# రాష్ట్ర రాజకీయ చరిత్ర

## (వందేళ్ళ శాస్త్రీయ విశ్లేషణ 1910-2010)

రచన
నరిసెట్టి ఇన్నయ్య

**Rashtra Rajakeeya Charitra**

(State Political History – 100 years survey)

**Published** : 2010

© **Centre for Inquiry India**

A-60, Journalist Colony,
Jubilee Hills, Hyderabad – 500 033
Phone No. 040 – 23544067
E-mail : innaiahn@yahoo.com
Cover Photo : D. Ravinder Reddy

**Printed at :**

Charita Impressions
1-9-1126/B
Azamabad
Hyderabad – 500 020, India.
Ph : 91-040-27678411.

**Sole Distributors :**

Navodaya Book House
Kachiguda X Roads
Hyderabad – 500 027
Phone : 91-040-24652387

**Price :** Rs. 120/-   $ 20   £ 10

## వరుస క్రమం


1. రాజకీయాల్లో ప్రజల స్థానం
2. ఆంధ్ర ప్రాంతంలో కాంగ్రెస్
3. 1887 నుండి కాంగ్రెసు ఉద్యమం
4. ఆంగ్లేయుల పాలనలో కులాలు
5. వందేమాతరం ఉత్తేజం
6. మాకొద్దీ మద్రాసు పాలన
7. అనీబిసెంట్ రంగ ప్రవేశం
8. చిగురించిన ఆంధ్ర కాంగ్రెసు
9. కాంగ్రెసుకు వ్యతిరేకంగా జస్టిస్ పార్టీ
10. స్థానిక స్వపరిపాలన
11. కాంగ్రెసులోనే స్వరాజ్య పార్టీ
12. ముఠాల మయంగా కాంగ్రెసు పార్టీ
13. తొలిదశలో విప్లవోద్యమాలు
14. ప్రత్యేక రాష్ట్రం కోసం కాంగ్రెస్
15. అతివాదంలో కాంగ్రెస్
16. జైళ్ళకు తెచ్చిన ముఠాలు
17. స్వాతంత్ర్యానికి ముందే అధికార కక్కుర్తి
18. చొచ్చుక వచ్చిన కమ్యూనిస్టు పార్టీ
19. ఇన్నేళ్ళకు వచ్చిన ఆంధ్ర
20. ఆంధ్రకేసరి పతనం
21. తెలంగాణా చరిత్ర
22. ఆంధ్ర మహాసభల ఉన్నత పాత్ర
23. తొలి భాషా రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్
24. పుట్టి గిట్టిన సోషలిస్ట్ డెమోక్రటిక్ పార్టీ
25. ప్రథమ దళిత ముఖ్యమంత్రి
26. రెండవసారి ఎన్. సంజీవరెడ్డి
27. రాజకీయ కలహాలు
28. ప్రత్యేక తెలంగాణాకై ప్రజాపోరాటం
29. పి.వి.నరసింహారావు పాలనలో రాష్ట్రం
30. తెలంగాణాకు వ్యతిరేకంగా ప్రత్యేకాంధ్ర పోరాటం
31. ముఖ్యమంత్రిగా జలగం వెంగళరావు
32. దేశంలో అత్యవసర పరిస్థితి

33. తెలంగాణా వూసెత్తని ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి
34. ఎయిర్ బస్ మంత్రిమండలితో కదలలేని అంజయ్య
35. ఏడు మాసాలతోనే భవనం వెంకట్రామ్ పాలన సరి
36. కోట్ల విజయభాస్కర రెడ్డి కాంగ్రెసు పాలనకు స్వస్తి
37. తెలుగుదేశం – ఎన్.టి.రామారావు
38. నెలతప్పిన ముఖ్యమంత్రిత్వం నాదెండ్ల భాస్కరరావు పాలన
39. ఎన్.టి.రామారావు రెండవసారి ముఖ్యమంత్రిగా
40. మళ్ళీ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా
41. ఎస్. జనార్ధన రెడ్డి ఏడాది ముఖ్యమంత్రి
42. మరోసారి ముఖ్యమంత్రిగా విజయభాస్కర రెడ్డి
43. మూడవసారి ముఖ్యమంత్రిగా ఎన్.టి.రామారావు
44. హైటెక్ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు
45. ఎదురులేని నాయకత్వం డా.వై.ఎస్. రాజశేఖర రెడ్డి
46. రోశయ్య మీద పడిన ముఖ్యమంత్రిత్వం

**అనుబంధం**

రాజకీయంలోనూ వంశపారంపర్యత

పార్టీ మార్పిడిలో ఇదీ వరస

జనతా నుండి కాంగ్రెస్ ఐ లోకి

కాంగ్రెసు నుండి కాంగ్రెస్ (ఐ)లోకి

ఇండిపెండెంట్లుగా కాంగ్రెస్(ఐ)ని ఓడించి కాంగ్రెస్ (ఐ)లోకి చేరినవారు

# తొలిపలుకు

రాష్ట్ర రాజకీయాల విశ్లేషణ గత 40 ఏళ్ళుగా చేస్తూ వస్తున్నాను. అటు పార్టీలనూ, ఇటు ఉద్యమాలనూ పరిశీలిస్తూ పక్షపాత ధోరణి అవలంబించకుండా వాస్తవ విషయాలను ముందుపెడుతున్నాను. అలాంటి ప్రయత్నమే ఇప్పుడు కూడా జరిగింది. ఈ రచనకు అనేక ఆధారాలు స్వీకరించాను. విద్యార్థులకు ఉపయోగకారిగా ఉంటుందని కూడా ఈ ప్రయత్నంలో తలంపు ఉన్నది. రాజకీయాలను శాస్త్రీయంగా పరిశీలించటం జటిలమైన పని. అయినా అది అవసరం. అందుకు యథాశక్తి ప్రయత్నించాను.

నా పుస్తక రచన పరిశీలించి, ప్రూఫులు శ్రద్ధగా చూచి సలహాలను ఇచ్చిన నా భార్య వెనిగళ్ళ కోమలకు కృతజ్ఞతలు. రచనను వివిధ దశలలో టైపు చేసి అనేక దిద్దుబాట్లు గావించిన డి. నాగలక్ష్మికి ధన్యవాదాలు. నవోదయ పుస్తక ప్రచురణ కర్త మిత్రులు సాంబశివరావు దీని పంపిణీ బాధ్యతను స్వీకరించి తగు ప్రోత్సాహం ఇచ్చారు. వివిధ దశలలో తోడ్పడిన మిత్రులు సి. భాస్కరరావు, వెనిగళ్ళ వెంకటరత్నంగార్లకు కృతజ్ఞతలు.

- *రచయిత*

# రాజకీయాల్లో ప్రజల స్థానం

'మాకొద్దీ ఆంధ్రోళ్ళు' అని 1969లో తెలంగాణా రక్తం చిందించింది. 'గోంగూర గోబాక్' అన్నది. 2009లో మళ్ళీ తెలంగాణా ఉద్యమం మొదలై ఈసారి హక్కుల పోరాటంగా నిలదొక్కుకున్నది. సమైక్య వాదులపై వ్యతిరేకత తప్ప ప్రజలపట్ల ద్వేష భావం లేదని స్పష్టం చేశారు.

'తెలంగాణా పొత్తు ఇక వద్దు. మా ధనం అక్కడ ఖర్చు కావడానికి వీల్లేదు. వేరే ఆంధ్ర ఒకటే మార్గం' అంటూ దెబ్బకు దెబ్బ తీస్తామని 1972లో ఆంధ్ర ప్రాంతంలో పోరాడారు. కానీ, 2009 నాటికి ఆ ధోరణి విరమించి సమైక్య ఆంధ్ర కావాలంటూ మొదలెట్టారు. పైగా ప్రత్యేకాంధ్ర కోరిన వారిపై అసహనం చూపెట్టారు.

తెలంగాణా రాష్ట్ర సమితి ఏర్పడి అసెంబ్లీ, లోక్ సభ స్థానాలలో కొన్ని పరిమితంగా సాధించుకున్నారు. కె.చంద్రశేఖర రావు నాయకత్వాన ఆందోళన అనేక మలుపులు తిరిగింది. విద్యార్థులు నాడు నేడు ముందంజ వేసి ఉద్యమానికి ఊతం ఇచ్చారు.

ప్రజలు నాయకుల మాటలు నమ్మారు. వెర్రి ఆవేశం తెచ్చు కున్నారు. తాత్కాలిక ఉద్రేకంలో విచేనా శక్తి కోల్పోతారని, జనాన్ని యిష్టం వచ్చినట్లు ఆడించ వచ్చని నాయకులు రుజువు చేసారు. ప్రజల ధోరణిని బట్టి తరచు నడుచుకుంటున్నట్లు నాయకులు నటించినా, వారికి ..పెద్ద భార్య.. అధికారం. దానికోసం వారు ఏ త్యాగమైనా చేస్తారు. రాజకీయాధికారం నేడు సర్వశక్తి వంతమైనది. కనుక దాన్ని సాధించడం కొందరికి జీవిత లక్ష్యమైంది. వారి ఆటలకు ప్రజలే బంతులు. ఈ రాజకీయం ఇప్పటిది కాదు. స్వాతంత్ర్యానంతరం మన నాయకులకు కొత్తగా వచ్చిన విద్యకాదిది. బ్రిటిష్ వారి కాలంలోనే దీనికి ఓనమాలు దిద్దారు. అప్పటి నుంచి క్రమంగా రాజకీయ నాయకులు ఏదో ఒక మార్గాన ఈ విద్యాభ్యాసం చేస్తూనే ఉన్నారు. ఆంధ్రలో ఈ కథ 1885లోనే అంటే, భారత జాతీయ కాంగ్రెస్ పుట్టినప్పటి నుంచి ప్రారంభమైనది. తెలంగాణాలో నైజాం నిరంకుశ ఫ్యూడల్ పరిపాలన వలన కొంచెం ఆలస్యంగా 1920 ఆ ప్రాంతాలలో ఆరంభమైంది. తెలంగాణా, ఆంధ్రలు 1956లో అయిష్టంగానే ఉమ్మడి కుటుంబంలో ప్రవేశించారు. రాజకీయాధికారాన్ని తమ గుత్తాధిపత్యంలో ఉంచుకోవా లనుకున్న నాయకులకు విడిగా ఉండటమే మంచిదనిపించింది. కానీ వీరిద్దరినీ కలిపి కేంద్ర ప్రభుత్వం బలవంతంగా కాపురం పెట్టించింది. అట్లాగే కోస్తా ఆంధ్రులంటే భయపడుతున్న రాయలసీమ నాయకులకు, కొన్ని అబద్ధాలాడి పెళ్ళి చేయమన్నట్లు 1953లో ప్రత్యేక ఆంధ్రను కేంద్రం ఏర్పరచింది. ప్రత్యేక ఆంధ్ర ఏర్పడినా, ఆంధ్రప్రదేశ్ రూపొందినా తక్షణమే గిట్టుబాటైనది రాజకీయ నాయకులకే. సామాన్య ప్రజలలో, ఆంధ్ర నుండి మదరాసుకు, రాయల సీమనుండి కోస్తాకు, ఆంధ్ర నుండి తెలంగాణాకు రాకపోకలు, ఇచ్చిపుచ్చుకోవడాలు ఇంకా అనేక వ్యవహారాలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. ఎటొచ్చి నాయకుల జోక్యంతో మానవ సంబంధాలు మరింత విషమించాయి. మన సమాజంలో కులం ఎట్లా వచ్చిందో గాని పాతుకుపోయి, దశ దిశలు అల్లుకు పోయింది. చిలవలు పలవలుగా వికృతి రూపం దాల్చింది. ఇవాళ నిలదీసి కులం అంటే ఏమిటని ప్రశ్నిస్తే సమాధానం చెప్పగల స్థితిలో ఎవరూ లేరు. కానీ అందరూ దీన్ని పాటిస్తున్నారు. సమాజంలో ఈ దోషం తొలగించడానికి ప్రయత్నించాల్సింది. సంఘ సంస్కర్తలు, రాజకీయ నాయకులు. అయితే మన నాయకులకు కులం గిట్టుబాటుగా ఉండడం వలన రాజకీయాలలోకి కులాన్ని ప్రవేశపెట్టడమే కాక, దాన్ని అన్ని విధాల బంధించి వేశారు.

1885లో కాంగ్రెస్ పుట్టినప్పుడు ఆంధ్రదేశంలో రాజకీయోద్యమం గాని, సాంఘికోద్యమం గాని ఏమీలేదు. ఆంధ్ర దేశానికి స్వంత ఉద్యమంమంటూ అప్పటికీ ఇప్పటికీ ఏదీ తలెత్తలేదు. ఎక్కడో ఒకచోట ఉద్యమాలు ప్రారంభమైతే ఆంధ్రలో అనుకరించారు. కాంగ్రెస్ కూడా ఆ విధంగా ఆంధ్రకు వచ్చింది. ఆనాడు రాజకీయాలలో ప్రవేశించ గల్గింది బ్రాహ్మణులు మాత్రమే. సమాజంలో అన్ని సదవకాశాల్ని వారు తమకనుకూలంగా వినియోగించుకో గల్గారు. అట్లాగని బ్రాహ్మణు లందరిలో ఐక్యత వెల్లి విరిసిందని గానీ, తమ కులాన్ని నిస్వార్థంగా పైకి తెచ్చుకన్నారని గాని అర్థం కాదు. ఆంధ్ర, కాంగ్రెస్ పితామహులలో శ్రీ టంగుటూరి ప్రకాశం, శ్రీ పట్టాభి సీతారామయ్య, శ్రీ కొండా వెంకటప్పయ్య, శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ అంతా బ్రాహ్మణులే. కానీ కాంగ్రెసు సంస్థలో ఆధిపత్యం కోసం, ఆవలి వాడిని అణగ దొక్కడం కోసం వారవలంబించని

పద్ధతులు లేవు. వైదికులు ఒక పక్కన, నియోగులు మరొక పక్కన చేరి కలహించుకున్నారు. స్థానిక రాజకీయాలలో ముఖ్యంగా మున్సిపాలిటీ స్థాయిలో వున్న ముఠా తగాదాలను రాష్ట్ర స్థాయివరకు తీసుకొని వెళ్ళారు. అయితే ఉద్యోగాలలో ఎక్కువగా బ్రాహ్మణులే ఉండేవారు. వైశ్యులు కొందరు బాగా డబ్బు సంపాదించి తమ పలుకుబడితో రాజకీయాలలో పైకి రావడానికి ప్రయత్నించినా వీలు కాలేదు. ఏలూరు, కాకినాడ వంటి ప్రాంతాలకు వారి స్థానానికి రాజకీయం పరిమిత మయింది. బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని ఏదో ఒక విధంగా సమాజం నిరసిస్తూనే ఉంది. బ్రాహ్మణేతరులు, బ్రిటిష్ వారి ద్వారా కుల ప్రాతిపదికపై ఉద్యోగాలిప్పించే ఉత్తరువు జారీ చేయించుకున్నారు. దానివల్ల ఆట్టే ప్రయోజనం లేకపోగా బ్రాహ్మణేతర ఉద్యమం ప్రారంభించి రాజకీయ పార్టీలోకి దిగారు. అట్లా పుట్టింది జస్టిస్ పార్టీ. జస్టిస్ పార్టీ అధికారంలో ఉన్న 16 ఏళ్ళలో బ్రాహ్మణేతర ఆగ్రకులాలలో నోరుగల నాయకులు, బ్రిటిష్ వారి అండన చేరి హాయిగా కాలక్షేపం చేసారు. వెలమ, క్షత్రియ, కమ్మ, కాపు, రెడ్డి తెలగ కులాలకు జస్టిస్ పార్టీలో ప్రధానంగా ప్రాతినిధ్యం ఇచ్చారు. జస్టిస్ పార్టీ వలన బ్రాహ్మణేతర ప్రజలకు ముఖ్యంగా సామాన్యులకు ఒరింగిందేమీ లేదు. కానీ జాతీయ రాజకీయాలలో బ్రాహ్మణుల ప్రాధాన్యత బాగా పెరగడానికి జస్టిస్ పార్టీ తోడ్పడింది. బ్రాహ్మణేతరులలో కొద్ది మంది మాత్రమే ముందు చూపుతో బ్రాహ్మణులతో చేతులు కలిపి జాతీయ కాంగ్రెసులోకి ప్రవేశించారు. ఎవరు ఎక్కడున్నా తమకులాన్ని మర్చిపోలేదు. ముఠా కట్టడం మానలేదు. జస్టిస్ పార్టీ 1936లో అడుగంటిన తరువాత వారిలో చాలామంది కాంగ్రెస్ రాజకీయాలలో ప్రవేశించారు. అప్పటి నుండి కాంగ్రెస్ వారు కొద్ది మోతాదులలో అధికారాన్ని చవిచూచారు. 1946 నుండి అధికారపు రుచి మరిగారు. కులాన్ని జోడించారు. కనుక కులం ఇటీవలే రాజకీయాలలో ప్రవేశించిందని, స్వాతంత్ర్యానికి పూర్వం విశాల హృదయంతో కుల ప్రసక్తి లేకుండా ఉండేవారని ఎవరైనా భ్రమ పడితే అది తొలగించుకోవడం మంచిది, కాగా ఆనాడు కులాభిమానానికి పరిమితావకాశాలు లభించాయి. కొద్దిమందే రాజకీయాలలో ప్రవేశించారు. అందువలన దాని ప్రభావం కొంతవరకే సోకింది. అదీ కాక ప్రచార సాధనాలు స్వల్పంగా ఉండే రోజులు కనుక నాయకుల చర్యలనేకం ఒక పట్టాన బయటపడలేదు. ఆధునిక పరిశోధన వలన యిప్పుడు వీరి గుట్టు తెలుస్తుంది.

ఆంధ్రలో జస్టిస్ పార్టీ పుట్టిన తరువాత బ్రాహ్మణులకు, కమ్మవారికి ప్రధానంగా వైరుధ్యం కలిగింది. సాంస్కృతిక, సాహిత్య రంగాలలో కమ్మ-బ్రాహ్మణుల మధ్య పోటీ కనపడింది. బ్రాహ్మణులను అనుకరించడానికి వారితో సమానంగా ఊహించుకోవడానికి కమ్మకులం ప్రయత్నించింది. ఈ ప్రయత్నంలో బ్రాహ్మణులు తెలివిగా రెడ్లను రాజకీయాలలో కలుపు కొన్నారు. స్వాతంత్ర్యానంతరం ఆంధ్ర రాజకీయాలలో రెడ్డి, బ్రాహ్మణ కలయిక కనబడుతుంది. అంటే బ్రాహ్మణులంతా రెడ్లతో చేతులు కలిపారని అర్థంకాదు. బ్రాహ్మణులు కమ్యూనిస్టు పార్టీతో సహా అన్ని పార్టీలలోను ఉన్నారు. అలాగే రెడ్లు కూడా. కానీ చెప్పవచ్చిందేమంటే, కీలక స్థానాలలో ఉన్న వ్యక్తులు పదవుల పోరాటంలో అవలంబించిన ఎత్తుగడల దృష్ట్యా బ్రాహ్మణ, రెడ్డి కలయిక జరిగిందని చెప్ప గల్గుతున్నాం. బ్రాహ్మణులలో బ్రాహ్మణులకు పదవుల వద్ద కలహాలు వచ్చినపుడు ఒక వర్గం కమ్మ కులాన్ని కలుపుకున్నాయి. ఈ ముఠాల కూలాల పోరాటంలో ప్రకాశం, సంజీవ రెడ్డి కలయిక చూడవచ్చు. రంగా రాయలసీమ రెడ్లను శ్రీకాకుళం, విశాఖలలో వెనుకబడిన వారిని ఆకర్షించారు.

ఈ వెనుకబడిన వర్గాలనేవి, స్వాతంత్యం వచ్చిన కొత్తలో వారికి దాని విలువ తెలియక పోవడం, తెలిసినా ఒకరిద్దరూ పదవులలో ఉన్న అగ్ర కులాల నాశ్రయించి తమ పబ్బం గడుపుకోవడం జరిగింది. వేముల కూర్మయ్య, బ.బస్.మూర్తి ఇలాంటివారే.

ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాలు ప్రారంభమైనపుడు ముఖ్యమంత్రిని బట్టి అవి ఎలాంటి రాజకీయాలలో నిర్ధారణ అయినాయి. మంత్రి వర్గాలలో మిగిలిన కులాలవారు ఉన్నప్పటికి ముఖ్యమంత్రి కులం చుట్టూ ప్రదక్షిణలు జరగవలసిందే. ముఖ్య మంత్రికిచ్చిన ప్రాధాన్యత, ఆ వ్యక్తి కులానికిచ్చిన ప్రాధాన్యతైంది. ఉద్యోగాలలో కులానికి లభించిన అవకాశాలు కొలమానంగా స్వీకరిస్తే కుల రాజకీయాలు స్పష్ట పడతాయి. ముఠా రాజకీయాలు కుల ప్రాతిపదిక పైన కాక అధికారాన్ని కట్టు దిట్టం చేసుకొనే లక్ష్యంతో సాగుతాయి. కనుక అన్ని కులాలవారు ఇరు పక్షాల ముఠాల్లో ఉన్నా ఆశ్చర్యం లేదు. సంజీవ రెడ్డి పక్షాన కళా వెంకటరావు, అల్లూరి సత్యనారాయణరాజు, ఆలపాటి వెంకట రామయ్య ఉన్నారు. వీరు భిన్న కులాలకు చెందినవారు. కానీ ముఠా ఒకటే... అలాగే రంగా ముఠాలో ఓబుల రెడ్డి, లచ్చన్న, గొట్టిపాటి వెంకట సుబ్బయ్య భిన్న కులాలకు చెందిన వారు. కనుక ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను స్థూలంగానూ,

సూక్ష్మంగానూ పరిశీలించినపుడు కులం, ముఠా బయట పడక తప్పదు. స్థానిక సంస్థలు, సహకార సంస్థలు, ముఖ్యమంత్రి నియమించగల ఉద్యోగాలు, సిఫారసు చేసి తీసుకు రాగల ఉద్యోగాలు ఏ నిష్పత్తిలో ఏ కులానికి దక్కినదో లెక్క వేసి చూస్తే కుల పక్షపాతం పచ్చిగా బయట పడుతుంది. ముఠాను నిలబెట్టుకోవాలి కనుక, ఆశ్రిత పక్షపాతం ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో యీ అంశాలు ప్రత్యేకంగా పరిశోధించ దగ్గవి.

సంజీవయ్య రెండేళ్లపాటు ఆంధ్ర ప్రదేశ్‌కు ముఖ్యమంత్రి అయినప్పుడు హరిజనులలో కొంచెం సంచలనం కలిగింది. కానీ అది ఒక దారి తెన్ను చేసుకోక ముందే మళ్ళీ రెడ్డి రాజకీయాలు చొచ్చుకొచ్చాయి. వెనుకబడినవారు, హరిజనులు, గిరిజనులు అనేవారు ఉన్నారని వారికీ సమస్య లుంటాయని, వారికి ఓటు ఉన్నదని రాజకీయంగా ప్రచారం చేసింది. దేశంలో ఇందిరా గాంధీ. 1971 పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ చీలిపోయిన తరువాత తన మనుగడ కోసం ఆమె ఈపని చేసింది. ఇంతకు ముందు కమ్యూనిస్టులు, సోషలిస్టులు ఎన్నాళ్ళు కొట్టుమిట్టాడినా బడుగు వర్గాలలో ఈ చైతన్యం తీసుకొని రాలేకపోయారు. అధికారంలో ఉన్నవారు చెబితేనే విలువ వుంటుందని, పనులు జరుగుతాయని విశ్వసించిన ప్రజలలో ఇలాంటి నమ్మకాలుండటం సహజం. ఇందిరాగాంధీ ఇచ్చిన నినాదాన్ని ఆంధ్రప్రదేశ్ లో పి. వి.నరసింహారావు బాగా ప్రయోగించాడు. 1953 తరువాత మళ్ళీ బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి పదవి రావడం 1972లోనే. అంటరాని వారు, సమాజంలో అట్టడుగున ఉన్నవారు. బ్రాహ్మణ నాయకత్వపు ఆదరానికి గురైనారు. సమాజంలో అనాది నుండి అసమానతలను అట్టిపెట్టడానికి మతపరంగా అంటరాని తనాన్ని అధికారికంగా పాటించడానికి అన్నివిధాలా కృషిచేసిన బ్రాహ్మణ పురోహిత వర్గం ఎత్తుగడలు మార్చింది. దీనికి ప్రధాన కారణం ఈ అట్టడుగు కులాల ఓటుకు విలువ రావడమే. అదీగాక మిగిలిన కులాలు బ్రాహ్మణులతో పోటీ పడటానికి సిద్ధంగా ఉన్నా హరిజనులు ఇంకా ఆస్థాయికి రాలేదని బ్రాహ్మణులు గ్రహించారు. కనుక బ్రాహ్మణులు హరిజనులపై ఎక్కడలేని ప్రేమ ఒలకబోశారు. అదంతా నిజమేనని అట్టడుగు వర్గాలు నమ్మాయి. ఓటిచ్చాయి. కానీ శాసన సభాస్థాయిలో రాజకీయాల ఎత్తుగడలు వారికింకా అంతుపట్టలేదు. బ్రాహ్మణేతర అగ్రకులాలు తమ ఆస్తి పాస్తులను అట్టి పెట్టుకొనడానికి ఐక్యమై బ్రాహ్మణ నాయకత్వాన్ని దెబ్బకొట్టాయి. ఆ తరువాత వెలమ, కమ్మ, కాపు రాజకీయాలొచ్చాయి. వెంగళరావు ముఖ్యమంత్రి కావడంతో జస్టిస్ పార్టీతోనే అంతమైన తమ అధికారం మళ్ళీ వచ్చినట్లు భావించారు. అధికారం పోగొట్టుకున్న బ్రాహ్మణులు, రెడ్లు చాలా నొచ్చుకున్నారు. తిరిగి అధికారం పొందే వరకు నిద్రపట్టలేదు. బ్రాహ్మణుల ఎత్తుగడనే రెడ్లు అవలంబించారు. హరిజన, గిరిజన, వెనుకబడిన వర్గాలపై ఎంతో ఆదరం వున్నట్లు మాట్లాడి ఓట్లు సంపాదించారు. ఫ్యూడల్ వ్యవస్థలో, గ్రామాలలో అగ్రకులాలే తమను బానిసలుగా చేశాయన్న విషయం బడుగు కులాలు మర్చిపోయాయి. ఇప్పటికి తమ ఓటుకు విలువున్నదని మాత్రమే బడుగు కులాలు గ్రహించాయి. కానీ కీలక స్థానాలలో తమ మనిషి లేకపోతే తమకు పెద్దగా ఒరిగేదేమీ లేదని వారింకా గ్రహించాల్సి ఉంది.

అధికార రాజకీయాలు ఒక పెద్ద చదరంగపు ఆట. వీటిలో కులాన్ని, ముఠాన్ని వాడుకొని అధికారాన్ని అట్టి పెట్టుకోవడం అనేది నిత్యకృత్యం. ప్రజలలో వైజ్ఞానిక దృక్పథం రానంత వరకు, ఓటును సద్వినియోగం చేసుకోలేనంత వరకు వారికి కుల రాజకీయ వేత్తల బాధలు తప్పవు.

1885 నుండి 1980 వరకు, ఒక శతాబ్దం పాటు ఆంధ్రప్రదేశ్ లో కులాలు, ముఠాలు రాజకీయాలలో ప్రవేశించి మానవులను ఎట్లా వక్ర మార్గాన పట్టించాయో చూపడానికి ఈ గ్రంథంలో సోదాహరణంగా పరిశీలించడం జరిగింది. ఇది కాక ఇంకా అనేక దోషాలు లేకపోలేదు. రంకు రాజకీయాలను గురించి, తెరవెనుక జరిగిన పదవుల కుమ్ములాట గురించి, డబ్బిచ్చి పదవులు కొనుక్కున్న సందర్భాలను గురించి ప్రత్యేక పరిశోధనా గ్రంథాలు వెలువడాల్సి ఉన్నది. లక్ష రూపాయలు యిస్తే ముఖ్యమంత్రి అవుతారని, కోటి రూపాయలు ఖర్చు పెడితే ప్రధాన మంత్రి కావచ్చని 1956లో డబ్బుకు విలువ పడిపోని రోజులలో సంజీవరెడ్డి వ్యాఖ్యానించాడు. ఈ మాటల సత్యాన్ని పరిశీలించాల్సి ఉంది.

కులాన్ని గురించి పట్టించుకొంటే కనీసం ఆ కులమైనా బాగుపడుతుంది కదా, తప్పేమిటనేవారు లేకపోలేదు. ఆధునిక ప్రజాస్వామిక, మానవ హక్కులు తెలిసినవారు ఇట్లా మాట్లాడరు, సాంఘికంగా వెనుకబడిన వారిని పైకి తీసుకొని రావాలనే నినాదం వేరు, కానీ కులం పేరిట రాజకీయాలను వాడుకోవడం ప్రారంభిస్తే కులమంతటికి ప్రయోజనం కలగక పోగా మిగిలిన కులాలకు ద్వేషం పెరుగుతుంది. ఇది వందేళ్ళ అనుభవం నేర్పుతున్న పాఠం, కేవలం తాత్కాలిక ప్రయోజనాలను మాత్రమే దృష్టిలో పెట్టుకొన్న రాజకీయ నాయకులు సమాజమంతటిని కులం పేరుతో,

ముఠాల పేరుతో కలుషితం చేస్తున్నారు. ఇలాంటి ప్రమాదాన్ని చూసి ప్రజలను హెచ్చరించడానికి, ఓటర్లు వారి సార్వభౌమాధికారం సద్వినియోగం చేసుకోవడానికి ఉద్దేశించిందే ఈ పుస్తకం.

-------

# ఆంధ్ర ప్రాంతంలో కాంగ్రెస్

ఆంధ్ర ప్రదేశ్ 1956లో ఏర్పడింది. అంతకు ముందు ఆంధ్రప్రాంతం (1953 వరకు) ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉండేది. తెలంగాణా ప్రాంతం నైజాం పరిపాలన క్రింద (1948 వరకు) వుండేది. భౌగోళికంగా ఆర్థికంగా విభిన్న ప్రాంతాలతో, భాషా విషయంగా తమిళ, మళయాళ, కన్నడ, ఒరియాలతో కలిసిన రాష్ట్రం నాటి ఆంధ్ర. అట్లాగే మరాఠి, కన్నడ, ఉర్దూతో మిళితమై తెలుగు వారి ప్రాంతం నైజాం రాజ్యం. మొత్తం రాష్ట్రం 80 శాతం వ్యవసాయంపై ఆధారపడింది. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలు, వాటిలోని శాఖలు, ఉత్తర దక్షిణ భేద భావాలు, ఆర్య ద్రావిడ వైషమ్యాలతో నాటి పరిస్థితులుండేవి. బ్రిటిష్ వారి పాలన క్రింద ఆంధ్ర ప్రాంతం, నైజాం పాలన క్రింద తెలంగాణా విద్య, సంస్కృతి ఆచారాలతో భిన్నత్వాన్ని కలిగి ఆర్థిక, రాజకీయ, సాంఘిక రంగాలలో కూడా తేడాలతో వుండేది. ముందుగా మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతాన్ని స్థూలీపులీక న్యాయంగా సింహావ లోకనం చేసి చూద్దాం.

సర్ ఆర్థర్ కాటన్ పుణ్యమా అని కృష్ణా గోదావరి డెల్టాలలో మధ్య తరగతి తలెత్తి తెల్ల బట్టలు వేసుకోనారంభించిన రోజులవి. 1848లో గోదావరిపైన 1852లో కృష్ణ పైన ఆనకట్టలు పూర్తయ్యాయి. గుంటూరు, విజయవాడ, ఏలూరు, కాకినాడ వంటి వాటికి నగర లక్షణాలు రావటం మొదలైంది. మార్వాడీలు, వైశ్యులు, సహకార బాంకులు వడ్డీ లివ్వడం ప్రారంభించగా మెట్ట ప్రాంతాల నుండి కూలీలు వచ్చి మాగాణి ప్రాంతీయులకు అతి చౌకగా కూలీచేసి సాలీనా బ్రతుకు దెరువుకు అనువైన సొమ్ము చేసుకొని వెడుతుండేవారు. నగర గుబాళింపులు కొద్దిగా గ్రామాలకు కూడా వాసన పడుతుండేది.

బ్రిటిష్ వారు పాలించినంత కాలమూ అసలు పెత్తనం లండన్ లో, తరువాత ఢిల్లీలో, పిమ్మట మద్రాసులో, అడుగూ బొడుగు స్థానికంగానూ వుండేది. శిస్తుల పేరిట వసూలు చేసే ఆదాయంలో (70) శాతం కేంద్రానికి చేరేది. సైనిక పోషణలో ఖర్చు హెచ్చుగా జరిగేది. అయితే ఎంతైనా పరాయి ప్రభుత్వం. భాషా సౌలభ్యం వారికి తక్కువ. ప్రతి దానికీ స్థానికంగా ఎవరో ఒకరిపై ఆధారపడవలసి వచ్చేది. ఆ అవకాశం చూచుకొని స్థానికులు ఒక ఆట ఆడారు. అవినీతి విలయ తాండవమాడింది. కలెక్టరు మొదలు, రెవిన్యూ గుమాస్తాల వరకు అవినీతి, నియామకాలలో రాగద్వేషాలు, కులం, లంచగొండితనం ఘోరంగా పరిణమించాయి.

మహారాష్ట్ర నుండి వలస వచ్చిన బ్రాహ్మణులు అనేక ఉద్యోగాల్లో గుత్తాధిపత్యం వహించారు. అది అదుపులోకి తేలేక బ్రిటిష్ వారు సతమతమయ్యారు. ఉదాహరణకు అనంతపురం హుజూర్ తహసిల్దారుగా డి.కృష్ణారావు అనే మహారాష్ట్ర బ్రాహ్మణుడు 108 మందిని తన కుటుంబీకులను, బంధువులను ఉద్యోగాల్లో పెట్టుకున్నాడు. అందుకని అతన్ని కడపకు బదిలీ చేసి హుజూర్ తహసిల్దారుగా చేశారు. అక్కడ యింకా విజృంభించి 117 మందిని తన వారిని నియమించాడు. ఇందులో ఒక్క కుటుంబీకులే 80 మంది వున్నారు. ఇట్లాంటి ఘటనలే కృష్ణా, గోదావరిలోను జరిగాయి. కరణాలు, మునసబులు వూళ్ళు పంచుకొని, బ్రిటిష్ వారి అండతో పాలించారు. డబ్బున్న సంపన్న కుటుంబాలు రాజ్యమేలాయి. కాకినాడలో పైడా (వైశ్యులు), ఏలూరులో మోతే కుటుంబాలు స్థానికంగా అప్పులిచ్చి పలుకుబడి పెంచుకొని, అన్ని విధాల తమ అదుపులో ప్రజల్ని అట్టి పెట్టుకున్నారు. బ్రిటిష్ వారు వీరిని కాదని ఏమీ చేయలేక పోయారు. జమీందార్లున్న చోట ఇక చెప్పనవసరం లేదు. విజయనగరం, పిఠాపురం, కాళహస్తి, బొబ్బిలి, పర్లాకిమిడి, నూజివీడు,

వెంకటగిరి జమీందార్లు వంశపారంపర్యంగా ఆస్తులు అనుభవిస్తూ యుద్ధాలు లేనందున విలాస జీవితాలకు అలవాటుపడి ప్రజల్ని దోచుక తిన్నారు. ప్రజల గోడు వినక, తమకు కావలసినది పన్నుల రూపేణా రాబట్టి, యథాశక్తి బ్రిటిష్ వారికి కొంత సంక్రమింపజేస్తూ పోయారు. పర్లాకిమిడి జమీందారు రైళ్ళ నిర్మాణంపైనా, బొబ్బిలి రాజా వ్యాపారంలోనూ, వెంకటగిరి రాజా అభ్రకం గనులలోనూ, పిఠాపురం జమీందారు ఇతర జమీందార్లకు అప్పులివ్వడం లోనూ నిమగ్నులయారు. పిల్ల జమీందార్లు వడ్డీ వ్యాపారాలు చేశారు. విలాసాలు విరివిగా చేసిన కాళహస్తి, పోలవరం జమీందార్లు ఆరిపోయారు.

విజయ నగరం రాజాకు సాలీనా 20 లక్షల రూపాయలు ఆదాయం. ఆ సంస్థానాన్ని ఎవరూ ఎదిరించలేకపోయారు. పాఠశాలలు పెట్టటం, సాంస్కృతిక పోషణ కార్యక్రమాలు నిర్వహించటంతో విజయనగరం రాజాకు తిరుగులేక పోయింది.

నూజివీడు జమీందారు వాడుక భాషోద్యమాన్ని సమర్థించాడు..

జమీందార్లు యిష్టమొచ్చినట్లు శిస్తులు వసూళ్ళు చేసారు. అందుకు ఆటంకాలు అప్పుడప్పుడు రాకపోలేదు. పిఠాపురం జమీందారుకు 10 లక్షల వరకూ కౌలుదార్ల నుండి బకాయిలు ఏర్పడ్డాయి. కాళహస్తిలో శిస్తు పెంచినందుకు ఎందరో కోర్టులకెక్కారు. వసూళ్ళు అయ్యేసరికి ఏళ్ళు పూళ్లు పట్టింది. నూజివీడు జమీ కూడా శిస్తులు కట్టనందుకే చితికింది.

ఇక సంపన్నుల విషయం కూడా యింతే వుండేది. ఏలూరులో మోతే వెంకట స్వామికి సబ్ కలెక్టరేట్ లోనే చాలా మంది రుణగ్రస్తు లుండేవారు. కనుక ఆయనపై ఆధారపడక తప్పేదికాదు. రెండు పర్యాయాలు యీయనపై నివేదికలు పంపగా అవి కాకినాడ కలెక్టరేట్ కు చేరక ముందే పట్టేసి చింపేయగలిగారంటే పలుకుబడి వూహించవచ్చు. కాకినాడలో పైడా కుటుంబం, ఎం. సత్యలింగం నాయకర్, కె.బసివి రెడ్డి, విశాఖపట్టణంలో ఎ.వి.జగ్గారావు, బెజవాడలో అప్పలస్వామి ఎదురు లేకుండా చక్రం తిప్పారు.

1870 నాటికే రీ సర్వే. రీ సెటిల్ మెంట్ చేయించిన ప్రభుత్వానికి లెక్కల వివరాలు బాగా తెలిసాయి. కరణాలను, మునసబులను ఏర్పరచి వంశపారంపర్యపు హక్కు యివ్వటంతో, వారు కీలక పాత్ర వహించారు. విపరీతంగా ఆస్తులు పెంచుకొన్న గ్రామాధికార్ల మాట సుగ్రీవాజ్ఞగా సాగేది. మాట వినకపోతే తలలు ఎగిరి పోయేవి. తప్పుడు కేసులు పెట్టేవారు. గ్రామాల స్థాయిలో వారే న్యాయమూర్తులు. శిక్షించేవారు కూడా. 1875 నాటికి ఒక్క కడపలోనే 168 గ్రామాధికారులు 22,507 రూపాయల వరకూ భూమిశిస్తు చెల్లించారంటే ఇంకెంత వసూలు చేశారో అనూహ్యం. క్రమంగా పరిపాలనలో అడవుల సంరక్షణ, సారాయి షాపులు, ఆదాయపు పన్ను అప్పీళ్లు, పోలీసు సెలక్షన్, కులకలహాల తీర్పు, నీటిసాగు వంటివి స్థానిక పాలనకు బదిలీ చేశారు బ్రిటిష్ పాలకులు.

1884లోనే అక్కడక్కడ మతకలహాలు చవిచూచారు. గూడూరు అనే గ్రామం నుండి కొందరు హిందువులు మచిలీపట్నంకు వూరేగింపుగా వెళ్ళి మసీదుపై దాడి చేశారు. ఇట్లాంటి హింసాయుత చర్యలకు సంపన్న వర్తకుల మద్దత్తు వుండేది.

కోర్టుల నిండా అవినీతి కేసులుండేవి. దేవాలయ సంఘాలకు కోశాధికారులు ఎన్నుకోబడటం మొదలైంది. పెరుగుతున్న నేరాల్ని అరి కట్టలేక పోయారు. ముఖ్యంగా కృష్ణా, గోదావరి డెల్టాలో ఇళ్ళ దొంగతనాలు అంతులేకుండా పెరిగి పోయాయి.

క్రైస్తవ మిషనరీలు మెల్లమెల్లగా హిందువులలో అట్టడుగు వర్గాలను ఆకర్షించి మతమార్పిడి మొదలెట్టాయి.

బెంగాల్, ప్రభావం ఆంధ్రకు సోకగా బ్రహ్మ సమాజ్ శాఖలు రాజమండ్రి, కాకినాడ, గుంటూరు, మచిలీపట్నంలో వెలిశాయి.

రాయలసీమలో ముఖ్యంగా జమ్మల మడుగు, కోస్తాలో విజయవాడ, ఏలూరు వంటి చోట్ల వివిధ క్రైస్తవ మిషనరీలు తమ మఠాల్ని స్థాపించారు.

గాజుల లక్ష్మీ నరసు చెట్టి 1852లోనే మద్రాసు నేటివ్ అసోసియేషన్ స్థాపించి ఆంధ్రుల దృష్టినాకర్షించాడు. 1884 మే 16న మద్రాసులో జి. రంగయ్య నాయుడు, పి. ఆనందాచార్యులు ఆధ్వర్యాన మహాజన సభ తలెత్తింది.

బ్రాహ్మణ, బ్రాహ్మణేతరుల మధ్య ఉద్యోగాల పంపకంలో, ముఖ్యంగా హుజూర్ సిరస్తిదారు. హెడ్ క్లర్క్ ఉద్యోగాలు వేర్వేరు కులాలకు వుండాలంటూ 1851లోనే బ్రిటిష్ వారు కమ్యూనల్ ఉత్తర్వు జారీ చేశారు. అప్పటికి జనాభాలో బ్రాహ్మణులు 3.2 శాతం మాత్రమే. మద్రాసు యూనివర్సిటీలో 1880-81 నాటికి 492 మంది బ్రాహ్మణ గ్రాడ్యుయేట్లయితే, 171 మంది బ్రాహ్మణేతరులున్నారు.

ఇది కాంగ్రెసు పుట్టేనాటికి పరిస్థితి.

కాంగ్రెసు తొలి మహాసభలో (1885) పి. రంగయ్యనాయుడు, ఆనందాచార్యులు, గుత్తి కేశవ పిళ్ళె, ఎస్. వెంకట సుబ్బారాయుడు, ఎస్. ఎన్. నరసింహులు నాయుడు, ఎస్.వి.జి. పంతులు, యింకా మచిలీపట్నం, కడప, బరంపురం, అనంతపూర్, బళ్లారి, నుండి ప్రతినిధులు వెళ్లారు.

ఎ.పి. పార్థసారథినాయుడు ఆయేడే *ఆంధ్ర ప్రకాశిక* వార పత్రిక ప్రారంభించాడు.

1886లో కాంగ్రెసు ద్వితీయ మహాసభలో పార్థసారథినాయుడు, ఆనందాచార్యులు, రంగయ్యనాయుడు, న్యాపతి సుబ్బారావు పంతులు, కేశవ పిళ్ళె, శనగపల్లి రామస్వామి గుప్త, ఇంకా రాజమండ్రి, విశాఖపట్టణం, గుత్తి, గుడివాడ, పెనుగొండ, నెల్లూరు, నుండి ప్రతినిధులు వెళ్లారు.

నాటి కాంగ్రెసు ఏటా బ్రిటిష్ ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేస్తుండేది. భారతీయులకు పరిపాలనలో స్థానం కల్పించాలని కోరేది.

-------

# 1887 నుండి కాంగ్రెసు ఉద్యమం

1887లో మద్రాసులో జరిగిన తృతీయ కాంగ్రెసు మహాసభలో సి ఆనందాచార్యులు ప్రముఖ పాత్ర వహించారు. విజయనగరం మహారాజా వేదికపైనున్నారు. వెంకటగిరి రాజా తన పక్షాన దివాన్‌ను పంపారు. చల్లపల్లి రాజా మద్దతు ప్రకటించారు. పాశ్చాత్య విద్యాభ్యాసంగల లాయర్లు, వీరికి అండగా వ్యాపారస్తులు యీ సమావేశంలో ప్రధాన పాత్ర వహించారు. ఉత్తర సర్కారు వైశ్యులు పేర్కొనదగినంతగా యీ మహాసభలకు వూతమిచ్చారు. రాయలసీమ నుండి అనేకచోట్ల చందాలు వసూలు చేసి బళ్ళారి వ్యాపారస్థులు ఎ. సభాపతి మొదలియార్ ను పంపారు. రాయలసీమ నుండి లింగాయత్ వ్యాపారస్తులు ఇందులో చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతపూర్ నుండి సర్దారులు వచ్చారు. కాంగ్రెసులో అగ్ర కులాలు ఉన్నవి. ప్రభుత్వం ఏర్పాటు గావించిన నిరసనలు తప్ప (ఆర్కాట్ ముస్లింలచే) కాంగ్రెసు సభలకు అడ్డులేదు. ముస్లింలు కూడా పాల్గొన్నారు. కుల రాజకీయం కోరలు విప్పని కాలమది.

# ఆంగ్లేయుల పాలనలో కులాలు

## బ్రాహ్మణాధిపత్యం

బ్రిటిష్ వారు ఇండియాను పరిపాలిస్తున్న కాలంలో భారతీయులకు ఉద్యోగాలిచ్చారు. అందులో చిన్న ఉద్యోగాలకే మొదట్లో భారతీయులను ఎంపిక చేశారు. నాటి మద్రాసు ప్రెసిడెన్సీలో అలా ఉద్యోగాలలో అత్యధిక సంఖ్యలో బ్రాహ్మణులు

ప్రవేశించారు. సైన్యంలో, ఇతర పనులలో వేరే కులాలవారు ప్రవేశించారు. జనాభాలో బ్రాహ్మణుల శాతం 3 మాత్రమే అయినప్పటికీ, చదువుకున్న వారిలో అత్యధిక సంఖ్య బ్రాహ్మణులదే. కనుక వారిని ఎంపిక చేశారు. కంపెనీ పాలనలో ప్రారంభమైన యీ వ్యవహారం, రాజు పాలనలో కూడా కొనసాగింది. ఆనాటి ఉద్యోగాలలో ప్రధానమైంది రెవిన్యూశాఖ. నేటి పరిపాలనలో వున్నన్ని శాఖలు నాడు లేవు. మహారాష్ట్ర నుండి వలస వచ్చి స్థిరపడిన బ్రాహ్మణులు ప్రథమ స్థానంలోనూ, తమిళ బ్రాహ్మణులు ద్వితీయ స్థానంలోనూ, ఆంధ్ర బ్రాహ్మణులు తృతీయ స్థానంలోనూ ఉద్యోగాలలో ఉన్నారు. సంఖ్యరీత్యా, ప్రాధాన్యత రీత్యా విషయం యింతే. ఒకసారి ఉద్యోగంలో ప్రవేశించిన బ్రాహ్మణుడు తన బంధువులను, మిత్రులను, తన కులానికి చెందిన ఆశ్రితులను ఉద్యోగాలలో చేర్చాడు. ఈ విధంగా రెవిన్యూ శాఖ అంతా బ్రాహ్మణమయమయింది. 1) రానురాను బ్రిటిష్ అధికారులు అదుపు తప్పే స్థితికి వచ్చింది. గ్రామాలలో కరణాలుగా వున్న బ్రాహ్మణులు బ్రిటిష్ అధికారుల్ని ఏడిపించారు, ముప్పతిప్పలు పెట్టారు. రికార్డు చూపించకుండా, అవసరమైనప్పుడు దాచి, తగులబడిందనో, తడిసిపోయిందనో సాకు చెప్పారు. అదీగాక భాషాపరమైన యిబ్బంది కూడా ఉండేది. ఇలాంటివన్నీ అనుభవించిన తరువాత ఫిర్యాదులు వచ్చిన మీదట బ్రిటిష్ పాలకులు కొత్త ఆలోచనలు చేశారు. బ్రాహ్మణుల పెత్తనాన్ని అదుపులో పెట్టదలిచారు. లేకుంటే తమకే ముప్పు వస్తుందనుకున్నారు. కనుక బ్రాహ్మణ ద్వేషంగాని, వ్యతిరేకత గానీ యితర కులాలకంటే బ్రిటిష్ వారికే నాడు ఎక్కువగా వున్నది. చీలించి పాలించాలనే ధోరణి గల బ్రిటిష్ వారికి యిది బాగా సాకు అయింది.

1851లో బ్రిటిష్ పాలకులు ఒక స్టాండింగ్ ఆర్డర్ జారీ చేశారు. (ఆర్డర్ నెంబరు 128 క్లాజు 2 అంటారు) ప్రభుత్వ రెవిన్యూ సర్వీసులో బ్రాహ్మణుల సంఖ్యను అదుపులో పెట్టాలని ఈ ఆర్డర్ సారాంశం. అన్ని ప్రభుత్వోద్యోగాలలో బ్రాహ్మణేతరులను📨 రెవిన్యూ శాఖతో సహా పెంచమన్నారు. బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు, ఇండియన్ క్రైస్తవులు, ముస్లింలు, యూరోపియన్లు ఆంగ్లో-ఇండియన్లు, ఇతరులు అనే వరుస క్రమంలో ఉద్యోగాలివ్వాలని, అర్నెల్లకోమారు జరిగిన అభివృద్ధి తెలియపరచాలని ఆర్డరులో పేర్కొన్నారు. కాని ఆర్డర్ కేవలం కాగితం పైనే నిలచింది కాని అమలు జరగలేదు. అమలు సరిగా జరిగిందో లేదో చూచే యంత్రాంగం కూడా లేదు. పైగా అన్ని కులాల్ని కలిపి బ్రాహ్మణేతరులు అని వర్గీకరించారే తప్ప, అప్పటికి కమ్మ, రెడ్డి, వెలమ అనే విభజన రాలేదు.

కంపెనీ పాలన 1857 సిపాయి తిరుగుబాటుతో అంతమై బ్రిటిష్ చక్రవర్తి పాలన వచ్చింది. ఉద్యోగాల స్థితిలో మార్పులేదు.

1885లో కాంగ్రెసు పార్టీ పుట్టినపుడు అందులోనూ బ్రాహ్మణ నాయకత్వమే రాష్ట్రానికి లభించింది. ఆ విధంగా అటు బ్రిటిష్ ప్రభుత్వ సేవలోనూ, ఇటు జాతీయోద్యమంలోనూ బ్రాహ్మణులు ముందే ఉన్నారు. కనుక కేవలం బ్రిటిష్ వారి భృత్యులుగా ఉన్నారు తప్ప, దేశం పట్టలేదనే విమర్శకు తావులేదు. ఆ మాటకొస్తే దేశంలో ఏ ఉద్యమాన్ని తీసుకున్నా, సంస్కరణ ప్రయత్నం సాగించినా, తిరుగుబాటు పోరాటాలను గమనించినా బ్రాహ్మణులు ముందంజ వేశారు. ఇండియాలో వారు యూదు జాతివారి వంటివారని, తెలివి తేటలతో వీరిని అధిగమించి మిగిలిన వారు త్వరగా పైకి రావడం కష్టమని బ్రిటిష్ వారే గ్రహించారు. ఆ కారణంగానే బ్రాహ్మణులను అదుపులో వుంచాలని బ్రిటిష్ పాలకులు తరచు ప్రయత్నిస్తూ వచ్చారు. దీని ఫలితంగా 1896 నుంచీ 1911 వరకూ బ్రాహ్మణేతరులకు ఉద్యోగాలలో అధిక స్థానాలు సమకూర్చాలని బ్రిటిష్ వారు విఫల ప్రయత్నం చేశారు.

సాంఘిక న్యాయం కొరకు బ్రాహ్మణేతరులకు అవకాశాలివ్వాలని బ్రిటిష్ పాలకులు తలపోశారు. 1892-1904 మధ్య పబ్లిక్ కమిషన్ పరీక్షలలో 16 మందికి గాను 15 మంది బ్రాహ్మణులే ఎంపిక అయ్యారు. నాటి మద్రాసు రాష్ట్ర జనాభా 41 1📨2 మిలియన్లు. అందులో 3 శాతం అంటే 1📂📨🗏 మిలియన్ లు బ్రాహ్మణులు. మద్రాసు గ్రాడ్యుయేట్లలో 72 శాతం బ్రాహ్మణులే వున్నారు. మొత్తం (8821లో). 1912లో బ్రిటిష్ పాలకులు మద్రాసు రాష్ట్రమంతటా 2వ పబ్లిక్ సర్వీసు కమీషన్ ద్వారా విచారణ జరపగా యీ విషయాలు బయటపడినవి (2).

బ్రిటిషువారి ప్రయత్నాలకు తోడు అటు తమిళ ప్రాంతంలో బ్రాహ్మణ వ్యతిరేక భావం రాజుకున్నది. అన్ని రంగాలలో యీ ద్వేషం అక్కడ ప్రబలింది. ఆంధ్రలో యిది ఎప్పుడూ ఆ స్థాయికి పోలేదు. కాని బ్రాహ్మణేతర ఉద్యమాన్ని ఆంధ్రలో ప్రారంభించినది కమ్మ కులస్తులే. కుల సంఘాలు స్థాపించి, సభలు జరిపి కులాధిక్యత వెల్లడించడం మొదలైంది. 1910లో దీనికి నాంది పలికింది.

ముఖ్యంగా రెడ్డి, విశ్వబ్రాహ్మణ, రాజు, కాపు, వైశ్య కులాల వారు కూడా కుల సంఘాలు పెట్టి సభలు జరుపుకున్నప్పటికీ, కమ్మ వారంతగా యీ కులాల వారు బ్రాహ్మణులపై ధ్వజమెత్తలేదు. కేవలం ఉద్యోగాల కోసమే గాక, అన్ని రంగాలలోనూ బ్రాహ్మణాధిపత్యాన్ని కమ్మవారు ప్రశ్నించారు. దేవాలయాలలో పౌరోహిత్యం మొదలు పెళ్ళిళ్ళు చేయించే వరకూ తామెందుకు అర్హులం కాదనే మీమాంస వచ్చింది. బ్రాహ్మణులపై పోరాటానికి వారినే అన్నివిధాలా అనుకరిస్తూ, జంధ్యాలు వేసుకొని, మంత్రాలు చదివి పెళ్ళిళ్ళు చేయించారు. సాహిత్యరంగంలోనూ ప్రవేశించి వేదాలు, పురాణాలు చదివారు. యజ్ఞాలు చేయించారు. బ్రాహ్మణులు సమాజంలో తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ, సాంఘిక, సాంస్కృతిక, విద్యారంగాలలో కీలక స్థానంలో వుంటూ, నాయకత్వం వహించారు. ఆ స్థానం కదిలితే వారికి ఆధారం పోతుంది, పెత్తనం పోతుంది, గుర్తింపు తగ్గుతుంది. కమ్మవారు సరిగ్గా అక్కడే దెబ్బ కొట్టారు. అప్పటినుంచీ బ్రాహ్మణ కమ్మ కులాల మధ్య విద్వేషాలు పెరిగిపోయాయి.

**వివరాలకు చూడండి 💻**

Frykenberg R.E. Guntur district 1788-1848 : A history of local influence and central authority in South India. - Oxford 1965.

Baker C.J. & Wash Brook. D.A. South India – Political Institution and Political change 1880 – 1940, Delhi, 1976 Vikas

## కమ్మసంఘాలు

కమ్మ కులానికి చెందిన తొలి మహాసభను 1910లో కృష్ణాజిల్లా కౌతరంలో జరిపారు. కంఠంనేని వెంకటరంగయ్య, బొబ్బా పద్మనాభయ్య యిందులో ప్రధాన పాత్ర వహించారు. అప్పటినుంచీ క్రమంగా విజయవాడ, గుంటూరు, ఖమ్మంలో కమ్మ హాస్టళ్ళు పెట్టారు.

1921 నాటికి జిల్లాల వారీగా కమ్మ జనాభా శాతం చూస్తే యిలా ఉన్నది. గోదావరి (నేటి ఉభయ గోదావరులు) 6.4శాతం, కృష్ణ 25.8, గుంటూరు 36 శాతం, నెల్లూరు 12.5 శాతం, కడప 2.3 శాతం, కర్నూలు 0.9 శాతం, అనంతపురం 4.5 శాతం, చిత్తూరు 10.7 శాతం, మొత్తం జనాభా 41,405,404 మొత్తం మీద 1910లో ప్రారంభమైన కమ్మ మహాసభలు ఏటా కాకున్నా తరచు మహాసభల్ని నిర్వహిస్తూ, కమ్మవారిని కూడగట్టే ప్రయత్నాలు చేశారు. బందరు నుంచి 1920లో కమ్మకుల పత్రికను స్థాపించారు. సూర్యదేవర రాఘవయ్య చౌదరి 1915లో మొదలు పెట్టిన బ్రాహ్మణేతరోద్యమానికి బలం చేకూరింది. 1925లో ఆయన 'బ్రాహ్మణేతర విజయము', 'బ్రాహ్మణేతర సంఘ దర్పనము' (1927) అనే రచనలు చేశారు. కమ్మవారు శూద్రులు కారని క్షత్రియులనే ఒక వాదన లేవనెత్తి, వెర్రి ఆవేశాన్ని ప్రదర్శించారు. గుంటూరు జిల్లా టంగుటూరు (ప్రస్తుతం ప్రకాశం జిల్లా)లో పాములపాటి కృష్ణయ్య చౌదరి ఆర్థిక సహాయంతో 8వ కమ్మ మహాజన సభ జరుపుకున్నారు (1922). త్రిపురనేని రామస్వామి చౌదరి అప్పటికి లండన్ లో బారిష్టర్ చదువు పూర్తిచేసి రంగ ప్రవేశం చేశారు. ఈయన ప్రవేశంతో కమ్మవారిలో ఆవేశం పెరిగింది. రామస్వామి చౌదరి రచనలు కూడా కమ్మ వారికి, బ్రాహ్మణేతరులకు తోడ్పడినవి. 1924లో కమ్మవారు వేదాలు

చదవరాదనే అగ్రహారీకుల ఆజ్ఞలు ధిక్కరించి తాడిపర్రు వేద పాఠశాలలో కమ్మ విద్యార్థులు వేదాలు వల్లించారు.

1926లో బెజవాడలో జరిగిన కమ్మ మహాసభలో ఎన్.జి.రంగా, గొట్టిపాటి బ్రహ్మయ్య మొదలైనవారు పాల్గొన్నారు.

సాహిత్య, మత, సాంఘిక, రంగాలలో యీ విధంగా బ్రాహ్మణాధి పత్యాన్ని ప్రశ్నిస్తూ ముందుగా కమ్మవారు, క్రమేణా మిగిలిన కులాల వారు ముందుకు వచ్చారు. ఉద్యోగాల సంగతి సరేసరి.

ఇదిలా వుండగా రాజకీయ రంగంలో మరో మార్పు జరిగింది. కాంగ్రెసు పార్టీ ఉద్యమాలు మద్రాసుకు ఆలస్యంగా పాకినవి. బెంగాల్, మహారాష్ట్ర ప్రభావం ఆంధ్రపై హెచ్చు కుల రాజకీయాలతో మద్రాసు రాష్ట్రం సతమతమౌతుండగా, బ్రాహ్మణ నాయకత్వం క్రింద ఆంధ్ర కాంగ్రెసువారు తమకు ప్రత్యేక కాంగ్రెసు సంఘం కావాలన్నారు. ఇది తమిళ బ్రాహ్మణులు వ్యతిరేకించారు. అనిబిసెంట్ కూడా వారికి వత్తాసు పలికింది. అందువలన, అనిబిసెంట్ హోమ్ రూల్ లీగ్ ప్రభావం ఆంధ్రలో అంతగా పాకలేదు. కాని తమిళ-ఆంధ్ర బ్రాహ్మణుల మధ్య అభిప్రాయ భేదాలు బాగా బయటపడినవి. మొత్తం మీద 1917 నాటికి ప్రత్యేక రాష్ట్ర కాంగ్రెసును సాధించుకున్నారు. అప్పటి నుంచీ కాంగ్రెసులో ఆధిపత్యం కోసం బ్రాహ్మణులలో – ముఖ్యంగా ప్రకాశం, పట్టాభి, కొండా వెంకటప్పయ్య, బులుసు సాంబమూర్తి కొట్లాడుకున్నారు. అనిబిసెంట్ రంగ ప్రవేశంతో మద్రాసు రాష్ట్రమంతటా బ్రాహ్మణేతరోద్యమాన్ని బాగా రెచ్చగొట్టినట్టయింది. ఎందుకంటే, ఆమె బ్రాహ్మణుల పక్షాన చేరింది. ప్రభుత్వ రంగంలో బ్రాహ్మణేతరులకు ఉద్యోగావకాశాలు, ఇతర సౌకర్యాలు కావాలంటూ 1916లో జస్టిస్ పార్టీ పుట్టింది. ఆ యేడాదే ఒక మానిఫెస్టో విడుదల చేశారు. మద్రాసులో పుట్టిన యీ పార్టీలో ఆంధ్రలోని బ్రాహ్మణేతర ప్రముఖులు చేరారు. అప్పటినుంచీ కులానికి రాజకీయాలుతోడు కాగా, జస్టిస్ పార్టీ బ్రిటిష్ వారి ఆదరణకు లోనైంది. ఆంధ్రలో జస్టిస్ పార్టీకి శాఖలు ఏర్పరచి సభలు జరిపారు. జమీందార్లందరూ యీ పార్టీ ప్రముఖులే. బొబ్బిలి, పిఠాపురం, మీర్జాపురం, చల్లపల్లి, వెంకటగిరి రాజాలు కుప్పుస్వామి చౌదరి, పామూలపాటి కృష్ణయ్య చౌదరి ప్రభృతులు యీ పార్టీలో వున్నారు. ఇందులో వెలమ, క్షత్రియ, రెడ్డి, కాపు, కమ్మ కులాల వారున్నారు. కట్టమంచి రామలింగారెడ్డి, పానుగంటి రాజా, కె.వి.రెడ్డి నాయుడు ఆంధ్ర నుంచి నాయకత్వం స్వీకరించారు. కాంగ్రెసు వారికీ, జస్టిస్ పార్టీ వారికీ పోరాటం ప్రారంభమైంది. పత్రికాముఖంగానూ జరిగింది. కులం, రాజకీయం కలసిపోయి అలా కొట్టుకున్నారు.

## కమ్మ పెళ్ళి సంబంధాలు
## వ్యక్తి పలుకుబడులు

20వ శతాబ్దపు తొలి దశాబ్దాలలో కమ్మ కులంలో కొంతమంది సంపన్న వంశీకులు పెళ్ళి సంబంధాలతో కట్టుదిట్టాలు చేసుకున్నారు. వెలగపూడి రామకృష్ణ ఐ.సి.ఎస్. చదివి అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య కుమార్తెను పెళ్ళి చేసుకున్నాడు. అడుసుమిల్లివారు కుటుంబంతోనూ, యార్లగడ్డవారితోనూ వియ్యమందారు. చల్లపల్లి రాజా కుమార్తె కొమ్మారెడ్డి పట్టాభి రామయ్యను వివాహమాడింది. బొల్లిన కుటుంబంతో గోగినేని వారికి సన్నిహిత సంబంధాలు ఏర్పడినవి. ఇటువంటి సంబంధాలు కేవలం సంపన్న కుటుంబాలకు పరిమితం గావడం, వారు చిత్తూరు నుంచి తూర్పుగోదావరి వరకూ విస్తరించి వుండటంతో, రాజకీయాలలో కూడా దీనిని వాడుకున్నారు. మద్రాసు ముఖ్యమంత్రి (నాడు ప్రధాని)గా పదవిని అలంకరించిన బొల్లిన మునుస్వామి నాయుడు (కమ్మ) తన కుమార్తెను డి.మునిరత్నం నాయుడికిచ్చి పెళ్ళి చేశాడు. చల్లపల్లి రాజా ఎస్టేట్‌లో మేనేజర్‌గా పనిచేసిన నారాయణస్వామి లాయరూ, మునిరత్నం నాయుడు సోదరుడు కూడా ముఖ్యమంత్రి పదవి పోయిన తరువాత మునుస్వామి నాయుడు, గోగినేని రంగాకు సన్నిహితుడైనాడు. జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరికి కుడి భుజంగా పాములపాటి వెంకట కృష్ణయ్య చౌదరి వుండేవాడు. ఆయన జస్టిస్ పార్టీ నాయకుడైతే, కాంగ్రెస్‌లో ప్రధాన పాత్ర వహించిన రంగాతో సన్నిహితంగా వుండటమే గాక ఆయనకు బంధువు కూడా, వాసిరెడ్డి శ్రీకృష్ణ జస్టిస్ పార్టీ ముఖ్య మంత్రి మునుస్వామి నాయుడుకు ప్రైవేట్ సెక్రటరీగా చేసి, తరువాత ఆంధ్రా యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ అయ్యాడు. వాసిరెడ్డి వారు ముక్త్యాల జమీందారులు.

జాగర్లమూడి కుప్పుస్వామి ఆనాడు 8వేల రూపాయల పన్ను చెల్లించేవాడు. 2400 ఎకరాల పొలం, 2వేల ఎకరాల తోట వుండేవి. (GoI Reforms Franchise B-34 99 Mar. 1921 National Archives) 1925-26లో గుంటూరు

జిల్లాలో చాలా తాలూకా బోర్డులు కమ్మవారి అధీనంలోకి వచ్చాయి. 1927లో జిల్లా బోర్డు కూడా కమ్మవారి అధ్యక్షత క్రిందకు వచ్చింది. పశ్చిమ గోదావరిలో మాగంటి సీతయ్య (కమ్మ) తన ప్రభావాన్ని బాగా చూపెట్టాడు (1927 నాటికి).

చలసాని సత్యనారాయణ చౌదరి కృష్ణ, గుంటూరు జిల్లాలలో కమ్మవారికి ప్రముఖ న్యాయవాది అయ్యాడు. స్థానిక సంస్థల కలహాలలో ఆయనన్నే కమ్మవారు సంప్రదించేవారు. ఈయన పాత్రను గురించి ఒ.జి.ఆర్.సింగ్ పెట్టిన ఫిర్యాదు దరఖాస్తును, గుంటూరు జిల్లాబోర్డు అధ్యక్షుడు పైకి పంపాడు. (1927 మార్చి 12 GO2367 (LSG) 23 June 1927 (State Archives) చట్టాన్ని, నియమ నిబంధనల్ని, కోడ్‌ను కమ్మవారికి అనుకూలంగా వ్యాఖ్యానించి, పదవులలో వున్న వారిని కాపాడడంలో సత్యనారాయణ చౌదరి బాగా తోడ్పడినట్లు యీ ఫిర్యాదు సారాంశం.

సర్ ఆర్థర్ కాటన్ పుణ్యమా అని నిర్మించబడిన గోదావరి, కృష్ణ ఆనకట్టల వలన చాలామంది కమ్మ రైతులు బాగా పొలాన్ని సాగుచేసి, కష్టించి, పండించి, తెల్ల బట్టలు కట్టగలిగారు. వీరితో పోల్చి చూస్తే మెట్ట ప్రాంతాలవారు వెనుకబడిన కమ్మవారు బీద కమ్మవారంతా నీరు కాయ వస్త్రాలు ధరించి, జొన్న అన్నం తినగా, భాగ్యవంతులైన కమ్మవారు సాధారణ బియ్యం వాడేవారు. ఇది ఆనాడు చాలా పెద్ద తేడా. అంతేగాక జొన్న అన్నం తినేవారిని వరి అన్నం తినేవారు చిన్న చూపు చూస్తూ, వారితో పెళ్లి సంబంధాలు కుదుర్చుకునే వారు కాదు. పెదకమ్మ, చినకమ్మ అనే వ్యత్యాసాలతో మాగాణి ప్రాంతపు కమ్మ వారిలో కూడా తారతమ్యాలు బాగా పాటించారు. ఆనకట్టలు వచ్చిన తరువాత వ్యవసాయ భూముల ధరలు విపరీతంగా పెరిగి, కొందరు కమ్మవారు సంపన్నులుగా మారారు. ఎకరం 40 రూపాయల నుండి వెయ్యి 15 వందలవరకూ 1926లో ధర పలికింది. ఆదాయం తల ఒక్కంటికి రెండున్నర రెట్లు పెరిగింది. (ఎకనమిక్ ఆర్గనైజేషన్, రంగా పేజి 20-5 Vol I, Vol II 95-100 oxford dissertation) కమ్మ రైతులు తమ పొలాల ఆధారంగా వడ్డీకి డబ్బు తీసుకుని, వాణిజ్య పంటలు వేసి విపరీతంగా సంపాదించ గలిగారు. పల్లెటూర్లకు నగరాలకు సంబంధాలు పెరిగి, గ్రామాలకు నాగరికత విస్తరిల్లడానికి యీ కొత్త ఆర్థిక వ్యవస్థ ఉపకరించింది. కొందరు రైతులు కొత్తగా వ్యాపారంలో ప్రవేశించారు. చాలా రైసుమిల్లులు అలా వచ్చినవే.

కమ్మకుల పత్రికను ప్రారంభించారు. (1920) కమ్మవారు 1930 నాటికి జమీందారీ వ్యతిరేక పోరాటంలో ముఖ్యంగా కృష్ణ-గుంటూరు జిల్లాలలో ప్రముఖపాత్ర వహించారు.

1923లో కమ్మ గ్రామ నాయకులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న టి.బాలాజీ రావును (వెలమ) కృష్ణాజిల్లా బోర్డు నుండి రాజీనామా చేయించారు. ఈయన తన పదవిని నిలబెట్టుకోవడానికి నాటి ప్రధాని పానగల్ రాజాకు డబ్బు రుణంగా ఇచ్చాడంటారు.

కృష్ణా జిల్లాను 1927లో పశ్చిమ, తూర్పు కృష్ణాలుగా నాటి ప్రధాని డాక్టర్ సుబ్బరాయన్ చీల్చాడు కొత్తగా ఏర్పరచిన బోర్డులకు సభ్యులను తానే నామినేట్ చేసే అధికారం స్వీకరించాడు. మీర్జాపురం రాజాకు వ్యతిరేకంగా ఆయన యిలా చేయగా అంతకు ముందు పానగల్లు రాజా మద్దత్తు మీర్జాపురానికి, తన దివాన్‌గా చేసిన బాలాజీ రావుకు ఉండేది. అలాగే గుంటూరులో యతిరాజులు నాయుడిని పానగల్లు వేనకేసుకొచ్చాడు. వీరికీ, కమ్మవారికీ పడేదికాదు. కమ్మ-కాపు పోరాటం ఆరంభమైంది.

అయితే చిత్తూరులో మాత్రం పానగల్లు మద్దత్తు కమ్మకులానికి లభించింది. అందుకే జిల్లాబోర్డులో మునుస్వామి నాయుడి ఆధిపత్యం వుండగా 1923లో పోటీకి నిలబడడానికి కట్టమంచి రామలింగారెడ్డి సాహసించలేదు. అప్పటినుంచీ చిత్తూరు జిల్లాలో రెడ్డి-కమ్మ స్పర్ధలు పెరిగాయి.

## జస్టిస్ పార్టీ - కుల పోరాటాలు

1916లో మద్రాసులో పుట్టిన జస్టిస్ పార్టీ, బ్రాహ్మణేతరుల ప్రతినిధిగా పేర్కొంటూ సభలు, సమావేశాలు జరిపింది. ప్రభుత్వానికి మహజర్లు పెట్టింది. మింటో-మార్లే సంస్కరణలు, మాంటేగు-ఛేంస్ఫర్డ్ సంస్కరణలవలన 1920లో మద్రాసు రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు జరిగాయి. అందులో జస్టిస్ పార్టీ వారు నిలబెట్టిన అభ్యర్థులు నెగ్గారు తరువాత ఆ పార్టీకి బ్రిటీష్ వారు పదవులను కట్టబెట్టారు.

జస్టిస్ పార్టీ వత్తిడి వలన 1919లో బ్రిటిష్ పాలకులు మద్రాసులో మరొక ఉత్తరువు జారీ చేశారు. క్లర్క్‌లు, డెప్యూటీ తహసిల్దారులు, సబ్-మాజిస్ట్రేట్ ఉద్యోగాలను తమిళ, తెలుగువారిలో సమంగాను, అందులో మరలా బ్రాహ్మణులకు సగానికి మించకుండానూ వుండాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆనాటి ఉద్యోగాల పరిస్థితి యిలావున్నది. 1920లో 495 అఖిల భారత సర్వీసులకు గాను బ్రాహ్మణులు 22 మంది, బ్రాహ్మణేతరులు 24గురు వున్నారు. 926 గెజిటెడ్ పోస్టులకుగాను బ్రాహ్మణులు 439 మంది బ్రాహ్మణేతర కులాలవారు 182 మంది వున్నారు. నెలకు వందరూపాయల జీతం లభించే నాన్ గెజిటెడ్ ఉద్యోగాలలో 1920 నాటికి బ్రాహ్మణులు 1665 మంది, బ్రాహ్మణేతరులు 722 మంది వున్నారు. మొత్తం ఉన్న ఉద్యోగాలు 2961 నెలకు 35 నుంచి 100 రూపాయల జీతం యిచ్చే నాన్ గెజిటెడ్ ఉద్యోగాలలో బ్రాహ్మణులు 5847 మంది, బ్రాహ్మణేతరులు 2870 మంది ఉన్నారు. మొత్తం ఉద్యోగాలు 9991 (ఇండియన్ స్టాట్యుటరీ కమిషన్, 6వ సంపుటి అనుబంధం ఎ పుట 607-13.)

1921 జనాభా లెక్కల్నిబట్టి చూస్తే తెలుగు బ్రాహ్మణులలో చదువుకున్న వారి శాతం 59.7 ఉండగా, రెడ్లలో (కాపు) 10.2 శాతం, కమ్మలో 13.6 శాతం, వెలమ 7 శాతం వున్నారు. ఇది పురుషులకే పరిమితం అని గ్రహించాలి.

ఇందులో మళ్ళీ ఇంగ్లీషు చదువులు లెక్కలుచూస్తే, తెలుగు బ్రాహ్మణులు 17.37 శాతం, వెలమ 0.63శాతం, రెడ్డి (కాపు) 0.41, కమ్మ 0.45 మాత్రమే వున్నారు. (సెన్స్ స్ ఆఫ్ ఇండియా, మద్రాసు 1921 x III Pt I, 128-129)

ఈ పరిస్థితిపై బ్రాహ్మణేతరులు పోరాడి, జస్టిస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత, అనగా 1920 అనంతరం మరొక ఉత్తరువు జారీ చేయించారు. 1921 సెప్టెంబరు 16న యీ ఉత్తరువు వచ్చింది. ఉద్యోగాలలో బ్రాహ్మణేతరులకు కేటాయింపులు అన్ని శాఖలకూ, సెక్రటేరియట్ కూ విస్తరింపజేయాలని యీ ఉత్తరువు సారాంశం. జస్టిస్ పార్టీ ప్రభుత్వ కమ్యూనల్ జి.ఓ.గా దీనికి పేరొచ్చింది. సంవత్సరానికి రెండు పర్యాయాలు యీ ఉత్తరువుననుసరించి జరిగిన అభివృద్ధిని తెలియపరచాలన్నారు. జస్టిస్ పార్టీ బ్రాహ్మణేతరులకు సాధించి పెట్టిన ఘన విజయంగా యీ జి.ఓను చెప్పుకున్నారు.

కులాలవారీగా జనాభా లెక్కల సేకరణ 1921లో జరిగింది. ఆ తరువాత ప్రతి 10 సంవత్సరాలకు జరిగే జనాభాలెక్కల్లో కుల ప్రాతిపదిక వివరాలు మానేశారు. కనుక ఏ కులానికి ఎంత జనాభా వున్నదీ ఎన్ని ఉద్యోగాలు ఎలాయిచ్చిందీ తెలుసుకోవడం దుర్లభమైపోయింది.

మద్రాసు కౌన్సిల్ లో 1920 ఎన్నికల అనంతరం జస్టిస్ పార్టీ తొలి ముఖ్యమంత్రిగా సుబ్బరాయలు రెడ్డియార్ ను నియమించారు. ఆయన అనారోగ్య కారణంగా రాజీనామా చేయగా ఎ.పి.పాత్రోను నియమించారు. ఆ తరువాత రామరాయణగారు (పానగల్లురాజా) ముఖ్యమంత్రి అయ్యారు. 1920 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పాల్గొనకపోవడంతో యించుమించు వ్యతిరేకత లేకుండానే జస్టిస్ పార్టీ వారు కౌన్సిల్ కు నెగ్గారు. ఉదాహరణకు కృష్ణాజిల్లా ఘంటసాలలో ఖాళీపెట్టెలు తిరిగి వెళ్ళాయి. ఆ ఊళ్ళో 210 ఓట్లూ వేయకుండా కాంగ్రెసు ఆపగలిగింది. **చూడు** – నాజీవననౌక – గొట్టిపాటి బ్రహ్మయ్య 1976 తెలుగు విద్యార్థి, మచిలీపట్నం. మొత్తం 98 స్థానాలకుగాను 63 జస్టిస్ వారిచే నామినేషన్లతో కలిపితే జస్టిస్ వారికి 81 స్థానాలున్నవి. కౌన్సిల్‌లో అన్ని విధాలైన స్థానాలు కలిపి చూస్తే 127. ఇందులో 22 మందే బ్రాహ్మణులు, 65 మంది బ్రాహ్మణేతరులు.

జస్టిస్ పార్టీ వారు అధికారానికి వచ్చిన తరువాత రెండవ కమ్యూనల్ జి.ఓ. 1922 ఆగస్టు 15న జారీ చేశారు. కౌన్సిల్‌లో చర్చ అనంతరం వచ్చిన యీ ఉత్తరువు ప్రకారం, సీనియారిటీగాక సెలక్షన్ పద్ధతిపై అన్ని స్థాయిల్లో అన్ని రకాల ఉద్యోగాలకు బ్రాహ్మణేతరులకు కేటాయింపులు జరగాలన్నారు. జస్టిస్ పార్టీ మరొక ఘన విజయం సాధించినట్లు పేర్కొన్నారు.

1921లో మొట్టమొదటిసారిగా జస్టిస్ పార్టీ మద్రాసు రాష్ట్రంలో స్త్రీలకు ఓటు హక్కును ప్రసాదించడం పెద్ద విశేషం.

ఆనాడు ఓటుహక్కు అంటే పన్ను లేదా శిస్తు సాలీనా 10 రూపాయలు చెల్లించే వారికే వుండేదని గుర్తుంచుకోవాలి.

జస్టిస్ పార్టీ 1920 నుండి 1937 వరకు మద్రాసు రాష్ట్రంలో అధికారంలో వున్నది. బ్రిటిషువారి, ద్వంద్వ పరిపాలనాధికారంలో బ్రాహ్మణ-బ్రాహ్మణేతర గొడవలు అన్ని రంగాలకు విస్తరిల్లిన మాటవాస్తవం. తరచు కౌన్సిల్‌లో యీ

విషయాలు చర్చకు వస్తుండేవి. బ్రాహ్మణుల దాడిని ఎదుర్కోనడం, బ్రాహ్మణులపై విమర్శలు చేయడం జస్టిస్ వారి ప్రధానాంశాలలో ఒకటిగా వుండేది. చివరకు మద్రాసు హైకోర్టులో బ్రాహ్మణాధి పత్యం వున్నందున, జిల్లా మున్సిఫ్‌లను నియమించే అధికారం హైకోర్టుకు వుండరాదని బొల్లిని మునుస్వామినాయుడు కౌన్సిల్‌లో వాదించాడు.

## బ్రాహ్మణాధిపత్యాన్ని దెబ్బతీసిన దేవాదాయ చట్ట మార్పు

హిందూ దేవాదాయ ధర్మాదాయ చట్టంలో జోక్యం చేసుకోరాదని, మత విషయాలను దూరంగా వుంచాలని బ్రిటిష్ వారి సాధారణ విధానం. కాని జస్టిస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత, మఠాలలో దేవాలయాలలో జరుగుతున్న దుర్వినియోగం అరికట్టడానికి బోర్డు ఆఫ్ కమిషనర్లను నియమించాలని నిర్ణయించారు. దీనికి బ్రాహ్మణుల వ్యతిరేకత బాగా వ్యక్తమైంది. మఠాధిపతులలో అధిక సంఖ్యాకులు బ్రాహ్మణులు. వారిని అదుపు చేయాలనే ఉద్దేశంతో యీ బిల్లును 1923లో ప్రవేశ పెట్టినట్లు విమర్శలు వచ్చాయి. కౌన్సిల్ లో సెలక్ట్ కమిటీ దీనిని వీటో చేసింది. అయితే బోర్డు ఆఫ్ కమిషనర్లను నియమించాలన్నారు. ఈ వాదోపవాదాలలో బ్రాహ్మణులపై తమిళులే ఎక్కువగా విరుచుకు పడ్డారు.

పానగల్లు రాజా ముఖ్యమంత్రిగా చేయని దోషం లేదు. జస్టిస్ పార్టీ ఐక్యత కంటె, తను, తన వారు అధికారంలో వుండటం ఆయనకు ముఖ్యం, ఆ దృష్టితో వ్యవహరించడంతో కూర్మా వెంకటరెడ్డి నాయుడు, కట్టమంచి రామలింగారెడ్డి జస్టిస్ పార్టీ నుంచి తప్పుకొని వ్యతిరేక పక్షాలను పెట్టారు. పానగల్లు రాజాపై కట్టమంచి అవిశ్వాస తీర్మానం తేగా, అది వీగిపోయింది. కుల, మత, ప్రాంతీయ భేదాలను విస్మరించి, అన్ని విధాలైన మార్గాలు అనుసరించి పానగల్లు రాజా పదవి నిలబెట్టుకున్నారు.

కె.వి.రెడ్డి నాయుడు జస్టిస్ పార్టీకి సలహాయిస్తూ బ్రాహ్మణ వ్యతిరేకత కంటే, జాతీయ దృక్పథాన్ని అలవరచుకోమన్నాడు. కాంగ్రెసు పార్టీ బ్రాహ్మణాధిపత్యంలో వున్నదనే భ్రమ తొలగించాలంటే కాంగ్రెస్ పార్టీలో బ్రాహ్మణేతరులు చేరాలని కట్టమంచి రామలింగారెడ్డి సూచించాడు. 1925లో అమరోతిలో అఖిలభారత బ్రాహ్మణేతర మహాసభలో పానగల్లు రాజా, త్యాగరాజ చెట్టి పాల్గొన్నారు. అంతకు ముందు 1924లో బొంబాయిలో యిలాంటి సభ జరిగినప్పుడు బొల్లిని మునుస్వామి నాయుడు వెళ్ళి పాల్గొని వచ్చాడు. తమిళనాడులో బ్రాహ్మణేతర ఉద్యమం రామస్వామి నాయకర్ నాయకత్వాన విజృంభించగా, ఆంధ్రలో అటువంటి తీవ్రత కనిపించలేదు. జస్టిస్ పార్టీ నాయకత్వాన బ్రాహ్మణేతరులు ఆంధ్రలో జాతీయోద్యమానికి చేరుకోలేకపోయారు. జలియన్ వాలాబాగ్ లో బ్రిటీష్ వారు భారతీయుల్ని మూకుమ్మడిగా కాల్చేస్తే ఇక్కడ అంతగా చలనం లేదు. గాంధీజీ యిచ్చిన వివిధ పిలుపులకు సైతం ఆంధ్రలో స్పందన అట్టే రాలేదు.

గోగినేని రంగనాయకులు (తరువాత 'రంగా') 1930 వరకూ జస్టిస్ పార్టీ మంత్రి మండలులు నియమించిన వివిధ సంఘాలలో పనిచేసి, సలహాలనిస్తూ వచ్చారు. కాంగ్రెసు పార్టీ ప్రత్యేక ఆంధ్ర శాఖను ఏర్పరచు కున్నప్పటికీ, 1930 వరకూ అంతగా బలాన్ని సంతరించుకోలేదనే చెప్పాలి.

1923లో కాంగ్రెస్ సభ్యత్వం 1562 మాత్రమే వుండగా 1925 డిసెంబరు నాటికి 2578కి పెరిగింది. 1926లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ బాయ్‌కాట్ చేయగా, స్వరాజ్యపార్టీ పక్షాన కొందరు కాంగ్రెసువారు పోటీచేసి నెగ్గినా, పార్టీ ఆదేశానుసారం పదవులు పుచ్చుకోలేదు. 1929 జులై వరకు అంటే, సైమన్ కమిషన్ బహిష్కరణ వరకూ ఆంధ్రలో కాంగ్రెసు పార్టీ సభ్యత్వం 4531 మాత్రమే వున్నది.

కాంగ్రెసు పార్టీలో ప్రకాశం-పట్టాభి ముఠాలకు ఎన్నడూ సయోధ్యలేదు. ఇరువురూ బ్రాహ్మణులే. బ్రాహ్మణేతరులలో ప్రముఖులెవరూ అప్పటికి కాంగ్రెసులో లేరు. ఉన్న కొద్దిమంది అంత పలుకుబడి కలవారు కారు. కాంగ్రెసులో కుల ద్వేషాలు ఎంతో ప్రబలంగా వుండేవి. చివరకు 1922లో పర్వతనేని వీరయ్య చౌదరి నాయకత్వాన గుంటూరుజిల్లా పెదనందిపాడు రైతులు పన్నుల నిరాకరణోద్యమం ప్రారంభిస్తే, పట్టాభి నాయకత్వానగల కాంగ్రెస్ దీనిని విరమింపజేసేవరకూ నిద్రపోలేదు. ఆశ్చర్యమేమంటే అలాంటిపనే పట్టాభి ఏలూరులోచేస్తే ఎవరూ కాదనలేదు. పర్వతనేని వీరయ్య చౌదరి యీ విషయమై గాంధీని సైతం నిందించక తప్పింది కాదు. 'బార్డోలీని మించిన పెదనందిపాడు

మహోద్యమం' పర్వతనేని వీరయ్యచౌదరి డైరీ – గుంటూరు మండల సర్వస్వము పుట289-293 (సం) దరువూరి వీరయ్య 1964)☜

కమ్యూనల్ జి. ఓ.లు అమలులో విఫలం కాగా జస్టిస్ పార్టీవారు ఆందోళన చెందారు. ఐ.సి.ఎస్. అధికారులు ముందు జాగ్రత్తగా బ్రాహ్మణ అధికారులను కలకత్తాకుగాని, గ్రామీణ ప్రాంతాలకుగాని బదిలీ చేశారు. వారి స్థానంలో బ్రాహ్మణేతరులను తెచ్చి నింపారు. అంతేగాని జి.ఓ.మాత్రం అమలు పరచలేదు. కలెక్టర్లకు, సెక్రటరీలకు నియామక విషయాలలో స్వేచ్ఛ వుండాలని మరోక ఉత్తరువు జారీ అయింది. అంతటితో కమ్యూనల్ జి.ఓ. బుట్టదాఖలా అయింది. (జి.ఓ.855 (పబ్లిక్) నవంబరు 3, 1923) కౌన్సిల్‌లో జస్టిస్ పార్టీవారు ఆందోళన చేసినా, నిష్ప్రయోజనమే. జ్యూడిషియల్ సర్వీస్‌లో లా మెంబరుగా సి.వి.రామస్వామి అయ్యర్‌కు క్రింది స్థాయి న్యాయమూర్తులను నియమించే పెత్తనం వుండేది. ఇది కూడా జస్టిస్ పార్టీ వారికి కంటకమైంది. ఆ తరువాత పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు ప్రతిపాదన వచ్చింది. ఐ.సి.ఎస్. వారు దీనికి పూర్తిగా మద్దత్తు ప్రకటించారు. సబ్ ఆర్డినేట్ పోస్టులను పరిశీలించి నియమించే స్టాఫ్ సెలక్షన్ బోర్డును ముందు ఏర్పరచారు. 1929లో సర్వీస్ కమిషన్‌ను నియమించారు. దేశంలో యిదే ప్రథమ సర్వీస్ కమిషన్. కౌన్సిల్‌లో సర్వీస్ కమిషన్ బిల్లుకు జస్టిస్ పార్టీవారు మళ్ళీ నామినేషన్లకే దారితీశారు. 1923 ఎన్నికల నాటికి 24 జిల్లాలలో 15 జిల్లా బోర్డు అధ్యక్షులను పానగల్లు నామినేట్ చేశారు. తన బంధువునే కళ్ళికోట బోర్డుకు నామినేట్ చేశారు. పానగల్లుకు డబ్బు రుణంగా యిచ్చిన కౌన్సిల్ సభ్యుడు తిక్కాని బాలాజీ రావును కృష్ణాజిల్లా బోర్డుకు అధ్యక్షుణ్ణి చేశాడు. చిత్తూరు జిల్లా ఎన్నిక పెట్టబోయి లాభం లేదని గ్రహించి వంశపారంపర్యంగా తమకు కొలువు చేస్తున్న మునుస్వామి నాయుడిని నామినేట్ చేశాడు. జిల్లా బోర్డు అధ్యక్షులనేగాక, అల్పసంఖ్యాకుల పేరిట కొందరు సభ్యులను కూడా తమవారనుకునే వారిని బోర్డులలో నామినేట్ చేసుకున్నారు. గుంటూరులో శాసనసభ్యుడైన పి.సి. యతిరాజులు నాయుడిని జిల్లా బోర్డు అధ్యక్ష పదవికే గాక గుంటూరు మునిసిపాలిటీకి కూడా నామినేట్ చేశారు. ఛైర్మన్ ఎన్నికకు సానుకూలం గావడానికి వీలుగా గుంటూరు మునిసిపాలిటీకి 5గురు సభ్యులను నామినేట్ చేశారు. బెజవాడలో ఛైర్మన్ తిరిగి ఎన్నిక గావడం కష్టమయ్యేసరికి, మూడు పర్యాయాలు ఎన్నికను వాయిదా వేసుకోవడానికి అనుమతించారు. స్థానిక సంస్థల నిధుల కేటాయింపును కూడా జస్టిస్ పార్టీ మంత్రులు తమ యిష్టం వచ్చినట్లు వాడారు. తెచ్చిన సవరణలు కూడా ప్రభుత్వం అంగీకరించలేదు. బ్రాహ్మణ, బ్రాహ్మణేతరుల మధ్య యీ విషయమై బాగా చర్చ, వివాదం జరిగింది. తొలుత కమిషన్ వారిదే పైచేయి అయింది. బ్రాహ్మణ, బ్రహ్మణేతర రాజకీయాలను సర్వీసులలో చొప్పించాలనే ప్రయత్నం అలా అంతమైంది

1988లో జరిగిన అలహాబాద్ కాంగ్రెసు మహాసభలో న్యాపతి సుబ్బారావు పంతులుతో సహా 45 మంది తెలుగువారు పాల్గొన్నారు.

1989లో బొంబాయిలో జరిగిన కాంగ్రెసు మహాసభకు ఆంధ్రనుండి 151 మంది, 1890లో కలకత్తాలో జరిగిన కాంగ్రెసు మహాసభకు 22 మంది వెళ్లారు.

1891లో ఆనందాచార్యులు, మరో 43 మంది ఆంధ్ర ప్రతినిధులు నాగపూర్ లో జరిగిన కాంగ్రెసు మహాసభలో పాల్గొన్నారు.

1892లో 17మంది ఆంధ్ర ప్రతినిధులు అలహాబాద్ కాంగ్రెసు మహాసభకు హాజరయ్యారు.

1893లో 14 మంది లాహోరు వెళ్లి పాల్గొనగలగటం ఆనాటి విశేషం.

1894లో మద్రాసులో కాంగ్రెసు మహాసభ జరిగింది. సామీప్యతను బట్టి 336 మంది తెలుగు ప్రతినిధులు పాల్గొన్నారు. కొండా వెంకటప్పయ్య నాటి సభల్లో వాలంటీరుగా పనిచేశారు.

1895లో పూనాలో జరిగిన కాంగ్రెసు మహాసభకు ఆంధ్ర నుండి ఎందరెళ్ళారో వివరాలు తెలియలేదు.

1890 తరువాత కాంగ్రెసు మహా సభల రాజకీయ ప్రాధాన్యత కొన్నేళ్ళపాటు తగ్గుముఖంలో వున్నది. దీనితో పాటే మద్రాసు మహాజనసభ కూడా వెనుకంజ వేస్తూ పోయింది. 1886 నుండి 1890లోగా యీ సభ సభ్యత్వం 607 నుండి

267కు తగ్గింది. కాంగ్రెసులో అలసత్వం ప్రబలింది. విన్నపాలే తప్ప మరొక చర్య లేనిరోజులవి. పాశ్చాత్య విద్యాభ్యాసంలో ప్రభుత్వానికి చేరువైన వారు పలుకుబడి పెంచుకున్నారు.

1897లో అమ్రౌతి కాంగ్రెసు సమావేశాలకు శంకరన్ నాయర్ అధ్యక్షత వహించారు. ఆంధ్రనుండి 21మంది ప్రతినిధులు వెళ్లారు.

1898లో జరిగిన మద్రాసు మహాసభలకు ఆనందాచార్యులు ఆహ్వాన సంఘాధ్యక్షులు. 208మంది ఆంధ్ర నుండి పాల్గొన్నారు.

1999లో జరిగిన లక్నో సమావేశాలకు రమేశ్ చంద్రదత్తా అధ్యక్షత వహించారు. 14మంది ఆంధ్ర నుండి పాల్గొన్నారు.

1900లో కలకత్తా కాంగ్రెసు మహాసభలకు ఆంధ్ర ప్రతినిధులు ఎందరు హాజరయ్యారో తెలియలేదు.

1903లో జరిగిన మద్రాసు మహాసభలకు లాల్ మోహన్ ఘోష్ అధ్యక్షత వహించగా 143 మందే ఆంధ్ర నుండి పాల్గొన్నారు.

1902లో 9 మంది ఆంధ్ర ప్రతినిధులు అహమదాబాద్ కాంగ్రెసులో పాల్గొన్నారు.

1904లో 97 మంది బొంబాయి కాంగ్రెసు మహాసభల్లో పాల్గొన్నారు.

1905లో 29 మంది కాశీ కాంగ్రెసు సమావేశానికి హాజరయ్యారు.

కాంగ్రెసు మహాసభల్ని ఆంధ్ర ప్రాంతానికి ఆహ్వానించేటంత నిర్మాణ కార్యక్రమంగానీ, ప్రముఖ నాయకత్వంగాని 1905 వరకూ పెంపొందలేదు. మద్రాసు మాత్రమే ఆంధ్రుల రాజధానిగా ప్రాముఖ్యత వహించింది. అయితే కాంగ్రెసు సమావేశాలకు వెళ్లి వచ్చిన ప్రతినిధుల ప్రభావం కొద్దిగా స్వస్థలాలలో పాకుతూ పోయిన మాట వాస్తవం. దేశస్థాయిలో, ఆ మాటకొస్తే రాష్ట్రస్థాయిలో ఆంధ్రుల పలుకుబడి, ప్రాభవం అంతంత మాత్రమే.

కొండా వెంకటప్పయ్య అప్పుడే బందరునుండి తరలి గుంటూరు వచ్చి ప్లీడరీ వృత్తి చేస్తున్నారు. కాశీనాథుని నాగేశ్వరరావు బొంబాయిలో అమృతాంజనం వ్యాపారం చేస్తున్నారు. 1894లో కృష్ణాజిల్లా రాజకీయ మహాసభ గుంటూరులో జరిగింది. నాడు కృష్ణా, గుంటూరులు కలసి ఒకే జిల్లాగా ఉండేవి. మరుసటి సంవత్సరం (1895) గోదావరి జిల్లా రాజకీయ మహాసభలు కాకినాడలో జరిగాయి. గంజాల వెంకటరత్నం బాగా కృషి చేశారు.

దాదాపు 20 సంవత్సరాలు న్యాపతి సుబ్బారావు, కందుకూరి వీరేశలింగంగారికి నరసింహం వ్యతిరేకిగా నిలబడ్డాడు. కాని ప్రభుత్వ సంస్కరణలతో యితను తగ్గాడు. నరసింహం ఆశ్రయంతో చదువు సాగించిన టంగుటూరి ప్రకాశం కూడా తన పలుకుబడిని రాజమండ్రిలో కోల్పోయాడు. నరసింహానికి స్థానిక విద్యాసంస్థలలోగల ప్రాధాన్యతకు బదులు వీరేశలింగం, సుబ్బారావుల పలుకుబడి బ్రిటిష్ వారి మద్దత్తు వలన యినుమడించింది.

1903-04లో రాజమండ్రి మునిసిపల్ అధ్యక్షుడుగా నరసింహంపై విచారణ సాగించటంతో పలుకుబడి మరింత తీసికట్టయింది.

కృష్ణాలో విద్యా సంస్థలపై గుత్తాధిపత్యం పి. వెంకటప్పయ్యది. అలాగే మునిసిపాలిటీలోనూ, బార్ లోనూ, పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు, కొండా వెంకటప్పయ్య యిందుకు వ్యతిరేకులు. సుబ్బారావు, వెంకటప్పయ్యల పెత్తనానికి ఎదురు తిరిగి రాజమండ్రిలో నరసింహం-ప్రకాశం, మచిలీపట్నంలో పట్టాభి సీతారామయ్య, కృష్ణారావు నిలబడ్డారు. స్థానిక ఆధిపత్యం కోసం ఆరంభమైన పోరాటం రాష్ట్రరాజకీయాల్లోకి పాకింది. ప్రకాశం, ముట్నూరి కృష్ణారావు పత్రికల ద్వారా తమ పోరాటం సాగించ గలిగారు. మైలాపూర్ ముఠాపై దాడి సలిపారు. కాంగ్రెసు మితవాదాన్ని నిరసించారు.

-------

# 'వందేమాతరం' ఉత్తేజం

బెంగాల్‌ను నాటి బ్రిటిష్ పాలకులు రెండుగా విభజించారు. లార్డ్ కర్జన్ తీసుకున్న యీ చర్య 1905 అక్టోబరు 10న ఆచరణలోకి రావటంతో అంతకుముందు నుండే యీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న ఆందోళన తీవ్రస్థాయికి చేరింది. దీని ప్రభావం ఆంధ్రపై పడింది.

మెల్లగా సాహసించి కొందరు పత్రికలు పెట్టి ప్రచారం ఆరంభించారు. కృష్ణాపత్రిక 1902లో కొండా వెంకటప్పయ్య, దాసు నారాయణరావు, అవుటపల్లి నారాయణరావుగారి కృషి వలన స్థాపితమయింది. ఈ విధంగా రాజకీయ వాతావరణానికి బీజాంకురాలు ఆంధ్రలో ఏర్పడి, వందేమాతరం వుద్యమానికి సహకరించాయి.

బెంగాల్ లో బంకించంద్ర ఛటర్జీ రాసిన ఆనంద్ మఠ్ నవలలో వందేమాతరం గేయమే ఆంధ్రుల్ని కూడా వుత్తేజితుల్ని గావించింది. వందేమాతరం అనే మాట వినిపిస్తే బ్రిటిష్ వారు అవమానంగా భావించేవారు. కొంతమంది యువకులు వందేమాతరాన్నే అభివాదంగా చేశారు. బాడ్జీలు ధరించేవారు. కేతా శ్రీరామశాస్త్రి యీ గేయాన్ని పాడి ప్రజా బాహుళ్యంలోకి తీసుకెళ్ళారు. వందేమాతరం వుద్యమంలో భాగంగా స్వదేశీవస్తు ప్రోత్సాహం, విదేశీ వస్తు బహిష్కరణ, జాతీయ విద్యను ప్రబలించాలనే ధోరణి వచ్చింది. అయితే ఈ వుద్యమాంశాలను వ్యతిరేకించినవారు మితవాదులు. ముఖ్యంగా విదేశీవస్తు బహిష్కరణను వారంగీకరించలేదు.

గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఆదిపూడి సోమనాథరావు ప్రచారానికి పూనుకుని, 1906 ఫిబ్రవరి 24న మద్రాసు స్వదేశీ ప్రచార సభలో పాల్గొన్నారు. కె వెంకటరమణారావు ఆధ్వర్యాన విద్యార్థి దళం ఏర్పడింది. న్యాపతి సుబ్బారావు పంతులు, వెంకటరమణ రావు ప్రచారానికి దిగగా, స్వదేశీ లీగ్ ఒకటి ఏర్పడింది. 1906 మే, జూన్ నెలల్లో వెంకట రమణరావు విశాఖపట్నం సమావేశాల్లో విదేశీ వస్తు బహిష్కరణను బలపరచలేదు.

1906 కలకత్తా కాంగ్రెసు తీర్మానాన్ననుసరించే స్వదేశీ వస్తు ప్రోత్సాహం ప్రారంభమయింది. ఇందులో గాడిచర్ల హరిసర్వోత్తమరావు, మునగాల రాజా, కె.వి.లక్ష్మణరావు, పింగళి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. సి. వై. చింతామణి నెల్లూరు, గుంటూరు, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం సభలలో యీ వుద్యమానికి ప్రోత్సాహం చేకూర్చారు.

స్వదేశీ వస్తువులు తయారు చేయడంలో సిద్ధహస్తురాలైన జపాన్ కు కొందరిని శిక్షణ నిమిత్తం పంపాలని చందాలు వసూలు చేశారు. గుంటూరు నుండి వసూలు చేసిన నిధితో మల్లాది వెంకట సుబ్బారావును, మద్రాసు జాతీయ నిధితో బళ్ళారి నుండి ఎస్. రామారావును 1908లో పెన్సిల్, గ్లాసు, గడియారాల తయారీ నేర్చే నిమిత్తం జపానుకు పంపారు. ఎ.భాస్కరరామయ్య సహాయంతో గోటేటి జానకిరామయ్య, ఇంకోసారి మామిడి దేవేంద్రాన్ని పంపారు. మునగాల రాజా ముందంజ వేసి బెజవాడలో ఒక నేత ఫ్యాక్టరీ ప్రారంభించారు.

1906లో సుప్రసిద్ధ గాయకుడు సురేంద్రనాథ్ బెనర్జీ అరెస్టుకాగా విజయనగరం, కాకినాడ, గుత్తి, రాజమండ్రిలో నిరసన సభలు చేశారు. తిలక్ ప్రేరణతో శివాజీ వుత్సవాలు మొదలు పెట్టారు. బందరులో కసరత్తుల కార్యక్రమం మొదలయింది.

కృష్ణాపత్రిక సంపాదకులు ముట్నూరి కృష్ణారావు 1907లో బిపిన్ చంద్రపాల్ పర్యటన విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, బెజవాడ, బందరు పట్టణాలలో ఏర్పాటు చేశారు. బ్రహ్మ సమాజికుడైన పాల్ కొంత అధ్యాత్మికతను స్వదేశీ ఉద్యమంతో రంగరించి, చదువుకుంటున్న వారిని వుత్తేజితుల్ని చేశాడు. ప్రతిచోటా యువకులు ఆయనకు ఘనమైన స్వాగతం పలికారు. బందరులో కోపల్లె హనుమంతరావు ప్రేరేపితుడై జాతీయ విద్య ప్రచారానికి కంకణం కట్టుకున్నాడు.

పాల్ పర్యటనలో భూపతిరాజు, వెంకటపతి రాజు, వి.జగన్నాథం, వి.పూర్ణయ్య (విశాఖపట్టణం, విజయనగరం), కె. పేర్రాజు (కాకినాడ), గంటి లక్ష్మన్న, కంచుమర్తి రాంచంద్రరావు, టంగుటూరి శ్రీరాములు, చిలుకూరి వీరభద్రరావు (బాలభారతి సమితిపేర), కేతా శ్రీరామ శాస్త్రి, చిలకమర్తి లక్ష్మీ నరసింహారావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు,

గున్నేశ్వరరావు (రాజమండ్రి), మునగాలరాజా, అయ్యదేవర కాళేశ్వరరావు, కోపల్లె హనుమంతరావు (బందరు) ప్రముఖ పాత్ర వహించి, కార్యక్రమం జయప్రదం గావించారు. అప్పటికే బి.ఎస్.శర్మ మితవాదిగా పాల్ ధోరణిని విశాఖ, విజయనగరం ప్రాంతాలలో వ్యతిరేకిస్తూ పోయాడు. మద్రాసులో పాల్ సభకు ప్రకాశం అధ్యక్షత వహించాడు.

రాజమండ్రిలో కళాశాల విద్యార్థులు పాల్ కార్యక్రమంలో పాల్గొనడం బాడ్జీలు ధరించి పరీక్షలకు వెళ్ళడం, వందేమాతరం నినాదాన్ని క్లాసులో యివ్వడం వలన మార్క్ హంటర్ ప్రిన్సిపాల్ గా అనేకమంది విద్యార్థులపై చర్య తీసుకొని కళాశాల నుండి బహిష్కరించారు. వారే స్వదేశీ వుద్యమానికి బాగా ప్రోది చేశారు.

కాకినాడలో కెప్టెన్ కెంప్ అనే అతన్ని చూసి వందేమాతరం నినాదం యిచ్చినందుకు కోపల్లె కృష్ణారావు చావు దెబ్బలు తిన్నాడు. అది కొట్లాటకు దారి తీయగా, కలెక్టర్ కు కూడా తగిలాయి. కెంప్ వుంటున్న భవనం దెబ్బ తిన్నది. పురప్రముఖులు విచారం వ్యక్తం చేసినా, బ్రిటిష్ వారు 5గురు కార్మికులతో సహా 50మందిని నిర్బంధించారు. కార్మికులు సమ్మె చేశారు. కలెక్టర్ హామీ యిస్తేగాని రేవులో పని ప్రారంభించలేదు. కెంప్ కొట్టినందుకు 100 రూపాయలు కృష్ణారావుకు యివ్వాల్సి వచ్చింది. ఇదంతా పాల్ పర్యటన వలన జాతీయోద్రేకతలో ప్రజలు జరిపిన చర్యలుగా, సూచనగా పేర్కొనవచ్చు. బిపిన్ చంద్రపాల్, సి.వై.చింతామణివంటి వారెవరో వస్తేగాని ఆంధ్రులు కదలలేదు. వందేమాతరం నినాదం, బెంగాల్ విభజన జరిగితేగాని ఆంధ్రులకు ప్రేరణ రాలేదు. ఒకసారి ఆవేశం వస్తే కొట్లాటలు, అరెస్టుల వరకూ పోయారు. ఈ చర్యల్ని మితవాదులు హర్షించలేదు. అతివాద మితవాద రాజకీయాల తీరు తెన్నులు సూరత్ కాంగ్రెసులో బాహాటంగా బయల్పడ్డాయి.

1907లో జరిగిన సూరత్ కాంగ్రెస్ సమావేశాలకు ఆంధ్రనుండి గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కోపల్లె హనుమంతరావు, గంటి లక్ష్మన్న టంగుటూరి ప్రకాశం, పెద్ద భొట్ల వీరయ్య, పేరి నారాయణమూర్తి వెళ్ళి అతివాదుల్ని కోపు వేసుకున్నారు.

ఆంధ్రకేసరి, కృష్ణాపత్రిక, నవయుగ పత్రికలు ఆనాటికే బ్రిటిష్ వ్యతిరేక ప్రదర్శనలు చేస్తూ దౌర్జన్యవాదం, అతివాదం సమర్ధించాయి. గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ముట్నూరి కృష్ణారావు, చిల్లరిగె శ్రీనివాసరావు వీటికి వరుసగా సంపాదకులు.

సూరత్ కాంగ్రెసులో తిలక్, అరవిందఘోష్, లజపతిరాయ్, అతివాద పక్షానికి నాయకత్వం వహించారు. రాష్ బిహారిఘోష్, సురేంద్రనాథ్ బెనర్జీ, ఫిరోజ్‌షా మెహతా మితవాదపక్షం వహించారు. బ్రిటిష్ వారి సంస్కరణలకు అనుకూలత చూపిన మితవాదులకు, స్వదేశీ వుద్యమాన్ని తీవ్రతరం చేయదలచిన అతివాదులకూ కొట్లాటలు జరిగి, కపర్దీ అనే వ్యక్తి వేదికపైకి చెప్పులు విసిరేసాడు. కొట్లాటల అనంతరం కాంగ్రెసు చీలింది. ఒక దశాబ్దం కాంగ్రెసు మితవాద స్తబ్దతలో పడింది.

మద్రాసులో జరిగిన రాష్ట్ర సమావేశంలో (1907) న్యాపతి సుబ్బారావు పంతులు, బి.ఎస్. శర్మ, మితవాదులుగా, కె శ్రీనివాసరావు (కర్నూలు), చిలకమర్తి లక్ష్మీనరసింహారావు అతివాదులుగా బయటపడ్డారు. ఈ చీలికే ఆంధ్ర ముఖ్య నగరాలన్నిటా వ్యాపించింది. విశాఖపట్నం, నందిగామ, తెనాలిలో సమావేశాలు జరిగాయి. వి.ఎస్.శ్రీనివాస శాస్త్రి మితవాదిగా కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లా సంఘాలు స్థాపించాడు. అతివాద పత్రికలు ఆంధ్ర కేసరి, నవయుగ, కృష్ణా పత్రికలు ఈ సంఘాలను ఆక్షేపించాయి. ఐక్యతా ధోరణిని పట్టాభి సీతారామయ్య, కోపల్లె హనుమంతరావు, వరాహగిరి వెంకట జోగయ్య చూపారు.

మద్రాసులో (1908) జరిగిన మితవాద కాంగ్రెస్ మహా సభకు ఆంధ్ర నుండి 116 మంది పాల్గొన్నారు. విషయ నిర్ణయ సంఘంలో 18 మంది ఆంధ్రులకు స్థానం యిచ్చారు. ప్రకాశం యీ సమావేశంలో వున్నారు. కె పేర్రాజు, వి వి జోగయ్య ఎ.సి. పార్థసారధి నాయుడు మట్లాడారు.

అనంతరం బెజవాడలో అయ్యదేవర కాళేశ్వరావు, తాడంకి వెంకటప్పయ్య పంతులు కలసి కాంగ్రెసు సంఘం స్థాపించారు.

లాలాలజపతిరాయ్ ని ప్రవాసం పంపినప్పుడు, బిపిన్ చంద్ర పాల్ ను విడుదల చేసినప్పుడు ఖేదమోద సమావేశాలు ఆంధ్రలో అక్కడక్కడ జరిపారు.

ఆంధ్రలో జాతీయ పాఠశాలలను తొలిసారిగా న్యాపతి సుబ్బారావు పంతులు రాజమండ్రిలో స్థాపించగా బందరులో కళాశాల ఏర్పడింది.

1908లో స్వరాజ్య పత్రిక బోడి నారాయణరావు సంపాదకత్వాన ప్రచురించిన వ్యాసాల నెపంతో అరెస్టులకు ప్రభుత్వం సిద్ధపడింది. అప్పటికే కలకత్తానుండి సర్దార్ అనే అతివాది ఆంధ్రలో అయ్యదేవర కాళేశ్వరరావు, హరి సర్వోత్తమరావు, పింగళి లక్ష్మీ నారాయణ, బోడి నారాయణరావు, కాశీనాథుని వీరమల్లయ్య, సూరి వెంకట నరసింహ శాస్త్రి, పెద్దిబొట్ల వీరయ్య, కలపటపు సుబ్బారావు, ముట్నూరి కృష్ణారావు, ఉన్నవ లక్ష్మీనారాయణ గున్నేశ్వరరావు, కొమర్రాజు లక్ష్మణరావు, ఆచంట లక్ష్మీపతి ప్రభుతులను వివిధ ప్రాంతాలలో కలిశాడు. సాయుధ పోరాటానికై బాంబుల తయారీ ఆవశ్యకతను నొక్కి చెప్పి వెళ్ళాడు. ఆ ప్రభావంతో దంటు సుబ్బావధాని కలకత్తా నుండి పిస్తోళ్ళు తెచ్చి పంచాడట. అయితే బాంబులు తయారు చేయడానికి ఎక్కడో ఒకరిద్దరు తప్ప ఎవరూ సాహసించలేదు. ఎల్. బసవయ్య అనే అతడు దేశద్రోహ కరపత్రాలను పంచాడని ప్రభుత్వం నెపం వేసింది.

1988లో మింటో మార్లే సంస్కరణల పట్ల మితవాద – అతివాద కాంగ్రెసు పక్షాలు రెండు విధాలుగా తీర్మానాలు చేశాయి. ప్రత్యేక నియోజక వర్గాలను అతివాదులు వ్యతిరేకించగా మితవాదులు ఆహ్వానించారు.

1908 జులై 13న గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, బోడి నారాయణ రావు అరెస్టు గావించబడగా, పింగళి లక్ష్మీ నారాయణ పుదుచ్చేరి అజ్ఞాతవాసానికి పోయారు.

అతివాదుల సాహసోపేత చర్యలు అనల్పమే. అయినా అలజడి సృష్టించాయి. (1909) కోటప్ప కొండ తిరునాళ్ళవద్ద పోలీసులు చంపబడడం, తెనాలి వద్ద కంచర్ల పాలెంలో బాంబులు పేలటం, అరెస్టులు, విజయనగరంలో అరెస్టులు మినహా మరేమీ జరగలేదు.

1909లో జరిగిన లాహోరు కాంగ్రెసు మహా సభలో 13 మంది ఆంధ్ర ప్రతినిధులు పాల్గొన్నారు. ఎ. ఎస్. కృష్ణారావు మాట్లాడారు.

1909లోనే ప్రత్యేకాంధ్ర నినాదం సూచన ప్రాయంగా వినిపించింది. 1870 నుండే తెలుగు భాషకు ప్రాధాన్యత కావాలనే ధోరణి అలహాబాదు కాంగ్రెసు తరవాత పుంజుకొన్నది. మైలాపూర్ బ్రాహ్మణ ముఠా ఆధిపత్యం పోవాలనే ప్రకాశం, పట్టాభి, ముట్నూరి, కొండాలు ప్రత్యేక రాష్ట్రానికి అండగా నిలవగా, ఆంధ్ర రాష్ట్రానికి వ్యతిరేకంగా న్యాపతి సుబ్బారావు మోచర్ల రామచంద్రరావులు పలికారు. వారికి మైలాపూర్ బ్రాహ్మణ లాయర్ల ముఠాతో సన్నిహిత సంబంధమున్నది. ఆ సంబంధాలు తెంచుకోలేక పోయారు.

మైలాపూర్ బ్రాహ్మణ లాయర్ల ముఠాపై వ్యతిరేకత, శాసనసభల్లో వారి పలుకుబడి వలన ఆంధ్ర వాదన యింకా బలపడింది. 1917 నాటికి మైలాపూర్ బ్రాహ్మణ ముఠా కూడా బ్రిటీష్ వ్యతిరేకమైన దారిన పడ్డది.

అనిబిసెంట్ హోమ్ రూల్ ఉద్యమంలో కొండా వెంకటప్పయ్య, పట్టాభి సీతారామయ్యలు పాల్గొన్నారు. వీరికి డబ్బు కూడా ముట్టేది.

(Statement of affairs of the Home Rule League 10 Jan 1919 (T.S.A. Theosophical Society Archives)
లెజిస్లేటివ్ కౌన్సిల్ కు తొలిసారిగా ఎన్నికయ్యారు కొండా వెంకటప్పయ్య. కాని 1920లో నుండి ప్రత్యేకాంధ్ర వుద్యమం చప్పబడింది. ప్రకాశం వెంకటప్పయ్య ముఠాల గొడవ అలా దారితీసింది.

స్వదేశీ వుద్యమానికి అనుకూలంగా అత్తిలి సూర్యనారాయణ వ్రాసిన హిందూ దారిద్ర్యం. మంగపూడి వెంకటశర్మ, వెంకట సుబ్బారాయుడు రచించిన భారత మాతృ శతకం నాడు పేరు గాంచాయి.

వల్లూరు మహారాణి పోషకత్వాన 1905లో విశాఖపట్నంలో స్త్రీ భారతి సంఘమేర్పడింది.

# మాకొద్దీ మద్రాసు పాలన

1909-10లో మితవాదులు కర్నూలు, గుంటూరు, కృష్ణా జిల్లాలలో సభలు జరిపారు. సమైక్యంగా జిల్లా సమావేశాలు జరగాలని, ఆంధ్రులు కట్టుగా ఉండాలని *దేశాభిమాని* పత్రిక 1910లో వ్రాసింది. చల్లా శేషగిరిరావు ఆంధ్రుల అవసరాలు, గుర్తింపు గురించి వ్రాసారు. 1908లో ఆంధ్ర అనే పత్రికను గుంటూరు నుండి జొన్నవిత్తుల గుర్నాధం వెలువరిస్తూ ఆలోచనలు రేకెత్తించారు.

గుంటూరులో యువజన సాహితీ సంఘం ఏర్పడి పనిచేస్తూ వున్నది. అక్కడ న్యాపతి నారాయణ రావు ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలనే అభిప్రాయాన్ని తొలుత వెల్లడించారు. అదేదో ఎబ్బెట్టుగా తోచింది అందరికీ.

ఆంధ్ర ప్రాంతంలో వుద్యోగాలన్నీ తమిళులకో, మహరాష్ట్రులకో దక్కాయి. తెలుగువారిని వేళ్ళపై లెక్కించవచ్చు. తమిళనాడులో సౌకర్యాలతో పోల్చి చూస్తే ఆంధ్ర బాగా అశ్రద్ధ చేయబడుతూంది. ఉపాధ్యాయులుగా, కోర్టు గుమాస్తాలుగా కూడా తమిళులు తామర తంపరగా వున్నారు. ఇదంతా చూచి చదువుకున్న యువకులు ప్రత్యేక రాష్ట్రాలోచన లీలగా చేశారు.

1912లో నిడదవోలులో జరిగిన కృష్ణా – గుంటూరు సమావేశాలు ...ప్రత్యేకాంధ్ర... నినాదం యిచ్చాయి. కూర్మా వెంకట రెడ్డి నాయుడు, న్యాపతి సుబ్బారావు, వల్లూరి సూర్యనారాయణ యీ నినాదాన్ని విని ఆశ్చర్య పడ్డారు. వున్నవ లక్ష్మీ నారాయణ నినాదం పలికాడు. చిలకమర్తి నరసింహం బలపరిచాడు. కొండా వెంకటప్పయ్య తటపటాయించాడు.

1910 అలహాబాదు కాంగ్రెసు మహాసభలో బి.ఎన్. శర్మ, డి.వి. కృష్ణారావు, సి.వై. చింతామణి, జి. రాఘవరావు, మోచర్ల రామచంద్రరావు ఎ.ఎస్.కృష్ణారావు, వి.వి.జోగయ్య, ముట్లూరి ఆదినారాయణయ్యతో సహా 82మంది ఆంధ్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

1911లో 72 మంది ఆంధ్ర ప్రతినిధులు కలకత్తాలో జరిగిన కాంగ్రెసు మహాసభలలో పాల్గొన్నారు. జి.శ్రీనివాసరావు, వావిళ్ళ వెంకటేశ్వర్లు, వి.వి.జోగయ్య మాట్లాడారు.

1912లో బంకీపూర్ కాంగ్రెసు మహాసభకు ఆంధ్ర నుండి వి.వి.జోగయ్య, ఎస్.వి.నరసింహారావు, ఎ.ఎస్.కృష్ణారావు, ఎ.పి.పాత్రో, సి.వి.ఎస్. నరసింహరాజు, డి.వి.ప్రకాశరావుతో సహా 12 మందే పాల్గొన్నా చాలా చర్చల్లో ప్రముఖ పాత్ర వహించారు.

1913లో జరిగిన కరాచి కాంగ్రెసు మహాసభలో 16 మంది ఆంధ్ర ప్రతినిధులు పాల్గొనగా, ఎ.ఎస్.కృష్ణారావు మాట్లాడారు.

1914లో యుద్ధారంభంలో మద్రాసు కాంగ్రెసు మహాసభ జరిగింది. 256 ఆంధ్ర ప్రతినిధులు పాల్గొన్నారు. ఎ.పి.పాత్రో, కె. వెంకట రెడ్డి నాయుడు, ఎ.పి. పార్ధసారధినాయుడు, జి. కేశవపిళ్ళై, కె.ఆర్.వి. కృష్ణారావు, ఎ. ఎస్.కృష్ణారావు, పి. లక్ష్మి నరసింహం చర్చలు చేశారు.

1917లో కలకత్తా కాంగ్రెసు మహాసభకు 352 మంది ప్రతినిధులు ఆంధ్రనుండి పాల్గొన్నారు. అనీబిసెంట్ అధ్యక్షత వహించిన యీ సభలో న్యాపతి సుబ్బారావు ప్రత్యేకాంధ్ర విజ్ఞాపన పత్రం సమర్పించారు. పట్టాభి సీతారామయ్య తీర్మానం పెట్టారు. గాంధీ, అనిబిసెంట్ వ్యతిరేకించారు. బాలగంగాధర తిలక్ అనుకూలించారు. కొండా వెంకటప్పయ్య మాట్లాడారు. తీర్మానం నెగ్గింది. ప్రకాశం ఆ సభలో వున్నారు.

1918లో జరిగిన ఢిల్లీ కాంగ్రెసు సభకు 20 మందే ఆంధ్ర నుండి వెళ్ళగలిగారు.

రాష్ట్ర సమావేశం ఏర్పాటు చేయాలని చట్టి నరసింహారావు చేసిన ప్రతిపాదన ఆమోదయోగ్యమైంది. కొండా వెంకటప్పయ్య కార్యదర్శిగా వింజమూరి భావనాచారి, వున్నవ లక్ష్మినారాయణ, చల్లా శేషగిరిరావు, జొన్నవిత్తుల గురునాధంతో ఒక సంఘాన్ని ఏర్పరిచారు. బాపట్లలో ఆంధ్ర మహాసభ జరిపాలని తీర్మానించారు.

1913 వేసవిలో జరిగిన బాపట్ల తొలి ఆంధ్ర మహాసభకు 800 ప్రతినిధులు వచ్చారు. బయ్యా నరసింహేశ్వర శర్మ అధ్యక్షత వహించారు. ముట్లూరి ఆదినారాయణయ్య, న్యాపతి సుబ్బారావు పంతులు, మోచర్ల రామచంద్రరావు, గుత్తి కేశవ పిళ్ళై ప్రత్యేకాంధ్రకు వ్యతిరేకంగా మాట్లాడారు. పేమవరపు రామదాసు పంతులు ప్రవేశపెట్టిన ప్రత్యేకాంధ్ర తీర్మానం వాయిదా వేయవలసి వచ్చింది. వల్లూరి సూర్య నారాయణరావు తీర్మానాన్ని బలపరిచాడు. అయితే ఆంధ్రలో ప్రముఖులు పర్యటించి ప్రతికూలాభిప్రాయం చేకూర్చాలన్నారు. అయ్యదేవర కాళేశ్వరరావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, ముట్లూరి ఆదినారాయణయ్య, చిలకమర్తి లక్ష్మీనరసింహం, ముట్నూరి కృష్ణారావు, వున్నవ లక్ష్మీనారాయణ వంటివారా సభలో పాల్గొన్నారు.

ప్రత్యేకాంధ్ర తీర్మానం ముట్లూరి ఆదినారాయణయ్య, గంటి వెంకట్రామయ్య కోరికపై తాత్కాలికంగా వాయిదా వేశారు.

పత్రికలలో అనుకూల వ్యతిరేక వాదోపవాదాలు మొదలైనాయి.

రాయలసీమ నెల్లూరు జిల్లాల నుండి ఆంధ్రకు వ్యతిరేకత కనబడింది. మిగిలిన జిల్లాలు అనుకూలత చూపాయి. వ్యతిరేకంగా బయటపడిన వారిలో కేశవపిళ్ళై, అమంచర్ల సుబ్బు కృష్ణారావు. మైనవోలు రంగయ్య, గోపాలస్వామి మొదలియార్, దొరస్వామి అయ్యంగారు, న్యాపతి సుబ్బారావు వున్నారు. అనుకూలుర జాబితా పెద్దది. అందులో పేర్కొనదగినవారు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కొండా వెంకటప్పయ్య, ముట్నూరి కృష్ణారావు, పట్టాభి సీతారామయ్య, వల్లూరి సూర్య నారాయణరావు, ఎస్. వి. నరసింహారావు, విదూరి పిచ్చయ్య, కె గుండురావు, దేశపాండ్య సుబ్బారావు, హట్టి శివరావు, కొలచెలను శ్రీనివాసరావు, నెమలి పట్టాభి రామారావు, బెజవాడ పట్టాభి రామిరెడ్డి, ఒంగోలు వెంకట రంగయ్య, హట్టి శంకరరావు, ఓ. యానాదిరెడ్డి యింకా మహానందయ్య, నరసింగరావు ప్రభృతులున్నారు.

బాపట్ల సభానంతరం పట్టాభి సీతారామయ్య, వల్లూరి సూర్య నారాయణరావు, ముట్నూరి కృష్ణారావు, కొండా వెంకటప్పయ్య సంఘం రాయలసీమ ప్రముఖ కేంద్రాలలో ప్రజాభిప్రాయ సానుకూలతకై పర్యటన జరిపింది. కడప, అనంతపూర్, బళ్ళారి, పెనుగొండ, గుత్తి, నంద్యాల, హిందూపూర్, చిత్తూర్ సమావేశాల్లో అభిప్రాయసేకరణ జరిపారు. నెల్లూరులో వ్యతిరేకత స్పష్టపడింది. రాయలసీమ అంతగా అనుకూలత చూపలేదని తెలిసింది.

ఈలోగా జిల్లా సమావేశాల్లో కూడా ప్రాంతాన్నిబట్టి అభిప్రాయాలు వెల్లడయ్యాయి. రాయలసీమలో ముఖ్యంగా నెల్లూరులో తొందరపాటు తగదన్నారు. కావల్సిందేనని గుంటూరు, కృష్ణా, గోదావరి సమావేశాలు స్పష్టపరిచాయి.

ద్వితీయ ఆంధ్ర మహాసభ 1914లో బెజవాడలో జరిగింది. అయ్యదేవర కాళేశ్వరరావు, అయ్యంకి వెంకటరమణయ్య, పెద్దిబొట్ల వీరయ్య ప్రధాన పాత్ర వహించారు. 1600మంది పాల్గొన్న ఈ సమావేశంలో కూడా అనుకూల ప్రతికూల అభిప్రాయాలు బయటపడినా ప్రత్యేకాంధ్ర కావాలనే తీర్మానాన్ని మంథాసూర్యనారాయణ ప్రవేశపెట్టగా పేమవరపు రామదాసు పంతులు బలపరిచారు. ఎ. ఎస్. కృష్ణారావు, ఎన్. పట్టాభి రామారావు తీర్మానాన్ని వాయిదా వేయమన్నారు. అయినా సరే, తీర్మానం నెగ్గింది.

ఆంధ్ర ప్రాంతమంతటా పట్టభద్రులైనవారు వున్నత విద్యకై వేరే రాష్ట్రాలకు పోవలసి వచ్చేది. సమీపంలో వున్న మద్రాసు నగరానికి ఎక్కువ మంది వెళ్ళేవారు. అయితే అందరికీ సీట్లు లభించక, దూర ప్రాంతాలకు వెళ్ళి ఎక్కువ ఖర్చు పడవలసి వచ్చింది. అయినా ఆ నాటికే దాదాపు 2000 మంది మద్రాసులో చదువుకునేవారు. మిగిలిన 9000 మందిలో కొద్దిమందే వేరే రాష్ట్రాలకు వెళ్ళగలిగారు. వృత్తి, సాంకేతిక రంగాలలో చదువుకు సీట్లు లభించక ఆంధ్రులు బాధపడ్డారు. ప్రత్యేక రాష్ట్రానికి యివన్నీ ప్రోది చేశాయి. తొలుత చదువుకున్న వర్గాలకే ఈ ఉద్యమం పరిమితం అని విస్మరించరాదు.

1915లో ఆంధ్ర మహాసభ నెల్లూరులో జరిగింది. నెల్లూరువారు తొలుతనుండి మద్రాసు సామీప్యత దృష్ట్యానూ, అనుకూలత రీత్యానూ, లావాదేవీలు మద్రాసులో వుండటం వల్లనూ విడిపోవడానికి విముఖత చూపారు. ఆసభ ఆంధ్ర రాష్ట్ర విషయమే లేనట్లు జరిగింది.

రాయలసీమలో సర్కారు జిల్లాల పట్ల వున్న అనుమానాలు, అపోహల దృష్ట్యా, వీరితో కలిసి ఆంధ్ర రాష్ట్రం కోరడానికి వెనుకాడారు. నెల్లూరు వారివలె రాయలసీమ కూడా ఆంధ్ర రాష్ట్రాన్ని వ్యతిరేకిస్తూనే వచ్చింది. తమిళులు చాలామంది ఇక్కడ ఉద్యోగాల్లో వుండి స్థానికులపై తమ ప్రభావాన్ని చూపించారు.

భాషా రాష్ట్రాన్ని వుత్తరాన అప్పటికే బ్రిటిష్ వారు ఏర్పాటు చేశారు. బెంగాల్ బీహార్ ను విడదీసి భాషా రాష్ట్రపరంగా వేరు చేశారు. ఇది కూడా ప్రత్యేకాంధ్ర భావానికి తోడ్పడింది. సింధు రాష్ట్రం కావాలని కోర్కె వెల్లడయింది.

1915లో జరిగిన మూడవ ఆంధ్ర మహాసభకు విశాఖపట్నంలో పానుగల్లు రాజా అధ్యక్షత వహించడం గొప్ప విశేషం. అంతవరకూ బ్రిటిష్ వారికి అనుకూలత చూపిన రాజా, రాష్ట్ర విషయంలో గట్టి పట్టు పట్టడం మిగిలిన వారికి వూతమచ్చింది. పాఠశాలల్లో తెలుగు బోధనా భాషగా పెట్టాలనుకున్నారు. సభలో తెలుగు ప్రసంగాలు చేశారు. తెలుగు పత్రికలు మెచ్చుకున్నాయి.

ఆ సంవత్సరమంతా రాష్ట్రంలో జిల్లాస్థాయి సభలు జరిగాయి. ఇదే సందర్భంలో మరో విషయం గమనార్హం. అంతవరకూ కాంగ్రెసు పార్టీలో పెత్తనం కూడా మద్రాసులో తమిళులకే వుండేది. 1915లో ప్రత్యేకాంధ్ర కాంగ్రెసు సంఘం వుండాలనే ప్రతిపాదన గుంటూరులో బయలుదేరింది. పత్రి శ్రీనివాసరావు తొలి అధ్యక్షులుగా విష్ణుబొట్ల సూర్యనారాయణ కార్యదర్శిగా గుంటూరు జిల్లా కాంగ్రెసు ఏర్పరచి, రాష్ట్ర కాంగ్రెసుకు బీజాంకురాలు నాటారు.

1915లో 178 మంది ఆంధ్ర ప్రతినిధులు బొంబాయిలో జరిగిన కాంగ్రెసు మహాసభకు వెళ్ళారు. కొండా వెంకటప్పయ్య నాయకత్వాన 46గురు ప్రత్యేక రాష్ట్ర కాంగ్రెసు కావాలని అర్జీ సమర్పించారు. పట్టాభి సీతారామయ్య, కె.ఆర్.వి.కృష్ణారావు యిందులో వున్నారు. అనిబిసెంట్ ఆంధ్ర ప్రతినిధులు పాత్ర శ్రద్ధగా గమనిస్తూ గ్రంథస్థం చేసింది.

1916లో నాలుగో ఆంధ్ర మహాసభ కాకినాడలో జరిగింది. పోలవరం జమీందారు, కె.ఆర్.వి. కృష్ణారావు ఆహ్వాన సంఘాధ్యక్షులుగా ఏర్పాట్లు గావించారు. మోచర్ల రామచంద్రరావు అధ్యక్షత వహించారు.

అప్పుడు మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులు. పి.వి.ఎస్. నరసింహరాజు ప్రత్యేకాంధ్రకై ప్రవేశ పెట్టిన తీర్మానం యథాతథంగా కాక *యుద్ధానంతరం* అనే పదం చేర్చి ఆమోదించారు. ఎ.పి.పాత్రో, కె. వెంకటరెడ్డి నాయుడు వుపన్యసించారు. వున్నత సైనికోద్యోగాలలోనూ, సైనిక నౌకా శిక్షణ పాఠశాలల్లోనూ భారతీయులకు అవకాశం వుండాలనే తీర్మానంపై సి.వి.ఎస్. నరసింహరాజు, ఎ.పి.పాత్రో, కె. వెంకటరెడ్డి నాయుడు ప్రసంగించారు.

మద్రాసులో వుంటున్న ఆంధ్రులకు న్యాయం చేకూరటంలేదనే ధోరణి బాగా వ్యక్తమౌతూ వచ్చింది. ఆంధ్ర రాజకీయ సమితి, ఆంధ్ర ప్రజాసంఘం 1917 ఏప్రిల్, మే లో వరుసగా తలెత్తాయి. బి.ఎన్. శర్మ అధ్యక్షతన ప్రజాసంఘం సంఘటితమైంది. వి. రామదాసు పంతులు, ఎన్. గురుస్వామి చెట్టి వుపాధ్యక్షులుగా, వి లక్ష్మీ నారాయణ, ఎస్. వెంకటాచలం చెట్టి కార్యదర్శులుగా పనిచేశారు.

5వ ఆంధ్ర మహాసభ 1917 జూన్ 1న నెల్లూరులో జరిగింది. సహజంగానే ప్రత్యేకాంధ్ర తీర్మానానికి వ్యతిరేకత వచ్చింది. అయినా తీర్మానం నెగ్గింది. కొండా వెంకటప్పయ్య పంతులు అధ్యక్షతన జరిగిన యీ సమావేశంలో కోడి రామమూర్తి (వస్తాదు) కూడా ఆంధ్ర రాష్ట్రానికి అనుకూలంగా మాట్లాడాడు. ఒంగోలు వెంకటరంగయ్య ఆహ్వాన సంఘాధ్యక్షులు.

-------

# అనిబిసెంట్ రంగప్రవేశం

ఇంగ్లండ్ లో నాస్తికురాలిగా ప్రారంభించిన అనిబిసెంట్ క్రమేణా ఆస్తికురాలైంది. ఇండియాలో దివ్యజ్ఞాన సమాజం స్థాపించి, అడయార్ (మద్రాసు) కేంద్రంగా ప్రచారం చేసింది. కాంగ్రెసులో చేరి హోమ్ రూల్ (అంతరంగిక స్వయం పరిపాలన) కావాలనే నినాదం యిచ్చింది.

1907లో అతివాద – మితవాద పక్షాలుగా చీలిన కాంగ్రెసు 1916 నాటికి కలిసింది. ప్రవాసానికి, కారాగారానికి, అజ్ఞాతవాసానికి వెళ్ళిన అతివాదులు తిరిగి వచ్చారు. విభజించిన బెంగాల్‌ను మళ్ళీ ఒకేరాష్ట్రంగా కలిపేశారు. ప్రపంచయుద్ధం ముమ్మరంగా సాగుతున్నది. బ్రిటిష్ అనుకూలురైన ముస్లింలు కాంగ్రెసుకు చేరువయ్యారు.

1916లో కాంగ్రెసు మహాసభ లక్నోలో జరిగింది. తిలక్, అనిబిసెంట్ కలిసి హోమ్ రూల్ నినాదాన్ని ప్రచారంలోకి తెచ్చారు.

అనిబిసెంట్ స్థాపించిన దివ్య జ్ఞాన సమాజానికి ఆంధ్రులు ఆకర్షితులై కొన్ని చోట్ల శాఖలు పెట్టారు. కొత్త భావం ఎవరైనా యిస్తే అల్లుక పోవటం ఆంధ్రులకు అలవాటు.

హోమ్ రూల్ వుద్యమ ప్రచారానికి ఆంధ్రలో గాడిచర్ల హరిసర్వోత్తమ రావు నడుం కట్టారు. లీగ్ కార్యదర్శిగా కాకినాడ, బెజవాడ, బందరు, గుంటూరులో శాఖలు ఏర్పరిచాడు. దివ్యజ్ఞాన సమాజ శాఖలే యిందుకు వుపకరించాయి.

1916లో అనిబిసెంట్ ఆంధ్రలోని, చిత్తూరు, కాకినాడ, రాజమండ్రి పర్యటించింది. మితవాదులు కొందరు (కె.ఆర్.వి.కృష్ణారావు, మోచర్ల రామచంద్రరావు) హోమ్ రూల్ లీగ్ లో చేరారు.

అనిబిసెంట్ కార్యకలాపాలకు మద్దతుగా మదనపల్లిలో జాతీయ కళాశాల (1916 మే) ఏర్పడింది. ఒక ఏడాదిలోగా ఆంధ్ర అంతటా 52 లీగ్ శాఖలేర్పడ్డాయి. గోదావరి, కృష్ణ, గంజాం, గుంటూరు జిల్లా మహాసభలు జరిగాయి. ఆంధ్ర మహాసభ ఈ ఉద్యమాన్ని బలపరిచింది.

లీగ్ జరిపే సభలకు విద్యార్థులు హాజరు కాకూడదని ప్రభుత్వం దమనకాండ చేసింది. తెలుగు పత్రికలు అభ్యంతరం చెప్పాయి. వుద్యమానికి చందాలు వసూలు చేశారు.

అనిబిసెంట్ ను బ్రిటీషు ప్రభుత్వం నిర్బంధించగా ఆంధ్రలోని కొన్ని నగరాలలో నిరసన సభలు జరిపారు. కృష్ణ, చిత్తూరు జిల్లాలు అనిబిసెంట్ వుద్యమానికి కేంద్ర స్థానాలయినాయి. అనిబిసెంట్ నిర్బంధానికి నిరసనగా సత్యాగ్రహం చేయాలని కొందరు, మాంటేగు – ఛేంస్ఫర్డ్ సంస్కరణల సంఘం రానున్న దృష్ట్యా కూడదని కొందరు వాదించుకున్నారు. పత్రికలలో అలాగే రాసుకున్నారు. ఆంధ్ర పత్రిక, ఆంధ్ర ప్రణాళిక సత్యాగ్రహాన్ని వ్యతిరేకించగా దేశాభిమాని అనుకూలించింది. మద్రాసులో జరిగిన గుంటూరు సమావేశం సత్యాగ్రహాన్ని వ్యతిరేకించింది. సమర్థిస్తూ రాజమండ్రి గుంటూరు బందరులో సభలు జరిగాయి. బి.ఎన్.శర్మ, వి.ఎస్. శ్రీనివాస శాస్త్రి, ఎన్.సుబ్బారావు పంతులు, ఎం రామచంద్రరావు పంతులు, పి.శివరావు, పి. వెంకటపతిరాజు, వి.పి.మాధవరావు, గొల్లపూడి రామనారయ్య. చట్టి నరసింహారావు, పి. సూర్య నారాయణరావు, శ్రీరామ్ అనుకూల ప్రచారంలో పాల్గొన్నారు. అనుకూలోద్యమానికి గాడిచర్ల హరిసర్వోత్తమరావు నాయకత్వం వహించారు. 1917 జూన్ 16న నిర్బంధించి, వుదకమండలం నుండి సెప్టెంబరులో అనిబిసెంట్‌ను విడుదల చేశారు. తరువాత మరో పర్యాయం ఆంధ్రలో అనిబిసెంట్ పర్యటించింది.

1918 జనవరి 26న బందరులో సమావేశమైన కృష్ణాజిల్లా కాంగ్రెసు ప్రతినిధులు పట్టాభి సీతారామయ్యను ఇంగ్లండు పంపాలనీ, సంస్కరణల (మాంటేగు)ను పాలకులు నీళ్ళుగార్చకుండా కాపాడాలనీ పేర్కొన్నారు.

1918 మార్చి 31న భూపతి రాజు వెంకటపతిరాజు ఆధ్యక్షతన బెజవాడలో ఆంధ్ర మహాసభలు జరిగాయి. ప్రత్యేకాంధ్రకు రాయలసీమ వారు సుముఖత చూపారు.

కృష్ణాజిల్లా ఆంధ్ర మహాసభ కాశీనాథుని నాగేశ్వరరావు అధ్యక్షతన, విశాఖ జిల్లా సభ విక్రమదేవవర్మ అధ్యక్షతన, కడప మహాసభ ఎస్. పట్టాభి రామారావు అధ్యక్షతన ప్రత్యేకాంధ్ర కావాలనే తీర్మానాలు చేశాయి.

హోమ్ రూల్‌ను సమర్థిస్తేనే యుద్ధానికి అనుకూలిస్తామనే తిలక్ తీర్మానాన్ని బొంబాయి కాంగ్రెసు సమావేశంలో కొండా వెంకటప్పయ్య, ఒరుగంటి వెంకటసుబ్బయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు బలపరిచారు.

మాంటేగ్ ఛేంస్ఫర్డ్ సంస్కరణలు పూర్తిగా నిరాకరించాలని ఒక పక్షం, సవరణలతో ఆహ్వానించాలని మరో పక్షం ఆంధ్ర మహాసభ గుంటూరు సమావేశంలో తీవ్రంగా వాదించుకున్నాయి. కాశీనాథుని నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో బి.ఎన్.శర్మ సవరణల ఆమోదానికి అనుకూలించారు. 76మంది వ్యతిరేకించారు. భారతీయుల పట్ల నమ్మకాన్ని, బ్రిటిష్ పార్లమెంటు ఆధిక్యతకు వ్యతిరేకత చూపే యీ తీర్మానం ఆమోదించారు.

1918 డిసెంబరు 8న ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సమావేశం జరుపుకున్నది. యుద్ధం అప్పుడే ముగిసింది. లండనులో జరగనున్న శాంతి కాంగ్రెసు మహాసభకు తిలక్ ను ప్రతినిధిగా పంపాలనే తీర్మానం చేశారు.

-------

# చిగురించిన ఆంధ్ర కాంగ్రెసు

మద్రాసు నుండి అన్ని విధాల విడిపోవాలనే కోర్కె, ప్రత్యేకాంధ్ర కాంగ్రెసు సంఘ ఏర్పాటుతో తొలి విజయాన్ని సాధించింది. కలకత్తా (1917) కాంగ్రెసు మహాసభ సుముఖత వలన (గాంధీ, అనిబిసెంటు వ్యతిరేకించి నప్పటికీ) ఆంధ్రకు కాంగ్రెసు సంఘం ఏర్పడింది.

1918 జనవరి 20న ప్రథమాంధ్ర కాంగ్రెసు మహాసభ న్యాపతి సుబ్బారావు అధ్యక్షతన బెజవాడలో జరిగింది. 185 మంది ప్రతినిధులు పాల్గొని తొలి రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్ష స్థానాన్ని న్యాపతి సుబ్బారావుకు కట్టబెట్టారు. ఆంధ్రను వద్దని తొలుత వ్యతిరేకించిన వ్యక్తి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు గావడమే రాజకీయం! కొండా వెంకటప్పయ్య ప్రథమ కార్యదర్శి అయ్యారు. సహాయ కార్యదర్శులుగా కాశీనాథుని నాగేశ్వరరావు, సి.ఆర్. పార్థసారధి అయ్యంగార్ (చిత్తూరు), పి. శివశంకరం పిళ్ళై (పెనుగొండ) ఎన్నికయ్యారు. గంజాం, విశాఖ, గోదావరి, కృష్ణ, నెల్లూరు, కర్నూలు అనంతపురం, ధర్మవరం, రాజమండ్రి, బెజవాడ శాఖలు అనుబంధమైనాయి (1919 జనవరి 20).

-------

# కాంగ్రెసుకు వ్యతిరేకంగా జస్టిసు పార్టీ

ఆంధ్రలో రాజకీయాలు బ్రాహ్మణ, బ్రాహ్మణేతరంగా ఆరంభ మయ్యాయి. చదువుకుని వుద్యోగాలు చేస్తున్న వారిలో బ్రాహ్మణులు హెచ్చుగా వుండేవారు. మళ్ళీ యిందులో మహారాష్ట్ర, తమిళ బ్రాహ్మణులెక్కువ. చదువుకున్న తెలుగు బ్రాహ్మణులకు అవకాశాలు తక్కువే. కనుక తమిళుల పెత్తనం పోవాలని ఆంధ్ర బ్రాహ్మణులు నినాదం లేవనెత్తారు. ఆలస్యంగా రాజకీయాల్లో ప్రవేశించిన బ్రాహ్మణేతరులు కళ్ళు తెరిచి చూస్తే ఎటు చూచినా బ్రాహ్మణాధిపత్యం కనపడేసరికి బ్రాహ్మణేతర గొడవ మొదలెట్టారు. ఇదంతా చదువుకున్న అగ్ర కులాలకు పరిమితమని విస్మరించరాదు.

బ్రిటిష్ వారు బ్రాహ్మణులకు వుద్యోగాలిచ్చినా వారంటే ఎప్పుడూ భయంతో ఒక కంట కనిపెడుతూ వుండేవారు. తెలివిగల వారు గనుక కొంప ముంచుతారనే ఆందోళన వుండేది. అందువల బ్రాహ్మణేతర వుద్యమం ప్రారంభమయితే బ్రిటిష్ వారు సంతోషించి, పోషించి, ప్రోత్సహించారు. వీలైనన్ని వుద్యోగాలిచ్చారు. ఒకరిమీద మరొకరిని వుసిగొలిపి చీల్చి పాలించే విధానాన్ని బ్రిటిష్ వారు మొదటి నుండి ఆచరిస్తూ పోయారు.

కాంగ్రెసు పుట్టినప్పటికి ఆంధ్ర జనాభాలో బ్రాహ్మణుల సంఖ్య 3.2 శాతం మాత్రమే. కానీ ఒక్క విషయం విస్మరించరాదు. బ్రాహ్మణులు తెలివి తేటలతో చదువుకు ప్రాధాన్యత యిచ్చినా, వుద్యోగాలన్నీ వశపరచుకున్నా, బ్రిటిష్ వారి ఏజంట్లుగా పని చేసినా, మళ్ళీ వారే జాతీయోద్యమంలో కూడా ముందంజ వేశారు. త్యాగాలు చేశారు. చేస్తున్న ప్లీడరీలు వదిలేశారు. అందుకే బ్రిటిష్ వారికి బ్రాహ్మణులంటే భయం.

బ్రాహ్మణ – బ్రాహ్మణేతర భేద భావాలు చిరకాలంగా వుండటం వలననే 1851 లోనే బ్రిటిష్ వారొక ఉత్తర్వు జారీ చేస్తూ ఈ రెండు వర్గాల మధ్య ఉద్యోగాలు సమానంగా వుంచాలన్నారు. హుజూర్ సిరస్తిదార్, ఇంగ్లీషు హెడ్ క్లర్క్ వుద్యోగాల్లో ఒకటి బ్రాహ్మణుడైతే మరొకటి బ్రాహ్మణేతరులకు వుండాలన్నారు. కాని కారణాంతరాల వలన యిది ఆచరణలోకి రాలేదు. నెల్లూరు జిల్లాలో లెక్కలు తీస్తే, జి. వెంకట రమణయ్య అనే నియోగి తన బంధువులను,

సన్నిహితులను మొత్తం 49 మందిని వుద్యోగాల్లో ప్రవేశ పెట్టాడని బ్రిటిష్ వారు తెలుసుకున్నారు. వీరంతా రెవిన్యూ శాఖలో వుండేవారు.

ఈ వుత్తరువు 1890లో మరోసారి గట్టిగా అమలు పరచాలను కుంటూనే బ్రిటిష్ వారు విఫలురై, బాహాటంగా పోటీ పడటమే మంచిదనుకున్నారు. 1893-95లో వుద్యోగాలన్నిటిలో బ్రాహ్మణులే పోటీ పరీక్షకు నిలబడి గెలుచుకున్నారు. బ్రాహ్మణుల గుత్తాధిపత్యం వుద్యోగాల్లో వుండరాదని భావిస్తున్న బ్రిటిష్ వారు 1896-1911 మధ్యకాలంలో కొంతమంది బ్రాహ్మణేతరుల్ని పరిమితంగా వుద్యోగాల్లోకి తీసుకో నారంభించారు.

1851లో జారీచేసిన వుత్తరువు 1912లో పునరుద్ధరించి అమలు జరపమని కలెక్టర్లను ఆదేశించారు. అప్పటికి 41.5 మిలియన్ జనాభాలో బ్రాహ్మణులు 1 1/3 మిలియన్ అంటే 3 శాతం బ్రాహ్మణులే వున్నారు. 1892-1904 మధ్య జరిగిన వుద్యోగ పోటీ పరీక్షల్లో 94 శాతం బ్రాహ్మణులు నిలబడ్డారు. 16 ఉద్యోగాల్లో 15 వారికే దక్కాయి. పోటీ పరీక్షలు బ్రాహ్మణులకు వేరుగానూ, బ్రాహ్మణేతరులకు వేరుగానూ వుండాలనే నినాదం బయలు దేరింది. బ్రిటిష్ వారు భారతీయులకు యిచ్చే ఉద్యోగాలన్నీ చిన్నవే. కీలక స్థానాల్లో బ్రిటిష్ వారే వుండేవారు. విద్యారంగం, బ్యాంక్ ఉద్యోగాలు, ప్రభుత్వ గుమాస్తాలు, డెప్యూటీ కలెక్టర్లు, సబ్ జడ్జీలు, మునిసిఫ్ లు, తహసిల్దార్లు, హెడ్ క్లర్క్ లు, సిరిస్తిదార్లు వంటి వుద్యోగాలలో బ్రాహ్మణాధిపత్యం వుండేది. అయితే తమిళ బ్రాహ్మణులని మరచి పోరాదు. అందుకే తెలుగు బ్రాహ్మణులు తమిళుల ఆధిపత్యం తొలగాలని పట్టుబడు తుండేవారు.

అందుబాటులో వున్న లెక్కలు చూస్తే- బ్రాహ్మణ – బ్రాహ్మణేతర గొడవకు ఆధారం లభిస్తుంది. ముందు చదువు గమనిద్దాం.

ఆంధ్రలో కాంగ్రెసు పుట్టేనాటికి మద్రాసు విశ్వవిద్యాలయంలో పట్టభద్రులైన బ్రాహ్మణుల సంఖ్య 492 కాగా బ్రాహ్మణేతరులు 171 మంది, క్రైస్తవులు, ముస్లింలు, విదేశీయులు కలిసి 107 మంది వున్నారు.

1890 నాటికి యీ సంఖ్య పెరిగింది. బ్రాహ్మణులు 1461 మంది బి.ఎ. పూర్తి చేయగా బ్రాహ్మణేతరులు 445మంది, మిగిలినవారు 263 మంది.

1901-1911 మధ్య బ్రాహ్మణులు 4074 మంది గ్రాడ్యుయేట్లయ్యారు. బ్రాహ్మణేతరులు 1035 మంది కాగా మిగిలినవారు 531 మంది.

వుద్యోగాల విషయంగా చూస్తే, 1892-1904 మధ్య అసిస్టెంట్ ఇంజనీర్లుగా బ్రాహ్మణులు 17మంది కాగా, బ్రాహ్మణేతరులు 4గురే, డెప్యూటీ కలెక్టర్లు, అకౌంట్ల శాఖలో 77 మంది బ్రాహ్మణులుంటే ఇతరులు 30.

1913 నాటికి న్యాయస్థానాలలో జిల్లా మునిసిఫ్ లుగా బ్రాహ్మణులు 93, బ్రాహ్మణేతరులు 25, కీలక స్థానాలయిన ప్రభుత్వ కార్యదర్శి, రెవిన్యూ బోర్డు కార్యదర్శి పదవులలో బ్రాహ్మణులే వున్నారు. ఇద్దరు కలెక్టర్లలో ఒకడు బ్రాహ్మణుడు.

1917 వచ్చేసరికి బ్రాహ్మణ-బ్రాహ్మణేతర స్థితి పరాకాష్ఠ అందుకుంది వుద్యోగ పర్వంలో. తహశీల్ దార్లు 135 మంది బ్రాహ్మణులు కాగా 60 మంది బ్రాహ్మణేతరులు, డెప్యూటీ తహశీల్ దారు 214 మంది బ్రాహ్మణులైతే 65 మంది బ్రాహ్మణేతరులు. హెడ్ క్లర్కు 16మంది బ్రాహ్మణులైతే 5గురు బ్రాహ్మణేతరులు. జిల్లా కోర్టులు, సబ్ కోర్టులలో సిరస్తి దార్లు 28 మంది బ్రాహ్మణులైతే. 10 మంది బ్రాహ్మణేతరులు.

ఇక్కడ బ్రాహ్మణేతరులంటే క్రైస్తవుల్ని, ముస్లింలను మినహా యించాలి. వెలమ, కమ్మ, బలిజ, కాపు, రెడ్డి, వైశ్య కులస్తులు మాత్రమే బ్రాహ్మణేతర వుద్యమంలో పాల్గొన్నారు. వారిలో కూడా సంపన్నులు. మధ్యతరగతి మాత్రమేనని విస్మరించరాదు.

మద్రాసులోని కళాశాలలో బ్రాహ్మణ – బ్రాహ్మణేతర హాస్టళ్లు ఆచారంగా ప్రారంభమయ్యాయి. 1890 నుండే బ్రాహ్మణేతరులకు కేటాయింపులుండాలని ఐసిఎస్ సభ్యుడు ఎ వేణుగోపాల్ చెట్టి చేసిన వాదనను ప్రభుత్వము సూత్రప్రాయంగా ఆమోదించింది.

అనిబిసెంట్ థియోనఫీ నుండి రాజకీయాలలోకి ప్రవేశించే సరికి బ్రాహ్మణ – బ్రాహ్మణేతర గొడవలు యింకా రాజుకున్నాయి. హిందూ సంస్కృతిని, ఆర్య గతాన్ని ఆమె శ్లాఘించింది. పురాణాలను, మనుధర్మ శాస్త్రాన్ని ఆకాశానికి ఎత్తింది. తమిళ బ్రాహ్మణులామెకు అండగా నిలిచారు. మద్రాసులో వుండటం, అడయార్ థియోసఫీ సంస్థకు బ్రాహ్మణుల సహకారం యిత్యాదులన్నీ యిందుకు తోడ్పడినాయి. తెలుగు వారికి ప్రత్యేక కాంగ్రెసును, రాష్ట్రాన్ని వ్యతిరేకించిన అనిబిసెంట్ పట్ల ఆంధ్రులు అయిష్టత కనబరుస్తూ పోయారు. కానీ బ్రాహ్మణ – బ్రాహ్మణేతర వుద్యమాలలో కలహాలలో ఒక్క విషయం గమనించాలి. మద్రాసులో ఈ కక్ష్య ఆర్యద్రావిడ గొడవలతో ముడిపడింది. అందు వలన తీవ్ర స్థాయికి పోయింది. కానీ ఆంధ్రలో బ్రాహ్మణులను అనుసరించడానికి, వారితో సమానంగా పెరగటానికి ప్రయత్నాలు జరిగాయి. కనుక వైషమ్యాలు హింసా రూపం దాల్చలేదు.

బ్రాహ్మణులకు వ్యతిరేకంగా తెలుగు, తమిళ బ్రాహ్మణేతరులు కొందరు చేతులు కలిపారు. 1912లో సి. నటేశ్ మొదలియార్ ఆధ్వర్యాన ద్రావిడ సంఘ స్థాపన జరిగింది. వుత్తరోత్తరా జస్టిస్ పార్టీ ఆవిర్భావానికి యివి నాందీ ప్రస్తావనలు. 1915లో 'ద్రావిడ' సాహిత్యం వెలువడటం 1916లో బ్రాహ్మణేతర హాస్టలు తలెత్తటం కూడా యిందులో భాగమే.

డాక్టర్ నాయర్, త్యాగరాజు చెట్టి వంటి 30 మంది మద్రాసులోని విక్టోరియా హాలులో 1916 నవంబరు 20న సమావేశమై సౌత్ ఇండియా ప్యూపిల్స్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. అది జస్టిస్ పార్టీకి శ్రీకారం. ఒకమాసం అనంతరం సౌత్ ఇండియా లిబరల్ ఫెడరేషన్ (డిసెంబరం 20) స్థాపించి బ్రాహ్మణేతర ప్రణాళిక విడుదల చేశారు. ఎ.సి.పార్థసారథి నాయుడు సంపాదకత్వాన వెలువడే 'ఆంధ్ర ప్రకాశిక' ఈ వుద్యమానికి మద్దతు నిచ్చింది.

ఆంధ్రలో జస్టిస్ పార్టీ శాఖలు వెలిసి మహాసభలు జరిగాయి. వెలమ, కమ్మ, రెడ్డి, కాపు కులాల ప్రముఖులు జస్టిస్ పార్టీని బలపరిచారు. అయితే తమిళనాడులో వలె బ్రాహ్మణ – బ్రాహ్మణేతర సంబంధాలు విషపూరితం కాలేదు. బ్రాహ్మణులను అనుకరించి, తాము కూడా అన్ని విధాలా వారికి తీసిపోమని చూపటమే ఆంధ్రలో బ్రాహ్మణేతరుల లక్ష్యమైంది. కాని జస్టిస్ పార్టీ అంతా వృద్ధులమయం. యువకుల్ని ఆకర్షించే ప్రయత్నం జరుగలేదు.

జస్టిస్ పార్టీ బ్రాహ్మణేతరులను పుట్టించడానికి పుట్టినట్లు చెప్పకొన్నా, ఆచరణలో అధికార కుమ్ములాట ప్రధానమైపోయింది. 1916లో మద్రాసులో పుట్టిన ఈ పార్టీకి ఆంధ్రలో అక్కడక్కడా శాఖలేర్పడ్డాయి. 1920కి పూర్వం మున్సిపాలిటీని వశపరుచు కోవాలంటే చాలా కష్టంగా వుండేది. ఓటర్లు కొద్దిమందే వుండేవారు. పన్ను చెల్లించేవారికే ఓటు హక్కు వుండేది. గ్రామ మునసబు కావడానికి అవసరమైతే 5 వేలు వరకు లంచాలు పెట్టేవారు. వైశ్యులు గుంటూరు, ఏలూరు, కాకినాడ ప్రాంతాలలో తమ వ్యాపార ప్రభావంతో అధికారంలోకి రావడానికి విఫల ప్రయత్నం చేశారు. గుంటూరు జిల్లాలో ప్రెసిడెంటు నుండి ప్యూను వరకు కమ్మ కులస్తుల వశమైంది. బ్రాహ్మణ, వైశ్య కుటుంబాలలో వివాహ సంబంధాల ద్వారా పలుకుబడి పెంచుకుని స్థానిక సంస్థలలోకి ప్రవేశించడానికి ప్రయిత్నించారు. దీనికి తోడు 1920లో అనేక కొత్త పంచాయితీలు ఏర్పరిచారు. బెజవాడ వంటి చోట్ల లాయర్లకు, వ్యాపారస్తులకు కలహాలు మీరి పోయినాయి. అట్లాంటి సమయంలో మద్రాసు శాసనసభ ఎన్నికలు వచ్చాయి. కొత్తగా పుట్టిన జస్టిస్ పార్టీ, కొత్తగా ఏర్పడిన ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల రంగంలోకి దిగాయి. ఎన్నికల ప్రచారంలో కరపత్రాలు, భజనలు అప్పుడే ప్రారంభమయ్యాయి. వాటికి కృష్ణాపత్రిక, స్వతంత్ర, చిత్తరంజన్, తెలగ, శ్రీ సుజన రంజని, హితకారిణి, కాపు, సత్యాగ్రహి, జన్మభూమి, కమ్మకుల ప్రతిక, కలియుగ, శారద వంటి పత్రికలు ప్రచారంలో ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో మాదిరెడ్డి వెంకటరత్నం జిల్లా బోర్డు ప్రెసిడెంటుగా జస్టిస్ పార్టీకి అనుకూలంగా ప్రచారం చేసాడు. జిల్లాబోర్డు ప్రెసిడెంటు విపరీతాధికారం చలాయిస్తున్నాడని, కనుక శాసన సభకు అతడు నిలబడ కూడదని గొడవ జరిగినది. కృష్ణా జిల్లాలో ఇందుకు భిన్నంగా జిల్లా బోర్డు అధ్యక్షుడు నిలబడాలి అన్నారు. గుంటూరు జిల్లాలో కాంగ్రెస్, జస్టిస్ రాజకీయాలు రౌడీల ఆధారంగా పొగాకు వ్యాపారస్తుల అండతో రోడ్డు మీదకు వచ్చాయి. జిల్లా బోర్డు అధ్యక్షులు విపరీతంగా హామీలిచ్చి ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నించారు. జస్టిస్ పార్టీకి అండగా జమీందార్లు నిలిచారు.

1920లో శాసన సభలో 48మంది లాయర్లు, 28 మంది భూస్వాములు, 26 మంది వ్యాపారస్తులు, 10 మంది వృత్తిదార్లు, 15 మంది అధికార్లు ఉన్నారు.

1919 నాటికే ప్రభుత్వము జిల్లా కలెక్టర్లకు వుత్తర్వులిస్తూ, తెలుగు, తమిళుల మధ్య వుద్యోగాలు సమానంగా పంచాలని, బ్రాహ్మణులు సగానికి మించి ఉండకూడదని పేర్కొన్నారు. జస్టిస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కమ్యూనల్ వుత్తర్వు జారీ చేశారు. (1921 సెప్టెంబరు). దీని ప్రకారం ప్రభుత్వోద్యోగాల అన్నింటిలో బ్రాహ్మణేతరులకు రిజర్వేషన్లు వుంటాయి. సాలీనా వుద్యోగాలు ఎన్ని యిచ్చింది. కులాల వారీగా లెక్కలు చెప్పాలని వుత్తర్వు జారీ చేసింది. బ్రాహ్మణేతర వుద్యమాన్ని చేపట్టిన జస్టిస్ పార్టీ ముస్లింలను, హరిజనులను దూరం చేసుకున్నది. ఈ పార్టీ 1921లో కె.వి.రెడ్డి నాయుడిని, కోకా అప్పారావు నాయుడిని, పానగల్లు రాజాను ఇంగ్లండు పంపించింది. బ్రిటీషు పత్రికలు జస్టిస్ పార్టీని సమర్థించాయి. ఎన్ని స్థానాలు ఎవరికివ్వాలన్న దగ్గర పేచీ వచ్చింది. కాంగ్రెస్ తరఫున ఎం. రామచంద్రరావు వెళ్ళి జస్టిస్ పార్టీని విపరీతంగా విమర్శించారు. జస్టిస్ పార్టీ మంత్రివర్గంలో ఎ.పి.పాత్రో, పానుగల్లు రాజా, రెడ్డి నాయుడు వున్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీ స్థానిక రాజకీయాలలో బాగా జోక్యం చేసుకోవడం మొదలయింది. జిల్లా బోర్డు అధ్యక్షులకు విపరీతమైన అధికారాలుండేవి. చిత్తూరు నుండి గోదావరి వరకు పెళ్ళి సంబంధాలతో యార్లగడ్డ, వాసిరెడ్డి, అడుసుమల్లి, కొండుల కుటుంబాలతో పాటు చల్లపల్లి, కొమ్మారెడ్డి బాంధవ్యాలు కలుపుకుని, రాజకీయ ప్రయోజనాలకు వీటిని ఉపయోగించుకున్నారు.

రూరల్ బోర్డులో 10 రూపాయలకు పైన శిస్తు చెల్లించే వారికే ఓటు హక్కు వుండటం వలన జమీందారులు, భూస్వాములు అతి సులభంగా వీటిని ఆక్రమించుకో గలిగారు. అధికారంలో వున్న పార్టీ వైపుకి చాలామంది ఆకర్షితులై కుల సంఘాలు పెట్టి సభలు జరిపారు. మరొక ప్రక్కన స్థానిక సంస్థలలో ఉన్న కాంగ్రెసువారు ఆందోళనలకు తమ ప్రభావాన్ని వినియోగించారు. జస్టిస్ పార్టీ 1922లో మున్సిపాలిటీలలో విద్యపై పన్ను విధించింది. కాంగ్రెసువారు దీనికి అభ్యంతరం తెలిపారు. ఆ సంవత్సరం కాకినాడలో అఖిలభారత కాంగ్రెస్ మహాసభ జరగడం కూడా స్థానిక కాంగ్రెసుకు ప్రోత్సాహం యిచ్చింది. ఎన్నికలలో పాల్గొనాలా వద్దా అన్న సమస్య పై కాంగ్రెసులో చీలిక వచ్చి స్వరాజ్య పార్టీ ఏర్పడింది. ఆంధ్రలో స్వరాజ్య పార్టీకి శాఖలు వెలిశాయి. 1923 నాటికి సి.వి.ఎస్. నరసింహరాజు ఇండిపెండెంటు పార్టీని స్థాపించాడు. అయితే అది ఆట్టేకాలం వుండలేదు. అధికారానికి వచ్చిన జస్టిస్ పార్టీ ఆశ్రిత పక్షపాతాన్ని వహించిందే కాని పార్టీ నిర్మాణాన్ని విస్మరించింది. పార్టీకి రాజ్యాంగమంటూ లేకుండానే, పార్టీలో కలతలు పారంభమైనాయి. జమీందార్ల పార్టీగా అది రూపొందింది. అయితే జమీందార్ల మధ్య కూడా తీవ్ర కలహాలుండటం వలన అవి కూడా సాఫీగా సాగలేదు. ముఖ్యమంత్రి పానుగల్లురాజా ఎత్తుగడలలో ఆరితేరినవాడు బ్రాహ్మణులకు వ్యతిరేకంగా ప్రారంభమైన జస్టిస్ పార్టీ, ఆ విషయం మరచిపోయి, వారిని ఆకట్టుకోవడానికి ప్రయత్నించింది. నలుగురు బ్రాహ్మణులను జిల్లా బోర్డు అధ్యక్షులుగా అతను నామినేట్ చేశాడు. మొత్తం 24 జిల్లా బోర్డులకు తన యిష్టం వచ్చినట్లు అతను నామినేట్ చేసాడు. ఎన్నికలు జరగవలసిన చోట కూడా నామినేషన్ తో కాలక్షేపం చేసాడు. కళాశాలలు, విశ్వవిద్యాలయ సంఘాలలో తన ప్రాబల్యానికై ఇష్టం వచ్చినట్లు మార్పులు చేసాడు. తనకు అనుకూలమైన వ్యక్తి మునిసిపల్ ఛైర్మన్ కావడంలేదన్న నెపంతో మునిసిపల్ ఛైర్మన్ ల ఎన్నిక మూడుసార్లు వాయిదా వేశాడు. గుంటూరు జిల్లాలో యతిరాజుల నాయుడ్ని జిల్లా బోర్డుకే గాక మున్సిపాలిటీకి కూడా నామినేట్ చేసాడు. గంజాంలో కళ్ళికోట జమీందారును, కృష్ణాలో బాలాజీరావును, చిత్తూరులో భూస్వామి నాయుడిని నామినేట్ చేశాడు. జస్టిస్ పార్టీ నుండి చీలిపోయి, జస్టిస్ డెమోక్రటిక్ పార్టీని పెట్టిన కట్టమంచి రామలింగారెడ్డి పానగల్లు మంత్రివర్గంపై అవిశ్వాస తీర్మానం తెచ్చాడు. అయితే బ్రాహ్మణ సభ్యులకు ఆశచూపి పానగల్లులో ఎలాగో బయట పడ్డాడు. మంత్రిపదవి నుండి కె.వి.రెడ్డి నాయుడ్ని పానగల్లు తొలగించాడు. బ్రిటిష్ వారి కనుసన్నలలో మెలిగిన పానగల్లు రాజా ప్రభావం విపరీతంగా పెరిగిపోయింది. పార్టీ నిర్మాణాన్ని అశ్రద్ధ చేసినందుకు తీవ్ర విమర్శ బయలుదేరింది. పార్టీ రాజ్యాంగ రచనకై 1924లో ముసాయిదా సిద్ధమయింది. కాని అది బీరువా నుండి బయటకు రాలేదు. క్రమంగా శాసన సభ్యులలో, కార్యకర్తలలో నిస్పృహ పెరిగిపోయింది.

అధికారమున్న పార్టీ చిద్విలాసాలు అలా వుండగా బయట పార్టీ నిర్మాణాన్ని గురించి కొద్దిగా పరామర్శిద్దాం. ఆంధ్రలో 1917 నవంబరు 13-14 తేదీలలో పులివెందులలో బారిష్టరు కె. సుబ్బారావు అధ్యక్షతన బ్రాహ్మణేతర మహాసభ జరిగింది. ఆ సంవత్సరంలోనే అక్టోబరు 27న తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులో చల్లపల్లి కుమార రాజా అధ్యక్షతన

మరొక మహాసభ జరిగింది. నవంబరు 11, 12 తేదీలలో పిట్టి త్యాగరాయ చెట్టియార్ అధ్యక్షతన బెజవాడలో యింకొక సభ జరిగింది. రాష్ట్ర మహా సభలు తమిళనాడు ప్రాంతాలలో జరిగినప్పుడు ఆంధ్రనుండి ప్రముఖులు ప్రతినిధులుగా వెళ్ళి పాల్గొన్నారు. భారతదేశంలో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గాంధీ యిచ్చిన సహాయనిరాకరణ పిలుపును, ఖిలాఫత్ వుద్యమాన్ని వీరు విమర్శించారు. 1921 సెప్టెంబరు ఒకటి నాటికి స్వరాజ్యం తెస్తానని గాంధీ ప్రకటిస్తే, 'బహుశా తేదీ పొరపాటు పడ్డారేమో ఏప్రిల్ ఒకటి అని వుండాలి' అని సి.ఆర్.రెడ్డి వ్యాఖ్యానించాడు. మొత్తం మీద 1920 నుండి 23 వరకు మళ్ళీ 1923 నుండి 26 వరకు జస్టిస్ పార్టీ మద్రాసు రాష్ట్రంలో అధికారంలో ఉన్నది. అధికారంలో వుండగా అన్ని అవలక్షణాలు అంటుకున్నాయి. అందువలన ఎంత త్వరగా పెత్తనంలోకి వచ్చారో అంతవేగంగా పతనం చెందారు. ఆ విషయం ప్రస్తావించేముందు వారు సాధించిన ఒకటి రెండు ఘనకార్యాలు ప్రస్తావించడం సబబుగా వుంటుంది.

## ఆంధ్రా యూనివర్సిటీ

జస్టిస్ పార్టీవారు అధికారంలో వుండగా ఆంధ్రులకు ఒక విశ్వవిద్యాలయం ఏర్పడటం విశేషంగా పేర్కొనవచ్చు. కాంగ్రెసు పార్టీవారు, జస్టిస్ పార్టీవారు ప్రత్యేకాంధ్రను, ప్రత్యేక యూనివర్సిటీని కోరడంలో కలిసారు. విశాఖపట్నం నుండి ఎం సూర్యనారాయణ అనే సభ్యుడు ప్రత్యేక విశ్వవిద్యాలయానికి తీర్మానం ప్రవేశపెట్టాడు. తమిళనాడు నుండి జస్టిస్ పార్టీవారు ఆంధ్రుల కోర్కెను సమర్ధిస్తూ తమకు కూడా యింకొక విశ్వవిద్యాలయం కావాలన్నారు. ఆ విధంగా ఆంధ్రుల పుణ్యమా అంటూ వారికి యింకొక యూనివర్సిటీ లభించింది. ప్రత్యేకాంధ్ర రాష్ట్రం మాత్రం తీర్మానం రూపంలోనే నిలిచిపోయింది.

మద్రాసు యూనివర్సిటీలో తెలుగువారికి, బ్రాహ్మణేతరులకు స్థానాలు లభించడం దుర్భరమైంది. అందువలన ఆంధ్ర యూనివర్సిటీకై నాటి జస్టిస్ విద్యా మంత్రి ఎ.పి.పాత్రోతో సహా చాలామంది పట్టుబట్టారు. సి.నటేశ మొదలియార్ తొలుత ఈ సూచన చేసారు. కాని నాడు మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రులు చాలాచోట్ల వ్యాపించి వుండటం వలన ఆంధ్ర ప్రాంతానికి ఎల్లలు నిర్ణయించడం కష్టమన్నారు. అదేగాక ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పరిస్తే బ్రాహ్మణేతరులలో చీలికలు రావచ్చుననే సందేహం వెలిబుచ్చారు. తమిళులకు అవకాశం కల్పించే నిమిత్తం కె.వి.రెడ్డి నాయుడు మంత్రి పదవి నుండి తొలగి తమిళుడైన శివరామపిళ్ళేకి స్థానం కల్పించాలన్నారు. ముఖ్యమంత్రిగా వున్న పానుగల్లు రాజా తమ ప్రత్యర్ధి అయిన రెడ్డి నాయుడిని తక్షణమే తొలగించారు. ఈ పరిస్థితుల దృష్ట్యా తమిళులు ఆంధ్రయూనివర్సిటీ ఏర్పాటును సమర్ధించారు. *ఆంధ్ర* అనే పదం ఆర్యులకు సంబంధించినదని దక్షిణాదివారు ద్రావిడులు కనుక తెలుగు యూనివర్సిటీ ఉండాలని రెడ్డినాయుడు పట్టుబట్టారు. కానీ ఆ వాదన సాగలేదు. 1925 నవంబరు 6న బిల్లు పాసయి ఆంధ్రాయూనివర్సిటీ ఏర్పాటుకు నాంది పలికింది. తొలి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఎవరు వైస్ ఛాన్సలర్ గా వుండాలని తర్జనభర్జనలు జరిగాయి. మొత్తం మీద కట్టమంచి రామలింగారెడ్డిని వైస్ ఛాన్సలర్ గా నియమించారు. జస్టిస్ పార్టీలో వచ్చిన చీలికల దృష్ట్యా ఐక్యతా ప్రయత్నాలు జరిగాయి. 1925 మే 25న మద్రాసు విక్టోరియా పబ్లిక్ హాలులో అందుకై సమావేశమయ్యారు. దూరంగా వుంటూవచ్చిన కె.వి.రెడ్డినాయుడు తిరిగి పార్టీలోకి వచ్చాడు. పానగల్లు రాజా మళ్ళీ నాయకుడయ్యాడు.

జస్టిస్ పార్టీవారు సాధించినవాటిలో అతిముఖ్యమైనది బ్రాహ్మణే తరులకు ప్రభుత్వోద్యోగాలలో అవకాశం కల్పించడం. ముఖ్యమైన ప్రతి కులానికి వుద్యోగాలలో వచ్చిన ఖాళీలను సర్దుబాటు చేయాలని నిశ్చయించారు. దీని ప్రకారం బ్రాహ్మణులకు 22 శాతం బ్రాహ్మణేతర హిందువులకు 48 శాతం భారత క్రైస్తవులకు 2 శాతం తదితరులకు 3 శాతం వుద్యోగాలు లభిస్తాయి.

వుచిత నిర్బంధ విద్య, గ్రామాలకు మంచినీటి సదుపాయాలు, పంచాయతీ స్థాపన, సాంఘిక, మతరంగాలలో అసమానత్వం తొలగించడం, పేద వర్గాల సముద్ధరణ పేర్కొన తగినవి.

॥

# స్థానిక స్వపరిపాలన

మాంటేగ్ – ఛేస్ఫర్డ్ సూచనలు అమలులోకి రాకపూర్వమే బ్రిటిష్ ప్రభుత్వం ఐదు చట్టాలద్వారా పురపాలక సంఘాల చట్టాలను మార్చి వేసింది. మునిసిపాలిటీలో రిజర్వేషన్ చాలా తక్కువగా వుండేది. సభ్యులందరు ఎన్నిక కావాలి. ఓటర్ల సంఖ్య కూడా పెంచారు. కలెక్టర్ల అధికారాలు మునిసిపాలిటీపై తగ్గించారు. పురపాలక సంఘాధికారాలు విధులు పెంచారు యాత్ర, వినోదం, వీధిదీపాలు, పరిశుభ్రత, చదువుపై క్రొత్త పన్నులు వేయడానికి అధికారాలు యిచ్చారు. ఎన్నికల సమయంలో పన్నులు తగ్గించడం ఒక ఆచారమైనా ఈ క్రొత్త అధికారాల వలన పెత్తనంలోకి వచ్చినవారు రిజిష్టర్లు మార్చేసి తమకు అనుకూలురైనవారికి తక్కువ పన్నులు, విరోధులకు ఎక్కువ పన్నులు వేసేవారు. బెజవాడ, గుంటూరులలో యిలాంటివి చాలా వుదాహరణలుండేవి. బెజవాడలో వ్యాపారస్తులు అప్పలస్వామి అధికారాన్ని పోగొట్టడానికి చాలా ప్రయత్నం చేశారు. అతను జస్టిస్ పార్టీని సమర్థించాడు. అందుకని అతని వ్యతిరేకులు కాంగ్రెసును కోపువేసుకున్నారు. 1920లో కాంగ్రెసువారి సహాయ నిరాకరణ వుద్యమంలో అప్పలస్వామి మురాకు ప్రత్యర్థులకు జరిగిన కలహాలవలన ప్రభుత్వం సైన్యాన్ని రప్పించవలసి వచ్చింది.

చీరాల-పేరాలను మునిసిపాలిటీగా మార్చడానికి ప్రభుత్వం నిర్ణయించింది. దీనివలన కొన్ని సౌకర్యాలున్నా పన్నులు పెరగడం, ప్రభుత్వ అజమాయిషీ ఎక్కువ కావడం తప్పదనే వుద్దేశంతో వ్యాపారస్థులు మార్పుకు వ్యతిరేకించారు. కానీ ప్రభుత్వం చీరాల-పేరాలను కలిపి మునిసిపాలిటీ చేసింది. స్థానికలు వ్యతిరేకత వలన ప్రభుత్వం కొన్ని పన్నులను మినహాయించినప్పటికీ చీరాల మునిసిపాల్టీ సహకరించ నందువలన పురపాలక సంఘాన్ని రద్దు చేయాల్సి వచ్చింది. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అక్కడి ప్రజలను సమీకరించి, నచ్చజెప్పి, 1921 ఏప్రిల్ 25న పట్టణమంతా ఖాళీ చేయించాడు. కొంతమంది మాత్రమే పట్టణంలో వుండిపోయారు. సాహసోపేతమైన ఈ చర్యవలన ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం పన్నులు కట్టనివారిని శిక్షించింది. క్రమంగా పట్టుదల సడలి వూరి వెలుపలి వారంతా స్వగృహాలకు చేరుకున్నారు.

నరసరావుపేట, రేపల్లె, గుంటూరు, తెనాలి, విజయవాడ మునిసి పాలిటీలలో కూడా సహాయ నిరాకరణోద్యమం కొంతవరకు సహాయపడింది.

1921 మార్చి 31, ఏప్రిల్ ఒకటిన అఖిలభారత కాంగ్రెస్ మహాసభ బెజవాడలో జరిగింది. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య కార్యదర్శిగా, కొండా వెంకటప్పయ్య అధ్యక్షుడుగా కాంగ్రెసు కార్యాలయం తాత్కాలికంగా బెజవాడకు మారింది. ఆ సమావేశాలకు గాంధీ వచ్చాడు. కాంగ్రెసు సభ్యత్వం పెంచడానికి చరఖా వుద్యమం వ్యాపింపజేయడానికి తీర్మానించి గాంధీ ఆంధ్రలోని కొన్ని ముఖ్యపట్టణాలలో పర్యటించాడు. కాంగ్రెస్ యిచ్చిన సహాయ నిరాకరణ పిలుపునందుకొని పల్నాడు, బెజవాడ తాలూకాలలో అడవులకు సంబంధించిన నియమాలు వుల్లంఘిస్తూ వుద్యమాలు జరిగాయి. అడవులలో పశువులను మేపుకోవడానికి, కట్టెలు కొట్టుకోవడానికి, యింటికి తెచ్చుకోవడానికి ఆటంకాలు వుండకూడ దన్నాడు. వున్నవ లక్ష్మీనారాయణ, మాడభూషి వేదాంత లక్ష్మీ నరసింహాచారి సభ్యులుగా కాంగ్రెస్ ఒక సంఘాన్ని నియమించి పల్నాటి ప్రజల సమస్యలను తీర్చమన్నారు. కానీ ప్రభుత్వం వారిని అరెస్టు చేయడంతో హర్తాళ్ళు జరిగాయి. కాంగ్రెస్ పిలుపునందుకుని, విదేశీ వస్తు బహిష్కరణ, మధ్యనిషేధ వుద్యమం కూడా ఆంధ్రలో కొన్ని చోట్ల వ్యాపించాయి. సహాయ నిరాకరణ వుద్యమంలో భాగంగా గ్రామాధికారులు కొందరు తమ పదవులకు రాజీనామా యిచ్చారు. పన్నులు చెల్లించరాదని కాంగ్రెసు యిచ్చిన పిలుపునందుకుని వుద్యమాలు ప్రారంభించారు. పెదనందిపాడులో పర్వతనేని వీరయ్య చౌదరి ఆధ్వర్యాన వుద్యమం తీవ్రరూపం దాల్చింది. కానీ పోలీస్ సహాయంతో ప్రభుత్వం త్వరలోనే వుద్యమాన్ని అణచగలిగింది. శాసనోల్లంఘన కార్యక్రమం వైపు పయనించిన కాంగ్రెస్ ప్రజల అభిమానాన్ని చూరగొనుచుండగా జస్టిస్ పార్టీ, కాంగ్రెసు వుద్యమాలను వ్యతిరేకిస్తూ పోయింది. దీనివలన వారు బలహీనులయ్యారు.

జస్టిస్ పార్టీ అధికారంలో వుండగా గోదావరి ఏజన్సీ ప్రాంతాలలో 1922 నుండి అల్లూరి సీతారామరాజు తిరుగుబాటు చేశాడు. కొండ జాతులవారికి పరిమితమైన ఈ వుద్యమాన్ని అణచడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసింది. ప్రజలలో ఈ వుద్యమంపై సానుభూతి వున్నా కాంగ్రెసువారు బాహాటంగా దీనిని బలపరచలేదు. ప్రభుత్వం ఈ వుద్యమాన్ని త్వరలోనే అణచివేసింది.

జస్టిస్ పార్టీలో కలహాలు, పదవీ వ్యామోహం పెరిగిపోతుండగా అధికారంలో లేని కాంగ్రెస్ అందుకు తీసిపోలేదు. 1925 నాటికి దుగ్గిరాల గోపాలక్రిష్ణయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, కొండా వెంకటప్పయ్యల మధ్య సిగపట్లు ప్రారంభమైనాయి. పట్టాభి సీతారామయ్యకు రాష్ట్ర కాంగ్రెస్ సంఘంలో సభ్యత్వం కూడా యివ్వలేదు. బులుసు సాంబమూర్తి, బి.హెచ్. సత్యనారాయణ కలసి కొండా వెంకటప్పయ్యతో తారసిల్లారు. చివరకు ఆంధ్ర కాంగ్రెస్ సంఘాధ్యక్షతను వదులుకోవడం కొండా వెంకటప్పయ్యకు తప్పలేదు.

ఆంధ్రకు ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ ప్రతిసంవత్సరం మహాసభలు జరిపి తీర్మానం చేస్తూనే పోయారు. అదికూడా ఐక్యతగా సాగలేదు.

॥

# కాంగ్రెసులోనే స్వరాజ్య పార్టీ

ఎన్నికలలో పాల్గొనాలా లేదా అనే వివాదంలో కాంగ్రెస్ నుండి చీలి ఎన్నికలలో పాల్గొనే నిమిత్తం చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూలు స్వరాజ్యపార్టీ స్థాపించారు. సి.ఆర్.దాస్ ఆంధ్రలో పర్యటించి పార్టీ శాఖను ఏర్పరిచాడు. అయ్యదేవర కాళేశ్వరావు అధ్యక్షులుగా నడింపల్లి నరసింహారావు, దుగ్గిరాల గోపాల కృష్ణయ్య కార్యదర్శులుగా స్వరాజ్యపార్టీ పనిచేసింది. 1923లో జరిగిన శాసనసభ ఎన్నికలకు స్వరాజ్య పార్టీ పోటీచేసింది. 11 స్థానాలు గెలుచుకుంది. 1926లో స్వరాజ్య పార్టీ బలపడింది. మద్రాసు శాసనసభలో 41 స్థానాలను గెలుచుకుంది. జస్టిస్ పార్టీకి 2 మాత్రమే దక్కాయి. 36 మంది స్వతంత్రులున్నారు. అయితే మంత్రివర్గాన్ని నియమించడానికి స్వరాజ్యపార్టీ నిరాకరించడంతో వారు అధికారానికి వచ్చే అవకాశం లేకపోయింది. పానగల్లు రాజాకూడా ఒప్పకోనందువలన పి.సుబ్బరామన్ ముఖ్యమంత్రి అయ్యారు. గాంధీని మహాత్మా అని పిలవటానికి నిరాకరించిన పానగల్లు రాజా క్రమేణా మారి గాంధీ చిత్రపటాన్ని ఆవిష్కరించే వరకు పోయాడు. (1927), కాంగ్రెసులో చేరి బ్రాహ్మణాధిపత్యం పోగొట్టాలని కట్టమంచి రామలింగారెడ్డి పిలుపునిచ్చాడు. ఏ పదవులూ రానందున ఈయన పార్టీ మారాడు. కె.వి.రెడ్డినాయుడు సౌత్ ఇండియా లిబరల్ ఫెడరేషన్ స్థాపించాడు. జస్టిస్ పార్టీని ఏలిన పానగల్లు రాజా 1928 డిసెంబర్ 16న చనిపోయాడు. మళ్ళీ పార్టీ నాయకత్వపు తగాదాలు మొదలయ్యాయి. బి. మునుస్వామి నాయుడు బొబ్బిలి రాజాల మధ్య తీవ్రమైన పోరాటం జరిగింది. మునుస్వామి నాయుడు జాతీయ నాయకుడైన రంగా సన్నిహితంగా వుంటూ జమీందారీ వ్యతిరేకాన్ని సమర్థించారు. బొబ్బిలి రాజా బ్రిటీష్ వారికి అనుకూలంగా తందాన ధోరణి అవలంబించాడు. 1929లో నాయకుని ఎన్నిక తగాదా నెల్లూరులో ప్రారంభమయింది. అది వెలమ, కమ్మ కలహంగా మారింది. 1930లో మద్రాసు ముఖ్యమంత్రిగా మునుస్వామి నాయుడు పదవిలోనికి వచ్చాడు. అప్పటికి సాఫీగా నడుస్తున్న ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది. అంతర్జాతీయ రంగాలలో వచ్చిన ఆర్థిక మాంద్యం ప్రభావం మద్రాసు రాష్ట్రంపై కూడా పడింది. గ్రామాలలో అప్పలు పెరిగిపోయాయి. ధరలు ఆకాశాన్నంటాయి. చాలామంది భూములమ్ముకున్నారు. రైతులు చిన్న వ్యాపారాలను ప్రారంభించారు. జిన్నింగు మిల్లులు తలెత్తాయి. రంగా నాయకత్వాన జమీందారీ వ్యతిరేకోద్యమం తీవ్రరూపం దాల్చింది. దీనికి సానుభూతిగా నిలబడిన మునుస్వామి నాయుడ్ని బొబ్బిలి మీర్జాపురం రాజులు పడగొట్టడానికి కంకణం కట్టుకున్నారు. మునుస్వామినాయుడు ఎస్టేట్ లాండ్ చట్ట సవరణలు తీసుకొచ్చి కౌలుదార్లకు అనుకూల తీర్పిచ్చాడు. అప్పడే జరిగిన రెవెన్యూ రీసెటిల్ మెంట్ సర్వే వలన అదనపు శిస్తు వేయడానికి నిర్ణయించారు. రైతులు ఎదురు తిరిగారు.

కాంగ్రెసువారు వుద్యమాన్ని చేపట్టారు. ఈ ఆందోళనలలో పాల్గొన్న గ్రామాధికారులను ఏదో ఒక నెపం పెట్టి ఉద్యోగాల నుండి తొలగించారు. పిఠాపురం రాజాకు వ్యతిరేకంగా కె.ఎ.ఆర్. స్వామి, డాక్టర్ పి. గురుమూర్తి నాయకత్వాన్ని వహించారు. దీనికి తోడు 1930 మార్చి 12న కాంగ్రెసు ప్రారంభించిన ఉప్పు సత్యాగ్రహం ఆంధ్రలో కూడా వ్యాపించింది. కాంగ్రెసువారు రహస్య సమావేశాలు జరిపారు. స్థానిక వర్తక సంఘాలు వారికి సహకరించాయి. కాంగ్రెస్ *నియంతలు* అరెస్టయ్యారు. స్థానిక సంఘాలపై అసంతృప్తి పెరిగిపోయింది. జస్టిస్ పార్టీ సభని జరపకుండా మూడేళ్లుగా వాయిదా వేస్తూ వచ్చిన మునిస్వామి నాయుడు 1932 తంజావూరులో మహాసభ జరిపించాడు. ఆ సభలో బొబ్బిలి రాజా ఆధిపత్యం వహించాడు. ఆంధ్ర నుండి ప్రత్యేకంగా వెళ్ళిన మునుస్వామి వర్గానికి ప్రవేశం దొరకలేదు. అంతటితో వారు ఎదురుతిరగగా చెప్పులు పైకి లేచాయి. తర్వాత మద్రాసు గవర్నర్ సలహాపై మునుస్వామి నాయుడు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా ఇచ్చాడు. బొబ్బిలి రాజా ముఖ్యమంత్రి అయ్యాడు. ప్రజాస్వామిక పద్ధతులకు స్వస్తి చెప్పాడు. బ్రాహ్మణులను జస్టిస్ పార్టీలో చేర్చుకోవాలని తీర్మానించాడు. మునుస్వామి నాయుడు ప్రవేశపెట్టిన జమీందారీ కౌలుదారీల బిల్లును వ్యతిరేకించాడు. 1934 తాలూకా బోర్డులను రద్దుచేశాడు. జిల్లా బోర్డులలో ప్రత్యక్ష ఎన్నికలను ప్రవేశపెట్టారు. అవిశ్వాస తీర్మానం ద్వారా అధ్యక్షుని తొలగించవచ్చన్నారు. స్థానిక సంస్థలు అందరికీ అందుబాటులో వుడంటం ద్వారా సమస్యలు కూడా పెరిగాయి. హింసాకాండ ఎక్కువైనందున బెజవాడ మునిసిపాలిటీని 1933లో రద్దుచేశారు. తూర్పుగోదావరి జిల్లా బోర్డు అధ్యక్షుడుగా ముళ్ళపూడి పళ్ళమ్ రాజు, నియామకాలను కంట్రాక్టులు యివ్వడంలోను, టీచర్లను ట్రాన్స్ ఫర్ చేయడంలోను నిరంకుశంగా ప్రవర్తించడంతో ప్రభుత్వం అతనిని అభిశంసించింది. అనంతరం, కడప, గుంటూరు జిల్లాలలో హత్యలు పెరిగిపోయాయి. జస్టిస్ పార్టీ నుండ క్రమంగా కొందరు బయటకు వెళ్ళడం మొదలుపెట్టారు. పిఠాపురం రాజా బొబ్బిలిని తొలగించడానికి విశ్వప్రయత్నం చేశాడు. కట్టమంచి రామలింగారెడ్డి కాంగ్రెసుకు దగ్గరయ్యాడు. బొబ్బిలిరాజా జస్టిస్ పత్రికలను పెట్టి తన గొప్పను చాటుకున్నాడు. ఒంగోలు జిల్లాబోర్డు అధ్యక్షుడుగా బ్రహ్మానందరెడ్డిపై ఫిర్యాదులు రాగా నేతి చలపతి, విచారణకై నియమించారు. కానీ నేటికీ ఆ రిపోర్టు వెలుగు చూడలేదు.

1936లో ఎన్నికలొచ్చాయి. జస్టిస్ పార్టీకి వ్యతిరేకంగా పిఠాపురం రాజా ప్యూపుల్స్ పార్టీ అనే క్రొత్తపార్టీని స్థాపించాడు. జస్టిస్ పార్టీకి దూరమైన వారినందరినీ ఆకర్షించి అభ్యర్థులుగా పెట్టాడు. ఆ ఎన్నికలలో జస్టిస్ పార్టీ 90 మందిని నిలబెట్టగా ప్రజాపార్టీ 40 మందిని నిలబెట్టింది. అప్పటికే కాంగ్రెస్ ప్రతిష్ఠ పెరిగిపోయినందున జస్టిస్ పార్టీ అతికష్టంగా 21 స్థానాలను గెలుచుకోగలిగింది. బొబ్బిలి రాజా, వెంకటగిరి రాజాలు ఓడిపోగా ప్రజాపార్టీలో పిఠాపురం రాజా ఒక్కడే గెలిచాడు. బొబ్బిలి నియోజకవర్గంలో కొట్లాటలు జరిగాయి. ఆ ఎన్నికలు జస్టిస్ పార్టీకి భరత వాక్యం పలికాయి. క్రమంగా జస్టిస్ పార్టీవారు రిటైర్ కాగా ముందుచూపు గలవారు కాంగ్రెస్.లో చేరారు.

॥

# ముఠాలమయంగా కాంగ్రెస్ పార్టీ

జస్టిస్ పార్టీ క్షీణిస్తూ పోగా కాంగ్రెసు పార్టీ ప్రతిష్ఠ పెరుగుతూ పోయింది. వున్నత, మధ్య తరగతులలో కాంగ్రెసు సిద్ధాంతాలు అల్లుకుపోయినాయి. సహాయనిరాకరణోద్యమం, శాసనోల్లంఘనోద్యమం కాంగ్రెసు ప్రతిష్ఠను పెంచడానికి తోడ్పడ్డాయి. జస్టిస్ పార్టీ వాసనలుగల రంగా, కట్టమంచి రామలింగారెడ్డి వంటివారు కాంగ్రెసులోకి ప్రవేశించారు. అయితే నాయకుల కలహాలలో జస్టిస్ పార్టీకి కాంగ్రెసు వారేమీ తీసిపోలేదు. కొండా వెంకటప్పయ్యకు, ప్రకాశానికి, పట్టాభికి వైరం వుండేది. ప్రకాశంకి రాజాజీకి పడేదికాదు. కుమారస్వామి రాజా, కాశీనాథుని నాగేశ్వరరావు ఒక ముఠాగా వుండగా రంగా, వి.వి.గిరి మరొక ముఠాగా ఎన్నికలలో దిగారు. 1923లోనే బులుసు సాంబమూర్తి కాంగ్రెస్ అధ్యక్షుడైతే డబ్బేమీ లేకుండా చేశాడని దుగ్గిరాల గోపాలకృష్ణయ్య విమర్శించాడు. కాళేశ్వరరావు, కొండా వెంకటప్పయ్య, దండు నారాయణరాజు, బిక్కిన వెంకటరత్నం ఒక ముఠాగా కొనసాగారు. రాష్ట్ర స్థాయిలో వున్న ఈ ముఠా రాజకీయాలు జిల్లాలకు ప్రాకి స్థానిక కలహాలకు

దారి తీసింది. 1934 మేలో కేంద్ర శాసన సభకు ప్రభుత్వం ఎన్నికలు ప్రకటించింది. ఎన్నికలకు అభ్యర్థులను నిర్ణయించడంలో ఎవరి ముఠా కోసం వారు కృషి చేశారు. అభ్యర్థులు నిర్ణయ విషయమై సమావేశంలో తిట్టుకొనడమే గాక పత్రికాముఖంగా బజారుకెక్కారు. ఒక్క గుంటూరు, నెల్లూరు, విజయవాడ నియోజక వర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన రంగాపై నడింపల్లి నరసింహారావు ఇండిపెండెంటు అభ్యర్థిని పెట్టించాడు. బెజవాడ గోపాలరెడ్డి ముందు పోటీ ప్రకటించి తరవాత విరమించాడు. మునుస్వామినాయుడు జస్టిస్ పార్టీలో తన అనుచరులతో సహా కాంగ్రెసులో చేరాలని విఫల ప్రయత్నం చేశాడు. బలపడుతున్న కాంగ్రెస్ చాలాచోట్ల యువకులను కూడా ఆకర్షించింది. ఓటర్లను బండ్లలో, కార్లలో చేరవేయడం అప్పుడే జరిగింది. కాశీనాథుని నాగేశ్వరరావు దేవాలయం గేట్ల వద్ద వుపన్యాసాలు చేసి వైశ్యులను బాగా అకట్టుకున్నాడు. కాంగ్రెస్ అభ్యర్థులు అందరూ గెలిచారు. మీర్జాపురం రాజావంటివారు పదవీ భ్రష్టులైనారు. పార్టీలు మారే పద్ధతి కూడా అప్పుడే ప్రారంభమైంది. పశ్చిమ గోదావరిలో 100 రూపాయలు యిచ్చినవారికి కాంగ్రెసు టికెట్టు యిస్తామన్నారు. కానీ రు.1000 యిచ్చిన వారికి టిక్కెట్ ఖాయం చేయడంతో రు.100 యిచ్చినవారు జస్టిస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ సభ్యత్వానికి కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. కాంగ్రెసువారిని విస్మరించి సంపన్నుడైన రామనాథ గోయంకాకు జస్టిస్ పార్టీ వ్యక్తి అయిన కె. వెంకటస్వామి నాయుడికి కాంగ్రెసు టికెట్ యిస్తున్నందుకు బులుసు సాంబమూర్తి నాడే రాజేంద్ర ప్రసాదుకు ఫిర్యాదు చేశాడు. క్రిస్ మస్ వస్తే అధికారుల చుట్టూ తిరిగి బహుమానాలిచ్చే వి.ఎ.పున్నయ్యకు, సంపన్నుడైన ఉప్పటూరి రామయ్యకు కాంగ్రెసు టిక్కెట్టు ఇస్తున్నందుకు సి.హెచ్. సూర్యనారాయణ ఫిర్యాదు చేసాడు. కడపలో కాంగ్రెసు కురువృద్ధులు సంస్థపై ఆగ్రహించి రాజీనామాలు చేశారు. అనంతపూర్ జిల్లా జస్టిస్ పార్టీవారు కాంగ్రెసులోకి మారారు. కర్నూలు జిల్లాలో జస్టిస్ పార్టీ తరఫున నెగ్గిన కె. శరభారెడ్డి అనే కౌన్సిలర్ కాంగ్రెసులో చేరి జిల్లా బోర్డుకు వుపాధ్యక్షుడైనాడు. అలాగే చిత్తూరులో జిల్లా బోర్డు అధ్యక్షుడైన సి.ఆర్.రెడ్డి ఖాళీని భర్తీ చేయడానికి ఎ. రఘునాథరెడ్డి, టి.ఎస్.రామకృష్ణారెడ్డి జస్టిస్ పార్టీ నుండి కాంగ్రెసులో చేరారు. ఒంగోలు బోర్డులో కాంగ్రెసుకు మెజారిటీ లేకపోయినా వాగ్దానాలతో నెట్టుకొచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లాలో అధ్యక్ష స్థానానికి ఎన్నిక నిమిత్తం సభ్యుల్ని దాచిపెట్టడం, వస్తాదుల సహాయంతో ఎన్నికలు జరపడం ఆనాడే ప్రారంభమయింది. కాంగ్రెస్ ఈ విధంగా విజయ పరంపర సాగిస్తూంటే ఏమీ చలించనట్లుగా నటించారు. ముఖ్యమంత్రి బొబ్బిలిరాజా, స్థానిక సంస్థలలో చేయగలిగినదంతా చేశాడు. గుంటూరు, బెజవాడ, రాజమండ్రి మునిసిపాలిటీలను అనేక స్థానిక సంస్థల్ని తాలూకా బోర్డులను రద్దు చేశాడు. జిల్లా బోర్డులను మార్చి తనవారిని నామినేట్ చేయించాడు. గవర్నరు చెప్పినా వినకుండా నెల్లూరు, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలను చీల్చాడు. మీర్జాపురం రాజాకోసం కృష్ణాజిల్లా బోర్డును మార్చాడు. ఎన్నిక చేసినా 1836 ఎన్నికలలో జస్టిస్ పార్టీ చిత్తుగా ఓడిపోయింది. మొత్తం 215 స్థానాలలో కాంగ్రెసుకు 159 స్థానాలు లభించాయి. అంతకుముందు కౌన్సిల్ మాత్రమే 98 స్థానాలతో వుండేది. తరువాత హరిజన, ముస్లింలకు మాత్రమే రిజర్వేషన్లు పెట్టి నామినేషన్ లు తీసివేశారు. 68 స్థానాలు మాత్రం ముస్లింలు, క్రైస్తవులు భూస్వాములు, వాణిజ్య ప్రతినిధులు, స్త్రీలు, కార్మికులు, గ్రాడ్యుయేట్ లకు ప్రత్యేకంగా ఏర్పరిచారు. శిస్తు చెల్లించిన వారందరికి ఓటు హక్కు లభించటంతో 13 శాతం జనాభా ఎన్నికల్లో పాల్గొనడానికి అవకాశం ఏర్పడింది.

॥

# తొలిదశలో విప్లవోద్యమాలు

1931 ప్రాంతాలలో వుజ్జీవన భారత సమ్మేళన్ అనే పేరిట గోదావరి జిల్లాలో ఒక అతివాద సంస్థ ఏర్పడింది. భగత్ సింగ్ ను ఆదర్శంగా, ప్రేరణగా పెట్టుకొని ప్రారంభించిన ఈ సంస్థలో ప్రతివాది భయంకరాచారి, కామేశ్వర శాస్త్రి కీలక పాత్ర వహించారు. రాజకీయంగా వీరు నిర్వహించిన పాత్ర చెప్పుకో తగినదిగా ఏమీలేదు. కానీ ప్రభుత్వం మొగ్గలోనే వీరి కార్యకలాపాలను త్రుంచివేసింది.

హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ అనే మరొక సంస్థకు కూడా ఆంధ్రలో శాఖ ఏర్పడినది. ఇది కూడా ఏమీ సాధించకుండానే సమసిపోయింది. కె. రామనాథచౌదరి, ఎం. సభాపతి మొదలైనవారు యిందులో ఉండేవారు. శాసనోల్లంఘన వుద్యమాన్ని కాంగ్రెస్ నిలిపేసిన తర్వాత ఆ నిరుత్సాహంలో ఒక కొత్త పార్టీ పుట్టింది. గాడిచర్ల హరిసర్వోత్తమరావు నాయకత్వం వహించిన ఈ పార్టీకి ఆంధ్ర కాంగ్రెస్ స్వరాజ్య పార్టీ అని నామకరణం చేశారు. 1934 ఫిబ్రవరి 12 విజయవాడలో సమావేశమైన ఈ పార్టీ ఆట్టే కాలం బ్రతకలేదు. గుమ్మడిదల వెంకట సుబ్బారావు, వి.రామదాసు పంతులు, కొల్లి సత్యనారాయణ చౌదరి ప్రభృతులు కలిసి ఒక ప్రణాళికను కూడా విడుదల చేసారు.

అఖిల భారత సోషలిస్టు పార్టీ పిలుపునందుకుని ఆంధ్రలో కూడా 1934 జూన్ 23న ఒక శాఖనేర్పరిచారు. ఇందులో కొత్తగా కమ్యూనిస్టులైన పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, అల్లూరి సత్యనారాయణ రాజు చేరారు. రంగా దీనికి అధ్యక్షులుగా వుండగా మద్దూరి అన్నపూర్ణయ్య కార్యదర్శిగా వున్నాడు. ఇందులో క్రొవ్విడి లింగరాజు, రంగసాయి, కె. సత్యనారాయణ మొదలైనవారు చేరారు. కానీ ఎక్కువగా పార్టీ యువకుల నాకర్షించింది. మార్క్సిస్ట్, సోషలిస్ట్ భావాలు అప్పుడే కొత్తగా యువకుల నాకర్షిస్తున్నాయి. కళాశాలలో యువకులు మార్క్సిస్ట్ ప్రభావంతో కొత్తగా సంఘాలు పెట్టారు. ఆంధ్రలో కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ అంతా కమ్యూనిస్టుల ఆధిపత్యం కింద ఉండేదని చెప్పవచ్చు. అయితే కాంగ్రెసులోనే వుంటూ ప్రత్యేక పార్టీగా కాక కాంగ్రెసుకు అనుబంధంగా వీరు పనిచేస్తూ వచ్చారు. కానీ అతివాద, మితవాద పక్షాలు యిందులో కలిసి వుండటం వలన పొంతన కుదిరేదికాదు. సుందరయ్య నాయకత్వాన (అప్పట్లో సుందర రామిరెడ్డి) ఒక ముఠా, లింగరాజు నాయకత్వాన మరొక ముఠా పనిచేస్తూ వుండేది. రంగా రాజకీయ పాఠశాలలు పెట్టి శిక్షణ యిచ్చేవాడు. అందులో కమ్యూనిస్టులు ఎక్కువగా పాల్గొన్నారు. జొన్నలగడ్డ రామలింగయ్య, సుందరయ్య సర్కారు జిల్లాలలో వ్యవసాయదారులను సమీకరించడానికి కృషి చేశారు. క్రమంగా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ అంతా కమ్యూనిస్టుల ఆధిపత్యం క్రిందకు వచ్చింది. కాంగ్రెసు నుండి వీరు చీలిపోయినపుడు ఆంధ్ర పార్టీ అంతా కమ్యూనిస్టుల వశమయింది.

॥

# ప్రత్యేక రాష్ట్రం కోసం కాంగ్రెస్

1936లో కాంగ్రెసు ఎన్నికలు జరిగాయి. అప్పటికి 50,865 మంది సభ్యులున్నారు. ఫిర్యాదులు, బేరసారాలు, కొట్లాటలు, అన్ని అవలక్షణాలు అప్పుడే ప్రారంభమైనాయి. వీటిని పరీక్షించడానికి రాష్ట్ర సంఘం మధ్యవర్తులను పంపుతుండేది. గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాలు కాంగ్రెస్ కలహాలకు పరాకాష్ఠ అని చెప్పవచ్చు. ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికలలో గుంటూరు జిల్లాలో రెండు ముఠాలేర్పడ్డాయి. ప్రకాశం, సాంబమూర్తి వర్గానికి కొందరు మద్దతు యివ్వగా, కాళేశ్వరరావు, రంగాకు ఎక్కువ మంది అండగా నిలబడ్డాడు. అయితే గుంటూరు జిల్లాలో రంగాకు రాజకీయంగా గిట్టుబాటు పరిస్థితి ఏర్పడింది. కృష్ణా జిల్లాలో పట్టాభిసీతారామయ్య పరిస్థితి కూడా అంతే. వీళ్ళిద్దరూ ఎవరికి వారు రాయలసీమలో రాజకీయ ప్రభావం కోసం ప్రయత్నం చేశారు. రంగా తన దృష్టిని విశాఖ, శ్రీకాకుళం జిల్లాలపై సారించాడు.

1937 ఫిబ్రవరిలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ప్రకాశం, సాంబమూర్తి కలిసి అభ్యర్థులను ఎన్నిక చేశారు. ఆ ఎన్నికలలో ప్రచారం నిమిత్తం రాజేంద్రప్రసాద్, నెహ్రూ, పటేల్ వచ్చారు. సోషలిస్టు నినాదాలు బాగా పనిచేశాయి. రైతులా? రాజులా? తేల్చుకోండని ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రచారాన్ని జస్టిస్ పార్టీ ఎదుర్కోలేక పోయింది. కాంగ్రెసుకు 111 సీట్లు రాగా జస్టిస్ పార్టీకి 3 మాత్రమే వచ్చాయి. హరిజనులలో కాంగ్రెసుకు 26 రాగా, జస్టిస్ కు 2 స్థానాలు వచ్చాయి. ముస్లింలలో కాంగ్రెస్ 4, జస్టిస్ కు అంతకు రెట్టింపు 8 వచ్చాయి. క్రైస్తవులలో కాంగ్రెస్ 3, జస్టిస్ కు 4 వచ్చాయి. కాంగ్రెసు తరఫున 7గురు స్త్రీలు ఎన్నికయ్యారు. జిల్లా బోర్డు ఎన్నికలలో కూడా అన్ని విధాలైన అవినీతి కార్యక్రమాలకు అటు కాంగ్రెస్ వారు, ఇటు జస్టిస్ వారు తలపడ్డారు. టీచర్లను ఎన్నికలలో వాడుకోవడం, సహకరించని వారిని బదిలీ చేయించడం మామూలైంది. ఎన్నికల సమయంలో గుంటూరు జిల్లాలో 172 మంది టీచర్లను బదిలీ చేశారు. 6గురు కొత్త టీచర్లను నియమించారు. జిల్లా బోర్డు వైస్ ప్రెసిడెంటు స్కూలు కట్టించాడు. ఒంగోలు జిల్లా బోర్డు వైస్ ప్రెసిడెంటు స్కూలు కట్టించాడు. అట్లాగే ఒంగోలు జిల్లా బోర్డులో సభ్యులను సంతృప్తి పరచడానికి 200 మంది టీచర్లను బదిలీ చేశారు. కాంగ్రెస్

ప్రచారాలను ఎదుర్కోవడానికి జస్టిస్ పార్టీ లక్షల రూపాయల పన్ను వసూలు చేసింది. చల్లపల్లి రాజా, మీర్జాపురం రాజా, పిఠాపురం రాజాలు పాతకలహాలు మాని తాత్కాలికంగా కలిశారు. అయినప్పటికీ కాంగ్రెస్ ధాటిని జస్టిస్ పార్టీ తట్టుకోలేకపోయింది.

## రాజాజీ మంత్రివర్గం

1937 ఎన్నికలలో ఘనవిజయం సాధించిన కాంగ్రెసు మద్రాసులో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసేటప్పుడు రాజగోపాలాచారి, ప్రకాశం ముఖ్యమంత్రి పదవి ఆశించారు. కాశీనాథుని నాగేశ్వరరావు గృహంలో తెలుగువారు సమావేశమయ్యారు. అయితే ప్రకాశం అభ్యర్థిత్వాన్ని తెలుగువారిలోనే కొందరు వ్యతిరేకించారు. గాంధీకి ప్రకాశం అంటే యిష్టం లేకపోవడం కూడా ఒక ప్రధాన కారణమైంది. ఇది గ్రహించిన ప్రకాశం, బులుసు సాంబమూర్తి కలిసి రాజగోపాలాచారి పేరు చెప్పి ఆయనను ఎన్నుకొనేటట్లు చేసారు. రాజాజీ మంత్రివర్గంలో ప్రకాశం రెవిన్యూ మంత్రయ్యాడు. బెజవాడ గోపాల రెడ్డి స్థానిక పరిపాలనా శాఖామంత్రిగా, బులుసు సాంబమూర్తి స్పీకర్ గా పదవిలోకొచ్చారు. అయితే ప్రకాశానికి రాజాజీకి ఎప్పుడూ మనస్పర్థలుండేవి. ప్రకాశం మంత్రి కాగానే ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షపదవిని పట్టాభి సీతారామయ్య చేపట్టాడు.

## శ్రీబాగ్ ఒడంబడిక

ఆంధ్ర మహాసభలు ప్రతి సంవత్సరం జరుగుతున్నప్పటికీ రాయలసీమ వారు ప్రత్యేకాంధ్రపట్ల సందేహాలు వ్యక్తపరుస్తూనే వున్నారు. కాశీనాథుని నాగేశ్వరరావు వంటివారు ఎప్పటికప్పుడు రాజీ ప్రయత్నాలు చేస్తూ సర్దుబాటు చేసుకుంటూ వచ్చారు. ఆంధ్రరాష్ట్ర నిర్మాణం చేయాలన్న విషయం సూత్రప్రాయంగా అఖిల భారత కాంగ్రెసు కూడా ఆమోదించింది. అయితే రాయలసీమవారి అనుమానాలు పోగొట్టడం కోసం సర్కారు, రాయలసీమ ప్రముఖులు కాశీనాథుని నాగేశ్వరరావు గృహంలో (శ్రీబాగ్) 1937 నవంబరు 14న సమావేశమయ్యారు. అప్పుడు పట్టాభి నాయకత్వం వహించాడు. రాయలసీమ నుండి కడప కోటిరెడ్డి, కల్లూరి సుబ్బారావు, పప్పూరి రామాచారి, హెచ్ సీతారామిరెడ్డి, ప్రభృతులున్నారు. సర్కారు నుండి –కొండా వెంకటప్పయ్య, ముళ్ళపూడి పళ్ళంరాజు, కాశీనాథుని నాగేశ్వరరావు వున్నారు. రాయలసీమవారి అనుమానాలు తీర్చడానికి కొన్ని హామీలిచ్చారు. అందులో ముఖ్యమైనవి రాజధానిగాని, హైకోర్టుగాని రాయలసీమవారి యిష్టానుసారం ఎక్కడ వుండాలని నిర్ణయించాలనేది ఒకటి. తరువాత అనంతపూర్ లో విశ్వవిద్యాలయం నెలకొల్పాలన్నారు. అంతటితో ఆంధ్రరాష్ట్రం ఏర్పరచాలనే తీర్మానం అసెంబ్లీలోను, కౌన్సిల్ లోను ప్రతిపాదని నెగ్గించారు. సమస్య సమసిపోయిందేకాని రాష్ట్రం ఏర్పడలేదు. ఆంధ్రకు రాజధానిగా మదరాసు వుండాలని ప్రకాశం పట్టుబడుతూ పోయాడు. ఈ పేచీ వలన రాష్ట్ర నిర్మాణం మరో పదహారేళ్ళకు వాయిదాపడింది. అఖిల భారత రాజకీయాలు ఎప్పటికప్పుడు ఆంధ్ర ప్రాంతాన్ని ప్రభావితం చేస్తూ పోయాయి. అదీగాక విద్యార్థులనేకులు బెనారస్ మొదలగు ప్రదేశాలకు వెళ్ళి చదివి కొత్త భావాలు తెచ్చారు. అప్పటికే 1935లో కాకినాడలో కమ్యూనిస్టులు రహస్యంగా సమావేశమై సుందరయ్యను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కొత్తపట్నం, మంతెనవారి పాలెం మొదలైన చోట్ల రాజకీయ పాఠశాలలు పెట్టి యువకులకు శిక్షణ యిచ్చారు. ఎం.ఎన్.రాయ్ ప్రభావంలో ఆంధ్రలో ఎం.వి.శాస్త్రి కోగంటి రాధాకృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, గోపాల కృష్ణమూర్తి, అబ్బూరి రామక్రిష్ణరావు మొదలైనవారు రాడికల్ భావాలను ప్రచారం చేయడానికి పూనుకున్నారు.

॥

# అతివాదంలో కాంగ్రెస్

క్విట్ ఇండియా వుద్యమం సందర్భంగా బందరులో కొందరు కాంగ్రెసు నాయకులు సమావేశమై దేశంలో విచ్ఛిన్నకర కార్యక్రమాలు జరగాలని నిర్ణయించారు. అందులో రెండు ముఠాలవారున్నారు. పట్టాభి, కళా వెంకటరావు ఒక ప్రక్కన, ప్రకాశం ముఠా యింకొక వైపున కూర్చుని కార్యక్రమం తయారు చేశారు. ఈ విషయం బ్రిటిష్ వారికి, గాంధీకి తెలిసింది. గాంధీ నిలదీసి అడిగితే మాకు తెలియదంటే మాకు తెలియదన్నారు. రైలు పట్టాలు పీకాలని, టెలిఫోన్ తీగలు తెంచాలని ఇత్యాది కార్యక్రమాలన్నీ ఆ సర్క్యులర్ లో రాసారు. బ్రిటిష్ వారు దీనిని అవకాశంగా తీసుకుని కాంగ్రెసు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనుకున్నారు. అమంచర్ల గోపాలరావు వంటివారు ఈ ఆంధ్ర సర్క్యులర్ ఆధారంగా గుంటూరు జిల్లాలో విధ్వంస కాండ జరిపారు. గాంధీ యిచ్చిన ఉప్పు సత్యాగ్రహం చర్యనైతేమి, బ్రిటీష్ వ్యతిరేక చర్యల వల్లనైతేనేమి కాంగ్రెసు నాయకులంతా జైళ్ళలో కలుసుకున్నారు. ఈ ముఠా కక్షలు జైళ్ళలో కూడా వదలకుండా సాగించారు. అది కాంగ్రెస్ ప్రవర్తన.

॥

# జైళ్ళకు తెచ్చిన ముఠాలు

వెల్లూరు జైల్లో రాజగోపాలాచారి, ప్రకాశం ముఠాలుగా ఎవరికివారు మడికట్టుకుని, కనీసం ఒకరితో ఒకరు మాట్లాడకుండా కూర్చునేవారు. తరువాత ప్రకాశం ముఠాను తిరుచునాపల్లి జైలుకు మార్చారు. వ్యక్తి సత్యాగ్రహం చేసిన వారినందరినీ మార్చడంతో రాజగోపాలాచారి కూడా అదే జైలుకు వచ్చాడు. అక్కడ మళ్ళీ బ్రాహ్మణ, బ్రాహ్మణేతర తత్వాలు బయట పడ్డాయి. మరొకసారి క్విట్ ఇండియా వుద్యమంలో అరెస్టయ్యి ప్రకాశం, తెన్నేటి విశ్వనాథం, వి.వి.గిరి, అనంతశయనం అయ్యంగార్, ముళ్ళపూడి పళ్ళంరాజు, నీలం సంజీవరెడ్డి మళ్ళీ వెల్లూరు జైలుకు వచ్చారు. అప్పుడు కళా వెంకటరావు, నీలం సంజీవరెడ్డి, ముళ్లపూడి పళ్ళంరాజు, ఎం. బాపినీడు ఒక ముఠాగా నడిపారు. మరికొందరిని తంజావూరు జైలులో పెట్టారు. అందులో రంగా, గౌతు లచ్చన్న మొదలైనవారు ఒక ముఠాగా వుంటే, గొట్టిపాటి బ్రహ్మయ్య, కాసు బ్రహ్మనందరెడ్డి, కల్లూరి చంద్రమౌళి, గొల్లపూడి సీతారామయ్య, మంతెన వెంకటరాజు మరొక ముఠాగా వున్నారు. వంటల నెపంతో వీరు తమ వ్యక్తిగతమైన కక్షలను బయటపెట్టుకున్నారు. వంటపెత్తనం చేసేవారు ఖైదీలకు సరిగా ఆహారం పెట్టక ఆడిస్తున్నారని ప్రధానాంశం. చివరికీ కలహాలు చాలా దూరం పోయి చేతులు కలపడ మొక్కటే తరువాయిగా మారాయి. ఇట్లా జైళ్ళలో బైటపడిన కక్షలతో కాంగ్రెసు నాయకులు ఏదో ఒక నెపంతో పెరోల్ తీసుకుని 1946 శాసనసభ ఎన్నిక నాటికి బయటపడ్డారు. ఈ నాయకులు జైల్లో వున్నంతకాలము కమ్యూనిస్టులు, రాడికల్స్ బైటే వున్నారు. అందువలన విద్యార్థి, కిసాన్ సంఘాలు వారి చేతుల్లోకి పోవడానికి దోహదం అయినది.

॥

# స్వాతంత్ర్యానికి ముందే అధికార కక్కుర్తి

క్విట్ ఇండియా ఉద్యమానంతరం కాంగ్రెస్ కమిటీ ఎన్నికలు జరపలేదు. జైలు నుండి బయటకు వచ్చిన ప్రకాశం ఆంధ్రలో పర్యటిస్తుండగా ఆయనకు విపరీతంగా చందాలు వసూలైనాయి. ఆయేడే హిందీ ప్రచారసభ రజతోత్సవాల సందర్భంగా రైలులో మదరాసు వస్తున్న గాంధీకి ఆంధ్ర అంతటా ఘన స్వాగతం లభించింది. గాంధీతోపాటు ప్రయాణం చేసిన కళా వెంకటరావు, ప్రకాశంపై చాడీలు చెప్పాడని తెన్నేటి విశ్వనాథం లాంటి వారు భావించారు. పర్యటనలో వసూలైన డబ్బులో 80 వేల రూపాయలు ప్రకాశం కాజేశాడనేది నేరారోపణ. మదరాసు రాజకీయాలలో ప్రకాశం కామరాజు నాడార్ కలవడం వలన గాంధీ ఆగ్రహానికి ప్రకాశం గురయ్యాడు. రాజాజీ నాయకత్వాన్ని గాంధీ అభిలషించాడు. 1949 మార్చిలో ఆంధ్ర కాంగ్రెసుకు ప్రకాశం అధ్యక్షుడు కాగా ఆయన ప్రత్యర్థి అయిన కళావెంకట్రావు కార్యదర్శి. ప్రకాశానికి తెలియకుండా కళా ఒక ఎన్నికల సంఘాన్ని నియమించాడు. అందులో రంగా మనిషిగాని ప్రకాశం మనిషిగాని లేరు.

అప్పుడు తెన్నేటి విశ్వనాథం, క్రొవ్విడి లింగరాజు, గౌతు రచ్చన్న కందుల ఓబులరెడ్డి అర్జంటుగా మద్రాసులో సమావేశమై కొత్త సంఘాన్ని ఎన్నుకోవాలని తీర్మానించారు. ప్రకాశం దీనిని దీవించాడు. అందరూ కలిసి రంగాను ఒప్పించారు. రాష్ట్రమంతా పర్యటించి ప్రదేశ్ కాంగ్రెసు సభ్యుల సంతకాలతో రిక్విజిషన్ నోటీసివ్వగా రాజమండ్రిలో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రకాశం ప్రతిపాదించిన ఎన్నికల సంఘాన్ని ఎదురు లేకుండా అంగీకరించారు. అందులో రంగా వర్గానికి చోటు లేదు. ఇది సహించలేక కొండా వెంకటప్పయ్య కేంద్రానికి ఫిర్యాదు చేశాడు. ప్రకాశానికి ప్రత్యర్థయిన పట్టాభి, ప్రకాశం ఏర్పరచిన సంఘాన్ని సవరించాడు. అయినా ఎన్నికలలో అభ్యర్థులను నిర్ణయించడంలో ప్రకాశం వర్గం నిరంకుశంగా ప్రవర్తించింది. 1946 శాసన సభ ఎన్నికలలో కాంగ్రెసుకు బాగా బలం చేకూరింది. తొలిసారి ఎన్నికలలో పోటీచేసిన కమ్యూనిస్టులకు ఒకే ఒక్క స్థానం లభించింది. రాడికల్, డెమోక్రటిక్ పార్టీలకు డిపాజిట్లు పోయాయి. కాంగ్రెసులో వున్న సోషలిస్టులు కూడా కొందరు గెలిచారు. అంతటితో రంగం మారి నాయకత్వపు కలహాలు ఆరంభమైనాయి. ప్రకాశాన్ని రానివ్వకుండా రాజాజీని ఎన్నుకోమని గాంధీ ఢిల్లీ నుండి 'మహాత్ముని' ఆజ్ఞగా చెప్పాడు. కామరాజు నాడార్ ప్రకాశంను బలపరిచాడు. పటేల్, ఆజాద్ రాజాజీనే బలపరిచారు. ప్రకాశానికి శాసస సభ్యులలో అత్యధిక సంఖ్యాబలమున్నది. కానీ కాంగ్రెస్ అధిష్ఠాన వర్గం నిర్ణయాన్ని పొడిగిస్తూ వచ్చింది. ప్రకాశం ప్రజల డబ్బు తిన్నాడని కనుక అవినీతిపరుడనీ ఆరోపణ చేశాడు. అయితే ప్రకాశం ధైర్యంగా గాంధీని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యాడు. ఈ లోపల గాంధీ కామరాజు నాడార్ ను ప్రకాశాన్ని వేరు చేయగలిగాడు. ప్రకాశాన్ని రానీయకుండా చేయడంలో కళా వెంకటరావు, గోపాలరెడ్డి యథాశక్తి కృషిచేశారు. చివరకు 1946 ఏప్రిల్ 23న ప్రకాశం నాయకుడుగా ఎన్నుకోబడ్డాడు. వికేంద్రీకరణ వుపన్యాసాల్లోనేగానీ ఆచరణలో లేదని కాంగ్రెస్ వారు రుజువు చేశారు. డబ్బుల వసూళ్ళ ఫిర్యాదులలో, పట్టాభి కూడా 'శుభోదయం' అనే పత్రిక పేరిట డబ్బులు వసూలు చేసుకున్నట్టుగా ప్రకాశం ఆరోపించాడు. ముఖ్యమంత్రిగా ఎన్నికైన ప్రకాశం, పట్టాభి వర్గానికి మంత్రి వర్గంలో చోటివ్వలేదు. వి. వి. గిరి, కడప కోటిరెడ్డి, వేముల కూర్మయ్య మంత్రులుగాను, తెన్నేటి విశ్వనాథం, వెన్నెల గంటి రాఘవయ్య, క్రొవ్విడి లింగరాజు పార్లమెంటరీ కార్యదర్శులుగాను పదవులను స్వీకరించారు. కానీ ప్రకాశం మంత్రి వర్గం సాఫీగా సాగడానికి వీలులేని పరిస్థితులు ప్రత్యర్థులు కల్పించారు. స్పీకరు ఎన్నికలలోనే ప్రకాశం అభ్యర్థయిన తెన్నేటి విశ్వనాథాన్ని ఓడించ గల్గారు. అప్పటి నుండి కళా వెంకట్రావు, కామరాజు నాడార్, రాజగోపాలాచారి కలసి సంవత్సరం తిరగకముందే ప్రకాశం మంత్రి వర్గంపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. ప్రకాశం దిగిపోగా ఓమండూరి రామస్వామి రెడ్డియార్ ముఖ్యమంత్రయ్యాడు. ఈ మార్పు 1947 మార్చిలో జరిగింది. ఈసారి మంత్రివర్గంలో హెచ్. సీతారామిరెడ్డి, కళా వెంకట్రావు, బెజవాడ గోపాలరెడ్డి, కల్లూరి చంద్రమౌళి మంత్రులుగా ఉన్నారు. ఈ మంత్రులు ఆంధ్రలో ఎక్కడికి వెళ్ళినా అవమానం పొందారు. కళా వెంకటరావు రాజకీయ బాధితులకు భూములిచ్చే పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్ర కాంగ్రెస్ నుండి సర్టిఫికెట్ తెచ్చుకోమన్నాడు. దాంతో రాజకీయ బాధితులు అయినవారు, కానివారు సంపన్నులు, పేదవారు ఎగబడి కాంగ్రెసు ఆఫీసునుండి పట్టాలు తెచ్చుకున్నారు. ఆ విధంగా అవినీతి చర్యలకు పట్టం కట్టారు. ఆర్థిక మంత్రిగా గోపాల రెడ్డి, పారిశ్రామిక మంత్రిగా హెచ్. సీతారామిరెడ్డి తమ సొంత వ్యాపార సంస్థల పేరిట లక్షలాది డబ్బు ప్రభుత్వం నుండి స్వీకరించారు. ప్రకాశం మంత్రి వర్గంలో వుంటూ ప్రత్యర్థులలో చేరి వాళ్ళ మంత్రి అయిన వేముల కూర్మయ్య ఎరువులకు సంబంధించిన అవినీతి కార్యక్రమాలలో తలదూర్చాడు. ఇలాంటి నేరారోపణలు పరిశీలించి, మంత్రులపై ధ్వజమెత్తాడు. దానికి మారుగా పట్టాభి వర్గంవారు ప్రకాశంపై మరికొన్ని ఆరోపణలు చేశారు. పరస్పరారోపణలతో రాజకీయాలలో ఆసక్తిగల వారికి బాగా సందడిగా వుండేది.

మంత్రివర్గ వ్యవహారాలు యిట్లా వుండగా ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికలు 1946లో జరిగినప్పుడు రంగా వర్గం చాలా స్థానాలను ఆకట్టుకుంది. విదేశాలలో వున్న రంగాకు, పళ్ళంరాజుకు పోటీ జరుగగా రంగా గెలిచాడు. కాంగ్రెస్ కార్యకర్తలకు కొద్దో గొప్పో ధన సహాయం చేయాలని రంగా ప్రవేశపెట్టాడు. కాంగ్రెస్ కార్యదర్శిగా వున్న కందుల ఓబుల రెడ్డి, సహాయ కార్యదర్శిగా వున్న లచ్చన్న సహజంగా తమ యిష్టా యిష్టాలను బట్టి కార్యకర్తలకు సహాయం చేసుకున్నారు. పట్టాభి వర్గం రంగాపై ఫిర్యాదులు చేయగా ఆయన అధ్యక్షస్థానం వహించిన నెలరోజులలోనే శ్రీమతి కమలా దేవి విచారణ సంఘాన్ని నియమించారు. ఆమె రంగాను వ్యక్తిగతంగా ఏమీ అనలేకపోయినా నాయకత్వ నిర్ణయాలను విమర్శించింది. ప్రకాశం, రంగా ఒక వర్గంగాను పట్టాభి మరొక వర్గంగాను చెలామణి అయ్యారు. గుంటూరు జిల్లాకు జరిగిన కాంగ్రెస్

ఎన్నికలు చెల్లవన్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా వున్న రంగా ఐదేండ్లలో నాలుగుసార్లు విదేశ పర్యటన చేయగా ఆయన శిష్యులు ఆయన పేరిట ముఠా రాజకీయాలు వుధృతంగా నడిపారు. 1948లో మరోసారి జరిగిన ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి జరిగిన పోటీలో రంగా అవలీలగా సంజీవరెడ్డిని ఓడించాడు.

# చొచ్చుక వచ్చిన కమ్యూనిస్ట్ పార్టీ

కాంగ్రెసు నాయకులంతా జైలులో వుండగా కమ్యూనిస్టుపార్టీ బయట వుండి చాలామంది కార్యకర్తలను ఆకట్టుకుంది. ఐతే ఎన్నికల్లో గెలిచేటంత బలం మాత్రం రాలేదు. అందువలన 1946 శాసన సభ ఎన్నికలలో మూడు జిల్లాల కార్మిక ప్రతినిధిగా కేవలం పిల్లలమర్రి వెంకటేశ్వర్లు మాత్రమే అసెంబ్లీకి నెగ్గాడు. కమ్యూనిస్టులు కార్మికులను, వ్యవసాయ కూలీలను సంఘటిత పరచటం, వారి హక్కుల కొరకై పోరాడటం మొదలైన కార్యక్రమాలు చేపట్టారు. కొన్ని సందర్భాలలో కాంగ్రెసు వారిపై దాడి చేయక పోలేదు. ముఖ్యమంత్రిగా వున్న ప్రకాశం కమ్యూనిస్టులకు పచ్చి వ్యతిరేకి, కాంగ్రెస్ అధ్యక్షుడుగా వున్న రంగా కూడా అంతే. రాష్ట్రంలో అరాచకత్వాన్ని సృష్టిస్తున్నారనే దృష్టితో 1947 జనవరిలో ఒక ఆర్డినెన్స్ జారీ చేశారు. దీని ప్రకారం విచారణ లేకుండానే ఎవరినైనా శిక్షించవచ్చు. అయితే ఆయేడు ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత కమ్యూనిస్టుల నందరినీ విడుదల చేశారు. కానీ జమీందారీ వ్యతిరేక పోరాటంలో కమ్యూనిస్టులు భూస్వాములకు ఇబ్బంది కలిగిస్తూనే పోయారు. అధికారులు చేసే ధాన్య సేకరణవంటి కార్యక్రమాలను నిరోధించారు. ప్రభుత్వంవారు తిరిగి కమ్యూనిస్టులను నిరోధించడం ప్రారంభించారు. అప్పుడు మలబారు నుండి ప్రత్యేక పోలీసు దళాన్ని పిలిపించడమే గాక కమ్యూనిస్టు పార్టీని 1948 సెప్టెంబరు 26న నిషేధించారు. వారికనుకూలంగా వున్న కార్మిక సంస్థలను కూడా నిషేధించారు. అప్పుడే కమ్యూనిస్టు పార్టీ నుండి చాలా మంది తప్పుకున్నారు. పార్టీ చేపట్టిన సాయుధ పోరాట పద్ధతికి నిరసనగా వావిలా గోపాల కృష్ణయ్య, ముక్కామల నాగభూషణరావు, జి.సి.కొండయ్య, అల్లూరి సత్యనారాయణ, కొమ్మరాజు, వెంకట రామశాస్త్రి ప్రభృతులు ఆ విధంగా పార్టీనుండి నిష్క్రమించిన వారిలో వున్నారు. చదలవాడ పిచ్చయ్యలాంటి వారి కమ్యూనిస్టు *అగ్రనాయకుల నగ్న సత్యాలు* పేరిట మాకినేని బసవ పున్నయ్య వంటి వారిపై పుస్తకాలు రాసారు. పార్టీ అతన్ని తొలగించింది. కమ్యూనిస్టు పార్టీలో కొన్ని ముఠాలుండేవి. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన కొర్రపాటి పట్టాభి రామయ్య సి.వి.కె.రావు ఒక ముఠాగా వుంటూ కమ్యూనిస్టు పార్టీ కమ్మకుల పక్షపాతంతో వ్యవహరిస్తున్నదని వీరు ఆరోపించారు.

కేంద్ర కమ్యూనిస్టు పార్టీలో ముఠాలుండేవి. ఆంధ్ర పార్టీలో ఆరోజులలో ప్రత్యేకతను ప్రదర్శిస్తూ చైనాకు అనుకూలంగా వుండేది. అదే సమయంలో తెలంగాణాలో కమ్యూనిస్టులు చేపట్టిన సాయుధ పోరాటానికి ఆంధ్ర పార్టీ బాగా సహకరించింది.

1948 జనవరి ఒకటిన సోషలిస్టులంతా కాంగ్రెసు నుండి చీలి బయటకు వచ్చారు. అంతేగాక శాసన సభలలో వున్న తమ పార్టీ సభ్యులంతా రాజీనామాలివ్వాలని ఆదేశించారు. ఆంధ్రలో మల్లికార్జునుడు అనే సభ్యుడు రాజీనామా ఇవ్వగా ఆ స్థానంలో జరిగిన వుపఎన్నికలో గౌతు లచ్చన్న శాసనసభకు తొలిసారి ఎన్నికయ్యాడు.

ఆంధ్రలో కమ్యూనిస్టుల చర్యలను అణచాలనే నెపంతో మలబారు పోలీసు సహాయంతో కాంగ్రెసు ప్రభుత్వం కొన్నిదారుణ కృత్యాలు జరిపింది. దాని వలన ప్రజలలో కాంగ్రెసు పట్ల సానుభూతి తగ్గుముఖం పట్టింది. అదీగాక ముఠా తగాదాలలో పరస్పరం రాళ్ళు విసురుకుంటూ ఒకరి గుట్టు మరొకరు బట్ట బయలు చేయడం వలన ప్రజలకు జుగుప్స కలిగింది. స్వాతంత్ర్యానంతరం తొలిసాధారణ ఎన్నికలు 1952లో అని ప్రకటించారు. అంత వరకు ఆంధ్రరాష్ట్రం కూడా ఏర్పరచలేని కాంగ్రెసుపై ప్రజలకు ఏవగింపు కలిగింది. కమ్యూనిస్టు పార్టీ విశాలాంధ్ర నినాదాలిచ్చి తెలంగాణాను కూడా కలుపుకోవాలని స్పష్టం చేసింది. జైళ్ళలో నుండి బయటకు వచ్చిన కమ్యూనిస్టులు తమ దౌర్జన్యకాండను క్షమించమని బహిరంగంగా సభలో అడిగారు. అదీగాక తమకు ఓట్లిచ్చి గెలిపిస్తే 5 ఎకరాలు, ఆవుదూడ పంచుతామనే ఆకర్షణీయమైన ఎన్నికల వాగ్దానం చేశారు. మలబారు పోలీసులు జరిపిన దారుణ కాండను కళ్ళకు కట్టినట్లు బహిరంగ సభల్లో చెప్పి



ప్రజల సానుభూతిని పొందారు. ఇది ఇట్లా వుండగా ఎన్నికలకు ముందే కాంగ్రెస్ సంఘ ఎన్నికలు జరిగాయి. ఐదేళ్ళుగా ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుగా వున్న రంగా తిరిగి పోటీకి తలపడ్డాడు. ప్రత్యర్థులు నీలం సంజీవరెడ్డిని పోటీ పెట్టారు. రంగాకు బలం కనిపిస్తున్నది. కళా వెంకటరావు తన ఎత్తుగడలతో రాష్ట్ర కాంగ్రెస్ సంఘ సభ్యులను పశ్చిమగోదావరి జిల్లాలో ఒకచోట చేర్చారు. రాష్ట్రంలో మంత్రులుగా ఉన్న కళా వెంకటరావు, కల్లూరి చంద్రమౌళి, హెచ్. సీతా రామిరెడ్డి ఎవరికి కావలసిన ప్రతిజ్ఞలు, వాగ్దానాలు వారు నిరభ్యంతరంగా చేసారు. అప్పటికే లక్షమంది కాంగ్రెసు సభ్యులను చేర్పించినట్లు వ్యాపారస్తుల దగ్గర డబ్బు వసూలు చేసి పావలా సభ్యత్వం క్రింద కళా వెంకట్రావు సభ్యత్వ రుసుం కూడా జమకట్టాడు. అప్పటి వరకు రంగాకు అనుకూలంగా ఉన్న కాకాని వెంకటరత్నం మరొక ముగ్గురు కృష్ణాజిల్లా సభ్యులు హఠాత్తుగా వ్యతిరేకమయ్యారు. గుంటూరు జిల్లా నుండి ఎన్నికయిన 25మంది సభ్యులు ఎన్నికలలో పాల్గొనకుండా స్టే తెచ్చారు. 7 ఓట్ల తేడాతో గెలుస్తాడనుకున్న రంగా 4 ఓట్ల తేడాతో ఓడిపోయాడు. మంత్రి పదవికి రాజీనామా చేసి వచ్చిన నీలం సంజీవరెడ్డి నెగ్గాడు. కళా వెంకటరావు ఎత్తుగడల ముందు కందుల ఓబుల రెడ్డి చిత్తు అయ్యాడు2. రంగా-ప్రకాశం వర్గానికి కార్యవర్గంలోని 19 స్థానాలలో 9 యిస్తానని సంజీవరెడ్డి ప్రతిపాదించాడు. కానీ రంగా ప్రకాశంలు అందుకు ఒప్పుకోలేదు. వెంటనే విజయవాడలో కాళేశ్వరరావు గృహంలో సమావేశమై కాంగ్రెస్‌కు రాజీనామా యిచ్చి ప్రత్యేక పార్టీ పెట్టాలనే కృత నిశ్చయానికి వచ్చారు. ఆంధ్ర ప్రజాపార్టీ అని కొత్త పార్టీ పెట్టారు. ఇంతలో కేంద్రంలో కొందరు నాయకులు కాంగ్రెసు నుండి చీలి పాట్నాలో సమావేశమయ్యారు. కృపలాని, అజిత్ ప్రసాద్ జైన్, రఫీ అహ్మద్ కిద్వాయ్ వంటి నాయకులు ఈ సమావేశానికి రావలసిందిగా ప్రకాశం, రంగాలను ఆహ్వానించారు. వీరు తక్షణమే పాట్నా వెళ్ళారు. అక్కడ దేశ స్థాయిలో కిసాన్ మజ్దూర్ అనే కొత్త పార్టీని స్థాపించారు. పార్టీ కార్యక్రమం రూపొందించడానికి ప్రకాశంతో సహా నలుగురు సభ్యులు ఉన్న సంఘాన్ని వేసారు. రంగాకు ఆ పార్టీలో ప్రముఖ స్థానం లభించలేదు. అంతటితో అలిగి రంగా బయటకు వచ్చి, సిద్ధాంతపరమైన అభిప్రాయభేదాలున్నాయనే నెపంతో కృషికార్ లోక్ పార్టీ అనే కొత్త పార్టీని పెట్టారు. 1952 ఎన్నికలలో ఈ పార్టీలన్నీ రంగంలోకి దిగాయి. కాంగ్రెస్ మంత్రులపై ప్రకాశం దుమ్మెత్తి పోసాడు. కళా వెంకటరావు, బెజవాడ గోపాలరెడ్డి, కల్లూరి చంద్రమౌళి, వేముల కూర్మయ్య ఓడిపోయారు. అప్పుడు ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు ప్రకటించారు. ఒకమంత్రి ఓటమి మరొక చోట ప్రభావితం చేయగా, అందరూ చిత్తుగా పరాజయం పొందారు. కాంగ్రెస్ అధ్యక్షుడైన సంజీవరెడ్డి అనంతపురంలో తన బావమరిది తరిమెల నాగిరెడ్డి మీద ఓడిపోయాడు. ఆ తరువాత సంజీవరెడ్డి అనంతపురంలో ఎప్పుడూ పోటీ చేయలేదు. మద్రాసులో పోటీచేసి ప్రకాశం కూడా ఓడిపోయాడు. శ్రీకాకుళం, విశాఖపట్నం, చిత్తూరు జిల్లాలలో తప్ప మిగిలిన చోట్ల రంగా వర్గం బాగా పరాజయం పొందింది. కమ్యూనిస్టులు సర్కారు జిల్లాల్లోను, కాంగ్రెసు వారు రాయలసీమలోను గెలిచారు. వుమ్మడి మద్రాసు రాష్ట్రంలో కాంగ్రెసుకు పూర్తిబలం చేకూరలేదు. అట్లాంటి పరిస్థితులలో కమ్యూనిస్టు పార్టీ నుండి రాష్ట్రాన్ని కాపాడ గలవాడు రాజగోపాలాచారి ఒక్కడే అని ఆయనను రంగంపైకి తీసుకొచ్చారు. కమ్యూనిస్టులు ప్రకాశాన్ని బలపరిచి ఐక్య సంఘటనను ఏర్పాటు చేయడానికి పూనుకున్నారు. కానీ రంగా మాత్రం రాజగోపాలాచారికి మద్దతునిచ్చాడు. అంతటితో బొటాబొటి సంఖ్యాబలంతో రాజగోపాలాచారి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయగలిగాడు. ముస్లింలు కూడా ఆయనకు అండగా నిలిచారు.

1952 సాధారణ ఎన్నికలలో లోక్ సభకు తొలిసారిగా కొత్త రఘు రామయ్య గుంటూరు నుండి నెగ్గారు. ఆయన ఉద్యోగానికి రాజీనామా యిచ్చి అప్పుడే రాజకీయాలలోకి దిగారు. విజయవాడలో కమ్యూనిస్టుల బలంతో హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ కృషికార్ లోక్ పార్టీ అభ్యర్థిని భారతీదేవిపై నెగ్గారు. తెనాలిలో రంగా ఓడిపోయారు.

రాజాజీ మంత్రివర్గంలో డి.సంజీవయ్య, ఎస్.రంగారెడ్డి, ఎస్.బి.పి. పట్టాభి రామారావు, ఎం.వి.క్రిష్ణారావు (విశాఖ), ఎన్.శంకర రెడ్డి (కర్నూలు) మంత్రులుగా వున్నారు. ముఖ్యమంత్రి కాగానే రాజగోపాలాచారి కృషికార్ లోక్ పార్టీ సభ్యులను కొందరిని కాంగ్రెసులోకి తిప్పుకున్నారు. ఆవిధంగా పార్టీల మార్పిడికి నాంది పలికినవాడు రాజగోపాలాచారి అనవచ్చును. కృషికార్ లోక్ పార్టీలోకి వచ్చిన ఆంతరంగిక కలహాలవలన తిమ్మారెడ్డి రంగాకు దూరమై సంజీవరెడ్డికి చేరువయ్యాడు. కులం ఆకర్షించిందనే అభిప్రాయం లేకపోలేదు. సాధారణ ఎన్నికలలో ఓడిపోయిన సంజీవరెడ్డి కాళహస్తిలో బలరామిరెడ్డిని రాజీనామా చేయించి అచ్చట నుండి శాసనసభకు నెగ్గాడు. అంతటితో మద్రాసు ప్రహసనం ముగిసిందనుకోవచ్చు. అయితే ముఠా రాజకీయాలు మాత్రం ముదురు పాకాన పడ్డాయి. అప్పుడు ప్రత్యేకాంధ్ర పర్వం ప్రారంభమైనది.

-------

# ఇన్నేళ్ళకు వచ్చిన ఆంధ్ర

ఆంధ్ర రాష్ట్రం ఏర్పడాలని 1913 నుండి సభలు జరిపి తీర్మానాలు చేస్తూ పోయారు. అనేక కారణాల వలన ప్రత్యేక రాష్ట్రం ఏర్పడలేదు. రాయలసీమవారు ఎప్పటికప్పుడు ప్రత్యేక ఆంధ్రను వ్యతిరేకిస్తూ వచ్చారు. సర్కారు వారంటే రాయలసీమలో అనుమానాలు వుండేవి. అవి తీర్చడం కోసం 1937లోనే కొన్ని హామీలు యిస్తూ నాయకులు తీర్మానం చేసుకున్నారు. ఆ తరువాత యుద్ధ కాలంలో ఆంధ్ర రాష్ట్రం కూడా ఎవ్వరికీ పట్టలేదు. థార్ కమిషన్ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకిస్తూ నివేదిక సమర్పించింది. అప్పుడు కాంగ్రెసు సంస్థలో కలకలం బయలుదేరగా, జవహర్ లాల్ నెహ్రూ వల్లభాయి పటేల్, పట్టాభి సీతారామయ్యలతో ఒక వుప సంఘాన్ని ఏర్పాటు చేశారు. వారు ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి అనుకూలంగా నివేదికనిస్తూ మద్రాసు నగరం ఆంధ్రులు వదులు కోవాలన్నారు. ఆంధ్ర కాంగ్రెసువారు ఈ నివేదికను అంగీకరించారు. కానీ రాయలసీమ వారికి మాత్రం అనుమానాలు పోలేదు. వారి తృప్తి కోసం రాజధాని శాశ్వతంగా రాయసీమలో వుండాలని కాంగ్రెస్ నివేదించింది.

1952 జులై 27న అన్ని పార్టీలు కలిపి మద్రాసులో సమావేశమై ఆంధ్ర రాష్ట్ర విషయం చర్చించుకోవాలనుకున్నారు. కానీ కాంగ్రెసు అధ్యక్షుడు నీలం సంజీవరెడ్డి ఆ సమావేశానికి తమ పార్టీవారు హాజరు కారాదని వుత్తరువు జారీ చేశాడు. రాష్ట్ర నిర్మాణం వాయిదా వేయాలంటూ రాయలసీమ శాసన సభ్యులు ప్రకటన చేశారు. ఇది గమనించిన స్వామి సీతారాం (గొల్లపూడి సీతారాం) 1552 ఆగస్టు 15న ఆమరణ నిరాహారదీక్ష వహించారు. 36 రోజులయిన తరువాత నాయకుల సలహాపై *యథాశక్తి సత్యాగ్రహి, పదోవంతు గాంధీ* తన దీక్షను విరమించుకున్నాడు. ఆయన నిజంగా చనిపోతాడనుకుని ఆంధ్రరాష్ట్రం కోసం విద్యార్థులు ఆందోళన పడ్డారు. ఈ విధంగా ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం వెనక్కు పోవడం, మద్రాసు ఆంధ్రులకు దక్కే ఆశలు లేకపోవడంతో మద్రాసు రాష్ట్రంతో సహా ప్రత్యేకాంధ్ర ఏర్పడాలని పొట్టి శ్రీరాములు మద్రాసులో నిరాహారదీక్ష ప్రారంభించాడు. ఈ దీక్ష ప్రధానంగా మద్రాసునగరం ఆంధ్రులకు కావాలని పట్టుపట్టడం కొరకే. 1952 అక్టోబరు 19న మద్రాసులో ప్రారంభించిన ఆమరణ నిరాహారదీక్షకు ప్రకాశం, బులుసు సాంబమూర్తి మద్దతూ ప్రోత్సాహం వున్నవి. దీక్ష తొలి రోజులలో ఎవరూ పట్టించుకోలేదు. క్రమంగా ఆంధ్ర అంతటా ఆందోళన సాగింది. ఎవరు కోరినా శ్రీరాములు దీక్షను విరమించలేదు. మద్రాసు వదులుకుంటే ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం విషయం ఆలోచిస్తామని నెహ్రూ డిసెంబరు 9న  పార్లమెంట్ లో ప్రకటన చేసాడు. శ్రీరాములు మరీ భీష్మించుకుని దీక్ష కొనసాగించి 55 రోజుల తరువాత డిసెంబరు 15న సాయంత్రం 3గంటలకు మరణించాడు.  ఆంధ్రలో విపరీతమైన ఆందోళన జరిగింది. అది విధ్వంస కాండకు దారితీసింది. చలికాలం వేడెక్కింది. గత్యంతరం లేక వివాద అంశం కాని ప్రాంతాలతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పరుస్తున్నట్లు నాటి ప్రధాని నెహ్రూ ప్రకటించాడు. 1953 అక్టోబరు 1న ముహూర్తంగా నిర్ణయించారు.

అఖిల భారత రాజకీయాలననుసరించి 1952లో ప్రకాశం పార్టీ. సోషలిస్టులు కలిసి ప్రజాసోషలిస్టు పార్టీగా మారిపోయారు. అయితే సోషలిస్టులు మద్రాసు తమిళులకే చెందాలన్నారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు విషయం జరగగానే

వాంఛూ కమిటీని కేంద్రం ఏర్పరచింది. అప్పడు అన్ని విషయాలు ఎట్లావున్నా రాజధాని మాత్రం రభసకెక్కింది. రాయలసీమవారు తమ ప్రాంతంలోనే రాజధాని వుండాలన్నారు. కమ్యూనిస్టులు గుంటూరు, విజయవాడ రాజధానిగా వుండాలని నిర్ణయించారు. ఇది చూచి రంగా నాయకత్వంలో కృషికార్ లోక్ పార్టీ చంద్రగిరిరాజా భూముల దృష్ట్యా తిరుపతిలో రాజధాని పెట్టాలన్నారు. తాత్కాలిక రాజధాని మద్రాసే వుండాలని కాంగ్రెసు వారు, ప్రకాశం కూడా నివేదించారు. సంజీవరెడ్డి, గోపాల రెడ్డి, కళావెంకటరావు, కాళేశ్వరరావు, కొత్త రఘురామయ్య, టి.ఎన్.వెంకట సుబ్బారెడ్డి కాంగ్రెస్ ఉపసంఘంగా ఏర్పడి ఆంధ్రకు రావలసిన సొమ్ము, ఆంధ్రలో చేరవలసిన ప్రాంతాలు పేర్కొన్నారు. 1953 మార్చి 25న నెహ్రూ మద్రాసు వదులుకోవాలని రాజధాని ఎక్కడో ఆంధ్ర అసెంబ్లీ సభ్యులే తేల్చుకోవాలని చెప్పాడు. వాంఛూ కమిటీ ప్రకటన చేసినపుడు ప్రాంతీయతలు, ముఠాతత్వాలు పార్టీ వ్యతిరేకతలు పరాకాష్ఠ నందు కున్నాయి. రాజకీయాలతో ముడిపెట్టి సమస్యను నాన్చారు. 1953 జూన్ 5న ఆంధ్ర శాసన సభ్యులు మరోసారి సమావేశమై తాత్కాలిక రాజధాని నిర్ణయించమని ప్రకాశానికి పెత్తనం యిచ్చారు. ఆ అవకాశాన్ని తీసుకుని ఆయన కర్నూలు



రాజధానిగా నిర్ణయించాడు. రాయలసీమవారు తృప్తి చెందారు. కోస్తా ఆంధ్రులు తిట్టుకున్నా చేసేది లేక వూరుకున్నారు. రాజకీయ రంగం మళ్ళీ మారింది. నీలం సంజీవరెడ్డి, లచ్చన్న, తెన్నేటి విశ్వనాథం కలిసి ఆంధ్ర రాష్ట్రానికి రావలసిన లావాదేవీలన్నీ తేల్చారు. సంజీవరెడ్డి ఆంధ్రరాష్ట్ర నిర్మాణాన్ని వ్యతిరేకించినా చాలా ముందు చూపుతో వ్యవహరించాడు. ఎందుకయినా మంచిదని ప్రకాశానికి సన్నిహితంగా మెలగడం మొదలు పెట్టాడు. ఇది ప్రకాశం వర్గం వారికిగాని, కళా వెంకటరావు ముఠాకి గాని నచ్చలేదు. ప్రకాశం ముఖ్యమంత్రి పదవికై ప్రజాసోషలిస్టు పార్టీకి వుద్వాసన చెప్పి కాంగ్రెసులో చేరిపోయాడు. అప్పటికే ఆయన కురువృద్ధుడు. కళ్ళు కనిపించక, సరిగా వినిపించక ఏదీ పట్టించుకోవడం మానారు. అప్పటికి అతని వయసు 82 సంవత్సరాలు. సమయస్ఫూర్తిగల సంజీవరెడ్డి ప్రకాశాన్ని అడ్డుగా పెట్టి రాజకీయం నడిపాడు. ప్రజాసోషలిస్టు పార్టీ మంత్రి వర్గంలో చేరడానికి అంగీకరించలేదు. అందుకని ప్రకాశం చీలిపోయి ప్రజాపార్టీగా ఏర్పడి కాంగ్రెసుతో సహకరించి ముఖ్యమంత్రి పదవి చేజిక్కించుకున్నాడు. సంజీవరెడ్డి వుపముఖ్యమంత్రి అయ్యాడు. పేరుకు వుపముఖ్య మంత్రేగాని పెత్తనం అంతా సంజీవరెడ్డిదే ప్రకాశం మంత్రివర్గంలో తెన్నేటి విశ్వనాథం, దామోదరం సంజీవయ్య, పెద్ది రెడ్డి తిమ్మారెడ్డి, కడప కోటిరెడ్డి, ఎ.బి.పి. పట్టాభిరామారావు మంత్రులుగా చేరారు. కొద్దిరోజులకు కృషికార్ లోక్ పార్టీనుండి లచ్చన్న కూడా మంత్రి అయ్యాడు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడుగా బెజవాడ గోపాల రెడ్డి ఎన్నికయ్యారు. అల్లూరి సత్యనారాయణరాజు, కాసు బ్రహ్మానంద రెడ్డి, మంతెన వెంకటరాజు, ఆలపాటి వెంకట్రామయ్య సంజీవరెడ్డికి అండగా నిలబడి పార్టీ నిర్మాణం చేస్తూ పోయారు. మంత్రివర్గం ఏర్పడిన 54 రోజులకే రాజధాని సమస్య తలెత్తింది. అప్పటికే చాలా విమర్శలు ఎదుర్కొంటున్న కృషికార్ లోక్ పార్టీ కర్నూలును సమర్థించలేకపోయింది. తత్ఫలితంగా లచ్చన్న తన మంత్రి పదవికి రాజీనామా యిచ్చి ప్రతిపక్షంలో కూర్చున్నాడు.

====

# ఆంధ్ర కేసరి పతనం

ప్రకాశం మంత్రివర్గంలో సంజీవరెడ్డి పెత్తనం సహించలేని కాం గ్రెసువారు కొందరు అవకాశం కోసం ఎదురు చూశారు. రాష్ట్రంలో ఆందోళనలు ప్రారంభమైనవి. ఈనాం కౌలుదార్ల నిమిత్తం సోషలిస్టులు కరివెనలో (కర్నూలు) సత్యాగ్రహ వుద్యమం ప్రారంభించారు. శొంఠి రామమూర్తి సంఘం మధ్య నిషేధం రద్దు చేయమని సిఫారసు చేసింది. ఆ సిఫారసు అమలు పర్చాలంటూ కృషికార్ లోక్ పార్టీ గీత కార్మికులచే సత్యాగ్రహం ప్రారంభించింది. లచ్చన్న దీనికి నాయకత్వం

వహించాడు. పార్టీ అధ్యక్షుడైన కందుల ఓబుల రెడ్డికి ఇది యిష్టం లేదు. కమ్యూనిస్టులు కూడా రంగంలోకి దిగారు. జైళ్ళు నిండాయి. ఈ లోపల కృషికార్ లోక్ పార్టీ పక్షాన లచ్చన్న, ఓబుల రెడ్డి రహస్యంగా కర్నూలులో కాంగ్రెస్ శాసన సభ్యుల్ని కలుసుకోవడం ప్రారంభించారు. మద్దూరి సుబ్బారెడ్డి, వెంకటశెట్టి, బత్తెన వెంకట కృష్ణారెడ్డి, చిదానందం, బి.వి. సుబ్బారెడ్డి నడింపల్లి నరసింహారావు మొదలైన వారంతా అవిశ్వాస తీర్మానం పెడితే బలపర్చడానికి సుముఖత చూపారు. 1954 నవంబరు 6న అవిశ్వాస తీర్మానం ఓటుకు వచ్చింది. అంతకుముందే ప్రకాశం లచ్చన్నతో రాయబారం నడిపాడు. కోరిన వుత్తరువు జారీచేస్తామన్నారు. కానీ అప్పటికే ఆలస్యమయింది. ఆనాడు శాసన సభలో రెండు అవిశ్వాస తీర్మానాలు ఓటుకు పెట్టగా ఒకటి 7 ఓట్ల తేడాతో ఓడిపోయాడు. రెండవది ఒక్క ఓటుతో గెలిచింది. నాయకంట శంకరరెడ్డి, అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు కాంగ్రెస్ పక్షంలో వుండి తీర్మానానికి అనుకూలంగా ఓటు చేసినందువలన ప్రకాశం ప్రభుత్వం పడిపోయింది. మళ్ళీ ప్రభుత్వాన్ని నిలబెట్టడానికి ప్రకాశం ప్రయత్నం చేయకపోలేదు. కానీ అది సఫలం కాలేదు. శాసనసభ రద్దయింది. రాష్ట్రపతి పాలన ఏర్పడింది. సి.ఎం.త్రివేది అప్పుడు గవర్నరుగా వున్నారు. జైళ్ళలో వున్న గీత సత్యాగ్రహులందరినీ విడుదల చేశారు.

అన్ని పార్టీలవారు ఎన్నికలకు సిద్ధమైనారు. కాట్రగడ్డ రాజ గోపాలరావు, విశ్వేశ్వరరావు కర్నూలులో కృషికార్ లోక్ పార్టీ ఎన్నికలతో పొత్తుకై రహస్య చర్చ జరిపారు. కానీ అది ఫలించలేదు. మధ్యంతర ఎన్నికలకు కమ్యూనిస్టు పార్టీ ముందుగానే తన అభ్యర్థుల జాబితా ప్రకటించింది. అధికారంలోకి రాబోతున్నట్లే నమ్మింది. ప్రచారస్థాయి తీవ్రతరం చేశారు. రాష్ట్రమంతా ఎరుపెక్కింది. మాకినేని బసవపున్నయ్య తీవ్రస్థాయి వుపన్యాసాలు మధ్యతరగతిని దూరం చేసుకోగా కార్మికులను ఆకర్షించింది. కమ్యూనిస్టులు గెలిస్తే ముఖ్యమంత్రి ఎవరు అనే వరకు వూహలు సాగాయి. కాంగ్రెసువారు ఒకపట్టాన ఐక్యం కావడానికి సుముఖంగా లేరు. ఏలూరులో సమావేశమై ఎవరితోనూ పొత్తు లేకుండా పోటీచేయాలని తీర్మానించారు. కానీ కేంద్ర కాంగ్రెసు నాయకులు కమ్యూనిస్టుల ప్రమాదాన్ని గ్రహించి ఐక్య సంఘటన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. కృషికార్ లోక్ పార్టీ నాయకుడు రంగాను పిలిచి ఢిల్లీలో బల్వంత్ రాయ్ మెహతా, లాల్ బహదూర్ శాస్త్రి, మల్లయ్య. కొత్త రఘురామయ్య చర్చలు జరిపారు. దాని ఫలితంగా తన పార్టీని సంప్రదించకుండానే కాంగ్రెసుతో కలుస్తామని ఢిల్లీ నుండి రంగా ప్రకటించాడు. రాష్ట్ర స్థాయిలో అప్పటికే సోషలిస్టు నాయకుడు పి.వి.జి. రాజు, కృషికార్ లోక్ పార్టీ నాయకుడు లచ్చన్న ఒప్పందానికి వచ్చి శ్రీకాకుళం, విశాఖ జిల్లాలలో ఎన్నికల పొత్తుకు అంగీకరించుకున్నారు. తెన్నేటి విశ్వనాథం కటక్‌లో నెహ్రూను సంప్రదించి ఎన్నికల పొత్తుకు ఒప్పుకున్నాడు. ప్రకాశం మంత్రి వర్గాన్ని పడగొట్టడానికి తోడ్పడిన నాయకంటి శంకరరెడ్డి, అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావులను కూడా చేర్చుకోవాలని రంగా విఫల ప్రయత్నం చేశాడు. కాంగ్రెస్, ప్రజాపార్టీ, కృషికార్ లోక్ పార్టీ కలిసి సంయుక్త కాంగ్రెస్‌గా పోటీ చేయాలని నిశ్చయించారు. ఎన్నికల అభ్యర్థుల నిర్ణయానికై బెజవాడ గోపాల రెడ్డి, తెన్నేటి విశ్వనాథం, కందుల ఓబులరెడ్డి ఒక సంఘంగా ఏర్పడ్డారు. సంజీవ రెడ్డి, కళా వెంకటరావు తమ ముఠా పేర్లను యివ్వగా లచ్చన్న మరొక జాబితా యిచ్చాడు. కొత్త రఘురామయ్య, చల్లపల్లి రాజా తెరవెనుక ప్రముఖ పాత్ర నిర్వహించారు. ప్రకాశం పేరు ఎక్కడా వినబడలేదు. ఆయనను ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నికల ప్రణాళిక ఎలావుండాలో తేల్చుకోలేక మళ్ళీ ఢిల్లీ పరిగెత్తారు. ఆ విధంగా ప్రతిదానికి పేచీపడి ఢిల్లీకి జుట్టు అందివ్వడం కాంగ్రెసు పార్టీకి ఆనవాయితీ అయింది. ఢిల్లీలో నాయకులు ఏదో సర్దుబాటు చేసి పంపించారు. 1955 మధ్యంతర ఎన్నికలు చాలా తీవ్రస్థాయిలో జరిగాయి. కమ్యూనిస్టులు దేశంలోని అగ్రనాయకు లందరినీ పిలిపించి చాలా వుత్సాహంతో ప్రచారం చేసాడు. కాంగ్రెసు వారు కూడా దేశంలోని నాయకులందరినీ రప్పించి ప్రచారం చేయించారు. మొత్తం 196 స్థానాలకు తీవ్రమైన పోటీ జరిగింది. ఆ ఎన్నికలలో వుభయ పక్షాల వారు గోబెల్స్ ప్రచారం చేశారు. పత్రికలన్ని ఐక్య కాంగ్రెస్ ను కోపు వేసుకున్నాయి. కాంగ్రెస్ పక్షాన ఎస్.కె.పాటిల్, బారువా వంటివారు వచ్చి ప్రముఖ పాత్ర వహించారు. ఎవరికి ఎన్ని సీట్లు అనే విషయంపై తీవ్రవాదోప వాదాలు చేసుకున్నారు. 120 స్థానాలు గెలుస్తామని కమ్యూనిస్టులు ప్రకటించుకున్నారు. ఫలితాలు వచ్చేసరికి ఐక్య కాంగ్రెసుకు 148 స్థానాలు వచ్చాయి. అందులో కృషికార్ లోక్ పార్టీకి 10, ప్రజాసోషలిస్టులకు 13, ప్రజాపార్టీకి 5, కాంగ్రెస్ కు 119 వచ్చాయి. కమ్యూనిస్టులకు 15 స్థానాలు మాత్రమే లభించాయి. (అంతకు ముందు కమ్యూనిస్టులకు 40 స్థానాలుండేవి.)

తిరుగులేని బలం రావడంతో కాంగ్రెస్ లో ముఠా రాజకీయాలు మళ్ళీ ప్రారంభమైనాయి. లాల్ బహదూర్ శాస్త్రి, దేబర్, దేవకాంత బారువా మధ్యవర్తులుగా ఢిల్లీనుండి దిగారు. ప్రజాపార్టీవారు ప్రకాశాన్ని మళ్ళీ తీసుకు రావాలని చేసిన ప్రయత్నానికి సానుకూలత లభించలేదు. కృషికార్ లోక్ పార్టీవారు గోపాలరెడ్డి పేరును సూచించారు. ఈ లోపల సంజీవరెడ్డి ముఠా చాలా తీవ్ర ప్రయత్నాలలో నిమగ్నమయింది. అల్లూరు సత్యనారాయణరాజు, బ్రహ్మానందరెడ్డి మొదలైనవారంతా సంజీవరెడ్డి కోసం గట్టి ప్రయత్నం చేసారు. తనకు బలం వున్నదని పోటీచేస్తానని సంజీవరెడ్డి అన్నాడు. ఢిల్లీ నుండి ఈ తగవు తీర్చడానికి శ్రీమన్నారాయణను పంపించారు. ఆయన కర్నూలులో రహస్య ఓటింగ్ జరిపించారు. ఓట్ల వివరాలు చెప్పలేదు కానీ గోపారెడ్డికే ఎక్కువ వోట్లు వచ్చాయన్నారు. మోసం జరిగిందని సంజీవరెడ్డికే ఎక్కువ ఓట్లు వచ్చాయని మంతెన వెంకటరాజు, అల్లూరి సత్యనారాయణ రాజు ప్రకటించారు. ఏమైతేనేమి బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రిగా, సంజీవరెడ్డి వుప ముఖ్యమంత్రిగా ఐక్య కాంగ్రెస్ మంత్రివర్గం ఏర్పడింది. ఇందులో తెన్నేటి విశ్వనాథం, ఎ.బి.నాగేశ్వరరావు ప్రజాపార్టీ పక్షాన, లచ్చన్న, నీరుకొండ రామారావు కృషికార్ లోక్ పార్టీ తరఫున, కాంగ్రెసు నుండి కల్లూరి చంద్రమౌళి, కళా వెంకటరావు మంత్రులుగా వున్నారు. స్పీకర్ ఎన్నికలలో సంజీవరెడ్డి ముఠా బ్రహ్మానందరెడ్డిని తమ అభ్యర్థిగా నిలబెట్టాలని ప్రయత్నించి బలం చాలక వెనక్కు తగ్గారు. రొక్కం లక్ష్మీనరసింహందొర స్పీకర్ గా పదవి నలంకరించాడు. ఎం.ఆర్.అప్పారావు ఆ పదవిని ఆశించి తనకు మద్దతునిచ్చేవారు ఎక్కువ మంది లేరని తెలిసి తగ్గాడు. మంత్రివర్గంలోకి కృషికార్ తరఫున ముగ్గురిని స్వీకరించాలని నోటిమాట ఒప్పందంను చెల్లించాలని తమ పార్టీ నుండి ఓబులరెడ్డిని మంత్రిగా స్వీకరించాలని లచ్చన్న మొదలైనవారు పట్టుబట్టారు. సంజీవరెడ్డి ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ పోయాడు. ఈలోగా మంత్రి నీరుకొండ రామారావు గుండెపోటుతో మద్రాసులో మరణించాడు. కొంత జాప్యం అనంతరం ఓబుల రెడ్డికి వ్యవసాయమంత్రి పదవి యిచ్చారు. పదవిని స్వీకరించిన మొదటినాడే ఆయన మాట్లాడుతూ 'మంత్రివర్గంలో నేనైనా వుండాలి. సంజీవరెడ్డి అయినా వుండాలి. ఇద్దరం యమడం' అన్నాడు. 6 నెలల అనంతరం సంజీవరెడ్డి మిగిలాడు.

మధ్యంతర ఎన్నికల అనంతరం ఎవరినీ సంప్రదించకుండానే ఒకరోజు ప్రొద్దున్నే కృషీకార్ లోక్ పార్టీని కాంగ్రెస్ లో కలిపేశాడు రంగా. ఆయన అనుయాయులంతా కిమ్మనకుండా వున్నారు. సంజీవరెడ్డి వర్గం లచ్చన్నపై ఫిర్యాదులు చేస్తూపోయింది. లచ్చన్న కూడా అందుకు అవకాశం యిచ్చాడు. కృష్ణాజిల్లాలో తన భార్య పేరిట, మంత్రిగా వుండగా ఒక కమ్మ భూస్వామి కొంత పొలాన్ని కేటాయించాడు. ఇట్లాంటివన్ని కలిపి అల్లూరి సత్యనారాయణరాజు, మంతెన వెంకటరాజు హైకమాండ్ కు ఫిర్యాదులు చేశారు. రంగాకు, లచ్చన్నకు కూడా అప్పుడే అభిప్రాయ భేదాలు ఏర్పడ్డాయి.

అఖిల భారత స్థాయిలో వచ్చిన ప్రజాసోషలిస్టు పార్టీ ముక్కలైంది. ఆ పార్టీలో తెన్నేటి విశ్వనాథానికి, పి.వి.జి. రాజుకు పడేదికాదు. రాజు వెళ్ళి లోహియా వర్గంలో చేరాడు.



బెజవాడ గోపాలరెడ్డి ముఖ్య మంత్రి కాగనే ఆంధ్ర కాంగ్రెస్ సంఘ అధ్యక్ష పదవికి ఎన్నిక వచ్చింది. సంజీవరెడ్డి వర్గం అల్లూరి సత్యనారాయణ రాజును నిలబెట్టింది. రంగా ప్రత్యర్థిగా నిలబడ్డాడు. ఎన్నిక సమయంలో రంగా విదేశ పర్యటన చేస్తున్నాడు. లచ్చన్న, ఓబుల రెడ్డి రంగాను గెలిపించ డానికి యథాశక్తి ప్రయత్నించారు. కానీ సంజీవరెడ్డి ముందు వారి పప్పులుడకలేదు. గోపాల రెడ్డి గట్టిగా నిలబడి ధైర్యంగా పనిచేయలేక పోయాడు. కళా వెంకటరావు, కల్లూరి చంద్రమౌళి, బ్రహ్మానందరెడ్డి నిర్విరామంగా అన్ని ఎత్తుగడలు ప్రయత్నించి రంగాను ఓడించారు. సంజీవరెడ్డి, గోపాల రెడ్డి ఎన్నికలో పాల్గొనకుండా పెద్దమనుషులుగా నటించారు. కథ అంతా కళా వెంకటరావు నడిపించాడు. బ్రహ్మానందరెడ్డి కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి అయ్యాడు. సంజీవరెడ్డి వర్గం రాజకీయాలలో బాగా నిలదొక్కుకోవడానికి ఆ ఎన్నిక ఆస్కారమైంది. పిడతల రంగారెడ్డి, పెమ్మరాజు వెంకటరావు (అంత వరకు రాడికల్ హ్యూమనిస్టు) సహాయ కార్యదర్శులుగా వున్నారు. ఇంతటితో ఆంధ్ర ఘట్టం ముగిసింది. ముఠా రాజకీయాలలో ఆరితేరిన ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు అక్కడి నుండి హైద్రాబాద్ కు తరల వలసి వచ్చింది.

మధ్యంతర ఎన్నికలలో ఓడిన కారణంగా కమ్యూనిస్టు పార్టీలో తీవ్రమైన చర్చలు జరిగాయి. అభిప్రాయ భేదాలు పొడసూపాయి. ఆ ఎన్నిక ఆంధ్రావారి పతనానికి నాంది అయినది.

ఆంధ్రలో కాంగ్రెస్ ప్రభుత్వాలు సాధించిన వాటిలో తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయ స్థాపన, కృష్ణానదిపై విజయవాడ వద్ద బరాజ్ నిర్మాణం, గుంటూరులో హైకోర్టు ఏర్పాటు, 12 వరకు, చిన్న ప్రాజెక్టులు ఏర్పరచడం పేర్కొనతగినవి.

## కమ్యూనిస్టులకూ తప్పని కులం

కమ్మ + రెడ్లు = కామ్రేడ్లు అని ఒక చతురోక్తి నానుడిగా వున్నది. రాష్ట్రంలో అనుకోకుండా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కమ్మ రెడ్డి కులాలకు దక్కింది. రాయసీమ, తెలంగాణా ప్రాంతాలలో రెడ్డి ప్రాబల్యం వుండగా, కోస్తా ఆంధ్రలో కమ్మ ఆధిపత్యం కమ్యూనిస్టు పార్టీలో స్పష్టంగా వున్నది. ఇటువంటి కులప్రాతిపదికపై పార్టీని విమర్శించడం, విశ్లేషించడం, కమ్యూనిస్టులకు, కనీసం పైకి యిష్టం వుండదు. వాస్తవ దృష్ట్యా వీరు కులాన్ని దాటి ప్రవర్తించలేకపోయారు.

1935 ప్రాంతాలలో కాంగ్రెసు సోషలిస్టు పార్టీలో అంతర్లీనంగా వుంటూ వచ్చిన కమ్యూనిస్టులు 1939 నాటికి ఆంధ్రలో బయటపడ్డారు. కృష్ణాజిల్లా మంగళాపురం నుంచి చండ్ర రాజేశ్వరరావు (కమ్మ), నెల్లూరు నుంచి పుచ్చలపల్లి సుందరయ్య (సుందర రామిరెడ్డి), గుంటూరు జిల్లా నుంచి మాకినేని బసవపున్నయ్య (కమ్మ) పార్టీలో మొదటినుంచీ అగ్రతాంబూలం పుచ్చుకున్నారు. వీరికంటే వెనకాముందూ వచ్చినవారు పార్టీకి, త్యాగం చేసిన వారూ వున్నప్పటికీ, విద్యార్థి నాయకులుగా వీరు పేరు తెచ్చుకొని పార్టీ నిర్మాణానికి మూల స్థంభాలైనారు. రెండవ ప్రపంచ యుద్ధంలో కమ్యూనిస్టులు బయటవుండి, పరిస్థితులను పార్టీకి అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేశారు. అప్పడే వీరు ముగ్గురూ తెలంగాణా ప్రాంతం వెళ్ళి కమ్యూనిస్టు పార్టీ రహస్య కార్యకలాపాలకు బాగాతోడ్పడ్డారు. రావినారాయణ రెడ్డి, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, బద్దం ఎల్లారెడ్డి ప్రభృతులు తెలంగాణాలో నాడు ఆంధ్ర నాయకత్వాన సుశిక్షితులైనారు. నల్గొండ జిల్లా, కృష్ణాజిల్లా యిరుగు పొరుగు జిల్లాలు కావడంతో రహస్య రాకపోకలకు శిబిరాలకు, పోరాటాలకు అనుకూలత ఏర్పడింది. కాంగ్రెసువారు జైళ్ళలోనూ, బయటా ముఠాతగాదాలతో, కులకక్షలతో వుండగా, అభ్యుదయ భావాలుగల కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ యువకులు కమ్యూనిస్టు పార్టీలో చేరి పేదప్రజలను, ముఖ్యంగా హరిజనులను ఆకర్షించగలిగారు. యుద్ధసమయంలో రేషనింగ్‌లో యిచ్చే వస్తువుల సక్రమ పంపిణీ, గిట్టుబాటు ధరలు ఇప్పించడం మొదలైన కార్యక్రమాలు చేపట్టారు. బెనారస్, ఆంధ్ర విశ్వవిద్యాలయాలలో చదివిన చండ్ర రాజేశ్వరరావు, గుంటూరు ఎ.సి. కళాశాలలో చదివిన మాకినేని బసవపున్నయ్య చాలామంది కమ్మ విద్యార్థులను ఆకర్షించగా, చదువు మాని ఉద్యమంలో చేరిన పుచ్చలపల్లి సుందరయ్య రెడ్లను ఉత్తేజపరిచాడు. ఈ విధంగా కమ్యూనిస్టు పార్టీ అభ్యుదయ భావాలుగలవారిని ఆకర్షించింది. కాంగ్రెసు మాత్రం కమ్యూనిస్టు పార్టీని వ్యతిరేకించడంలో వెనకాముందూ చూడలేదు. జైలునుంచి వచ్చిన కాంగ్రెసువారు కోస్తా ఆంధ్రలో – ముఖ్యంగా కృష్ణా, గుంటూరు జిల్లాలలో కమ్యూనిస్టులను ఎదుర్కొన్నారు. కాంగ్రెసుపార్టీ అధ్యక్షుడుగా రంగా, ముఖ్యమంత్రిగా ప్రకాశం, జిల్లా నాయకులుగా కాకాని వెంకటరత్నం, గొట్టిపాటి బ్రహ్మయ్య, చల్లపల్లి రాజా మొదలైనవారు మలబారు పోలీస్ సహాయంతో కమ్యూనిస్టులను అణచాలని ప్రయత్నించారు. దీనివలన మధ్యతరగతి రైతులలోనూ కొంత చీలిక వచ్చింది.

1946లో పరిమిత ఓటింగ్‌తో శాసనసభ ఎన్నికలు జరుగగా, కోస్తా ఆంధ్రలో లేబర్ శాసనసభా సభ్యుడుగా పిల్లలమర్రి వెంకటేశ్వర్లు (బ్రాహ్మణ) ఒక్కడే కమ్యూనిస్టు పార్టీ పక్షాన గెలువగలిగాడు. అప్పటికి కమ్యూనిస్టు పార్టీ 24 స్థానాలలో పోటీ చేసింది. పార్లమెంటరీ ఎన్నికలలో పోటీచేయడం పార్టీకి అదే మొదలు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, మద్రాసులో ఉన్న కాంగ్రెసు మంత్రివర్గం, రాష్ట్ర కాంగ్రెసు వీధుల్లో కొట్టుకోవడం, అవినీతి పనులకు తలపడటం కమ్యూనిస్టు ప్రచారానికి యింకా వూతాన్నిచ్చింది. ప్రజలకు ప్రత్యామ్నాయ ఆర్థిక కార్యక్రమాన్ని యిస్తూ, తెలుగు ప్రజల ఐక్యత, విశాలాంధ్రలో ప్రజారాజ్యం అనే ఆకర్షణీయ నినాదాలను కమ్యూనిస్టులు

ప్రచారంలో పెట్టారు. 1948 నుండి 1951 వరకూ కాంగ్రెసుపై పోరాటాలు జరుపుతూ జైళ్ళలో పడిన కమ్యూనిస్టులు, విడుదల అవుతూనే తొలి సాధారణ ఎన్నికలకు సిద్ధంకాగలిగారు. కాంగ్రెసులో వచ్చిన చీలిక పార్టీల అనైక్యతతోబాటు, కమ్యూనిస్టు పార్టీ ఆవూ, ఐదెకరాలూ యిస్తామనే భూసంస్కరణల ఎర పేదల్ని పార్టీవైపుకు మళ్ళించింది. ఈలోగా కమ్యూనిస్టు పార్టీలో పొరపొచ్చాలు రావడం, కొందరు బయటకు పోవడం తటస్థించినా, దీనివలన పార్టీ అప్పటికి బలహీన పడలేదు. *కమ్యూనిస్టు అగ్రనాయకుల నగ్న సత్యాలు* అనే శీర్షికతో మాజీ కమ్యూనిస్టు చదలవాడ పిచ్చయ్య (కమ్మ) పార్టీలోని ప్రముఖులను వ్యక్తిగతంగా విమర్శిస్తూ వ్రాసిన రాతలు కాంగ్రెసువారికి తోడ్పడ్డాయి. తెలంగాణాలో మాకినేని బసవపున్నయ్య పెత్తనం పట్ల రావి నారాయణ రెడ్డివంటి వారికి నిరసన వున్నప్పటికీ, క్రమశిక్షణ పేరిట బయటపడలేదు. బసవపున్నయ్య ధాటికి తట్టుకోగలిగినవారు పార్టీలో తక్కువ. 'మంగళాపురం రాజకీయాలని' ఆయన చంద్ర రాజేశ్వరరావును విమర్శించే వాడు. గ్రామస్థాయి నుండి ఎదగలేదని భావం. కమ్యూనిస్టు పార్టీ తొలి ఎన్నికల నాటికి సాహిత్యాన్ని బాగా ప్రచారంలో పెట్టింది. శ్రీశ్రీ వంటి కవులు, ఎందరో యువ రచయితలు ఉద్వేగపూరిత గేయాలు, కవితలు, నాటికలు ప్రచురించి ప్రచారానికి తోడ్పడ్డారు. తెలంగాణాలో ఘోరంగా విఫలమైన గెరిల్లా పోరాటం తరువాత ఎన్నికలు వచ్చినా, అప్పటికే, ఆంధ్ర – తెలంగాణాలలో అనేకమంది కమ్యూనిస్టులు ప్రభుత్వ దమనకాండలో చనిపోవడం, సెంటిమెంటల్‌గా కమ్యూనిస్టులు తమ ఎన్నికల ప్రచారానికి వినియోగించుకోగలిగారు. ఆస్తిపరులపైన వీరు చేస్తున్న దాడి పేదవారికి యింపుగావుండి, భూతల స్వర్గాన్ని సృష్టించుకోబోతున్న పార్టీగా కనిపించింది. స్టేజిపై కమ్యూనిస్టుల ఉపన్యాసాలు కూడా ఉద్రూతలూగించేవి.

రాష్ట్ర స్థాయి నుండి చంద్ర రాజేశ్వరరావు, మాకినేని బసవ పున్నయ్య, అఖిల భారత స్థాయికి ఎదిగారు. తెలంగాణా పోరాట సందర్భంగా రష్యా వెళ్ళి స్టాలిన్‌ను రహస్యంగా కలిసిరావడం వలన కమ్యూనిస్టుల దృష్టిలో కమ్మ నాయకుల ప్రతిష్ఠ పెరిగిపోయింది. మక్కాకు వెళ్ళి వచ్చిన ముస్లింను చూచినట్లు వీరిపట్ల కమ్యూనిస్టు కేడర్ వీరారాధన చేసింది. తమ కమ్మ కులాన్ని పార్టీకి చక్కగా వినియోగించుకున్నారు. సిద్ధాంతపరంగా పార్టీలో ఎలాంటి పోరాటాలు జరిగినా యిది వాస్తవం. చైనాలో మావో తరహా పోరాటం కావాలని ఆంధ్ర రైతుల్ని దృష్టిలో పెట్టుకొని చంద్ర రాజేశ్వరరావు నినదించారు.

1952లో ప్రధమ సాధారణ ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి మద్రాసులో ఉన్న ఆంధ్రలోని కమ్యూనిస్టులు 41 స్థానాలు గెలుచుకున్నారు. అందులో 31 స్థానాలు కోస్తా ఆంధ్రలో నెగ్గారు. 61 స్థానాలకు పోటీచేసి, 12,08,656 ఓట్లతో 41 స్థానాలు నెగ్గడంతో మిగిలినవారికి కనువిప్పు అయింది. హరిజనులు పూర్తిగాను రైతులలో కొందరు కమ్యూనిస్టులకు అండగా నిలబడ్డారనేది స్పష్టపడింది.

పార్లమెంటరీ ఎన్నికలలో ఆరితేరిన కాంగ్రెసు వారితో పోటీ పడడమే కమ్యూనిస్టులు చేసిన పెద్ద పొరపాటైంది. ఎత్తుగడలు, వ్యూహాలలో కాంగ్రెసువారు, ఇతర చిల్లర కమ్యూనిస్టేతర పార్టీలు అందెవేసిన చేతులు, ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కమ్యూనిస్టుల్ని అధికారంలోకి రానివ్వకుండా చేయడానికి వారంతా ఏకమయ్యారు.

ఎన్నికలలోనూ, అంతకు ముందూ కమ్యూనిస్టులను తరిమి కొట్టిన ప్రకాశాన్ని మంత్రివర్గం ఏర్పరచమని కమ్యూనిస్టులు కోరారు. ప్రకాశం కూడా అలిసిపోయి వుండి సిద్ధాంతాల గొడవ పట్టించుకొనక, పదవికోసం కక్కుర్తిపడ్డాడు. కాని కాంగ్రెసువారు రాజగోపాలాచారిని రంగంలోకి తెచ్చారు. మద్రాసు గవర్నరు శ్రీ ప్రకాశ్ మంత్రిమండలిని ఏర్పరచవలసిందిగా రాజాజీని అడిగారు. ప్రకాశం నుండి చీలిపోయి కృషికార్ లోక్ పార్టీ పెట్టిన రంగాకు శాసనసభలో కొన్ని స్థానాలున్నాయి. కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా తన బలాన్ని రాజాజీకి మద్దతుగా యివ్వడానికి రంగా అంగీకరించాడు. ఆ విధంగా కమ్యూనిస్టులు, ప్రకాశం దెబ్బతిన్నారు.

1952 అసెంబ్లీ ఎన్నికలలో నెగ్గిన కమ్యూనిస్టు కమ్మ ప్రముఖులలో కొల్లా వెంకయ్య, మోటూరి హనుమంతరావు, వేములపల్లి శ్రీకృష్ణ, కొర్రపాటి పట్టాభిరామయ్య వున్నారు.

కమ్యూనిస్టు నాయకత్వం కమ్మవారి చేతుల్లో వుండటంవల్ల కమ్మ ఓట్లు కమ్యూనిస్టులకు అధికంగా వచ్చాయనడానికి ఆధారాలు లేవు. అందుచేత డెల్టా ప్రాంతంలో కమ్యూనిస్టుల విజయానికి కమ్మ కులస్తుల

సంఖ్యాబలం ఒక్కటే కారణం కానేరదు. Kulaks in Andhra : a case study in Harrison's India, the most dangerous decades. P.P.204 Oxford. 1952 ఎన్నికలలోగాని 1955లో గాని కమ్మ ఓటర్లు కమ్యూనిస్టులకు అత్యధికంగా ఓటు చేశారని నిర్ధారణగా చెప్పడానికి శాస్త్రీయాధారాలేవీ లేవు. జనాభా లెక్కల్లో కులాల ప్రస్తావన 1921 నుండి నిలిపివేసినందున, అంచనాలన్నీ సుమారుగా చేశారు. 1921 జనాభా ఆధారంగా, ఆ దామాషాలో పెరిగిన జనాభాను బట్టి సంఖ్యలు సుమారుగా ఊహించారు.

నాయకులలో చూస్తే కమ్మవారు అన్ని పార్టీలలోనూ వున్నారు. కమ్యూనిస్టులలో చండ్ర రాజేశ్వరరావు మాకినేని బసవపున్నయ్య వుంటే కాంగ్రెసులో ఎన్.జి.రంగా, కాకాని వెంకటరత్నం, ఆలపాటి వెంకటరామయ్య, కల్లూరి చంద్రమౌళి వంటి వారున్నారు. కుటుంబ సంబంధాల వలన, స్నేహితుల వలన కొందరు అనుకూల, ప్రతికూలతలు చూపితే ఓటుకు అది కొలమానం కాజాలదు.

కమ్యూనిస్టుల బలం హరిజనులలో బాగా ప్రబలింది. రైతులలో కాంగ్రెసుకు అనుకూలత వున్నది. రంగా రైతులతో తాదాత్మ్యం చెందగా, కమ్యూనిస్టులు హరిజనులను చైతన్యవంతుల్ని చేశారు. కమ్యూనిస్టు పార్టీ కూలీల పార్టీగా పేరు తెచ్చుకున్నది. చెదురుమదురుగా తప్ప రైతులు బాహాటంగా కమ్యూనిస్టులను బలపరచలేదు. కృష్ణా జిల్లాలోని కాటూరు, ఎలమర్రు వంటి గ్రామాలలో కమ్యూనిస్టులను బలపరుస్తున్నారనే పేరిట రైతుల్ని హింసించినందుకు నిరసన వెల్లడైంది. అయితే రైతులు కుప్పలు వేసుకొంటే రాతిళ్ళు దోచడం, కూలికి రాకుండా కట్టు చేయడం, వురులు కోయడం వంటి కూలీల కార్యక్రమానికి కమ్యూనిస్టు పార్టీ మద్దతు వున్నదని రైతులు భావించకపోలేదు.

అయితే 1955 ఎన్నికల అనంతరం సోషలిస్టు నినాదాలనిచ్చిన కాంగ్రెసు పట్ల కూలీలు ముఖ్యంగా హరిజనులు మొగ్గు చూపారు. కమ్యూనిస్టు పార్టీకి హరిజనులలో ఓట్లు తగ్గాయి. 1962 వచ్చేసరికి కమ్యూనిస్టులు బాగా బలహీనపడ్డారు. స్వతంత్ర పార్టీ రైతుల్ని ఆకర్షించింది.

కుల ప్రాతిపదికగా ఏ రాజకీయ పార్టీ ఏర్పడలేదు. కాని నాయకులు కులాన్ని వాడారు. అభ్యర్థుల ఎంపికలో ఇది స్పష్టపడింది. జనాభాలో పలుకుబడిగల కులానికి సీట్లు ఇవ్వడం ఇందుకు నిదర్శనం. అంతేతప్ప ఏ ఒక్క కులానికీ గెలిచే ఓట్లు అంటూ ఎక్కడా లేవు. అధికారంలో వున్న వారివలన కులానికి ప్రాధాన్యత పెరిగింది.

కమ్యూనిస్టులు సామాజిక రంగంలో చేసిన కృషి గణనీయమైనది. బ్రాహ్మణ పురోహితుల స్థానే పెళ్ళిళ్ళలో సెక్యులర్ పద్ధతి ప్రవేశపెట్టారు. ఈ విధంగా మంత్రతంత్రాలు లేకుండా కమ్యూనిస్టులు దండల మార్పిడిలో ఎన్నో వివాహాలు 1940 నుంచీ చేయిస్తున్నారు.

1955 ఎన్నికల అనంతరం కమ్యూనిస్టు కేడర్‌లో నిరుత్సాహం వచ్చింది. అనేకమంది కమ్మవారు పార్టీనుంచి దూరమై సానుభూతి పరులుగా మిగిలారు. వారు వ్యాపారాలు చేసుకుంటూ కమ్యూనిస్టు పార్టీలకు అప్పుడప్పుడు చందాలివ్వడం వరకే తమ సానుభూతిని పరిమితం చేశారు. మాజీ కమ్యూనిస్టులు, సానుభూతిపరులు వడ్డీ వ్యాపారాలకు సైతం దిగారు.

కాని వాస్తవమేమంటే కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం నాటి నుంచీ నేటి వరకూ కమ్మ, రెడ్డి కులాలకే పరిమతమైంది. పార్టీ రెండుగా చీలిన తరువాత కూడా పరిస్థితి మారలేదు. ప్రముఖ స్థానాలకి వెనుకబడినవారు, హరిజనులు రాకపోవడం గమనార్హం. శాసనసభలో మార్క్సిస్టు పార్టీ నాయకుడుగా వెనుకబడిన కులానికి చెందిన ఎం ఓంకార్ వుండగా 1983లో ఆయన్ను పార్టీ నుంచి తొలగించి రాఘవరెడ్డికి పట్టంగట్టారన్నది కూడా ఈ సందర్భంలో పరిశీలించదగ్గది.

కమ్యూనిస్టు నాయకుల జాబితా చూస్తే వివరాలకు పోకుండానే కమ్మ, రెడ్డి కులాల పెత్తనం అర్థమౌతుంది.

## ప్రముఖ కమ్మ కమ్యూనిస్టు నాయకులు

చంద్ర రాజేశ్వరరావు, పేములపల్లి శ్రీకృష్ణ, కడియాల గోపాలరావు, మద్దుకూరి చంద్రశేఖరరావు, ఎస్.గిరిప్రసాద్, తమ్మారెడ్డి సత్యనారాయణ, వై.వి.కృష్ణారావు, చల్లపల్లి శ్రీనివాసరావు, చలసాని ప్రసాద్, కొల్లా వెంకయ్య, మాదాల నారాయణస్వామి, మోటూరి హనుమంతరావు, లావు బాలగంగాధర రావు, చెన్నుపాటి లక్ష్మయ్య, ప్రభృతులు.

అలాగే రెడ్డి కమ్యూనిస్టులు పుచ్చలపల్లి సుందరయ్య, కొండపల్లి సీతారామయ్య, తరిమెల నాగిరెడ్డి, చండ్ర పుల్లారెడ్డి, నీలం రాజశేఖరరెడ్డి, రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఇంతా రమణారెడ్డి, తరిమెల రామదాసు రెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, బి.నరసింహారెడ్డి, గురువారెడ్డి వగైరా.

పార్టీలలో వున్న మిగిలిన కులాల వారికి ప్రముఖస్థానాలు లభించకపోవడం, అగ్రకులాలకే యివి పరిమితంగావడం కమ్యూనిస్టు పార్టీ కుల పక్షపాతానికి ఒక నిదర్శనమే.

చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా వుండగా మార్క్సిస్టు పార్టీ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య డ్రైనేజి బోర్డు ఛైర్మన్ పదవి పుచ్చుకొనడం అందరినీ ఆశ్చర్యపరచింది. శాసనసభలో కూడా కొందరు సుందరరామిరెడ్డి (సుందరయ్య అసలుపేరు) అని అవహేళన చేసే స్థితి వచ్చింది. తరువాత ఆయన ఏదో వంకతో ఆ పదవిని వదిలించుకోవడానికి పార్టీలో వచ్చిన విమర్శ కారణం అని తెలిసింది. మార్క్సిస్టులు యీ విషయమై బాధపడినా, క్రమశిక్షణ పేరిట దిగమింగుకున్నారు. పార్టీకన్నా కులం బలమైందని ఒక్కొపర్యాయం కమ్యూనిస్టుల్లో సైతం రుజువు కావడం కద్దు.

కమ్యూనిస్టులు కూడా కులాన్ని వదిలించుకోలేక పోయారు

-------

# తెలంగాణా చరిత్ర

ఆంధ్రతో పోలిస్తే తెలంగాణా రాజకీయాలు చాలా ఆలస్యంగా ప్రారంభమైనవనవచ్చు. నైజాం పరిపాలనలో రాజకీయ పార్టీలకుగాని, జాతీయోద్యమాలకు కాని, లిబరల్ విద్యకుగాని, అతివాద వుద్యమాలకు గాని చోటివ్వలేదు. తొమ్మిది జిల్లాలలో వున్న తెలంగాణా తెలుగువారికి బొత్తిగా ప్రాధాన్యత వుండేదికాదు. పరిపాలనంతా వుర్దూలో జరిగేది. వున్నత విద్యాభ్యాసాలకు ముస్లిం విద్యార్థులు అలీగడ్ కు, హిందువులు మదరాసు తదితర ప్రాంతాలకు వెళుతుండేవారు. గ్రామాల పరిస్థితి మరీ అధ్వాన్నంగా వుండేది. వెట్టిచాకిరీ ప్రబలంగా వుండేది. జాగీర్దారీల పెత్తనం భయంకరంగా వుండేది. 1918లో ప్రారంభమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం వుర్దూలోనే బోధన సాగించింది. బ్రిటిష్ వారి అండతో, వారికి కప్పం చెల్లిస్తూ నైజాం తన ఫ్యూడల్ పరిపాలనను కొనసాగించాడు. రాష్ట్రం చుట్టూ వున్న జాతీయోద్యమాల ప్రభావం హైదరాబాద్ సంస్థానంపై పడలేదు. ముస్లింల తరువాత మహారాష్ట్రులు ఎక్కువ ప్రాధాన్యత వహించారు. కన్నడిగులు, తెలుగువారి పరిస్థితి మూడోస్థానంలో వుండేది. కొమర్రాజు లక్ష్మణరావు, రావిచెట్టు రంగారావు 1902లో శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయాన్ని నెలకొల్పారు. తరువాత విజ్ఞాన చంద్రిక గ్రంథమండలి ప్రారంభించారు.

1918లోనే హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ వామన్ నాయక్ అధ్యక్షతన ఏర్పాటైనా నామమాత్రంగానే వుంది. కాంగ్రెస్ మహాసభలలో పాల్గొనడానికి మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామక్రిష్ణారావు, కొండా వెంకట రంగారెడ్డి వెళుతుండేవారు. తొలుత వారి ప్రభావం తెలంగాణాలో ఏమీ వుండేదికాదు. ఆర్య సమాజం వ్యాపిస్తున్నప్పటికీ తెలుగువారిపై దీని ప్రభావం తక్కువ. తెలంగాణాలో తెలుగువారు చాలా అవమానాలకు గురి అయ్యారు. కన్నడ, మరాఠి భాషలకున్న ప్రాముఖ్యత, గౌరవం తెలుగుకు వుండేదికాదు. 1921 నవంబరు 12న హైద్రాబాద్ లోని వివేకవర్ధని పాఠశాలలో జరిగిన హిందూ సంఘ సంస్కరణ సభలో మాడపాటి హనుమంతరావు, ఆలంపల్లి వెంకట రామారావు తెలుగులో మాట్లాడగా అవమానానికి గురి అయ్యారు. అది భరించలేక టేకుమళ్ళ రంగారావు యింట్లో సమావేశమై

శ్యామలరెడ్డి అధ్యక్షతన నిజాం రాష్ట్ర ఆంధ్ర సంఘుస్థాపన గావించారు. మాడపాటి హనుమంతరావు దీనికి కార్యదర్శిగా వున్నాడు. తెలంగాణాలో ఆంధ్రోద్యమానికి యిది నాంది అనవచ్చు. రాజకీయాల జోలికి పోకుండా గ్రంథాలయోద్యమాన్ని ఆసరాగా ఆంధ్రుల సమస్యలను చర్చిస్తుంటే నైజాం ప్రభువుకు అభ్యంతరం లేకపోయింది.

1924లో పింగళి వెంకట రామిరెడ్డి అధ్యక్షతన మధిరలో గ్రంథాలయ మహాసభ జరిగింది. తరువాత సూర్యాపేటలో ద్వితీయ గ్రంథాలయ మహాసభ కదిండి నారాయణరావు ఆధ్వర్యాన జరిగింది. బ్రహ్మ సమాజ్ ప్రభావంతో సూర్యాపేటలోనే గాడేపల్లి సూర్యప్రకాశరావు అధ్యక్షతన సంఘు సంస్కరణ సభకూడా జరిగింది. వీటన్నింటి వలన తెలంగాణా ఆంధ్రులలో ముఖ్యంగా వున్నత, మధ్యతరగతి వారిలో వుత్సాహం కలిగింది. ఆంధ్ర మహాసభ 1930లో ఏర్పాటు చేసుకున్నారు. ఈ సభలతోపాటే మహిళా సభలు కూడా జరిగినవి. నాడు ప్రతిసభకు ప్రభుత్వ అనుమతి ముందుగా పొందాల్సివచ్చేది. ముందుగా ప్రసంగాలన్నీ ప్రభుత్వం సెన్సార్ చేసేది. అందువలన తెలంగాణా ఆంధ్ర మహాసభలలో ఎక్కువగా సంఘు సంస్కరణల గురించి, తెలుగువారి విద్యావకాశాల గురించి మాత్రమే చర్చించేవారు. ఇలాంటి చర్చలకు ప్రోత్సాహం యివ్వడానికి 1925లో సురవరం ప్రతాపరెడ్డి సంపాదకత్వాన ప్రారంభమయిన 'గోల్కొండ' పత్రిక ఎంతో వుపకరించింది.

------

# ఆంధ్రమహాసభల మహోన్నత పాత్ర

తెలంగాణాలో బ్రాహ్మణులు, వైశ్యులు, తరువాత రెడ్లు ఈ వరుస క్రమంలో రాజకీయాలలో చొరవ తీసుకున్నారని చెప్పవచ్చు. తొలి మహాసభ మెదక్ జిల్లా జోగిపేటలో (1930) జరిగినప్పుడు సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించారు. అదే సందర్భంలో ప్రథమ మహిళా మహాసభ కూడా శ్రీమతి నడింపల్లి సుందరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బాల్య వివాహాలు నిషేధించడానికి, వితంతు వివాహాలు అంగీకరించడానికి ప్రభుత్వం తలపెట్టిన శాసనాలను బలపరుస్తూ తీర్మానం చేసారు. వీటిని శేషాచార్యులు, అనంత వెంకటరావు, వెంకటేశ్వరగుప్తా, రావికోటి విరల శాస్త్రి, వెంకట భుజంగశాస్త్రి వ్యతిరేకించారు. అంటరానితనం నిర్మూలించాలంటూ భాగ్యరెడ్డివర్మ అనే హరిజనుడు ప్రవేశపెట్టిన తీర్మానానికి సభలో చాలా నిరసన వచ్చింది. చాలామంది అగ్రకులాలవారు అతను తమతోపాటు కూర్చోవడాన్ని అధిక్షేపించారు. వామన్ నాయక్ జోక్యంతో కొంత సద్దుమణిగింది.

రెండవ ఆంధ్ర మహాసభ బూర్గుల రామక్రిష్ణారావు అధ్యక్షతన దేవరకొండలో జరిగింది. అప్పటికే ప్రభుత్వానికి కొద్దిగా అనుమానంపేసి సభకు అనుమతివ్వడానికి చాలా పేచీలు పెట్టారు. ఈ సభల్లో తీర్మానాలు చేస్తూ సభలు జరుపుకోవడానికి నిషేధాలు వుండకూడదని ప్రతిపాదించారు. బాల్యవివాహాలు నిషేధాన్ని గురించి యిక్కడకూడా పండిత కేశవరావు సమర్థించగా వామన్ నాయక్ వ్యతిరికస్తూ మాట్లాడారు. ప్రభుత్వానికి ఆంధ్ర మహాసభపై అనుమానం హెచ్చింది. ప్రభుత్వం యిలాంటి సమావేశాలకు అనుమతివ్వడం నిరాకరించడంతో మూడవ మహాసభకు రెండేళ్లు పట్టింది. రాజకీయాలతో సంబంధం లేదని ఎంతో హామీలు తీసుకొని కానీ వారు అంగీకరించలేదు. 1934లో పులిజాల రంగారావు అధ్యక్షతన మూడవ ఆంధ్ర మహాసభ జరిగింది. ప్రభుత్వమే కాక సనాతనులు కూడా ఆంధ్రమహాసభకు వ్యతిరేకంగా తీవ్రకృషి చేస్తూ వచ్చారు. చాలా తీర్మానాలను ప్రభుత్వం ప్రవేశపెట్టనివ్వలేదు. ఇక్కడకూడా ఎల్లా ప్రగడ సీతాకుమారి అధ్యక్షతన మహిళాసమావేశం జరిగింది.

1935లో మాడపాటి హనుమంతరావు అధ్యక్షతన కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో 4వ ఆంధ్ర మహాసభ జరిగింది. ప్రభుత్వం దీనికి కూడా కొంతవరకు ఆంక్ష విధించింది. వుత్తరోత్తరా కమ్యూనిస్టులుగా బయటపడిన రావి నారాయణరెడ్డి సమావేశంలో పాల్గొనడం, హరిజన సమస్యలపై ఆరిగ రామస్వామి మాట్లాడటం పేర్కొనదగిన విశేషాలు.

జోగినేపల్లి రాధాబాయి అధ్యక్షతన మహిళాసభకూడా జరిగింది. మరొక వర్ధమాన కమ్యూనిస్టు బద్దం ఎల్లారెడ్డి వ్యాయామ సభల పేరిట ఆ సభలో పాల్గొన్నారు. మొట్టమొదటిసారిగా పాల్గొన్న వారందరు తెలుగులో మాట్లాడి

భాషాభిమానం కూడా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ సభ ప్రాధాన్యతను గుర్తించడం ప్రారంభించింది. మందుముల నరసింగరావు 'రైతు' అనే వారపత్రికను స్థాపించి ఆంధ్రమహాసభకు ప్రోత్సాహం యిచ్చారు.

5వ ఆంధ్ర మహాసభ మహబూబ్ నగర్ జిల్లా షాద్ నగర్ లో కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. తెలంగాణా హద్దులేవో నిర్ణయించాలని తీర్మానించారు.

దేశంలో వస్తున్న మార్పుల దృష్ట్యా హైద్రాబాద్ సంస్థానంలో ప్రభుత్వం కూడా కొన్ని సంస్కరణలు తలపెట్టింది. సంస్కరణల సంఘం ఒకటి ఏర్పాటు చేసింది. ఈ సంఘానికి తెలుగువారి అభిప్రాయాలు చెప్పటానికి మాడపాటి హనుమంతరావు అధ్యక్షతన ప్రజాపరిషత్ ఒకటి ఏర్పాటుచేసింది. కానీ ఈ పరిషత్ ముస్లిం సంస్థ ఇత్తే హాదుల్ ముస్లిమీన్ తో పోటీ పడలేకపోయింది. ఈలోగా తెలంగాణా 6వ మహాసభ నిజామాబాద్ లో జరిగింది. ప్రభుత్వం చిక్కులెక్కువ చేసింది. మందుముల నరసింగరావు దీనికి అధ్యక్షత వహించాడు. భాషా విషయమై తీవ్ర చర్చలు జరిగిగాయి. వి.బి.రాజు, నందగిరి వెంకటరావు ఒక పక్షం వహించగా శ్రీ రావి నారాయణరెడ్డి మరొక పక్షం వహించి తీవ్ర వాదోపవాదాలు చేసుకున్నారు. అభిప్రాయాల స్థాయి పెరిగింది. తెలుగులోనే మాట్లాడాలని వి.బి.రాజు పట్టుబట్టగా ఏ భాషైనా అనుమతించాలని కొండా వెంకట రంగారెడ్డి పక్షం అభిప్రాయపడింది.

1937లో కాంగ్రెసుకు శాఖగా హైద్రాబాద్ స్టేట్ కాంగ్రెసును స్థాపిస్తుండగానే ప్రభుత్వం దానిని అక్రమ సంస్థగా నిషేధించింది. ఇందుకు నిరసనగా రావి నారాయణరెడ్డి, మందుముల నరసింగరావు ప్రభృతులు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ప్రభుత్వ నిరంకుశ ధోరణి చూసి కాబోలు బూర్గుల రామక్రిష్ణారావు వంటివారు వెనక్కు తగ్గారు. 1938 నవంబరులో సత్యాగ్రహం జరగడంతో అనేకమంది జైళ్ళ పాలయ్యారు. అందులో ఆరుట్ల రామచంద్రారెడ్డి, బద్దం ఎల్లారెడ్డి వంటి కమ్యూనిస్టులు కూడా వున్నారు.

అదే సమయంలో ఆర్య సమాజం, హిందూ మహాసభ తెలంగాణాలో వ్యాపించడం మొదలయింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు మొట్టమొదటిసారిగా వందేమాతరం పాడి నైజాం వుత్తరువును ధిక్కరించారు. స్టేట్ కాంగ్రెస్ పేరు మార్చుకుంటే నిషేధం తొలగిస్తామని నైజాం చేసిన సూచన నిరాకరించబడింది. జైళ్ళలో వున్న సత్యాగ్రహులు సంవత్సరం తరువాత విడుదల అయ్యారు. ఈలోగా ఆంధ్రోద్యమంలో విభేదాలు పెరిగిపోయాయి. అప్పుడే నైజాం రాజ్యంలో కమ్యూనిస్టు పార్టీ తలెత్తింది. పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, స్టేట్ లో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, సర్వదేవర భట్ల రామనాథం మొదలైనవారితో సంబంధాలు పెట్టుకుని రహస్యంగా పార్టీని నడిపించారు.

1940లో మల్కాపురంలో మందుముల రామచంద్రరావు అధ్యక్షతన ఆంధ్ర మహాసభ జరిగింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలను బహిష్కరించాలని రావి నారాయణరెడ్డి, కాళోజీ నారాయణరావు, ఎన్.కె.రావు, పోలంపల్లి వెంకటరావు పట్టుబట్టారు. మితవాదులైన కే.వి.రంగారెడ్డి, మాడపాటి హనుమంతరావు, పులిజాల వెంకటరంగారావు సంస్కరణలకు అనుకూలంగా మాట్లాడారు. ఆ సభలో అతివాద, మితవాద ధోరణులు బాగా వ్యక్తమయ్యాయి.

1941లో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన నల్గొండ జిల్లాలోని చిలుకూరు మహాసభ జరిగింది. ఉపన్యాసంలో తీవ్రధోరణి కనిపించింది. ప్రజాదళాలను ఏర్పరచాలని సభ్యత్వం 4 అణాలు మాత్రమే వుండాలని తీర్మానించారు.

1942లో మదరాసు ఆంధ్ర మహాసభ జరిగింది. మితవాదులకూ, కమ్యూనిస్టులకు రెండో ప్రపంచయుద్ధ విషయమై ఘర్షణ జరిగింది. అంతవరకు కమ్యూనిస్టులు పేరు చెప్పుకుని బహిరంగంగా బయటపడలేదు.

1943లో 10వ ఆంధ్రమహాసభ హైద్రాబాద్ లో జరిగింది. కమ్యూనిస్టుల పక్షంలో బద్దం ఎల్లారెడ్డి, మితవాదుల నుండి కె.వి.రంగారెడ్డి పోటీ చేసు కున్నా మితవాదులే నెగ్గారు. అప్పటికీ కమ్యూనిస్టులు బయట పడలేదు.

11వ ఆంధ్ర మహాసభ నల్గొండ జిల్లా భువనగిరిలో జరిగింది. దీనికి అధ్యక్షుడు రావి నారాయణరెడ్డి. అంతవరకు వస్తున్న మితవాద, అతివాద పక్షాలు బయటపడ్డాయి. కమ్యూనిస్టులు 11వ ఆంధ్ర మహాసభను దాదాపు ఆక్రమించుకున్నారనే చెప్పవచ్చును. మితవాదులు దీనిని యించుమించు బహిష్కరించారు. కృష్ణా జిల్లా నుండి కమ్యూనిస్టులు చాలామంది అహ్వానితులుగా వచ్చారు.

నిమ్మగడ్డ సత్యవతి అధ్యక్షతన మహిళాసభ కూడా ఒకటి జరిపారు. ఈ సభలో ఎన్నుకోబడిన కార్యవర్గం కూడా కమ్యూనిస్టులతోను, వారి సానుభూతిపరులతోను నిండి పోయింది. మితవాదుల పక్షాన ఆంధ్ర మహాసభను పేరే పునరుద్ధరించడానికి మందుముల నరసింగరావు, కె.వి.రంగారెడ్డి, బూర్గుల రామక్రిష్ణారావు, మాదిరాజు రామకోటేశ్వరరావు, సి.శ్రీనివాసరావు ప్రయత్నించి 1945లో వరంగల్ దగ్గర మడికొండలో జరుపుకున్నారు.

1946లో జమలాపురం కేశవరావు అధ్యక్షతన మెదక్ జిల్లా కందిలో 13వ ఆంధ్ర మహాసభ జరుపుకున్నారు. కమ్యూనిస్టులు భువనగిరి సభానంతరం ఆంధ్ర మహాసభ పేరిట కాక కమ్యూనిస్టు వుద్యమాన్ని బలపరచడానికే తీవ్రంగా కృషిచేశారు. వీరి ప్రమాదాన్ని గ్రహించిన నైజాం నవాబు 1946 నవంబరులో పార్టీని నిషేధించాడు.

నైజాం ప్రభుత్వం దేశంలో వచ్చిన మార్పుల దృష్ట్యా హైద్రాబాద్ స్టేట్ కాంగ్రెస్ పై నిషేధం తొలగించింది. వెంటనే స్టేట్ కాంగ్రెస్ వారు సత్యాగ్రహ వుద్యమాన్ని చేపట్టారు. కాశిం రజ్వి హైద్రాబాద్ ను ముస్లిం రాజ్యంగా కొనసాగించాలనే ధోరణిలో నిరంకుశ చర్యలు ప్రారంభించాడు. కమ్యూనిస్టులు రహస్యంగా భూస్వాముల బారినుండి రైతు కూలీలను తప్పించి విమోచన కల్గించాలని పోరాటం ప్రారంభించారు. పగలు రజాకార్ల వలన, రాత్రి కమ్యూనిస్టులతోను ప్రజలు విసిగిపోయారు. హైద్రాబాద్ భారత దేశంలో చేరాలా వద్దా అన్న అంశంపై చర్చ ప్రారంభమైంది. చేరకూడదని కాశింరజ్వీ పట్టుపట్టాడు. చేరవలసిందేనని కాంగ్రెసువారు అన్నారు. ఇంతలో హఠాత్తుగా 1948 మే 4న కమ్యూనిస్టు పార్టీపై నైజాం నిషేధం తొలగించడంతో వారి పాత్ర అనుమానాస్పదమైంది. నైజాం భారత దేశంలో చేరకపోయినా ఫరవాలేదనే ధోరణి కమ్యూనిస్టు పార్టీ అవలంభించినట్లు అందుకే నిషేధం తొలగించినట్లు చెప్పుకున్నారు. భారత ప్రభుత్వం సైనిక చర్యతో హైద్రాబాద్ ను వశపరుచుకుని దేశంలో విలీనం చేసింది. అప్పుడు భారత ప్రభుత్వ సైన్యాన్ని ఎదుర్కొన్న కమ్యూనిస్టులు కూడా చాలామంది ఆహుతి అయ్యారు. తాత్కాలికంగా జె.ఎన్.చౌదరి ఆధ్వర్యాన సైనిక పాలన ఏర్పాటు చేశారు. సంవత్సరం తరువాత ఎం.కె.వెల్లోడి ముఖ్యమంత్రిగా 1950 జూన్ 12న మంత్రివర్గం ఏర్పడింది. ఇందులో బూర్గుల రామక్రిష్ణారావు, వి.బి.రాజు కూడా మంత్రులయ్యారు. కె.వి.రంగారెడ్డి డాక్టర్ చెన్నారెడ్డి, అరిగె రామస్వామిని పార్లమెంటుకు నామినేట్ చేశారు.

తెలంగాణాలో సాయుధ పోరాటం గురించి కమ్యూనిస్టులలో తీవ్ర అభిప్రాయ భేదాలు ఏర్పడ్డాయి. ఆంధ్ర నాయకత్వంపై తెలంగాణావారు నిరసన తెలియజేశారు. స్టాలిన్ సలహా తీసుకోవడానికి మాకినేని బసవపున్నయ్య, చంద్ర రాజేశ్వరరావు ప్రభృతులు రహస్యంగా రష్యా వెళ్ళి వచ్చారు. మీ సమస్యలు మీరే పరిష్కరించుకోండని స్టాలిన్ సలహా ఇచ్చాడు. దేశపటం చూసి, మధ్యలో వున్న తెలంగాణాను ఎలా విమోచన గావిస్తారని ఆయన ప్రశ్నించాడు. తెల్లబోయిన అగ్రనాయకులు తిరిగి వచ్చారు.

కమ్యూనిస్టు పార్టీమీద నిషేధం తొలగించకుండానే 1952లో తెలంగాణా సాధారణ ఎన్నికలలో పాల్గొన్నది. ఈ ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీవారు పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంటు పేరుతో పోటీ చేశారు. ముఠా రాజకీయాలు కాంగ్రెసులో బాగా తలెత్తాయి. అప్పటికే స్టేట్ కాంగ్రెసులో రెండు పక్షాలు వుండేవి. రామానందతీర్థ అభ్యుదయ పక్షానికి నాయకత్వం వహించి బూర్గుల రామక్రిష్ణారావు, కె.వి.రంగారెడ్డి నైజాంతో లాలూచీ పడ్డారంటూ వారిని సంస్థ నుంచి తొలగించారు. కేంద్ర కాంగ్రెసు వారు రాజీ పేరుతో ఏదో అతుకు వేశారు. ఆ అతుకు ఎన్నికల సమయంలో బయటపడింది. అంతవరకు రెడ్లతో కలిసివున్న బూర్గుల రామక్రిష్ణారావు రామానందతో చేయికలిపాడు. ఎన్నికల సంఘం తీవ్రవర్గం చేతులలో పడింది. రెడ్ల వర్గం పేచీ పెట్టింది. కేంద్రం మళ్ళీ తాత్కాలికంగా సర్దుబాటు చేసి పంపింది. ఎన్నికల్లో కాంగ్రెసుకు 96 స్థానాలురాగా కమ్యూనిస్టులకు (పి.డి.ఎఫ్.) 39 వచ్చాయి. సోషలిస్టు వర్గానికి 35 సీట్లు లభించాయి. లోక్ సభలో కాంగ్రెసుకు 14 స్థానాలు రాగా పి.డి.ఎఫ్.కు 6 లభించాయి. (మొత్తం హైద్రాబాద్ స్టేట్ కు సంబంధించి).

హైద్రాబాద్ కాంగ్రెసులో అప్పటికి మూడు ముఠాలు ముచ్చటగా పనిచేస్తున్నాయి. రామానంద తీర్థ బూర్గుల రామక్రిష్ణారావు, కె.వి.రెడ్డి ముఖ్యమంత్రి ఎవరుండాలనే కొట్లాటలో కేంద్రం జోక్యం చేసుకుని బూర్గుల రామక్రిష్ణారావుకు పట్టంకట్టింది. ఆయన మంత్రివర్గంలో తెలుగువారుగా కొండా వెంకటరంగారెడ్డి (రెవిన్యూ), డా.మర్రి చెన్నారెడ్డి (వ్యవసాయం), వి.బి.రాజు డిప్యూటీ మంత్రులుగా పి.హనుమంతరావు, ఎం.ఎస్.రాజలింగం, అరిగె రామస్వామి, శ్రీమతి సగం లక్ష్మీబాయి ప్రభృతులు వుండేవారు. అయితే 1952 ఎన్నికల్లోనే జలగం వెంగళరావు, బొమ్మకంటి సత్యనారాయణ,

శీలం సిద్ధారెడ్డి వంటివారు. కాంగ్రెస్ సీట్లురాక ఇండిపెండెంట్‌గా పోటీచేసి ఓడిపోయారు. వీరిని కాంగ్రెసు పార్టీ నుండి ఆరేళ్ళపాటు తొలగించారు. బూర్గుల మంత్రివర్గం సాఫీగా సాగలేదు. ఆయనకు బలం లేదని డి.జి.బిందు ప్రచారం చేయగా ఎలాగైనా బూర్గులను పడగొట్టాలని వి.బి.రాజు, కె.వి.రంగారెడ్డి ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నంలో బూర్గుల నిలద్రొక్కుకోగా వి.బి.రాజుకు మంత్రివర్గం నుండి ఉద్వాసన చెప్పారు. వి.బి.రాజు రాజీనామాను వుపసంహరించే ప్రయత్నం సఫలం కాలేదు.

హైద్రాబాద్ కాంగ్రెసులో కూడా కె.వి.రెడ్డికి పోటీగా నిమ్మగడ్డ సత్యనారాయణ నిలబడ్డారు. అధ్యక్షుడుగా రంగారెడ్డి గెలిచాడు. జె.వి.నరసింగరావు అప్పడే రాజకీయాలలో ప్రవేశించి రెడ్డి వర్గంతో సన్నిహితుడైనాడు. ఈ విధంగా రావు-రెడ్డి ముఠాలతో 1958 వరకు బూర్గుల రామక్రిష్ణారావు మంత్రివర్గం కొనసాగింది. బూర్గుల మంత్రివర్గంలో కౌలుదారీ రక్షణ చట్టం, వ్యవసాయ సంస్కరణ చట్టం తీసుకొచ్చారు. కానీ ఆచరణలో విఫలమైంది. అయితే మొట్టమొదట వినోబాభావే ప్రోత్సాహం వలన వెదిరె రామచంద్రారెడ్డి 100 ఎకరాల భూమి దానం చేసి భూదానోద్యమానికి నాంది పలికాడు. రాష్ట్ర కాంగ్రెసులో సభ్యత్వం చేర్పించడంలో రెండు గ్రూపులు పోటీపడ్డాయి. రెడ్డి గ్రూపుది పై చేయి అయింది. బొమ్మకంటి వంటివారు చేర్పించిన సభ్యత్వాన్ని అగ్గిపాలు చేసారంటారు.

ఈ విధంగా చూస్తే ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడే నాటికి తెలంగాణాలో కూడా రాజకీయ పార్టీలు ముఠాలు, కులతత్త్వాలు బాగా పాతుకు పోయాయి. కానీ ఆంధ్రతో పోల్చి చూస్తే వీటి వయసు తక్కువ. తెలంగాణాలో స్థానిక సంస్థల ఎన్నికలు లేనందువలన ఆ స్థాయిలో కలహాలు విజృంభించలేదు. శాసన సభలలో కూడా వీరి అనుభవం ఆరేళ్ళకే పరిమితమైనది. ఇట్లాంటి పరిస్థితులలో ఆంధ్ర తెలంగాణాలు కలిసిపోవడానికి ఉపక్రమించాయి.

=====

# తొలి భాషా రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్
## మొదటి ముఖ్యమంత్రిగా నీలం సంజీవరెడ్డి

దేశమంతటా భాషారాష్ట్రాలు ఏర్పరచడానికి కేంద్ర ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది. ఆ సంఘం పర్యటన సందర్భంగా విశాలాంధ్ర కావాలని ఆంధ్రాలోని అన్ని పక్షాలవారు కోరారు. తెలంగాణాలో కమ్యూనిస్టులు, కాంగ్రెసులో మాడపాటి హనుమంత రావు, రామానందతీర్థ విశాలాంధ్రను సమర్థించారు. బూర్గుల రామక్రిష్ణా రావు కాలంలోను అంతకు ముందు నైజాం కాలంలోను ఆంధ్రులు తమిళులు చాలామంది హైద్రాబాద్ రాష్ట్రంలో వచ్చి స్థిరపడ్డారు.



1952లోనే కె.వి.రంగారెడ్డి, చెన్నా రెడ్డి ముల్కీ వుద్యమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర పున ర్విభజన సంఘం హైద్రాబాదు వచ్చినప్పుడు బూర్గుల రామక్రిష్ణా రావు, కె.వి.రంగారెడ్డి, ఎం.చెన్నా రెడ్డి, ప్రజాసోషలిస్టు పార్టీ తెలంగాణా కావాలని కోరారు. కేంద్ర నాయకులు గోవిందవల్లభ పంత్, దేబర్ విశాలాంధ్ర ఏర్పడాలన్నారు. కానీ రాష్ట్రాల పునర్విభజన సంఘం మాత్రం తెలంగాణా ఐదేళ్ళపాటు ఏర్పరచి చూచి ప్రజలంగీకరిస్తే శాసనసభలో మూడింట రెండువంతులు ఒప్పుకుంటే అప్పుడు విశాలాంధ్ర చేయాలన్నారు. కేంద్ర నాయకుల ఒత్తిడి వలన బూర్గుల రామక్రిష్ణారావు విశాలాంధ్ర వైపు తిరిగిపోయారు. చివరకు కె.వి.రంగారెడ్డి, చెన్నారెడ్డి వ్యతిరేకిస్తున్నా నెహ్రూ 1956 మార్చి 6న నిజామాబాద్ లో విశాలాంధ్ర ఏర్పాటు ప్రకటించాడు. అంతటితో కె.వి.రంగారెడ్డి, చెన్నారెడ్డి చేయిస్తున్న ఆందోళన కాస్తా తాత్కాలికంగా విరమించుకున్నారు.

బి.వి.గురుమూర్తి, కొండా లక్ష్మణ్, కొత్తూరి సీతయ్య గుప్త, దేవరపల్లి రామానుజరావు, పాగ పుల్లారెడ్డి, బూర్గుల రామకృష్ణారావు విశాలాంధ్రకు నిలబడ్డారు. తెలంగాణా వారికున్న అనుమానం తొలగించడానికి ఆంధ్ర తెలంగాణా నాయకులు గోవింద వల్లభపంత్ ఇంట్లో సమావేశమై పెద్దమనుషుల ఒప్పందం చేసుకున్నారు. దీనిపై బూర్గుల రామక్రిష్ణారావు, కె.వి.రంగారెడ్డి, ఎం. చెన్నారెడ్డి, జె.వి.నరసింగరావు, గౌతు లచ్చన్న, బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, అల్లూరి సత్యనారాయణరాజు సంతకాలు చేశారు. అంతటితో రంగం మళ్ళీ రాష్ట్రానికి మారింది. కొత్త ఆంధ్రప్రదేశ్ కు నాయకులెవరన్న సమస్య వచ్చింది. ఇంతకుముందే ఒకసారి ఓడిపోయిన నీలం సంజీవరెడ్డి ఈసారి జాగ్రత్తపడి ముందుగానే తన అనుచరులతో  చాలా కట్టుదిట్టం చేసుకున్నాడు. బ్రహ్మానందరెడ్డి, అల్లూరి సత్యనారాయణరాజు కర్నూలులో అన్ని ఏర్పాట్లు చేసి సంజీవరెడ్డి పక్షాన కాలికి బలపం కట్టుకు తిరిగారు. చెన్నారెడ్డి రంగాకు అనుకూలంగా బెజవాడ గోపాల రెడ్డిని సమర్థించడానికి పూనుకున్నాడు. సంజీవరెడ్డి స్వయంగా వచ్చి అడిగినా నిరాకరించాడు. బూర్గుల రామక్రిష్ణారావు సంజీవరెడ్డిని బలపరచడానికి నిశ్చయించుకుని ఒకవేళ అతనికి అవకాశం లేకపోతే తనకివ్వమన్నాడు. చెన్నారెడ్డి మామ కె.వి.రంగారెడ్డి తటస్థం వహించి ఉండగా కె.వి.నరసింహారావు చెన్నారెడ్డిని బలపర్చాడు. రంగాను అభ్యర్థిగా నిలబెట్టాలని కృషికార్ లోక్ పార్టీవారు విఫల ప్రయత్నం చేశారు. ఈ ఎన్నిక జరిపించడానికి శ్రీమన్నారాయణ కర్నూలు వచ్చాడు. సంజీవరెడ్డి గోపాలరెడ్డి పోటీలో సంజీవరెడ్డి దిగ్విజయం పొందాడు.

ఐతే అంతకుముందు సంవత్సరం ఐక్య కాంగ్రెస్ పేరిట ఆంధ్రలో ఎన్నికైన కృషికార్ లోక్ పార్టీ, ప్రజాపార్టీలను సంజీవరెడ్డి దూరంగా అట్టపెట్టాడు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా నీలం సంజీవరెడ్డి నల్లేరు మీద బండివలె రాజకీయాన్ని నడిపించాడు. కొండా వెంకట రంగారెడ్డికి ద్వితీయస్థానం యిస్తూ ఉపముఖ్యమంత్రి పదవికి ఉద్వాసన చెప్పాడు. ఆ విధంగా పెద్ద మనుషుల ఒప్పందానికి ముందుగా పంగనామాలు పెట్టింది నీలం సంజీవరెడ్డే. ఆంధ్రలో ఉప ముఖ్యమంత్రిగా చేసిన అనుభవంతో అది కేవలం ఆరోవేలు వంటిదని ఆయన వర్ణించాడు. కృషికార్ లోక్ పార్టీ నుండి అనగాని భగవంతరావును చీలదీసి అతనికి మంత్రి పదవి ఇచ్చి తనవైపుకు తిప్పుకున్నాడు. సంజీవరెడ్డి తనతో పోటీ చేసి ఓడిపోయిన గోపాల రెడ్డిని ...పెద్దన్న...గా చిత్రించి మంత్రి వర్గంలోకి ఆహ్వానించాడు. గోపాలరెడ్డి పదవి చూడగానే అరమరికలు లేకుండా సంజీవరెడ్డితో చేరిపోయాడు. బూర్గుల రామకృష్ణారావు కేరళ గవర్నరుగా వెళ్ళిపోయాడు. సంజీవరెడ్డి మంత్రివర్గంలో కళా వెంకటరావు, వి.బి.రాజు, జె.వి.నరసింగారావు, దామోదరం సంజీవయ్య, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, ఎస్.బి.పి. పట్టాభిరామారావు, జి. వెంకటరెడ్డి నాయుడు, మెహిదీ నవాబ్ జంగ్, మందుముల నరసింగరావు ఉన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన ఒక సంవత్సరంలోనే మళ్ళీ సాధారణ ఎన్నికలొచ్చాయి. ఆంధ్రలో అంతకు ముందే ఎన్నికలు జరిగాయి. కావున తెలంగాణాలోనే  ఈ సాధారణ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అనంతరం సంజీవరెడ్డి తిరిగి నాయకుడుగా ఎన్నికయ్యాడు. చెన్నారెడ్డి లచ్చన్నలకు మంత్రి పదవి లభించలేదు. వారు సంజీవరెడ్డిపై దుమ్మెత్తి పోస్తూ విమర్శలు చేశారు. అల్లూరి సత్యనారాయణ రాజు, బ్రహ్మానందరెడ్డి సంజీవరెడ్డికి మద్దతుగా నిలబడి వీరి ప్రచారాన్ని ఎదుర్కొన్నారు. పార్టీలో జరుగుతున్న, ఈ అంతర్యుద్ధం ఎప్పటికప్పుడు ఢిల్లీలో తెలుస్తూనే ఉన్నది. మంతెన వెంకటరాజు లచ్చన్నపై హైకమాండుకు ఫిర్యాదు చేసాడు. హైకమాండ్ లచ్చన్నను సంజాయిషీ కోరింది. లోక్ సభ డెప్యూటీ స్పీకర్ హుకుంసింగ్ ద్వారా లచ్చన్నపై విచారణ జరిపించారు. కానీ హైకమాండ్ ఆ నివేదిక బయటపెట్టలేదు.

సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా విజృంభించి తన స్థితి బాగా కట్టుదిట్టం చేసుకోవాలని ప్రయత్నాలు చేశాడు. ఆంధ్ర తెలంగాణా కాంగ్రెస్ సంఘాలను కలిపివేసి తన సన్నిహితుడైన అల్లూరి సత్యనారాయణ రాజును అధ్యక్షుని చేశాడు. రైతు సంఘాలలో రంగా ప్రభావంను దెబ్బతీయడానికి ఆయన మాజీ శిష్యుడైన తిమ్మారెడ్డితోను శ్రీకాకుళం నుంచి లుకలాపు లక్ష్మణదాసుతోను రైతు సంఘాన్ని ఏర్పాటు చేయించాడు. వెనుకబడిన తరగతులలో కూడా లచ్చన్న ప్రభావం లేకుండా ప్రగడ కోటయ్య కార్యదర్శిగా కూడా ఒక సంఘాన్ని పెట్టారు. టి.లక్ష్మయ్య అనే వ్యక్తిని అధ్యక్షునిగా తీసుకొచ్చారు. అది సరిగా పని చేయకపోయేసరికి లచ్చన్న మళ్ళీ ఆ సంస్థను ఆక్రమించాడు. వెంటనే సంజీవరెడ్డి వర్గం డా.లక్ష్మీ నరసయ్య సహాయంతో కె.వి.కేశవులు కార్యదర్శిగా, బొజ్జం నరసింహులు అధ్యక్షునిగా పోటీ సంఘం పెట్టారు. 1958లో బెజవాడ గోపాలరెడ్డిని నెహ్రూ తన మంత్రి వర్గంలో తీసుకొనడం వలన ఆ ఖాళీలో తనకు అత్యంత సన్నిహితుడుగా ఆనాడు వున్న బ్రహ్మానందరెడ్డిని ఆర్థిక మంత్రిగా సంజీవరెడ్డి నియమించాడు. 1958లో ఆంధ్రప్రదేశ్ కు శాసనమండలి కూడా ఏర్పడినది. దీని వలన పదవులు లేని, ఓడిపోయిన అనేక మందికి సంజీవరెడ్డి రాజకీయ

పునరావాసం కల్పించినట్లయింది. 1955 ఎన్నికలలో కాంగ్రెసుతో పోటీచేసి ఓడిపోయి పార్టీనుండి సస్పెండ్ అయిన శ్రీకాకుళం జిల్లా ప్రముఖుడు బెండి కూర్మన్నను శాసనమండలికి నీలం సంజీవరెడ్డి తెచ్చాడు.

1958లో పంచాయతీరాజ్ వ్యవస్థ ననుసరించి జిల్లాపరిషత్ లు, సమితులు, పంచాయితీలు ఏర్పడ్డాయి. అదే సంవత్సరం తెలంగాణా ప్రాంతీయ సంఘం కూడా చట్టబద్ధంగా ఏర్పడింది. దీనికి అధ్యక్షుడు ఎవరుండాలని తెలంగాణా వాదులకు, రాష్ట్ర సమైక్యతా వాదులకు భేదాభిప్రాయాలు వచ్చాయి. కె. అచ్యుత రెడ్డి, బి.వి. గురుమూర్తుల మధ్య పోటీ జరగగా అచ్చుత రెడ్డికే బలమున్నట్లు తేలింది. తరువాత అధికార పూర్వకంగా పోటీ జరుగగా కమ్యూనిస్టు నాయకుడు రావి నారాయణరెడ్డి కూడా పోటీచేశాడు. అచ్యుతరెడ్డికి 68 ఓట్లు రాగా రావినారాయణ రెడ్డికి 28 ఓట్లు వచ్చి ఓడిపోయాడు. సంజీవరెడ్డి తనకు అనుకూలుడైన జలగం వెంగళరావును చేంబర్ ఆఫ్ పంచాయతీరాజ్ కు అధ్యక్షుడిగా తీసుకొచ్చారు. 1957 ఏప్రిల్ లో రాజ్య సభ ఎన్నికలు జరుగగా లచ్చన్న కాంగ్రెస్ అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటు చేశాడని సంజీవరెడ్డి వర్గం ఆరోపించింది. సంజీవరెడ్డి వ్యతిరేక వర్గం వారంతా గోపాలరావు ఎగ్బోటె ఇంట్లో సమావేశమవు తుండేవారు. వారిలో చెన్నారెడ్డి, లచ్చన్న, పాగపుల్లారెడ్డి, బొమ్మకంటి సత్యనారాయణ ఉన్నారు. 1958 ఫిబ్రవరి శాసనసభ కాంగ్రెస్ సభ్యుల సమావేశంలో డా.చెన్నారెడ్డి, ఎం.ఎస్. రామలింగం, బొమ్మకంటి సత్యనారాయణ, లచ్చన్న తీవ్ర విమర్శలు చేస్తూ మాట్లాడారు. ఈ అసంతృప్తి వర్గానికి మంత్రి పదవులిమ్మని నాటి కాంగ్రెస్ అధ్యక్షుడు దేబర్ ముఖ్యమంత్రి సంజీవరెడ్డికి సలహా ఇచ్చాడు.

ఈలోగా అంతవరకు ఆప్తులనుకున్న అల్లూరి సత్యనారాయణరాజు, సంజీవరెడ్డి మధ్య తీవ్ర అభిప్రాయ భేదాలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న అల్లూరి సత్యనారాయణ రాజును కేంద్ర కాంగ్రెస్ కార్యదర్శిగా సంజీవరెడ్డి సిఫారసు చేసి పంపించాడు. అప్పటి నుండి సత్యనారాయణరాజు సంజీవరెడ్డికి శత్రువైనాడు. ఆ సంవత్సరం కలకత్తాలో అఖిల భారత కాంగ్రెస్ సంఘ సమావేశం జరిగింది. లచ్చన్న, చెన్నారెడ్డి కూడా సంజీవరెడ్డిపై ఫిర్యాదులు చెప్పారు. చెన్నారెడ్డికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ సంజాయిషీ నోటీసు యిచ్చింది. అంతటితో ఆయన కాంగ్రెసుతో తెగతెంపులు చేసుకోవాలనుకున్నాడు. తెగిందాకా లాగవద్దని హుమయూన్ కబీర్ చెప్పి చూసినా సంజీవరెడ్డి వినలేదు. చెన్నారెడ్డి బొమ్మకంటి సత్యనారాయణ, టి. హయగ్రీవాచారి తెలంగాణాలో కాంగ్రెస్ నుండి బయటపడ్డారు. లచ్చన్న కృషీకార్ లోక్ పార్టీలో కొందరు, కాకాని వెంకటరత్నం, కందుల ఓబుల రెడ్డి ఆంధ్రలో కాంగ్రెస్ నుండి బయటకు పోయారు. కృష్ణా జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుండి కాకాని వెంకటరత్నంను తొలగించి తనకనుకూలుడైన గొట్టిపాటి బ్రహ్మయ్యను ఆ పదవిలో పెట్టాడు. ఈ కారణంగా కాకాని ఎదురుతిరిగాడు. అసెంబ్లీలో బి.వి.సుబ్బారెడ్డిపైన ఆరోపణలు చేయడంతో ఆయన ఎదురు తిరిగి సంజీవరెడ్డిపై విరుచుకు పడ్డాడు. అసెంబ్లీలో అట్లా కాంగ్రెస్ కు ఎదురు తిరిగిన వారంతా నేషనల్ డెమోక్రాట్స్ అనే పేరుతో వ్యవహరిచారు.

అల్లూరి సత్యనారాయణ రాజును కేంద్రానికి పంపించిన సంజీవరెడ్డి పిడతల రంగారెడ్డిని ఆస్థానంలో ప్రవేశపెట్టాడు. అతడు పదవి స్వీకరించగానే లచ్చన్నలాంటి వారికి సంజాయిషీ నోటీసులు జారీచేసాడు. ఈ విధంగా ముఠా తగాదాలతో కాంగ్రెస్ పార్టీ కొట్టు మిట్టాడింది. ఉస్మానియా యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్ గా డి.ఎస్. రెడ్డిని సంజీవరెడ్డి తీసుకు రావడంతో ఆంధ్రులు వద్దంటూ చెన్నారెడ్డి ఆందోళన చేయించాడు. ఆ సంవత్సరం రాజకీయపు ఎత్తుగడలలో చాణుక్యుడిగా పేరు పొందిన కళా వెంకటరావు చనిపోయాడు. కాంగ్రెసు నుండి ఇట్లా కొందరు బైటకు రావడంతో ఆ లోపం తీర్చడానికి సోషలిస్టులను కొందరిని కాంగ్రెసులోకి సంజీవరెడ్డి అహ్వానించాడు. కోదాటి రాజమల్లు లాంటివారు అప్పుడు చేరినవారే. తెన్నేటి విశ్వనాథం తిరిగి ప్రజాపార్టీని నెలకొల్పాడు.

కొత్తగా ఏర్పడిన పంచాయతీరాజ్ వ్యవస్థను సంజీవరెడ్డి తన ముఠా రాజకీయాలకు బాగా వాడుకున్నాడు. కృష్ణాజిల్లా చల్లపల్లి రాజా, కాకాని వెంకటరత్నాన్ని ఓడించి సంజీవరెడ్డి మనిషిగా గెలుపొందాడు. ఖమ్మం జిల్లాలో జలగం వెంగళరావు జిల్లాపరిషత్ అధ్యక్షుడుగా గెలుపొందడం కూడా సంజీవరెడ్డికింకా బలాన్ని చేకూర్చింది. ఈ పంచాయతీ రాజ్ వ్యవస్థ రాష్ట్ర కాంగ్రెసు నాయకత్వాన్ని కట్టుదిట్టం చేసుకోవడానికి సహకరించింది. ముఠాలు, కులాలు స్వైర విహారంచేశాయి.

నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా బస్సుల జాతీయీకరణ పాఠ్యగ్రంథాల జాతీయీకరణ జరిపాడు. తెలంగాణాలో అప్పటికే బస్సుల జాతీయీకరణ జరిగి ఉండటం వలన ఆంధ్రలో అంచల వారీగా, ముందు కృష్ణా,

గుంటూరు జిల్లాలలో జాతీయాకరణ ప్రారంభించారు. బస్సుల యజమానులు హైకోర్టు వరకూపోయి జాతీయాకరణను ఆపలేకపోయారు. అయితే నాటి మంత్రి పట్టాభిరామారావుపై హైకోర్టు చేసిన వ్యాఖ్యతో వారు తృప్తి పడ్డారు. పాఠ్య గ్రంథాల జాతీయాకరణ కూడా ఆశయాలకంటే పబ్లిషర్స్ తో వచ్చిన కలహాలే కారణమని తెరవెనుక గాథ తెలిసినవారు భావించారు. రాష్ట్రంలో తన పరిపాలనలో నీలం సంజీవరెడ్డి మంత్రుల్ని ఉద్యోగస్తుల్ని గడగడలాడించాడు. వి.బి.రాజు ఎన్నికల పిటీషన్ పై ఆరేళ్ళ వరకు అనర్హుడుగా కోర్టు నిర్ణయించింది.

------

## మంత్రి మండలి

ముఖ్యమంత్రి – ఎన్. **సంజీవ రెడ్డి**

1-11-1956 నుంచి 16-04-1957

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | ఎన్. సంజీవ రెడ్డి | కార్యనిర్వాహక, సమాచార, ప్రణాళిక మరియు రవాణా |
| 2. | కె. వి. రంగారెడ్డి | భూమి పన్ను |
| 3. | కళా వెంకట రావు | ఆర్థిక మరియు భూ సంస్కరణలశాఖ |
| 4. | బి. గోపాల రెడ్డి | గృహ నిర్మాణ శాఖ |
| 5. | వి. బి. రాజు | వాణిజ్య, పరిశ్రమల మరియు శ్రామిక శాఖ |
| 6. | పి. తిమ్మారెడ్డి | వ్యవసాయ మరియు అటవిశాఖ |
| 7. | జి. వెంకట రెడ్డి నాయుడు | న్యాయ శాఖ |
| 8. | జె. వి. నర్సింగరావు | విద్యుత్తు మరియు భారీ నీటీపారుదల శాఖ |
| 9. | ఎస్.బి.పి. పట్టాభి రామారావు | విద్యాశాఖ |
| 10. | డి. సంజీవయ్య | సహకార శాఖ |
| 11. | ఎమ్. నర్సింగరావు | నిర్మాణ, హైవే, పన్నులు మరియు ప్రొహిబిషన్ |
| 12. | మెహదీ నవాజ్ జంగ్ | ఆరోగ్య శాఖ |
| 13. | కె. బ్రహ్మానంద రెడ్డి | అంతర్గత కార్యనిర్వాహక శాఖ |

## ముఖ్యమంత్రి – ఎన్. సంజీవ రెడ్డి

17-04-1957 నుంచి 10-01-1960

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | ఎన్. సంజీవ రెడ్డి | సామాన్య కార్యనిర్వాహక, పరిశ్రమల, వాణిజ్య, ఆరోగ్య, సమాచార, ప్రణాళిక మరియు రవాణా |
| 2. | కె. వి. రంగారెడ్డి | గృహ నిర్మాణ శాఖ |
| 3. | బి. గోపాల రెడ్డి | ఆర్థిక శాఖ |
| 4. | కళా వెంకట రావు | భూమి పన్ను మరియు భూసంస్కరణ శాఖ |
| 5. | జె. వి. నర్సింగరావు | భారీ నీటిపారుదల మరియు విద్యుత్తు |
| 6. | పి. తిమ్మారెడ్డి | వ్యవసాయ మరియు అటవి శాఖ |
| 7. | వి. బి. రాజు | ప్రణాళి మరియు పబ్లిక్ వర్క్స్ |
| 8. | ఎస్.బి.పి. పట్టాభిరామారావు | విద్యాశాఖ |
| 9. | ఎమ్. నర్సింగరావు | గృహనిర్మాణ మరియు హైవేస్ |
| 10. | కె. బ్రహ్మానంద రెడ్డి | అంతర్గత కార్యనిర్వాహక శాఖ |
| 11. | డి. సంజీవయ్య | సాంఘిక సంక్షేమ మరియు శ్రామిక శాఖ |
| 12. | జి. వెంకట రెడ్డి నాయుడు | న్యాయ శాఖ |
| 13. | మెహది నవాజ్ జంగ్ | సహకార శాఖ |
| 14. | ఎ. భగవంత రావు | దేవాదాయ, చిన్న తరహా మరియు గృహపరిశ్రమ శాఖ |

-------

# పుట్టి గిట్టిన సోషలిస్ట్ డెమోక్రటిక్ పార్టీ

సంజీవరెడ్డితో పోరాటంలో విఫలమైన దరిమిలా చెన్నారెడ్డి, లచ్చన్న మంతనాలు జరిపి వేరే పార్టీ పెట్టాలని నిర్ణయించారు. సోషలిస్టులలో పి.వి.జి.రాజు, ఎ.చక్రధర్, జి.సి.కొండయ్య, ఎస్.బి.గిరి కలిసి చర్చలు చేసి ఒక్క పార్టీగా ఏర్పడాలని నిర్ణయించుకున్నారు. కాకాని వెంకటరత్నం వచ్చి చేరాడు. నన్నపనేని వెంకట్రావు, జాగర్లమూడి చంద్రమౌళి, కందుల ఓబులరెడ్డి కూడా ఇందులో కలిసారు. వీళ్ళందరూ కాంగ్రెసు నుండి బైటపడుతున్న రోజులలో అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఇందిరా గాంధీ ఉన్నది. తన అనుచరులైన లచ్చన్న, ఓబుల రెడ్డి తనకు చెప్పకుండా పార్టీనుండి బైటకు పోవడం పట్ల రంగా ఆగ్రహం వెలిబుచ్చాడు. వరంగల్లులో ఏర్పాటైన డెమోక్రాటిక్ పార్టీ తెనాలి పయనించి సోషలిస్టు డెమోక్రాటిక్ పార్టీ అయింది. 1959 మే నెలలో ఈ పార్టీ మహాసభ తెనాలిలో జరిగింది. ఎవరి గ్రూపులు వారట్టిపెట్టుకుని కొత్త పార్టీ ఏర్పడినట్లు ప్రకటించారు.

తెనాలిలో చెన్నారెడ్డి గంభీరోపన్యాసం చేస్తూ నీలం సంజీవరెడ్డి నాయకత్వాన కాంగ్రెసులో నియంతృత్వం ఏర్పడినదని, అలాంటి కాంగ్రెసులో చేరేకన్నా కృష్ణానదిలో పడి చావడం నయమని వ్యాఖ్యానించాడు. కమ్మవారినందరినీ కూడగట్టి కొత్త పార్టీలో చేర్చాలని కాకాని వెంకటరత్నం విశ్వప్రయత్నం చేసాడు. రంగా, కొత్త రఘురామయ్య, చల్లపల్లి రాజా, ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ వుత్తరోత్తరా చేతులు కలుపుతామని చెప్పారేకాని ముందుకు రాలేదు.

కృష్ణా జిల్లాపరిషత్ అధ్యక్ష స్థానానికి కాకానిని ఓడించాలని సంజీవరెడ్డి పట్టుదల వహించాడు. ఓటర్లందరికి ఫోను చేయడం, వ్యక్తిగతంగా చెప్పడం, మంత్రి పట్టాభిరామారావును స్వయంగా పంపించి కృష్ణా జిల్లాలో మకాం వేయించడం జరిగింది. తన భూములు ప్రభుత్వం ఎక్కడ లాక్కుంటుందోనని భయపడిన చల్లపల్లి రాజా సంజీవరెడ్డి అభ్యర్థిగా నిలబడి కాకానిని ఓడించడానికి తోడ్పడ్డాడు. జిల్లాపరిషత్ లో అధ్యక్షస్థానం మినహా అంతా కాకాని వశమైంది.

సంజీవరెడ్డి సోషలిస్టు డెమోక్రటిక్ పార్టీని బద్దలు కొట్టే ప్రయత్నంలో పి.వి.జి.రాజుకు మంత్రిపదవి ఆశచూపాడు. ఆయన సోషలిజానికి తిలోదకాలు ఇచ్చి సంజీవరెడ్డితో చేరిపోయాడు. సోషలిస్ట్ డెమోక్రటిక్ పార్టీ కనీసం ఆఫీసు తెరవకమునుపే అంతమయింది.



1959లో దేశవ్యాప్తంగా కాంగ్రెసు పార్టీలో వచ్చిన వ్యతిరేకత వలన స్వతంత్ర పార్టీ పుట్టింది. రంగా ఆ పార్టీకి అధ్యక్షుడైనాడు. సోషలిస్టు డెమోక్రటిక్ పార్టీ వారందరిని స్వతంత్రలో చేరమన్నారు. సోషలిస్టులు ఏలాగు తప్పుకున్నారు. కనుక మిగిలినవారిలో కాకాని వంటి వారిని మినహాయిస్తే చెన్నారెడ్డి, లచ్చన్న మొదలైనవారంతా స్వతంత్ర పార్టీలో చేరిపోయారు. ఐతే స్వతంత్ర పార్టీకి పురిటిలోనే సంధికొట్టింది. రంగా తనకనుకూలుడు, నమ్మినబంటు అయన గొర్రెపాటి వేంకట సుబ్బయ్యను రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా చేసాడు. రిటైరైన జిల్లాజడ్జి తేళ్ళ కృష్ణమ్మను కార్యదర్శిగా చేసాడు. నిరుత్సాహపడిన లచ్చన్న వుదాసీనత వహించాడు. చెన్నారెడ్డి వేరే అవకాశం కోసం ఎదురు చూసాడు. అలాంటి సమయంలో ఇందిరాగాంధీ అనంతరం నీలం సంజీవరెడ్డిని కాంగ్రెసు అధ్యక్షునిగా నియమించారు. సంజీవరెడ్డి అంటే 1951 నుండే నెహ్రూకు అభిమానముండేది. పురుషోత్తమదాస్ టాండన్, నెహ్రూకు కాంగ్రెస్ అధ్యక్షపదవికి జరిగిన పోటీలో సంజీవరెడ్డి నెహ్రూను సమర్థించాడు. అప్పటినుండి పెరిగిన అభిమానంతో కాంగ్రెస్ అధ్యక్షపదవి సంజీవరెడ్డికి కట్టబెట్టారు. మళ్ళీ రాష్ట్ర రాజకీయాలలో మార్పులు వచ్చాయి. సంజీవరెడ్డి వ్యతిరేక వర్గాలన్నీ కాంగ్రెసులోకి రావడానికి ప్రయత్నించాయి. ఎవరు ముఖ్యమంత్రిగా వుండాలనే సమస్యవచ్చింది. బ్రహ్మానందరెడ్డిని చేయాలని సంజీవరెడ్డి ఆశించాడు. అల్లూరి సత్యనారాయణ రాజు తాను పోటీ చేస్తానని ప్రకటించాడు. అయితే అతనికి తగినంత బలం సమకూరలేదు. బ్రహ్మానందరెడ్డి అభ్యర్థిత్వానికి మాత్రం సుముఖత రాలేదు. మధ్యవర్తి అభ్యర్థిగా దామోదరం సంజీవయ్యను నిర్ణయించారు. త్వరలో మళ్ళీ రాష్ట్రానికి రాదలచిన సంజీవరెడ్డి రాష్ట్రంపై ఒక కన్ను వేసే ఉంచాడు. 1960 జనవరి 10న దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రి అయ్యారు.

-------

# ప్రథమ దళిత ముఖ్యమంత్రి

## దామోదరం సంజీవయ్య

సంజీవరెడ్డి ఢిల్లీ పోగానే అతని వ్యతిరేక వర్గాలన్నీ సంజీవయ్యకు అనుకూలమైనాయి. స్వతంత్ర పార్టీ నుండి చెన్నారెడ్డి కాంగ్రెసులో చేరాడు. సంజీవయ్య మంత్రవర్గం అన్ని ముఠాలకు ప్రాతినిధ్యం వహించింది. పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం కొండా వెంకటరంగారెడ్డికి ఉప ముఖ్యమంత్రి పదవి యిచ్చారు. అయితే తన ఆటలు సాగలేవని రంగారెడ్డి త్వరలోనే తెలుసుకున్నాడు. సంజీవయ్యను బలపరచిన అల్లూరి సత్యనారాయణ రాజుకు మంత్రి పదవి

లభించింది. అయన ఐక్యసమితి పేరిట కాంగ్రెసులో ముఠాలు కట్టడం ప్రారంభించాడు. నెల్లూరు జిల్లాలో ఒక ముఠాకు నాయకుడైన ఎ సి సుబ్బారెడ్డి సంజీవరెడ్డికి వ్యతిరేకిగా మంత్రివర్గంలో చేరాడు. కానీ అచిర కాలంలోనే ఆయన చేయబోయిన కర్ర పెత్తనానికి చోటు లేదని తెలుసుకున్నాడు. కులం పేరుతో దూషించుకునే వరకు సంజీవయ్య దుమ్మెత్తి పోశాడు. బ్రహ్మానందరెడ్డి ఆర్థిక మంత్రిగా సంజీవరెడ్డి వారసుడుగా మంత్రివర్గంలో కొనసాగుతూ ముఠారాజకీయాలు నడిపాడు. పి.వి.జి.రాజు కూడా సంజీవయ్య మంత్రి వర్గంలో కొనసాగాడు. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న పిడతల రంగారెడ్డి స్థానిక స్వపరిపాలన మంత్రి అయ్యాడు. వీరుకాక కల్లూరి చంద్రమౌళి, ముళ్లపూడి పళ్ళంరాజు, మందుముల నరసింగరావు, శ్రీమతి మసుమాబేగం, నూకల రామచంద్రారెడ్డి మంత్రులుగా వున్నారు. కల్లూరి చంద్రమౌళి దేవాదాయ శాఖామంత్రిగా అధికార బలాన్ని చూసి డబ్బు వసూలు చేసి, జీర్ణదేవాలయాలను పునరుద్ధరించడం ధ్యేయంగా పెట్టుకున్నాడు. సంజీవయ్య హయాంలో అధ్యక్షుడుగా నూకల సర్వోత్తమ రెడ్డి అయ్యాడు. ఆయన్ని దించే వరకు సంజీవరెడ్డి నిద్రపోలేదు. ముళ్ళపూడి పళ్ళంరాజుని కాంగ్రెసు అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

సంజీవయ్య పాలనకు సంబంధించిన ఉత్తరువు అత్యంత ప్రధానంగా పేర్కొనతగినది. శతాబ్దాలుగా అన్యాయాలకు గురైన హరిజనులకు ఇంకా వెనుకబడి ఉన్న గిరిజనులకు కేటాయించబడిన ఉద్యోగాలలో తగిన అభ్యర్ధులు దొరకనప్పుడు అలాంటివారు లభించే వరకు ఆ స్థానాన్ని అట్టిపెట్టాలని ఆ ఉత్తర్వు సారాంశం. అగ్రకులాలవారు అది అదనుగా తీసుకొని తీవ్ర విమర్శలు చేయడం మొదలు పెట్టారు. వెనుకబడిన కులాల జాబితాలో రాయలసీమ శెట్టి బలిజలు, సర్కారు తెలగాలు, తెలంగాణా కాపులు చేర్చబడ్డారు. సంజీవయ్య మంత్రి వర్గంలో ఉన్న పళ్ళంరాజును దృష్టిలో పెట్టుకుని అతని కుమారునికి ఐ.ఎ.ఎస్. ప్రమోషన్ ఇప్పించడానికి ఈ మార్పు చేసాడని విమర్శ వచ్చింది. హైకోర్టులో ఈ జాబితా అంతా పనికి రాదన్నారు. వెనుకబడిన వర్గాల వారు ఆందోళన ప్రారంభించారు.

1962 సాధారణ ఎన్నికలకు అభ్యర్ధులను నిర్ణయించే నిమిత్తం సంజీవయ్యఅల్లూరి సత్యనారాయణ రాజు వర్గం వారు ఒక సంఘాన్ని ఏర్పరిచారు. ఇది పాక్షికంగా ఉందంటూ ఎ.సి.సుబ్బారెడ్డి కేంద్రానికి ఫిర్యాదు చేశాడు. అక్కడ సంజీవరెడ్డి కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉంటూ నిష్పాక్షికంగా వ్యవహరించానని చూపడానికి ఫిర్యాదు పండిట్ పంత్ కు పంపాడు. పండిట్ పంత్ ఆ ఎన్నికల సంఘాన్ని రద్దు చేసారు. మళ్ళీ ఎన్నిక సంఘం ఏర్పాటు చేయగా బ్రహ్మానందరెడ్డికి పట్టు చిక్కింది. ఎన్నికలు జరుగుతూ ఉండగానే ముఖ్యమంత్రి పదవికి మరోసారి పోటీ చేస్తానని సంజీవయ్య ముందుగానే ప్రకటించాడు. సంజీవరెడ్డి కాంగ్రెస్ అధ్యక్ష పదవి వదులుకొని మళ్ళీ రాష్ట్రానికి వచ్చాడు. కాంగ్రెస్ పార్టీకి ఆ ఎన్నికల్లో 177 స్థానాలు లభించాయి. కమ్యూనిస్టు పార్టీకి 51, స్వతంత్ర పార్టీకి 19 మాత్రమే లభించాయి. సంజీవరెడ్డి నాయకత్వ పోటీకి నిలబడ్డాడు. ముందుగా ప్రకటించిన ప్రకారం సంజీవయ్య కూడా అల్లూరి సహాయంతో పోటీకి నిలబడ్డాడు. కానీ కాంగ్రెస్ హైకమాండ్ సంజీవయ్యను పోటీ చేయవలదని ఆదేశించింది. సంజీవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. సంజీవయ్యకి మంత్రిపదవి ఇస్తానని ఆహ్వానించాడు. కానీ అతనికి సన్నిహితంగా పనిచేసిన అల్లూరి సత్యనారాయణరాజుకి కూడా ఇస్తే గాని రానని భీష్మించుకు కూర్చున్నాడు. సంజీవరెడ్డి అట్లాంటి రాజీలకు సిద్ధంగా లేడు.

1962 సాధారణ ఎన్నికల్లో సీట్లు లభించని కాంగ్రెసువారు స్వతంత్రులుగా పోటీచేశారు. తెలంగాణాలో సుమారు 27మంది ఇండిపెండెంట్ గా నెగ్గారు. కాంగ్రెసులో ముఠాలవారే ఇందుకు ప్రోత్సాహమిచ్చారు. కె.వి.నారాయణరెడ్డి నేషనల్ డెమోక్రటిక్ పేరుతో ఒక ముఠాగా ఏర్పడి బేరసారాలు సాగించాడు. ఆ ఎన్నికలో కొండా వెంకటరంగారెడ్డి ఓడిపోయాడు. బ్రహ్మానందరెడ్డిని ఓడించాలని ఫిరంగిపురం నియోజకవర్గంలో జాగర్లమూడి చంద్రమౌళి పోటీచేశాడు. చివరకు అది కమ్మ రెడ్డి పోటీగా తయారై రాష్ట్రమంతటి దృష్టిని ఆకర్షించింది. లక్షల రూపాయలు నలిగిపోయాయి. ఆ ఎన్నికల్లో వందల తేడాతో గెలిచిన బ్రహ్మానందరెడ్డిపై ఎన్నికల పిటీషన్ ఐదు సంవత్సరాలు నడిచిపోయింది.

1964లో శ్రీకాకుళం జిల్లాపరిషత్ అధ్యక్షునిగా వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు స్వతంత్ర పార్టీ బలంతో నెగ్గాడు. గొట్టిపాటి బ్రహ్మయ్య అతన్ని ఆరేళ్ళపాటు కాంగ్రెసునుంచి తొలగించాడు. కానీ కేంద్రంలో సంజీవయ్య ఉండడంతో ఆ చర్యను అంగీకరించలేదు. కృష్ణాజిల్లాలో కూడా సంజీవరెడ్డికి అనుకూలంగా ఉన్న మాగంటి అంకినీడు ప్రసాద్ జిల్లాపరిషత్ అధ్యక్షుడయ్యాడు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా ఇచ్చిన సంజీవరెడ్డి ఆట్టే శ్రమలేకుండా

బ్రహ్మానందరెడ్డిని నాయకుడిగా ఎన్నిక చేశాడు. కాని శాసనసభా నాయకుడిగా మాత్రం తానే కొనసాగాడు. కేంద్రంలో సంజీవయ్యను మంత్రిమండలిలోకి తీసుకున్నారు.

1964లో చాల ముఖ్యమైన మార్పులు జరిగినాయి. కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ జాతీయ కారణాలవల్ల రెండుగా చీలిపోయింది. ఎవరికి దక్కిన కార్యాలయాలు వారు వశపర్చుకొన్నారు. రాష్ట్రంలో స్వతంత్ర పార్టీ రైతుల సమస్యలపైన, వెనుకబడిన జాబితాను పునరుద్ధరించాలని లచ్చన్న నాయకత్వాన ఆందోళన సాగించింది. నియోజకవర్గాల పునర్విభజన సంఘంలో వెంగళరావు అనధికార సభ్యుడుగా ఉండి కాంగ్రెసు పార్టీకి అనుకూలంగాను, అందులో కొన్ని ముఠాలకు మరీ అనుకూలంగాను మార్పు చేయడంలో తోడ్పడ్డాడు.

=====

## ముఖ్యమంత్రి – డి. సంజీవయ్య

11-01-1960 నుంచి 11-03-1962

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | డి. సంజీవయ్య | సామాజిక కార్యనిర్వాహక శాఖ |
| 2. | కె. వి. రంగారెడ్డి<br>ఉప ముఖ్యమంత్రి | భూమి ఆదాయ పన్ను శాఖ |
| 3. | అల్లూరి సత్యనారాయణ రాజు | విద్యాశాఖ మరియు రవాణా |
| 4. | ఎ.బి.పి. పట్టాభి రామారావు | ప్రణాళిక, అంతర్గత కార్యనిర్వాహక అభివృద్ధి శాఖ, సమాచార శాఖ |
| 6. | కల్లూరి చంద్రమౌళి | దేవాదాయ మరియు సహకార శాఖ |
| 7. | కె. బ్రహ్మానంద రెడ్డి | ఆర్థిక, న్యాయ మరియు కోర్టులు |
| 8. | ఎమ్. నర్సింగరావు | గృహనిర్మాణ శాఖ |
| 9. | ఎమ్. పల్లం రాజు | అటవి, జంతు సంరక్షణ, మత్స్య శాఖ |
| 10. | ఎ.సి. సుబ్బారెడ్డి | పరిశ్రమల మరియు మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ |
| 11. | పి. వి.జి. రాజు | మెడికల్ మరియు ఆరోగ్యం |
| 12. | శ్రీమతి మసుమా బేగం | సాంఘిక సంక్షేమ మరియు వక్ఫ్ |
| 13. | ఎన్. రామచంద్రారెడ్డి | వ్యవసాయ, ఆహార మరియు కార్మిక శాఖ (లేబర్) |
| 14. | కొండా లక్ష్మణ్ బాపూజి | చిన్నతరహా మరియు పన్నుల శాఖ |

-----

# రెండవ సారి ఎన్. సంజీవరెడ్డి

1964 మే 27న ప్రధాని నెహ్రూ చనిపోయాడు. అంతటితో కాంగ్రెస్ లో పెద్ద మార్పులొచ్చాయి. కామరాజు నాడార్, ఎస్.కె.పాటిల్, సంజీవరెడ్డి, నిజలింగప్ప, అతుల్యఘోష్ కలసి రాజకీయాలను నడిపించ పూనుకున్నారు. దీనికి సిండికేట్ అని పేరు వచ్చింది. లాల్ బహదూర్ శాస్త్రిని ప్రధాని చేసింది వీరే. అప్పుడు కేంద్రంలో ఉక్కుశాఖ మంత్రిగా సంజీవరెడ్డి చేరాడు. కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న సంజీవయ్య ఆంధ్రకాంగ్రెస్ వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం ప్రారంభించాడు. బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంపై పెత్తనం వహించబోయిన కారణంగా సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి స్పర్ధలు పెరిగిపోయాయి.

సంజీవరెడ్డి ఢిల్లీలో తన అనుభవాలను గురించి వ్యాఖ్యానిస్తూ తనను శ్రీమతి ఇందిరాగాంధీ చప్రాసిగా చూసారని ఆపదవికి ఏమీ గౌరవం లేదని వ్యాఖ్యానించాడు. కేంద్ర నాయకులు ఇలాంటి ప్రకటన పట్ల ఆశ్చర్యం చెందారు. చివరకు పెకింగ్ రేడియో కూడా సంజీవరెడ్డి వ్యాఖ్యను ప్రసారం చేసింది.

సంజీవరెడ్డి ఏర్పరచిన మంత్రివర్గంలో ఆయనకు బద్ధ విరోధిగా ఉన్న ఎ.సి.సుబ్బారెడ్డికి స్థానం లభించింది. మర్రి చెన్నారెడ్డి నూకల రామచంద్రారెడ్డి తెలంగాణా రాజకీయాలలో ఎప్పుడూ వ్యతిరేకులు మంత్రులుగా చేరారు. తనకోసం త్యాగం చేసి కాళహస్తి సీటుకు రాజీనామా యిచ్చిన ఎ.బలరామిరెడ్డిని మంత్రి చేశాడు. తనకు నమ్మిన బంటుగా ఉంటున్న ఆలపాటి వెంకటరామయ్యకు మంత్రి పదవి ఇచ్చాడు. చల్లపల్లి రాజా, విజయనగరం రాజా, పి.వి.జి. రాజు, నూజివీడు జమీందారు, ఎమ్.ఆర్.అప్పారావు ఇంకా పి.వి.నరసింహారావు, ఎమ్.ఎన్.లక్ష్మీ నరసయ్య, మీర్ అహమ్మద్ అలీఖాన్, టి.ఎన్.సదాలక్ష్మి, బి.వి.గురుమూర్తి మంత్రు లయ్యారు. జమీందారులందరికీ ఇట్లా మంత్రి పదవి ఇచ్చినందుకు చాలా విమర్శవచ్చింది. సంజీవరెడ్డి కాంగ్రెసు అధ్యక్షపదవికి రాజీనామా ఇవ్వగానే ఈసారి ఆ స్థానం సంజీవయ్యకు లభించింది. బ్రహ్మానందరెడ్డి, సంజీవరెడ్డికి అతిసన్నిహితుడయ్యాడు. 'బ్రహ్మాన్ని' అడగనిదే ఏపని చేయని స్థితిలో సంజీవరెడ్డి ఉన్నాడనుకున్నారు. అట్లాంటి సమయంలో రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షపదవి నుండి పిడతల రంగారెడ్డిని తొలగించి గొట్టిపాటి బ్రహ్మయ్యను తీసుకొచ్చాడు. సంజీవరెడ్డి. కానీ సంజీవరెడ్డి కర్నూలు జిల్లాలో బస్సురూట్లు ఉన్నాయి. కనుక వాటిని జాతీయం చేస్తే అతనికి బలం పోతుందనే ఉద్దేశంతో ముందుగా కర్నూలు జిల్లాలో బస్సులను ప్రభుత్వం స్వీకరించింది. నిపుణుల సిఫార్సు ప్రకారం వరుసగా నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాలు ఐన తరువాత కర్నూలుకు రావాలని ఉన్నది. ఇందుకు విరుద్ధంగా చేసినందుకు సుప్రీంకోర్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు చెప్పింది. అంతటితో సంజీవరెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశాడు. సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా జిల్లాపరిషత్ లపై అజమాయిషీ వహించి తనవారిని చేతిలో పెట్టుకొనడానికి విశ్వప్రయత్నం చేసాడు.

బ్రహ్మానందరెడ్డి మంత్రవర్గం సాఫీగా సాగలేదు. సంజీవరెడ్డి వర్గం ఆయనతో క్షణక్షణ పోరాడింది. ఇందులో ఎ.సి.సుబ్బారెడ్డి, పిడతల రంగారెడ్డి, పి.వి.జి.రాజు, జలగంవెంగళరావు, నూకల రామచంద్రారెడ్డి ఉన్నారు. చెన్నారెడ్డి క్రమంగా బ్రహ్మానందరెడ్డికి చేరువైనాడు. నెల్లూరులో ఎ.సి సుబ్బారెడ్డికి వ్యతిరేకమైన చెంచు రామానాయుడిని తూర్పుగోదావరిలో తోటరామస్వామిని, పశ్చిమగోదావరిలో టి.వి. రాఘవులును మంత్రులుగా స్వీకరించారు. ఛాంబర్ ఆఫ్ పంచాయతీరాజ్ ప్రెసిడెంట్ గా ఉన్న శ్రీ జలగం వెంగళరావును బ్రహ్మానందరెడ్డి తొలగించాడు. ఆయన కోర్టుకు వెళ్లి తన స్థానం నిలబెట్టుకున్నాడు. వాళ్ళిద్దరు బాహాటంగా తిట్టుకున్నారు.

సంజీవరెడ్డికి అతిసన్నిహితుడైన ఆలపాటి వెంకటరామయ్య చనిపోవడంతో రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల సంఘంలో ఖాళీ ఏర్పడినది. ఆ ఖాళీలో ఎన్నికయ్యే అభ్యర్థినిబట్టి బ్రహ్మానందరెడ్డి, సంజీవరెడ్డి బలాబలాలు తేలిపోతాయి. బ్రహ్మానందరెడ్డి పక్షాన కాకాని వెంకటరత్నం, ప్రత్యర్థిగా మూర్తిరాజు పోటీచేసారు. 1964 సెప్టెంబరు 29న జరిగిన ఎన్నికలో 27 ఓట్లతో కాకాని నెగ్గాడు. బ్రహ్మానందరెడ్డి బలపడ్డాడు. రాష్ట్రంలో అనేక కీలక స్థానాలలో బ్రహ్మానందరెడ్డి తన మనుషుల్ని నియమించుకున్నాడు. వ్యవసాయ విశ్వవిద్యలయ సంఘాధ్యక్షుడిగా కందుల ఓబులరెడ్డి, ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి రోడ్డు రవాణా అధ్యకుడిగా వి.బి.రాజు, భూమి తనఖా బ్యాంకు అధ్యకుడిగా శీలం

సిద్ధారెడ్డి ఉన్నారు. బ్రహ్మానందరెడ్డిని బాహాటంగా విమర్శిస్తూ ఎ.సి.సుబ్బారెడ్డి, సదాలక్ష్మి ప్రకటనలు చేశారు. వారిని తొలగించాలని బ్రహ్మానందరెడ్డి ప్రయత్నించినా కాంగ్రెసు అధ్యక్షుడు కామరాజు నాడార్ అంగీకరించలేదు. అందువలన వారికున్న ముఖ్యమైన శాఖలను తీసివేయడంతో తృప్తిపడవలసి వచ్చింది.

బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా విశాఖపట్టణంలో ఉక్కు కర్మాగారానికి సంబంధించిన ఆందోళన ప్రారంభమైంది. విశాఖపట్టణానికి కర్మాగారం రాబోవడంలేదనే వార్త వదంతిగా వ్యాపించింది. ప్రతిపక్షాలు ప్రారంభించిన ఆందోళనలో కాంగ్రెవారు కూడా మనుగడకోసం ప్రవేశించారు. తమనంపల్లి అమృతరావు ఆమరణ నిరాహారదీక్ష విశాఖలో పూనాడు. రాష్ట్రమంతటా హర్తాళ్ లు జరిగాయి. ఇదంతా కేంద్రంలో ఉన్న ఉక్కు మంత్రి సంజీవరెడ్డికి వ్యతిరేకంగా బ్రహ్మానందరెడ్డే చేయించాడన్నారు. చివరకు బ్రహ్మానందరెడ్డే విశాఖ వెళ్ళి అమృతరావుతో దీక్ష విరమింపచేయాల్సి వచ్చింది. ఈ ఆందోళన సందర్భంగా విజయవాడలో ఉన్న సంజీవరెడ్డి కంచు విగ్రహాన్ని పగలగొట్టి కాల్వలో పారవేశారు. తెన్నేటి చలపతిరావు మొదలైన తాత్కాలిక భక్తులు పెట్టించిన విగ్రహానికి ఆ గతి పట్టింది.

1966లో విశ్వవిద్యాలయాల స్వతంత్ర ప్రతిపత్తిని తగ్గిస్తూ ప్రభుత్వం తలపెట్టిన శాసనానికి వ్యతిరేకంగా ఆందోళన ప్రారంభమైనది. ఆ శాసనాన్ని అనుసరించి వైస్ ఛాన్సలర్ డి.ఎస్.రెడ్డిని పదవీ కాలపరిమితి పూర్తి కాకుండానే తొలగించారు. పిన్నమనేని నరసింహారావును వైస్ ఛాన్సలర్ గా నియమించారు. కానీ ఆయన యూనివర్సిటీలో అడుగుపెట్టలేక రాజభవనంలోనే ప్రమాణ స్వీకారం చేసి గెస్టహౌస్ నుండే గుంటూరు వెళ్ళవలసి వచ్చింది. సుప్రీంకోర్టు డి.ఎస్.రెడ్డికి అనుకూలంగా తీర్పు చెప్పింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు డి.ఎస్.రెడ్డికి అండగా నిలబడ్డారు. బ్రహ్మానందరెడ్డి, డి.ఎస్.రెడ్డి చాల తక్కువ స్థాయికి పోయి ఒకరిపై ఒకరు విసురుల బాణాలు వేసుకొన్నారు.

అఖిల భారత కాంగ్రెస్ ఎన్నికల సంఘంలో సంజీవరెడ్డి అత్యధిక సంఖ్యాబలంతో ఎన్నిక కాగా అత్యల్ప సంఖ్యతో సంజీవయ్య ఎన్నికైనాడు. కొత్త రఘురామయ్య ఢిల్లీలో వారిద్దరి మధ్య రాజకీయాలు నడిపి పంక్తి భోజనం చేయించగల్గాడు. బ్రహ్మానందరెడ్డితో బేరంచేసి ప్రదేశ్ కాంగ్రెస్ లో స్థానాలు పొందలేదు. రఘురామయ్య, సంజీవయ్యలు సంజీవరెడ్డితో చేతులు కలిపారు. సంజీవరెడ్డి, సంజీవయ్య కూడబలుక్కుని తమ అభిప్రాయ భేదాలన్నీ సర్దుబాటు చేసుకొన్నామని ప్రకటించారు. 1967 సాధారణ ఎన్నికలు దగ్గర పడేసరికి దరఖాస్తులు పెట్టుకోవలసిందిగా ప్రదేశ్ కాంగ్రెస్, జిల్లా కాంగ్రెస్ ను కోరింది. ప్రతి జిల్లా సంఘం అంతర్గత పోరాటాలలో తమ అభ్యర్థుల పేర్లను సూచించింది. ప్రదేశ్ కాంగ్రెస్ సంఘంలో బ్రహ్మానందరెడ్డి ముఠాకు ఆరు స్థానాలు, ప్రత్యర్థులకు ఐదు స్థానాలు ఎన్నికల సంఘంలో ఉన్నాయి. బ్రహ్మానందరెడ్డి ముఠా 1966 నవంబరులో తుది జాబితాను కేంద్రానికి పంపించింది. ప్రత్యర్థి వర్గం మరొక జాబితా తయారు చేసి కేంద్రానికి పంపింది. ఈ తగవు తీర్చడానికి కేంద్రానికి మూడు మాసాలు పట్టింది. ఇరువురి జాబితాలలోను 30 మంది అసెంబ్లీకి, ఐదుగురు లోక్ సభకు ఒకే పేర్లను సూచించారు. అధికారవర్గం పంపిన జాబితాలో లోగడ ఎన్నికల్లో కాంగ్రెసును ఓడించిన 24 మంది పేర్లు కూడా ఉండగా. మరొక 11 మంది స్వతంత్రులుగా నెగ్గిన వారి పేర్లు కూడా సిఫారసు చేశారు. అంతటితో ఆంధ్రప్రదేశ్ నుండి ఢిల్లీకి కాంగ్రెసు వారు యాత్ర చేసారు. కాంగ్రెసువారిలో ఇదొక పెద్ద ఆచారమైపోయింది. అభ్యర్థిగా నిలబడ దల్చినవారు, వారికి సిఫారసు చేసేవారు అంతాకలసి ఢిల్లీ చుట్టూ తిరిగారు. కామరాజు నాడార్ ఎంత ప్రయత్నించినా ఇరువర్గాల మధ్య సంధి కుదరలేదు. బ్రహ్మానందరెడ్డి, సంజీవయ్య బలవంతాన చర్చించినా ఫలితం శూన్యమైంది. గత్యంతరం లేక ఉన్నతాధికార ఉపసంఘాన్ని నియమించారు. మొరార్జీ దేశాయ్, ఎస్.కె.పాటిల్, వై.బి.చవాన్ ఈసంఘ సభ్యులుగా సమస్య పరిష్కరించారు. సంజీవరెడ్డి లోక్ సభకు పోటీ చేయాలని నిర్ణయించు కోవడంతో వారిపని మరీ సులభమైంది. 1966 డిసెంబరులో పరిష్కార జాబితాను ప్రకటించారు. 169 స్థానాలు బ్రహ్మానందరెడ్డి వర్గానికి, వందస్థానాలు ఎ.సి.సుబ్బారెడ్డి వర్గానికి ఇచ్చారు. అయినా రాష్ట్రంలో ప్రశాంతత ఏర్పడలేదు. టిక్కెట్టు రానివారు స్వతంత్రులుగా పోటీ చేశారు. ముఖ్యమంత్రిగా పోటీచేస్తానని ఎ.సి.సుబ్బారెడ్డి ముందే ప్రకటించాడు. ఒక ముఠాను మరొక ముఠా ఓడించుకొనడానికి తీవ్ర ప్రయత్నం చేసుకొన్నారు. దాదాపు 50 మంది కాంగ్రెసువారు ఇండిపెండెంట్ గా పోటీ చేసారు. వారందరిని ఆరేళ్ళపాటు కాంగ్రెసు నుండి బహిష్కరించారు. సంజీవరెడ్డి, సంజీవయ్య, ఎ.సి.సుబ్బారెడ్డి, బలరామరెడ్డి, సదాలక్ష్మి, పట్టాభి రామారావుపై బ్రహ్మానందరెడ్డి వర్గం ఇండిపెండెంట్ లను పోటీ పెట్టించింది. అలాగే ఎ.పి. సుబ్బారెడ్డి వర్గం కూడా బ్రహ్మానందరెడ్డి, ఓబుల రెడ్డి, కాకాని వెంకటరత్నం మొదలైన వారిపై

పోటీచేసిన వారిని బలపర్చింది. కాంగ్రెసు పార్టీ టిక్కెట్టు నిరాకరించిన కొందరికి స్వతంత్ర పార్టీ టిక్కెట్లు లభించాయి. ఎన్నికల్లో పంచాయతీరాజ్ వ్యవస్థ అంతా బ్రహ్మానందరెడ్డికి అనుకూలంగా వ్యవరించిందని చెప్పవచ్చు. ఎన్నికల ఖర్చునకై అనేక విధాల అధికార కాంగ్రెస్ డబ్బులు వసూలు చేసింది. పి.డబ్ల్యు.డి. కంట్రాక్టర్ల నుండి 5 లక్షల వరకు వసూలు చేసినట్లు ఎ.సి.సుబ్బారెడ్డి తెలిపారు.

కమ్యూనిస్టు పార్టీ మొట్టమొదటిసారిగా చీలిక అనంతరం పరస్పరం పోటీ చేసుకున్నాయి. కాంగ్రెసువారు 165 స్థానాలు గెలుచుకున్నారు. కమ్యూనిస్టులకు తొమ్మిది, మార్క్సిస్టులకు పది లభించాయి. 68 మంది ఇండిపెండెంట్ లు నెగ్గారు. లోక్ సభ ఫలితాలలో రంగా ఓడిపోయాడు. సంజీవయ్య, సంజీవరెడ్డి కేంద్రానికి పోవడంతోను, అల్లూరు సత్యనారాయణ రాజు మరణించడంతోనూ బ్రహ్మానందరెడ్డి పరిస్థితి మెరుగైంది. బ్రహ్మానంద రెడ్డికి అనుకూలంగా గెలిచిన ఇండిపెండెంట్ లు కొందరిని కాంగ్రెసులో చేర్చుకోవడంతో బ్రహ్మానందరెడ్డికి బలం బాగా చేకూరింది. ఎన్నికల అనంతరం తిరిగి బ్రహ్మానందరెడ్డి నాయకుడుగా ఎన్నికై మంత్రి వర్గాన్ని ఏర్పరిచాడు. డా.చెన్నారెడ్డి నాయకుడుగా ఎన్నికై మంత్రి వర్గాన్ని ఏర్పరిచాడు. డా.చెన్నారెడ్డి, వి.బి.రాజు, పి.తిమ్మారెడ్డి, జె.వి.నరసింగరావు, టి.వి.రాఘువులు, కొండాలక్ష్మణ్ బాపూజీ తోటరామస్వామి మంత్రులు గాను, కె.విజయభాస్కర రెడ్డి, శీలం సిద్ధారెడ్డి, పి.వి.నరసింహారావు, బి.వి.గురుమూర్తి, ఎన్.చెంచు రామనాయుడు, ఆర్. రామలింగరాజు, స్టేట్ మంత్రులుగా ఉన్నారు.

======

## ముఖ్యమంత్రి – ఎన్. సంజీవ రెడ్డి

12-03-1962 నుంచి 28-02-1964

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | ఎన్. సంజీవ రెడ్డి | కార్యనిర్వాహక, గృహనిర్మాణ, సాంఘిక సంక్షేమ మరియు పెద్ద తరహా పరిశ్రమలు |
| 2. | ఎన్. రామచంద్రారెడ్డి | భూ పన్నులు, భూ సంస్కరణలు |
| 3. | కె. బ్రహ్మానందరెడ్డి | ఆర్థిక శాఖ, సహకార శాఖ |
| 4. | ఎమ్. పల్లం రాజు | అటవీ మరియు జంతుసంరక్షణ |
| 5. | డా. ఎమ్. చెన్నారెడ్డి | ప్రణాళికలు, పంచాయతీలు మరియు పంచాయతీరాజ్ |
| 6. | పి. వి.జి. రాజు | విద్యాశాఖ |
| 7. | ఎ.సి.సుబ్బారెడ్డి | భారీ నీటిపారుదల శాఖ, విద్యుత్తు |
| 8. | మీర్ అహమ్మద్ అలిఖాన్ | నిర్మాణ, సమాచార (కమ్యూనికేషన్), వక్ఫ్ |
| 9. | వై. శివరామ ప్రసాద్ | ఆరోగ్య మరియు వైద్య సహకార శాఖ |
| 10. | డా. ఎమ్.ఎన్.లక్ష్మినరసయ్య | మెడిసిన్ మరియు చిన్నతరహా పరిశ్రమలు |

**రాష్ట్ర మంత్రులు**

| | | |
|---|---|---|
| 11. | ఎమ్. ఆర్. అప్పారావు | పన్నులు మరియు ప్రొహిబిషన్ |
| 12. | పి. వి. నరసింహారావు | న్యాయ మరియు సమాచార శాఖ |
| 13. | ఆలపాటి వెంకట రామయ్య | మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ |
| 14. | టి. ఎన్. సదా లక్ష్మి | దేవాదాయ మరియు చిన్న పొదుపు |
| 15. | ఎ. బలరామి రెడ్డి | వ్యవసాయ శాఖ |
| 16. | బి. వి. గురుమూర్తి | కార్మిక మరియు రవాణా శాఖ |

-----

# రాజకీయ కలహాలు

## బ్రహ్మానందరెడ్డి మంత్రి వర్గం

బ్రహ్మానందరెడ్డి వర్గంలో స్థానాలు లభించని ఎ.సి.సుబ్బారెడ్డి మరికొందరిని కూడగట్టుకొని ఒక ఫ్రంట్ గా ఏర్పడ్డారు. జలగం వెంగళరావు, నూకల రామచంద్రారెడ్డి రత్నసభాపతి, బొబ్బిలి రాజా, కాజ రామనాథం మొదలైన వారంతా ఆ ఫ్రంట్ లో ఉన్నారు. నాయకుని ఎన్నికలలో వారిలో వారే కలహించుకొన్నారు. చివరకు ఆదిలో హంస పాదు



కాకూడదని కాజ రామనాథాన్ని నాయకుడ్ని చేశారు. రత్న సభాపతి ఉపనాయకుడుగా జన కాంగ్రెస్ అని కొత్త పక్షానికి పేరు పెట్టారు. రెండు నెలలు తిరక్కముందే ఎ.సి. సుబ్బారెడ్డిని మంత్రి వర్గంలోకి తీసుకొన్నారు. ఆయనతో పాటు డెమోక్రటిక్ ఫ్రంట్ పేరిట కొందరు సభ్యులను కూడగట్టుకొని ఉన్న కె.వి.నారాయణరెడ్డికి మంత్రి పదవి లభించింది. బ్రహ్మానందరెడ్డికి సన్నిహితుడైన వెనిగళ్ళ సత్యనారాయణ ఇంకా అరిగె రామస్వామి, ఇబ్రహీం ఆలీ అన్సారీ కూడా మంత్రులయ్యారు. జన కాంగ్రెస్ ఆట్టేకాలం బ్రతకలేదు. దాని నాయకుడు కాజ రామనాథం చాటుగా బ్రహ్మానందరెడ్డికి వార్తలు చేరవేస్తున్నాడని సభ్యులు అనుమానపడ్డారు. అప్పుడు స్వతంత్ర పార్టీలో కలసి యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ గా ఏర్పడ్డారు. ఈ ఫ్రంట్ కు గౌతు లచ్చన్న నాయకుడు కాగా కాజ రామనాథంతో సహా కొందరు సభ్యులు బయటకు వెళ్ళిపోయారు. అచిర కాలంలోనే ఆ ఫ్రంట్ కూడా రద్దయి స్వతంత్ర పార్టీ నెగ్గింది. సోషలిస్టుగా బయలుదేరిన రత్న సభాపతి కాంగ్రెసు ద్వారా స్వతంత్రలో ప్రవేశించాడు.

1967లో ఎ.సి.సుబ్బారెడ్డి మరణించాడు. అప్పుడే తెలంగాణా నాయకుడు బూర్గుల రామకృష్ణారావు కూడా మరణించాడు. ఇందిరాగాంధీ ప్రధాని కాగా, సంజీవరెడ్డి స్పీకరయ్యాడు. అంతటితో సంజీవరెడ్డి వర్గం రాష్ట్రంలో చెల్లాచెదరైంది. సంజీవయ్య వర్గం కూడా అంతంత మాత్రంగానే ఉంది. చెన్నారెడ్డిని కేంద్రంలో మంత్రిగా స్వీకరించారు. బ్రహ్మానందరెడ్డికి రాష్ట్రంలో ఎదురులేని స్థితి ఏర్పడింది. ఆఏడు హైదరాబాదులో అఖిలభారత కాంగ్రెసు మహాసభలు జరిగాయి. నిజలింగప్ప కాంగ్రెసు అధ్యక్షుడుగా ఉన్నారు. బ్రహ్మానందరెడ్డి కాంగ్రెసు కార్యవర్గ సభ్యుడుగా ఎన్నుకోబడ్డారు.

మార్క్సిస్టుల్లో మరొక చీలిక వచ్చి కొందరు, ఉగ్రవాదులు తుపాకి చేపట్టడానికి పూనుకొన్నారు. తరిమెల నాగిరెడ్డి, చెండ్ర పుల్లారెడ్డి, కొల్లా వెంకయ్య, కొండపల్లి సీతారామయ్య, చౌదరి తేజేశ్వరరావు, దేవులపల్లి వెంకటేశ్వరరావు, వెంపటాపు సత్యనారాయణ, సత్యమూర్తి, పైలా వాసు దేవరావు, నాగ భూషణ్ పట్నాయక్ ప్రభృతులెందరో ఉద్యమాల్లో నాయకత్వం వహించారు. యువకులు అనేకులు దీనిపట్ల ఆకర్షితులై అడవుల్లోకి పోయారు. అయితే వీరంతా ఐక్యంగా పోరాడలేదు. అనేక ముఠాలు, చీలికలతో వారిలో వారే విపరీతంగా కలహించుకున్నారు.

ఆఏడు హైదరాబాదులోను, నిజామాబాదులోను మత కలహాలు జరిగాయి. అవి త్వరలోనే సర్దుబాటు అయ్యాయి.

హరిజనులను తన్నాలని తిమ్మారెడ్డి అన్నట్లుగా పేపర్లలో వార్తలు వచ్చాయి. పార్లమెంటులో అప్పుడు పెద్ద రభస జరిగి తిమ్మారెడ్డిని బర్తరఫ్ చేయమని చాల మంది కోరారు. కానీ బ్రహ్మానందరెడ్డి అతన్ని ఆదుకొని ఆపద నుండి తప్పించాడు. తనకు వ్యతిరేకంగా వ్రాస్తున్న ఆంధ్రజ్యోతిని బ్లాక్ లిస్టు చేసి ప్రభుత్వం ప్రకటనలు యివ్వటం మానివేశారు. అధికార ప్రెస్ బిల్లు ఒకటి ప్రవేశపెట్టి పత్రికలను అదుపులో పెట్టడానికి ఆలోచన చేశారు. మేధావులంతా బ్రహ్మానందరెడ్డిపై తీవ్ర విమర్శ చేశారు. అంతటితో ఆంధ్రజ్యోతిని బ్లాక్ లిస్టునుండి తొలగించి ప్రెస్ బిల్లును సెలక్ట్ కమిటీకి నివేదించారు. మంత్రివర్గ విస్తరణ పేరుతో ఎప్పటికప్పుడు తమకు పదవులు వస్తాయని కొందరు ఆశించారు.

1968లో ప్రాంతీయ సంఘాన్ని మరొక ఐదేళ్ళు పొడిగించారు. ముల్కీ నిబంధనల కాలం మరొక ఐదేళ్ళు పొడిగించవలసిందిగా ప్రభుత్వం సిఫార్సు చేసింది. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో అధికార పక్షానికి ఒక వర్గం ఉండేది. విద్యార్థులతో ఇలా వర్గాన్ని పోషించడం ప్రమాదమని ఉత్తరోత్తరా తెలుసుకొన్నారు. ఎన్.జి.ఓ.లలో ఒకే సంఘం ఉండగా, తెలంగాణా సంఘాన్ని ఏర్పరచి దానికి గుర్తింపు యిచ్చాడు ముఖ్యమంత్రి, ఉద్యోగులలో తెలంగాణా ఆంధ్ర భావం బాగా పాతుకుపోయింది.

-------

# ప్రత్యేక తెలంగాణాకై ప్రజాపోరాటం

ప్రశాంతంగా సాగుతున్నదనుకున్న బ్రహ్మానందరెడ్డి వర్గంపై పెద్ద వుప్పెన వచ్చిపడింది. ప్రతి సమస్యను తెమల్చకుండా నానబెట్టే బ్రహ్మానందరెడ్డి ధోరణి ఆందోళనకు దారితీసింది. తెలంగాణా ప్రజలలోను, ఉద్యోగస్తులలోను, విద్యార్థులలోను ఉన్న అసంతృప్తిని వాడుకోవడానికి అన్ని పార్టీల రాజకీయ నాయకులు సిద్ధంగా ఉన్నారు. వుద్యోగస్తులు రాజకీయ నాయకుల చుట్టూ తిరిగి తమకు జరిగిన అన్యాయాలను చెప్పుకున్నారు. ముఖ్యమంత్రిని వుద్యోగస్తులు అడుగగా మీరు మౌనం వహిస్తే నేనేం చేసేదని మర్మ గర్భితంగా మాట్లాడాడు. అంటే అందోళన చేస్తే కేంద్రంతో బేరం చేస్తాననే భావంతో, 1968 నవంబరు 30న వరంగల్ లో జరిగిన ఒక మహాసభలో ప్రత్యేక తెలంగాణా నినాదం ప్రారంభమైంది. అక్కడేర్పరచిన ఒక సంఘం తెలంగాణా జిల్లాలలో పర్యటించి ప్రత్యేక తెలంగాణా ప్రచారం చేసారు.

1969 జనవరి 8న ఖమ్మంలో రవీంద్ర అనే విద్యార్థి ఆమరణ నిరాహారదీక్ష పూనాడు. తెలంగాణా హక్కుల రక్షణ కావాలని ఆ దీక్ష సారాంశం.

బ్రహ్మానందరెడ్డి వర్గంలో స్థానం లభించని జలగం వెంగళరావు తదితరులు ప్రోత్సాహంతో ఖమ్మంలో ప్రారంభమైన ఆందోళన రాజధానికి ప్రాకింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బ్రహ్మానందరెడ్డికి అనుకూల వర్గం విద్యార్థి నాయకుడు వెంకట రామిరెడ్డి అధ్యక్షతన తెలంగాణా రక్షణ నినాదం యిచ్చాడు. 1969 జనవరి 14న వెంకటరామిరెడ్డి నాయకత్వాన తెలంగాణా రక్షణల పేరిట ఊరేగింపులు జరిపారు. ఆ విద్యార్థి వర్గాన్ని దెబ్బ కొట్టడానికి ప్రత్యర్థి వర్గం ప్రత్యేక తెలంగాణా కావాలని జనవరి 16న వూరేగింపు జరిపి సభపెట్టి లాఠీఛార్జీ వరకు వ్యవహారం లాగారు. స్వామి రామానందతీర్థ ప్రత్యేక రాష్ట్ర నినాదాన్ని ఖండించారు. వ్యవహారం తేలికగా పోయేట్లు లేదని ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి సులభంగా గ్రహించాడు. ఈ ఆందోళన అప్పటికప్పుడే నిజామాద్ వరకు వ్యాపించింది. విద్యార్థులను అదుపులో పెట్టడం కష్టమని గ్రహించారు. వెంటనే బ్రహ్మానందరెడ్డి జనవరి 18, 19న అన్ని పార్టీల నాయకుల్ని పిలిపించి చర్చలు జరిపి ఒక ఒప్పందానికి వచ్చి ప్రకటించాడు. తెలంగాణా వారికి అన్యాయం కొంత జరిగిందని కొన్ని లోపాలు జరిగాయని ముఖ్యమంత్రి ఒప్పుకున్నాడు. యథాప్రకారం పెద్దమనుషుల ఒప్పందంలో తెలంగాణాకు విద్యాసౌకర్యాలు, అభివృద్ధి, మిగులు నిధులు ఖర్చుపెట్టడం, వుద్యోగుల సీనియారిటీ జాబితాను తయారు చేయడం జరిగింది. ఈ ప్రకటన ఎవరికివారే తమ విజయంగా భావించారు. ప్రతి పక్షాలను చిత్తు చేశామని ముఖ్యమంత్రి భావిస్తే, ముఖ్యమంత్రికి అతని

అర్హత స్థానం చూపెట్టామని ప్రతిపక్షాలవారు భావించారు. ఒప్పందాలపై సంతకాలు చేసినవారిలో కాంగ్రెస్, కమ్యూనిస్టు, స్వతంత్ర, జనసంఘ్, సోషలిస్ట్, మజ్లీస్ పక్షాలవారు ఉన్నారు. వారి పేర్లు, చొక్కారావు, అచ్యుత రెడ్డి, వి.బి.రాజు, పి.నరసింగరావు, సి.హెచ్. రాజేశ్వరరావు, బద్రీ విశాల్ పిట్టి, వై.వి.క్రిష్ణారావు, పి.వి.నరసింహారావు, జాపూడి యజ్ఞ నారాయణ, కుడిపూడి ప్రభాకర రావు, వి.రామారావు, రోడామిస్త్రి, సి.జంగారెడ్డి, ఎ.వాసుదేవరావు, సలావుద్దీన్ ఒవైసి, పి. నరసారెడ్డి, జె.రంగారెడ్డి, పి.గోవర్ధన రెడ్డి, జె.వెంగళరావు, టి.పురుషోత్తమ రావు, కె.రాంచంద్రారెడ్డి ఎం.కమాలుద్దీన్, ఎర్రం సత్యనారాయణ, సి.హెచ్.మూర్తిరాజు, కె.రాజమల్లు, కె.సుదర్శన రెడ్డి, కాకాని వెంకటరత్నం, ఎం.ఎస్. లక్ష్మీనరసయ్య, కాజ రామనాథం, తోట రామస్వామి, శీలం సిద్దా రెడ్డి, నూకల రామచంద్రారెడ్డి, అరిగె రామస్వామి, ఎస్.వరప్రసాదరావు, పి. తిమ్మారెడ్డి, జె.వి.నరసింగరావు, కె.వి.నారాయణరెడ్డి, బి.వి.గురుమూర్తి, ఇబ్రహీం అలీ అన్సారీ, గౌతు లచ్చన్న, వావిలాల గోపాలక్రిష్ణయ్య, నరసింహారెడ్డి, చెంచు రామానాయుడు, కొండా లక్ష్మణ్ బాపూజీ, బ్రహ్మానందరెడ్డి.

ఈ పెద్దమనుషుల్లో చాలామంది సంతకం చేసి బయటకు వచ్చిన మరుక్షణం నుండి ఆలోచన మార్చుకున్నారు. ఒప్పందానికి వ్యతిరేకంగా విద్యార్థులు తెలంగాణాలోనే కాక ఆంధ్రలోకూడా ఆందోళన ప్రారంభించారు.

1969 ఫిబ్రవరి 28లోగా ఆంధ్రకు సంబంధించిన వుద్యోగస్తులంతా తెలంగాణా నుండి బదిలీ చేయబడతారని కేంద్రం నుండి మిగులు నిధుల విషయం పెంచడానికి ఆడిటర్ జనరల్ ను పంపిస్తామని అనేసరికి విద్యార్థులు రెచ్చిపోయారు. తెలంగాణా హక్కును కాపాడాలనే విద్యార్థులు వెనక్కు తగ్గగా ప్రత్యేక తెలంగాణా విద్యార్థులు విజృంభించారు. కొండా వెంకట రంగారెడ్డి ఒక ప్రకటన చేస్తూ బ్రహ్మానందరెడ్డిని బలపరచే ధోరణిలో ప్రస్తావన చేసాడు. సంతకం చేసి విజయవాడ వెళ్లిన గౌతు లచ్చన్న తదితరులను విద్యార్థులు నిలవేయగా, తనుచేసింది తప్పని, విద్యార్థులే నాయకులని లచ్చన్న సమయానుకూల ప్రసంగం చేసాడు. వెంగళరావు మాత్రం ఖమ్మం వెళ్ళి నిరాహారదీక్ష పూనిన రవీంద్రను మాన్పించాడు. అప్పటినుండి వెంగళరావు మాత్రం సమైక్యతకే నిలబడ్డాడు. తెలంగాణా ప్రాంతీయ సంఘ అధ్యక్షుడిగా ఉన్న జవ్వాది చొక్కారావు, విద్యార్థులు సమీపించగా అయోమయంగా మట్లాడి ప్రత్యేక తెలంగాణాకు అనుకూలమో కాదో తెలియని స్థితిలో వారిని అట్టిపెట్టాడు కానీ పరోక్షంగా విద్యార్థుల పక్షమే వహించాడు. వరంగల్ నుండి టి. పురుషోత్తమరావు మాత్రం ప్రత్యేక తెలంగాణాకు గట్టిగా పట్టుబట్టాడు. ఢిల్లీలో మంత్రిగా వుంటున్న చెన్నారెడ్డి వద్దకు ఆయన ప్రియశిష్యుడైన వెంకటరామిరెడ్డి తరచు వెళ్ళి సంప్రదిస్తూనే ఉన్నాడు. తెలంగాణాలో ఆంధ్రులపై అత్యాచారాలు జరిగాయి. ఆంధ్ర తెలంగాణా భేదభావం పల్లెటూళ్లకు బాగా ప్రాకింది.

తెలంగాణాలో జరుగుతున్న వ్యవహారం చూస్తూ ఆంధ్రులు వూరుకోలేకపోయారు. విద్యార్థులు సమ్మెలు, హర్తాళ్ళు చేసారు, కానీ అచిరకాలంలోనే పోలీసుల సహాయంతో ఆంధ్రలో ఆందోళనను అపివేయగలిగారు.

తెలంగాణాలో ఆందోళన వెనుక ఎవరో కొందరు వ్యక్తులున్నారంటూ ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి ప్రకటన చేశాడు. మంత్రులంతా సమైక్యతకై రాష్ట్ర పర్యటన చేయాలని నిర్ణయించుకొని పోలీసు కాపలాతో పర్యటన చేశారు.

తెలంగాణా ప్రజాసమితి సమావేశం జరిపించాలని ఫిబ్రవరి చివరలో నిర్ణయించారు. మదన్ మోహన్, టి.పురుషోత్తమరావు, వెంకటరామిరెడ్డి ప్రధానపాత్ర వహించారు. మంత్రులుగాని, శాసనసభ్యులుగాని బయట తిరగలేకపోయారు. ప్రత్యేక తెలంగాణా కోరినవారే వీధుల్లోకి రాగలిగారు. మొదట్లో నాయకత్వంలేని ప్రజాందోళన సాగింది. అనేకచోట్ల కాల్పులు జరిగాయి. వరంగల్ లో, నల్గొండలో, కరీంనగర్ లో ఆంధ్రులపై చేయి చేసుకోవడంతో కొందరు కట్టుబట్టలతో ఆంధ్రకు పారిపోయారు. అదిచూచి ఆంధ్రనుండి కొందరు లారీలలో కోదాడవరకు వచ్చి తెలంగాణావారిపై చేయి చేసుకోవాలనుకున్నారు.

1969 మార్చి 8, 9 తేదీలలో హైద్రాబాద్ లో తెలంగాణా పీపుల్స్ కన్వెన్షన్ జరిపారు. అప్పుడు సదాలక్ష్మి, టి. పురుషోత్తమరావు ప్రధాన పాత్ర వహించగా, ఉస్మానియా యూనివర్శిటీ వైస్.ఛాన్సలర్ రావాడ సత్యనారాయణ ప్రారంభోత్సవం చేసాడు. టి.అంజయ్య, జి.రాజారామ్,. జి.వి.సుధాకరరావు, ఎం.ఎం.హాషీం, ఎస్.బి.గిరి, మహదేవసింగ్, మాణిక్యరావు బయటపడి ప్రత్యేక తెలంగాణాకై నిలబడ్డారు. వుస్మానియా యూనివర్సిటీ నుండి విద్యార్థులు గట్టిగా నిలబడ్డారు. తెలంగాణా అంతటా ప్రత్యేక రాష్ట్ర నినాదం ఒక్కటే వినిపించింది. మార్చిలో తెలంగాణా బంద్ కు పిలుపు యిచ్చారు. ఈలోగానే బెల్లంపల్లి మొదలైన చోట్ల ఆంధ్ర, తెలంగాణా కార్మికుల మధ్య కొట్లాటలు జరిగాయి. ఉపాధ్యాయులు కూడా కొందరు బయటపడి ఉద్యమంలో దిగారు. తెలంగాణాలో అనేకమందిని చీలదీసి వుద్యమానికి

వ్యతిరేకంగా పనిచేయించడానికి బ్రహ్మానందరెడ్డి నిర్విరామంగా తన ఎత్తుగడలను ప్రయోగించాడు. తెలంగాణాలో యిచ్చిన మొదటిబంద్ పిలుపు జయప్రదంగా సాగింది. తెలంగాణా కన్వెన్షన్‌లో ఎ.మదన్ మోహన్ అధ్యక్షతన ఒక సంఘం ఏర్పడింది. ఆందోళనకు కావలసిన డబ్బు వసూలౌతూనే ఉంది. బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో సమాచారశాఖా మంత్రిగా ఉంటున్న కొండా లక్ష్మణ్ మార్చి 27న రాజీనామా యిచ్చాడు. ఇదే అదనుగా భావించిన తిమ్మారెడ్డి రాయలసీమ వారికి ప్రత్యేక హక్కులు కావాలంటూ ఒక సదస్సు ఏర్పాటు చేసాడు. అయితే తెలంగాణా ఉద్యమ తీవ్రతలో ఇవన్నీ అడుగున పడిపోయాయి.

దారితెన్నూ లేకుండా జరుగుతున్న తెలంగాణా ఆందోళనలో మదన్ మోహన్, ఎస్.బి.గిరి, మల్లికార్జున్ మొదలైన వారంతా జైళ్ళ పాలయ్యారు. పాఠశాలల నుండి విద్యార్థులంతా బయటకు వచ్చేసారు. తెలంగాణా అంతా సామూహికంగా సత్యాగ్రహ శిబిరాలు వెలిసాయి. సమైక్యతకై నిలబడిన కమ్యూనిస్టులు సైతం బహిరంగ సభలు పెట్టలేక పోయారు.

ఏప్రియల్ మొదటివారంలో సికిందరాబాద్‌లోని బూర్గుల మహదేవ్ హాలులో సమైక్యతా సమావేశం జరిపారు. ఫలితంగా ఆనాడు కాల్పులు జరిగాయి. ఈలోగా ఆంధ్ర ఉద్యోగుల బదిలీ విషయమై కొందరు కోర్టుకెక్కారు. ముల్కీ నిబంధనలు చెల్లవని హైకోర్టు తీర్పునిచ్చింది. ఇదంతా ఉద్యమానికి ఇంకా బలాన్ని చేకూర్చాయి. బ్రహ్మానందరెడ్డి పక్షాన జి.వెంకటస్వామి సమైక్యతా సభలు జరిపాడు. గోడమీది పిల్లివాటంగా ఉంటూ వచ్చిన కె.రాజమల్లు, టి.అంజయ్య, కె.రామచంద్రారెడ్డి, కె.ఎస్.నారాయణ, ఐరేని లింగయ్య ప్రత్యేక తెలంగాణా వాదంలోకి దిగారు.

ఇట్లా ఉద్యమం తీవ్రస్థాయిలోకి చేరుకునేటప్పుడు 1969, ఏప్రిల్ 11న ఢిల్లీలో ప్రధాని ఇందిర ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. చెన్నారెడ్డి, కొండాలక్ష్మణ్, నూకల రామచంద్రారెడ్డి, జె.చొక్కారావు, బ్రహ్మానందరెడ్డి, వి.బి.రాజు, కాకాని వెంకటరత్నం అందులో పాల్గొన్నారు. అప్పటికి ఆ సమావేశంలో ప్రత్యేక తెలంగాణా వాదాన్ని ఎవరూ తీసుకు రాలేదు. మంత్రివర్గ ఉపసంఘాన్ని మాత్రం పంపించవలసిందిగా చెన్నారెడ్డి కోరారు. ఆ సమావేశ ఫలితంగా ప్రధాని ఎనిమిది సూత్రాలను రూపొందించి లోక్ సభలో ప్రకటించారు. ఐనా దీనివలన తెలంగాణాలో పరిస్థితులు మెరుగు కాలేదు. తెలంగాణాకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని కొండాలక్ష్మణ్ బాపూజీ సూచించగా, కాశ్మీర్ వంటి స్థానం తెలంగాణాకు లభించాలని, వి.బి.రాజు ప్రతిపాదించాడు. మళ్ళీ రాష్ట్రాల పునర్విభజన సంఘం ఏర్పరచాలని జనసంఘం తీర్మానించింది. సోషలిస్టు నాయకుడు బద్రీవిశాల్ పిట్టి ప్రత్యేక తెలంగాణా వాదం చేసాడు. ఈ గందరగోళంలో కేంద్రం నుండి దామోదరం సంజీవయ్య వచ్చి ముఖ్యమంత్రి తెలంగాణా వారికి అన్యాయం చేస్తున్నాడనే ధ్వనితో ప్రకటన చేశాడు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రావాడ సత్యనారాయణకు వైస్ ఛాన్సలర్ పదవి యివ్వగానే. నూకల నరోత్తమరెడ్డి అంతవరకు ఊరుకున్న వాడల్లా ప్రత్యేక తెలంగాణా వాదాన్ని చేపట్టాడు. ఏప్రిల్ లో స్థానిక సంస్థల నియోజక వర్గం నుండి శాసన మండలికి జరిగిన ఎన్నికల్లో ప్రత్యేక తెలంగాణా వాదిగా వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ప్రభాకర రెడ్డిని ఓడించాడు.

ప్రధాన మంత్రి తెలంగాణాలో అనేకమందిని ఢిల్లీకి ఆహ్వానించి చర్చలు జరిపారు. అయినా ఫలితం దక్కలేదు. మహబూబ్ నగర్ జిల్లా నాయకుడు అచ్యుత రెడ్డి ప్రత్యేక తెలంగాణా వాదాన్ని ప్రారంభించాడు. ఒక ప్రక్కన ఆందోళన ముమ్మరంగా సాగుతుంటే ప్రదేశ్ కాంగ్రెసు క్రమశిక్షణ పేరిట వెంకటరామిరెడ్డి లాంటివారిని బహిష్కరించింది. తెలంగాణాకు వేరే ప్రదేశ్ కాంగ్రెస్ ఉండాలని కె.వి.రంగారెడ్డి ప్రకటించాడు. ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ఎదుగు బొదుగు లేకుండా కొంతవరకు హింసాయుతంగా జరుగుతున్నది. సరైన నాయకత్వం లేని లోపం కనిపించింది. ఆ సమయంలో ఉద్యమాన్ని మలుపుతిప్పే సంఘటన జరిగింది. చెన్నారెడ్డి ఎన్నిక చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. వందేమాతరం రామచంద్రరావు డా.చెన్నారెడ్డిపై ఓడిపోయి ఎన్నికలు పిటిషన్ పెట్టిన ఫలితంగా ఈ తీర్పు వచ్చింది. ఉద్యమానికి నాయకత్వం కావలసిన తరుణంలో ఇట్లాంటి తీర్పు రావడం చెన్నారెడ్డికి కలిసి వచ్చింది. అంతవరకు వెనుక ఉండి సలహాలివ్వడం, ప్రత్యేక తెలంగాణా ప్రస్తావించక పోవడం, మే 1న జరిగిన బ్రహ్మాండమైన ఊరేగింపులో కూడా ఆయన పాల్గొనక పోవడంతో చాలామంది ఆశ్చర్యపోయారు. కోర్టు తీర్పు రాగానే చెన్నారెడ్డిని అహ్వానించాలని వెంకటరామిరెడ్డి, సుధాకరరావు, పురుషోత్తమరావు, జనార్ధన రెడ్డి పట్టుబట్టారు. ఆయన రావడానికి ఇష్టపడనివారు ఎ. మదన్ మోహన్,

ఎస్.బి.గిరి, శ్రీధర్ రెడ్డి, వందేమాతరం రామచంద్రరావు ప్రభృతులు ఉన్నారు. తాము చెప్పినట్లు వింటామనే స్పష్టమైన హామీతో చెన్నారెడ్డి మే 22న ప్రజాసమితి అధ్యక్షుడైనాడు. ఆయన ప్రకటించిన నూతన కార్యవర్గం పట్ల వెంటనే కొందరు అసంతృప్తి చెందారు. ప్రజాసమితి నుండి చీలిపోయి శ్రీధర్ రెడ్డి పోటీ ప్రజాసమితి నేర్పరిచాడు. కానీ చెన్నారెడ్డి ధాటికి అది నిలువలేకపోయింది. ఈలోగా బ్రహ్మానందరెడ్డి తన సమైక్యతా ప్రయత్నాలను విరమించలేదు. మహబూబ్ నగర్ జిల్లా నాగర్ కర్నూలులో మే 25 తేదీన సమైక్యతా సభ ఏర్పాటు చేసాడు. అయితే పోలీసు కాపలాతోనే అది జరిపించారని చెప్పకతప్పదు.

1969 జూన్ 1న కొండా లక్ష్మణ్ అధ్యక్షుడుగా తెలంగాణా కాంగ్రెసు సంఘం ఏర్పడింది. చెన్నారెడ్డి ప్రవేశంతో ప్రజలకు కొత్త ఉత్సాహం వచ్చింది. ఆందోళన తీవ్రతరమైంది. ముఖ్యమంత్రి ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. తెలంగాణాలో చాలామంది గాలివాటపు నాయకులు ప్రత్యేక తెలంగాణాకోసం ప్రాణాలు తీసుకుంటామని వీరులుగా పోజుపెట్టారు.

1969 జూన్ 12న ఉద్యోగస్తులను సంతృప్తి పరచడానికి జీతాలు పెంచుతూ ముఖ్యమంత్రి అటునుంచి నరుక్కొచ్చే ప్రయత్నం చేశాడు. ఒకవైపున ప్రజలు రెచ్చిపోయి ఉంటే ప్రభుత్వం మొండి పట్టుదలతో 1969 జూన్ నుండి విద్యార్థులకు పరీక్షలు జరపాలని నిర్ణయించింది. ఎట్లా జరుపుతారో చూస్తామని ప్రజాసమితి పట్టుబట్టింది. ఫలితంగా పోలీస్ కాపలా వలన కూడా పరీక్షలు జరపలేకపోగా పగలు కూడా కర్ఫ్యూ పెట్టాల్సి వచ్చింది. బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కొనసాగాలా లేదా అనే మీమాంసలో వి.బి.రాజు నాయకత్వం వహించాడు. జూన్ 27న రాజీనామా ఇవ్వాలని కొందరు మంత్రులు తీర్మానించారు. ఇది తెలిసి బ్రహ్మానందరెడ్డి కొన్ని పై ఎత్తులు వేసాడు. ముందుగా సమైక్యతావాది గురుమూర్తిచే రాజీనామా యిప్పించాడు. జూన్ 28న వి.బి.రాజుతో సహా కొందరు మంత్రులు రాజీనామాలు సమర్పిస్తూ సమైక్యత కోసమే ఈ చర్య తీసుకున్నామన్నారు. వారి చర్యవల్ల ఎలాంటి ఫలితం లేకుండా ఉండే ఎత్తుగడలు వంటివి ముఖ్యమంత్రి వేశాడు. తానే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా యిస్తున్నట్లు ప్రకటించాడు. ఆ రాజీనామా లేఖను గవర్నరుకు కాక కాంగ్రెసు అధ్యక్షుడు నిజలింగప్పకు పంపించాడు. ఆ వార్త జంటనగరాలలో వ్యాపించగా చాలా హింసాకాండ జరిగింది. రాజకీయపు ఎత్తుగడల లోతుపాతులు తెలియనివారు తెలంగాణా సాధించినట్లేనని భావించారు. చివరకు కర్ఫ్యూ విధించాల్సిన పరిస్థితి మరోసారి ఏర్పడింది.

జూన్ 5వ తేదీన, జంటనగరాల్లో జరిగిన హింసాకాండ తెలిసి ప్రధాని ఇందిర అర్ధరాత్రి హైదరాబాద్ వచ్చి చెన్నారెడ్డితో సహా అందరితో కలిసి వెళ్ళింది. ఆ మరునాడు హోం మంత్రి చవాన్ వచ్చి తన ప్రయత్నం తాను చేసి వెళ్ళారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు నిజలింగప్ప, కొండాలక్ష్మణ్, చెన్నారెడ్డిలతో చర్చలు చేసినా ప్రయోజనం లేకపోయింది. వారందరిని అరెస్టు చేసి రాజమండ్రి జైలుకు పంపించారు. తెలంగాణాలో జరుగుతున్న హింసకు నిరసనగా రామానంద తీర్థ మే 27న నిరాహారదీక్ష ప్రారంభించాడు. తెలంగాణాలో హింసాకాండ రైళ్ళపై కూడా మళ్ళింది. తెలంగాణావారిని ముఖ్యమంత్రిని చేయాలని రామానందతీర్థ, నాయకత్వంలో మార్పు రావాలని వి.బి.రాజు, రాష్ట్రపతి పాలన పెట్టాలని కె.వి.నారాయణరెడ్డి ఎవరికి తగినట్లు వారు ప్రకటించారు. అంతవరకు సమైక్యతా వాదులుగా ఉన్న మేయర్ కుముద్ నాయక్ వంటివారు ప్రత్యేక రాష్ట్ర వాదులుగా మారారు. బ్రహ్మానందరెడ్డి రాజీనామా విషయమై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి 1969 జులై 6న కాంగ్రెస్ సమావేశం ఏర్పాటు చేశారు. అప్పటికే వి.బి.రాజు కాంగ్రెసును కాపాడండి అంటూ నినాదం యిచ్చాడు. తెలంగాణా శాసనసభ్యులు 30 మందితో ఒక ఫ్రంట్ గా శాసనసభలో ఏర్పడ్డారు.

బ్రహ్మానందరెడ్డిని ఎలాగైనా తొలగించాలని సంజీవయ్య, కొత్త రఘు రామయ్య, పెండేకంటి వెంకట సుబ్బయ్య ప్రయత్నాలు మొదలు పెట్టారు. తిమ్మారెడ్డి, కాకాని వెంకటరత్నం, పి.వి.నరసింహారావు మొదలైనవారు బ్రహ్మానందరెడ్డికి అనుకూలంగా నిలబడ్డారు.

1969 జులై 6న కామరాజునాడార్, నిజలింగప్ప పరిశీలకత్వాన హైద్రాబాద్ లో కాంగ్రెసు శాసనసభ్యుల సమావేశం జరిగింది. అందులో వి.బి.రాజు, నూకల రామచంద్రారెడ్డి, చొక్కారావు కూడా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పై విశ్వాసం

ప్రకటిస్తూ ఆయన కొనసాగాలని ఆ సమావేశం తీర్మానించింది. ఆ సమావేశానికి  తెలంగాణా నుండి 43 మంది శాసన సభ్యులు, శాసన మండలి నుండి 14 మంది పాల్గొన్నారు. మిగిలిన వారు ఆంధ్రులు. పి.వి.నరసింహారావు చేసిన ప్రతిపాదనను అక్కినేని భాస్కరరావు సమర్థించి బ్రహ్మానందరెడ్డి పట్ల విశ్వాసం ప్రకటించాడు. ఆబలంతో వెంటనే బ్రహ్మానందరెడ్డి అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలకు బెంగుళూరు వెళ్ళారు. కానీ జూలై 7నే జంటనగరాల్లోని హింసాకాండ ప్రజ్వరిల్లగా కర్ఫ్యూ విధించవలసి వచ్చింది. బెంగుళూరులో ఇందిరాగాంధీ వర్గానికి, సిండికేట్ గా పేరొందిన మూరార్జీ, సంజీవరెడ్డి వర్గానికి అంతర్యుద్ధం జరిగింది. బ్రహ్మానందరెడ్డి ఆనాడు ఇందిరాగాంధీకి అండగా నిలబడ్డాడు. బెంగుళూరు నుండి తిరిగి రాగానే బ్రహ్మానందరెడ్డి కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసాడు. అందులో సంజీవరెడ్డి అల్లుడు రాంభూపాల్ రెడ్డి చేరడానికి నిరాకరించాడు. అలాగే నూకల రామచంద్రారెడ్డి కూడా ఆ మంత్రివర్గంలో చేరడానికి సాహసించ లేకపోయాడు.

జూలై 19న కొత్త మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అప్పటికి నెలరోజులుగా జరుపుతున్న సమ్మెను ఎన్.జి.ఓ.లు విరమించు కున్నారు.

బ్రహ్మానందరెడ్డి ఏర్పరచిన కొత్త మంత్రివర్గంలో డిప్యూటీ ముఖ్య మంత్రిగా జె.వి.నరసింగరావును స్వీకరించారు. తనకు పచ్చి విరోధి అయిన జలగం వెంగళరావును, అయనకు ఖమ్మం జిల్లాలో విరోధి అయిన శీలం సిద్ధారెడ్డిని మంత్రివర్గంలో తీసుకున్నాడు. తెలంగాణా నుండి పి.వి. నరసింహారావు, ఇబ్రహీం అలీ అన్సారీ, లక్ష్మీ నరసయ్య, జి. సంజీవరెడ్డి కేబినెట్ మంత్రులుగా చేరారు. అక్కిరాజు వాసుదేవరావు, రోడామిస్త్రీ, వి.పురుషోత్తమ రెడ్డి, రామచంద్రరావు కళ్యాణి, రాజనరసింహాస్టేట్ మంత్రులుగా స్వీకరించబడ్డారు. ఆంధ్ర ప్రాంతం నుండి తోట రామస్వామి, పి.తిమ్మారెడ్డి, కె.విజయ భాస్కర రెడ్డి, కాకాని వెంకటరత్నం, ఎస్ చెంచు రామనాయుడు, ఆర్. రామలింగరాజు, అనగాని భగవంతరావు, కృష్ణమూర్తి నాయుడు, డి.పెరుమాళ్ళు కాబినెట్ మంత్రులుగాను, స్టేట్ మంత్రులుగా అనం సంజీవరెడ్డి, రొండ నారపు రెడ్డి, సాగి సూర్యనారాయణ రాజు, గుర్రం చినవెంకన్న, పాములపాటి అంకినీడు ప్రసాదు, ఎఫ్.ఆర్.అప్పల నాయుడు ఉన్నారు.

బ్రహ్మానందరెడ్డికి అన్నివేళలా సన్నిహితంగా ఉన్న వెనిగళ్ళ సత్యనారయణ, హరిజన ప్రతినిధులైన అరిగె రామస్వామి, టి.వి.రాఘువులు తొలగించబడ్డారు.

శ్రీధర్ రెడ్డి పోటీ ప్రజాసమితి పక్షాన నగరంలోని కాలనీలకు వెళ్ళి ఆంధ్రులకు వ్యతిరేకంగా ఉద్యమం జరగడంలేదని కళ్ళనీళ్ళు తుడవడానికి ప్రయత్నం చేశాడు. ఆగస్టు 11 నుండి నిరవధిక బంద్ జరపమని, స్వాతంత్రోత్సవం జరపవద్దని శ్రీధర్ రెడ్డి పిలుపు ఇచ్చాడు. అంతటితో ఆయన్ను అరెస్టు చేశారు. ఆగస్టు 26న ప్రివెంటివ్ డిటెన్షన్ క్రింద నిర్బంధంలో ఉన్న ప్రజా నాయకులందరిని విడుదల చేసారు. మళ్ళీ డా. చెన్నారెడ్డి, కొండా లక్ష్మణ్ ఢిల్లీలో ప్రధాన మంత్రిని కలిసి చర్చలు జరిపినా అవి శుష్క ప్రియాలుగానే నిలచిపోయినాయి.

## కేంద్రానికి ఎదిగిన నీలం సంజీవరెడ్డి

రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ మరణం వలన తిరిగి 1969 ఆగస్టు 30న ఎన్నిక జరగవలసి వచ్చింది. అప్పుడు లోక్ సభ స్పీకరుగా ఉన్న సంజీవరెడ్డి పేరును ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రతిపాదించింది. ఆ ఏడు బెంగుళూరు కాంగ్రెసు సమావేశంలో బ్యాంకు జాతీయీకరణ మొదలైన విషయాల పేరిట ఇందిరాగాంధీకి, సిండికేటుకు అభిప్రాయ భేదాలు బాహాటంగా బయట పడ్డాయి. సంజీవరెడ్డి అభ్యర్థిత్వాన్ని సిండికేటు వారు బలపరిచారు. అంతటితో పేరు ప్రతిపాదించిన ఇందిర చివరకు సంజీవరెడ్డిని బలపర్చకుండా ఇండిపెండెంటు అభ్యర్థి వి.వి.గిరిని సమర్థించింది. సంజీవరెడ్డికే ఓటు వేయాలని కాంగ్రెసు వారందరికి నిజలింగప్ప హుకుం జారీచేసాడు. ఉపరాష్ట్రపతిగా వున్న వి.వి.గిరి తన పదవికి రాజీనామా ఇచ్చి దేశమంతటా పర్యటించి బాగా ప్రచారం చేసుకున్నాడు. సంజీవరెడ్డి మాత్రం అలాంటి ప్రచారాలేమీ చేయలేదు. ఇందిర ధోరణి తెలుసుకున్న ఆంధ్ర కాంగ్రెస్ సభ్యులు శ్రీ బ్రహ్మానందరెడ్డి నాయకత్వాన వి.వి.గిరిని సమర్థించారు. అదేగాక సరిగ్గా ఎన్నికల సమయానికి సంజీవరెడ్డి గత చరిత్రంతా తవ్వితీసి కరపత్రాల్లో వేసి దేశంలో ఉన్న ఓటర్లందరికి ఎవరో పంపించారు. ఇది ఎవరో తెలియలేదు. వి.వి.గిరి ఒక విజ్ఞప్తి చేస్తూ ఎవరి మనసు చెప్పినట్లు వారు చెయ్యమన్నాడు. మొత్తం మీద ఆంధ్ర వరకు అధిక సంఖ్యాకులు నిజలింగప్ప విప్ కు వ్యతిరేకంగా వి.వి.గిరికే ఓటు

చేసారంటారు. బహిరంగంగా ప్రచారం చేసిన కాకాని వెంకటరత్నం పై క్రమశిక్షణ చర్య తీసుకోవడానికి నిజలింగప్ప ఉపక్రమించాడు. ఏమైనా కొద్ది తేడాతో వి.వి.గిరి నెగ్గాడు. కేంద్రంలో నిజలింగప్ప ఇందిరాగాంధీపై క్రమశిక్షణ చర్య గైకొనడానికి పూనుకోవడంతో వ్యవహారం పరాకాష్ఠకు చేరింది. కాంగ్రెసు రెండుగా చీలింది. ఇందిరాగాంధీ కాంగ్రెసుకు మద్దత్తుగా ఆంధ్ర నుండి బ్రహ్మానందరెడ్డి, సంజీవయ్య, రఘురామయ్య మొదలైనవారు నిలబడ్డారు. సంజీవరెడ్డికి అనుకూలంగా పెండేకంటి వెంకటసుబ్బయ్య, గొట్టిపాటి బ్రహ్మయ్య, వెంగళరావు ఉన్నారు.

ప్రజాసమితి డా.చెన్నారెడ్డి నాయకత్వాన నిర్వీరామంగా ఏదో ఒక ఆందోళన కొనసాగిస్తూనే పోయింది. 1969 సెప్టెంబరు 10న సామూహిక సత్యాగ్రహాలు జరపాలని సమితి పిలుపు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొనకపోతే సమితి కార్యవర్గంలో ఉన్నవారు పదవులు కోల్పోతారని డా.చెన్నారెడ్డి హెచ్చరించాడు. అంతటితో చెన్నారెడ్డికి, కొండా లక్ష్మణ్ బాపూజీల మధ్య భేదాభిప్రాయాల అఖాతం పెరిగి పోయింది. కొండా లక్ష్మణ్ ప్రజాసమితికి రాజీనామా ఇచ్చాడు. ఆ తరువాత తెలంగాణా అంతటా సమ్మేళనలు జరిపి నవంబరులో రాష్ట్రస్థాయి సమ్మేళనలు పెట్టాలని తీర్మానించారు. ఈ విషయమై డా.చెన్నారెడ్డితో కొందరు విభేదించారు. అందుకు నిరసనగా డా.చెన్నారెడ్డి తన అధ్యక్షపదవికి రాజీనామా ఇచ్చాడు. కానీ అధిక సంఖ్యాకులు డా.చెన్నారెడ్డి పక్షాన ఉండడంతో కొద్దిమంది మాత్రమే సమితి నుండి వెళ్ళిపోయారు. తిరిగి తరగతులకు హాజరు కావాలని మల్లికార్జున్ నాయకత్వాన విద్యార్థి సంఘం నిర్ణయించింది. అది అందరిని సంప్రదించకుండా తీసుకొన్న నిర్ణయమని విద్యార్థి నాయకులు కొందరు విమర్శించారు. 1969 అక్టోబరు 10న మల్లికార్జున్ ఆమరణ నిరాహారదీక్ష పూనాడు. కానీ ప్రజాసమితి ఈ నిర్ణయాన్ని హర్షించలేదు. ప్రజాసమితితో క్రమంగా స్తబ్ధత ఏర్పడింది. లోక్ సభకు, శాసన సభకు రాజీనామాలు ఇవ్వాలంటే ఎవరూ ముందుకు రాలేదు. చెన్నారెడ్డిని సంప్రదించకుండా ఢిల్లీ వెళ్ళి నాయకులతో చర్చించినందుకు మదన్ మోహన్ ను ప్రజాసమితి మందలించింది.

1970వ సంవత్సరం అంతా ప్రజాసమితి ఆందోళనస్థానే *రాజకీయం* చేపట్టింది. తెలంగాణాకు ప్రత్యేక ప్రదేశ్ కాంగ్రెస్ ఏర్పరచాలనే పాత కాంగ్రెస్ తీర్మానించగా రెండు కాంగ్రెస్ లు ప్రజలకు సమ్మతం కావని చెన్నారెడ్డి స్పష్టం చేసాడు. డా.చెన్నారెడ్డి ఇందిరాగాంధీని సమర్థించి నప్పటికీ ప్రజాసమితి ప్రయోజనం లేకపోయింది. వి.బి.రాజు శాసనసభలో తెలంగాణా ఐక్యసంఘటన ఏర్పరచి గందరగోళం చేసాడు. ఇందులో ప్రత్యేక తెలంగాణా వాదులు, ఉభయ కాంగ్రెస్ వాదులు, ప్రత్యేక తెలంగణాపై అంతగా పట్టుపట్టని వారూ ఉన్నారు. వీరంతా కలసి శాసన సభలో సుమారు 44 మంది ఉన్నారు. లోక్ సభలో కూడా ప్రజాసమితి పక్షాన 12 మంది సభ్యులు విడిగా కూర్చున్నారు. ఈలోగా రాజ్యసభకు వచ్చిన ఖాళీలో వి.బి.రాజు ఎన్నికై తన రాజకీయాన్ని ఢిల్లీకి మార్చాడు. అక్కడ ఆయన సంతకాల ఉద్యమం ప్రారంభించి 250 మంది పార్లమెంటు సభ్యుల సంతకాలతో 1970 సెప్టెంబరు 3న ఒక నివేదిక సమర్పించాడు. 'ఆత్మగౌరవంతో' తెలంగాణా సమస్యను పరిష్కరించాలని వేదాంతం చెప్పాడు.

చెన్నారెడ్డి మాత్రం ప్రత్యేక తెలంగాణా విషయమై బేరసారాలు లేవని వేరే రాష్ట్రం ఏర్పడవలసిందేనని ప్రకటనలు చేసాడు. ప్రజాసమితిని రాజకీయ పార్టీగా మార్చాలని సంకల్పించాడు. ఈ విషయమై ప్రజాసమితి నియమించిన ఒక ఉపసంఘం రాజకీయ పార్టీగా మార్చడం మంచిదని 1970 నవంబరు 17న సూచించింది. ఈ సూచనను అమలు పరిస్తే సోషలిస్టు రిపబ్లికన్ కాంగ్రెస్ పార్టీలవారికి సమితిలో స్థానం వుండదు. అయినప్పటికి ప్రత్యేక పార్టీ పెట్టాలనే నిర్ణయించారు. బద్రివిశాల్ పిట్టీ, జే. ఈశ్వరీబాయి, బి.సత్యనారాయణరెడ్డి, ప్రజాసమితి నుండి బయటికి పోవలసి వచ్చింది.

1970లో శాసన సభకు రెండు ఉపఎన్నికలు వచ్చాయి. ఒకటి సిద్ధిపేటలో రాగా అక్కడ ప్రజాసమితి పక్షాన ఎ.మదన్ మోహన్ గెలిచాడు. రాజధానిలో ఖైరతాబాద్ నియోజవర్గంలో కూడా ప్రజాసమితి అభ్యర్థే నెగ్గాడు. అది ప్రజల భావాలకు సూచనగా భావించారు. 1971 మార్చిలో జరిగిన లోక్ సభ ఎన్నికలో ప్రజాసమితి పక్షాన 14మంది పోటీచేయగా 10 మంది నెగ్గారు. వారు జె.రామేశ్వరరావు (నాగర్ కర్నూలు), జి.ఎస్.మేల్కోటే (హైదరాబాద్), ఎం.ఎం.హాషిం (సికింద్రాబాద్), జి. వెంకటస్వామి (సిద్ధిపేట), మల్లికార్జున్ (మెదక్), వి.తులసీరామ్ (పెద్దపల్లి), ఎం. సత్యనారాయణరావు (కరీంనగర్), కంచర్ల రామకృష్ణారెడ్డి (నల్గొండ), ఎస్.బి.గిరి (వరంగల్లు).

ఖమ్మంలో లక్ష్మీకాంతమ్మతో ప్రజాసమితి అభ్యర్థిగా చేకూరి కాశయ్య పోటీచేసి ఓడిపోయాడు. తెలంగాణాలో ప్రజాసమితికి, పోలైన ఓట్లలో 47.5 శాతం వచ్చాయి.

ఈ లోక్ సభ ఎన్నికల్లో ఆంధ్ర రాష్ట్ర ప్రాంతంలో ఇందిరా కాంగ్రెస్ తరఫున పోటీచేసిన సంజీవరెడ్డి, స్వతంత్ర పార్టీ తరఫున పోటీచేసిన రంగావంటి ప్రముఖులు ఓడిపోయారు. దేశవ్యాప్తంగా కూడా ఇందిరాగాంధీకి చాల పెద్ద మెజారిటీ వచ్చింది. అందువలన ప్రజాసమితి సభ్యులు 10 మంది పార్లమెంట్ లో ప్రత్యేకమైన పాత్ర నిర్వహించడానికి అవకాశం లేకుండ పోయింది. కర్తవ్యం ఏమిటనే మీమాంసలో ప్రజాసమితి పడింది.

స్వతంత్ర పార్టీ ఆ ఎన్నికల నాటికే దేశంలోనూ, రాష్ట్రంలోనూ ముఠాలుగా చీలింది. రంగాస్థానే మసానీని అధ్యక్షుని చేసారు. అప్పటినుంచి స్వతంత్ర పార్టీకి క్రమంగా రంగా దూరమౌతూ వచ్చాడు. రాష్ట్రంలో పార్టీకి అధ్యక్షుడుగా లచ్చన్న ఉన్నాడు. అయితే పార్టీ నానాటికీ క్షీణిస్తూ పోయింది. చాలమంది కాంగ్రెసుకు వెళ్ళిపోయారు.

1969లో బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో హోమ్ మంత్రిగా చేరిన వెంగళరావు ముఠాలుగా చీలిపోయిన అతివాద కమ్యూనిస్టులను అణచడానికి కంకణం కట్టుకొన్నాడు. వారు చేపట్టిన ఖతం ఉద్యమాన్ని ఖతం చేయడానికి పూనుకొన్నాడు. పోలీసులతో జరిగిన సంఘర్షణలో చనిపోయారంటూ చాలమంది నక్సలైట్లను కాల్చి చంపివేశారు. ఆ చర్యలని కాంగ్రెసువారు, స్వతంత్ర, జనసంఘంవారు సమర్థించడమే కాక ఇంకా కట్టుదిట్టంగా నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేయాలన్నారు. వెంగళరావును శ్లాఘించారు. హోమ్ మంత్రిగా రాష్ట్రంలో శాంతి భద్రతలను నెలకొల్పడానికి వెంగళరావు సమర్థవంతంగా పని చేసాడన్నారు. కానీ పోలీసులతో సంఘర్షణ అనేది కేవలం కట్టుకథ అని, పట్టుకొని కాల్చి చంపారని కమ్యూనిస్టులు స్పష్టంగా ఆరోపించారు. అయితే అనేక ముఠాలుగా చీలిపోయిన కమ్యూనిస్టు పార్టీ ఈ విషయంలో ప్రభుత్వాన్ని ఏ విధంగానూ ఎదుర్కొనలేకపోయింది. తీవ్రవాదుల్లో పరస్పరం దూషణ, విమర్శలు విపరీతంగా పెరిగిపోయాయి. చివరకు జైళ్ళలో కూడా కొట్టుకున్నారంటే కలహాలు ఏ స్థాయికి పోయాయో ఊహించవచ్చు.

పాతకాంగ్రెసులో చేరిన పెండేకంటి వెంకటసుబ్బయ్య, గొట్టిపాటి బ్రహ్మయ్య అచిర కాలంలోనే ఇందిరాకాంగ్రెస్ లో చేరిపోయారు. సంజీవరెడ్డి తాత్కాలికంగా రాజకీయ సన్యాసం స్వీకరించాడు.

ప్రజాసమితి పక్షాన చెన్నారెడ్డి 1971 ఎన్నికల అనంతరం ప్రధాని శ్రీమతి ఇందిరను కలిసి చర్చలు ప్రారంభించాడు. దాని ఫలితంగా ఆరు సూత్రాల పథకం వచ్చింది. ఈ సూత్రాలననుసరించి తెలంగాణాకు వేరే బడ్జెట్, వేరే లెక్కలు ఉండాలి. ముల్కీ నిబంధనలు కొనసాగించాలి. తెలంగాణా ప్రాంతీయ సంఘానికి చట్టబద్ధమైన అధికారం ఉండాలన్నారు. తెలంగాణాకు వేరే కాంగ్రెస్ కమిటీ ఉండాలన్నారు. మూడు సంవత్సరాల అనంతరం పరిస్థితిని సమీక్షించాలి. తెలంగాణాకు ముఖ్యమంత్రి పదవి రావడానికి వీలుగా బ్రహ్మానందరెడ్డి రాజీనామా ఇవ్వాలి. ప్రధానికి డా.చెన్నారెడ్డికి కుదిరిన ఈ ఆరుసూత్రాల ఒప్పందం వలన 1971 సెప్టెంబరు 18న ప్రజాసమితి కాంగ్రెస్ లో కలిసిపోయింది. బ్రహ్మానందరెడ్డికి శాసనసభలోని 287 మంది కాంగ్రెసు సభ్యులలో 220 మంది అనుకూలంగా ఉన్నారు. అయినప్పటికి ఇందిరాగాంధీ సూచనపై బ్రహ్మానందరెడ్డి రాజీనామా ఇవ్వక తప్పలేదు. అంతటితో 1956 నుండి సాగుతూ వచ్చిన 'రెడ్డి' ఆధిపత్యం రాజకీయాలలో వెనుకంజ వేసింది. ప్రజలతోకాని శాసన సభ్యులతో కాని నిమిత్తం లేకుండా కేంద్రం తీసుకొన్న నిర్ణయాల ఫలితంగా రాష్ట్రంలో నాయకత్వంలో మార్పులు జరిగాయి.

---

## ముఖ్యమంత్రి – కె. బ్రహ్మానందరెడ్డి

29-02-1964 నుంచి 6-03-1967

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | కె. బ్రహ్మానందరెడ్డి | కార్యనిర్వాహక మరియు ఆర్థిక |
| 2. | ఎన్. రామచంద్రారెడ్డి | భూమి పన్నులు |
| 3. | డా. ఎమ్. చెన్నారెడ్డి | ప్రణాళిక మరియు పంచాయతీ రాజ్ |
| 4. | పి. వి. జి. రాజు | విద్యాశాఖ |
| 5. | ఎ. సి. సుబ్బారెడ్డి | పబ్లిక్ వర్క్స్ |
| 6. | మీర్ అహ్మద్ ఆలీ | గృహనిర్మాణ శాఖ |
| 7. | వై. శివరామ్ ప్రసాద్ | ఆరోగ్య మరియు వైద్య సహకార శాఖ |
| 8. | ఎమ్. ఎన్. లక్ష్మి నరసయ్య | పరిశ్రమలు |
| | **రాష్ట్ర మంత్రులు** | |
| 9. | ఎమ్. ఆర్. అప్పారావు | పన్నులు మరియు ప్రొహిబిషన్ |
| 10. | పి. వి. నరసింహారావు | న్యాయ మరియు కారాగారాలు |
| 11. | ఆలపాటి వెంకటరామయ్య | మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ |
| 12. | శ్రీమతి టి. ఎన్. సదా లక్ష్మి | దేవాదాయ మరియు చిన్న పొదుపు పథకాలు |
| 13. | ఎ. బలరామి రెడ్డి | వ్యవసాయ శాఖ |
| 14. | బి. వి. గురుమూర్తి | కార్మిక మరియు రవాణా |

## ముఖ్యమంత్రి – కె. బ్రహ్మానందరెడ్డి

6-03-1967 నుంచి 18-07-1969

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | కె. బ్రహ్మానందరెడ్డి | కార్యనిర్వాహక, ప్రణాళిక మరియు పెద్దతరహా పరిశ్రమలు |
| 2. | పి. తిమ్మారెడ్డి | వ్యవసాయ మరియు జంతు సంరక్షణ |
| 3. | వి. బి. రాజు | భూమి పన్నులు |
| 4. | తోట రామస్వామి | పంచాయతీ రాజ్ |
| 5. | జె. వి.నర్సింగరావు | నిర్మాణ మరియు హైవేస్ |
| 6. | టి. వి. రాఘవులు | పన్నులు, ప్రొహిబిషన్ మరియు |

| | | |
|---|---|---|
| | | విద్యాశాఖ |
| 7. | కొండా లక్ష్మణ్ బాపూజీ | కార్మిక మరియు సమాచార శాఖ |
| 8. | డా. ఎమ్. చెన్నారెడ్డి | ఆర్థిక శాఖ |
| 9. | ఎ. సి. సుబ్బారెడ్డి | గృహనిర్మాణ మరియు వ్యాపార పన్నులు (కమర్షియల్ టాక్సస్) |
| | **రాష్ట్ర మంత్రులు** | |
| 10. | పి. వి. నరసింహారావు | న్యాయ మరియు దేవాదాయ శాఖ |
| 11. | బి. వి. గురుమూర్తి | పరిశ్రమలు |
| 12. | ఎన్. చంద్రబాబు నాయుడు | మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ |
| 13. | కె. విజయ భాస్కర రెడ్డి | సహకార శాఖ |
| 14. | ఆర్. రామలింగ రాజు | సాంఘిక సంక్షేమ శాఖ |
| 15. | ఎస్. సిద్ధా రెడ్డి | మెడిసిన్ మరియు చిన్న నీటి పారుదల శాఖ |
| 16. | కె. వి. నారాయణ రెడ్డి | ప్రణాళికలు మరియు వ్యాపార శాఖ |
| 17. | ఎమ్.డి. ఇబ్రహీం అలీ అన్సారీ | జైళ్ళు మరియు వక్ఫ్ |
| 18. | అరిగె రామస్వామి | సాంఘిక సంక్షేమ శాఖ |
| 19. | వి. సత్యనారాయణ స్వామి | పన్నులు మరియు ప్రొహిబిషన్ |

ముఖ్యమంత్రి – **కె. బ్రహ్మానందరెడ్డి**

1969 నుంచి 1971 వరకు

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | కె. బ్రహ్మానందరెడ్డి | కార్యనిర్వాహక, ఆర్థిక శాఖ, భారీ పరిశ్రమలు మరియు ప్రొహిబిషన్ |
| 2. | జె. వి. నరసింగరావు | ప్రణాళికలు, రోడ్లు మరియు నిర్మాణాలు (బిల్డింగ్స్) |
| 3. | జె. వెంగళరావు | గృహ నిర్మాణ శాఖ |
| 4. | పి. తిమ్మారెడ్డి | భూమి పన్ను |
| 5. | కాకానివెంకట రత్నం | పంచాయతీ రాజ్ |

| | | |
|---|---|---|
| 6. | తోట రామస్వామి | పంచాయతీ రాజ్ |
| 7. | డా. ఎమ్. ఎన్. లక్ష్మి నరసయ్య | రవాణాశాఖ |
| 8. | ఎమ్. చెంచు రామనాయుడు | మునిసిపల్ అడ్మినిస్ట్రేటర్ |
| 9. | ఆర్. రామలింగ రాజు | దేవాదాయ శాఖ |
| 10. | ఎస్. సిద్ధారెడ్డి | భారీ నీటిపారుదల శాఖ |
| 11. | ఎమ్. ఇబ్రహీం అలీ అన్సారీ | ఆరోగ్య మరియు మెడిసిన్ |
| 12. | ఎ. భగవంత రావు | చేనేత |
| 13. | వి. కృష్ణమూర్తి నాయుడు | విద్యుత్తు |
| 14. | జి. సంజీవరెడ్డి | కార్మిక శాఖ |
| 15. | డి. పెరుమాళ్ళు | సాంఘిక సంక్షేమ శాఖ |
| 16. | కె. విజయ భాస్కర రెడ్డి | సహకార శాఖ |
| 17. | పి. వి. నరసింహారావు | విద్యాశాఖ |
| 18. | సాగి సూర్యనారాయణ రాజు | అటవీ శాఖ |
| 19. | ఎ. వాసుదేవ రావు | సమాచార శాఖ |
| 20. | ఆనం సంజీవరెడ్డి | పౌరసరఫరాల శాఖ |
| 21. | రామచంద్రరావు కల్యాణి | మార్కెటింగ్ |
| 22. | రొండా నారప రెడ్డి | మధ్యతరహా నీటిపారుదల శాఖ |
| 23. | శ్రీమతి రోడా మిస్త్రి | స్త్రీ సంక్షేమ మరియు పర్యాటక శాఖ |
| 24. | గుర్రం చిన వెంకన్న | చిన్న పరిశ్రమల శాఖ |
| 25. | పి. పురుషోత్తం రెడ్డి | చిన్న తరహా నీటిపారుదల శాఖ |
| 26. | సి. రాజ నరసింహ | గృహ మరియు వసతి నియంత్రణ |
| 27. | పి. అంకినీడు ప్రసాద్ | వ్యాపార మరియు ఎక్స్ పోర్ట్ కంట్రోల్ |
| 28. | ఎస్.ఆర్.ఎ.ఎస్.అప్పల నాయుడు | మత్స్య మరియు పోర్ట్స్ |

-------

# పి. వి. నరసింహారావు పాలనలో రాష్ట్రం

ప్రధాని ఇందిర సూచనపై సమైక్యవాది, కరీంనగర్ హుజురాహబాద్ తాలూకాకు చెందినవాడు, బ్రాహ్మణుడు, భూస్వామి, సనాతనుడు, బహుభాషలు తెలిసినవాడు అయిన పి.వి. నరసింహారావును ముఖ్య మంత్రిగా నిర్ణయించారు. అతని మంత్రివర్గంలో బి.వి.సుబ్బారెడ్డిని ఉపముఖ్య మంత్రిగా స్వీకరించారు. మిగిలిన మంత్రులు తోట రామస్వామి, కాకాని వెంకటరత్నం, చెంచు రామానాయుడు, కె.అచ్యుత రెడ్డి, జె.చొక్కా రావు శీలం సిద్ధారెడ్డి, అన్సారీ, ఆర్. రామ లింగరాజు, అనగాని భగవంతరావు.

ఆంధ్ర ప్రదేశ్ లో కాంగ్రెస్ ను మరమ్మత్తు చేయడానికి కేంద్రం పూనుకుని మూడు నెలల పాటు ఎడతెరిపి లేకుండా చర్చలు జరిపింది. వాటి ఫలితంగా కాకినాడకు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ ను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుణ్ని చేసింది. తెలంగాణాకు చెందిన టి.అంజయ్యను ఉపాధ్యక్షుడిని చేసింది. 97 మంది సభ్యులతో తాత్కాలిక సంఘం ఏర్పరిచారు. అందులో 39మంది కార్యనిర్వాహక వర్గం అన్నారు. తెలంగాణా నుండి 16 మందిని, కోస్తా ఆంధ్ర నుండి 14 మందిని రాయలసీమ నుండి 9 మందిని ఈ కార్యనిర్వాహక వర్గంలోకి తీసుకున్నారు. 15 మంది సభ్యులతో కూడిన ఎన్నికల సంఘాన్ని ఏర్పరిచారు. బ్రహ్మానందరెడ్డికి కాని ఆయనకు సన్నిహితుడైన విజయభాస్కరెడ్డికి కాని ఈ సంఘాల్లో చోటులేకుండా చేసారు.

తెలంగాణాకు 16 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక ఎన్నికల సంఘాన్ని వేసారు. ఆరుసూత్రాల పథకం క్రింద ఏర్పరచవలసిన ప్రత్యేక కాంగ్రెస్ ఏర్పడలేదు. కానీ ప్రత్యేక ఎన్నికల సంఘం ఏర్పడింది. ప్రత్యేక కాంగ్రెసుకు మాత్రం సమైక్యతావాదులు ఒప్పుకోలేదు. 1972లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థులను నిర్ణయించే నిమిత్తం సన్నద్ధమయ్యారు. జిల్లా కాంగ్రెస్ సంఘాల సిఫార్సులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని తాత్కాలిక రాష్ట్ర సంఘం నిర్ణయించింది. దీనికిగాను పి.వి.నరసింహారావు, మహమ్మద్ ఇస్మాయిల్, చెన్నారెడ్డి, టి. అంజయ్య ఒక ఉపసంఘంగా ఏర్పడ్డారు. జిల్లాల నుండి రాజధానికి పిలిపించి మంతనాలు జరిపారు. రాష్ట్ర సంఘం ఏర్పడినట్లే జిల్లాలలో కూడా ఆపత్కాలపు సంఘాలను ఏర్పరిచారు. ఎన్నికలలో 60 శాతం వెనుకబడిన తరగతులకు, హరిజనులకు, గిరిజనులకు, అల్ప సంఖ్యాక వర్గాలకు అసెంబ్లీ స్థానాలను ఏర్పరచాలని కేటాయించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఇస్మాయిల్ ను, టి. అంజయ్యను పిలిపించి అభ్యర్థులను ఎన్నిక విషయమై పాటించవలసిన నిబంధనలు చర్చించారు. కాంగ్రెస్ ఎన్నికల సంఘం సభ్యులు కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు. అయితే అనుకున్న నిబంధనలేవీ ఆచరణలో పెట్టలేదు. అధ్యక్షుడు ఇస్మాయిల్ మాత్రం పోటీ చేయలేదు. ఉన్నత పదవులు నిర్వహిస్తున్నవారు గాని, సమితి అధ్యక్షులు గాని ఎన్నికల్లో పోటీ చేయదలచుకుంటే పదవులకు రాజీనామా చెయ్యాలన్నారు. 65 సంవత్సరాలు దాటిన వారికి సీట్లు ఇవ్వకూడదనుకున్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ సంఘ కార్యనిర్వాహక సభ్యులు పోటీ చేయాలా వద్దా అనే విషయం తేల్చుకోలేక పోయారు. సీలింగ్ కు మించి భూములున్నవారు అనర్హులన్నారు. కానీ తీరా అభ్యర్థులను నిర్ణయించడంలో ఈ సూత్రాలకు ప్రాధాన్యత ఇవ్వక ఏ నియోజకవర్గంలో ఎవరు నెగ్గుతారనేది ప్రధానంగా దృష్టిలో పెట్టుకున్నారు.



సమైక్యతావాదులకు, తెలంగాణా వాదులకు సీట్ల నిర్ణయంలో ఒక పట్టాన రాజీ కుదరలేదు. లోక్ సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను బట్టి స్థానాలను నిర్ణయించాలని చెన్నారెడ్డి పట్టుబట్టాడు. అలాగైతే ఉన్న ఎమ్.ఎల్.ఎ.లకు చాలామందికి ఉద్వాసన చెప్పాల్సి వస్తుంది. కనుక సమైక్యతా వాదులు అందుకు అంగీకరించలేదు. చివరకు అంతకు ముందున్న ఎం.ఎల్.ఎ.లు 64 మందికి స్థానాలు లభించాయి. మిగిలినవి, ప్రజాసమితివారు, సమైక్యతా వాదులుపంచుకున్నారు. మొత్తం 287 స్థానాలకు 4000 పై చిలుకు దరఖాస్తులు వచ్చాయి. కొన్ని నియోజక వర్గాలలో పేర్లు 30 వరకు పోయాయి. ఆ సందర్భంలో టికెట్టు కోరేవారు చేసిన హడావుడి, పెట్టిన ఖర్చు, వినియోగించిన పద్ధతులు వర్ణనాతీతం. రాష్ట్ర నాయకత్వంలో బ్రహ్మానందరెడ్డి స్థానే పి.వి.నరసింహారావు రావడం వలన ఈ అవకాశాన్ని తీసుకుని దామోదరం సంజీవయ్య ఒకవైపున, మర్రి చెన్నారెడ్డి మరొకవైపున ప్రముఖ పాత్ర వహించడానికి కృషి చేశారు. అందులోనూ బ్రాహ్మణులు ప్రకాశం పంతులు తరువాత, మళ్ళీ ఇన్నాళ్ళకు తమకు ప్రాధాన్యత వచ్చినట్లు భావించారు. మిగిలిన కులాలకు వ్యతిరేకంగా బ్రాహ్మణులు తమ ఆధిక్యతను నిలబెట్టు కోవడానికి హరిజనుల్ని వెనుకబడిన వార్ని కలుపుకోవాలని ప్రయత్నించారు. కేంద్రంలో ఇందిరాగాంధీ వేసిన ఎత్తుగడను రాష్ట్రంలో పి.వి.నరసింహారావు తెలివిగా అనుసరించాడు. చివరకు ఎన్నిక సంఘంలో పి.వి.నరసింహారావు, ఇస్మాయిల్, చెన్నారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వి.బి.రాజు తుది నిర్ణయాలు తీసుకోవడానికి కారకులైనారు. ఇందులో తాను పోటీ చేయబోవడం లేదని బ్రహ్మానందరెడ్డి

ప్రకటించడంతో పి.వి.నరసింహారావు నాయకత్వం ఇంచుమించు స్థిరపడినట్లే అయింది. చెన్నారెడ్డి ఆరేళ్ళవరకు ఎన్నికల్లో పోటీచేసే అర్హత కోల్పోయాడు. వి.బి.రాజు రాజ్యసభ సభ్యుడు కనుక ఆయనతోనూ సమస్య లేకుండా పోయింది.

జిల్లా కాంగ్రెస్ సంఘాల సిఫారసులు పనిచేయలేదు. కేంద్రం నుండి వచ్చిన మనూభాయిషా హైద్రాబాదులో 11 రోజులు కూర్చుని అభ్యర్థుల నిర్ణయానికి తోడ్పడ్డాడు. జిల్లా సంఘాలిచ్చిన సిఫారసులన్నీ పరిశీలించారు. వ్యక్తుల పూర్వాపరాలు తెలుసుకున్నారు. ఈలోగా యువ కాంగ్రెస్ వారు ఒక ప్రకటన చేస్తూ మిల్లు యజమానులు, బస్ రూటు యజమానులు, పారిశ్రామిక పేత్తలు దరఖాస్తులు పెట్టుకున్నా టికెట్టు ఇవ్వరాదని పట్టుబట్టారు. తమకు ఎక్కువ ప్రాతినిధ్యం కావాలని కోరుతూ క్రైస్తవులు ఒక ఎన్నికల సంఘాన్ని ఏర్పరచి విజ్ఞప్తులు చేశారు. అలాగే విశ్వ బ్రాహ్మణ సంఘం, లంబాడీల సంఘం, దళిత జాతుల సంఘం, హరిజనుల సంఘం, కార్మికుల సంఘాలు తమతమ వర్గాలకు ప్రాతినిధ్యం ఎక్కువగా వుండాలంటూ గొడవచేశారు. మొత్తం మీద 1967తో పోలిస్తే ఈసారి 244 స్థానాలలో అభ్యర్థులను నిర్ణయించి కేంద్రానికి సిఫారసు చేయగలిగారు. 1967తో పోల్చి చూస్తే లోగడ రెడ్లకు 69 స్థానాలు ఇవ్వగా ఈసారి 47 మాత్రమే లభించాయి. లోగడ 47 స్థానాలు కమ్మకులానికి చెందగా ఈసారి 29 మాత్రమే ఇచ్చారు. మిగిలిన పెద్ద కులాలకు 53 స్థానాలు 1967లో ఉండగా, ఈసారి 49 ఇచ్చారు. ఏమైనా రెడ్లకున్న ప్రాధాన్యత, కమ్మకుల ఆధిక్యత తగ్గించడానికి బాగా ప్రయత్నం జరిగింది. 46 శాతం పెద్ద కులాలకు లభించాయి. వెనుకబడిన తరగతులకు 64 స్థానాలు, గిరిజనులకు 9, హరిజనులకు 37, అల్పసంఖ్యాక వర్గాలకు 40, స్త్రీలకు 30 లభించాయి. వీటన్నిటినీ బలహీన వర్గాలుగా చిత్రీకరించారు. ఊరూపేరూ లేనివారికి స్థానాలిచ్చారని కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి వారు విమర్శించారు. 65 సంవత్సరాలు దాటినవారు మంత్రివర్గంలో ఉండటం వలన వారికి ఇవ్వాలా వద్దా అన్న మీమాంస వచ్చింది. బి.వి.రెడ్డి, కాకాని వెంకటరత్నం, పి.బసిరెడ్డి, రుద్రరాజు రామలింగరాజు ఈ కోవకు చెందినవారు. వారు ఉండాల్సిందేనని పి.వి.నరసింహారావు పట్టుబట్టాడు. అవినీతిపరులైన 11 మంది మంత్రులకు స్థానాలివ్వరాదని కేంద్రం నుండి వచ్చి మనూభాయిషా నివేదిక సమర్పిం చాడు. ప్రదేశ్ కాంగ్రెస్ జాబితాలు ఎంత రహస్యంగా ఉంచుదామన్నా దాగలేదు. 1972 జనవరి 26కల్లా జాబితాలతో సహా పోటీచేయదల్చినవారు దింపుడు కళ్ళ ఆశవారు, వ్యవహారమేదో ఢిల్లీలో తేల్చుకుందామనుకునే వారు భారత రాజధానిలో తిష్టవేసారు. ఆంధ్రప్రదేశ్ జాబితాను కొల్లూరు మల్లప్ప అనే మాజీ శాసన సభ్యుణ్ణి పరిశీలించమన్నారు. ఇదంతా అయిన తరువాత జనవరి 31న, ఫిబ్రవరి 1న ఆంధ్ర ప్రదేశ్ జాబితాను చాలా మార్పులతో కేంద్రం విడుదల చేసింది. 230 శాసన సభ్యులతో 116 మందికే తిరిగి స్థానాలు లభించాయి. అవినీతిపరులుగా మనూభాయిషా పేర్కొన్న వారికి మళ్ళీ సీట్లు దొరికాయి. 33 మంది స్త్రీలకు, 15 మంది ముస్లింలకు 5గురు క్రైస్తవులకు స్థానాలిచ్చారు. వెనుకబడిన తరగతుల వారిని ఉద్ధరిస్తామని ఉపన్యాసాలు చెప్పినంతగా ఆచరణలో కనిపించలేదు. మాజీ ప్రజాసమితిలో చెన్నారెడ్డి పక్షానికి 22 స్థానాలు, ఆయన ప్రత్యర్థులకు 15 స్థానాలు మాత్రమే లభించాయి. కేంద్ర కాంగ్రెసువారు ఇచ్చిన సూచనల్ని వారే పాటించలేదు. కొన్ని స్థానాలకు చివరి నిముషం వరకు అభ్యర్థులను నిర్ణయించలేక పోయారు.

కాంగ్రెసుకు దరఖాస్తులు పెట్టుకునేవారు ఒకవేళ సీటు రాకపోతే కాంగ్రెసు నుండి వైదొలగి పోటీచేయబోమని హామీ ఇస్తూ ఒక ప్రతిజ్ఞా పత్రాన్ని సమర్పించవలసి ఉన్నది. అందరూ అలాగే వ్రాసి ఇచ్చారు. తీరా ఎన్నికల సమయానికి 14 మంది శాసన సభ్యులతో సహా, 200 మంది కాంగ్రెసువారు ఎదురు తిరిగి పోటీ చేసారు. కాంగ్రెసువారు కొన్నిచోట్ల చివరి నిముషం వరకు అభ్యర్థులను నిర్ణయించలేక పోవడంతో ఎదురు తిరిగినవారు, ముందుగానే కృషి చేసుకోవడంతో వారిపని సులువైంది.

కాంగ్రెస్ పై ఎదురు తిరిగిన వారిని ఎట్టి పరిస్థితులలోను సహించేది లేదని ఇస్మాయిల్, పి.వి.నరసింహారావు పదేపదే హెచ్చరికలు చేయడం వల్ల 97 మందిని 6 సంవత్సరాలపాటు కాంగ్రెసు నుండి బహిష్కరించారు. మరొక 300 మందిని తొలగించారు. అందులో మాజీ మంత్రులు, ప్రదేశ్ కాంగ్రెసులో ప్రముఖులు, ఎన్నికైన శాసన సభ్యులు ఉన్నారు. అఖిల భారత కాంగ్రెస్ సభ్యులు ఈ చర్యల పట్ల తీవ్ర నిరసన తెలియజేస్తూ ఇది ఏకపక్షంగా జరిగిందన్నారు. బ్రహ్మానందరెడ్డి ముఠా ఈ క్రమశిక్షణ చర్యకు బాగా గురైంది. బ్రహ్మానందరెడ్డి సోదరుడు వెంగళరెడ్డితో సహా జిల్లా పరిషత్ అధ్యక్షులుగా ఉన్న చాలమంది కాంగ్రెసుకు వ్యతిరేకంగా పనిచేసినందున వారిని సస్పెండ్ చేసారు. ఇస్మాయిల్ ఈ విషయంలో మొహమాటాలు లేకుండా పార్టీ ఆదేశాన్ని అక్షరాలా పాటించారు. కానీ కాంగ్రెసు వారి చిత్తశుద్ధిని, పాదరసం వంటి వారి మనస్సును అవగాహన చేసుకోలేకపోయాడు. ముఖ్యమైన వారిని తొలగించబోయేముందు ఇస్మాయిల్ కేంద్రాన్ని సంప్రదిస్తే వారు అతని చర్యని ఆపేశారు. బ్రహ్మానందరెడ్డి ముఠా చేసిన విజ్ఞప్తి దృష్ట్యా కేంద్ర కాంగ్రెస్ మళ్ళీ

అందరినీ మాతృవడిలోకి స్వీకరించింది. ఇలా జరుగుతుందని బహిరంగంగా తిరుగుబాటు చేసిన కాంగ్రెస్ వారికి స్పష్టంగా తెలుసు.

ఎన్నికల్లో ఇందిర ప్రభంజనం బాగా పనిచేసింది. అదీకాక బలహీన వర్గాలవారు కట్టగా కాంగ్రెసుకు ఓటు వేశారు. గోడలమీద రాసిన అత్యాచారాలను, కాంగ్రెస్ వ్యతిరేకతను, తెలంగాణా ప్రజలు మర్చిపోయి సంపూర్ణ తెలంగాణా ప్రజాసమితిని చిత్తుగా ఓడించారు. కాంగ్రెస్ పార్టీకి లోగడకంటే 11 స్థానాలు తగ్గినప్పటికి 219 స్థానాలు గెల్చుకున్నారు. స్వతంత్ర పార్టీ మరీ నేలగరిచింది. వారికి బతుకు జీవుడా అంటూ రెండే స్థానాలు వచ్చాయి. ఎదురు తిరిగిన కాంగ్రెస్ స్వతంత్రులకు 53 స్థానాలు వచ్చాయి. మార్క్సిస్ట్ పార్టీకి ఒకే ఒక స్థానం కూడా రాకపోయినట్లయితే మరీ పరువు పోయేది. సి.పి.ఐ.కి 7 స్థానాలు వచ్చాయి. సిండికేటు కాంగ్రెసుకు పోటీ చేసిన 11కు ఒక స్థానం కూడా దక్కలేదు. అలాంటి గతే జనసంఘానికి కూడా పట్టింది. స్త్రీలు 26 మంది నెగ్గడం పెద్ద విశేషంగా చెప్పుకొనవచ్చు. ముస్లింలు 10మంది నెగ్గారు. అయితే మొత్తం మీద ఫలితాలు చూస్తే వెనుకబడిన వర్గాలు కొద్దిగా తమ బలాన్ని పెంచుకున్నా అగ్రకులాల శాతం ఆట్టే ఎక్కువగా తగ్గలేదు. ఐతే రెడ్లకంటే, కమ్మ, వెలమ కులాలు  కొంచెం పైచేయి అనిపించుకున్నాయి.

పి.వి.నరసింహారావు మంత్రి వర్గాన్ని 5 నెలల పాటు చవిచూచిన కాంగ్రెసువారు ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగడానికి కొన్ని అభ్యంతరాలు చెప్పారు. ప్రతిదానికి ఢిల్లీ పరుగెత్తుతాడని, అధికారంలో ఉన్న 5 నెలలలో సగం రోజులు ఢిల్లీలోనే కాపురం పెట్టాడని, ఇది రాష్ట్రానికి మంచిది కాదని అన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన పార్టీ వారికి అందుబాటులో లేకుండా పోయాడని ఇంకొక విమర్శ, పరిపాలన రంగంలో కూడా ఫైళ్ళు పేరుకు పోవడం, నిర్ణయాలు తీసుకోకపోవడం, ఉద్యోగులలో ఉదాసీనత ఏర్పడిం దన్నారు. లక్ష్మీకాంతమ్మ వంటివారి సిఫారసులకు లొంగిపోయాడని ఇంకొక విమర్శ వచ్చింది. ప్రదేశ్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు టి. అంజయ్య, నూకల రామచంద్రా రెడ్డి, ఎస్. వెంకటరామరెడ్డి, ఢిల్లీ వెళ్ళి ఇందిరను సంప్రదించారు. పి.వి.నరసింహారావు ముఖ్యమంత్రి అని ఆమె తన నిర్ణయాన్ని చెప్పింది. కాదనలేక అంజయ్యతో సహా అందరూ మద్దతు ప్రకటించారు. కేంద్ర  కాంగ్రెస్ ఉమాశంకర్ దీక్షితుల్ని పరిశీలకుడిగా హైద్రాబాద్ పంపింది. పి.వి.నరసింహారావు ఏకగ్రీవంగా ఇందిరాగాంధీ నిర్ణయానుసారం నాయకుడైనాడు. ప్రధానమంత్రిని సంప్రదించి పి.వి. నరసింహారావు తన మంత్రి వర్గాన్ని ప్రకటించాడు. వారిపేర్లు ఇవి – బి.వి. సుబ్బారెడ్డి, కాకాని వెంకటరత్నం, హయగ్రీవాచారి, అన్సారీ, జలగం వెంగళరావు, ఎ. భగవంతరావు, వి.కృష్ణమూర్తి నాయుడు, ఎం.మాణిక్యారావు, బి.సుబ్బారావు, మూర్తిరాజు, పి.బసిరెడ్డి, సాగి సూర్యనారాయణరాజు, వి.పురుషోత్తమరెడ్డి, చొక్కారావు, ఎల్. లక్ష్మణదాస్, పి.నరసారెడ్డి, టి.అంజయ్య, ఎం.వి.కృష్ణారావు, భవనం జయప్రద, కె.ప్రభాకర రెడ్డి, చల్లా సుబ్బారాయుడు, జి.రాజారామ్, కె.గోపాలనాయుడు, భాట్టం శ్రీరామమూర్తి, కె. భీమారావు, సి. హెచ్. దేవానందరావు, ఎ.మదన్ మోహన్, ఎం.ఆర్.శ్యామ్ రావు, డి.మునుస్వామి.

పి.వి.నరసింహారావు కొంతమందితో అతి సన్నిహితంగా ఉండటం, ఇతరులను అశ్రద్ధ చేయడం ముఠా కలహాలకు దారితీసాయి. భవనం జయప్రద, ఎం.వి.కృష్ణారావు, భాట్టం శ్రీరామమూర్తి, జి.రాజారాం, హయగ్రీవా చారిని ఎక్కువగా సంప్రదిస్తుండేవాడు.

మంత్రి వర్గాన్ని పరిశీలిస్తే, 29 మందిలో తెలంగాణాకు 14 రావడమే కాక వెనుకబడిన వర్గాలకన్నింటికి 13 మంది మంత్రులుండటం విశేషమైనదిగా పేర్కొనేవారు. కానీ పి.వి. నరసింహారావు మంత్రివర్గం సాఫీగా సాగలేదు. ఆయన సిఫారసులకు లొంగడమేకాక అవినీతిపరులను చేరదీసాడని, బంధుప్రీతి విపరీతంగా చూపాడని విమర్శలు వచ్చాయి. తన కుమారుడు రంగారావు తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నా చూస్తూ ఊరుకున్నాడు. చెన్నారెడ్డి అనుకూలురై నారు మంత్రి వర్గంలో చేరడంతో చెన్నారెడ్డి ఇంచుమించు రాజకీయంగా నిశ్శబ్దంగా ఊరుకున్నాడు. ఖమ్మం జిల్లాలో శీలం సిద్దారెడ్డి, కర్నూలు జిల్లాలో విజయభాస్కర రెడ్డి ప్రత్యర్థి వర్గంగా పనిచేస్తూ పోయారు.

ఆర్థిక విప్లవం తేవాలంటూ ఉపన్యాసాలు ఇవ్వడం మొదలు పెట్టిన పి.వి.నరసింహారావు సాంఘికంగా పెద్ద తిరోగమన వాదిగా బయలుదేరి సనాతన ధర్మాలను మత ఛాందసాలను ప్రోత్సహించాడు. ఇది బ్రాహ్మణీకమని కొందరు వ్యాఖ్యానించారు. పంచాయతీరాజ్ వ్యవస్థను మార్పు చేస్తానంటూ జిల్లా పరిషత్ లను కాస్తా రద్దు కావించాడు. దీంతో జిల్లాలో ఉన్న కాంగ్రెస్ నాయకత్వం పదవులు పోగా గుర్రుగా ఉన్నది. భూ సంస్కరణ బిల్లు ప్రవేశపెట్టగా 1972 సెప్టెంబరు

5న అది ఆమోదించబడింది. అంతకుముందే జూన్ 5న పట్టణాలలో భూముల్ని అమ్మకుండా సీలింగ్ తెచ్చే ఒక ఆర్డినెన్స్ జారీచేశారు. కాంగ్రెసు వారు పైకి ఎన్ని మాటలు చెప్పినా నరసింహారావు తెచ్చిన ఈ రెండు సంస్కరణల పట్ల లోలోపల తీవ్ర వ్యతిరేకత కనపర్చారు. సమయం కోసం ఎదురు చూసారు. ఇది ఇట్లా ఉండగా ఏప్రిల్ 9న 14 మంది ప్రముఖ కాంగ్రెస్ వాదులను పార్టీ నుండి తొలగిస్తూ ఇస్మాయిల్ ప్రకటించాడు. అప్పటికి ఇస్మాయిల్‌కు నరసింహారావుకు షష్ఠాష్టకంగా ఉంది. పార్టీ వ్యవహారాలు పరాకాష్ఠకు రాగా ప్రధాని ఇందిర ఏప్రిల్ 28న హైద్రాబాద్ వచ్చి తగాదాను సర్దుబాటు చేసింది. మే 7వ తేదీ దామోదరం సంజీవయ్య ఢిల్లీలో చనిపోవడంతో  ఆంధ్రప్రదేశ్ లో హరిజనులకు చెప్పకోదగిన నాయకుడంటూ లేకుండా పోయాడు. సెప్టెంబర్ 4న మాజీ ఉప ముఖ్యమంత్రి జె.వి.నరసింగరావు కూడా చనిపోయాడు.

ఈలోపల ముల్కీ నిబంధనల విషయమై కొందరు సుప్రీంకోర్టుకు వెళ్ళగా ఆ నిబంధనలు చెల్లుతాయని 1972 అక్టోబరు 3న సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. ముల్కీ సమస్యకు ..ఇదే తుది పరిష్కారమని.. వ్యాఖ్యానించిన నరసింహారావు కొరివితో తలగోక్కున్నాడు.

--------

# తెలంగాణాకు వ్యతిరేకంగా
## ప్రత్యేక ఆంధ్ర పోరాటం

అనేక కారణాల వలన ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం ప్రారంభమైంది. తెలంగాణాలో 1969-70 లో జరిగిన ఉద్యమం ఆంధ్రులకు ఇంకా గుర్తుంది. అప్పుడు గోడల మీద రాసిన రాతలు వారి మనస్సులో మెదులుతున్నాయి. రాజధానిలో ఆంధ్రులు ద్వితీయ స్థానంలో ఉండటం వారికి నచ్చలేదు. రాజకీయంగా పదహారు సంవత్సరాలుగా పరిపాలించిన రెడ్లకు పెత్తనం లేకుండా పోయింది. భూములున్న కమ్మలకు, రాజులకు పి.వి. నరసింహారావు తెచ్చిపెట్టిన సీలింగులు వారి మనుగడకు దెబ్బకొట్టే విధంగా ఉన్నాయని భావించారు. ఇలాంటి కారణాలను పురస్కరించుకుని ఉద్యమం ప్రారంభమైంది. తెలంగాణా ఉద్యమంలోవలె ఇక్కడ కూడా విద్యార్థులే ముందు నడుంకట్టారు. పి.వి.నరసింహారావు వారికి సమాధానం చెప్పలేకపోయాడు. 1972 అక్టోబరు 24న ఏలూరులో పి.వి.నరసింహారావు అవమానానికి గురై రాజధానికి తిరిగి వచ్చాడు. నాన్ గెజిటెడ్ ప్రభుత్వోద్యోగులు 1972 అక్టోబరు 26 నుండి సమ్మెకు ఉపక్రమించారు. మంత్రివర్గంలో బి.వి.సుబ్బారెడ్డి ఆంధ్రులకు నాయకత్వం వహించాడు. నవంబర్ 12న గుంటూరులో ఆంధ్రప్రదేశ్ మహాసభ జరిగినప్పుడు ప్రత్యేకాంధ్ర కావాలని అడగలేదు. ఆంధ్రప్రదేశ్ ఎలాంటి నిబంధనలు లేకుండా కొనసాగాలన్నారు. అందులో నిశ్శంకరరావు వెంకటరత్నం, పి.వి.కె.రావు, ఎ.శ్రీరాములు, ఎన్.శ్రీనివాసులు రెడ్డి ప్రభృతులున్నారు. ఇది జరిగిన ఆరు రోజులకే నవంబరు 18, 19 తేదీలలో అన్ని పార్టీలు కలిసి మహాసభ పెట్టాయి. నిబంధనలు లేని ఆంధ్రప్రదేశ్ అంగీకరించకపోతే ఆంధ్రను వేరు చేయాలని తీర్మానించారు. ఆంధ్ర ప్రజాపరిషత్ అనే పేరిట ఒక సంస్థను ఏర్పరిచారు. గౌతు లచ్చన్న, నడింపల్లి నరసింహారావు ఉపాధ్యక్షులుగను, జాగర్లమూడి చంద్రమౌళి కోశాధికారిగా, తుమ్మల చౌదరి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ప్రజాపరిషత్ ఏర్పడిన మూడురోజులకే ఆంధ్ర బంద్ పిలుపు ఇచ్చారు. నవంబర్ 21న ఆంధ్ర అంతటా పోలీసు కాల్పులు జరిగాయి. ప్రత్యేక పోలీసు దళాలను పిలిపించారు. అయినప్పటికి ప్రత్యేకాంధ్ర ప్రసక్తి లేదని ప్రధాని ఇందిర ప్రకటించి అయిదు సూత్రాల పథకాన్ని ఇచ్చింది. లోగడ తెలంగాణా ఉద్యమంలో ముందు ఎనిమిది సూత్రాల పథకాన్ని, ఆ తరువాత ఆరు సూత్రాల పథకాన్ని ఇచ్చిన విషయం విస్మరించరాదు. ప్రధాని పంచసూత్ర పథకాన్ని ఆంధ్ర ప్రజలు తిరస్కరించారు. 1972 నవంబరు 28న విద్యార్థి నాయకులు గుంటూరులో సమావేశమై డిసెంబరు 5న బంద్ పిలుపిచ్చారు. నవంబరు 30వ తేదీన రాజమండ్రిలో న్యాయవాదులు సమావేశమై కోర్టులు బహిష్కరించాలని తీర్మానించారు.

ప్రధాని పంచసూత్రాల పథకాన్ని గురించి చర్చించడానికి  హైద్రాబాద్‌లో శాసన సభ్యులు సమావేశమయ్యారు. ప్రధాని పథకం అందరూ ఆమోదించారని ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు ప్రకటించాడు. అది నిజంకాదని కాంగ్రెస్ శాసన సభ్యులు వసంత నాగేశ్వరరావు, గుడిపూడి ప్రభాకరరావు, పీటర్ పాల్ చుక్కా ప్రకటించారు. బి.వి.సుబ్బారెడ్డి

కొన్ని వివరణలు కోరినా ఆనాటికి ప్రధాని పంచసూత్రాల పథకాన్ని ఆమోదించాడు. ప్రజాపరిషత్ పక్షాన డిసెంబరు మొదటివారం అంతా సభలు, సమావేశాలు జరుగుతుండగా ప్రభుత్వం అరెస్టులు ప్రారంభించింది. డిసెంబర్ 10న విజయవాడలో మరోక పెద్ద సమావేశం జరిగింది. తెన్నేటి విశ్వనాథం గౌరవాధ్యక్షుడుగాను, లచ్చన్న అధ్యక్షుడుగాను, మరొక సంఘం ఏర్పడింది. లచ్చన్న కార్యనిర్వాహక వర్గాన్ని ప్రకటించగా జొన్నలగడ్డ రామలింగయ్య నిరసన తెలియజేశారు. బస్సులను ఆపాలని, రైళ్ళను నిలపాలని తీర్మానించారు.

పి.వి.నరసింహారావు మంత్రివర్గంలో బత్తైన సుబ్బారావు తన రాజీనామాను ముఖ్యమంత్రికి, ప్రధానికి పంపించారు. మంత్రివర్గంలోని మరి 8 మంది బి.వి.సుబ్బారెడ్డి, వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు, కాకాని వెంకటరత్నం, సాగి సూర్యనారాయణరాజు, బసిరెడ్డి, చల్లా సుబ్బారాయుడు, డి.మునుస్వామి, మూర్తిరాజు సమైక్యతకై రాజీనామా ఇచ్చారు. 1972 డిసెంబర్ 17న విజయవాడలో పెద్ద సమావేశం జరిగింది. అందులో రాజీనామా ఇచ్చిన మంత్రులు, జిల్లాపరిషత్ అధ్యక్షులు, శాసనసభ్యులు, సమితి అధ్యక్షులు, తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వారు లోపల చర్చలు జరుపుతుండగా బయట ప్రజలు చాలా ఆందోళన చేసి ప్రత్యేకాంధ్రపై తీర్మానాలు చేయకపోతే బ్రతికి బైటపడరని హెచ్చరించారు. బ్రతికి బాగుంటే పదవుల సంగతి తరువాత చూసుకోవచ్చని అయిష్టంగానే రాజీనామా యిచ్చిన మంత్రులు ప్రత్యేకాంధ్రకు అంగీకరించారు.

ఉద్యమాన్ని దెబ్బతీయాలని పి.వి. నరసింహారావు కమ్యూనిస్టుల సహకారంతో 1972 డిసెంబరు 24న విజయవాడలో పెద్ద ఊరేగింపు తలపెట్టాడు. ప్రత్యేకాంధ్ర ఉద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజులలో ఈ సమైక్యతా ఊరేగింపు అవమానకరంగా భావించారు. కాకాని వెంకటరత్నం ఆ ఊరేగింపు జరగనీయరాదని పట్టుబట్టాడు. ఫలితంగా పోలీసు కాల్పులు జరిగి ఆ రాత్రి ఎనిమిదిమంది మరణించారు. అది జరిగిన కాసేపటికే కాకాని చనిపోయాడు. డిసెంబర్ 26న ఆంధ్రలో మళ్ళీ బంద్ జరపాలని తీర్మానించారు. ఈ కార్యాచరణ సమితి ఏర్పడిన నాటి నుండి డబ్బుల వసూళ్ళలో పరస్పర అనుమానాలు, అభిప్రాయభేదాలు మొదలైనాయి.

పోలీస్ కాల్పులు జరుగుతూనే ఉన్నాయి. డిసెంబర్ 31న కాంగ్రెసువారు తిరుపతిలో 131 మంది ఎం.ఎల్.ఎ.లతో, 11 మంది పార్లమెంటు సభ్యులతో వేలాది ప్రజలతో సభజరిపారు. ప్రభుత్వం నాయకులందరిని అరెస్టు చేసింది. జనవరి 2న మళ్ళీ బంద్ నాడు కాల్పులు జరుపగా 60 మంది చనిపోయారు. జనవరి 26వ తేదీలోగా ప్రత్యేకాంధ్ర ప్రకటించక పోతే కాంగ్రెసుకు తిలోదకాలిస్తామని 15 మంది పార్లమెంటు సభ్యులు బెదిరింపు ప్రకటన చేసారు. ఈలోగా రాజీనామా ఇచ్చిన మంత్రుల స్థానే పి.వి.నరసింహారావు ఆంధ్ర నుండి 8 మంది కొత్త మంత్రులను నియ మించారు. అందులో మద్దూరి సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి, పి.వి.చౌదరి, కె.అమరనాధరెడ్డి, జి. సోమశేఖర్, సి.దాస్, వడ్డె నాగేశ్వర్ రావు, ఆర్ రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. 1973 జనవరి 3న వీరు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసారు. కానీ వారం తిరక్కముందే కనీసం మంత్రులుగా బులపాటం తీరకముందే పి.వి. నరసింహారావు మంత్రి వర్గాన్ని రద్దు చేస్తూ రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టబడింది. హెచ్.పి.సరీన్‌ను ప్రత్యేక సలహాదారుగా నియమించారు. అయితే ఆంధ్రలో మాత్రం ఆందోళన కొనసాగింది. జనవరి 21న కాకినాడలో సమావేశమై ఉద్యమాన్ని ఇంకా తీవ్రతరం చేయాలని తీర్మానించారు. కాంగ్రెసు పార్టీకి తామిచ్చిన రాజీనామాల సంగతి తేల్చాలని, ఫిబ్రవరి 5లోగా ప్రత్యేకాంధ్ర విషయం తేల్చకపోతే మహా విప్లవం తెస్తానని బి.వి.సుబ్బారెడ్డి ప్రగల్భాలు పలికాడు. శాసనసభ్యులంతా రాజీనామా ఇవ్వాలని తీర్మానించారు. జనవరి 26న కృష్ణానది ఒడ్డున సమావేశమైన నాయకులు రంగా, లచ్చన్న, కొమ్మారెడ్డి సూర్యనారాయణ, ఒకరినిమించి ఇంకొకరు ఉద్రేకంతో మాట్లాడారు. బి.వి.సుబ్బారెడ్డి కార్యాచరణ సంఘం కార్యక్రమం గురించి తనకేమీ తెలియదని ప్రకటన చేసాడు. ఆయన ప్రసంగాలు కాంగ్రెస్ వారిని కలవరపరిచాయి.

జనవరి 27న నెల్లూరులో విద్యార్థులు సమావేశమై శాసనసభ్యులు రాజీనామా ఇవ్వాలని తీర్మానించారు. నరసరావుపేటలో సమావేశమైన కార్యాచరణ సమితి శాసన సభ్యులను రాజీనామా ఇవ్వమని కోరింది. కానీ పైకెన్ని చెప్పినా రాజీనామా ఇవ్వడానికి ఎవ్వరు సిద్ధంగా లేరు. తెన్నేటి విశ్వనాథం, సి.వి.కె.రావుతో సహా రాజీనామాలు ఇవ్వడాన్ని కాంగ్రెసువారు వ్యతిరేకించారు. రాజీనామా ఇస్తే ఎం.ఎల్.ఏ.గా అనుభవించే సౌకర్యాలు కూడా పోతాయని, మళ్ళీ ఎం.ఎల్.ఎ. అయ్యే అవకాశం ఉంటుందో ఉండదోనని భయపడ్డారు. ఫిబ్రవరి 4న సంయుక్త కార్యాచరణ సమితికి బి.వి.సుబ్బారెడ్డిని అధ్యక్షుడన్నారు. ఈలోగా ఢిల్లీ పోదలచిన కొందరు మాజీ మంత్రులను బి.వి.సుబ్బారెడ్డి వారించారు. ఆ సమావేశంలో చేసిన తీర్మానం ఫలితంగా విప్లవం రాలేదు కానీ, రైళ్ళు మాత్రం ఆపగలిగారు. ప్రధాని ఇందిరాగాంధీ ఉద్యమాన్ని నిరసిస్తూ మాట్లాడగా కేంద్రంలో ప్రతిపక్ష నాయకులు ఆంధ్ర ఉద్యమాన్ని బలపరిచారు. ఫిబ్రవరి 7వ తేదీన ఢిల్లీకి రమ్మని బి.వి.సుబ్బారెడ్డికి ప్రధాని ఇందిర నుండి ఆహ్వానం వచ్చింది. ఫిబ్రవరి 9వ తేదీన సొంత పెత్తనం కట్టుకుని

బసిరెడ్డి, వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు ఢిల్లీ వెళ్లారు. ఫిబ్రవరి 15న సంయుక్త కార్యాచరణ సమితి మంత్రులు ఇలా ఢిల్లీ వెళ్ళడాన్ని నిరసిస్తూ కారంచేడులో తీర్మానించారు. ఆ సమావేశాలకు బి.వి.సుబ్బారెడ్డి, తెన్నేటి విశ్వనాథం, రంగా, గొట్టిపాటి బ్రహ్మయ్య రాలేదు. కారణం వారికే తెలియాలి. కారంచేడులో జరిగిన సభలో కాంగ్రెసువారు, ప్రతిపక్షాలవారు కలహించుకున్నారు. లచ్చన్న, చల్లా సుబ్బారాయుడు, మాటలనుకున్నారు. ఉద్రేకాలు పెరిగాయి. ప్రజలు ఆందోళన మాత్రం కొనసాగిస్తూనే ఉన్నారు. ఫిబ్రవరి 17వ తేదీ బి.వి. సుబ్బారెడ్డి, తెన్నేటి విశ్వనాథం, లచ్చన్న సంప్రదించుకున్నారు. కానీ, కలిసి ఒక ప్రకటన చేయడానికి కానీ పత్రికా విలేఖరులతో ముచ్చటించడానికి కాని ఐక్యం కాలేక పోయారు. ఫిబ్రవరి 19న పార్లమెంటు సమావేశం జరిగింది. ప్రత్యేక ఆంధ్ర కోరే పార్లమెంటు సభ్యులు, కాంగ్రెసు నుండి పోతామని ఆంధ్రలో ప్రకటన చేసిన పార్లమెంటు సభ్యులు కలిపి పార్లమెంటులో విడిగా కూర్చున్నారు. ఫిబ్రవరి 27వ తేదీన పార్లమెంటులో ప్రకటన చేసిన ప్రధాని ఇందిర మళ్ళీ ఢిల్లీకి రమ్మని బి.వి.సుబ్బారెడ్డినే ఆహ్వానించింది. సంయుక్త కార్యాచరణ సమితి సమావేశకర్తగా తెన్నేటి విశ్వనాథం రాజీనామా ఇచ్చాడు. ప్రత్యేకాంధ్ర సాధించేవరకు హైద్రాబాదులో అడుగుపెట్టనని బి.వి.సుబ్బారెడ్డి ప్రతిజ్ఞ చేసాడు. జూపూడి యజ్ఞనారాయణ తానుకూడా శాసనమండలికి రాజీనామా ఇస్తున్నట్లు ప్రకటించినా అది ఆచరణలోకి రాలేదు. ఏప్రిల్ లో బండారు రత్న సభాపతి తన శాసనసభా సభ్యత్వానికి రాజీనామా ఇచ్చాడు. ఢిల్లీలో బి.వి.సుబ్బారెడ్డి జరిపిన చర్చలు సఫలం కాలేదు. విఫలం కాలేదు. కానీ ప్రత్యేకాంధ్ర ఉద్యమం మాత్రం దెబ్బతిన్నది. ఆంధ్రలో సమైక్యతా వాదులకు, వేర్పాటు వాదులకు అక్కడక్కడా కలహాలు సంభవించాయి. మార్చి 18న తిరుపతిలో జరపవలసిన ఆంధ్ర కాంగ్రెస్ కార్యాచరణ సమితి చిత్తూరుకు మార్చారు. బి.వి.సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ప్రత్యేక పార్టీ పెట్టడానికి నిర్ణయించుకుని డి.మునుస్వామి అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించారు. సమావేశంలో పాల్గొన్న 132 మంది శాసన సభ్యులు, 7గురు పార్లమెంటు సభ్యులు ప్రత్యేక పార్టీకి అనుకూలంగా ఉన్నారో లేదో అభిప్రాయ సేకరణ జరగలేదు. కానీ కాంగ్రెసువారు నాటకం ఆడుతున్నారని ప్రజలు గ్రహించక పోలేదు. ఉపాధ్యాయులు ఎన్.జి.ఓలు సమ్మెను విరమించుకున్నారు. మార్చి 19వ తేదీ కడపలో బి.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతున్న ఎన్.జి.ఓ.ల సమావేశంపై పోలీస్ కాల్పులు జరిగాయి. బి.వి. సుబ్బారెడ్డిని ఎలాగో తప్పించారు. ఆ సంఘటనపై విచారణకి హైకోర్టు న్యాయమూర్తి మాధవరెడ్డిని నియమించారు. ఆంధ్ర కేంద్ర కార్యాచరణ సమితి సారధ్య సంఘంలోవచ్చిన అభిప్రాయ  భేదాల వలన అంతవరకు కార్యదర్శిగా ఉన్న ఎం.వి. రామమూర్తి రాజీనామా ఇచ్చాడు. న్యాయవాదులు కోర్టులకు హాజరు కావాలని, విద్యార్థులు సమ్మెను విరమించాలని తీర్మానించుకున్నారు. 1973 ఏప్రిల్ 6న  రాజమండ్రిలో జై ఆంధ్ర ఫ్రంట్ అవతరించింది. ఇందులో రత్నసభాపతి, నడింపల్లి నరసింహారావు, తెన్నేటి విశ్వనాథం, లచ్చన్న, జూపూడి యజ్ఞనారాయణ, తుమ్మల చౌదరి, ఎ.బి.నాగేశ్వరరావు, జి.సి.కొండయ్య ఉన్నారు. తెలంగాణా నుండి టి.పురుషోత్తమరావు, బి.సత్యనారాయణ రెడ్డి సానుభూతిగా వచ్చి పాల్గొన్నారు.

1973 జనవరి 10న ఇస్మాయిల్ అధ్యక్షతన ఉన్నఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ అపద్ధర్మ సంఘాన్ని రద్దు చేసారు. దానిస్థానే చాలామంది సభ్యులతో కూడిన ఉన్నతాధికార సంఘాన్ని వేసారు. అందులో చెన్నారెడ్డి, పిడతల రంగారెడ్డి, విజయభాస్కర రెడ్డి లాంటివారున్నారు. కానీ, విజయభాస్కర రెడ్డి అందులో చేరడానికి నిరాకరించాడు.

ఆంధ్రలో ఆందోళన సాగుతుండగా తెలంగాణాలో చెన్నారెడ్డి నాయకత్వాన ప్రత్యేక తెలంగాణా కాంగ్రెస్ ఫోరం అంటూ ఒకటి ఏర్పాటు చేసారు. ఇందులో జైపాల్ రెడ్డి, రోడామిస్త్రి, సరోజిని పుల్లారెడ్డి, అన్సారి, భోజిరెడ్డి, పురుషోత్తమ రెడ్డి, శీలం సిద్ధారెడ్డి, సుధాకర్ రావు, వెంకటరామిరెడ్డి కె.వి.కేశవులు, చొక్కారావు మొదలైనవారున్నారు. వీరంతా కలిసి మార్చి 1న తెలంగాణా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఒకటి జరిపారు. ఆంధ్రలోను తెలంగాణాలోను వేర్పాటు వాదులు కలిసి పనిచేయాలనుకున్నారు.

చెన్నారెడ్డికి వ్యతిరేకంగా, పి.వి.కి అనుకూలంగా జి.రాజారాం, జగన్నాధరావు, గోవిందసింగ్, మండలి వెంకట కృష్ణారావు, భాట్టం శ్రీరామ మూర్తి నిలబడ్డారు. పి.వి.కి వ్యతిరేకంగా, చెన్నారెడ్డి వర్గం జలగం వెంగళరావు, నూకల రామచంద్రారెడ్డి, నరసారెడ్డి, అక్కిరాజు వాసుదేవరావు, కోదాటి రాజమల్లు, వి.బి.రాజు ఉన్నారు.

రాష్ట్రంలో వ్యవహారాలు ఇలా ఉండగా 1973 ఫిబ్రవరి 3న కేంద్ర మంత్రి వర్గంలో కొత్త రఘురామయ్య, జి.వెంకటస్వామి చేరారు. రఘురామయ్య 1971 లోక్ సభ ఎన్నికల్లో గెలిచినా ఆయన మీద ఉన్న ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని ఇందిరాగాంధీ అతనికి మంత్రి పదవి ఇవ్వలేదు. రఘురామయ్య మంత్రి కాగానే గుంటూరు, కృష్ణా జిల్లాలలో కొందరు కమ్మ ప్రముఖులు ప్రత్యేకాంధ్ర పట్ల ఉదాసీనత ప్రకటించారు.

1971 లోక్‌సభ ఎన్నికల్లోను 1972లో వచ్చిన రాజ్యసభ ఖాళీలోను పోటీచేసి ఓడిపోయిన రంగా అంతవరకు ఇందిరాగాంధీని నానాదుర్భాషలాడి హఠాత్తుగా ఆమె పక్షం అయ్యాడు. ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో పాల్గొన్న ఆయన వర్గం కొంచెం ప్రత్యేకంగానే ప్రవర్తిస్తూ వచ్చింది. బి.వి.సుబ్బారెడ్డి నాయకత్వం ఇష్టం లేని బసిరెడ్డి కేంద్రంతో సంప్రదింపులు కావించాడు. బ్రహ్మానందరెడ్డి యధా ప్రకారం తన వైఖరి ఏమిటో వెల్లడించకుండా నాన్చాడు. ప్రత్యేక పార్టీ పెట్టాలన్న ఆంధ్ర కాంగ్రెసువారు 1973 ఏప్రిల్ 16న నివేదిక సమర్పిస్తామన్నా, ఆపని మాత్రం జరగలేదు.

తెలంగాణాలో కోదాటి రాజమల్లు, అక్కిరాజు వాసుదేవరావు ముల్కీ నిబంధనలను తొలగించడం మంచిదని ప్రకటనలు చేసారు. గాంధీ పుట్టిన రోజుకు ఆంధ్రరాష్ట్ర నిర్మాణం చేయకపోతే సత్యాగ్రహం చేస్తానని బి.వి. సుబ్బారెడ్డి అన్న మాటలను ఎవరూ పట్టించుకోలేదు. ప్రజలు ఉద్రేకంగా జరిపిన ఉద్యమం క్రమంగా దారీ తెన్నూ లేకుండా పోయింది. ఈ ఉద్యమంలో అతివాద కమ్యూనిస్టులు ప్రముఖ పాత్ర వహించారు. మార్క్సిస్టులు, సి.పి.ఐ. సమైక్యతకు నిలబడ్డారు. ఆంధ్ర అంతటా తల ఎత్తిన దాదాపు 30 సేనలు క్రమంగా అడ్రసు లేకుండా పోయినాయి. బలవంతంగా చందాలు వసూలు చేసుకోవడం, దౌర్జన్యకాండలు, అక్రమాలు అనేకం జరిగాయి. తెలంగాణ ఉద్యమంలోను, ఆంధ్ర ఉద్యమంలోను ప్రజలను వాడుకుని బాగుపడింది రాజకీయవాదులే.

1973 సెప్టెంబరు 1న ప్రధాని ఇందిర ఆరు సూత్రాల పథకాన్ని అమలు పరిచింది. ఆంధ్రలోగాని, తెలంగాణాలోగాని ఆరు సూత్రాల బాగోగులను చర్చించడానికి కూడా ఎవరూ సంసిద్ధులుగా లేరు. ఉద్యమాల పేరిట జరిగిన హింసా కాండలో  వారు ఆహుతి అయిపోయారు.

స్వతంత్ర పార్టీకి తిలోదకాలిచ్చిన లచ్చన్న, చరణ్ సింగ్ నాయకత్వాన ఏర్పడిన భారతీయ లోక్ దళ్ అనే పార్టీలో చేరారు. ఆంధ్రలో ఆయనవెంట మనుషులు లేకుండా పోయారు.

--------------

## ముఖ్యమంత్రి – పి. వి. నరసింహారావు

30-09-1971 నుండి 2-03-1972

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | పి. వి. నరసింహారావు | కార్యనిర్వాహక, పన్నులు, గృహ, కార్మిక మరియు సాంఘిక సంక్షేమ శాఖ |
| 2. | బి. వి. సుబ్బారెడ్డి | ప్రణాళికలు, రోడ్లు మరియు నిర్మాణ శాఖ |
| 3. | కాకాని వెంకట రత్నం | వ్యవసాయ శాఖ మరియు జంతు సంరక్షణ |
| 4. | కె. అచ్యుత్ రెడ్డి | భూమి పన్ను |
| 5. | జె. చొక్కారావు | పరిశ్రమలు |
| 6. | ఎస్. సిద్ధా రెడ్డి | నీటి పారుదల శాఖ |
| 7. | మహ్మద్ అలీ అన్సారీ | ఆరోగ్య మరియు మెడికల్ |
| 8. | ఎమ్. మాణిక్ రావు | మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ |
| 9. | బత్తిన సుబ్బారావు | కో-ఆపరేషన్ |

**రాష్ట్ర మంత్రులు**

| | | |
|---|---|---|
| 10. | ఎ. వాసుదేవ రావు | సహకార శాఖ |
| 11. | సి. రాజ నరసింహ | హౌసింగ్ |
| 12. | కె. గోపాల నాయుడు | రవాణా |
| 13. | పి. మహేంద్ర నాథ్ | అటవీ శాఖ |
| 14. | కె. భీమారావు | గిరిజన సంక్షేమ శాఖ |

**మంత్రివర్గ విస్తరణ - అక్టోబరు 6, 1971**

| | | |
|---|---|---|
| 15. | తోట రామస్వామి | పంచాయతీ రాజ్ |
| 16. | ఆర్. రామలింగ రాజు | దేవాదాయ శాఖ |
| 17. | వి. కృష్ణమూర్తి నాయుడు | విద్యుత్తు మరియు పన్నులు |
| 18. | ఎ. భగవంతరావు | చేనేత |
| 19. | సిహెచ్. వి. పి. మూర్తిరాజు | మార్కెటింగ్ |

**రాష్ట్ర మంత్రులు**

| | | |
|---|---|---|
| 20. | డా. సిహెచ్. దేవేంద్రరావు | పర్యాటక శాఖ |

**మంత్రివర్గ విస్తరణ - అక్టోబరు 28, 1971**

| | | |
|---|---|---|
| 21. | ఎస్. చెంచురామ నాయుడు | చేనేత |
| 22. | పి. బసిరెడ్డి | మధ్యతరహా నీటిపారుదల శాఖ |

**రాష్ట్ర మంత్రులు**

| | | |
|---|---|---|
| 23. | చల్లా సుబ్బా రాయుడు | పౌర సరఫరాల శాఖ |
| 24. | ఎ. మదన్ మోహన్ | సాంకేతిక విద్య |
| 25. | శ్రీమతి పద్మా భాస్కర రెడ్డి | శిశు సంక్షేమ శాఖ |

## ముఖ్యమంత్రి – పి. వి. నరసింహారావు

20-03-1972 నుండి 18-01-1973

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | పి. వి. నరసింహారావు | కార్యనిర్వాహక, కళాశాల విద్య, భూమి పన్ను మరియు సమాచార శాఖ |

| | | |
|---|---|---|
| 2. | బి. వి. సుబ్బారెడ్డి | ప్లానింగ్ మరియు హైవేస్ |
| 3. | కాకాని వెంకట రత్నం | ఆహార మరియు వ్యవసాయం |
| 4. | టి. హయగ్రీవాచారి | పంచాయతీ రాజ్ |
| 5. | ఎమ్. డి. ఇబ్రహీం అలీ | ఆరోగ్య, మెడికల్ మరియు వక్ఫ్ |
| 6. | జె. వెంగళరావు | పరిశ్రమలు |
| 7. | ఎ. భగవంతరావు | ఫైనాన్స్ |
| 8. | వి. కృష్ణమూర్తి నాయుడు | గృహ |
| 9. | ఎమ్. మానిక్ రావు | మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ |
| 10. | బి. సుబ్బారావు | సహకార శాఖ |
| 11. | సిహెచ్.వి.పి. మూర్తి రాజు | దేవాదాయ శాఖ |
| 12. | పి. బసి రెడ్డి | మధ్యతరహా నీటిపారుదల |
| 13. | సాగి సత్యనారాయణ రాజు | అటవీ శాఖ |
| 14. | ఐ. లక్ష్మణదాసు | హౌసింగ్ |
| 15. | పి. నర్సారెడ్డి | భారీ నీటిపారుదల శాఖ |
| 16. | టి. అంజయ్య | కార్మిక శాఖ (లేబర్) |
| 17. | ఎమ్. వి. కృష్ణారావు | సాంఘిక సంక్షేమ శాఖ |
| 18. | బి. జయప్రద | విద్యుత్ శాఖ |
| 19. | కె. ప్రభాకర రెడ్డి | రవాణాశాఖ |

-------

# రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన

రాష్ట్రపతి పాలనతో గవర్నర్ సలహాదారుగా నియమించబడిన సరీన్ ఒక సంవత్సరంపాటు ఎదురులేని పాలన చేశాడు. రాజకీయవాదులకు నిస్పృహ ఏర్పడింది. నల్లేరుపై బండివలె పరిపాలన సాగించిన సరీన్ కాలంలో లంచగొండితనం పెరిగింది. రాజకీయనాయకులు, రాజకీయాలే వృత్తిగా కలవారు కాళ్ళూ చేతులూ ఆడక తహతహలాడారు. ఢిల్లీ చుట్టూ ఖద్దరు బట్టలు వేసుకుని తెగ తిరిగారు. ప్రధాని ప్రకటించిన ఆరు సూత్రాల పథకాన్ని గబగబ ఒప్పేసుకున్నారు. మళ్ళీ ప్రజా ప్రతినిధుల పరిపాలన కొనసాగించాలన్నారు. ఢిల్లీ చుట్టూ తిరిగే ప్రదక్షిణలలో ఎవరు నాయకుడు కావాలనే సమస్యకాక ఎవరు కాకూడదనే విషయం కూడా ప్రధానాంశమైంది. ప్రత్యేక ఆంధ్ర, ప్రత్యేక తెలంగాణా అనే వాదాన్ని సృష్టించి పెద్ద ఎత్తు ఉద్యమాలు చేసిన ఆ నాయకులంతా అతిత్వరలో చీకూచింతా లేకుండా విస్మరించడమేకాక ఆమాట ఎత్తడానికే సంకోచించారు. మొత్తం మీద చెప్పకోతగిన విశేషాలేమీ లేకుండానే సరీన్ పరిపాలన సమాప్తమైంది.

-----

# ముఖ్యమంత్రిగా జలగం వెంగళరావు

నాయకుడు ఎవరు కావా లనే తీర్థయాత్రలో యథా ప్రకారం అంతిమ నిర్ణయం ప్రధాని ఇందిర చేసింది. జలగం వెంగళరావు ముఖ్యమంత్రి కావడం అభిలష ణీయం అన్నారు. ప్రధాని కోరిన ప్రకారం 1973 డిసెంబరు 7న హైద్రాబాద్‌లో కాంగ్రెస్ శాసన సభా సమావేశంలో వెంగళ రావును ఏకగ్రీవంగా నాయకుడిగా ఎంపిక చేశారు. 1973 డిసెంబర్ 10న తన మంత్రి వర్గాన్ని ప్రకటించాడు. ప్రత్యేకాంధ్రకై ప్రాణాలర్పిస్తానన్న బి.వి.సుబ్బారెడ్డి సమైక్యతా మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రి పదవి పుచ్చుకుని కిమ్మనకుండా ఉన్నాడు. 1955లో జరిగిన పెద్ద మనుషుల ఒప్పందాన్ని పాటించి కాబోలు ఆంధ్ర నుండి వచ్చి తెలంగాణాలో స్థిరపడిన వెంగళరావు రాయలసీమకు ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చాడు. ప్రత్యేక రాష్ట్ర వాదులుగా కొన్నాళ్ళు తప్పనిసరై పోజు పెట్టిన బసిరెడ్డి, బత్తెన సుబ్బారావు, సాగి సూర్యనారాయణరాజు, వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు మంత్రులై కూర్చున్నారు. తెలంగాణ నుండి నూకల రామచంద్రారెడ్డి, చొక్కారావు, రాజమల్లు, అన్సారీ, జి. రాజారాం మంత్రులయ్యారు. వీరుకాక ఇంకా లుకలాపు లక్ష్మణదాస్ సి.హెచ్. దేవానంద రావు, ఎం. లక్ష్మీదేవి మంత్రులయ్యారు. నెలతిరక్క ముందే సమైక్యతా వాదులుగా నిలబడ్డ ఎం.వి.కృష్ణారావు, భాట్టం శ్రీరామమూర్తి, ప్రత్యేకాంధ్రకై కృషిచేసిన చనుమోలు వెంకటరావు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసారు. మంత్రులుగా



చేరిన 6 నెలల్లో బి.వి.సుబ్బారెడ్డి (1974 జులై 27) చనిపోయాడు. ఆ తరువాత ఉప ముఖ్యమంత్రి పదవిని మళ్ళీ పునరుద్ధరించలేదు. కానీ పిడతల రంగారెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకుని మరికొంత మందిని చేర్చుకుంటూ 1974 సెప్టెంబర్ 25న మంత్రివర్గాన్ని విస్తరించారు. కొత్తగా వచ్చిన వారిలో టి.అంజయ్య, పి.నరసారెడ్డి, వి.పురుషోత్తమరెడ్డి, పి. మహేంద్రనాథ్, డి.మునుస్వామి, ఎస్.వెంకట రామిరెడ్డి, అసిఫ్ పాషా, కె.వి. కేశవులు, ఆనం వెంకటరెడ్డి ఉన్నారు.

సమైక్యతా వాదిగా పేరొందిన వెంగళరావు రాష్ట్ర కాంగ్రెస్ లో మార్పులు చేస్తూ వీరమాచినేని వెంకటనారయణను అధ్యక్షుడిని కావించాడు. 1971 లోక్‌సభ ఎన్నికలలో కొమ్మారెడ్డి సూర్యనారాయణపై పోటీచేసి ఓడిపోయిన పాత కాంగ్రెస్ అభ్యర్థి ఈయన. వీరమాచనేని వారికి, వెంగళరావుకు ఉన్న సన్నిహిత సంబంధాల్ని బట్టి ఈ విధంగా చేసాడంటారు.

ఆరు సూత్రాల పథకాన్ని అమలు చేసే కార్యక్రమంలో మూడు ప్రణాళికా సంఘాల్ని ఏర్పరిచారు. బి.వి.సుబ్బారెడ్డికి కర్నూలు జిల్లాలో వ్యతిరేకంగా ఉంటూ వచ్చిన కె.బి.నరసప్పను రాయలసీమకు, పాత కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన రేబాల దశరథ రామిరెడ్డికి ఆంధ్ర ప్రాంతానికి డిప్యూటీ స్పీకర్ గా ఉన్న జగన్నాథ రావుకు తెలంగాణాకు ప్రాణాళికా సంఘ పదవి ఇచ్చారు.

1974 అక్టోబరు 18న మర్రి చెన్నారెడ్డి ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా నియమితులై వెళ్ళిపోయారు. బ్రహ్మానందరెడ్డి కేంద్రంలో హోమ్ మంత్రి అయ్యారు. ఈ విధంగా వెంగళరావుకు రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఏర్పడటంతో కలిసి వచ్చింది.

వెంగళరావు ముఖ్యమంత్రిగా తొలి సంవత్సరంలో రాష్ట్రమంతటా ఆహారమండలాలన్ని రద్దు చేసాడు. పోలీసు శాఖలో తనకు అనుకూలమైన అనేక మార్పులు చేసాడు. అలాగే చాలా కీలక నియామకాలలో కూడా తన వారిని తెచ్చిపెట్టుకున్నాడు. మంత్రి మండలిలో తోటివారిని సంప్రదించడం కాని ఆయా జిల్లాలకు సంబంధించిన వ్యవహారాలు పిలిచి అడగడం కాని ఆయనకు అలవాటు లేదు. తమ సొంత జిల్లాలో శీలం సిద్ధారెడ్డి, చేకూరి కాశయ్య మొదలైనవారు వెంగళరావుకు వ్యతిరేకంగా ఉన్నారు. సర్వీస్ కమీషన్ ఛైర్మన్‌గా తన అభ్యర్థి డి.ఎస్.రెడ్డికై ప్రయత్నించి బసిరెడ్డి విఫలమైనాడు. అప్పుడు ఖాదర్ అనే వ్యక్తిని ఛైర్మన్‌గా చేసారు. తిరుపతి దేవస్థానం ఛైర్మన్‌గా అన్నారావు అనే వ్యక్తిని నియమించారు. ఆ శాఖా మంత్రి సాగి సూర్యనారాయణ రాజును సంప్రదించకుండా ఇలా చేసాడన్నారు. కులం బలమైనదికదా... తోటి మంత్రులను సంప్రదించక పోవడంతో ఎవరు వెంటనే బయటపడకపోయినా హైకమాండ్‌కు ఫిర్యాదులు మాత్రం మొదలయ్యాయి. ఇందులో బసిరెడ్డి ప్రధాన పాత్ర వహించాడు. ఆయన తరచు ఢిల్లీకి వెళ్ళి

ఫిర్యాదులు చేస్తుండేవాడు. శాసన సభ్యుల్ని కూడ బెట్టడం మొదలైంది. పి.వి.నరసింహారావు ప్రోత్సాహం కూడా కొంతవరకు లేకపోలేదు. వెంగళరావు పదవికి ఎసరు పెట్టాలని ప్రయత్నాలు జరిగాయి. 1975 ఏప్రిల్ 12 నుండి వారం రోజులు ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. దీనిలో ప్రముఖ పాత్ర వహించిన ఎం.వి.క్రిష్ణారావు అవినీతి చర్యలకు పాల్పడ్డాడని ఫిర్యాదులు వచ్చాయి. వెంగళరావు వ్యతిరేక శక్తులన్నీ ఏదో ఒక విధంగా ఐక్యమౌతూరాగా 1975 జూన్ 25న అత్యవసర పరిస్థితి ప్రకటించడంతో కాంగ్రెస్ లో ప్రతిపక్షాలవారి నోళ్ళు మూత పడ్డాయి.

-------

## ముఖ్యమంత్రి – జె. వెంగళరావు

10-12-1973 నుండి 05-03-1978

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | జె. వెంగళరావు | కార్యనిర్వాహక, ప్రణాళికలు, గృహ, భూ సంస్కరణలు, భారీ నీటిపారుదల |
| 2. | బి. వి. సుబ్బారెడ్డి | ఆహార మరియు వ్యవసాయ |
| 3. | ఎన్. రామచంద్రారెడ్డి | ఆర్థిక శాఖ |
| 4. | పి. బసి రెడ్డి | పరిశ్రమలు |
| 5. | జె. చొక్కారావు | రవాణా శాఖ |
| 6. | కె. రాజమల్లు | మెడికల్ మరియు ఆరోగ్యశాఖ |
| 7. | సాగి సత్యనారాయణ రాజు | దేవాదాయ శాఖ |
| 8. | ఎమ్. ఇబ్రహీం అలీ అన్సారీ | సమాచార మరియు వక్ఫ్ |
| 9. | వి. కృష్ణమూర్తినాయుడు | మధ్యతరహా నీటిపారుదల |
| 10. | బి. సుబ్బారావు | సహకార |
| 11. | ఐ. లక్ష్మణ దాసు | కార్మిక మరియు వృత్తి శాఖలు |
| 12. | జి. రాజారాం | విద్యుత్తు |
| 13. | చల్లా సుబ్బారాయుడు | మునిసిపల్ కార్యనిర్వాహకత |
| | **రాష్ట్ర మంత్రులు** | |
| 14. | డా. సిహెచ్. దేవానందరావు | పర్యాటక మరియు ప్రజా గ్రంథాలయాలు |
| 15. | శ్రీమతి లక్ష్మీదేవి | స్త్రీ శిశు సంక్షేమ శాఖ |

**జనవరి 12, 1974 నాటి**
**మంత్రివర్గ విస్తరణ**

| | | |
|---|---|---|
| 16. | ఎమ్.వి.కృష్ణారావు | విద్య |
| 17. | సిహెచ్. వెంకటరావు | రోడ్డు మరియు భవనాలు |

**రాష్ట్ర మంత్రులు**

| | | |
|---|---|---|
| 18. | బి. శ్రీరామమూర్తి | సాంఘిక సంక్షేమ శాఖ |

**సెప్టెంబర్, 25, 1974 నాటి**
**మంత్రివర్గ విస్తరణ**

| | | |
|---|---|---|
| 19. | పిడతల రంగారెడ్డి | ఆర్థిక మరియు సమాచార శాఖ |
| 20. | టి. అంజయ్య | కార్మిక మరియు ఉపాధి |
| 21. | పి. నరసారెడ్డి | భూమి పన్నుల శాఖ |

**రాష్ట్ర మంత్రులు**

| | | |
|---|---|---|
| 22. | ఎ. వెంకట్ రెడ్డి | మైనర్ ఇరిగేషన్ |
| 23. | వి. పురుషోత్తమ్ రెడ్డి | ఎక్సైజ్ |
| 24. | పి. మహేంద్రనాథ్ | మార్కెటింగ్ |
| 25. | డి. మునిస్వామి | మత్స్య శాఖ |
| 26. | ఎస్. వెంకట్ రామ రెడ్డి | జంతు సంరక్షణ శాఖ |
| 27. | అసిఫ్ పాషా | న్యాయశాఖ |
| 28. | పి. వి. కేశవులు | హేండ్లూమ్స్ |

**ఆగస్టు 13, 1976 నాటికి**
**మంత్రివర్గ విస్తరణ**

| | | |
|---|---|---|
| 29. | సిహెచ్. హనుమయ్య | రవాణా శాఖ |

**రాష్ట్ర మంత్రులు**

| | | |
|---|---|---|
| 30. | శ్రీమతి కృష్ణవేణి సంజీవయ్య* | స్త్రీ సంక్షేమ శాఖ |
| 31. | కె. బి. నరసప్ప | చక్కెర పరిశ్రమ |
| 32. | పి. శేషావతారం | గిరిజన అభివృద్ధి |
| 33. | పి. ధర్మారెడ్డి | గృహనిర్మాణ శాఖ |
| 34. | పై నారాయణ స్వామి* | చిన్న తరహా పరిశ్రమలు |

**సెప్టెంబర్ 4, 1977 నాటికి**
**మంత్రివర్గ విస్తరణ**

| | | |
|---|---|---|
| 35. | ఆర్. నారప రెడ్డి | పంచాయత్ రాజ్ |

36. మాణిక్య రావు వాణిజ్య పన్ను
37. లక్ష్మీనారాయణ యాదవ్* వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ

# దేశంలో అత్యవసర పరిస్థితి

అత్యవరస పరిస్థితి ప్రకటించే సందర్భంలో వెంగళరావు ఢిల్లీలో ఉన్నాడు. ఆయన ద్వారా కర్ణాటక ముఖ్యమంత్రి దేవరాజ్ ఆర్స్‌కు ప్రధాని ఇందిర ఇందుకు సంబంధించిన రహస్యాన్ని చేరవేసారు. భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతి పక్షాలకు సంబంధించిన వారినందరిని అనగా స్వతంత్ర, బి.ఎల్.డి., సోషలిస్ట్, సి.పి.ఎం., జనసంఘం, సి.పి.ఎల్.ఎం.కు సంబంధించిన వారిని జైళ్ళలో నిర్బంధించారు. కేసులు పెట్టలేదు. విచారణ జరపలేదు. రాడికల్ హ్యూమనిస్ట్ ఎం.వి.రామమూర్తి, జనతంత్ర సమాజ్ కు చెందిన జి.సి.కొండయ్య మొదలైనవారందరినీ జైళ్ళలో పెట్టారు. ఆర్.ఎస్.ఎస్.కు సంబంధించిన చాలామందిని నిర్బంధిచడమే కాక చిత్రహింసలకు గురిచేసారు. అలాగే అతివాద కమ్యూనిస్టులను చిత్రహింసకు గురిచేయడమేకాక పోలీసులతో సంఘర్షణ పేరిట కాల్చి చంపారు. కృష్ణాగౌడ్, భూమయ్య అనే అతివాద కమ్యూనిస్టులను 1975 డిసెంబర్ 1న సికింద్రాబాద్ జైల్లో ఉరితీశారు. లోగడ ఎమర్జెన్సీ లేనప్పుడు వీరిని ఉరి తీయరాదని దేశవ్యాప్తంగా ఆందోళన జరిగింది. కోర్టు కూడా స్టే ఇచ్చింది. ఉరికి సంబంధించిన వార్తలేమీ బయటకు పొక్కకుండా సెన్సార్ పనిచేసింది. సమాచార శాఖలోనే సెన్సార్ బోర్డు ఏర్పాటు చేసి లిఖిత పూర్వకంగా కాక ఫోను ద్వారా చాలా అంశాలు సెన్సార్ చేస్తూ పోయారు.

1976 జనవరి 3న ఇందిర విశాఖపట్టణంలో సైన్స్ కాంగ్రెస్ ప్రారంభించడానికి వచ్చినప్పుడు ఆమె వెంట ఆమె కుమారుడు సంజయ్ గాంధీ కూడా వచ్చారు. ఎమర్జెన్సీలో ప్రధాని ఆంధ్ర ప్రదేశ్ కు రావడం అది రెండవసారి. అంతకుముందు నవంబర్ లో హైదరాబాద్ వచ్చి జాతీయ పోలీసు అకాడమీని, హైదరాబాద్ యూనివర్సిటీని ప్రారంభించి వెళ్లారు. సంజయ్ గాంధీకి విశాఖపట్టణంలో బాగా స్వాగతం చెప్పడానికి ప్రయత్నించారు.

పంచాయతీ సమితి, జిల్లాపరిషత్ లకు సంబంధించి సవరణలు చేసారే కాని ఎన్నికలు మాత్రం జరగలేదు. అని సహకార సంస్థలకు పర్సన్ ఇన్ చార్జిలతో నింపుకొని రాజకీయంగా బలపడటానికే ప్రయత్నించారే కాని ప్రజాస్వామ్యం విప్పారడానికి ఏమాత్రం కృషి చేయలేదు. 20 సూత్రాల పథకం పేరిట ఆంధ్రాకు 18,82 మిలియన్ల రూపాయలు కేంద్రం ఇవ్వగా వెంగళరావు ఇది ఖర్చు చేయడంలో ఇందిరాగాంధీకి ప్రచారం బాగా చేసాడు. దానితోపాటే సంజయ్ చెప్పిన 5 సూత్రాల పథకాన్ని కూడా విపరీతంగా ప్రచారం చేయించాడు. ప్రచారం తారాస్థాయి నందుకోవడమే కాక రాష్ట్రాలలో ఏ చిన్నపని జరిగినా, భూములకు పట్టాలిచ్చినా, ఇళ్ళకు అప్పులిచ్చినా ఇదంతా ఇందిరాగాంధీ చలవేనని ఆయన ప్రచారం చేసాడు. అంతవరకు రాష్ట్రంలో గవర్నర్ లేనందున తాత్కాలిక గవర్నరుగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఓబులరెడ్డి పనిచేస్తూ ఉండేవాడు. 1976 జూన్ 15న ఆర్.డి.భండారే గవర్నరుగా వచ్చి 20 సూత్రాల ప్రచారానికి పూనుకున్నాడు.

వెంగళరావు ఇందిరాగాంధీకి ఎంత సన్నిహితంగా ఉన్నప్పటికీ రాష్ట్ర కాంగ్రెస్ లో, మంత్రివర్గంలో ముఠా రాజకీయాలను పోగొట్టలేక పోయినాడు. పరిశ్రమల మంత్రిగా ఉంటున్న బసిరెడ్డి చాలా విషయాలలో ముఖ్యమంత్రితో ఏకీభవించలేక పోయాడు. ఆయన తరచు వెళ్ళి హైకమాండ్ కు ఫిర్యాదులు ఎమర్జన్సీలో కూడా చేసాడు. అదీగాక ఢిల్లీలో ఇందిరకు సన్నిహితుడుగా పి.వి.నరసింహారావు ఉండేవాడు. ఆయన సహకారంతో వెంగళరావును పడగొట్టాలని తరచు మంతనాలు జరిగేవి. జనగన్నాధరావు, రాజారామ్ ఈ ప్రయత్నాలలో ప్రధాన పాత్ర వహించాడు. వ్యవహారాలు శ్రుతిమించేసరికి బసిరెడ్డిని రాజీనామా ఇవ్వవలసిందిగా ముఖ్యమంత్రి వెంగళరావు పట్టుబట్టాడు. 1976 ఆగస్టు 12న బసిరెడ్డి రాజీనామా ఇచ్చాడు. వెంగళరావు రాష్ట్రంలో తనబలాన్ని ఇంకా కట్టుదిట్టం చేసుకోవడానికి మంత్రివర్గాన్ని

విస్తరించాడు. చేబ్రోలు హనుమయ్య, పరకాల శేషావతారం, సి. ధర్మారెడ్డి, వై. నారాయణస్వామి, కె.బి.నరసప్ప, కృష్ణవేణి సంజీవయ్య 1976 ఆగస్టు 14న మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసారు.

ఎమర్జెన్సీలో అసెంబ్లీ సమావేశం జరిగినప్పటికీ చర్చలు స్వేచ్ఛగా ప్రచురింపనీయలేదు. అతివాద కమ్యూనిస్టు, మాజీ శాసన మండలి సభ్యుడైన నీలం రామచంద్రయ్య పోలీస్ సంఘర్షణలో చనిపోయాడని వార్త తెలిసి శాసనమండలిలో సానుభూతి తీర్మానంపై మాట్లడబోగా తిరస్కరించారు. శాసనసభా సమావేశాలు జరుగుతున్నా జైళ్ళలో ఉన్న శాసన సభ్యులను కనీసం పోలిస్ రక్షణలోనైనా సమావేశాలకు హాజరు కానివ్వలేదు. గోదావరి ఆనకట్టకు గండిపడితే ఆవార్త పత్రికలో వస్తే ముఖ్యమంత్రి మండిపడ్డాడు.

1976లో కాంగ్రెస్ లో ఉన్న ముఠా రాజకీయాల ఫలితంగా వీరమాచనేని వెంకటనారాయణను కాంగ్రెస్ అధ్యక్షుడుగా తొలగించి తాడేపల్లి ముసలయ్యను ఆపద్ధర్మ అధ్యక్షుడ్ని చేసారు. మంత్రి అవుదామనుకున్న వెంకట నారాయణకు ఏ పదవీ లేకుండా పోయింది. అంతటితో ఆయన వెంగళరావుకు వ్యతిరేకమయ్యాడు.

1976 డిసెంబరులో ఒక ప్రధాన ఘట్టం జరిగింది. సంజ్ యయ్ గాంధీని వెంగళరావు ఆంధ్రకు ఆహ్వానించాడు. కొత్తగూడెం, గుంటూరు, తిరుపతిలో సమావేశాలు ఏర్పాటు చేసారు. అధికార యంత్రాంగాన్నంతటినీ ఉపయోగించారు. సంజయ్ గాంధీ హెలికాప్టర్ లో దిగడానికి హెలిపాడ్ నిర్మించారు. విందులకు, వినోదాలకు విపరీతంగా ఖర్చు చేసారు. రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ప్రముఖులు అందరూ సంజయ్ గాంధీ గుర్తింపు కోసం తొక్కిసలాడారు. గిరిజనులకు ప్రభుత్వం ఇస్తున్న సహాయం సందర్భంగా మనుషుల్ని లారీలపైన తీసుకొచ్చారు. ...మరపురాని మధురక్షణాలు... అనే న్యూస్ రీల్ సినిమాను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది, సంజయ్ గాంధీ ప్రత్యేక విమానంలో ప్రయాణం చేసాడు. పైలట్ గా చేసాడట. ఆయన వెంట వెంగళరావు, రఘురామయ్య ఉన్నారు. ఆనాడు కాంగ్రెసులోని అన్ని ముఠాలవారు సంజయ్ గాంధీ భజన చేసిన వారే. గుంటూరులో పెద్ద బహిరంగసభను ఏర్పాటుచేసి జనాన్ని 'తోలుకొచ్చారు' ఆ సమావేశంలో నాటి కేంద్ర మంత్రి కొత్త రఘురామయ్య మాట్లాడుతూ 'మీ తాతకు సేవ చేసాం, మీ తండ్రికి సేవచేసాం, మీకు చేయడానికి సిద్ధంగా ఉన్నాం, మమ్మల్ని మర్చిపోవద్దు, మీరు ఉదయిస్తున్న సూర్యభానుడు' అని చెప్పిన మాటలు చాలా జుగుప్సాకరంగా ఉన్నాయని ఉత్తరోత్తరా విమర్శకు గురి అయినాయి. *కొందరు చేస్తారు, కానీ చెప్పకోరు, మేము చేసేది* చెప్పానని రఘురామయ్య తరవాత అన్నాడు. తిరుపతిలో కూడా సంజయ్ గాంధీకి చాలా ఘనంగా స్వాగతం లభించింది. యూత్ కాంగ్రెస్ పేరిట వెంగళరావు కొంతమందిని ప్రోత్సహించాడు. ఆయన కుమారుడు జలగం ప్రసాద్ హఠాత్తుగా ఖమ్మం జిల్లా రాజకీయాలలో ప్రముఖపాత్ర వహించాడు. వెంగళరావు తన కుమారుడి చర్యలు తెలిసి కూడా వాటిని నిరోధించక పోవడం వలన తండ్రి మద్దతు ఉన్నదని అధికారులు భావించారు.

జైళ్ళలో ఉన్న వారిలో కొందరు వెంగళరావును ఆశ్రయించి బెయిలుపై విడుదలయ్యారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి ఉదారంగా ప్రవర్తించాడు. అత్యవసర పరిస్థితిలో తన గురువు నీలం సంజీవరెడ్డిని జైలులో పెట్టలేదు. ఆయన రెండు పర్యాయాలు బహిరంగ సభలలో మాట్లాడటానికి ప్రయత్నించినపుడు కూడా నిరోధించారే తప్ప నిర్బంధించ లేదు. అయితే నీలం సంజీవరెడ్డికి ఆతిథ్యం ఇచ్చినవారిని నిర్బంధించారు. ఉత్తరాదితో పోల్చి చూస్తే అత్యవసర పరిస్థితి అంత దారుణంగా ఆంధ్రలో లేదు. కానీ వేలాది ప్రభుత్వోద్యోగుల్ని ఉపాధ్యాయుల్ని ఎమర్జెన్సీలో ఉద్యోగాల నుండి నిర్బంధంగా తొలగించారు. అందులో కొందరు మాత్రమే కోర్టుకెళ్ళారు.

## 1977 లోక్ సభ ఎన్నికల ఆశ్చర్యకర ఫలితాలు

1977 జనవరిలో అత్యవసర పరిస్థితి తొలగింపబడటం ఎన్నికలు జరుగుతాయని ప్రకటించడంతో మళ్ళీ పాతకథ పునరావృతమైంది. కేంద్రంలో ఏర్పడిన జనతాపార్టీకి ఆంధ్రలో కూడా హఠాత్తుగా ఒక శాఖ వెలిసింది. తెన్నేటి విశ్వనాథం దానికి అధ్యక్షుడుగా నియమితుడైనాడు. హడావుడిగా 42 లోక్ సభ స్థానాలకు అభ్యర్థుల్ని ఎంపిక చేసారు. నీలం సంజీవ రెడ్డి దక్షిణాది రాష్ట్రాలకు జనతా నాయకుడిగా ఎన్నికల విషయం చూసాడు. కొండా లక్ష్మణ్, జగ్ జీవన్ రాం

ఏర్పరచిన జనతంత్ర కాంగ్రెసులో చేరాడు. పార్లమెంట్ స్థానాలకు కూడా కొంత హడావుడి జరిగింది. అట్టే శ్రమలేకుండానే నిర్ణయం జరిగిపోయింది. నీలం సంజీవరెడ్డి నంద్యాలలో పోటీ చేసాడు. పెండేకంటి వెంకట సుబ్బయ్య కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకి నిలబడ్డాడు. లక్ష్మీకాంతమ్మ సికింద్రాబాద్ లో ఎం.ఎం.హాషీమ్ పై పోటీ చేసింది. సదాలక్ష్మి, వెంకటస్వామిపై పోటీచేసింది. రాజగోపాల నాయుడు, చెంగల్రాయనాయుడు చిత్తూరులో పరస్పరం పోటీ చేసుకున్నారు. కాంగ్రెసులో ఇంచుమించు అంతా పాతవారే ఉన్నారు. గుంటూరులో కొత్త రఘురామయ్య, జనతా అభ్యర్థి డాక్టర్ సదాశివరావు పోటీ చేసుకున్నారు. ఇద్దరూ ఒకే కులానికి చెందినవారు. నర్సరావుపేటలో బ్రహ్మానందరెడ్డి నిలబడ్డాడు. గోడె మురహరి విజయవాడలో కాంగ్రెసు తరఫున పోటీచేసాడు. ఆయన ఆంధ్రుడే అయినా లోగడ ఉత్తరప్రదేశ్ నుండి సోషలిస్టు పార్టీ పక్షాన పార్లమెంట్ కు వచ్చాడు. ఉత్తరాదిన వీచిన జనతాగాలి, ఇందిరా వ్యతిరేక ప్రభంజనం దక్షిణాదిలో కూడా ఉన్నదని జనతావారు భ్రమపడ్డారు. జనతా నాయకులంతా ఆంధ్రప్రదేశ్ లో పర్యటన చేసారు. జనం విపరీతంగా వారి సభలకు హాజరయ్యారు. కాంగ్రెసువారు కూడా యధాశక్తి ప్రచారం జరిపారు. ముఖ్యమంత్రి వెంగళరావు మొదటి నుండీ ధైర్యంగా అన్నిసీట్లు గెలుస్తామని చెప్పాడు. ఆయన తమ్ముడు కొండలరావు ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసాడు. గురుశిష్యులైన నీలం సంజీవ రెడ్డి, వెంగళరావు ఎన్నికల్లో ఒకరిపై ఒకరు చాలా విసుర్లు సభా ముఖంగా విసురుకున్నారు. రఘురామయ్య, బ్రహ్మానందరెడ్డి ఒకరి కొకరికి వ్యతిరేకంగా లోలోపల కృషి చేసుకున్నారు. కొన్నిచోట్ల కాంగ్రెసు అభ్యర్థులు కాడి కింద పారేసి ఊరుకున్నారు. తీరా ఎన్నికల ఫలితాలు చూసేసరికి 41 స్థానాలు కాంగ్రెసు చేజిక్కించుకున్నది. నంద్యాలలో నీలం సంజీవరెడ్డి మాత్రం పట్టుదలతో విజయం సాధించాడు. కాంగ్రెసుకు 57 శాతం ఓట్లు రాగా జనతాకు 32 శాతం వచ్చింది. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు పేరులో లేకుండా పోయాయి.

ఎన్నికల అనంతరం వెంగళరావు రాష్ట్రంలో గెలిచినందుకు సంతోషించబోతుండగా, కేంద్రంలో తమ పార్టీ ఊడినందుకు విచారించవలసి వచ్చింది. ఎన్నికల అనంతరం కాంగ్రెసుకు వ్యతిరేకంగా పనిచేసిన వారిపై క్రమశిక్షణ చర్య తీసుకున్నారు. ఖమ్మం జిల్లాలో తన ప్రత్యర్థి అయిన చేకూరి కాశయ్యను కాంగ్రెసు నుండి తొలగించారు. అయితే వెంగళరావుకు అప్పటినుండి గడ్డు పరిస్థితి ఏర్పడింది. మంత్రివర్గంలో ఉన్న అభిప్రాయ భేదాలు మళ్ళీ పైకి రావడం ప్రారంభించాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా చాలామందికి కొత్త ఆలోచనలు వచ్చాయి. వెంగళరావుపై ఆరోపణలు చేస్తూ విచారణ జరిపించాలని అసెంబ్లీలోను, బయట జనతాసభ్యులు కేంద్రాన్ని ఒత్తిడి చేయసాగారు. దీని ఫలితంగా రెండు కమీషన్ లను కేంద్రం నియమించింది. ఒకటి విమద్ లాల్ కమీషన్, రెండవది భార్గవ కమీషన్, ఇవి రెండూ కేంద్రం సలహాపై రాష్ట్రమే నియమించింది. పోలీసులతో జరిగిన ఘర్షణలలో నక్సలైట్లు చనిపోలేదని వారిని కాల్చి చంపారని, తార్కుండే కమిటీ నివేదించింది. ఇందులో రాష్ట్రం నుండి ఎం.వి. రామమూర్తి, బల్వంత రెడ్డి, కన్నాభిరాన్, కాళోజీ నారాయణరావులు ఉన్నారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగానే భార్గవ కమీషన్ నియమించబడింది. ముఖ్యమంత్రి పైన మంత్రుల పైన వచ్చిన ఆరోపణలను విచారించడానికి విమద్ లాల్ కమీషన్ నియమించబడింది. మంత్రులు రంగారెడ్డి, చొక్కారావు, ఎం.వి. కృష్ణారావు భాట్టం శ్రీరామమూర్తి, కె.వి.కేశవులు మొదలైన వారిపై ఆరోపణలున్నాయి. తొలగించిన ఉద్యోగులను పూర్తిగా మళ్ళీ సర్వీసులోకి తీసుకోవడమేకాక న్యాయమైన కేసులను పరిశీలించి స్వీకరిస్తామని వెంగళరావు ఒప్పుకోవాల్సి వచ్చింది.

కేంద్ర కాంగ్రెస్ రాజకీయాలలో కొన్ని ప్రధానమైన మార్పులు వచ్చాయి. వాటి ఫలితంగా బ్రహ్మానందరెడ్డి కాంగ్రెస్ అధ్యక్షుడైనాడు. ఇందిరాగాంధీ కోరికపై బ్రహ్మానందరెడ్డి పేరు మంత్రి రాజారాం ప్రతిపాదించాడు. బ్రహ్మానందరెడ్డి అధ్యక్షుడు కావడంపట్ల అందుకు నిరసనగా ఆ మరుక్షణంలో కొత్త రఘురామయ్య కాంగ్రెసుకు రాజీనామా ఇచ్చాడు. వెంగళరావు తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా ఇచ్చాడు. వెంగళరావు రాజీనామాను కాంగ్రెస్ హైకమాండ్ ఆమోదించలేదు. ఇందిరాగాంధీ ఆయనను ఢిల్లీకి పిలిపించి సర్ది చెప్పింది. ఆమె మాటను అంగీకరించి బ్రహ్మానందరెడ్డితో రాజీపడటానికి వెంగళరావు అంగీకరించాడు. హైకమాండ్ వెంగళరావు రాజీనామాను ఉపసంహ రించుకోవడానికి ..అనుమతించింది... ఆ తరువాత రాష్ట్ర కాంగ్రెస్ లో కొన్ని మార్పులు చేయాల్సి వచ్చింది. తాడేపల్లి ముసలయ్యను అధ్యక్షస్థానం నుంచి తొలగించి రహమతుల్లాను అధ్యక్షుని చేసారు. ఇతను కడపకు చెందిన వాడు, సంపన్న ముస్లిం. రాజ్యసభ సభ్యుడు తరువాత ఇందిరా కాంగ్రెస్ లో చేరి మళ్ళీ వెంగళరావుకు అనుకూలు డయ్యాడు. మంత్రివర్గాన్ని

కూడా బ్రహ్మానందరెడ్డికి అనుకూలంగా విస్తరించ వలసిన పరిస్థితి ఏర్పడింది. బ్రహ్మానందరెడ్డికి కుడి భుజంగా ఉన్న రొండా నారపరెడ్డిని పంచాయతీ రాజ్ మంత్రిగా నియమించారు. అమరనాథ రెడ్డిని, అప్పుడు దొరను మంత్రులుగా వేసుకున్నారు. మంత్రివర్గంలో రాజమల్లు చాలా సందర్భాలలో వెంగళరావుతో ఘర్షణ పడ్డాడు. అగ్రకులాలకు చెందిన డాక్టర్లు రాజధానిలోనే చాలా కాలంగా తిష్ట వేసుకున్నారని, వారిని బదిలీ చేయాలని, ప్రభుత్వ డాక్టర్ల ప్రైవేటు ప్రాక్టీసు నిషేధించాలని రాజమల్లు పట్టుబట్టాడు. కానీ వెంగళరావు ఆయన మాట సాగనివ్వలేదు. చివరకు వారి ఘర్షణ పరాకాష్ఠకు పోగా రాజమల్లు ఆరోగ్యశాఖామంత్రిగా రాజీనామా ఇచ్చాడు. తానే తొలగిస్తున్నట్లు వెంగళరావు ప్రకటించాడు.

1977 నవంబరు 19న గుంటూరు, కృష్ణా జిల్లాలలో వచ్చిన ఉప్పెన, తుఫాను ఫలితంగా 10,000 మందికి పైగా చనిపోవడంతోపాటు వేలాదిమంది నిరాశ్రయులై ఆస్తిపాస్తులు పోగొట్టుకున్నారు. సమయానికి సహాయం చేయలేకపోయారని పార్టీ కలహాలలో పడిపోయారని వెంగళరావుపైన ఆయన మంత్రివర్గం పైన తీవ్ర విమర్శ వచ్చింది. ఆర్థిక మంత్రి పి.రంగారెడ్డి, వ్యవసాయశాఖామంత్రి చొక్కారావు, గృహవసతుల శాఖ మంత్రిని విమర్శిస్తూ రాజీనామాలు ఇచ్చారు. వెంటనే కాకున్నా, ఎన్నికలు సమీపించేసరికి, రంగారెడ్డి, చొక్కారావు జనతాపార్టీలో చేరారు. అంజయ్య, రాజారాం కూడా రాజీనామాలిచ్చి ఇందిర కాంగ్రెసులో చేరారు. కేంద్రంలో కాంగ్రెస్ చీలిపోయినప్పుడు వెంగళరావు మళ్ళీ ఇందిర పక్షంలో కాక బ్రహ్మానందరెడ్డితోనే ఉన్నాడు. ఎక్సయిజ్ మంత్రి వి.పురుషోత్తమ రెడ్డి రాజీనామా ఇచ్చి జనతాపార్టీలో చేరాడు. లుకలాపు లక్ష్మణదాస్ కూడా మంత్రిగా రాజీనామా ఇచ్చాడు. భాట్టం శ్రీరామమూర్తి కొన్ని సందర్భాలలో వెంగళరావును విమర్శించినా మంత్రి పదవికి రాజీనామా ఇచ్చేంతవరకూ పోలేదు. విశాఖ జిల్లాలో భాట్టంకు ప్రత్యర్థి సాగి సూర్యనారాయణరాజు తన మంత్రి పదవికి రాజీనామా ఇచ్చి జనతాలో చేరాడు. భాట్టం చేరకపోవడానికి అది కారణం అనుకున్నారు. ఆంధ్రలో వెంగళరావు, బ్రహ్మానందరెడ్డి కలిసి ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా ఎన్నికలకు సిద్ధపడ్డారు. కాంగ్రెసు శాసనసభ్యుల్లో కొందరు ఇందిరా కాంగ్రెస్ వైపుకు, మరికొందరు జనతావైపు పార్టీలు మార్చారు. విమద్ లాల్ కమీషన్ ముందు వెంగళరావు సాక్ష్యం ఇస్తూ రాజకీయ పరిస్థితుల వలన సంజయ్ గాంధీని ఆహ్వానించమని చెప్పాడు.

ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా రాజీనామా ఇచ్చి రాష్ట్రానికి వచ్చిన మర్రి చెన్నారెడ్డి ఏ పార్టీలోనూ చేరకుండా కొన్నాళ్ళు సంప్రదింపులతో గడిపాడు. చివరకు ఇందిరాగాంధీ పక్షమై ఆ పార్టీలో ప్రధాన పాత్ర వహించాడు. ఎన్నికల సమయానికి 1978 జనవరి 18న రాష్ట్రంలో ఇందిరా కాంగ్రెస్ మహాసభ జరిపినప్పుడు చెన్నారెడ్డిని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఇందిరాగాంధీ ప్రకటించింది. ఆ స్థానం కోరుకున్న రాజారాం చివరకు తానే ఇందిరాగాంధీ సలహాతో చెన్నారెడ్డి పేరును ప్రతిపాదించాడు. రంగా వర్గం కొద్దిమంది సభ్యులతో ఇందిరాగాంధీ వర్గంలో చేరింది.

## జనతా కుప్పిగంతులు

1977 లోక్ సభ ఎన్నికలలో ఒక్కస్థానాన్ని మాత్రమే గెలుచుకున్న జనతాపార్టీ సమర్థుడైన నాయకుడు లేని పక్షంగా రూపొందింది. కానీ 1978 శాసనసభ ఎన్నికలలో తప్పనిసరిగా అధికారంలోకి వస్తామని వారికి మూఢ విశ్వాసం కలిగింది. కనుక ఎన్నికలలోపుగా ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెసును దెబ్బతీసి జనతాను బలపరచుకోవాలని నిశ్చయించుకున్నారు. కానీ ఏకగ్రీవాభిప్రాయం వచ్చేటట్లు కనిపించలేదు. కాంగ్రెసువలె ఇక్కడ కూడా ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు, సిఫారసులు ముమ్మరంగా కొనసాగాయి. సోషలిస్టులు, జనసంఘం, బి.ఎల్.డి. ప్రజాస్వామ్య కాంగ్రెసువారు ఎవరి నాయకుల్ని వారు ఢిల్లీలో కలుసుకుని తమకు అనుకూలంగాను, ఎదుటి వారిపై ఫిర్యాదులు చేస్తూను చెప్పారు. లచ్చన్న, లక్ష్మీకాంతమ్మ, విశ్వనాథం, కొండాలక్ష్మణ్ అధ్యక్షుని ఆటలో పాల్గొన్నారు. అయితే ఈ తగువు పరిష్కారం చేయడానికి జార్జి ఫెర్నాండజ్ ను, వీరేంద్రషాను హైదరాబాద్ పంపించారు. అప్పుడు జరిగినతంతు అంతా ఇంతాకాదు. ఎవరికి వారు జిల్లాల నుండి కొందరు మనుషుల్ని పిలిపించుకుని నాయకులకు చెప్పించుకున్నారు. జనసంఘం వారు తమ అభ్యర్థి అయిన బంగారు లక్ష్మణ్ ను చివరి నిముషంలో బలపరచక పోవడానికి అతడు హరిజనుడు కావడమే కారణమని అనుకున్నారు. సోషలిస్టులు, జనసంఘంవారు, లచ్చన్నను బలపర్చారు. ఫెర్నాండజ్, వీరేంద్రషాలు ఢిల్లీ వెళ్ళి పార్టీకి తమ అభిప్రాయాలను వివరించారు. అక్కడ పార్టీవారు మధ్య మార్గం అనుసరించి తెన్నేటి విశ్వనాథాన్నే

అధ్యక్షుడిగా అట్టిపెట్టి లచ్చన్నను ఉపాధ్యక్షుడిగా చేసారు. 8 మందిని కార్యదర్శులుగా వేశారు. అంతటితో తృప్తిపడక ప్రత్యేక ఆహ్వానితులతో పెద్ద జాబితాను తయారు చేసారు. జనతావారి ప్రవర్తన హుందాగా లేకపోవడం పెద్ద లోపంగా కనిపించింది. లచ్చన్న పాత స్వతంత్రపార్టీ రాజకీయాలనే మళ్ళీ ప్రారంభించాడు. పార్టీలో ఇంచుమించు అంతర్యుద్ధం ప్రారంభమైంది. ఎన్నికలు సమీపిస్తుంటే సురేంద్రమోహన్‌ను కేంద్ర పార్టీ ఇక్కడకు పంపించింది. ఆయన మాట కూడా అంతగా చెల్లలేదు. పార్టీకి ప్రజల్ని సమీకరించే సమస్య ఏదీ కనిపించలేదు. అయితే కాంగ్రెసు శాసన సభ్యులు ఒక్కరొక్కరే జనతాలోకి రావడం మొదలు పెట్టారు. విమద్ లాల్ కమిషన్ వేయించడంలో జనతా సభ్యులు కృతకృత్యులయ్యారు. అత్యవసర పరిస్థితిలో కూడా ఇందిరాగాంధీని, రాజ్యాంగ సవరణల్ని సమర్థించిన అయ్యపురెడ్డి శాసనసభలో జనతాకు నాయకుడయ్యాడు. కాంగ్రెసుకు, జనతాకు ఆంధ్రప్రదేశ్‌లో ఆట్టే తేడా లేకపోవడమేగాక, కొత్తగా చేరినవారు కూడా కాంగ్రెసువారే కావడంతో ఇది *జనతా కాంగ్రెస్* అని పేరు తెచ్చుకుంది. ఏ సమస్యా దొరకక కొట్టుకుంటున్న జనతాకు చివరకు తుఫాను, ఉప్పెన సమస్య ఊతంగా లభించింది. కేంద్రం నుండి జనతా నాయకులంతా వచ్చి వెంగళరావు నాయకత్వం విఫలమైందని ఉపన్యాసాలిచ్చారు. 1977 నవంబరు 19న తుఫాను, ఉప్పెన వచ్చి 10,000 మంది చనిపోయిననాడు ముఖ్యమంత్రి వెంగళరావు ఢిల్లీలో ఉన్నాడు. ఆయన రాజకీయాలలో నిమగ్నుడై ప్రజలను అశ్రద్ధ చేశాడని జనతావారు విమర్శించారు. కానీ ఆయన మంత్రివర్గంలో సభ్యుడైన ఎం.వి.కృష్ణారావు ఉప్పెన ప్రాంతంలో ఉండటమేగాక, రాత్రింబవళ్ళు కృషి చేయడంతో జనతావారి విమర్శకు వెంగళరావు మంత్రి వర్గం ఊగిసలాడలేదు. ఇందిరాగాంధీ ఆంధ్ర పర్యటనకు వస్తానంటే రావద్దని ముఖ్యమంత్రి వెంగళరావు ఫోనుచేసి చెప్పాడు. అప్పుడు మానేసిన ఇందిరాగాంధీ తుఫాను ఆసరాగా తీసుకుని వచ్చి వెళ్ళింది. ఆమెవెంట టి.అంజయ్య, భవనం జయప్రద, బి.వెంకటరామిరెడ్డి మొదలైనవారు అండగా వున్నారు.

1978 జనవరి మాసం అంతా ఆంధ్ర ప్రదేశ్‌లో ఎన్నికల మాసంగా పరిగణించవచ్చు. ఏ పార్టీ గెలుస్తుందో ఎవరూ ఊహించలేని పరిస్థితిలో ఉన్నారు. కొందరు ఎందుకైనా మంచిదని మూడు పార్టీలకు దరఖాస్తులు పెట్టారు. (జనతా, ఇందిరా కాంగ్రెస్, కాంగ్రెస్). ఏ పార్టీ కూడా దరఖాస్తుల జాబితాను ప్రచురించలేదు. కానీ ఎన్నికలకు ముందు మాత్రం విపరీతంగా జరిగిన పార్టీ మార్పుల వలన మూడు పార్టీలకు దరఖాస్తులు పెట్టిన వారున్నారని నిర్ధారణ అయ్యింది. జనతాపార్టీ హడావుడి చూసి వారు అధికారంలోకి వస్తారనుకుని దాదాపు 2000 మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. సిఫారసు చేయించుకున్నారు. జనతా ఎన్నికల సంఘంవారు దరఖాస్తుల పరిశీలనకు రహస్యంగా సమావేశం కావలసి వచ్చింది. దీనికి తోడు సి.పి.ఎంతోను, సి.పి.ఎం.ఎల్.తోను, రిపబ్లికన్ పార్టీతోను జనతా పొత్తు కుదుర్చుకోవడంతో చివరి నిముషం వరకు జాబితా విడుదల చేయలేకపోయారు. మార్కిస్ట్ పార్టీకి 22 స్థానాలు ఇవ్వడానికి అంగీకరించారు. సి.పి.ఎం.ఎల్.కు వీరికి పొత్తు కుదరలేదు.

అధికార కాంగ్రెసు వారు చాలా మంది ఉన్న శాసన సభ్యులనే తిరిగి పోటీ చేసే అవకాశం ఇచ్చారు. వారు పి.పి.ఐ.తో పొత్తు కుదుర్చు కున్నందువలన 257 స్థానాలలో మాత్రమే పోటీ పెట్టారు. అందరికంటే చివరి జాబితా విడుదల చేసినవారు ఇందిరాకాంగ్రెస్ వారు. ఎవరితోను పొత్తు కుదుర్చుకోకుండా 284 స్థానాలకు పోటీ చేసారు. చివరి నిముషంలో అటు జనతాలోను, ఇటు అధికార కాంగ్రెసులోను సీట్లు రానివారు చాలామంది ఉన్నారు. అదీకాక కేవలం కొత్తవారు కూడా 202 మంది ఉన్నారు. బెంగుళూరు నుండి ఇందిరాగాంధీ దీవెనలతో జాబితా సిద్ధమైంది.

ఎన్నికల సంరంభం చాలా జోరుగా సాగింది. ఎవరికి వారు తామే అధికారంలోకి వస్తున్నామని భావించారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్న వెంగళరావు ధైర్యంగా తాము తిరిగి పెత్తనంలోకి వస్తామని చెప్పాడు. అధికారం చేపట్టబోతున్నామని చెన్నారెడ్డి అన్నాడు. జనతాగాలి వీచింది. కనుక తామే అధికారంలోకి వస్తామని జనతావారు గుండెమీద చేయివేసుకుని చెప్పారు. జనతా నాయకులంతా ఎన్నికల ఉపన్యాసాలు చేయడానికి ఎడతెరిపి లేకుండా తిరిగారు. జనం విపరీతంగా వచ్చారు. అధికార కాంగ్రెసు వారికి జనం రాలేదు కానీ నాయకులు మిగిలారు. ఇందిరాగాంధీ రెండు పర్యాయాలు ఆంధ్రలో పర్యటించింది. ఆమె పర్యటన బడుగు వర్గాలలో, స్త్రీలలో అనూహ్యమైన చైతన్యాన్ని, ఉత్సాహాన్ని కల్పించింది. ప్రధానిగా అధికారంలోలేని ఇందిర ఎలా ఉంటుందో అని చూడటానికి జనం వచ్చారని జనతావారు వ్యాఖ్యానించారు. ఇందిరాగాంధి చాలచోట్ల కేవలం ధర్మదర్శనంగానే పర్యటన జరిగింది. రాష్ట్ర సమైక్యతకు నిలబడతామని ఇందిరా కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలతో పేర్కొన్నది. ఒకప్పుడు వేర్పాటు వాదాన్ని

లేవనెత్తిన చెన్నారెడ్డి సమైక్యతకు నిలబడటంతో ప్రత్యేక తెలంగాణా సమస్య రాలేదు. తెలంగాణాలో ఒకరిద్దరు ప్రత్యేక రాష్ట్ర వాదాన్ని తెచ్చినా ఎవరూ పట్టించుకోలేదు.

ఎన్నికల ఫలితాలను అంచనా వేయడంలో చాలామంది పొరపాటు పడ్డారు. హరిజన, గిరిజన, వెనుకబడిన వర్గాలు ఇందిరా కాంగ్రెసు పక్షాన నిలబడ్డాయి. ఈసారి రాష్ట్రంలో ఏకగ్రీవంగా ఎక్కడా ఎన్నిక జరగలేదు. 646 మంది ఇండిపెండెంట్లు నిలబడ్డారు. తీరా ఫలితాలు చూస్తే ఇందిరా కాంగ్రెసుకు 175 స్థానాలు వచ్చాయి. జనతాకు 60, కాంగ్రెసుకు 30, సి.పి.ఎం.కు 8, సి.పి.ఐ.కి 6 వచ్చాయి. మొత్తం 294 స్థానాలలో 202 మంది అసెంబ్లీకి కొత్తగా రావడం విశేషం. కాంగ్రెస్‌లో అనేక మంది మంత్రులు, శాసన సభ్యులు ఓడిపోగా వెంగళరావు, భాట్టం శ్రీరామమూర్తి గెలిచారు. వెంగళరావుపై కాళోజీ నారాయణరావు పోటి చేశాడు. అన్ని పార్టీల వారు కాళోజీని బలపరచడంతో వెంగళరావు నియోజకవర్గంలోనే ఉండిపోవాల్సి వచ్చింది.

---------

# తెలంగాణా వూసెత్తని ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి

ఇందిరా కాంగ్రెస్ బలం చేకూర్చడంతో నాయకత్వపు సమస్య వచ్చింది. చెన్నారెడ్డి నాయకుడు కావడం ఖాయం అనుకొంటుండగా తాను పోటీచేస్తానని రాజారామ్ అన్నాడు. ఆయన ఢిల్లీ వెళ్ళి ఇందిరా గాంధీని సంప్రదించడంతో పోటీ జరుగుతుందను కున్నారు. చివరి నిముషంలో ఇందిర సలహాపై రాజారామ్ పోటీ విరమిస్తున్నట్లు ప్రకటించాడు. ఇందిరా కాంగ్రెస్ నుండి గెలిచిన శాసనసభ్యుడు శ్రీనివాసుల రెడ్డి ముందుగానే చెన్నారెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ ప్రకటన చేశాడు. చెన్నారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనాడు. 1978 మార్చి మొదటివారంలో ఢిల్లీ వెళ్లి ఇందిరతో సంప్రదించాడు. రాజధానిలోను ఢిల్లీలోను మంత్రిపదవుల వేట ప్రారంభమైనది. సిఫారసులు, వత్తిడులు, కులం ముఠాలు విజృంభించి పనిచేసాయి. లోగడ కాంగ్రెసులో ఉన్న లక్షణాలన్నీ యధావిధి బైటపడ్డాయి. మార్చి 6న చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసాడు. ఆయనకు మంచి రోజుపైన, కొన్ని తేదీలపైన నమ్మకం ఉంది. మార్చి 10న ఆయన మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేసింది. ఇందులో శాసనసభకు ఎన్నిక కానివారు ఆరుగురు మంత్రులు కావడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. ఇందిరా కాంగ్రెసుకు అసెంబ్లీలో సంపూర్ణబలం ఉండగా, ఎన్నికైన వారిలో ప్రతిభావంతులుండగా బయటనుండి తీసుకోవలసిన అవసరం ఏమిటనే ప్రశ్న వచ్చింది. బహుశా అక్కడే రకరకాల ఊహలకు తావిచ్చే చర్యలు జరిగుంటాయని భావించారు. ఈ విధంగా మంత్రులైన వారిలో లోక్ సభ సభ్యుడు, ప్రజాసమితిలో ప్రముఖ పాత్ర వహించిన ఎం.ఎం.హాషీమ్, మాజీ కేంద్ర మంత్రి, కార్మిక నాయకుడు, లోక్ సభ సభ్యుడు, ముందు సమైక్యతా వాది తరువాత వేర్పాటు వాది జి.వెంకటస్వామి, రాజ్యసభ సభ్యుడుగా చేసిన ఎస్. జనార్ధన రెడ్డి, భవనం వెంకటరామిరెడ్డి, పి.వి.చౌదరి, జి.వి.సుధాకర్, సి.దాస్ ఉన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం మదరాసు శాసన సభలో ఉన్న సాంప్రదాయాన్ని చెన్నారెడ్డి మళ్లీ ప్రవేశపెడుతూ ఆరుగురు పార్లమెంటరీ కార్యదర్శులను నియమించాడు. సత్యవతి, బి.కృష్ణ, డి.రవీంద్రనాయక్, నీలం చార్లెస్, ఆర్.నాగభూషణం, కె.ఇ.కృష్ణమూర్తికి ఈ పదవులు దక్కాయి. ఇవి ఆరవ వేలువంటివని కన్నీటి తుడుపుకై ఇచ్చినవని వేరే చెప్పనవసరంలేదు. ఇవి చెల్లవని కోదండరాం అనే వ్యక్తి పిటిషన్ పెట్టగా, ఎన్నికల కమీషనర్ వారిని సంజాయిషీ అడిగాడు.



చెన్నారెడ్డి మంత్రివర్గం ఏర్పడగానే విమర్శ బయలుదేరింది. ప్రత్యేక తెలంగాణా అభిమానమంతా చూపాడని, ముఖ్యమైన శాఖలన్నీ ప్రజా సమితిలో పనిచేసేవారికి ఇచ్చుకున్నాడని, ఆంధ్రులకు అన్యాయం జరిగిందని ఈ విమర్శ

సారాంశం. సమైక్య ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా కొనసాగడానికి నిశ్చయించుకున్న చెన్నారెడ్డి ఈ విమర్శలో ఆంతర్యాన్ని గ్రహించాడు. వెంటనే కొన్ని ముఖ్యమైన శాఖలను ఆంధ్ర ప్రాంతపు మంత్రులకు ఇచ్చాడు.

చెన్నారెడ్డికి వ్యతిరేకంగా తెలంగాణాలోనే ఇందిరా కాంగ్రెస్ వారు కొందరు విమర్శలు మొదలుపెట్టారు. ఎన్నికలలో ఓడిపోయిన రాజమల్లు, టి.అంజయ్య, సరోజినీ పుల్లారెడ్డి ఇందిరాగాంధీకి సన్నిహితంగ ఉంటూ చెన్నారెడ్డి ధోరణిని విమర్శించారు. ఈలోగా రాజ్యసభకు ఖాళీ అయిన స్థానాలలో అంజయ్య, సరోజిని పుల్లారెడ్డి ఎన్నికయ్యాడు. అంజయ్య, సరోజినీ పుల్లారెడ్డి క్రమంగా చెన్నారెడ్డికి అనుకూలురై అనుచరులుగా మారారు. సరోజినీ పుల్లారెడ్డి 1979 అక్టోబరు 1న సమాచార శాఖా మంత్రి కూడా అయింది. విమర్శలన్నీ పదవులతో సరి.

పంచాయితీ రాజ్య ఎన్నికలు వాయిదా వేసినందుకు వెంగళరావు ప్రభుత్వాన్ని విమర్శించిన ఇందిరాకాంగ్రెస్, చెన్నారెడ్డి, నాయకత్వాన ఏదో ఒక నెపంతో పంచయతీ సంస్థ ఎన్నికను జరపకుండా వాయిదా వేస్తూ, చివరకు 1979 జూన్ లో జరుపుతామన్నారు. చట్టసవరణలను హైకోర్టులో సవాల్ చేసినందున మళ్ళీ ఎన్నికలు వాయిదావేసారు. కోర్టులో రిట్ వలన మళ్లీ కొన్నాళ్ళు వాయిదా పడింది. 1980 వేసవిలో జరపాలని నిర్ణయించారు.

ప్రభుత్వోద్యోగులకు డి.ఎ. పెంచబడింది. వివిధ కార్పొరేషన్లకు, సహకార సంస్థలకు వెంగళరావు మనుషులు అధ్యక్షులుగా, అధిపతులుగా ఉన్నందున క్రొత్త ప్రభుత్వం దృష్ట్యా వారంతా రాజీనామా ఇవ్వాలని కాంగ్రెస్-ఐ పార్టీ ప్రతిపాదన చేసింది. ప్రతిపక్ష నాయకుడికి మంత్రి హోదా ఇవ్వడానికి నిర్ణయించారు. డిప్యూటీ స్పీకర్ స్థానాన్ని జనతాపార్టీ అభ్యర్థి ప్రభాకర్ రెడ్డికి ఇచ్చారు. 18 సంవత్సరాల వయస్సు వారందరికీ పంచాయతీ ఎన్నికలలో ఓటు హక్కు ఇచ్చారు.

డాక్టర్ చెన్నారెడ్డి ఆయన మంత్రులు ఆంధ్రప్రదేశ్ లో పర్యటనలు సాగిస్తూ విపరీతమైన హామీలు ఇచ్చారు. ఉద్యోగస్తుల పట్ల కర్కశంగా మాట్లాడటం చెన్నారెడ్డి ఉపన్యాసాలలో అలవాటు అయిపోయింది. చెన్నారెడ్డి ప్రతీ సభకూ ఆలస్యంగా రావడం ఆనవాయితీగా పెట్టుకున్నాడు. దీనివలన అందరిదృష్టి ఆలస్యంగా వచ్చిన వారిపై ఉంటుందని ఒక అపోహ.  రాజకీయంగా పైరవీల రాజ్యం మొదలైంది. తమ పార్టీ నిమిత్తం డబ్బు వసూళ్లు బాగా జరుగుతున్నాయని వదంతి వ్యాపించింది. ఇట్లా ఉండగా 1978 మార్చి 30న రాజధానిలోని నల్లకుంట పోలీస్ స్టేషన్ లో పోలీసుల దురాగతం వలన శ్రీమతి రమీజాబీని చెరచడం, ఆమె భర్త కొట్టినందువలన అతను చనిపోవడం సంభవించింది. వారిద్దరూ ముస్లింలు ఈ సంఘటన ముందుగా పోలీస్ స్టేషన్ చుట్టుపట్ల ప్రాంతానికి ప్రాకటం, కాల్పుల వరకు పోవటం జరిగింది. ఆ తరువాత నగరమంతా వ్యాపించి వారంరోజులపాటు కర్ఫ్యూ విధించాల్సి వచ్చింది. రాజకీయ పార్టీలన్నీ ఇందులో ప్రవేశించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ప్రారంభించడానికి రగులు కొంటుండగా చెన్నారెడ్డి సంధి చేసుకున్నాడు. హైకోర్టు జడ్జి ముక్తదర్ ను  సంఘటనపై దర్యాప్తుకు కమీషనర్ గా నియమించారు. ప్రతిపక్షాలను చాకచక్యంగా చెన్నారెడ్డి ఆకట్టుకున్నాడని అనుకున్నారు. ఆగస్టు 10న కమీషన్ నివేదికను ప్రభుత్వం ఆమోదించింది. పోలీసు అధికారుల్ని దోషులన్నారు.

30 స్థానాలను మాత్రమే తెచ్చుకోగలిగిన జాతీయ కాంగ్రెస్ ను ఉభయ శాసన సభలలో నాయకుడిగా వెంగళరావును ఎన్నుకున్నారు. కానీ ఆయన శాసనసభా సమావేశాలకు రాలేదు. భాట్టం శ్రీరామమూర్తిని అసెంబ్లీలో నాయకుడిగాను, రోశయ్య కౌన్సిల్ లో నాయకుడిగా పెట్టారు. ఈ పార్టీ పక్షాన ఎన్నికైన ఎం.వి. కృష్ణారావు, కె.వి.కేశవులు, చనుమోలు వెంకటరావు, పిన్నమనేని కోటేశ్వరరావు మొదలైనవారంతా ఇందిరా  కాంగ్రెస్ లో చేరారు. కేశవులు కొన్నాళ్ళకు మళ్ళీ వెంగళరావుతో చేరాడు. శాసన సభలో 30 నుండి 9కు క్రమంగా సంఖ్య పడిపోయింది. 1980 ఫిబ్రవరికి ముగ్గురు మిగిలారు. ఏప్రిల్ లో కాంగ్రెస్ వారు రాష్ట్ర సదస్సు ఏర్పాటు చేసుకున్నారు. వెంగళరావు కాంగ్రెస్ ఓటమికి కారణం చెబుతూ రాష్ట్రంలో పేదవారికి గొర్రెనిచ్చినా, బర్రెనిచ్చినా, గుడిశెనిచ్చినా ఇందిరాగాంధీ పేరిటే డబ్బా కొట్టినందువలనే వారి పార్టీ గెలిచిందన్నాడు. బ్రహ్మానందరెడ్డి రంగంలోకి దిగి చెన్నారెడ్డి మంత్రివర్గానికి 6 నెలలు సమయం ఇస్తున్నామని అప్పట్లోగా ప్రజాసమస్యలను తీర్చకపోతే పెద్ద ఎత్తున ఆందోళన ప్రారంభిస్తామని హెచ్చరించాడు. కానీ అది అరుపుగానే మిగిలింది. ఇట్లాంటి ...జుట్లు ముడివేసే బ్రహ్మానందరెడ్డి సంగతి తనకు బాగా తెలునని... చెన్నారెడ్డి త్రిప్పి కొట్టాడు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న రహమతుల్లా మర్యాదగా చెప్పి రాజీనామా ఇచ్చి వెళ్ళిపోయాడు. 1979 అక్టోబరులో మళ్ళీ వచ్చాడు. ఆ స్థానంలో విజయ భాస్కరరెడ్డిని అధ్యక్షుడిగా

నియమించారు. వెంటనే వెంగళరావు శాసనసభలో తన నాయకత్వానికి రాజీనామా ఇచ్చాడు. విమద్ లాల్ కమీషన్ నివేదిక బయటపడగానే శాసన సభకు కూడా రాజీనామా ఇచ్చి తాత్కాలికంగా రాజకీయాలకు స్వస్తిపలికాడు. అంతకుముందే కాంగ్రెసు సదస్సులోను, బయటకూడా అనేకమందికి హెచ్చరికలు చేస్తూ అడ్ హాక్ కమిటీ నియామకాలు, పెత్తనాలు చేసే పద్ధతి తగదని హెచ్చరించారు. అయినప్పటికీ పార్టీకి పాతవాసనలు వదలలేదు. విమద్ లాల్ సంఘం 1979 జనవరిలో తుది నివేదిక సమర్పిస్తూ వెంగళరావు నిర్దోషి అన్నారు. మళ్ళీ వెంగళరావు రాజకీయాలలో ప్రవేశించాడు. ఆయన ప్రతిష్ఠ పెరిగింది. ఎక్కడికెళ్ళినా ఘనస్వాగతం లభించింది.

ఎన్నికలు జరిగిన 6 నెలల అనంతరం కూడా ఇందిరా కాంగ్రెస్ రాష్ట్ర పార్టీకి అధ్యక్షుణ్ని నిర్ణయించలేకపోయింది. చివరకు అజీజ్ ను నియమించారు. అధికారం మీద ఉన్న దృష్టి పార్టీ నిర్మాణంపై లేకపోయింది. కేంద్ర ప్రభుత్వముతో అనేక సమస్యలపై చెన్నారెడ్డి సంఘర్షణలకు దిగాడు. రాష్ట్ర అనుమతి లేకుండా రాష్ట్రానికి సంబంధించి సి.బి.ఐ. విచారించడానికి వీలులేదన్నాడు. దక్షిణాది ముఖ్య మంత్రులంతా కలిసి కేంద్రంతో తలపడే ప్రయత్నాలు ప్రారంభించారు. షా కమీషన్ నివేదిక ఆధారంగా ఇందిరాగాంధీని అరెస్టు చేస్తే పరిస్థితులు విషమిస్తాయని హెచ్చరించారు. ఇందిరాగాంధీని లోక్ సభ తీర్పుపై అరెస్టు చేస్తే రాష్ట్రంలో ఆందోళన చేసారు. రాజకీయంగా బెదిరింపులతో సాగుతుండగా, సాంఘికంగా తిరోగమనం బాగా ప్రబలి ఉంది. స్వాములు, భజనలు, మత ప్రచారాలు ప్రభుత్వ ప్రోత్సాహంతో సాగాయి. రాజమల్లు, కేశవరావు, జగన్నాథరావు వంటివారు చెన్నారెడ్డికి ఎదురు తిరిగారు.

జనతా పార్టీ 60 స్థానాలు గెలుచుకుని ప్రతిపక్షంలో కూర్చున్నా బలపాటాలేమీ తీర్చుకోలేదు. ముందు నాయకత్వం కోసం పోట్లాట ప్రారంభమయింది. లచ్చన్న, లక్ష్మీకాంతమ్మ, అయ్యపరెడ్డి కలహించు కోగా అంతమందిలోనే ఓటు పెట్టవలసి వచ్చింది. చివరకు లచ్చన్న నాయకుడైనాడు. చెన్నారెడ్డి, లచ్చన్న లోగడ కలిసి ఒకే పార్టీలో పని చేయడం, సంజీవరెడ్డికి వ్యతిరేకంగా ముఠా కట్టడం, రంగా నాయకత్వాన కొన్నాళ్ళు కలిసి ఉండటం, ఇరువురూ లోగడ వేర్పాటు వాదులు కావడం, మొదలైన కారణాల వలన ప్రతిపక్ష నాయకుడిగా లచ్చన్న తన పాత్ర నిర్వహించడంలో విఫలుడైనాడు. 1980 ఎన్నికలకు ముందే ఆ పదవి కూడా పోయింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడుగా ఏ మాత్రం కృషి చేయలేని తెన్నేటి విశ్వనాథం తప్పుకున్నాడు. ఎన్నికలు చూడకుండానే 85వ ఏట చనిపోయాడు. సుబ్బరాజుకు ఆ పదవి లభించింది. ఆయన సంజీవరెడ్డికి అతి సన్నిహితుడు. జనతాపార్టీలో మాజీ జనసంఘ సభ్యులు పార్టీ నడకపట్ల తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు. అదేస్థితి సోషలిస్టులలో కూడా లేకపోలేదు. రాష్ట్రంలో జనతాగాలి ఇప్పట్లో వీచేటట్లు కనిపించడంలేదు. 1979 మార్చి 27న శాసన సభ నాయకత్వ ఎన్నికలో లచ్చన్నపై పోటీ చేసి జైపాల్ రెడ్డి ఓడిపోయాడు. లచ్చన్నకు 31 ఓట్లు, జైపాల్ రెడ్డికి 25 ఓట్లు వచ్చాయి. అంతకు ముందు లచ్చన్నను తొలగించాలంటూ పెట్టిన అవిశ్వాస తీర్మానం కేంద్ర జోక్యం వలన ఆగిపోయింది. రాష్ట్రంలో జనతాపార్టీ ఎన్నికలు జరిగాయి కానీ సక్రమంగా జరపలేదంటూ జనసంఘం వర్గం ఫిర్యాదులు చేయడంతో రాష్ట్ర కార్యవర్గం ఎన్నికలు ఆగాయి. కేంద్ర పార్టీ పరిశీలకుని పంపాలని నిర్ణయించింది.

రాష్ట్రంలో జనతావారు జైపాల్ రెడ్డిని శాసనసభలో నాయకుడిగా ఎన్నుకున్నారు. బాబుల్ రెడ్డి రాష్ట్ర జనతా అధ్యక్షుడుగా నియమితు డయ్యాడు.

లచ్చన్న వర్గం తాత్కాలికంగా ఆంధ్రప్రదేశ్ జనతాపార్టీ వాడుగా వ్యవహరిస్తూ, చివరకు చరణ్ సింగ్ స్థాపించిన లోక్ దళ్ లో చేరాడు. సుబ్బరాజుతో సహా 11 మంది స్వతంత్రులయ్యారు. కె. ప్రభాకర రెడ్డి అలిగి కాంగ్రెస్-ఐలో చేరగా, కె.బి.సిద్ధయ్య ఎం.ఎల్.ఎ. కూడా ఆయన్ను అనుసరించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో లోక్‌దళ్ అధ్యక్షుడుగా లచ్చన్న నియమితుడయ్యాడు. సంజీవ రెడ్డికి సన్నిహితులైన సుబ్బరాజు వర్గం 1980లో సాధారణ ఎన్నికలు రాకముందే కాంగ్రెస్-ఐలో చేరారు. ఇందులో అయ్యపురెడ్డి, దొడ్డపనేని ఇందిర, రాంభూపాల్ రెడ్డి ప్రభృతులు 10 మంది ఉన్నారు. సుందరయ్య రాజీనామా ఇవ్వగా ఏర్పడిన ఖాళీలో ఎం.వి.ఎస్. సుబ్బరాజు డ్రైనేజి బోర్డు అధ్యక్షుడయ్యాడు.

# అవినీతి ఊబిలో చెన్నారెడ్డి పాలన

డా.మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గం సంవత్సరం పాలన పూర్తి అవుతుండగా, ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం పెట్టి, శాసన సభలో విమర్శించాయి. శాసన మండలిలో అవినీతి ఆరోపణలు చేశాయి. అనేక సంఘటనల విషయమై రాష్ట్ర ప్రభుత్వం ముద్దాయిగా సంజాయిషీ చెప్పుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. హెూటళ్ళలో ధరలు పెరగకుండా ఆపజాలక పోవడం, ముఖ్యమంత్రి షష్టిపూర్తి ఉత్సావాలు ఆడంబరంగా జరుపుకోవడం, కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఒక హరిజన శాసన సభ్యుడు మసాల ఈరన్నను గుడి నుండి బయటకు వెడలగొట్టడం, శాసన మండలి సభ్యుడు తోటకూర వెంకటప్పయ్య ఇంటిని కొత్త గూడెంలో కట్టుబానిసత్వపు కాగితాలపై సోదా చేసి గలాభా చేయడం, యిత్యాదులెన్నో వున్నాయి.

మసాల ఈరన్న సంఘటన ఆధారంగా పంచాయతీరాజ్ శాఖామంత్రి ఎం. బాగారెడ్డి రాజీనామా ఇచ్చాడు. కాని కాంగ్రెస్ (ఐ) శాసన సభ్యులలో అధిక సంఖ్యాకులు ఆయన రాజీనామా ఆమోదించవద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాజీనామా విషయం తమాషా అనుకున్నారు. అలాగే అయింది.

ఈలోగా మరొక హరిజన మంత్రి గోకా రామస్వామి రాజీనామా యిస్తూ మార్చి 27న ముఖ్యమంత్రిపై తీవ్ర ఆరోపణలు గావించాడు. ముఖ్యమంత్రి ఆ నెపాలను ఖండించారు.

శ్రీయుతులు మాణిక్ రావు, సుధాకర్ రావు, వీరమాచనేని వెంకట నారాయణ, కె.బి. నరసప్ప, వడ్డె నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, ఎం.వి.ఎస్. ప్రసాదరావును మంత్రివర్గం నుండి డా.చెన్నారెడ్డి తొలగించారు. వారంతా పార్టీలోనే ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలు రెండూ ఐక్యతకై జరిపిన చర్చలు విఫలం అయినందున, రాష్ట్రంలో జాతీయ కాంగ్రెస్ ప్రతిపక్షంగానే నిలచింది. పంచాయతీ ఎన్నికలలో ప్రతిపక్షాలన్నీ ఐక్య సంఘటన ఏర్పరచాలను కున్నారు. తమ ముఖ్యమంత్రి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిని సంప్రదించకుండా కొత్తవారిని చేర్చుకొనరాదని శాసనసభ కాంగ్రెస్ ఐ పార్టీ తీర్మానించింది. డా. చెన్నారెడ్డి వ్యతిరేక వర్గంవారు యిదంతా ఇందిరా వ్యతిరేక నిర్ణయం అన్నారు. సుమారు 50 మంది శాసన సభ్యులు డా.చెన్నారెడ్డికి వ్యతిరేకంగా పార్టీలో పనిచేస్తున్నారు. పరిపాలన సాఫీగా సాగకుండా వున్నది. పార్టీలోకూడా ప్రజాస్వామ్య పద్ధతులు లేకుండా తాత్కాలిక సంఘం నెట్టుకొస్తున్నది.

వందేమాతరం రామచంద్రరావుకు అధికార భాషా సంఘాధ్యక్ష పదవి, పవిత్రన్ ను నగరంలో పోలీస్ కమీషనర్ గా నియమించడం, కౌన్సిల్ లో కాంగ్రెస్ నాయకుడు కె. రోశయ్యను అహ్వానించి కాంగ్రెస్-ఐలో చేర్చుకుని మంత్రి పదవి యివ్వడం, సి.పి.ఎం. నాయకుడు సుందరయ్యకు డ్రైనేజి బోర్డు అధ్యక్ష పదవి, ప్రతిపక్ష నాయకుడికి మంత్రి హెూదా, డెప్యూటీ స్పీకర్ ను ప్రతిపక్షాలకు యివ్వడం, తరువాత ఆయన్ను కాంగ్రెస్ లో చేర్చుకోవడం విమర్శకు తావిచ్చింది.

ఆఫీసు వేళలు రెండు పర్యాయాలు మార్చడం, బస్సు రూట్లు ప్రైవేటు వారికి కూడా యివ్వడం విజయవాడలో నగరాభివృద్ధి సంస్థ అధ్యక్షుడుగా రామయ్య చౌదరి, జె.ఎన్.టి.యు.కి వైస్ ఛాన్సలర్ గా షణ్ముగరావు నియామకం విజయదశమినాడు రోశయ్య, సరోజిని, శ్రీరాములు నాయుడు మంత్రుల నియామకం, అక్టోబర్ 6న శాఖల మార్పు, ఈనాడుకు ప్రకటనల నిలుపుదల, అధికారులపై దండయాత్ర 3 అంచెల వైద్యవిధానం, అభ్యుదయ ప్రాథమిక విద్య పేరిట సాయిబాబా శిక్షణ, కొందరు స్త్రీలకు అధిక ప్రాధాన్యత కాంగ్రెస్ అధ్యక్షుడు విజయభాస్కరరెడ్డిని కాంగ్రెస్ (ఐ)లోచేర్చుకోవడం, నగరంలో పాదయాత్రలు, తోటకూర వెంకటప్పయ్యను కాంగ్రెస్ (ఐ)లో చేర్చడం, గోదావరి పుష్కరాలు, స్వాముల విజృంభణ, భార్గవా కమీషన్ విచారణ నిలుపుదల, సిబిఐ విచారణకు అవకాశాలు లేకుండా చేయడం హాస్టళ్ళలో విద్యార్థులను రెచ్చగొట్టడం, కల్లోలిత ప్రాంతాలుగా సిరిసిల్ల, జగిత్యాలను ప్రకటించడం, ముఖ్యమంత్రి ప్రధాన పోషకుడుగా చైతన్య సంస్థకు ఇంజనీరింగ్ కళాశాల, వాకాడులో ఇంజనీరింగ్ కళాశాల, యివన్నీ ప్రభుత్వానికి ప్రమాణాలు, గీటురాళ్ళు, జలగం కృషి వలన 4 పార్టీల ఐక్యత నారవ రెడ్డి, రఘునాథరెడ్డి, తటస్థం.

1980 జనవరి 6న లోక్ సభ ఎన్నికలు జరిగాయి. మళ్ళీ ఇందిరా గాంధీ ప్రధాని అయింది. ఆంధ్రప్రదేశ్ తన ఆనవాయితీ నిలబెట్టుకుంటూ, 42 లోక్ సభ స్థానాలలో 41 కాంగ్రెస్ (ఐ)ను గెలిపించింది. ఒకే ఒకస్థానం పార్వతీపురం రిజర్వుడు నియోజకవర్గంలో కేంద్ర మంత్రిగావున్న కిశోర్ చంద్రదేవ్ గెలిచారు. ఆయన కాంగ్రెస్ (యు) అభ్యర్థి

ఎన్నికలలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న వెంగళరావు ప్రయత్నం వలన ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, లోక్ దళ్ కాంగ్రెస్ (యు)లు ఐక్య సంఘటనగా ఏర్పడి సీట్ల సర్దుబాటు చేసుకున్నప్పటికీ, ఇందిరగాలికి నిలవలేక పోయాయి. అలాగే ఏకాకిగా పోటీచేసిన జనతాపార్టీని కూడా ఇందిర మెదక్ నుంచి పోటీ చేసి జనతా అభ్యర్థి జయపాల్ రెడ్డిని ఓడించింది. ఆమెకు ఎన్నికల ఏజంట్‌గా పనిచేసే నిమిత్తం పంచాయతీరాజ్ మంత్రి ఎం.బాగారెడ్డి తాత్కాలికంగా రాజీనామా ఇచ్చి, ఎన్నిక అయిన తరువాత మళ్ళీ చేరాడు.

ఎన్నికలలో కాంగ్రెస్ (ఐ) వారిలో చాలామంది మంత్రులు, శాసన సభ్యులు తదితరులు యధాశక్తి వ్యతిరేకంగా పనిచేసారు. వారందరిపై వచ్చిన ఫిర్యాదులను కేంద్ర పార్టీకి క్రమశిక్షణ చర్య నిమిత్తం పంపారు.

ఎన్నికలు సమీపిస్తుండగా అంతవరకూ కాంగ్రెస్‌లో వుంటూ, చరణ్ సింగ్ మంత్రివర్గ సభ్యులుగా ఉన్న బ్రహ్మానందరెడ్డి, పాములపాటి అంకినీడు ప్రసాదరావు రాజీనామా యిచ్చి కాంగ్రెస్-ఐలో చేరడమేగాక, సీట్లు సంపాదించి గెలిచారు కూడా. లోగడ లోక్ సభ సభ్యులుగా వున్న తమ పార్టీ అభ్యర్థులు 28 మందికి మళ్ళీ కాంగ్రెస్ (ఐ) టిక్కెట్లు యిచ్చింది. కొత్తవారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం, తద్వారా నాలుగు లక్షల రూపాయలు కాంగ్రెస్ (ఐ) కార్యాలయానికి డబ్బురావడం జరిగినా, అదంతా ఫార్స్ గానే మిగిలింది.

కాంగ్రెస్ (యు) నుంచి పురుషోత్తం రెడ్డి కూడా చివరి నిమిషంలో కాంగ్రెసు(ఐ)లో చేరాడు. గుంటూరు జిల్లాలో అవుదారు వెంకటేశ్వర్లు (ఎం.ఎల్.ఎ.) లోక్ దళ్ నుండి కాంగ్రెసు (ఐ)లో ప్రవేశించాడు. మాజీ మంత్రి మహేంద్రనాథ్ కాంగ్రెస్ (ఐ) నుండి జనతాలో ప్రవేశించగా, తెనాలిలో నన్నపనేని వెంకటరావు కూడా కాంగ్రెస్ (ఐ) నుండి లోక్‌దళ్‌కు పోయాడు. ఎన్నికల అనంతరం చనిపోయాడు. లక్ష్మీకాంతమ్మ జనతా నుంచి కాంగ్రెస్ ఐలో చేరింది. ఎన్నికల అనంతరం ఎం.ఆర్.కృష్ణా కూడా జనతాను వీడి కాంగ్రెస్ (ఐ)లో ప్రవేశించాడు. పదవులలో లేని అనేక మంది మాజీ శాసనసభ్యులు, సమితి, పరిషత్ మాజీ అధ్యక్షులు యింకా కొందరు ప్రముఖులు కాంగ్రెస్ (ఐ)లో ప్రవేశించారు. కాంగ్రెస్ (యు)లో ప్రముఖంగా వుంటూ వచ్చిన రఘునాథ రెడ్డి, నారపరెడ్డి పార్టీకి దూరమై, ఐక్య సంఘటన పేరిట విఫల ప్రయత్నాలు చేశారు. కౌన్సిల్‌లో ప్రతిపక్ష నాయకుడైన టి.పాంచజన్యం, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడుగా లోగడ ఉన్న తాడేపల్లి ముసలయ్య కాంగ్రెస్ (ఐ)లో చేరారు. కౌన్సిల్‌లో ప్రధాన ప్రతిపక్షం లేకుండా పోయింది.

ఎన్నికల అనంతరం లోక్ దళ్, కాంగ్రెస్ (యు) నుంచి కొందరు శాసన సభ్యులు కాంగ్రెస్ (ఐ)లో చేరారు. 165 సభ్యులతో ప్రారంభమైన కాంగ్రెస్ (ఐ) శాసన సభలో 240 అయింది.

కాంగ్రెస్ (ఐ)లో అసమ్మతి వర్గ నాయకుడు కె. రాజమల్లు లోక్ సభకు ఎన్నిక కావడంతో డా.చెన్నారెడ్డి నాయకత్వంపై మరికొందరు ధ్వజమెత్తారు. నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి యిందుకు సారధ్యం వహించారు.

శాసన సభ రేపు ప్రారంభమౌతుందనగా డా.చెన్నారెడ్డి హఠాత్తుగా మంత్రి నాదెండ్ల భాస్కరరావు శాఖలు ఎక్సైజ్, వాణిజ్యపన్నులు తొలగించి, పురావస్తు శాఖ, తూనికలు కొలతలు యిచ్చాడు. డా.చెన్నారెడ్డి రాష్ట్రం నుంచి తొలగిపోతారనుకొని ముఖ్యమంత్రి పదవికి భాస్కరరావు ప్రయత్నించిన ఫలితంగా యీ చర్య గైకొనడానికి మూలకారణం అనుకున్నారు. స్టేట్ మంత్రిగా ప్రారంభమైన భాస్కరరావుకు తరువాత కాబినెట్ హోదా యివ్వడం, పిమ్మట అతిముఖ్యమైన ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖలు యివ్వడం, 1980 ఎన్నికలలో రాష్ట్రమంతటికీ ప్రచార శాఖాధిపతిని చేయడం, అనంతరం మళ్ళీ తగ్గించి వేయడం రెండేళ్ళలో జరిగింది. 'బల్బు, బర్రె, బస్సు' నినాదంతో డా.చెన్నారెడ్డి కొత్త పథకాలు ప్రారంభించాడు. 1952లో కమ్యూనిస్టులు అయిదెకరాలు, ఆవుదూడ అందరికీ యిస్తామన్నట్లు 1980 ఎన్నికల ముందు డా.చెన్నారెడ్డి కూడా ప్రతి వూరికీ బస్సు, ఇంటింటిలో బల్బు, పేదవాడికి పాడి బర్రె యిస్తామన్నాడు. చెదురు మదురుగా అమలు జరిగినా ఆట్టే ఆకర్షించని పథకాలే యివన్నీ.

ఎన్నికల ముందు రాష్ట్రంలో డాక్టర్లు (సివిల్ అసిస్టెంట్లు, జూనియర్ డాక్టర్లు) సమ్మె ప్రారంభించి 79 రోజులు సమ్మెచేసి ప్రపంచ రికార్డు సృష్టించారు. హైదరాబాదులో హిందూ ముస్లిం మత కలహాలు జరిగి, 15 రోజుల కర్ఫ్యూలో పాతబస్తీ ప్రజలు నివశించారు. మజ్లిస్, జనత కార్యకర్తలను, ప్రముఖులను ఎన్నికల అనంతరం అదుపులో పెడితే కాని అల్లర్లు సద్దుమణగలేదు. అంతవరకు ఇత్తెహాద్ ముస్లిం మజ్లీస్‌తో కాంగ్రెస్ (ఐ) చేతులు కలిపి, తమ పొత్తు శాశ్వతమని ప్రకటించారు. ఎన్నికలలో ఒడంబడిక కుదరక చీలిపోయారు. ఫలితంగా ప్రజలు నలిగిచచ్చారు.

రాష్ట్రం నుంచి లోక్‌సభకు ఎన్నికైనవారిలో పి.వి.నరసింహారావు విదేశాంగ శాఖ మంత్రిగానూ, శివశంకర్ న్యాయశాఖామంత్రిగానూ, పెండేకంటి వెంకటసుబ్బయ్య హోమ్ శాఖ స్టేటు మంత్రిగానూ పదవులు పొందారు.

దేశం మొత్తం మీద ఒకే ఒక కాంగ్రెస్(ఐ) అధికార రాష్ట్రంగా వుంటున్న ఆంధ్ర ప్రదేశ్ కు, ముఖ్యమంత్రి డా.చెన్నారెడ్డి అంతవరకు వున్న కీలక ప్రాధాన్యత, 1980 ఎన్నికలతో ఒక్కసారిగా పడిపోయింది.

10 సంవత్సరాలుగా వాయిదా పడుతూ వచ్చిన పంచాయతీ, మునిసిపాలిటీ ఎన్నికలు పెట్టాలని డా.చెన్నారెడ్డి ప్రభుత్వం నిర్ణయించి, ఏప్రిల్, మే మాసాలలో తేదీలు కూడా ప్రకటించింది. చాలామందిలో ఆశలు చిగురించాయి. 18 సంవత్సరాల వయస్సుగల వారికి ఓటు హక్కు యివ్వడమేగాక, 14శాతం హరిజనులకు పంచాయతీరాజ్ సంస్థలలో రిజర్వేషన్లు కేటాయించడం డా.చెన్నారెడ్డి ప్రభుత్వ నిర్ణయమే.

సాంకేతిక విద్యలో రాష్ట్రం వెనుకబడి వున్నందున ప్రైవేట్ యాజమాన్యాలు విరాళాలు, నిధులు సేకరించడానికి వీలుగా కొన్ని ఇంజనీరింగ్ కళాశాలలకు ప్రభుత్వం అనుమతించింది. విద్యార్థులు తాత్కాలికంగా ఆందోళన చేసి విరమించారు.

1980 జులైలో కాంగ్రెస్ ఐ పార్టీ శాసన సభా సభ్యులు అత్యధిక సంఖ్యలో డా.చెన్నారెడ్డికి వ్యతిరేకతను ప్రకటించాయి. కేంద్రం నుంచి పి.వి.నరసింహారావు వచ్చి ప్రధాని ఇందిరాగాంధీ మాటగా చెప్పి ఆంధ్ర నుంచి పరకాల శేషావతారాన్ని, తెలంగాణా నుంచి జి.రాజారాంను మంత్రుల రాజీనామాలు సేకరించమన్నారు. 18 మంది మంత్రులు రాజీనామాలు యిచ్చారు. కాని పద్మనాభరాజు తన రాజీనామాను వుపసంహరించు కున్నారు. మిగిలిన వారి రాజీనామాలను ఇందిరాగాంధీకి సమర్పించారు. జులైలో ప్రారంభమైన యీ ప్రహసనం మూడు మాసాలపాటు నడచింది. రాష్ట్రంలో పరస్పర ఆరోపణలు విపరీతంగా చేసుకున్నారు. ముఖ్యమంత్రిపైన, అతని సన్నిహితులపైనా అసమ్మతి వర్గంవారు ఆరోపణలు కేంద్రానికి అందజేసారు. వాటిపై విచారణ జరగలేదు. ఢిల్లీ చుట్టూ వుభయవర్గాలవారు విపరీతంగా ప్రదక్షిణలు చేసి అధికార కుమ్ములాట కొనసాగించారు. ఒక సందర్భంలో రాజీనామా యివ్వబోయి ప్రధాని సలహాపై ఆగిన డా.చెన్నారెడ్డి కనిపించిన రాయికల్లా మొక్కాడు. కళ్లు తెరచి యిన్నాళ్లూ ఖాళీగా వున్న అనేక పదవులను భర్తీ చేశాడు. రేపు రాజీనామా చేస్తాడనగా ఆయన కూడా ఆర్డర్లు వేస్తూనే పోయాడు. చివరకు అక్టోబరు పదితో యీ రాజకీయ నాటకం ముగిసింది. అంతవరకూ డా.చెన్నారెడ్డి చుట్టూ భజన చేసిన వారు ఎవరి దారి వారు చూసుకోవడం మొదలు పెట్టారు. ఎన్ని పూజలు చేసినా, ఎన్ని వ్రతాలు జరిపినా, క్షుద్ర దేవతల నుంచి వెంకటేశ్వరుడి వరకూ మొక్కినా డా. చెన్నారెడ్డి పదవి నుంచి తప్పుకోవటం ఆగలేదు. ప్రధాని ఇందిరాగాంధీ ఆగ్రహానికి గురైన తరవాత మిగిలినవన్నీ నామమాత్రమే అని చెప్పుకోవాలి. అంతకు ముందు సంజయ్ గాంధీ ఆగ్రహానికి గురైన డా.చెన్నారెడ్డి, విమాన ప్రమాదంలో సంజయ్ గాంధీ మరణించినప్పుడు అసెంబ్లీ సమావేశాలు కూడా రద్దుగావించి తన భక్తిని చూపాడు. కాని అది కేవలం తాత్కాలికమే అయింది. అసమ్మతి వర్గంవారు ఎందరు ఆందోళన చేసినా, ఎంత సంఖ్యాబలం చూపినా, ప్రధాని ఇందిరాగాంధీ మాత్రం ప్రజాస్వామ్య ధోరణిలో పోలేదు. పార్టీని సమావేశ పరచలేదు. బలా బలాలు తేల్చుకోమన లేదు. కొత్త నాయకుని ఎన్నుకొనే స్వేచ్ఛను ఇవ్వలేదు. అయితే దీనికి తగ్గట్లే అసమ్మతి వర్గం వారంతా తమ హక్కును ఇందిరాగాంధీకి ధారాదత్తం చేశారు. ఆమె ఎవరి పేరు చెప్పినా ఆమోదిస్తామన్నారు. చివరకు డా.చెన్నారెడ్డి పేరు చెప్పినా ఒప్పుకుంటామని రాజారాం ఒక అపహాస్యపు ప్రకటన చేసారు. ఈలోగా డా.చెన్నారెడ్డికి సన్నిహితులుగా మెలగిన కొందరు మంత్రులకు, ముఖ్యంగా శాసన సభ్యులకు బాగా గిట్టుబాటయింది. అటువంటివారు చెన్నారెడ్డి పాలనలో చేసిన ఘనకార్యాలు వల్లించడం, ఆయనపై వచ్చే విమర్శలకు సమాధానాలు చెప్పటం సందడిగా తయారయింది.

డా.చెన్నారెడ్డి తొలగిపోవడం ఖాయమని అనుకున్న తరువాత సెప్టెంబరు చివరి వారంలో శాసనసభ సమావేశాలు జరిగాయి. ఆరునెలల లోపుగా సమావేశాలు జరగటం రాజ్యాంగ పరంగా అవసరం గనుక వీటిని ఏర్పరచారు. సమావేశాలలో ప్రతి పక్షాలవారు అ విశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా అసమ్మతి వర్గం వారితో సహా అందరూ కాంగ్రెస్ ..ఐ...వారు దానిని త్రోసి పుచ్చారు. అంటే శాసనసభ డా.చెన్నారెడ్డి నాయకత్వంలో విశ్వాసాన్ని ప్రకటించిందన్నమాట. అది జరిగిన వారం రోజులకే ముఖ్యమంత్రిగా డా. చెన్నారెడ్డి రాజీనామా యివ్వవలసి వచ్చింది. శాసనసభ సమావేశాలకు ముందు లాంఛనప్రాయంగా మంత్రివర్గ సమావేశాన్ని పిలువగా అసమ్మతి వర్గ మంత్రులు 15 మందీ హాజరు కాకుండా పెద్ద సంచలనాన్ని కలిగించారు. కాని హైకమాండ్ ఆదేశానుసారం హడావిడిగా అదే రోజు మళ్ళీ మంత్రివర్గం సమావేశంలో అందరూ హాజరు వేసుకున్నారు. కాంగ్రెస్ ..ఐ... కృత్రిమ రాజకీయాలకూ,

లాంఛన సంప్రదాయాలకూ, యిది పరాకాష్ఠ అనవచ్చు. మొత్తం మీద పూర్తి మెజారిటీ వున్న కాంగ్రెస్ ...ఐ... పార్టీ అంతర్గత వైషమ్యాల వలన నగుబాట్ల పాలయింది.

---------

## ముఖ్యమంత్రి – డా. ఎమ్. చెన్నారెడ్డి

మార్చి 6, 1978 నుండి 1980

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | డా. ఎమ్. చెన్నారెడ్డి | కార్యనిర్వాహక, భూ స్కరణలు, పరిశ్రమలు, సమాచార, పన్నులు, న్యాయ మరియు ఆర్డర్. |
| 2. | ఎస్. అమరనాథ్ రెడ్డి | కో-ఆపరేషన్ |
| 3. | ఎమ్. బాగా రెడ్డి | పంచాయత్ రాజ్ |
| 4. | పి. వి. చౌదరి* | వస్త్రపరిశ్రమ |
| 5. | సి. దాస్ | చక్కెర పరిశ్రమ |
| 6. | ఎమ్. ఎమ్. హాసీమ్* | గృహ నిర్మాణ శాఖ |
| 7. | టి. హయగ్రీవాచారి | వ్యాపార మరియు వృత్తి విద్య |
| 8. | పి. గంగా రెడ్డి | వ్యవసాయ శాఖ |
| 9. | ఎస్. జనార్దన రెడ్డి | భూమి పన్ను |
| 10. | ఎ. మదన్ మోహన్ | వైద్య, ఆరోగ్య శాఖ |
| 11. | ఎమ్. మాణిక్య రావు | హైవేస్, ఆర్ అండ్ బి |
| 12. | వి. నాగేశ్వరరావు* | జంతు సంరక్షణ శాఖ |
| 13. | కె. బి. నరసప్ప | చిన్న తరహా పరిశ్రమలు |
| 14. | కె. ఒబుల్ రెడ్డి | మధ్య తరహా నీటి పారుదల శాఖ |
| 15. | జి. రాజారాం | ఆర్థిక, విద్యుత్ |
| 16. | బి. రాందేవ్ | మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ |
| 17. | శ్రీమతి రోడా మిస్త్రీ | పర్యాటక, ప్రజా గ్రంథాలయాలు |
| 18. | జి. వి. సుధాకర రావు | భారీ నీటిపారుదల శాఖ, వాణిజ్య పన్నులు |
| 19. | వి. వెంకట నారాయణ | దేవాదాయ శాఖ |
| 20. | బి. వెంకట రామ్ రెడ్డి | విద్యాశాఖ |
| 21. | వై. వెంకట రావు | ప్రణాళికలు, న్యాయ, న్యాయస్థానాలు |
| 22. | జి. వెంకట స్వామి | కార్మిక, ఉపాధికల్పనా శాఖ |
| 23. | అహ్మద్ షరీఫ్ | అటవి శాఖ |
| 24. | ఎస్. భాస్కర రావు | లెజిస్లేటివ్ కార్యకలాపాలు |
| 25. | నిజామ్ వాలి | వక్ఫ్, చిన్న తరహా పొదుపు |
| 26. | కె.వి.ఆర్. పద్మనాభ రాజు | గిరిజన సంక్షేమ శాఖ |

| | | |
|---|---|---|
| 27. | ఎస్.వి. ప్రసాద్ | మార్కెటింగ్ |
| 28. | జి. రామస్వామి | పౌరసరఫరాలు |
| 29. | కె. రంగారావు | హరిజన సంక్షేమ శాఖ |
| 30. | పి. శేషావతారం | రూరల్ డెవలప్ మెంట్ |
| 31. | జె. వెంగళ రావు | రవాణా శాఖ |
| 32. | ఎ. వీరప్ప | మత్స్య శాఖ |
| 33. | ఎస్. వెంకట రెడ్డి | గనులు |

---------

# ఎయిర్ బస్ మంత్రి మండలితో కదలలేని అంజయ్య

ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ రాష్ట్రంలో కాంగ్రెస్ ఐ నాయకుడుగా, ముఖ్యమంత్రిగా టి. అంజయ్యను నిర్ణయించి పంపించారు. ఆయన అక్టోబరు 11న ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు రెండు మాసాల నుంచీ తను ముఖ్యమంత్రి నవుతానని కొందరు సన్నిహితు లతో అంజయ్య చెపుతున్నా చాలామంది నమ్మలేదు. కేంద్రంలో మంత్రులుగా వున్న పి.వి. నరసింహారావు, శివశంకర్, పెండే కంటి వెంకట సుబ్బయ్య ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వుందని వారు చేసిన ప్రయత్నాల వలన కొందరు భావించారు. రాష్ట్ర మంత్రివర్గంలో మరికొందరు అటువంటి ప్రయత్నమే చేసారు. చివరికి యీ భారం అంజయ్యపై పడింది.



అంజయ్య అప్పటికే కేంద్రంలో కార్మిక మంత్రిగా వున్నారు. 1957 నుంచీ రాజకీయాలలో ముఖ్యంగా కార్మిక రంగంలో వుంటూ 1969లో జరిగిన ప్రత్యేక తెలంగాణా ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. బ్రహ్మానందరెడ్డిని ముఖ్యమంత్రిగా తప్పించిననాడు ఆ పదవికి రావాలని అంజయ్య ఆశించాడు. నూకల రామచంద్రారెడ్డి కె.చొక్కారావు, వి.పురుషోత్తమ రెడ్డి ఆనాడు (1971) అంజయ్య నాయకత్వాన ఢిల్లీ రాయబారం వెళ్ళి శ్రీమతి ఇందిరాగాంధీని కలిశారు. కాని అప్పటికే ఆమె శ్రీ పి.వి.నరసింహారావును నిర్ణయించడంతో అంజయ్యతిరిగి వచ్చి రాష్ట్రంలో కార్మిక మంత్రిగా కుదురు కున్నాడు. తరువాత వెంగళరావు మంత్రివర్గంలో కార్మిక మంత్రిగానే కొనసాగారు. అత్యయిక పరిస్థితి అనంతరం ఎన్నికలకు ముందు కాంగ్రెసు పార్టీ చీలిపోయినప్పుడు అంజయ్య తన విశ్వాసాన్ని శ్రీమతి ఇందిరా గాంధీ పట్ల ప్రకటించారు. 1978 శాసనసభ ఎన్నికలలో అంజయ్య ఓడిపోయి నప్పటికీ తరువాత ఆయనను రాజ్యసభకు శ్రీమతి ఇందిరాగాంధీ నిర్ణయించారు. 1980లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ ఐ పక్షాన బీహారు రాష్ట్ర పరిశీలకుడుగా అంజయ్య నిర్వహించిన పాత్రవల్ల అతడు బీహారు కాంగ్రెసు నాయకులకేగాక సంజయ్ గాంధీకి, శ్రీమతి ఇందిరా గాంధీకి మరింత సన్నిహితుడయ్యాడు. విశ్వాసపాత్రంగా వుండటమే ప్రధాన లక్షణంగా భావించిన శ్రీమతి ఇందిరాగాంధీ ముఖ్యమంత్రిగా అంజయ్యను నిర్ణయించారు. అతడు పదవిని చేపట్టిన అనంతరం మళ్ళీ కాంగ్రెసుపార్టీ కథ మొదటికి వచ్చింది. మంత్రులను వేసుకోవడానికి ఢిల్లీ వెళ్ళి అనుమతి తెచ్చుకోవలసి వచ్చింది. అసమ్మతి వర్గంగా చెలామణీ అయిన 15 మంది మంత్రులూ, వారితో చేరిన స్పీకరు, డెప్యూటీ స్పీకరూ మంత్రులయ్యారు. రాష్ట్రపతి సంజీవరెడ్డి అల్లుడు రాంభూపాల్ రెడ్డి తొలిసారి మంత్రి గావటమేగాక అతి ప్రధానమైన రెవెన్యూ శాఖలను కూడా పొందాడు. మంత్రివర్గాన్ని విస్తరిస్తానని, ప్రమాణస్వీకారపు తేదీలు చెప్పిన ముఖ్యమంత్రి అంజయ్య మాట దక్కించుకోలేకపోయాడు. రెండవ పర్యాయం ఢిల్లీ వెళ్ళి

వట్టి చేతులతో తిరిగి వచ్చాడు. (అక్టోబర్ 27) ఢిల్లీ మయసభ రాజకీయాలు అంత తొందరగా అంతుబట్టవు. ముఖ్యమంత్రి జుట్టు కేంద్రం చేతుల్లో వుంటుంది. స్వేచ్ఛ అనేది కేవలం పైకి కనిపించే ఎండ మావి మాత్రమే. ఆలస్యం అయేకొద్దీ మంత్రిపదవులు ఆశించే వారి సంఖ్య పెరిగి పోయింది. వత్తిడులెక్కువయ్యాయి. డా.చెన్నారెడ్డి సన్నిహితులనుకునే వారంతా అంజయ్య ఆప్తులుగా నటించసాగారు. కేంద్ర మంత్రి శివశంకర్ ప్రభావం ముఖ్యమంత్రి అంజయ్యపై చాలా వున్నదని భావించిన కారణంగా కొన్నాళ్ళు శివశంకర్ యింటికి కాంగ్రెసు వారు తీర్థయాత్ర చేశారు. అది వట్టిదే అని తేలిన తరువాత పి. వి. నరసింహారావు గృహానికి కైంకర్యం చేశారు. అయినా కీలకం ఎక్కడవున్నదో చాలామందికి అంతుపట్టలేదు. ఇది అధికార పార్టీ కేంద్రీకృత రాజకీయం.

అంజయ్య తొలిమంత్రిమండలిలో 65 మంది ఉన్నారు. ఇది ఎయిర్ బస్ మంత్రివర్గం అని చిత్రించారు. దేశ వ్యాప్తంగా యిది అందరి విమర్శలకు, నగుబాట్లకు గురైంది. నెలరోజులకే మళ్ళీ మంత్రిమండలిలో కొందరిని తొలగించక తప్పిందికాదు. తొలగించినవారిలో కొందరికి వేరే పదవులు లభించాయి.

1980 అక్టోబరు 14న అంజయ్య ఒక్కడే. లోగడ చెన్నారెడ్డి వలె ప్రమాణ స్వీకారం చేశాడు. తరువాత కొన్నాళ్ళు వూరించిన అనంతరం, ఢిల్లీ ప్రదక్షిణలు పూర్తి చేసుకుని, డబ్బు బాగా నలిగిన తరువాత డిసెంబరు 2న హఠాత్తుగా ప్రమాణ స్వీకారం ఏర్పరిచారు. చివరి నిముషం వరకు కొందరు మంత్రులకే తమ ప్రమాణ స్వీకారం గురించి తెలియదు. మొత్తం 65 మంది అయ్యేసరికి, దీన్ని ఎయిర్ బస్ మంత్రి మండలి అన్నారు. తీవ్ర విమర్శల అనంతరం ఫిబ్రవరి 9న 1981, 15 మంది మంత్రులను తొలగించారు. తొలగించిన వారి పేర్లు – రుద్రరాజు రామలింగరాజు, ప్రకాశరావు, జి.వేదాంతరావు, ఎడ్లపాటి వెంకటరావు, కాసు కృష్ణారెడ్డి, నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి, రుక్మిణమ్మ, లక్ష్మీకాంతమ్మ, పాపయ్య, అహమ్మద్ షరీఫ్, రాంభూపాల్ రెడ్డి, ఎం. శ్రీనివాసరావు, హెచ్.నరసప్ప.

అందరి వద్దా రాజీనామాలు తీసుకొని, తొలగించినవారు గాక మిగిలిన వారు మళ్ళీ ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రతిపక్ష నాయకులైన లచ్చన్న, జయపాల్ రెడ్డికి కూడా మంత్రిపదవులు తదితర పదవులు యిస్తానని అంజయ్య అనగా, వారు అపహాస్యం చేస్తూ నిరాకరించారు.

ఆ తరువాత తొలగించిన మంత్రులలో కొందరికి వివిధ పదవులను అంజయ్య కట్టబెట్టి, వారిని శాంతింప జేశాడు. రుద్రరాజు రామలింగరాజుకు సహకార బాంక్ అధ్యక్షపదవి, ప్రకాశరావుకు గిరిజన కార్పొరేషన్ అధ్యక్షస్థానం, యడ్లపాటి వెంకటరావుకు పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్ అధ్యక్షపదవి, నల్లపురెడ్డి శ్రీనివాసు రెడ్డికి రోడ్డు రవాణా సంస్థ అధ్యక్షత, రుక్మిణమ్మకు పిల్లల సంక్షేమ బోర్డు అధ్యక్షత, లక్ష్మీకాంతమ్మకు వినిమయదారుల ఫెడరేషన్ అధ్యక్షస్థానం, ఎం. శ్రీనివాసరావుకు కార్పొరేషన్ అధ్యక్షత కట్టబెట్టారు.

రాజ్య సభకు రాజీనామా చేసిన అంజయ్య, మెదక్ జిల్లా రామాయంపేట నుంచి ముత్యం రెడ్డి స్థానంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అందరితో సహా బి.జె.పి. అభ్యర్థి కూడా ఉపసంహరించుకోవడానికి కొందరు మంత్రులు ఎంతో కృషి చేశారు. బి.జె.పి. వారికి క్షమాపణ చెప్పకోవడానికి సైతం ముఖం చెల్లనంత అవమానం జరిగింది. తనకోసం రాజీనామా చేసిన ముత్యంరెడ్డికి గనుల కార్పొరేషన్ అధ్యక్ష పదవి యిచ్చి అంజయ్య ఋణం తీర్చుకున్నారు. ఇంకా కొందరు కాంగ్రెస్ శాసన సభ్యులకు తదితరులకు పదవులు యిచ్చాడు. ఇంకొన్ని ఇస్తామని ఆశచూపుతూ మరికొందరిని తిప్పకున్నాడు.

అంజయ్య హయాంలో పేర్కొనదగిన అంశం పంచాయతీ వ్యవస్థకు, సహకార సంఘాలకు ఎన్నికలు జరపడం, పార్టీరహితంగా జరిపిన యీ ఎన్నికలలో గెలిచిన వారంతా మా వాళ్లేనని అంజయ్య గొప్పలు చెప్పాడు. విజయవాడ, వైజాగ్ లను కార్పొరేషన్లుగా మార్చి, పార్టీల పేరిట ఎన్నికలు జరిపేసరికి రెండుచోట్లా కాంగ్రెస్ (ఐ) ఓడిపోయింది. తల తిరిగిపోయిన కాంగ్రెస్ (ఐ) వారిని, స్థానిక సంస్థ నుంచి అసెంబ్లీకి జరగాల్సిన ఎన్నికలు ఆపేయమని అధిష్ఠానం ఆదేశించింది. ఇంతలో కాంగ్రెస్ ..ఐ..లో అసమ్మతి వర్గం బయలుదేరింది. ఢిల్లీ నుంచి కొందరి మద్దత్తు లభించింది. పంచాయతీ ఎన్నికలు జరగబోతుండగా పైకి కారణం చెప్పకుండానే, మంత్రి నాదెండ్ల భాస్కరరావును అంజయ్య తొలగించారు. తరువాత కె. కేశవరావును మంత్రిగా స్వీకరించారు. కేశవరావు కాంగ్రెస్ ...ఐ... శాసనసభా సమావేశంలో

అంజయ్యతో పోట్లాడి, చేతులు కలిసే వరకూ పోయాడు. ఆ తరువాత నెలకే మంత్రి కాగలిగాడు. (జూలై 27, 1981) ఒక నెల రోజుల తరువాత ఆగస్టు 20న చనుమోలు వెంకటరావు, నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి మంత్రులయ్యారు. నెల్లూరు జిల్లాలో జనార్ధన రెడ్డికి పోటీగా శ్రీనివాసులు రెడ్డికి పదవి యిచ్చాడనుకున్నారు. స్టేట్ హోదాగల మంత్రులలో ఐదుగురికే కేబినెట్ హోదా యిచ్చారు. ఇది చూచి యువ మంత్రులు అలిగారు. రాజశేఖర్ రెడ్డి రాజీనామా యిస్తే, ఆయనచే బలవంతంగా మాన్పించి, ఏమీ జరగలేదన్నారు.

రాష్ట్ర వ్యవహారాలు నానాటికే అధ్వాన్నమౌతున్నట్లు భావించిన కేంద్రం, స్పీకర్ గా వున్న కోన ప్రభాకర రావును రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించింది. ప్రధాని స్వయంగా యీ పనిచేయడంలో, కోన ప్రభాకరరావుకు బలం చేకూరింది. స్పీకర్‌గా రాజీనామా చేశాడు. అంజయ్యకు గాలి తీసేసినట్లయింది. లోగడ అజీజ్ వలె కోన ప్రభాకర రావు ముఖ్యమంత్రికి కీలుబొమ్మగా వుండబోడన్నారు. యువ కాంగ్రెస్ వారు మరికొందరు కాంగ్రెస్ అధ్యక్షుడి పట్ల మొగ్గు చూపారు. అంతఃకలహం పైకి కనబడింది. రాష్ట్రంలో పరిపాలన అధమ స్థాయికి దిగజారింది. కేతిగాడి రాజ్యంగా, పేరిగాడి పాలనగా నడిచింది. బాధలకు గురైంది ప్రజలు, పదవులు పంచుకుని తిన్నది నాయకులు, చిత్తూరు జిల్లా పరిషత్ ఎన్నికలలో కాంగ్రెస్ (ఐ) పార్టీ అధ్యక్షుడిచ్చిన నోటిమాటను ధిక్కరించి నందుకు మంత్రులు సి.దాసు, చంద్రబాబునాయుడు, రాయలసీమ ప్రాంతీ యాభివృద్ధి సంఘాధ్యక్షుడు సైఫుల్లాబేగ్ లను కోన ప్రభాకరరావు సస్పెండ్ చేశాడు. ఇది కేంద్రం వరకూ పోగా, రాజీచేసి మంత్రులను కొనసాగించారు. అయితే ఎన్నికయిన జిల్లా పరిషత్తువారిని రాజీనామా యివ్వమన్నారు. జిల్లాలో అమరనాథరెడ్డికి సి.దాసు, చంద్రబాబునాయుడికి మధ్య ముఠా కలహాలు అలా వుండగా, నెల్లూరు జిల్లాలో ఎన్. జనార్ధన రెడ్డికి ఎన్. శ్రీనివాసులు రెడ్డికి మధ్య పచ్చగడ్డి భగ్గుమన్నది. ఇటువంటి కలహాలు ప్రతి జిల్లాలోను వున్నాయి. అవి మంత్రిమండలిలో ఏదో ఒక రూపేణా బయట పడుతూనే వున్నాయి. ఆరుగురు కాంగ్రెస్ (ఐ) శాసన సభ్యులు అంజయ్యను తొలగించమని ఇందిరాగాంధీని కోరడంతో వ్యవహారం బజారున పడింది. అంజయ్య హయాంలో 1981 అంతా ఎన్నికల సంవత్సరంగా గడచిపోయింది. పదేళ్ళనుండి వాయిదా పడుతూ వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఫలితాలు వచ్చిన తరువాత ఎక్కువమంది మా వాళ్ళే అని అంజయ్య ప్రకటించాడు. 30 కౌన్సిల్ స్థానాలకు గాను, 9 సీట్లలో కాంగ్రెస్ (ఐ) ఓడిపోయింది. విజయవాడ, విశాఖ కార్పొరేషన్లలో కాంగ్రెస్ (ఐ)కి ప్రతిపక్ష స్థానం లభించింది.

అంజయ్య పరిపాలన ఎయిర్ బస్ మంత్రిమండలితో ప్రారంభమై ఆరణాల స్థాయికి దిగజారింది. ఇది రాష్ట్ర దురదృష్టం.

హఠాత్తుగా ముఖ్యమంత్రి పదవి నుండి తొలగింపబడ్డాడని భావించేవారు కేవలం కేంద్ర కాంగ్రెస్ రాజకీయాలు తెలియనివారే. ఇంచుమించు 6 నెలలుగా కేంద్ర నాయకత్వం అతనిని తొలగించడానికి చేసిన ప్రయత్నమే మార్పుకు దారితీసింది. అధికారంలో ఉన్న వారికి ఇలాంటి విషయాలు త్వరగా తెలియవు. చుట్టూ *చేరి మీవి అమృత హస్తాలని, మీ నాయకత్వం శాశ్వతమని, మీరు లేకుంటే రాష్ట్రం లేదని* పొగుడుతూ, లాభపడుతూ, అడ్డమైన రాళ్ళకు, బాబాలకు మొక్కిస్తూ ముఖ్యమంత్రులను ఆటాడించే వారున్నంతకాలం వాస్తవ విషయాలు తెలియవు. పదవి పోయిన అంజయ్య అలిగి, పార్టీ పెట్టబోయి, పంచాయతీరాజ్ పేరిట ఫోరం పెడతానని ప్రకటించాడు. అంటే ఏమిటో ఆయనకే తెలియదు. డా.చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా 18 ఏళ్ళ వయస్సువారికి ఓటు హక్కు ఇవ్వడం, హరిజనులకు, గిరిజనులకు, స్త్రీలకు పంచాయతీరాజ్ లో రిజర్వేషన్లు ఏర్పరచడం, చట్టరీత్యా చేసారు. అదంతా అమలుపరచబోయేసరికి ఆయన దిగిపోవాల్సి వచ్చింది. అప్పుడు అంజయ్య బయలుదేరి తానే వాటికి కారణం అన్నాడు. అయితేనేం ముఖ్య మంత్రులు మారినంత మాత్రాన ప్రజల స్థితిగతులు బాగుపడవని నిర్ధారణ అయింది. అంజయ్యకు అండగా మాజీ మంత్రి జి.వి.సుధాకర రావు. మరికొందరు సహాయపడుతున్నారని తెలిసింది. ప్రజాభిమానంపై ఆధారపడదలచిన అంజయ్య ఏ అవతారం దాల్చనున్నాడో మరి.

డా. చెన్నారెడ్డికి పంజాబ్ గవర్నర్ పదవి లభించడంతోను, వి.బి.రాజుకు కనీసం శాసనసభలో సభ్యత్వమైనా లేకపోవడంతో కొత్త రాజకీయం మొదలైంది. బ్రహ్మానందరెడ్డి మాత్రం అవకాశం కోసం చూస్తున్నారు. మనకు మాజీ ముఖ్యమంత్రులు, మాజీ మంత్రులు ఎక్కువయ్యారు.

# ముఖ్యమంత్రి – టి. అంజయ్య

1980

| పేరు | | శాఖ |
|---|---|---|
| 1. | టి. అంజయ్య | ముఖ్య మంత్రి |
| 2. | అహ్మద్ షరీఫ్ | పోర్ట్స్ |
| 3. | ఎస్. అమరనాథ్ రెడ్డి | సహకార శాఖ |
| 4. | ఎమ్. బాగా రెడ్డి | పంచాయతీ రాజ్ |
| 5. | నాదెండ్ల భాస్కరరావు | చిన్న తరహా పరిశ్రమలు |
| 6. | పి. వి. చౌదరి | దేవాదాయ శాఖ |
| 7. | సి. దాస్ | వస్త్ర పరిశ్రమ |
| 8. | టి. హయగ్రీవాచారి | వృత్తి విద్య |
| 9. | దివి కొండయ్య చౌదరి | రోడ్లు, భవనాలు |
| 10. | ఎ. మదనమోహన్ | మెడికల్ సర్వీసెస్ |
| 11. | కె. ఓబుల్ రెడ్డి | మధ్యతరహా నీటిపారుదలశాఖ |
| 12. | కె. ప్రభాకర్ రెడ్డి | గృహనిర్మాణశాఖ |
| 13. | జి. రాజారాం | ఆర్థిక శాఖ |
| 14. | సి. రాంభూపాల్ రెడ్డి | రెవెన్యూ |
| 15. | బి. రాందేవ్ | జంతు సంరక్షణ శాఖ |
| 16. | కోనేరు రంగారావు | హౌసింగ్ |
| 17. | బి. సరోజిని పుల్లారెడ్డి | మునిసిపాలిటీస్ |
| 18. | పి. శేషావతారం | రవాణా శాఖ |
| 19. | జి. శ్రీరాములునాయుడు | చిన్నతరహా నీటిపారుదల |
| 20. | వై. వెంకటరావు | అగ్రికల్చర్ |
| 21. | ఏ. వీరప్ప | విద్యుత్ |
| 22. | బి. వెంకట రామిరెడ్డి | విద్య |
| 23. | సి. జగన్నాథరావు | పన్నులు |
| 24. | ఎం.ఎ. అజీజ్ | అటవీ శాఖ |

| | | |
|---|---|---|
| 25. | ఎస్. జనార్ధన రెడ్డి | పరిశ్రమలు |
| 26. | జి. వి. సుధాకర రావు | భారీ నీటిపారుదల శాఖ |
| 27. | భాట్టం శ్రీరామమూర్తి | గిరిజన సంక్షేమం |
| 28. | ఎమ్. మాణిక్యరావు | వాణిజ్య పన్నులు |
| 29. | ఇ. అయ్యప్ప రెడ్డి | న్యాయస్థానాలు, న్యాయ శాఖ |
| 30. | డి. మునుస్వామి | పర్యాటక శాఖ |
| 31. | చేబ్రోలు హనుమయ్య | మార్కెటింగ్ |
| 32. | జి. వెంకటరావు | గిరిజనాభివృద్ధి |
| 33. | ఎస్. వెంకట స్వామి | గనులు |
| 34. | టి. లక్ష్మి కాంతమ్మ | స్త్రీ సంక్షేమ శాఖ |
| 35. | ఎస్. శ్రీనివాసులు రెడ్డి | చక్కెర పరిశ్రమ |
| 36. | ఎమ్. ఎమ్. హసీమ్ | వ్యాపార, ఎగుమతులు |
| 37. | ఆర్. రామలింగరాజు | ఓడరేవులు |
| 38. | కె. రోశయ్య | హౌసింగ్ |
| 39. | కె. కేశవరావు | చిన్న తరహా పరిశ్రమలు |
| 40. | చనుమోలు వెంకటరావు | వ్యవసాయం |

రాష్ట్ర మంత్రులు

| | | |
|---|---|---|
| 41. | పి. జనార్ధన రెడ్డి | కో-ఆపరేషన్ |
| 42. | పాలడుగు వెంకటరావు | పంచాయత్ రాజ్ |
| 43. | కె. వి. కృష్ణమూర్తి | పన్నులు |
| 44. | ఎస్. నరసప్ప | చేనేత పరిశ్రమ |
| 45. | జి. ప్రకాశరావు | అటవి శాఖ |
| 46. | వై. ఎస్. రాజశేఖర రెడ్డి | మెడికల్ సర్వీసెస్ |
| 47. | ఎమ్. శ్రీనివాస రావు | విద్య |
| 48. | వి. వెంకటేశ్వరరావు | రెవెన్యూ |
| 49. | కె. సత్యనారాయణ రాజు | భారీ నీటిపారుదల శాఖ |
| 50. | ఎమ్. తులసీదాస్ | మధ్యతరహా నీటిపారుదల శాఖ |

| | | |
|---|---|---|
| 51. | డి. రవీంద్రనాయక్ | గిరిజన సంక్షేమ శాఖ |
| 52. | బి. రుక్మిణి దేవి | సాంఘిక సంక్షేమ శాఖ |
| 53. | సి.హెచ్. పరశురామ నాయుడు | మత్స్య శాఖ |
| 54. | ఎస్. చంద్రబాబు నాయుడు | జంతుసంరక్షణ శాఖ |
| 55. | టి. బాలగౌడ్ | రోడ్లు, భవనాలు |
| 56. | అల్వార్ దాస్ | మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ |
| 57. | గోకా రామస్వామి | రవాణా శాఖ |
| 58. | గోగినేని నాగేశ్వరరావు | వ్యవసాయ శాఖ |
| 59. | కె. పాపయ్య | ఎలక్ట్రిసిటీ |
| 60. | ఎమ్. ఎస్. విజయలక్ష్మి | స్త్రీ సంక్షేమ శాఖ |
| 61. | కె. వి. కృష్ణారెడ్డి | ఓడ రేవులు |
| 62. | సి. రాజనరసింహ | హౌసింగ్ |

ముఖ్యమంత్రి – **టి. అంజయ్య**
ద్వితీయ మంత్రివర్గం 1980 - 1982

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | టి. అంజయ్య | ముఖ్య మంత్రి |
| 2. | ఎస్. అమర్ నాథ్ రెడ్డి | కో-ఆపరేషన్ |
| 3. | ఇ. అయ్యప్ప రెడ్డి | న్యాయ శాఖ |
| 4. | ఎమ్.ఎ. అజీజ్ | అటవీశాఖ |
| 5. | ఎమ్. బాగారెడ్డి | భారీ పరిశ్రమలు |
| 6. | పి. వి. చౌదరి | దేవాదాయ శాఖ |
| 7. | సి. దాస్ | చిన్న నీటిపారుదల శాఖ |
| 8. | సి.హెచ్. హనుమయ్య | మార్కెటింగ్ |
| 9. | ఎమ్. ఎమ్. హసీమ్ | ఓడరేవులు |
| 10. | టి. హయగ్రీవాచారి | వృత్తి విద్య |
| 11. | సి. జగన్నాథ రావు | గృహనిర్మాణ శాఖ |
| 12. | ఎస్. జనార్దన రెడ్డి | రెవెన్యూ |

| | | |
|---|---|---|
| 13. | దివి కొండయ్య చౌదరి | రోడ్లు, భవనాలు |
| 14. | ఎ. మదన్ మోహన్ | మెడికల్ సర్వీసెస్ |
| 15. | ఎమ్. మాణిక్యరావు | వాణిజ్య పన్నులు |
| 16. | కె. ప్రభాకర రావు | ఆర్థిక శాఖ |
| 17. | బి. రాందేవ్ | జంతుసంరక్షణ శాఖ |
| 18. | కె. రంగారావు | సాంఘిక సంక్షేమ శాఖ |
| 19. | కె. రోశయ్య | రవాణా |
| 20. | బి. సరోజిని పుల్లారెడ్డి | మునిసిపల్ కార్యనిర్వాహకశాఖ |
| 21. | భాట్టం శ్రీరామమూర్తి | సాంస్కృతిక వ్యవహారాలు |
| 22. | ఎస్. శ్రీనివాసులు రెడ్డి | పంచాయత్ రాజ్ |
| 23. | జి. వి. సుధాకర్ రావు | భారీ నీటిపారుదల శాఖ |
| 24. | ఎ. వీరప్ప | విద్యుత్తు |
| 25. | ఎస్. వెంకట రెడ్డి | గనులు |
| 26. | బి. వెంకటరామి రెడ్డి | విద్య |
| 27. | జి. వెంకట స్వామి | కార్మిక |
| 28. | సి. రాజనరసింహ | పర్యాటక శాఖ |
| 29. | జి. రామస్వామి | మత్స్య శాఖ |
| 30. | ఎమ్. తులసీదాస్ | వెనుకబడిన తరగతుల సంక్షేమం |
| 31. | పాలడుగు వెంకటరావు | గిరిజన, నీటిపారుదల శాఖ |
| 32. | ఎమ్. ఎన్. విజయలక్ష్మిదేవి | స్త్రీ సంక్షేమ శాఖ |
| 33. | కె. కేశవరావు | చిన్నతరహా పరిశ్రమలు |
| 34. | సి.హెచ్. వెంకటరావు | వ్యవసాయశాఖ |

**రాష్ట్ర మంత్రులు**

| | | |
|---|---|---|
| 35. | ఎస్. అల్వార్ దాస్ | మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ |
| 36. | ఎన్. చంద్రబాబు నాయుడు | గ్రంథాలయాలు |
| 37. | బాలగౌడ్ | చక్కెర పరిశ్రమలు |
| 38. | పి. జగన్నాథ రెడ్డి | యువ సేవ |

39. జి. నాగేశ్వరరావు — చేనేత పరిశ్రమలు

40. వై.ఎస్. రాజశేఖర రెడ్డి — గిరిజన అభివృద్ధి శాఖ

41. డి. రవీంద్ర నాయక్ — గిరిజన సంక్షేమం

42. కె. సత్యనారాయణ రాజు — హౌసింగ్

43. వి. వెంకటేశ్వరరావు — భూగర్భజల శాఖ

----------

# ఏడు మాసాలతోనే భవనం వెంకట్రామ్ పాలన సరి



వంశపారంపర్యంగా వస్తున్న వారందరికీ పాదుకా పట్టాభిషేకం చేస్తానని అంజయ్య పదే పదే చెప్పినా ఆయనకు ముఖ్యమంత్రి పదవి నిలబడలేదు. ప్రధాని ఇందిర కుమారుడు రాజీవ్ గాంధీ 1982లో రెండు రోజులు ఆంధ్రప్రదేశ్ లో పర్యటించి, తన కొరకు పెద్ద ఎత్తు ఆర్భాటాలు చేసినందుకు ముఖ్యమంత్రి అంజయ్యపై మండిపడ్డాడు. పరిపాలనలో తగినంత సమర్థత చూపెట్టడం లేదనే విమర్శకు అంజయ్య తరచు ప్రతిపక్షాలనుంచి, ప్రజల నుంచి గురి అవుతూ వచ్చారు. ఇదిలా ఉండగా విజయవాడ, విశాఖపట్టణాలలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రతిపక్షాలైన మార్క్సిస్ట్ పార్టీ విజయవాడలోను, బి.జే.పి. విశాఖలోను విజయాలను సాధించాయి. హైద్రాబాద్ లో జరగవలసి ఉన్న కార్పొరేషన్ ఎన్నికలను అంజయ్య ప్రభుత్వం వాయిదా వేసింది. ఇక మంత్రివర్గం భారీ ఎత్తున నిర్మాణమై ఉన్నది. పరిపాలించిన రెండేళ్ళు మునిసిపల్, పంచాయతీ తదితర ఎన్నికలతోటే సరిపోయింది. 1983లో అసెంబ్లీ ఎన్నికలు జరుపవలసి ఉంది. ఇదీ అంజయ్యను పదవి నుండి తొలగించేనాటికి రాష్ట్రంలోని పరిస్థితి. ఆయనను పదవినుండి ఎందుకు తొలగించారో కారణాలు ఎవరూ చెప్పలేదు. ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకొనవలసిందిగా అధిష్ఠానం ఆదేశించిన తరువాత, 1982 ఫిబ్రవరి 20వ తేదీన శనివారం నాడు అంజయ్య రాజీనామాను సమర్పించారు. అనంతరం నూతన ముఖ్యమంత్రి భవనం వెంకట్రాం ఫిబ్రవరి 24వ తేదీన ప్రమాణ స్వీకారం చేసారు. ఉప ముఖ్యమంత్రిగా సి. జగన్నాథరావు నియమితు డయ్యాడు. పెద్ద మనుషుల ఒప్పందాన్ననుసరించి ఇది జరిగింది.

భవనం వెంకట్రామ్ హైకమాండ్ పుణ్యమా అంటూ హఠాత్తుగా ముఖ్యమంత్రి అయ్యాడు. రాష్ట్ర కాంగ్రెస్ ఐ శాసన సభా పక్షం ఏకగ్రీవ తీర్మానంలో, ప్రధాని ఇందిరను కోరినట్లు ఈ నిర్ణయం జరిగింది. అంతకు ముందు ఎన్. జనార్ధన రెడ్డి, కోన ప్రభాకర రావు ముఖ్యమంత్రిత్వానికి విఫల ప్రయత్నం చేసారు. వీరిరువురూ ప్రధానంగా పోటీపడ్డారు. మధ్యలో పెండేకంటి వెంకట సుబ్బయ్య పేరు వినవచ్చి ఆగిపోయింది. కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేయడానికి కొంత తతంగం జరిగి అభిప్రాయ సేకరణ జరిపినట్లు నటించి చివరకు భవనం వెంకట్రాంను ముఖ్యమంత్రిగా చేసారు. ఆ తరువాత మంత్రులను నియమించడానికి, భవనం వెంకట్రాం కూడా ఢిల్లీ వెళ్ళి సంప్రదింపులు జరిపి 32 మందిని ఎంపిక చేసారు. ఆదిలోనే హంసపాదుగా, కనిపించిన ఈ మంత్రి వర్గానికి, శాఖలు ఇవ్వడంలో నానా రభసా జరిగింది. అంతకు ముందు అంజయ్య మంత్రివర్గంలోని 15 మందికి ఉద్వాసన చెప్పడం జరిగింది.

చేపలకు వాసన లేకుండా చేస్తామన్నట్లు పరిశుభ్రమైన పరిపాలన అందిస్తామని కొత్త ముఖ్యమంత్రి భవనం వెంకట్రామ్ భ్రమలతో కూడిన ప్రకటన చేసారు. మంత్రులను నియమించడానికి కూడా స్వేచ్ఛలేని ముఖ్యమంత్రి పొడిచేస్తాడనుకోవడం పగటి కలే అవుతుంది. కనుక కొత్త ముఖ్యమంత్రి ఈ చట్రంలో ఏమంతగా చేయలేడని, ఏదైనా తలపెట్టినా ఈలోపు మరో ముఖ్యమంత్రి వస్తాడని గుర్తుంచుకోవాలి. ఈ విధంగా ప్రారంభం అయిన వెంకట్రాం మంత్రివర్గం ప్రతిపక్షాల విమర్శకు గురి అయింది. ఇది ఎన్నాళ్ళుంటుందనే ప్రశ్న కూడా తలెత్తింది.

మార్చి 29న జరిగిన రాజ్యసభ ఎన్నికలలో 6 స్థానాలకు కాంగ్రెస్-ఐ పార్టీ అభ్యర్థులను నిలబెట్టింది. ప్రతిపక్షాలు అన్నీ కలిసి రాష్ట్ర జనతా పార్టీ అధ్యక్షుడు బాబుల్ రెడ్డిని బలపరిచాయి. ఒక్కొక్క అభ్యర్థి గెలవటానికి 43 ఓట్లు రావల్సి ఉండగా కాంగ్రెస్-ఐ అభ్యర్థులెవ్వరికీ మొదటి లెక్కింపులో గెలవటానికి వీలైన ఓట్లు రాలేదు. కాంగ్రెస్-ఐ బలపరిచిన ఆర్. సాంబశివ రావుకు అధికార పక్షం 32 ఓట్లను మాత్రమే కేటాయించింది. అయినా అతనికి 46 ఓట్లు వచ్చాయి. ప్రతిపక్షాలు అన్నీ కలిపి చూచినా 28 మంది శాసన సభ్యులు మాత్రమే ఉండగా, బాబుల్ రెడ్డికి 56 ఓట్లు వచ్చాయి. మాజీ మంత్రి హషీంకు 32 ఓట్లు మాత్రమే లభించాయి. మొత్తం మీద కాంగ్రెస్-ఐ పార్టీకి శాసనసభలో 254 స్థానాలు ఉన్నప్పటికీ రాజ్యసభలో ఒకసీటు ఓడిపోవడం కేవలం లోలోపల జరిగిన కుట్రలు, కీచులాటలే కారణంగా భావించారు. కొందరు మంత్రులు కూడా డబ్బు తీసుకుని తాము వేయవలసిన వారికి కాక వేరేవారికి ఓటు వేసారని చెప్పుకున్నారు. కాంగ్రెస్-ఐ అభ్యర్థి ఒకరు ఓడిపోవాలనే ఉద్దేశంతో మాత్రం మంత్రివర్గంలోని వారు కొందరు పట్టుదలగా కృషిచేశారు. రాజ్యసభ ఎన్నికల్లో డబ్బు, సారాయి, కులం, అధికారం చాలా దుర్వినియోగం అయ్యాయి. కాంగ్రెస్-ఐ పార్టీలో సుమారు 30 మంది ప్రతిపక్ష అభ్యర్థికి ఓటు చేయగా మరొక 30 మంది కేటాయించిన వారికి గాక వేరే ఓటు చేసారు. దీనినే ...చిత్తశుద్ధి... ఓటు అనవచ్చు. ఒకప్పుడు నీలం సంజీవరెడ్డికి, వి.వి.గిరికి రాష్ట్రపతి పదవికై పోటీ జరిగినప్పుడు మనస్సు చెప్పినట్లు ఓటు వేయమని ఇందిరాగాంధీ ఉద్బోధించింది. ఆ సూత్రాన్నే ఇక్కడ కాంగ్రెస్-ఐ వారు పాటించారు. కాకుంటే అభ్యర్థులకు ఖర్చు అయ్యింది.

ఇబ్రహీంఖాన్ అనే వ్యక్తి జంటనగరాలలో ఒక ముఠాను తయారు చేసి అనేక చోట్ల వివిధ సంఘాల పేరిట కాజేయడం ప్రారంభించాడు. డా.చెన్నారెడ్డి, అంజయ్య ముఖ్యమంత్రులుగా అతడినేమీ చేయలేక పోయారు. భవనం వెంకట్రాం ముఖ్యమంత్రి కాగానే అతడిని అతడి సహచరులు కొందరిని జాతీయ భద్రతా చట్టం క్రింద జైలులో పెట్టించాడు. నగరంలో భూమి గరిష్ఠ చట్టానికి మినహాయింపులు ఇచ్చే పద్ధతిని 1982 మార్చి 31 నాటికి పూర్తయింది. ఈ మినహాయింపులు ఇవ్వడం ద్వారా లోగడ మంత్రివర్గాలు లక్షల రూపాయలు ఆర్జించాయి. మినహాయింపులు తేదీని కొన్నాళ్ళపాటు పొడిగించమని మంత్రివర్గ సహచరులతోను అనేకమంది ఒత్తిడి చేసినప్పటికీ భవనం వెంకట్రాం ముందుకు రాలేదు. విద్యామంత్రిగా ఉండగా కాపిటేషను ఫీజు వసూలు చేసే ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలపై ధ్వజమెత్తిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఆ ఊసెత్తకపోవడం ఆశ్చర్యకరం. ఆచరణలో మాత్రం అవకాశం వచ్చినప్పుడు తగినట్లుగా వ్యవహరించలేక పోయాడనేది తేలిపోయింది. శాసనసభలో, బహిరంగ సభలో, వ్యక్తులతో చర్చలలో చూపే చాకచక్యానికి తగినట్లుగా పనులు జరగడం లేదు. మంత్రి వర్గంపై ముఖ్యమంత్రికి అదుపు లేదు. ఢిల్లీ యాత్రలు యధావిధిగా కొనసాగుతున్నాయి. కాంగ్రెస్-ఐ పార్టీ అంటూ నామమాత్రంగా ఒకటి ఉన్నప్పటికీ, అది ఎక్కడా పనిచేస్తున్నట్లు అనిపించడంలేదు. తెలుగుదేశం పార్టీ వచ్చి రబ్బరు ముద్రల ముఖ్యమంత్రులను విమర్శించి ఢిల్లీ పెత్తనాన్ని ఈసడించుకుని, తెలుగువారి ఆత్మాభిమానం పోయిందని హెచ్చరించినపుడు, పైకి ఎన్ని గంభీర ప్రవచనాలు చెప్పినా లోలోపల కాంగ్రెస్-ఐ వారికీ పిరికితనం పట్టుకుంది. ముఖ్యమంత్రి అనేక ముఠాల మధ్య సతమతమవుతూ ఏమీచేయలేని అవస్థలో పడ్డాడు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్-ఐ ఆఖరు ముఖ్యమంత్రిగా భవనం వెంకట్రాం పేరు చిరస్థాయిగా ఉంటుందని అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకులు అన్నమాటలు ఎంతవరకూ నిజమవుతాయో చూడవలసి ఉంది. మొత్తం మీద ముఖ్యమంత్రికి ..స్టార్టింగ్ ట్రబుల్.. ఉన్నదని వ్యాఖ్య వచ్చింది. ఏమి చేయాలన్నా హేమ్ లెట్ వలె తటపటాయింపు ఎక్కువ కావడంతో మంచిపేరు రావడం కష్టం. కాంగ్రెస్-ఐ సంస్కృతిలో ప్రజలను అనేక విధాల కబళించగల థగ్గులు, పిండారీలు, తిమింగలాలుగా, పైరవీకారులుగా, హైకమాండ్ గా చెలామణి అవతుండగా వారి మధ్య తట్టుకుని మంచి పనులు చేసి ఈ ముఖ్యమంత్రి పేరు అనిపించుకోలేకపోయాడు.

-------

## ముఖ్యమంత్రి
## భవనం వెంకటరాం

ఫిబ్రవరి 1982 – సెప్టెంబర్ 1982

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | బి. వెంకటరాం | ముఖ్య మంత్రి |
| 2. | సి. జగన్నాథరావు | గృహ, రవాణా |
| 3. | ఎన్. జనార్ధన రెడ్డి | రెవెన్యూ, విద్యుత్తు |
| 4. | కోన ప్రభాకర రావు | ఆర్థికశాఖ |
| 5. | ఎన్. అమరనాథ్ రెడ్డి | సహకార శాఖ |
| 6. | ఎమ్. ఎ. అజీజ్ | అటవీ శాఖ |
| 7. | ఎమ్. బాగా రెడ్డి | భారీ పరిశ్రమలు |
| 8. | టి. బాల గౌడ్ | చక్కెర పరిశ్రమ |
| 9. | పి.వి. చౌదరి | దేవాదాయ శాఖ |
| 10. | టి. హయగ్రీవాచారి | వృత్తి విద్య |
| 11. | కె. కేశవరావు | విద్యాశాఖ |
| 12. | ఎ. మదన్ మోహన్ | మెడికల్ సర్వీసెస్ |
| 13. | ఎమ్. మానిక్ రావు | రోడ్లు, భవనాలు |
| 14. | వై. ఎస్. రాజశేఖర రెడ్డి | పన్నులు |
| 15. | సి. రాంభూపాల్ రెడ్డి | పంచాయతీ రాజ్ |
| 16. | బి. రామ్ దేవ్ | జంతు సంరక్షణ |
| 17. | కె. రంగారావు | సాంఘిక సంక్షేమ శాఖ |
| 18. | బి. సరోజిని పుల్లారెడ్డి | మునిసిపల్ కార్యనిర్వాహకశాఖ |
| 19. | మజ్జి తులసీదాస్ | మధ్యతరహా నీటిపారుదల శాఖ |
| 20. | ఎ. వీరప్ప | చేనేత పరిశ్రమ |
| 21. | చనుమోలు వెంకటరావు | వ్యవసాయం |
| 22. | పాలడుగు వెంకటరావు | మార్కెటింగ్ |
| 23. | జి. వెంకటస్వామి | పౌర సరఫరాలు |
| 24. | వి. వెంకటేశ్వరరావు | చిన్నతరహా పరిశ్రమలు |

**రాష్ట్రమంత్రులు**

| | | |
|---|---|---|
| 1. | ఎస్ అల్వార్ దాస్ | విద్యాశాఖ |
| 2. | ఎన్. చంద్రబాబునాయుడు | చిన్నతరహా నీటిపారుదల |

3. పి. గోవర్ధన్ రెడ్డి యూత్ సర్వీసెస్
4. పి. జనార్ధన రెడ్డి ఆర్కైవ్స్
5. జి. నాగేశ్వరరావు వాణిజ్యం
6. ఐ. రామకృష్ణరాజు పర్యాటక శాఖ
7. డి. రవీంద్రనాయక్ భూగర్భజల శాఖ
8. బి. సమ్మయ్య మత్స్య శాఖ
9. బి. శేషశయన రెడ్డి హౌసింగ్
10. సిహెచ్. శ్యామల రావు గిరిజన సంరక్షణ

--------

# కోట్ల విజయభాస్కర రెడ్డి కాంగ్రెసు పాలనకు స్వస్తి

విజయభాస్కర రెడ్డిని ముఖ్య మంత్రిగా చేస్తే రెడ్లు సంతోషించారు. ఆయన మంత్రి మండలిలో 6గురు రెడ్లు, 5 గురు కమ్మవారున్నారు. 4 మాసాలున్న ఈ మంత్రి మండలి కుల ప్రాతిపదికగా సాగడానికి వ్యవధి లేదు. ఎన్నికలొచ్చి పడటంతోనూ ఎన్.టి. రామారావు దాటికి తట్టుకునే ప్రయత్నంలోనూ సతమతమయ్యారు. కర్నాలు జిల్లాలో స్థాన బలం గల విజయభాస్కర రెడ్డి శాసన సభ్యుడిగా ఎన్నికై తర్వాత కేంద్ర మంత్రి కావటంతో రాజీనామా చేశాడు. ఆ ఖాళీ తెలుగుదేశపు రెడ్డికి దక్కింది.



విజయభాస్కర రెడ్డి కర్నూలు జిల్లా ముఠా రాజకీయ వాది, కేంద్రంలో మంత్రి అయినప్పటికీ జిల్లాలో ముఠాలను దాటిపోలేదు.

తెలుగు గంగ పథకం తెలుగుదేశం వారు ప్రారంభించారు. ఎం.జి.ఆర్. ఇచ్చిన 30 కోట్ల రూపాయలకు ఇందిరా గాంధీ ప్రారంభోత్సవం చేసింది. అయితే దీని వలన ఎన్.టి. రామారావుకు రాయలసీమలో పేరు ఎక్కువ స్థిరపడిపోతుందోనని, అది నుంచి విజయభాస్కరరెడ్డి యీ పథకాన్ని ఎగతాళి చేస్తూ మాట్లాడారు. రాయలసీమ పట్ల ఆయనకు గల అభిమానం కులం రీత్యా యిట్లా బయటపడింది. నాలుగు నెలలకే ఆయన పాలన అంతమై ఎన్నికలు జరగగా ఎన్.టి. రామారావు కాంగ్రెస్ ను తొలిసారి రాష్ట్రంలో చావుదెబ్బ కొట్టి అధికారానికి వచ్చాడు.

--------

# ముఖ్యమంత్రి
# కె. విజయభాస్కర రెడ్డి
సెప్టెంబర్ 1982 – డిసెంబర్ 1982

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | కె. విజయభాస్కర రెడ్డి | కార్యనిర్వాహక శాఖ, సమాచార, అర్బన్ లాండ్ సీలింగ్, 20 సూత్రాల పథకం, గృహపరిశ్రమలు |
| 2. | సి. జగన్నాథ రావు | పరిశ్రమలు |
| 3. | ఎస్. జనార్ధన రెడ్డి | వ్యవసాయం |
| 4. | ఎ. మదన్ మోహన్ | రెవెన్యూ మరియు వాణిజ్య పన్నులు |
| 5. | ఎం.ఎ.అజీజ్ | అటవీ శాఖ |
| 6. | ఎమ్. వి. కృష్ణారావు | సహకార శాఖ |
| 7. | కోన ప్రభాకర రావు | ఆర్థిక, ప్రణాళికలు |
| 8. | ఎమ్. మాణిక్ రావు | రోడ్లు, భవనాలు |
| 9. | బి. రామ్ దేవ్ | జంతు సంరక్షణ |
| 10. | డి. మునుస్వామి | పంచాయత్ రాజ్ |
| 11. | సి. అల్వార్ దాస్ | సాంఘిక సంక్షేమశాఖ |
| 12. | బి. సరోజిని పుల్లారెడ్డి | ఆరోగ్య, మెడికల్ సర్వీసెస్ |
| 13. | ఎమ్. బాగారెడ్డి | రవాణా |
| 14. | కె. రోశయ్య | గృహనిర్మాణ శాఖ |
| 15. | ఎ. వీరప్ప | చిన్నతరహా నీటిపారుదల |
| 16. | సి.హెచ్. వెంకట రావు | భారీ, చిన్నతరహా నీటిపారుదల |
| 17. | ఎన్. అమరనాథ్ రెడ్డి | పౌర సరఫరాలు |
| 18. | డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి | విద్య |
| 19. | అహ్మద్ షరీఫ్ | ట్రేడ్ అండ్ కామర్స్ |
| 20. | వి. వెంకటేశ్వరరావు | న్యాయశాఖ |
| 21. | కె. కేశవరావు | కార్మిక, స్త్రీ సంక్షేమ శాఖ |
| 22. | పాలడుగు వెంకటరావు | మార్కెటింగ్ |
| | **రాష్ట్ర మంత్రులు** | |
| 23. | ఎన్. చంద్రబాబునాయుడు | వృత్తి విద్య |
| 24. | జి. నాగేశ్వరరావు | దేవాదాయ శాఖ |
| 25. | ఐ. రామకృష్ణ రాజు | పన్నులు |
| 26. | పి. గోవర్ధన రెడ్డి | చేనేత పరిశ్రమ |
| 27. | ఆర్. వేమన్న | మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ |
| 28. | అమర్ సింగ్ తిలావత్ | పర్యాటక శాఖ |

| | | |
|---|---|---|
| 29. | పి. వి. రాఘవులు | మత్స్య శాఖ |
| 30. | బి. సమ్మయ్య | చిన్నతరహా పరిశ్రమలు |
| 31. | సన్యాసి నాయుడు | చక్కెర, గ్రామీణ పరిశ్రమలు |
| 32. | వి.హనుమంతరావు | గిరజన సంక్షేమ శాఖ |

-------

# తెలుగుదేశం – ఎన్.టి. రామారావు

తెలుగుదేశం పార్టీ హఠాత్తుగా పుట్టలేదు. దీని నాయకుడు ఎన్.టి. రామారావు కొన్నాళ్ళుగా రాజకీయాల్లోకి రావాలనే ఆలోచనలో ఉన్నాడు. చెన్నారెడ్డి ముఖ్య మంత్రిత్వం కోల్పోయి అంజయ్య వచ్చినప్పుడు రామారావుకు రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన తీవ్రతరమయింది. ఇందు నిమిత్తం ఆయన సినీరంగం లోని తన సన్నిహిత మిత్రులనూ, ఇతర రంగాలలో తనకు బాగా చనువున్న వారినీ కదిలించి చూచారు. కొందరు చప్పరించి నిరుత్సాహ



పరచగా మరి కొందరు ప్రోత్సహించారు. విజయ భాస్కర రెడ్డి, అంజయ్యలను కూడా ఆయన ఈ విషయమై సూచన ప్రాయంగా సంప్రదించక పోలేదు. కానీ అల్లుడు కాకముందునుంచీ చంద్రబాబునాయుడు విషయమై ఆసక్తి కనబరుస్తూ రామారావును రాజకీయాల్లోకి రమ్మని పదే పదే కోరాడు. అల్లుడైన తరవాత ఇంకా చొరవ తీసుకొని కొన్ని చర్చా సమావేశాలు ఏర్పరచాడు. అంజయ్య మంత్రివర్గంలో ఉంటూ విందు సమావేశాలు ఏర్పాటు చేశాడు. రామారావు తరచు తన కుటుంబ సభ్యులతో కూడా ఈ విషయాలను చెపుతూ వచ్చినా వారంతా సీరియస్‌గా తీసుకోలేదు. సినీరంగంలో వ్యక్తులూ అంతే. ఇట్లా వుండగా ఇందిరా గాంధీ పేకముక్కల వలె ముఖ్యమంత్రులను మార్చే ఆటలో అంజయ్యను తొలగించి భవనం వెంకట్రామ్‌ను ఎంపిక చేసింది. భవనం వెంకట్రామ్‌కు సినీరంగంలో అనేక విధాలైన సంబంధాలున్నాయి. చదువుకునే రోజుల్లోనే గుంటూరు బ్రాడీ పేటలో కొన్నాళ్ళు వెంకటరామ్ గదిలో రామారావు ఉన్నారు. ఆ తరువాత ఉద్యోగం మానుకుని సినీరంగంలో ప్రవేశించటానికి ఎన్.జి.రంగా వంటి వ్యక్తుల ప్రోత్సాహం కూడా ఉన్నది. కొన్ని సినిమాలు తీసిన వెంకటరామ్ అప్పుడప్పుడు రామారావును మద్రాసులో కలుసుకోవటం, ఆ సందర్భంగా 'దేశమంటే మనుషులోయ్' అనే సినిమా ఎందుకు విఫలమయిందో రామారావు వివరించడం జరిగింది. అప్పట్లోనే తిరుపతి వచ్చిన ఆంధ్ర యాత్రికులు మద్రాస్ వరకూ వెళ్ళి రామారావును దర్శించుకోటం పరిపాటయింది. ప్రజల్లో రామారావు పట్ల ఉన్న అభిమానం, వీరి ఆరాధన తాను గమనించినట్లు, ఆయన క్రమశిక్షణ జీవితం ఆయనకెంతో తోడ్పడినట్లు వెంకటరామ్ వ్యాఖ్యానిస్తూ ఉండేవారు. అలాంటి వెంకటరామ్ ముఖ్యమంత్రి అవుతున్నప్పుడు ఢిల్లీలో కేంద్ర హైకమాండ్ వారు కొన్ని విషయాలు గుచ్చి గుచ్చి అడిగినట్లు చెపుతారు. అప్పటికే రామారావు పార్టీ పెడతాడనే వదంతి వ్యాపించింది. ఇది నిజమా అని కేంద్రం వారడిగినపుడు "నేను ముఖ్యమంత్రినైతే రామారావు పార్టీ పెట్టే ప్రసక్తే ఉండదని" వెంకటరామ్ హామీ ఇచ్చాడంటారు. ఏమైతేనేమి ముఖ్యమంత్రి అవుతున్నాడని తెలియగానే ఢిల్లీ గెస్ట్ హౌస్‌కు ఫోను చేసి రామారావు అభినందనలు తెలియచేశారు. తన ప్రమాణ స్వీకారానికి రావలసిందిగా వెంకటరామ్ కోరడం, ఏమాత్రం అవకాశమున్నా వస్తానని ఆయన హామీ ఇవ్వటం జరిగింది. దీని వెనుక చంద్రబాబునాయుడు ఉన్నాడంటారు. ఉండవచ్చు. ప్రమాణ స్వీకారం నాడు మద్రాసు నుంచి వచ్చిన రామారావు ముందుగా వెంకటరామ్ ఇంటికి రావడం, వారిరువురూ ఒకే కారులో

రాజభవన్‌కు రావడం అందరికీ తెలిసిన విషయమే. ఆ తరువాత రామారావు నోటికి లడ్డు అందిస్తున్న వెంకటరామ్ ఫోటోలను పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. దీనిపై నాటి రాష్ట్ర కాంగ్రెస్ (ఐ) అధ్యక్షుడు సి.దాస్ వ్యంగ్య వ్యాఖ్యానాలు చేశారు కూడా. ఇంతలో అప్రియమైన ఒక సంఘటన జరిగింది. రామారావు అల్లుడు చంద్రబాబు నాయుడుకు ఎలాంటి ప్రాధన్యత వెంకటరామ్ మంత్రివర్గంలో లభించలేదు. వెంకటరామ్ ముఖ్యమంత్రి అయిన నెల రోజులకే రాజకీయపార్టీ ఏర్పరుస్తున్నట్లు రామారావు ప్రకటించాడు. ఈలోగా వెంకటరామ్ మంత్రివర్గంలో స్థానాలను ఆశించిన నాదెళ్ళ భాస్కరరావు, నల్లపు రెడ్డి శ్రీనివాసులు రెడ్డి నిరుత్సాహాన్ని ఎదుర్కొన్నారు. ముందుగా రామారావు పార్టీలో చేరుతున్నట్లు నాదెళ్ళ భాస్కరరావు ప్రకటించాడు. తన పార్టీలో చేరటానికి ముందుగా ఇతర పార్టీ-శాసన సభ్యులు తమ సభ్యత్వానికి రాజీనామా ఇవ్వాలని రామారావు ఆంక్ష పెట్టారు. నాదెళ్ళ భాస్కరరావు ముందుచూపుతో రాజీనామా చేశారు. కానీ అయనతో బాటు బయటికి వచ్చిన గద్దె రత్తయ్య, ఆదెయ్య, సి.నారాయణ శాసన సభ్యత్వానికి రాజీనామా ఇవ్వలేదు. పైగా కొత్త పార్టీలో చాలా పెద్ద పీట ఆశించటమే గాక, కాంగ్రెస్ సంస్కృతిని ఒదులుకోలేక పార్టీ నాయకత్వాన్ని విమర్శించటం మొదలు పెట్టారు. అంతటితో వారికి కొత్త పార్టీ ఉద్వాసన పలికింది. వారు ఉభయ భ్రష్టులయ్యారు. 1982 అక్టోబరు 3న నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి శాసనసభ సభ్యత్వానికి రాజీనామా ఇచ్చి కొత్త పార్టీలో చేరారు.

తెలుగుదేశం గురించి ఇంకా చర్చించి తెలుసుకునే ముందు యీ పార్టీ నాయకుడు ఎన్.టి.రామారావు గురించి కొంత వరకు గ్రహించడం అవసరం. అందుకే మరో ఫ్లాష్ బాక్!

ఎన్.టి.రామారావు కృష్ణా జిల్లా నిమ్మకూరు గ్రామంలో 1923 మే 28న లక్ష్మయ్య, వెంకట రామమ్మల మధ్యతరగతి కమ్మ కుటుంబంలో పుట్టాడు. వల్లూరి వెంకట సుబ్బారావు టీచర్ వద్ద పాఠాలు వల్లించి, 1933 నాటికే బెజవాడ మునిసిపల్ హైస్కూలులో ఆరవతరగతి మొదలు పెట్టాడు. కుటుంబం ఆర్థికంగా చితికిపోగా, చిన్నతనం నుంచీ పేదరికాన్ని అనుభవించి, కష్టించి పనిచేయడం నేర్చాడు. బెజవాడలో ఇంటర్మీడియట్ (ఎఫ్.ఎ.అనేవారు) చదివాడు. చదువుకునే రోజులలో సాముగారడీలతో బాటు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం వారు నిర్వహించే శిక్షణ తరగతులకు హాజరయ్యాడు. ఆ రోజుల్లోనే నాటకాలపై అసక్తి కలిగి పాత్రధారణ ప్రారంభించాడు. బెజవాడలో కుటుంబ పోషణకై హెూటళ్ళకు పాలు తీసుకెళ్ళడం, పాడి పశువులకు మేత తీసుక రావడం నిత్యకృత్యాలుగా వుంటుండేవి. 1941లో ఒకసారి ఎఫ్.ఎ.తప్పినా మళ్ళీ చదివి పాసయ్యాడు. 1942లో పెళ్ళి చేసుకున్నాడు. బి.ఎ. చదవడానికి గుంటూరు ఎ.సి.కళాశాలలో చేరి రోజు రైల్లో వస్తూ పోతూ వుండేవాడు. పరీక్షలు దగ్గర పడినప్పుడు చదువుకు అంతరాయం కలుగకుండా వుండే నిమిత్తం గుంటూరులో వుంటున్న భవనం వెంకట్రామ్ గదిలో కొన్నాళ్ళున్నాడు. చదువు పూర్తి అయిన తరువాత కొద్ది రోజులపాటు బెజవాడలో గుమాస్తా గిరి చేసారు. ఇంతలో సబ్‌రిజిస్ట్రార్ ఉద్యోగం రాగా అందులో ప్రవేశించాడు. అలాంటప్పుడే సినిమాలలో చేరమని ఆహ్వానం రావడం, ఉద్యోగం వదలడమా లేదా అనే సమస్యలో పడటం జరిగింది. ముందుగా విజయ ప్రొడక్షన్స్ వారికి కంట్రాక్ట్ కుదిరింది. సినిమాలలో క్రమేణా కుదురుకున్న రామారావు, తన నిత్యజీవితంలోని క్రమశిక్షణను ఆ రంగంలోనూ ప్రవేశపెట్టి సఫలుడయ్యాడు. రాను రాను హీరోగా రాణించడమే గాక, సినిమా రంగంలో ఎదురులేని, తిరుగులేని నాయకత్వాన్ని, ఆధిపత్యాన్ని పొందాడు. కొన్ని పాత్రలు రామారావే ధరించగలడనిపించాడు. కృష్ణ, రామ, భీష్మ, కర్ణ, సుయోధన, బ్రహ్మనాయుడు, వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీ కృష్ణదేవరాయలు, గిరీశం, నాగరాజు యింకా అనేక పాత్రలు వేసి, మూడు తరాల వారిని ప్రభావితం చేశాడు. ఒక్కొక్క పాత్ర కొందరిని ప్రభావితం చేస్తుండగా, స్త్రీలు, యువకులు ఆరాధించేవిగా గ్రామగ్రామాన రామారావు అభిమాన సంఘాలు వెలిశాయి.

మద్రాసులో రామారావును ప్రభావితం చేసిన ఒక ప్రముఖ వ్యక్తి, సుప్రసిద్ధ జర్నలిస్టు వి.ఆర్.నార్ల, ఆంధ్ర ప్రభ దినపత్రిక సంపాదకుడుగా వుంటున్న నార్ల ఒక సందర్భంగా రాయలసీమ కరువును ఆదుకోవడానికి రామారావును పురిగొల్పారు.

## నార్ల వెంకటేశ్వరరావు సలహా

నార్లవారి ప్రోత్సాహంతో రామారావు ఒక బృందంతో బయలుదేరి సర్కారు ప్రాంతాలు పర్యటించి వచ్చిన డబ్బును రామకృష్ణ మిషన్ ద్వారా సద్వినియోగం చేశారు. కరువుతో బాధపడుతున్న రాయలసీమ పేదలకు గంజి

కేంద్రాలు తెరచి ఆదుకోవడంలో రామారావు తోడ్పడడంతో, సినిమా హీరోగానేగాక తమ ఆపద్బాంధవుడుగా పేద ప్రజలు గుర్తుంచుకున్నారు. ఈ విధంగా రెండు పర్యాయాలు కరువు బాధితుల నిమిత్తం మరోసారి వరద బాధితుల కొరకు రామారావు నిధులు వసూలు చేసి యిచ్చారు. ఇవి క్రమంగా ప్రజలలో ప్రభావం చూపెట్టాయన్న సంగతి మరచిపోరాదు.

నార్ల వెంకటేశ్వరరావు 30 సంవత్సరాల క్రితం యిచ్చిన ప్రోత్సాహాన్ని, ఆ తరువాత లభించిన ఆదరాన్ని రామారావు బాగా గుర్తుంచుకున్నాడు. హైదరాబాద్‌కు రామారావు మారిన తరువాత, 1982 జనవరి మాసంలో ఒక పెళ్ళి సందర్భంగా నార్ల రామారావును కలియడం తటస్థించింది. కాంగ్రెస్ రాష్ట్రంలో చేస్తున్న దగుల్బాజీ పనులను ఏకరువు పెట్టి, మీ వంటి వ్యక్తులు రాజకీయాల్లోకి రావాలని ఆవేదనతో అన్న మాటలు రామారావుకు బాగా హత్తుక పోయాయి. అందుకే తెలుగుదేశం పార్టీ పెట్టిన తొలిరోజులలో ప్రాంతీయ పార్టీని ఆహ్వానిస్తూ నార్ల ప్రకటన చేశారు. అధికారాన్ని చేబట్టిన రామారావు గతాన్ని విస్మరించ కుండా, నార్ల దీవెనలు అడిగి, పొందారు. అంతటితో ఆగక నార్ల భావాలు, నాస్తికత్వం, హేతుతత్వం, మానవతా తత్వం తెలిసికూడా ఆయన్ను ప్రభుత్వ సలహాదారుగా కోరి, అంగీకరింప జేశారు. అంతేగాక నార్ల సలహాలను పాటించి అమలులో పెట్టారు కూడా! ఆమేరకు రామారావు చాలా కృతజ్ఞతతో, విశ్వాసంతో, వివేచనతో వ్యవహరించారు.

## ఈనాడు చేయూత

ప్రాంతీయ పార్టీ స్థాపించ దలచిన రామారావు, ఈనాడు దినపత్రిక ప్రధాన సంపాదకుడు రామోజీరావును సుదీర్ఘంగా అనేక పర్యాయాలు సంప్రదించాడు. ఆయన ఆమోదం పొంది రంగ ప్రవేశం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈనాడు పత్రికకు రామోజీరావుకు ప్రత్యేక స్థానం వున్నది. పాఠకులను లెక్క చేయకుండా, కేవలం వ్యాపారంగా పత్రికలను ఏదో విధంగా నడిపిస్తున్న రోజులలో, రామోజీరావు ప్రవేశించి, రంగం మార్చేశారు. ఒకనొక సందర్భంలో విమానం ప్రయాణం చేస్తూ, మరొక పత్రిక యజమానితో, విశాఖలో పత్రిక పెడితే జయప్రదమౌతుందని రామోజీరావు అన్నారట. కాని ఆ పత్రికాధిపతి చులకనగా, ***మాటలు చెప్పడం కాదు, దిగితే తెలుస్తుంది*** అని వెటకారంగా అనేసరికి, రామోజీరావు పట్టుదలతో పత్రిక పెట్టి పంతం నెగ్గించుకున్నారు. ఆ విధంగా విశాఖలో ఆరంభమైన ఈనాడు, హైదరాబాద్ మీదుగా విజయవాడ చేరుకుని, తిరుపతిలో పరాకాష్ఠ నందుకున్నది. పాఠకులు ప్రధానం అనే తత్వంతో ఈనాడును రాష్ట్రం నలుమూలలా తీసుకెళ్ళడంలోనూ ప్రజల సమస్యలకు ప్రాధాన్యత యివ్వడంలోనూ, అధికారంలో ఉన్న వారి అవినీతి చర్యలను బట్టబయలు చేయడంలోనూ రామోజీ ఒక మలుపు తిప్పారు. పత్రికా రంగంలో కొమ్ములు తిరిగిన వారందరూ విస్తుబోయారు. ముఖ్యమంత్రులు ప్రకాశం, సంజీవరెడ్డి, గోపాలరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నాయకులు రంగా వంటివారిని దిమ్మ తిరిగేటట్లు నార్ల వెంకటేశ్వరరావు చేస్తే, ప్రభుత్వాలు ప్రజలకు లొంగి వుండాలని రామోజీ చూపారు. అలాంటి ఇరువురు వ్యక్తుల అండదండలు రామారావు పొందాడు.

రామోజీరావు ఏదిచేసినా శాస్త్రీయంగా, క్రమపద్ధతిలో ఆకర్షణీయంగా అందరికీ అందుబాటులో వుండేటట్లు చేస్తాడు. రామారావు స్థాపించిన కొత్త పార్టీకి యిది ఎంతగానో తోడ్పడింది. ముఖ్యంగా పార్టీ ప్రచారం, నినాదాలు, అధికార పక్షాన్ని ఖండించడం, ఓటర్లకు విజ్ఞప్తి, పార్టీ ప్రణాళిక, పోస్టర్లు, యిత్యాదులు సిద్ధం చేయడంలో రామోజీ తోడ్పాటు మరువరానిది. చదువురాని వారు సైతం ఈనాడు చదివించుకుని విషయాలు తెలుసుకున్నారు. తెలుగుదేశం అనే పేరు పెట్టడంలో కూడా ప్రజాభిప్రాయం సర్వేచేయించారు. రామారావు పర్యటనకు బాగా ఈనాడు ప్రచారం లభించింది. ప్రజలనాడి తెలిసిన ఈనాడు, రామారావు నిత్యకృత్యాలతో సహా, ప్రతి ప్రసంగాన్ని ప్రచురించింది. మిగిలిన పత్రికలన్నీ వెక్కిరిస్తూ కూర్చున్న రోజుల్లో జరిగిన సంగతే యిదంతా, చాలా ఆలస్యంగా పత్రికలు రామారావు ప్రాభవాన్ని గుర్తించారు. అప్పటికే ఆలస్యమైంది. పైగా కాంగ్రెసు నాయకుల వెక్కిరింతలను ప్రచురించే యీ పత్రికలను ప్రజలు యీసడించుకున్నారు. విలేఖరులను సర్వే చేయడానికి పెడితే, తిట్లుతిన్న యీ పత్రికలు, గతిలేక ఈనాడు విలేఖరుల శరణు పొందిన సందర్భాలున్నాయి. ఆఫీసులో కూర్చుని, యజమాని చిత్తం వచ్చినట్లు వ్రాస్తున్న ఎడిటర్లు, విలేఖరుల నివేదికలను మార్చేసి ప్రచురించారు. ప్రజలు యిది నిరసించారు. విలేఖరులు తమ బాధలు ఎవరికి చెప్పుకోలేక కుమిలిపోయేవారు. మిగిలిన పత్రికల బాధ అలావుండగా, ఈనాడు ప్రభంజనం జోరుగా సాగిపోయింది. రామారావుకు అది కొండంత అండ.

సినీరంగంలో తనకు అండకావాలని రామారావు పెద్దగా ఆశించలేదు. డైరెక్టర్ తాతినేని ప్రకాశరావు వచ్చి పనిచేయనారంభించారు. రామారావు కుమారులు కొంత కృషి చేయగా, అల్లుళ్లు చేయూత నిచ్చారు. లోక్ దళ్, సోషలిస్టు పార్టీలలో అనుభవంగల కె.వి.సత్యనారాయణ నల్గొండ జిల్లాలో స్థిరపడ్డారు. ఆయన ఆర్గనైజర్.గా ముందుకొచ్చారు. మేధావుల సహాయాన్ని రామారావు అర్థించి నప్పుడు ఉద్యోగం వదులుకొని పర్వతనేని ఉపేంద్ర వచ్చారు. తెలుగుదేశం కార్యాలయంలో తుర్లపాటి సత్యనారాయణ, లోగడ ఈనాడులో పనిచేసిన యలమంచిలి శేఖర్ నిర్విరామంగా రాతకోతల పని చూచారు. స్వచ్ఛందంగా, పార్టీలో చేరకుండా కేవలం కాంగ్రెసు దిగిపోవాలనే ఉద్దేశంలో ఐనంపూడి చక్రధర్ (మాజీసోషలిస్టు ఎం.పి.) పనిచేశాడు. కృష్ణా జిల్లాలో కర్నాటి రామమోహనరావు బాగా సహాయపడ్డారు. కానీ రామారావు మనస్తత్వం గ్రహించలేక బయటపడి, అసలైన తెలుగుదేశం అంటూ, పేరూ వూరూ లేకుండా పోయారు. యలమంచిలి శివాజి, బండారు రత్న సభాపతి, కె. రాంచంద్రారెడ్డి, జె.వీరాస్వామి, వసంత నాగేశ్వరరావు, బెజవాడ పాపిరెడ్డి కోపు పేసుకున్నారు. ఎటొచ్చీ తెలంగాణాలో ప్రముఖులెవరూ బయటపడలేదు.

తెలుగుదేశం తొలి మహాసభ హైదరాబాద్ నిజాంకళాశాల ఆవరణలో 1982 మార్చి 27న జరిగింది. దీనికి మహానాడు అని నామకరణం చేశారు. జనం కిటకిటలాడారు. ఆనాటి ప్రసంగంలో టంగుటూరి ప్రకాశాన్ని విమర్శించిన రామారావుగార్ని కొందరు జర్నలిస్టులు కావాలని దుయ్యబట్టారు. ఇంకేముంది, దొరికాడు అనుకొని కొన్ని పత్రికలు రామారావు వెంటబడ్డాయి. కాని యీ తరం యువతకు ప్రకాశం ఎవరో తెలియదని, యీ పత్రికలు విమర్శలు పనిచేయవని వారు గ్రహించలేకపోయారు. రామారావు తొలిపర్యటన రాష్ట్రంలోని ముఖ్య కేంద్రాలలో జరిగింది. సినిమా ఆకర్షణ వలన జనం వచ్చారని కాంగ్రెసు వారు సర్ది చెప్పుకున్నారు. మళ్ళీ వస్తే జనం రారని అన్నారు. అప్పటికే తమ నాయకులకు జనం కావాలంటే బాడుగ లారీలలో కిరాయి మనుషులను తెస్తున్న కాంగ్రెసు వారికి, ప్రజలతో సంబంధం పోయింది.

రాష్ట్ర ప్రజలు కరువుతో బాధపడుతుంటే, శ్రీరామారావుగారు జోలి పట్టుకుని బయలుదేరాడు. జనం తండోపతండాలుగా వచ్చి, డబ్బుతోపాటు ఉంగరాలు, నగలు యిచ్చారు. అప్పటికీ కనువిప్పు కలగని కాంగ్రెసువారు, ఇదొక స్టంటు అన్నారు. జ్యోతిలక్ష్మి వస్తే అంతకంటే ఎక్కువ మందివస్తారని పాలడుగు వెంకటరావు వంటి మంత్రులు మాట్లాడారు. ప్రతిపక్షాలవారు మాత్రం హాయిగా నిద్రపోయారు. తెలుగుదేశ ప్రభంజనం, ప్రభావం చవిచూచిన కొందరు చేరాలని ఉవ్విళ్ళూరినా శాసనసభ సభ్యత్వం వదులుకోలేక ఆగారు. మరికొందరు సెంటిమెంట్‌తో కాంగ్రెసును అంటిపెట్టుకున్నారు.

తెలుగుదేశం పార్టీ సభ్యత్వం చేర్పించడం మొదలైంది. రూపాయి చొప్పున సభ్యత్వం నిర్ణయిస్తే విపరీతంగా చేరారు. ఈ విషయంలో కూడా ఈనాడు పత్రిక బాగా తోడ్పడింది.

రాష్ట్రంలో శ్రీ రామారావు విజృంభించి ప్రచారం చేస్తుండగా కాంగ్రెస్ నాయకులు నిమ్మకు నీరెత్తినట్లు సొంత పనులు చూసుకోటం ప్రారంభించారు. అప్పటికే కాంగ్రెస్ పట్ల తెలుగు ప్రజలు ఆగ్రహంతో ఉండగా ముఖ్యమంత్రి భవనం వెంకటరామ్‌ను మార్చి ఇక్కడ ఎవరూ లేరన్నట్లుగా 12 ఏళ్ళ క్రితం ఢిల్లీకి పోయిన విజయ భాస్కర రెడ్డిని ముఖ్యమంత్రిగా ఇందిరాగాంధీ తెచ్చిపెట్టింది. ఆయన అసెంబ్లీ సమావేశాలు చూడకుండానే పదవిని కోల్పోయాడు.

కేంద్ర ప్రభుత్వం మాత్రం రాష్ట్రంలో జరుగుతున్న మార్పులను కొంతవరకు గమనించింది. ఢిల్లీ వెళ్ళిన ప్రతివారినీ రామారావుగారి ప్రభావం ఏమిటని అడగటం మొదలు పెట్టారు. రాయలసీమలో ముస్లిములు ఎక్కువగా తెలుగుదేశంలో చేరటానికి కారణం ఏమిటని ఇందిరాగాంధీ ప్రశ్నించినప్పుడు, రాష్ట్ర మంత్రిగా ఉన్న ఎం.ఎ. అజీజ్ బుకాయించబోయి తెల్లముఖం వేశాడు. అలాగే వెనుకబడిన వర్గాలవారు తెలుగుదేశాన్ని ఎందుకు బలపరుస్తున్నారంటే ఆ వర్గం నాయకులనుకునేవారు – సమాధానం చెప్పలేకపోయారు. పైగా రామారావుగారు కమ్మకులానికి చెందినవాడనీ, ఆ కులంవారు రాష్ట్రంలో 5 శాతంకంటే ఎక్కువ లేరనీ, వారు అధికారంలోకి రావడం అసంభవమనీ కొత్తవాదన తెచ్చారు. ఇవన్నీ వింటూనే ఇందిరాగాంధీ కేంద్ర గూఢచారులను రామారావుగారి సభలకు పంపించి సర్వే చేయించింది. లోగడ సినిమా శతదినోత్సవాలు జరిగినప్పుడు రామారావుగారు వచ్చినా కనిపించని జనం ఇప్పుడు అతని రాజకీయ సభల్లో కనిపిస్తున్నారని తెలిసింది. స్త్రీలు, వెనుకబడిన తరగతుల వారూ, రైతులు, యువకులు కులంతో నిమిత్తం లేకుండా ఈ సభలకు వచ్చారు. అంతటితో పరిస్థితి చేయిజారక ముందే జాగ్రత్త పడదామని 1983 మార్చిలో జరగవలసిన ఎన్నికలను రెండు నెలలు ముందుగా జరపాలని నిర్ణయించారు. అప్పటికి రెండు పర్యాయాలు రాష్ట్రమంతటా పర్యటించిన రామారావు మూడవ పర్యాయం 1982 డిసెంబరు 16 నుంచి దిగ్విజయ యాత్ర మొదలు పెట్టాడు. అనూహ్యంగా

వచ్చిపడ్డ దరఖాస్తులను పరిశీలించిన అభ్యర్థులను ఎంపిక చేయటంలో సతమతమయ్యారు. చివరి నిమిషం వరకూ కొన్ని మార్పులు చేస్తూ పోయారు. సహజంగానే కొత్త నీటితోపాటు పాతవారనేకమంది స్థానాలను పొందారు. అయితే అభ్యర్థి ప్రధానం కాకుండా పోవడంతో తాత్కాలికంగా విమర్శలేమీ రాలేదు. వచ్చినా నిలబడలేదు. 287 స్థానాలలో పోటీ చేసిన తెలుగు దేశం సంజయ్ విచార్ మంచ్‌కు 5 స్థానాలు ఇచ్చింది మేనకా గాంధీ తెలంగాణాలో రామారావు తోపాటు పర్యటించింది. తన చెవర్లెట్ కారును మొబైల్ ఇల్లుగా మార్చుకుని రామారావు అందులోనే నిద్రిస్తూ భోజనం చేస్తూ నిర్విరామంగా పర్యటించాడు. కారులోనే మైక్ ఏర్పాటు చేసి, అడుగడుగునా కదలనివ్వకుండా ఆపుతున్న జనాన్ని ఉద్దేశించి ప్రసంగించాడు. గొంతు బొంగురు పోయినా, నిద్రాహారాలు సరిగ్గా లేకపోయినా రోడ్డు పక్కనే స్నానం చేస్తూ మొండిగా పట్టుదలతో రాష్ట్రమంతా తిరిగాడు. ఆయన ప్రసంగాలను క్యాసెట్ల రూపంలో మారుమూల గ్రామాల వారు విన్నారు. ఇదిగాక మిమిక్రీలు వచ్చాయి. దీనిని ఎదుర్కోవటానికి కాంగ్రెసువారు ఎన్ని తిప్పలు పడ్డా పేలవంగానే మిగిలిపోయింది. ఒక దశలో రామారావు కార్యక్రమాలు 48 గంటల వరకూ ఆలస్యంగావటంతో హెలికాప్టర్ తీసుకు రావాలని ప్రయత్నించారు. దానికి కావలసిన పెట్రోలు తదితర సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఆ ప్రయత్నం విరమించు కున్నారు. రామారావు రాకకోసం జనం అలాగే వేచి వుండి తీర్థయాత్రీకుల వలె ఎక్కడపడితే అక్కడ నిద్రించిన సందర్భాలు లేకపోలేదు. తెలంగాణాలోని జహీరాబాద్ వంటి చోట్ల కూడా జనం వేలం వెర్రిగా తెల్లవారు ఝూమున, అర్థరాత్రి జరిగిన సభలకు కూడా జాగారం చేసి హాజరయ్యారు. తిరుపతి, గుడివాడలలో రామారావు పోటీ చేయగా కాంగ్రెసు వారు సినీతారలకై ప్రయత్నించి విఫలమయ్యారు. చివరకు ఒక చిత్తూరు జిల్లాకు మాత్రం ప్రచారానికి శివాజీ గణేశన్‌ను తెచ్చుకోగలిగారు. మూడవదశలో రామారావు కొన్ని చోట్లకు వెళ్ళలేకపోయాడు. అందువలన ఖమ్మం, నల్గొండ, కర్నూలు జిల్లాలలో కమ్యూనిస్టులూ, కాంగ్రెసువారూ బయటపడగలిగారు.

## ఎన్నికల సమస్యలు

ఈ ఎన్నికలలో ప్రధాన పాలక పక్షమైన కాంగ్రెస్ (ఐ) అడుగడుగునా ఎన్.టి.రామారావు విమర్శలకు తెలుగుదేశం పార్టీ వారికీ సమాధానం చెప్పకోవలసి వచ్చింది. తెలుగుదేశం 45 పేజీల ఎన్నికల ప్రణాళికలో అనేక విషయాలను ప్రస్తావిస్తూ, తెలుగువారి ఆత్మాభిమానం కాంగ్రెసువారి చేతుల్లో, ఢిల్లీ వీధుల్లో ఎలా తాకట్టుగా మారిందో వివరించారు. తెలుగునాడు ప్రతిష్ఠను పునరుద్ధరిస్తామనీ హామీ ఇచ్చారు. అవినీతికీ, అక్రమ పాలనకూ సమాధికట్టి నిష్కలంక పాలనకు పునాది ఏర్పరుస్తామన్నారు. తెలుగు భాషకు ప్రాధాన్యతను చేకూర్చుతామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఇస్తామనీ, వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు ఏర్పరుస్తామనీ హామీ ఇచ్చారు. గ్రామీణాభివృద్ధికి భారీ ఎత్తున కార్యక్రమం చేపడతామన్నారు. ప్రతి ఊరికీ, ప్రతి పేటకూ మంచి నీళ్ళందిస్తామని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కల్పిస్తామన్నారు. గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఇస్తామన్నారు. పంచాయతీ రాజ్ సంస్థలకు అధికారాలు ఇస్తామన్నారు. బ్రతుకుదెరువు చూపే విద్యావిధానం ప్రవేశ పెడతామన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు పరుస్తామన్నారు. పారిశ్రామికీకరణ త్వరగా చేస్తామన్నారు. కార్మికులకు కనీస వేతనం 15 రూపాయలు ఏర్పరుస్తామన్నారు. పోలీసు వ్యవస్థను పటిష్ఠవంతం చేస్తామన్నారు. కుటుంబ నియంత్రణను ప్రజలకు నచ్చజెప్పి అమలు పరుస్తామన్నారు. ప్రజలకు ఆరోగ్య, వైద్య సేవలను అందించి వైద్య రంగంలో ఉన్న అవినీతిని అరికడతామన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణం సకాలంలో పూర్తి చేస్తామన్నారు. స్త్రీకి తండ్రి ఆస్తిలో భాగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువకులకు భవిష్యత్తు చూపే పథకాలు చేపడతామనీ, ఉపాధి సౌకర్యాలు సమకూరుస్తామనీ, క్రీడాకారులను ప్రోత్సహిస్తామనీ అన్నారు. ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు మెరుగు పరుస్తూ, రాష్ట్రాలకు ఎక్కువ స్వేచ్ఛను ఇచ్చేలా చూస్తామన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకూ, పత్రికల స్వేచ్ఛకూ రేడియో, టి.వి.ల స్వతంత్ర ప్రతిపత్తికీ పాటుపడతామన్నారు. ప్రతివ్యక్తి ఒకే పదవి నిర్వహించాలనేది సూత్రంగా పెట్టుకుంటామన్నారు. న్యాయవ్యవస్థను గౌరవిస్తామంటూ ఎన్నికల సంస్కరణకు కృషి చేస్తామన్నారు. పార్టీ ఫిరాయింపుకు వ్యతిరేకతను ప్రకటించారు. పాలనా వ్యయంలో పొదుపు చేస్తామని కూడా చెప్పారు. రెండు రూపాయలు కిలో బియ్యం అమ్మిస్తామనీ, వినియోగదారులలో చైతన్య దీప్తిని కలిగిస్తామనీ హామీ ఇచ్చారు. హేతుబద్ధమైన పన్నుల విధానాన్ని అనుసరిస్తామన్నారు. జన సామాన్యానికి పెద్ద ఎత్తున గృహవసతి కల్పిస్తామన్నారు. సెక్యులరిజాన్ని త్రికరణ శుద్ధిగా పాటిస్తూనే మైనారిటీలకు సంక్షేమాన్ని కలిగిస్తామన్నారు. బడుగు వర్గాల అభ్యున్నతి, గీత కార్మికుల సంక్షేమం, చేపలు పట్టే వారికి సహాయం, రిక్షాకార్మికులకు రక్షణ, చేనేత పరిశ్రమకు చేయూత నిస్తామన్నారు. దేవస్థానాల అభివృద్ధి, పర్యటన స్థలాల అభివృద్ధి,

చలనచిత్ర రంగానికి ప్రోత్సాహం కల్పిస్తామన్నారు. హైదరాబాద్ కార్పోరేషన్‌కు ఎన్నికలు పెడతామన్నారు. ప్రాంతీయ పార్టీ అయినప్పటికీ విదేశాంగ విధానంలో తటస్థవైఖరిని అవలంబించే పద్ధతిని సమర్థిస్తామని చెప్పారు.

ఇందులో ముఖ్యంగా తెలుగువారి ఆత్మాభిమానం కాపాడతామనేది, అవినీతిని అరికడతామనేది ప్రధానాంశమయింది. మిగిలిన పార్టీలు, ముఖ్యంగా కాంగ్రెస్ (ఐ) పార్టీ ఎన్నికల ప్రణాళికను విడుదల చేసినా వాటికంత ప్రాధాన్యత లేకుండా పోయింది. సినిమాలలో సంపాయించుకున్న రామారావుకి రాజకీయాలేమి తెలుసని కాంగ్రెసు వారు విమర్శించగా – సంపాయించుకొని, రాజకీయాల్లోకి వస్తున్నాడుగాని, డబ్బు గడించటానికి రావటల్లేదుగా అని జనసామాన్యమే సమాధానం చెప్పింది. రుద్రాక్షమాల పట్టుకొని ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజల ముందు నిలబడుతున్నానని రామారావు పదే పదే చెప్పాడు.

ఎన్.టి.రామారావు ఎన్నికల ప్రచారాన్ని చెడగొట్టడానికి కాంగ్రెస్ (ఐ) వారు అక్కడక్కడా ప్రయత్నాలు చేశారు. హైదరాబాదు నగరంలోనే అలాంటి ప్రయత్నం జరిగినప్పుడు ప్రచారం ఊరేగింపును ఆయన విరమించుకోవలసి వచ్చింది.

అన్ని పార్టీల జాతీయస్థాయి నాయకులు వచ్చి ప్రచారం చేసినా రామారావు ప్రభంజనం ముందు వారి సభలు పేలవమైపోయాయి. కనీసం వెంకయ్య నాయుడుపై పోటీని విరమించమని వాజ్‌పేయి ఆ సందర్భంగా రామారావుకి విజ్ఞప్తి చేశాడు. ప్రతిపక్ష జాతీయస్థాయి నాయకులు తెలుగు దేశాన్ని ఏదో విధంగా సమర్థించక తప్పలేదు. సి.పి.ఎం.వారు విమర్శించినా చివరి దశలో కొన్నిచోట్ల మద్దతునిచ్చారు.

## ఎన్నికల ఫలితాలు

1983 జనవరి 5న జరుగనున్న ఎన్నికల ఫలితాలు గురించి రాజకీయ పక్షాలు, పత్రికలు ఎవరి ధోరణిలో వారు అంచనాలు, ఊహలు చేశారు. కాని విదేశాలలో ముఖ్యంగా అమెరికాలో గేలప్ పోల్ వంటి పద్ధతులను, యిక్కడ అనుసరించలేదు. 'ఈనాడు' పత్రిక మాత్రం ఈ విషయంలో కూడా మిగిలిన వారికంటే శాస్త్రీయంగా సర్వేచేయించి, నెగ్గింది. ఈ సర్వే ఫలితాన్ని జనవరి 1న ప్రచురించింది. తెలుగుదేశం 200 స్థానాలతో గెలుస్తుందని చెబుతూ, కాంగ్రెస్ (ఐ) వారిని రాజధాని నుండి మూటాముల్లె సర్దుకోమని హెచ్చరిక చేసింది. అన్నట్లే జరిగింది. మిగిలిన దినపత్రికలు తమ యాజమాన్యాలను బట్టీ, తమ తగాదాలనుబట్టీ పిచ్చి పిచ్చిగా ఏవో రాశాయి. దినపత్రికల అంచనాలే యిలావుంటే, ఊబిలో దున్నల సంగతి చెప్పనక్కరలేదు. కాని ఫలితాలు వచ్చిన తరువాత కూడా వీరు మానాభిమానాలు లేకుండా రాయడం కర్మభూమిలోనే చెల్లుతుంది. కాంగ్రెస్ (ఐ), తెలుగుదేశంవారు తాము అధికారాన్ని చేబడతామని స్పష్టంగా ప్రకటనలు చేశారు. రామారావు నియోజకవర్గాలలో పందాలు బాగా వేసుకున్నారు. జనవరి 5న రామారావు మాత్రం హైదరాబాదు చేరుకొని సతీసమేతంగా ఓటువేసి ప్రశాంతంగా ఫలితాలకు ఎదురు చూచారు.

తీరా ఫలితాలు ప్రకటిస్తుంటే కొందరికి మతి పోయింది. బ్లడ్ ప్రషర్ పెరిగింది. తెలుగు దేశంవారు ఆనందోత్సాహాలతో గంతులేశారు. తొలి ఫలితం మాత్రం షాద్.నగర్.లో ఎలక్ట్రిక్ ఓటింగ్ వలన త్వరగా వెల్లడైంది. వెంకటస్వామి అల్లుడు శంకరరావుకు యిది దక్కింది. ఇక మరుసటిరోజున చూస్తే ఫలితాలు వేరే తీరులో వున్నాయి. విశేషమేమంటే ఏ వార్త వచ్చినా నిష్పాక్షికంగా సేకరించి వెల్లడించాల్సిన జర్నలిస్టులలో కొందరికి సన్నివాత జ్వరం వచ్చినట్లు కవళికలు మారడమే! ఒక విధంగా కాంగ్రెస్ ఉప్పుతిన్న ఫలితమిది! సరే అదలావుంచి, ఫలితాలు చూద్దాం! రాష్ట్రంలో మొత్తం 294 నియోజక వర్గాలు ఇందులో మదనపల్లి నియోజక వర్గంలో ఎన్నికల సమయంలో ఒక అభ్యర్థి చనిపోయిన కారణంగా పోలింగ్ వాయిదా వేశారు.

| | |
|---|---|
| రాష్ట్రంలో మొత్తం ఓటర్లు | 3,13,72,809 |
| స్త్రీ ఓటర్లు | 1,58,47,290 |
| పురుష ఓటర్లు | 1,55,25,519 |

ఓటర్లలో స్త్రీల సంఖ్య అధికంగా వున్నప్పటికీ అన్ని పార్టీల పక్షాన పోటీ చేసినవారు 70 మంది మాత్రమే.

## ఎన్నికల ఫలితాల విశ్లేషణ

ఈ ఎన్నికలలో ప్రధానంగా అమ్మ – అన్నకు మధ్య పోటీ జరిగిందనవచ్చు. కాంగ్రెస్ (ఐ) వారు తమకు చరిత్ర వున్నదనీ, ఇందిరాగాంధీ జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిందనీ, కనుక ఓటు వేయమనీ ప్రచారం చేశారు.

అయితే అవినీతి, లంచగొండితనం, తప్పుడు పనుల విషయం, ఢిల్లీ ప్రదక్షిణల ప్రస్తావన ఏమీ తేలేదు. విమర్శలకు సమాధానం లేదు. పైగా, రామారావు సినిమా డైలాగులు చెబుతున్నాడనీ, తెలుగుదేశానికి చరిత్ర లేదనీ ఎగతాళి చేసారు.

ఐక్య సంఘటన పేరిట ఏర్పడిన ప్రతిపక్షాల ఫ్రంటు కూడా రామారావును అడప దడప విమర్శించకపోలేదు. అందులో పి.పి.ఐ. మరీ మోతాదు మించి మాట్లాడింది.

రామారావు ప్రతిపక్షాల జోలికి పోలేదు. ఆయన కాంగ్రెస్ (ఐ) పైనే కేంద్రీకరించాడు. వారి తప్పులను, తెలుగువారి గౌరవాన్ని మంట గలిపిన తీరును చూపాడు. ఆత్మాభిమానం కాపాడుకోవాలని, తెలుగు జాతి పౌరుషం నిలబెట్టాలని ప్రధానంగా ప్రసంగాలు చేసాడు. ప్రాంతీయ పార్టీని సమర్ధించుకుంటూ, ఢిల్లీకి దాసోహమనే కాంగ్రెస్ వారిని ఈసడించాడు. ఆయన ప్రసంగ ధోరణిలో హిట్లర్ లక్షణాలు లేకపోలేదు. మొత్తం మీద ఎక్కువ మంది జనాలకు ఆయన మాటలు, వ్యక్తిత్వం ఆకర్షణీయమైంది.

ప్రతిపక్షాలకు విలువలేకుండా పోయింది. కాంగ్రెసుకు పరువు పోయింది. మిగిలింది తెలుగుదేశం – రామారావే. ఆ పార్టీ అభ్యర్థులు ఎవరు, వారి పుట్టుపూర్వోత్తరాలు ఏమిటి అనేది ప్రధానాంశం కాలేదు. సైకిల్ గుర్తు, రామారావు ముఖ్యం అయ్యారు. చిన్నపిల్లలు వేలంవెర్రిగా ఊరేగారు. ఎక్కడ చూచినా పచ్చ జండాల, బాడ్జీల మయమే. రామారావు బొమ్మలు తగిలించుకొని తిరిగారు. నిలువెత్తు బొమ్మలు పెట్టి ఊరేగించారు. ఒక ఛాన్స్ రామారావుకు ఇచ్చి చూద్దాం అన్నారు. కాంగ్రెసుపై అసహ్యత, రామారావు ఆకర్షణ కలిసిపోయాయి. ఆ విధంగా తెలుగుదేశం అభ్యర్థులు కొట్టుక వచ్చారు.

ఆంధ్రప్రదేశ్ ఓటర్లు మితవాదులు. దేశం యావత్తూ కాంగ్రెసు (ఐ)ని ఓడించినప్పుడు, ఇందిరాగాంధీని చిత్తు చేసిన తరువాత కూడా, ఈ రాష్ట్రంలో కాంగ్రెసు తిరుగులేని బలంతో గెలిచింది. అదే ఆఖరు ఛాన్సు. అదికాస్తా దుర్వినియోగపరుచుకున్నారు. ముఖ్యమంత్రులను పాత చొక్కాలవలె ఇందిరాగాంధీ తీసిపారేసింది. చెన్నారెడ్డి షష్ఠిపూర్తి తులాభారాలు, చందాల వసూళ్ళతో ప్రారంభమైన అవినీతి, అంజయ్య రాజీవ్ చేతుల్లో అభాసుపాలు గావడంతో పరాకాష్ఠ నందుకున్నది. ఇవన్నీ గమనించిన ఓటర్లు ఇక కాంగ్రెసువలన ప్రయోజనం లేదని తేల్చుకున్నారు.

అప్పటికి ఎన్నికలలో హరిజనులు అధిక సంఖ్యలో కాంగ్రెసుకు అండగా నిలిచారు. అందుకే 70 లక్షల వరకూ ఓట్లు వచ్చాయి. అదీగాక మిగిలిన వర్గాలు తెలుగుదేశాన్ని బలపరుస్తూంటే, హరిజనులు వారితో చేతులు కలపలేకపోయారు. దీనికి చారిత్రక కారణాలున్నవి. అనాదిగా హరిజనులు అగ్రజాతుల దోపిడీకి గురైనారు. అలాంటి హరిజనులకు ఇందిరాగాంధీ ఒక గుర్తింపు తెచ్చిపెట్టింది. 'మేమూ మనుషులమే, మాకూ హక్కులున్నాయనే' ఆలోచన వారిలో వచ్చింది. ఆగ్రకులాలవారికి ఇది కన్నెర్రగానే ఉన్నది. ఓట్లకోసం హరిజనులపై ప్రేమ ఒలకబోస్తున్నప్పటికీ, అగ్రకులాలవారికి ద్వేషం ఉన్నది. హరిజనులు పైకి రావడం వారికి ఇష్టంలేదు.

ఈ ఎన్నికలలో ఆగ్రకులాల మాట అలా ఉంచి, వెనుకబడిన తరగతులవారు హరిజనులకు వ్యతిరేకంగా తెలుగుదేశాన్ని బలపరిచారు. సౌకర్యాలు, రిజర్వేషన్లు హరిజనులకేనా అని వారు ప్రశ్నించారు.

స్త్రీలు ప్రత్యేకంగా తెలుగుదేశంపట్ల, ముఖ్యంగా రామారావు వ్యక్తిత్వంపట్ల ఆకర్షితులయ్యారు.

యువకులు ప్రేరణ పొంది రామారావు సేనగా కృషిచేశారు. చిన్నపిల్లలు రామారావు జిందాబాద్, తెలుగుదేశానికి మీ ఓటు అంటుంటే, ఇంట్లో పెద్దలు సెంటిమెంటులో పడ్డారు. ఇలాంటి కారణాలున్నాయి. కలసి రాగా తెలుగుదేశానికి 96 లక్షల ఓట్లు వచ్చాయి.

50 సంవత్సరాల చరిత్రగల కమ్యూనిస్టు పార్టీలు పేరుకు మాత్రమే నిలిచాయి. పైగా అనేకచోట్ల సి.పి.ఐ. – సి.పి.యం. వారు హృదయపూర్వకంగా ఒకర్ని ఒకరు బలపరుచుకోలేకపోయారు.

లోక్ దళ్ పూర్తిగా ఓడిపోవడమేగాక, ఎన్నికల అనంతరం రద్దు చేసుకున్నది కూడా.

జనతాలో జైపాల్ రెడ్డి గెలిచినా అది పార్టీ విజయంగా గాక, వ్యక్తిగత పలుకుబడి అనవచ్చు. కాంగ్రెసు ఓడిపోయినందుకు సంతోషించిన జయపాల్ రెడ్డి, తెలుగుదేశం విజయాన్ని మనసారా ఆహ్వానించ లేకపోయాడు.

బి.జె.పి. గొంగళివలె నిలిచింది. మజ్లీస్ కు రెండు సీట్లు అదనంగా రావడం ఈ ఎన్నికలలో దురదృష్టకర లక్షణం. ఇండిపెండెంట్లు అనవసరం అన్నట్లుగా మిగిలారు.

కాంగ్రెసువారు పెట్టిన డబ్బంతా ప్రజలకు వివిధ రూపాలలో దక్కింది. కాని కొమ్ములు తిరిగిన కాంగ్రెసు వారంతా ఓడిపోయారు. తెలంగాణా కొంతవరకు కాంగ్రెసు పరువు కాపాడింది. ఆంధ్రలో, కృష్ణాజిల్లా, రాయసీమ కడప, కర్నూలు కాంగ్రెసును కొద్దిగా ఆదుకున్నవి. 40వేల మెజారిటీ గెలుస్తానని ముఖ్యమంత్రి విజయభాస్కరరెడ్డి పలికిన ప్రగల్భాలు సరైనవి కావని తేలింది. కడప జిల్లాలో రాజశేఖర రెడ్డి తక్కువ బలంతో నెగ్గాడు. కృష్ణా జిల్లాలో ఎం.వి.కృష్ణారావు, పిన్నమనేని కోటేశ్వరరావు నెగ్గారు. మంత్రులు. మాజీ మంత్రులు అంతా అడ్రస్ లేకుండా పోయారు. ఎన్.జనార్దన రెడ్డి, అమరనాథ రెడ్డి, చంద్రబాబునాయుడు, పి.వి.చౌదరి, పేమన్న, అజీజ్, చనుమోలు, వెంకటరావు, పాలడుగు వెంకటరావు, కోన ప్రభాకర రావు, కాసుకృష్ణా రెడ్డి, చేబ్రోలు హనుమయ్య, సత్యనారాయణ రాజు, రామకృష్ణ రాజు కేశవరావు, ప్రభాకర రెడ్డి, ప్రభృతులు ఓడిపోయారు. బాగారెడ్డి, మదన్ మోహన్, అంజయ్య, గోవర్ధన్ రెడ్డి తెలంగాణాలో గెలిచారు.

తెలుగుదేశం గాలి ఎలా వున్నప్పటికీ, చివరి వరకూ చాలామంది అభ్యర్థులు భయంతోనే వున్నారు. నెగ్గుతామనే ఆశలేనివారు సైతం గెలిచి కూర్చున్నారు. సికింద్రాబాద్ లో కాడికింద పారేసిన కిషన్ రావు గెలిచాడు. హిమయాత్ నగర్ లో లక్ష్మీ కాంతమ్మ, శ్రీధర్ రెడ్డి ఓడిపోగా, తెలుగు దేశం అభ్యర్థి గెలిచిననాడే గుండె ఆగి చనిపోయాడు. విజయవాడలో కమ్యూనిస్టుల ఎరుపు పోయి తెలుగుదేశం గెలిచింది. అంతకుముందు విజయవాడ, విశాఖపట్టణాలలో కమ్యూనిస్టు పార్టీలు, బి.జె.పి. మునిసిపాలిటీలను కైవశం చేసుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికలలో ఆగాలి లేదు. తెలంగాణాలో సైతం అనుకోకుండా తెలుగుదేశం చాలాచోట్ల గెలిచింది. మొత్తం మీద, చిరకాల కాంగ్రెసుపాలన పోయింది. అమ్మ స్థానే అన్న పార్టీ చోటుచేసుకున్నది. ఆద్యంతాలూ అన్న పేరే వినిపించింది. మనది వీరారాధన సమాజం కదా!

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలను ప్రపంచ వ్యాప్తంగా రేడియోలు, ప్రసారం చేశాయి. టైం, న్యూస్.వీక్ వంటి అమెరికన్ పత్రికలు, దినపత్రికలు ఈ విషయాన్ని ప్రముఖంగా ప్రచురించాయి. హఠాత్తుగా దక్షిణాదిన ఇందిరాగాంధీ కోట కూలిపోయింది. ఎన్.టి.రామారావుపై ప్రతివారి దృష్టి పడింది. లోగడ ఉత్తరాదిలో ఎవరిని కదలించినా, దక్షిణాది అంటే తమిళనాడు అనుకునేవారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ పేరు మారుమ్రోగింది. ఎన్.టి. రామారావుకు ఈ ఖ్యాతి దక్కింది.

ఎన్నికల సందర్భంగా చెదురుమదురుగా సంఘర్షణలు, కలహాలు జరగకపోలేదు. కానీ మొత్తం మీద ప్రశాంతంగా ప్రజాస్వామికంగా ఎన్నికలు జరిగాయనే చెప్పవచ్చు. చిత్తూరు జిల్లా పదిరి, కుప్పంలో మాత్రం హరిజనవాడలో కొన్ని యిళ్లు తగలబెట్టడం, కొందరు వ్యక్తుల్ని కాల్చివేయడం దురదృష్టకరం. దీనిపై తెలుగుదేశం ప్రభుత్వం న్యాయ విచారణ వేసింది. కాంగ్రెసువారు యీ సంఘటన ద్వారా ఏదో పొడిచేద్దామనుకుని విఫలమయ్యారు.

## తెలుగుదేశ మంత్రిమండలి

తెలుగుదేశ శాసనసభ్యులు 1983, జనవరి మొదటివారంలో హైదరాబాదుకు చేరుకున్నారు. చాలామందికి రాజధాని కొత్త అందువలన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారందరికీ గుర్తింపుగా ప్రత్యేక బాడ్జీలు ఇచ్చారు. వాటిని ధరించి జూబ్లీహాలులో జనవరి 8న సమావేశమై, ఎన్.టి.రామారావును శాసన సభాపక్ష నాయకుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ లాంఛన తతంగం ముగిసిన తరువాత శాసన సభ్యులందరూ ప్రమాణం చేస్తూ దైనందిన పరిపాలనా వ్యవహారాలలో జోక్యం చేసుకోబోమనీ, నియోజకవర్గాలలో పర్యటించి, ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటామనీ, పార్టీలు మారమనీ సామూహిక ప్రమాణం చేశారు. శాసనసభా నాయకుని ఎన్నిక తీర్మానాన్ని గవర్నరు కె.సి.అబ్రహాంకు అందజేయగా ఆయన యన్.టి.రామారావు సినిమా టెంపోను చివరిదాకా అట్టిపెట్టారు. ఇంటలిజెన్స్ ఉద్యోగుల ద్వారా మంత్రులను చేయదలచుకున్న వారికి లాల్ బహదూర్ స్టేడియంకు రావలసిందిగానూ, వారి కుటుంబ సభ్యులను తీసుకురావద్దనీ కబురు చేశారు. జనవరి 9న లాల్ బహదూర్ స్టేడియం అంతా కిటకిటలాడిపోయింది.

ఈ విధంగా ప్రజల ఎదుట పగలు 12 గంటలకు ప్రమాణ స్వీకారోత్సవం జరగడం ఇదే ప్రథమం. గవర్నరు కె.సి.అబ్రహాం ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుతోనూ, మిగిలిన మంత్రులతో ప్రమాణం చేయించారు. గవర్నర్ వెళ్ళిపోయిన తరువాత ప్రజల నుద్దేశించి రామారావు తన ప్రసంగ పాఠాన్ని చదివాడు. ఈ ప్రమాణస్వీకారోత్సవానికి ప్రతిపక్షం వారు వచ్చినప్పటికీ కాంగ్రెసువారు కొద్దిమందే హాజరయ్యారు. వారిలో చాలామంది షాక్ నుంచి తేరుకోలేదు. సినిమారంగం నుంచి చాలామంది ప్రముఖులు దీనికి హాజరయ్యారు.

## కొత్తమంత్రులు

మంత్రిమండలిని ఏర్పరచడంలో ముఖ్యమంత్రి పాత కాంగ్రెస్ ప్రమాణాలను పాటించలేదు. కులాలవారీగా, జిల్లాల వారీగా, ప్రాంతం వారీగా యివ్వాలనే నియమం పెట్టుకోలేదు. అందువలన చాలామంది అంచనాలకు అందనిరీతిలో మంత్రిమండలిని ఏర్పరచాడు. నాదెండ్ల భాస్కరరావు, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పి.మహేంద్రనాథ్‌లు లోగడ మంత్రులుగా అనుభవం గడించినవారే. మిగిలిన వారంతా కొత్తవారు పి.వి.జి. రాజుకుమారుడు ఆనంద గజపతి రాజు తొలిసారి శాసన సభ్యుడై మంత్రిగా వచ్చాడు. ఆయన రాష్ట్రేతరంగా పెళ్ళి చేసుకున్నాడు. విదేశాలలో చదువుకున్నాడు. తెలుగు మాట్లాడాలంటే జంకుఉన్నది. జానారెడ్డిని ప్రోత్సహించి, పైకి తెచ్చిన వ్యక్తి కె.వి. సత్యనారాయణ. వ్యవసాయ మంత్రిగా జానారెడ్డి తన ప్రతిభను నిరూపించుకొనవలసి వున్నది. దేవాదాయ శాఖామంత్రి ఈలి ఆంజనేయులు తాడేపల్లిగూడెం మునిసిపాలిటీ స్థాయినుంచి మంత్రి పదవికి ఎదిగాడు. కాని మూడు మాసాలకే ఆయన మరణించాడు. ఆ శాఖను ముఖ్యమంత్రే స్వీకరించారు. మహేంద్రనాథ్‌కు గల రెండు శాఖలలో పౌరసరఫరాల శాఖను మే మొదటివారాంతంలో ముఖ్యమంత్రి స్వీకరించారు. అనంతపురం జిల్లాకు చెందిన షకీర్ కూడా ముస్లింల పక్షాన వున్నట్లు భావించవచ్చు. అయితే తెలంగాణా ముస్లింలకు యిదేమంత తృప్తికరం కాదు. జస్టిస్ పున్నయ్య కుమార్తె ప్రతిభా భారతి పెద్ద శాఖను నిర్వహిస్తున్నది.

ముఖ్యమంత్రికి అండగా నిలబడి, తరచు శాసన సభలోనూ, బయటా తన గతానుభవాన్నిబట్టి సలహాలను యిస్తూ నాదెండ్ల భాస్కరరావు వ్యవహారాలు నడిపిస్తున్నాడు. వీరిద్దరికీ అభిప్రాయ భేదాలున్నాయనేది వదంతిగానే, కొందరి కోరికగానే మిగిలింది. నల్లపు రెడ్డి శ్రీనివాసులురెడ్డి తృప్తిగా సజావుగా బండిసాగిస్తున్నాడు. ఎం. రామచంద్రరావుపై అప్పడే ఆరోపణలో వచ్చాయి. వాటి సంగతి తేలాలి. రామమునిరెడ్డి యువకుడు, కొత్త అయినా రాజకీయంగా లోకసభ సభ్యుడు, తన మామ ఓబుల రెడ్డి అండవున్నది. ఏమైనా మంత్రులెవరూ వివాదాలలోకి పోకుండా సాగిపోతున్నారు. ప్రతి మంత్రికీ ఒక ఐ.ఎ.ఎస్. అధికారిని స్పెషల్ అసిస్టెంట్‌గా కేటాయించారు. పి.ఎ.లు మామూలే. కాంగ్రెసు మంత్రుల వద్ద పి.ఎ.లుగా పనిచేసినవారిలో కొద్దిమందే నేడు పి.ఎ.లుగా వున్నారు.

తెలుగుదేశం కొత్త సంప్రదాయాలు, అలవాట్లను ప్రవేశపెట్టింది. కాంగ్రెసు 'సంస్కృతి'కి అలవాటుపడిన వారికి యిది వింతగా, విడ్డూరంగా వుండడం సహజం. ఆ ప్రమాణంతో కొలిస్తే అన్నీ వక్రంగా కనిపిస్తాయికూడా. కాని కాంగ్రెస్ 'సంస్కృతి'ని దుయ్యబట్టి, అది పోగొడతానని చెప్పి, ఎన్.టి.రామారావు అధికారంలోకి వచ్చాడనేది మరచిపోరాదు. ఆ దృష్ట్యా జరుగుతున్న కార్యక్రమాలను, మార్పులను అంచనా వేయాలి. తెలుగుదేశం ప్రణాళికను, హామీలకు ఏమేరకు అమలుపరుస్తున్నదీ చూడాలి.

## కాంగ్రెసువారు మారిపోతారా?

తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ శాసనసభా పార్టీ నాయకునిగా మాజీ ముఖ్యమంత్రి విజయభాస్కర రెడ్డిని ఎన్నుకున్నారు. ఆయన కౌన్సిల్‌లో కె.రోశయ్య, కె. కేశవరావులను నాయకుడు, ఉపనాయకుడుగా, అసెంబ్లీలో మదన్ మోహన్, రాజశేఖర రెడ్డిని నాయకుడు ఉపనాయకులుగా నియమించారు. ఇది సాఫీగా జరగలేదు. ఆ తరువాత విజయభాస్కరరెడ్డి తన శాసన సభా సభ్యత్వానికి రాజీనామా యిచ్చి, లోక్‌సభ స్థానాన్ని అట్టిపెట్టుకున్నారు. నాలుగు నెలలకే ముఖ్యమంత్రి పదవి పోగొట్టుకున్న వ్యక్తిపై సానుభూతితో కాబోలు, ప్రధాని ఇందిరాగాంధీ ఆయన్ను కేంద్రంలో మంత్రిని చేసింది. మదన్ మోహన్ నాయకత్వం బాగారెడ్డికి, చెన్నారెడ్డి అనుచరులలో యితరులకు యిష్టంలేదు. వారంతా తరచు డా.చెన్నారెడ్డి యింట్లో సమావేశాలు జరిపి, ఇందిరాగాంధీని విమర్శిస్తూ, మార్గాంతరాలు ఆలోచించసాగారు.

శాసన సభలోనూ, శాసన మండలిలో కూడా కాంగ్రెసువారు తెలుగుదేశాన్ని విమర్శించడం, దుయ్యబట్టడం మొదలుపెట్టారు. తరచు దీనివలన వారికే ఎదురు దెబ్బలు తగిలాయి కూడా.

ప్రజలలో కాంగ్రెసు పట్ల ఇంకా సానుభూతి తగ్గుతూ వచ్చింది. విజయభాస్కరరెడ్డి రాజీనామా చేసిన స్థానంలో ఉప ఎన్నిక జరిపితే, అదికాస్తా తెలుగు దేశానికి దక్కింది. అలాగే రామారావు రాజీనామా చేసిన తిరుపతిలో ఎలాగైనా గెలవాలని కాంగ్రెసువారు పడిన తిప్పలు యిన్నీఅన్నీ కావు. కాని తెలుగుదేశమే మళ్ళా నెగ్గింది. మదనపల్లిలో సరేసరి. ఎటొచ్చీ హిమాయత్ నగర్‌లో తెలుగుదేశం స్థానం కాస్తా బి.జె.పి.కి పోయింది. ఇక్కడ మళ్ళీ పట్టుదలతో పోటీచేసిన టి.లక్ష్మీకాంతమ్మకు డిపాజిట్ పోయింది. ఆ విధంగా కాంగ్రెస్‌ను ప్రజలు పూర్తిగా తృణీకరించారు. అయినా గుణపాఠం నేర్చుకోకుండా, చౌకబారు ఎత్తుగడలకే వారు పరిమితమయ్యారు.

## రామారావు ప్రభుత్వం ఎన్నాళ్ళు ?

ఈ ప్రశ్న కాంగ్రెసువారు వేసి, ప్రచారం చేసినట్టిదే, తొలుత ఒక నెల రోజులకంటె యిది. నిలవదన్నారు. తరువాత మూడు నెలల్లో పడిపోతుందన్నారు. ఇప్పుడు ఆర్నెల్లు గడువు యిచ్చామన్నారు. ఇలా మాట్లాడటానికి కారణం లేక పోలేదు. తెలుగుదేశం శాసన సభ్యులు అసంతృప్తితో ఉన్నారు గనుక, ఎన్నికలలో పెట్టిన ఖర్చు అయినా రాబట్టుకునే అవకాశం లేదు గనుక, అలాంటి వారిని ఒక వందమందిని కొనేస్తే సరిపోతుందని కాంగ్రెస్ వారి అంచనా. ఈ పగటి కలతోనే వారు గుసగుసలు ఆర్భాటం మొదలుపెట్టారు. కనుక కాంగ్రెస్ 'సంస్కృతి' ఎలా పనిచేస్తున్నదీ అవగాహన చేసుకోవచ్చు. పార్టీల మార్పిడి నిషేధం బిల్లును కేంద్రం చేపట్టదని వారికి బాగా తెలుసు. తెలుగుదేశం చేసే తప్పులపై ఆధారపడి, మళ్ళీ అధికారంలోకి వద్దామని వారి ఆశ, అంటే అమ్ముడుపోయే శాసన సభ్యులు వుంటే, కొనడానికి కాంగ్రెస్ వారు సిద్ధంగా వున్నారన్న మాట!

ఒకవేళ కొనడానికి వీలున్నా, డబ్బెక్కడిది? అదొక సమస్య కాదని అనేక ఆధారాలు చూపుతున్నారు. హైదరాబాద్‌లో ఇన్నాళ్ళు కాంగ్రెస్ "సంస్కృతి" చలవతో పనులు చురుగ్గా చేసుకుంటున్న వ్యాపారస్తులు, కంట్రాక్టర్లు, హొటల్ యజమానులు, ఫ్యూడల్ ముస్లింలు, మార్వాడీలు, ఉత్తరాది నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడినవారు చందాలివ్వడానికి సిద్ధంగా వున్నారట. వీరికి తెలుగుదేశం ప్రభుత్వంలో పనులు జరగకపోవడమే యిందుకు కారణం. అదీ కాకుంటే మళ్ళీ ప్రత్యేక తెలంగాణా అని నినాదం యిస్తామన్నారు. అనడమే కాదు, సంజయ్ విచార్ మంచ్ శాసనసభ్యుడు ప్రకాశరావు ద్వారానూ, తెలంగాణా ఉద్యోగుల సంఘ నాయకుల పేరిటా, ఇది మొదలైంది. కాని ప్రజలలో యీ నినాదం పట్ల ఏమాత్రం ఆకర్షణ లేకపోవడంతో తాత్కాలికంగా అది విరమించారు. తెలంగాణాకు నీళ్ళవిషయమై ఆందోళన చేయాలన్నప్పటికీ, కొత్త పథకాలు చేబట్టడంతో అదీ వీలుకాలేదు. ఇక మిగిలింది ఢిల్లీ మాత్రమే. అయితే రాష్ట్ర కాంగ్రెస్ నాయకులపై ఢిల్లీకి నమ్మకం బాగా సడలింది. అన్ని విధాలా నిరుత్సాహంతో ఏమీ తోచక, పైరవీలు సాగక కాంగ్రెసువారు మార్గాంతరాలు అన్వేషిస్తున్నారు. రాష్ట్ర కాంగ్రెసు నాయకులు ఒక వైపు యిలా ఆలోచిస్తుండగా, ఒక్కొక్క జిల్లా పరిషత్తు వారి నుంచి జారిపోతున్నది. కృష్ణా జిల్లాలో దీనికి నాంది పలికింది. నెల్లూరు, మహబూబ్‌నగర్, ప్రకాశం జిల్లాలు తెలుగుదేశానికి మారాయి. మిగిలినవి ఎలా వుంటాయో తెలియని స్థితి ఏర్పడింది.

రాష్ట్ర కాంగ్రెసుకు మిగిలింది ఒక శాసనమండలి మాత్రమే, కొందరు 'కీలక' వ్యక్తులు ముఖ్యమంత్రిని కలిసి, కౌన్సిల్ రద్దు చేసే తీర్మానం పెట్టకపోతే తాము కాంగ్రెసు నుంచి బయటకు వచ్చి ఇండిపెండెంట్లుగా వుంటామన్నారు. కాని ముఖ్యమంత్రి అంగీకరించలేదు. అంతటితో కొందరు విజృంభించి నోటికొచ్చినట్లు ఔచిత్యం తప్పి మాట్లాడారు. కానీ అదీ పనిచేయ లేదు. కౌన్సిల్ అవసరాన్ని ప్రధాని సూచన ప్రాయంగా చెప్పింది. త్వరగా రద్దు చేయమని ముఖ్యమంత్రి ఆమెను కోరారు. లోగడ పశ్చిమ బెంగాల్‌లో అడిగితే, లోక్‌సభలో ప్రవేశపెట్టిన రద్దుకు అంగీకరించారు. ఆంధ్రప్రదేశ్‌లో రద్దుకు ఒప్పుకోకపోతే విచక్షణ చూపినట్లే, మాకొద్దీ కౌన్సిల్ అంటుంటే, బలవంతాన కేంద్రం అట్టిపెడుతుందా? కౌన్సిల్‌లో సుంకర సత్యనారాయణ తొలుత ఇండిపెండెంటుగా మారి, తరువాత తెలుగుదేశంలో చేరారు. కృష్ణా జిల్లా పరిషత్తు అధ్యక్షుడుగా ఆయన ఎన్నికైన తరువాత కౌన్సిల్‌కు రాజీమానా యిచ్చారు. మరికొందరు కౌన్సిల్ వారు కూడా తెలుగుదేశానికి మద్దత్తు ప్రకటించారు. కౌన్సిల్ భవిష్యత్తు అనుమానాస్పద ధోరణిలో పడింది.

తెలుగుదేశ ప్రభుత్వం ఏర్పడక ముందే, ఎన్నిక జరగబోయే ముందు ముగ్గురికి 1983 జనవరి 3న కౌన్సిల్ సభ్యత్వం లభించింది. సూరాబత్తుని నాగేశ్వరరావు, ఎం.ఆర్.శ్యాంరావు, వై.ఖురేషీలకు ఈ అదృష్టం ప్రాప్తించింది.

ముగ్గురినీ ముఖ్యమంత్రి విజయభాస్కర రెడ్డి సిఫారసు చేయగా, గవర్నర్ నియమించారు. ఇందులో వై.ఖురేషీ అనే వ్యక్తి విజయభాస్కర రెడ్డి ఆంతరంగిక మిత్రుడు కావడమే అర్హత అని భావించారు.

కౌన్సిల్ రద్దు తీర్మానాన్ని తెలుగుదేశంతోపాటు, ప్రతిపక్షాలన్నీ బలపరచగా కాంగ్రెస్(ఐ) మాత్రం వాకౌట్ చేసింది. బి.జె.పి. వారు అఖిల భారత స్థాయిలో యీ విషయం చర్చించాలనే విచిత్ర వాదన లేవనెత్తారు. కౌన్సిల్‌లో వారి సభ్యులు పోతారని భయపడటమే అసలు కారణం.

## తెలుగుదేశ ప్రభుత్వ చర్యలు

తెలుగుదేశ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం తొలి శాసనసభా సమావేశం 1983 జనవరి 17న జరిగింది. ఎన్.టి.రామారావు అసెంబ్లీలో ప్రవేశించగానే తెలుగుదేశం శాసనసభ్యులు లేచి అభివాదం చేసే కొత్త సంప్రదాయం మొదలైంది. రామారావు అసెంబ్లీ ప్రాంగణంలోనూ, లోపలా కూడా ప్రతిపక్షం వారిని కలసి కరచాలనం చేశారు.

తాత్కాలిక స్పీకర్‌గా నారాయణస్వామి సభాపతి స్థానంలో వుండి, తంగి సత్యనారాయణ ఏకగ్రీవ ఎన్నికను జరిపించారు. లోగడ స్వతంత్ర పార్టీ శాసన సభ్యుడుగా ఐదేళ్ళపాటు వున్న తంగి సత్యనారాయణ శ్రీకాకుళంలో న్యాయవాది.

మళ్ళీ మార్చి 9న జరిగిన అసెంబ్లీ సమావేశంలో తాత్కాలిక బడ్జెట్‌ను నాదెండ్ల భాస్కరరావు ప్రవేశపెట్టారు. అప్పటికే తెలుగుదేశం ప్రభుత్వం చాలా చర్యలు తీసుకున్నది. ఆ సమావేశంలో అదిలాబాద్‌కు చెందిన భీమ్‌రెడ్డిని డెప్యూటీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రామారావు అనేక చర్యలు ప్రారంభించాడు. వాటిలో చాలా భాగం కాంగ్రెసు (ఐ) వారు తలపెట్టి విఫలమైనవే.

ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా రెండు పర్యాయాలు ఢిల్లీ వెళ్ళి వచ్చారు. ఫిబ్రవరి మొదటి వారం (1983)లో ఢిల్లీ వెళ్ళినప్పుడు ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. అప్పటికే జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో వచ్చిన ప్రచారం రేడియో, టెలివిజన్ ప్రసారాలు యిందుకు దోహదం చేశాయి.

ప్రెస్ క్లబ్ సమావేశం, తెలుగువారి నుద్దేశించి, బహిరంగ సభ చాలా ఘనతను తెచ్చిపెట్టాయి. అలాగే బెంగుళూరు వెళ్ళినప్పుడు కూడా గొప్ప స్వాగతం లభించింది.

ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో ఎక్కడ పర్యటించినప్పటికీ ప్రజలు తండోపతండాలుగా వస్తూనే వున్నారు. కాంగ్రెసు వారు రామారావును విమర్శిస్తున్నా ఆయన మాత్రం వారిని గోంగూరలో పురుగువలె ఏరిపారేశాడే తప్ప, ఎవరికీ వ్యక్తిగతంగా సమాధానం చెప్పలేదు.

కాని, పంజాబ్ నుంచి అప్రతిష్ఠతో గవర్నర్ పదవి వదలి వచ్చిన డా. చెన్నారెడ్డికి మాత్రం రామారావు విందు యిచ్చాడు. రామారావును ఇంతవరకూ బయటపడి విమర్శించలేదు. సరిగదా, తనవారిని కూడా కొంతకాలం మౌనం వహించమని సలహా ఇచ్చినట్లు తెలిసింది. బహుశ విదేశ యాత్రానంతరం చెన్నారెడ్డి తన పథకాన్ని బయటపెట్టవచ్చు.

మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి రెండు పర్యాయాలు రామారావును సమర్థిస్తూ ప్రకటనలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి బెజవాడ గోపాల రెడ్డి, మాజీ మంత్రి అయ్యపురెడ్డి కూడా రామారావు పాలనను సమర్థించారు.

ప్రతిపక్ష నాయకులను ఢిల్లీలో కలసిన రామారావు 1983 మే 26న విజయవాడలో సమావేశానికి రావలసిందిగా వారిని ఆహ్వానించాడు. బి.జె.పి. నాయకుడు వాజ్‌పేయి ఒక ప్రకటన చేస్తూ, దక్షిణాదికి ప్రధాని పదవి దక్కాలనడం రామారావును దృష్టిలో పెట్టుకునే అనే వ్యాఖ్యానాలు వినిపించాయి.

విదేశాల నుంచి తెలుగువారు వచ్చి రామారావుకు ఆహ్వానాలు అందజేశారు.

తెలుగుదేశం ముఖ్యమంత్రి రామారావుకు పైన ఎవరూ లేరు. ఆయన ఎవరినీ చూసి భయపడనక్కరలేదు. డబ్బు వసూలు చేసి పంపనక్కరలేదు. సిఫారసులకు ఢిల్లీ నుంచి ఫోనులు చేసేవారు లేరు. ఇంతవరకు చాలా పెద్దమార్పు అనవచ్చు. ఇన్నాళ్ళూ ఇందిరాగాంధీ చుట్టూ అధికార రాజకీయం వుండగా, ఇప్పుడు రామారావుకు అది సంక్రమించింది. ఢిల్లీ నుంచి రంగం హైదరాబాదుకు మారింది.

పొదుపుగా వుంటామని, ఆడంబరాలకు పోమని, సన్మానాలు చేయించు కోమని రామారావు ప్రకటించారు. ఒకటి రెండు మినహాయింపులు వున్నప్పటికీ మొత్తం మీద యీ విషయాలను పాటించారు. ప్రజల దృష్టిలో వీరిపట్ల గౌరవం పెరిగింది. జుగుప్సాకరమైన పొగడ్తల సభలు, దండలు, విందులు, సన్మానపత్రాలు లేకుండా హాయిగా వున్నది.

హైదరాబాద్‌లో అప్పుడు రామకృష్ణ థియేటరు పక్కనే సొంత యింట్లో వున్న రామారావు లేక్ వ్యూ గెస్ట్ హౌస్.కు మారాలని నిర్ణయించుకున్నారు. ఫోను ఏర్పాటు జరిగింది, పాలు పొంగించారు. ఇంతలో జనతా నాయకుడు జయపాల్ రెడ్డి మొదలైనవారి విమర్శలతో ఆ ప్రయత్నం విరమించారు. ఆబిడ్స్‌లో ఆయన వుండడం చాలామందికి యిబ్బందే. ఇరుకైన ప్రదేశం కావడం వలన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.

రామారావు తెల్లవారుజామున లేచి, కసరత్తు చేసి, ఆహారం స్వీకరించి ఉదయం 5 గంటల నుంచే కార్యాలయం పని ప్రారంభిస్తారు. అధికారులకు హైదరాబాద్ అలవాట్లు ఉన్నవారికి యిది బాధాకరమే అయినా క్రమేణా అలవాటు పడ్డారు. లోగడ అయితే అల్పాహారానంతరం ఒక లంక పొగాకు చుట్ట వూదేసేవారు. ఇప్పుడు అదీ లేదు. మొదటి నుంచీ క్రమశిక్షణకు అలవాటు పడిన వ్యక్తి గనుక మిగిలినవారు ఆయన పద్ధతులకు సరిపెట్టుకునేవారు. ఇప్పుడూ అంతే.

## తెలుగుదేశం సాధించింది

శాసన సభ్యులు కాంగ్రెసు (ఐ) రాజ్యంలో జీతాలు, భత్యాలు, సౌకర్యాలు విపరీతంగా పెంచుకున్నారు. ప్రజాసేవ చేయటానికి ముందు తమ సేవ తాము చేసుకొన్నారు. ఇలా జీతాలు పెంచుకొంటున్నప్పుడు ప్రతిపక్షాలవారు వద్దని హెచ్చరించారు. అప్పటిలో కాంగ్రెసు వారికి ఎదురులేని బలం వున్నందువలన వారి మాటే చెల్లింది. హైదరాబాదులో క్వార్టర్లు గదులు వారి నిమిత్తం కట్టించి యిచ్చారు. బస్సుల్లో, రైళ్ళలో ప్రయాణం చేయడానికి కుటుంబాలతో సహా ఉచిత పాసులు కల్పించారు. పోనీ ఇన్ని సౌకర్యాలు ఏర్పరచినా వాటిని సద్వినియోగం చేశారా అంటే అదీ లేదు. చివరకు ఎం.ఎల్.ఏ. క్వార్టర్స్‌పై పోలీసులు దాడిచేసి పేకాటాడేవారిని పట్టుకున్నారంటే వీరి చర్యలు ఏ స్థాయికి పోయాయో వూహించు కోవచ్చు. కొద్దిమందిని మినహాయిస్తే చాలామంది శాసనసభ్యులు ప్రజలను మర్చిపోయి తమ వళ్ళు కూడా మర్చిపోయేటట్లు ప్రవర్తించారు.

తెలుగుదేశం అధికారంలోకి రాగానే రామారావు శాసనసభలో ఒక బిల్లు ప్రవేశపెట్టి శాసనసభ్యులకు పెన్షన్ ఇచ్చే పద్ధతిని రద్దు చేశారు. అంతేగాక శాసనసభ లేని సమయాల్లో తమ పార్టీ శాసనసభ్యులు నియోజక వర్గాలలో తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదించాలన్నారు.

## 58 నుంచి 55 వరకు

డా. చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా దిగిపోను కూడా యితర కారణాల ప్రభావం వల్ల అంతవరకూ 55 సంవత్సరాలకు రిటైర్ అవుతున్న ఉద్యోగుల కాలపరిమితిని 58 సంవత్సరాలకు పెంచారు. ఇందులో కొందరు ఇంజనీర్లు ప్రముఖ పాత్ర వహించారని అనుకొన్నారు. రిటైరు కాబోయేవారికి మూడేళ్ళ వూపిరి వచ్చింది. ప్రమోషన్ రాబోయేవారు నిరుత్సాహపడి తేరుకొనేలోపల మూడేళ్ళు గడిచి వాళ్లు రిటైర్ అయ్యారు. ఈ పరిస్థితులలో యువకులు నిరుత్సాహ పడ్డారు. 58 సంవత్సరాలున్నా 55 సంవత్సరాలున్నప్పటికీ ఉద్యోగస్తులు చాలామంది ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎలా ప్రవర్తించాలో తెలియని స్థితిలోనే ఉన్నారు. బ్రిటిష్ కాలంనాటి పరిపాలనలో ప్రజలపట్ల ఎలా వ్యవహరించారో యిప్పుడూ అలాగే నడుస్తున్నారు. ప్రజల డబ్బుతో ప్రజల పనులు చేయడానికి ఉద్యోగాలలోకి వచ్చామనే విషయం వారికి ఏ కోశానా గుర్తుండటంలేదు. ప్రజల్లో ఉద్యోగులపై సానుభూతి లేదు. వాటన్నిటిని దృష్టిలో పెట్టుకొని తెలుగుదేశం ప్రభుత్వం ముందుగా క్రమశిక్షణతో వ్యవహరించమని ఉద్యోగులను ఆదేశించింది. అంటే వచ్చేపోయే వేళలను పాటించమని నియమిత నిర్ణయాలు తప్ప మిగిలినప్పుడు ఆఫీసుల నుండి బైటకి వెళ్ళవద్దని, ఫైళ్ళు త్వరగా పరిష్కరించాలని చెప్పారు. చీటికి మాటికి తమ హక్కులకై సమ్మెలు చేయడం, కాంగ్రెసు రాజ్యంలోగా వీరికి ఆనవాయితీ అయిపోయింది. చివరకు రాజకీయాలలో గూడా తలదూర్చి ఆందోళనలో పాల్గొన్న సందర్భాలు లేకపోలేదు. రామారావు వచ్చిన తరువాత మళ్ళీ 55 సంవత్సరాలకు రిటైర్ అయ్యే పద్ధతిని ప్రవేశ పెట్టాడు. ఆఫీసు వేళలు పాటిస్తున్నారు. దీన్ని కూడా కొందరు ఉద్యోగులు నిరసించక పోలేదు. సచివాలయంలో అయితే "తమని జైల్లో పెడుతున్నారని, నిర్బంధంగా పని

చేయమంటున్నారని" వ్యాఖ్యానించిన వారు లేకపోలేదు. వయోపరిమితి తగ్గించడాన్ని త్యాగం చేస్తూ సుప్రీం కోర్టుకు వెళ్ళి నప్పటికీ 'స్టే' రాలేదు.

## ఆస్థాన అగ్రహారాలు

అంజయ్య ముఖ్యమంత్రిగా ఉండగా రకరకాల వ్యక్తులను ఆస్థానంలో వేయించి మళ్ళీ ఫ్యూడలిజాన్ని జ్ఞప్తికి చేశారు. అంతకుముందు ఒక ఆస్థానకవి మాత్రం ఉండేవారు. దాశరథి ఆస్థానకవిగా అంజయ్యదే అసలైన తెలుగంటూ ముఖం వాచేటట్లు పొగడటమే వృత్తిగా పెట్టుకొన్నారు. మిగిలినవారు కూడా ప్రభుత్వం ఇచ్చే సౌకర్యాలు అనుభవిస్తూనే తమ తమ కళల ఆధారంగా సంపాదించుకొంటున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అలాంటి ఆస్థానకవులను రద్దు చేసింది. శ్రీమతి సుబ్బలక్ష్మితో సహా అందరూ, హర్షించగా ఒక్క దాశరథి మాత్రం వాపోయారు.

## స్త్రీల హక్కులు

తెలుగుదేశం ప్రభుత్వం వారసత్వపు ఆస్తిలో కుమారులతోపాటు కుమార్తెలకు కూడా సమానహక్కు లభించేటట్టు బిల్లు ప్రవేశపెట్టాడు. దీన్ని సెలెక్టు కమిటీకి పంపించారు. దేశం యావత్తు ఈ ప్రతిపాదనను ఆహ్వానించగా కేంద్రంలో మంత్రిగా ఉన్న శివశంకర్ విమర్శిస్తూ భూ సంస్కరణలు దెబ్బతీయటానికి యిది ప్రవేశపెట్టారని అన్నారు. చాలామంది స్త్రీలు శివశంకర్ ధోరణిని నిరసించారు. అంతటితో అతడు తన ధోరణిని మార్చుకోవలసి వచ్చింది.

తిరుపతిలో పద్మావతి స్త్రీల విశ్వవిద్యాలయాన్ని1983 ఏప్రియల్ 14వ తేదీ స్థాపిస్తున్నట్లు యన్.టి.రామారావు ప్రకటించారు. అంతకు ముందు ఆవుల సాంబశివరావు అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించి మహిళా విశ్వవిద్యాలయం ఎట్లా ఉండాలో పరిశీలింపజేసి నివేదిక తెప్పించారు. తదనుగుణంగా శ్రీమతి వనజ అయ్యంగార్ స్పెషల్ ఆఫీసరుగా మహిళా విశ్వవిద్యాలయం ఒక ఆర్డినెన్స్ ద్వారా రూపొందించింది. ఇది రెసిడెన్షియల్ యూనివర్సిటీ, తెలుగుదేశం ఎన్నికల ప్రణాళిక యిచ్చిన హామీని నెరవేర్చింది.

## పుట్టగొడుగు కార్పొరేషన్లు

అంజయ్య కాలంనాటికి కార్పొరేషన్లు పుట్టగొడుగుల వలె పెరిగిపోయాయి. ఆశ్రితులకు, భజనపరులకు పదవులు కల్పించి సౌకర్యాలు యిచ్చి ప్రైవేటు సామ్రాజ్యాన్ని రూపొందించుకోవటంలో కార్పొరేషన్.లకు సాటిలేదు. అనేక సంస్థలు నష్టాలకు గుర్తై అవినీతి నిలయాలుగా మారాయి. తెలుగుదేశం రావటంతో వీటన్నిటిని కుదిరిన అధికార కాంగ్రెస్ ఛైర్మనులను ఇండ్లకు పంపింది. పరిపాలన సౌకర్యం కోసం కొన్ని కార్పొరేషన్లు మిళితం చేశారు. కొన్నిటిని రద్దుచేశారు. ప్రజలు హాయిగా ఉంటున్నట్లు భావించారు.

## శాసనమండలి రద్దు

1958లో అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని బట్టి రాష్ట్రానికి శాసనమండలి ఏర్పాటు చేస్తూ పార్లమెంటు ఆమోదించింది. కాంగ్రెసువారికి ఇదొక అనాథ శరణాలయంలా తోడ్పడింది. ఎన్నికలలో ఓడిపోయినవారికి, భర్తలను కోల్పోయినవారికి స్థానాలు కల్పించటం చారిత్రక సత్యం. రానురాను ప్రజలు ఎన్నుకొన్నవారికి గౌరవం లేకపోగా పరోక్షంగా వచ్చిన కౌన్సిల్ సభ్యుల పెత్తనం పాతుకపోయింది. ఒక స్థాయికి వచ్చేసరికి శాసనసభలను కాదని కౌన్సిలులో ఉన్నవారికే ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారు. మరికొందరికి ముందు మంత్రి పదవులు యిచ్చిన తరువాత కౌన్సిలులో సభ్యత్వం కల్పించారు. సమాజంలో వివిధ వృత్తి నిపుణులు, మేధావులు యిలాంటి కౌన్సిళ్ళలో వుంటూ సలహాలను అందించాలని తొలుత వీటిని ఏర్పరచారు. కాని అది ఎన్నడూ జరగలేదు. తెలుగుదేశం ప్రభుత్వం కౌన్సిల్.ను రద్దుచేయాలనే తీర్మానం ఆమోదించి, పార్లమెంటుకు పంపింది.

## ప్రభుత్వ డాక్టర్ల ప్రైవేటు ప్రాక్టీసు

లోగడ కాంగ్రెసువారు ఒక పర్యాయం ప్రభుత్వ డాక్టర్లు ప్రైవేటు ప్రాక్టీసు రద్దు చేశారు. కాని కాంగ్రెసు వారికి చిత్తశుద్ధి లేదు. కనుక ఇది అమలు జరగలేదు. క్రమేణ రద్దు తొలంగించారు. ఇలాంటి నిషేధం అవసరమని ఆల్ ఇండియా మెడికల్ కౌన్సిల్, కేంద్రప్రభుత్వం వివిధ డాక్టర్ల సంఘాలు కోరాయి. తీరా తెలుగుదేశం ప్రభుత్వం దీనిని అమలు పరచేటప్పటికి లోకం యావత్తు మునిగిపోతున్నట్లు కొందరు డాక్టర్లు వాతావరణాన్ని సృష్టించారు. హైకోర్టుకు వెళ్ళి 'స్టే' తెచ్చుకున్నారు. మరి కొందరు డాక్టర్లు రాజీనామా యిచ్చి ప్రైవేటు ప్రాక్టీసునే కొనసాగించారు. జరగవలసిన దేమంటే ఆసుపత్రుల సమీపంలో డాక్టర్‌లకు నివాస గృహాలు నిర్మించి, వారు ఎప్పుడూ రోగులకు అందుబాటులో ఉండేటట్టు చేయాలి.

## కాపిటేషన్ ఫీజు రద్దు

కాంగ్రెసు రాజ్యాలలో ప్రయివేటు ఇంజనీరింగు, మెడికల్ కాలేజీలు చాలా పుట్టాయి. కొందరు రాజకీయవాదులు మరికొందరు వ్యాపారస్థులు విద్యార్థులను ఉద్ధరిస్తామనే పేరుతో  కళాశాలల పేరిట కోట్ల ధనం వసూలు చేసి తమ పలుకుబడిని పెంచుకొన్నారు. విచిత్రం ఏమిటంటే ప్రైవేటు మెడికల్ కాలేజీలు పనికిరావంటూ కాకినాడలో, వరంగల్ లో వున్న మెడికల్ కాలేజీలను స్వాధీనం చేసుకొన్న కాంగ్రెసు వారే వీటిని అనుమతించారు. కులాలవారీగా ఈ కళాశాలలు తలెత్తాయి. ఇందులో కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య, రాజులు ప్రముఖస్థానం వహించారు.

తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ కళాశాలలో ప్రవేశానికి కాపిటేషన్ ఫీజు వసూళ్ళను రద్దు చేసింది. ప్రైవేటు యాజమాన్యాలు బ్లాక్ మెయిల్ చేస్తూ కాంగ్రెసు రాజ్యంలో చెలామణి అయ్యాయి. కాని రామారావు లొంగలేదు.

## ఐ.ఎ.ఎస్. ఆటలు

ఐ.ఎ.ఎస్. అధికారులు సర్వజ్ఞులమనీ, తామే  ప్రభుత్వాన్ని నడిపిస్తున్నామనీ భావిస్తున్నారు. కేంద్రం నుంచి రాష్ట్రం వరకూ వారికి ఎన్నో ఆయువుపట్లు తెలుసు. ఇదొక ప్రత్యేకమైన కులంగా, ట్రేడ్ యూనియన్‌గా మారింది. కాంగ్రెసు రాజ్యంలో ఐ.ఎ.ఎస్. వారి జోలికి పోవాలంటే ఒక పట్టాన సాధ్యమయ్యేది కాదు. మహా అయితే ట్రాన్స్‌ఫర్ చేసేవారు. మన రాష్ట్రంలో ప్రస్తుతం 297 మంది ఐ.ఏ.ఎస్. అధికారులున్నారు. వీరిలో కొందరు విదేశాలలోనూ, మరికొందరు ఇతర రాష్ట్రాలలోనూ లేకపోలేదు. వీరు ఆధునిక సామ్రాజ్యాలను ఏలుతున్నారంటే ఆశ్చర్యంలేదు. మంత్రులు సహితం వీరి చెప్పుచేతల్లో నడుచుకోక తప్పటంలేదు. భవనం వెంకట్రామ్ ముఖ్యమంత్రిగా ఉండగా సింగరేణి కాలరీస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న సంతానంపై అవినీతి ఆరోపణలు రాగా ఇవి రామిరెడ్డిని విచారణ నిమిత్తం నియమించారు. ఆ మాత్రానికే సంతానం చాలా హడావిడి చేశారు. ఆ తరువాత విచారణ నివేదిక రాగా తెలుగుదేశం ప్రభుత్వం యస్.సంతానాన్ని సస్పెండ్ చేసింది, (23-2-1982) దీనివలన  సెక్రటేరియట్ లోనూ, ఇతర చోట్లా ఐ.ఏ.ఎస్. అధికారులలో రెండు ముఠాలుగా చీలిక ఏర్పడింది. ప్రధాని సెక్రటేరియట్‌లో పనిచేస్తున్న రాజమణి, త్రిపుర సర్వీసుకు వెళ్ళిన శంకరన్ కత్తిగట్టి, సంతానంపై సస్పెన్షన్ రద్దు చేయించాలని ప్రయత్నించారు. పదిమంది ఐ.ఏ.ఎస్. అధికారుల సంతకాలు సేకరించి ఒక లేఖను అహ్మద్ ఐ.ఎ.ఎస్.కు పంపారు. కె.యస్.ఆర్.మూర్తి మొదలైనవారి సంతకాలు సేకరించి ఆ తరువాత ఉత్తరాన్ని ప్రధానకార్యదర్శిగా ఉన్న బి.ఎన్.రామన్‌కు అందజేయమన్నారు. కాని అహ్మద్ అలాంటిదేమీ చేయకుండానే ఆ ఉత్తరాన్ని రామన్‌కు ఇచ్చివేశారు.  విషయం అంతటితో ఆగకుండా ఇంకొంచెం ముదురు పాకాన పడింది. ప్రధాన కార్యదర్శి రామన్‌పై బ్రాహ్మణ ఐ.ఎ.ఎస్. అధికారిగా రాజీనామా చేసి వెళ్ళిన సి.ఎన్.శాస్త్రి కూడా రంగంలోకి దిగాటరంటారు. ఆయన ఇంటిపై ఎ.సి.బి.వారు దాడి చేయగా చాలా విలువైన పత్రాలు, సొమ్ము లభించింది. బ్రాహ్మణేతరులు రామన్‌ను కోపువేసుకోగా పరిపాలనలో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవటం ప్రారంభమయింది. హైదరాబాదు మునిసిపాలిటీ స్పెషల్ ఆఫీసరుగా ఉన్నపరేఖ్‌ను బదిలీ చేస్తే ఆయన తనకు ముందు ఆఫీసరుగా పనిచేసిన అర్జునరావుపై అనేక ఆరోపణలు చేశాడు. అందుకుగాను అతడిపై పరువునష్టం దావా వేసేందుకు అర్జున్ రావుకు తెలుగుదేశం ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

ఎన్.కె. మురళీధర్ అనే మరొక ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ అవినీతిపనులకు తలడ్డాడని ఆరోపణలవలన ఆయన్ని కూడా రామారావు ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

ఎన్.టి. రామారావు కార్యదర్శిగా శ్రావణ్ కుమార్, మరొక కార్యదర్శిగా మోహన్ కందా ఉన్నారు. వీరిరువురి ద్వారానే ఫైల్స్ అన్నీ వెళ్ళవలసి ఉంటుంది. ఇద్దరూ కమ్మ కులానికి చెందినవారు కారు. ఒకరు బ్రాహ్మణులు కాగా మరొకరు కాయస్థులు. ప్రధాన కార్యదర్శి రామన్ బ్రాహ్మణుడు కాగా రాజకీయ కార్యదర్శి అర్జున్ రావు హరిజన్. మే నెలలో ఆయన్ను హెూం కార్యదర్శిగా బదిలీ చేశారు. మిగిలిన సిబ్బంది ఎవరికీ ఫైల్స్ అందుబాటులో ఉండటంగాని, నిర్ణయాలు తీసుకోటం గాని జరగదు. అలాగే ఆర్థిక కార్యదర్శి కె. మాధవరావు హరిజన్, విద్యాశాఖ కార్యదర్శి కె.యస్.ఆర్.మూర్తి హరిజన్, కీలకమైన ఏ స్థానంలో కూడా కమ్మ ఐ.ఎ.ఎస్. ఆఫిసర్లు లేకపోవడం గమనించాలి. అయితే ప్రచారం మాత్రం సాగిపోతూనే ఉన్నది. కొందరు కమ్మ అధికార్ల వీరవిహారం ఇందుకు కారణం. అలాగే అనధికార కమ్మవారి ప్రవర్తన కూడా దోహదం చేసింది.

## ఐ.పి.యస్. కర్రపెత్తనం

ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయినప్పుడు ఎస్.ఆనందరామ్ డి.జి.పి.గా ఉన్నారు. టంగుటూరులో రైతులపై కాల్పులు జరిపినప్పుడు, కడప జిల్లాలో శివారెడ్డి అనే ఎం.ఎల్.ఎపై దాడి జరిగినప్పుడు శాసనసభలో పెద్ద గొడవయింది. డి.జి.పి. ఆనందరామ్ ముఖ్యమంత్రి కోరినప్పటికీ పోలీసువారి ప్రతిష్ఠ పోతుందనే నెపంతో సంఘటనలకు దారితీసిన అధికారులను బదిలీ చేయడానికి నిరాకరించారు. అది పోలీసు మనస్తత్వం. ప్రజలను పిట్టలవలె కాల్చి ఆ తరువాత కప్పిపుచ్చుకోటానికి వారు చేసే ప్రయత్నం అంతా ఇంతా కాదు. కనక ఆనంద రామ్ సెలవుపై పోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆయన స్థానంలో కె.బి.ఎరాడేని డిజిపిగా నియమించారు. మన రాష్ట్రంలో 143 మంది ఐపియస్ అధికారులు ఉన్నారు. వీరిలో కొందరు పోలీసు వృత్తిని మరచిపోయి ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేస్తున్నారు. అలా ఎందుకు అనుమతిస్తారో అర్థం కాలేదు. అదలా ఉంచి ఈ పోలీసు ఉద్యోగులు ప్రజలకు సంబంధం లేకుండా చిన్న ఉద్యోగులపై పెత్తనం చలాయిస్తూ ఉంటారు. వీరిలో కొందరు రాజకీయ నాయకులతో సంబంధాలు పెట్టుకొని కాంగ్రెసు రాజ్యంలో స్వైర విహారం చేశారు. అలాంటి వారిలో పి.వి.పవిత్రన్ ఒకరు. తెలుగుదేశం ప్రభుత్వం ఆయన్ని సస్పెండ్ చేసింది.

రాష్ట్రంలో కీలకమైన మరొక స్థానం గూఢచారి విభాగం వారిది. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినప్పుడు కె.విజయరామారావు దీనికి అధిపతిగా ఉండేవాడు. తరవాత ఆయనను చంద్రశేఖర్ స్థానే రాజధాని పోలీసు కమీషనర్.గా నియమించారు. రాజకీయాలతో అంతగా పరిచయం లేని సుబ్రహ్మణ్యంను గూఢచారి విభాగాధిపతిగా తెచ్చారు. వి.అప్పారావును అవినీతి నిరోధక శాఖలో అడిషనల్ డైరెక్టర్.గా నియమించారు. న్యాయమూర్తి పి.ఎ.చౌదరి కుమారుడు గౌతమ్.ను ముఖ్యమంత్రి రక్షణాధికారిగా నియమించారు. వీరిరువురూ కమ్మ కులానికి చెందినవారు, కనక రామారావుకు కమ్మ అభిమానమున్నదని ప్రచారం చేయటానికి ఆస్కారం ఏర్పడింది.

## తిరుపతి దేవస్థానం నిధులు

ఎన్.టి.రామారావు భక్తుడని అందరికీ తెలిసిందే. ఆయన తన భక్తిని దాచుకోకుండా సెక్యులరిజాన్ని ప్రదర్శిస్తున్నారు. తెలుగుదేశం ఎన్నికల ప్రచారంలో కూడా రుద్రాక్షమాల పట్టుకొని తిరిగాడు. తరవాత అన్ని మతాలవారినీ ఐక్య పరచటానికి ప్రయత్నిస్తానని ఒక అలౌకిక ప్రకటన చేశాడు. కంచి కామకోటి పీఠాధిపతిని భార్యా, కుమారుడు, అల్లుడు సమేతంగా వెళ్ళి దర్శించాడు. హెలీకాప్టర్.లో భార్యాసమేతంగా భద్రాచలం శ్రీరామనవమికి వెళ్ళారు. ఢిల్లీ వెళ్ళినప్పుడు దేవాలయాలు దర్శించి తనకు కృష్ణుడు పాత్రే ఇష్టమని చెప్పారు. అలాంటి రామారావు అరమరికలు లేకుండా, తిరుపతి దేవస్థాన నిధులను ప్రజా సంక్షేమం కోసం వాడే నిమిత్తం ప్రభుత్వ ఖజానాలో పెట్టాలన్నాడు. దీనికి చాలామంది నాలుక కోసుకుంటామన్నారు. పిలకలు పీకేసుకుంటా మన్నారు. కానీ రామారావు జంకలేదు. మానవసేవే మాధవ సేవ అయినప్పుడు ఆ నిధులను ఎందుకు వాడరాదని అడిగాడు.

అయినప్పటికీ సెక్యులర్ రంగంలో మాత్రం రామారావు ఆధునికతకు చాలా దూరంగా ఉన్నాడనే చెప్పాలి. ముఖ్యంగా పదవిలో వున్న వ్యక్తి తన భక్తి ప్రపత్తులను వ్యక్తిగతంగా ఉంచుకోవాలి. ఇందిరాగాంధీ మొదలు డా.చెన్నారెడ్డి వరకూ ఆమాటకొస్తే టి. అంజయ్యదాకా భక్తి పేరుతో తమ పదవులను దుర్వినియోగం చేశారు. అధికార యంత్రాంగాన్ని తమ వ్యక్తిగత ఇష్టాఇష్టాలకు వాడారు. చేతులు చూసే వారు చెప్పినట్లు విని నిర్ణయాలు తీసుకున్నారు. రామారావు కూడా ఇంచుమించు ఆ ధోరణిలోనే నడిచాడు. సంసార లంపటత్వంలో చికాకులు పడలేక బయటపడదామనుకున్న రామారావు కాషాయ వస్త్రాలు ముందుగానే కుట్టించి ఉగాదినాడు తిరుపతిలో సినిమా ఉత్సవంలో ఈ విషయం ప్రకటించాడు. భార్యకు దూరంగా ఉంటానని విలేఖరులకు చెప్పాడు. మాంసాహారాన్ని మానివేశానని ఇందిరాగాంధీకి చెప్పాడు. హైదరాబాద్ నాచారం వద్ద కుటీరం వేసుకుని ఉంటానని ప్రకటించాడు. ఆస్థలంలో గుడిసెలు వేయించాలనే కాంగ్రెసు వారి ఎత్తుగడ దెబ్బతిన్నది. సన్యాసం అనేది బాధ్యతలను తప్పించుకొని వెళ్ళిపోయేవారు అవలంబించే పద్ధతి. ముఖ్యమంత్రిగా ఉన్న రామారావు బాధ్యతగల వ్యవహారాలను నడపవలసి ఉన్నది. సన్యాసత్వానికీ, పదవికీ పొత్తు కుదరదు. అదీగాక అన్నివిధాలైన ప్రజలను పరిపాలించే వ్యక్తి ఒక మతానికి సంబంధించిన ప్రచారం పైకి చేయరాదు. మనదేశంలో కాంగ్రెసు నాయకులు చేసిన తప్పులనే రామారావు తెలిసో తెలియకో అనుసరించాడు.

## పార్టీ ఫిరాయింపుల నిషేధం

కాంగ్రెసు వారు ఎన్నాళ్ళనుంచో పార్టీలు మారుస్తున్నారేగాని, మార్పిడిని ఆపుతామన్న బిల్లును మాత్రం ప్రవేశపెట్టలేదు. ఎన్.టి.రామారావు పార్టీని స్థాపించినప్పుడే ఒక సూత్రాన్ని ప్రవేశపెట్టి శాసనసభ్యులైనవారెవరైనా తన పార్టీలో చేరదలుచుకుంటే శాసన సభ్యత్వానికి రాజీనామా ఇచ్చి రావాలన్నాడు. దీనివలన ఫిరాయింపుల ప్రవాహం ఆగిపోయింది. చేరిన ఒకరిద్దరు రాజీనామా చేసి వచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్రానికి ఒక సిఫారసు చేస్తూ పార్టీల మార్పిడిని అరికట్టే పద్ధతి సూచించారు. కానీ కేంద్రంలో ఉన్న కాంగ్రెసు పార్టీ ఇంతవరకూ ఆ సూచనను స్వీకరించలేదు. లోగడ జనతాపార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు పార్టీ ఫిరాయింపుల నిషేధపు బిల్లును రానివ్వకుండా మధులిమాయే అడ్డుపడ్డాడు. సిద్ధాంత రీత్యా పార్టీ మారటానికీ, అధికారం కోసం మారటానికీ తేడా వుందని ఆయన మీమాంస లేవనెత్తాడు. తెలుగుదేశం వారు మంచి సంప్రదాయాన్ని ప్రారంభించినా, ఎవరైనా ఆచరించకపోతే చేయగలిగిందేమీ లేదు. ప్రజా ప్రాతినిధ్య చట్టం కేంద్రం పరిధిలోనిది. దీనికి సవరణ జరగాలి. ఒక్క కాశ్మీర్‌కు మాత్రమే ప్రత్యేకమైన ప్రజా ప్రతినిధి చట్టం ఉన్నది. ఎవరైనా రాజీనామా చేయకుండా పార్టీ మారితే ప్రజల ఎదుట నిలబెడతామని రామారావు అన్నాడు. అంటే నైతికంగా సూత్రాన్ని పాటించాలని అర్థం. మన రాజ్యాంగం పార్టీలను గుర్తించలేదు. శాసనసభలలో, పార్లమెంటులో సంప్రదాయానుసారం పార్టీలను గుర్తిస్తున్నారు. కనుక కేంద్ర ప్రభుత్వం సవరణలు తీసుకురావాలి. కాంగ్రెసు పార్టీ ఒక పట్టాన అటువంటి పనులకు పూనుకోదు.

## తెలుగు గంగ

తమిళనాడుకు ముఖ్యంగా మద్రాసు నగరానికి కృష్ణ నీటిని ఇవ్వాలనే పథకం కాంగ్రెసువారి కాలంలోనే ప్రారంభమయింది. కాని వారు అమలుపరచలేదు. ఎన్.టి.రామారావు సాహసించి మద్రాసు నుంచి తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.జి.రామచంద్రన్‌ను పిలిచి ఒప్పందంపై సంతకాలు చేశారు. దీనికి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ, రాష్ట్రపతి కూడా హర్షించారు. కాని రాష్ట్రంలోని కాంగ్రెసు వారు మాత్రం పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ తమ అనైక్యతను చూపెట్టుకున్నారు. చివరకు కడప, నెల్లూరు మధ్య ఒకవైపునా, తెలంగాణా రాయలసీమ మధ్య మరొక వైపున దీనిని సమస్యగా చేశారు. ఇందుకుగాను శ్రీశైలం ఎడమ కాలువ రెగ్యులేటర్‌కూ, శ్రీరామపాదసాగర్ ప్రాజెక్టుకూ ఎన్.టి.రామారావు పునాదిరాళ్ళు వేశాడు. డబ్బెక్కడిదని కాంగ్రెసువారు శంకించారు. శ్రమ చేస్తే డబ్బుకు కొదవలేదని కంట్రాక్టర్లకు స్వస్తి చెప్పి యువసేనతో తెలుగు గంగ ప్రాజెక్టును పూర్తి చేస్తామని రామారావు ప్రకటించాడు. కేంద్రం ఈ పథకానికి ఆమోదం తెలిపి, తమ వాటా ఇవ్వటానికి ఆమోదించింది. దీనివలన మద్రాసుకు మంచినీళ్ళు లభించటమే గాక, రాయలసీమలో, నెల్లూరులో చాలా ప్రాంతం సాగవుతుంది.

## బస్సుల జాతీయీకరణ

చిరకాలంగా విజయవాడలో సిటీబస్సులు జాతీయం చేయడానికి ప్రయత్నాలు జరిగినా ఫలించలేదు. సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటినుంచీ సిటీబస్సు ఓనరులు డబ్బుతో కాంగ్రెసు రాజ్యంలో ఏ పనైనా చేయించగలమని ధృవపరిచారు. అలాంటి ప్రయత్నం తెలుగుదేశం వచ్చిన తరువాత కూడా చేయకపోలేదు. కాని వారి ఆటలు సాగలేదు. దీనితోపాటు కడప, కరీంనగర్, వరంగల్లులో కూడా కొన్ని రూట్లు జాతీయీకరణ చేశారు.

## అధికార భాష తెలుగు

తెలుగును అధికార భాషగా 1983 ఉగాది నుంచీ సెక్రటేరియట్ స్థాయిలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభించింది. ఇందుకు తగిన పూర్తి ఏర్పాట్లు జరగని మాట వాస్తవమే. కానీ కాంగ్రెసువారిలాగా కేవలం హామీలతో సరిపెట్టుకోక తెలుగుదేశం వారు ఎక్కడో ఒకచోట ప్రారంభించారు. దీర్ఘకాలికంగా దీని ఫలితాలు కనిపిస్తాయి. తెలుగు చదువుకోకుండా దాటవేస్తున్నారు. ఉన్నతాధికారులు తప్పనిసరిగా తెలుగులో కార్యకలాపాలు నడపవలసి ఉంటుంది. ఇందుకు సంబంధించిన శిక్షణ తరగతులు కూడా ప్రారంభించారు. పథకం విఫలం కాకుండా చూడవలసిన బాధ్యత ఉన్నది. అలాగే శాసనసభలో కూడా నిబంధనలను సవరించి కార్యకలాపాలను తెలుగులో నడపడానికి నిర్ణయం తీసుకోవాలి. ప్రజా ప్రభుత్వంలో ప్రజల భాషలో పరిపాలన జరగడం అవసరం. ఈ కార్యక్రమానికి ఆధునీకరణ కూడా తోడు కావాలి. తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రణాళిక ఇందుకు సంబంధించిన హామీలను ఇచ్చింది. కాని ఎలక్ట్రిక్ టైపురైటర్లను తెప్పించడం, లిపి సంస్కరణ జరిపించటం కూడా అత్యవసరంగా భావించాలి. లేకుంటే భాషాపరంగా వెనుకబడినతనం అలాగే కొనసాగుతుంది.

ప్రజలకు కిలో బియ్యం 2 రూపాయలకు అందిస్తామన్నారు. తరువాత నెలకు ఆరువందల రూపాయల ఆదాయమున్నవారికి మాత్రమే ఇది వర్తిస్తుందన్నారు. మిల్లర్లు ప్రభుత్వాన్ని బెదిరిస్తూ ఆటలాడుతూనే ఉన్నారు. ఈ మిల్లర్ల లాలూచీ చాలా బలమైనది. ఇందులో ఒక వర్గంవారు తెలుగుదేశానికి అనుకూలం అంటూనే, లోపాయకారిగా పథకాన్ని దెబ్బతీస్తున్నారు. మొత్తం మీద ఇంకా ఈ పథకం ఒకదారిన పడలేదు. ఆదాయంలో విపరీతమైన వ్యత్యాసాలుండగా, ఉన్నత ఆదాయాల వారికి పథకాన్ని వర్తింపచేయడంలో అర్థంలేదు. పౌర సరఫరాల శాఖ సరిగా పనిచేస్తే పేద వారికి కిలో రెండు రూపాయల బియ్యం అందించటం సులభమవుతుంది. మొత్తం మీద తెలుగుదేశం వారు పట్టుదలతో ఈ పథకాన్ని అమలుజరుపుతున్నారు.

ఎటొచ్చీ అందరూ సందేహించేది మధ్యాహ్న భోజన పథకాన్ని గురించే. కాంగ్రెసువారు దీన్ని ప్రారంభించినప్పటికీ అప్పట్లో ఎవరూ అంత సీరియస్‌గా దీన్ని పట్టించుకోలేదు. ఇప్పుడు పోషకాహార నిపుణుల సలహానుబట్టి ఈ పథకాన్ని అమలు జరపాలనుకొంటున్నారు. దీనివలన గ్రామాలలో పేదవారి పిల్లలకు చాలా ఉపయోగం ఉంది. అయితే అమలుజరపడంలో చాలా చిక్కులు ఎదురవుతాయి.

రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లోనూ, రోడ్డు ట్రాన్స్ పోర్టు అథారిటీ కార్యాలయాల్లోనూ పరిస్థితి కాస్త మెరుగయింది. లంచాల ప్రవాహం ఆగింది. అవినీతి తుడిచి పెట్టుకు పోకపోయినా కాంగ్రెసు రాజ్యంలోకంటే కొంత నయం అనిపించింది. 15 సూత్రాల ప్రగతిపథం పేరిట నిర్మాణ కార్యక్రమాన్ని రూపొందించారు.

రాష్ట్రంలో బందిపోట్లు విజృంభించారు. పోలీసులు అదుపుచేయ లేనందుకు బి.జె.పి.వారు నిరసన తెలిపారు. పోలీసుల అదృశ్యహస్తం వున్నదనే వదంతి లేకపోలేదు.

## బ్రాహ్మణ – రెడ్డి – కమ్మ – దళిత

రాష్ట్రంలో చిరకాలంగా సాంస్కృతిక, విద్య, ఉద్యోగ, రాజకీయరంగాలలో బ్రాహ్మణాధిపత్యం తిష్టవేసుకొని ఉన్నది. సమాజంలో అన్ని కులాలవారూ బ్రహ్మణాధిపత్యాన్ని ఒక ఆచారంగా, అలవాటుగా అంగీకరిస్తూ వచ్చారు. దీనిని మొట్టమొదటసారిగా జస్టిస్ పార్టీ వ్యతిరేకించింది. స్వాతంత్ర్యం రాకముందు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 1916లో పుట్టిన ఈ పార్టీ, 1920లో అధికారంలోకి వచ్చి 1937 వరకూ పెత్తనం సాగించింది. ఆంధ్ర ప్రాంతంలో కమ్మ కులంవారు ప్రధానంగా ఈ పార్టీని కోపు వేసుకున్నారు. వెలమ, కాపు, రెడ్డి కులస్థులు ఈ పార్టీలో ఉన్నప్పటికీ, కమ్మవారంతటి తీవ్రంగా

మిగిలిన కులాలు బ్రాహ్మణ వ్యతిరేకతను చూపలేదు. సంస్కృతం నేర్చి, మంత్రాలు చదివి, పెళ్ళిళ్ళు చేయించి, జంధ్యాలు వేసుకొని, శాఖాహారులై బ్రాహ్మణుల సామాజిక నాయకత్వాన్ని ప్రశ్నించి వారి పీఠాన్ని కమ్మ వారు కదిలించారు. త్రిపురనేని రామస్వామి ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు. అందుకని ఒక అర్ధ శతాబ్దం పైగా కమ్మ, బ్రాహ్మణ వైరం ద్వేషం, ప్రబలి ఉన్నది.

రాజకీయరంగంలో ప్రవేశించిన బ్రాహ్మణులు తమ నాయకత్వం నిలబెట్టుకోటానికి రెడ్లను అడ్డం పెట్టుకున్నారు. క్రమేణా రెడ్లు చైతన్యవంతులై బలపడేసరికి బ్రాహ్మణులు ముందుచూపుతో హరిజనోద్ధరణ అనే నినాదం ఇచ్చారు. హరిజనులు వీరి వలలో పడి ఇప్పటికీ తేరుకోలేదు. ఈ దేశంలో అంటరానితనాన్ని తెచ్చిపెట్టి, హరిజనులను దోపిడీచేసి సాంఘిక తారతమ్యాలను తెచ్చిపెట్టి అమానుషంగా ప్రవర్తించినవారు బ్రాహ్మణులే. అయితే ఇటువంటి వ్యవస్థపై తిరుగుబాటు చేసి సంస్కరణ కోసం పోరాడిన ప్రముఖులు కూడా బ్రాహ్మణులే. సంస్కరణవాదులైన బ్రాహ్మణులు అల్పసంఖ్యలో ఉండగా, సమాజంపై బడి అడుక్కుతినటమే వృత్తిగా చేసుకొని దానికి గౌరవాన్ని ఆపాదించుకొన్నవారే అధిక సంఖ్యాకులగు బ్రాహ్మణులు. అలాంటి వారు ఇతరులు పరిపాలిస్తుంటే సహించలేకపోవటం సహజం. ఇవ్వాళ యన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయిన తరువాత కమ్మ కులం అనే ప్రచారాన్ని వీధి వీధికీ చేస్తున్నవారు వీరే, పైన చెప్పిన చారిత్రక కారణాలే ఇందుకు దోహదం చేశాయి. ప్రచార, ప్రసార కేంద్రాలలో కీలకస్థానం వహిస్తూ తమ కులాన్ని బలపరుచుకోవటానికి అన్ని విధాలా ప్రయత్నించిన వీరు ఇతరులపై నెపం వేస్తున్నారు. ఉదాహరణకు, ఆంధ్ర ప్రదేశ్ సాంస్కృతిక డైరెక్టరేట్‌లో 36 మందికిగాను 32 మంది బ్రాహ్మణులే ఉన్నారు. వీరిలో అధిక సంఖ్యాకులు ఇతర శాఖల నుంచి తాత్కాలికంగా వచ్చినవారే. సంస్కృతి అంటే గుత్తాధిపత్యం ఉన్నదని బ్రాహ్మణుల ఉద్దేశ్యం. కాని ఇతర కులాలవారిని అవలీలగా హేళన చేయటానికీ, వేలెత్తి చూపటానికీ వీరికి జంకూ గొంకూ ఉండదు. ఇందుకు మినహాయింపులు ఏ కొద్దిమందో ఉన్నారంతే. అయితే అలాంటివారి మాట చెల్లదు.

ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడినప్పటినుంచీ ముఖ్యమంత్రి స్థానంలో రెడ్లు అధికంగా ఉన్నారు. అది కీలకమైన పదవి గనక, సహజంగా వారి ఆధిపత్యం భిన్న రంగాలలో ప్రబలింది. అయితే వీరు బ్రాహ్మణాధిపత్యాన్ని బాహాటంగా ప్రశ్నించలేదు. ముఖ్యంగా సాంస్కృతిక రంగాన్ని బ్రాహ్మణులకే వదిలేశారు. బెజవాడ గోపాల రెడ్డి వంటివారు స్తోత్ర పాఠకుల మధ్య కొలువుదీర్చి పొగడ్తలకు ఉబ్బిపోయారు. అయితే మిగిలిన రంగాలలో మాత్రం రెడ్లు బాగా పెత్తనం చేశారు. హఠాత్తుగా వారి పెత్తనం పోయేసరికి ఏమీ తోచని స్థితిలో విమర్శలకు దిగి బ్రాహ్మణులతో చేతులు కలిపారు. ఐతే రెడ్లందరూ ఏకంగా ఉన్నారనిగానీ, ముఖ్యమంత్రిగా రెడ్డి ఉన్నప్పుడు రెడ్లలోని పేదరికం పోయిందనీ అర్థం కాదు. నోరు గలవారు రాజ్యం చేశారు – కొందరు కాంట్రాక్టర్లు నిలువుదోపిడీ చేశారు. కాంగ్రెసులో వారి పెత్తనం బాగా సాగింది. అలాంటి వారే నేడు కులం అంటూ అరుస్తున్నారు.

సంజీవయ్య రెండేళ్ళపాటు ముఖ్యమంత్రిగా వుంటే, ఆయన్ని దించేవరకు అగ్రకులాలకు, ముఖ్యంగా రెడ్లకు నిద్రపట్టలేదు. అయినప్పటికీ  హరిజనులు అధికార రాజకీయాలలోని లోతుపాతులు తెలియక, నినాదాల భ్రమలో కొట్టుకుపోతున్నారు. ఇందిరాగాంధీ వీరిలో చైతన్యం కలుగజేసి వారికొక ఉనికిని కలిగించినమాట వాస్తవం. అది కేవలం ఓట్లకోసం చేసిన కుట్ర, పన్నిన ఎత్తుగడ. హరిజనులు ఇప్పటికీ ఈ ఉచ్చులో నుంచి బయటపడలేదు. ఇటీవల జరిగిన ఎన్నికలలో వీరు కాంగ్రెసుకు అండగా నిలబడ్డారు.

ఒకప్పుడు హరిజనుల శ్రమశక్తిని ఆగ్రకులాలవారు దోచుకుంటే నేడు హరిజనులలో పైకి వచ్చిన కొద్దిమంది రాజకీయ నాయకులు పెద్ద చేప చిన్న చేపలను మింగినట్టు తమవారినే అంటరానివారుగా చూస్తున్నారు. ఎవరు రాజ్యంలో ఉన్నా వీరు మాత్రం ఊరి వెలుపల గుడిసెలలో ఉండటం తప్పలేదు. ప్రతివారూ హరిజనోద్ధరణకే తాము పుట్టామని ఉపన్యాసాలు చెప్పటం మానలేదు. 30 ఏళ్ళుగా రిజర్వేషన్లూ, ప్రత్యేక సౌకర్యాలూ ఏర్పరిచినా వీరికి అందకుండా పోయాయి. నగరాలలో ఉన్న కొద్దిమందీ వాటిని కాజేశారు. వీరికి రిజర్వేషన్లు ఎందుకుండాలని అప్పుడే అగ్ర కులాలవారు ప్రశ్నిస్తున్నారు. శతాబ్దాలుగా మతం, ధర్మం పేరిట హరిజనుల్ని దోపిడి చేసినవారు నేడు రిజర్వేషన్లనే

ఓర్చుకోలేకపోతున్నారు. ఇటువంటి పరిస్థితులలో వెనుకబడిన తరగతులవారు హరిజనులపై మరీ ద్వేషాన్ని పెంచుకున్నారు. ఇలాంటి సన్నివేశంలో కమ్మ కులస్థుడైన వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యారు.

## ఎన్.టి.రామారావు కులాభిమానం

ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్.టి.రామారావు అన్ని పదవులనూ ఇతర కులాలకు కట్టబెట్టినా, కమ్మ వాసన పోలేదు. ముఖ్యమంత్రి పదవి అంతటి కీలకమైనది. దీనికితోడు ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రిగా కమ్మకులస్తుడు రావడం ఇదే మొదటిసారి. 1930లో రెండేళ్ళపాటు చిత్తూరు జిల్లాకు చెందిన బొల్లిన మునుస్వామి జస్టిస్ పార్టీ ముఖ్యమంత్రిగా వున్నాడు. ఆ తరువాత అటువంటి అవకాశం లభించడం ఇదే మొదలు. సినీరంగంలో కమ్మ కులాధిపత్యం బాగా ఉన్నది. రాజకీయ రంగంలో కూడా అది అల్లుకుపోతుందని ఇతర కులాలవారికి భయం లేకపోలేదు. దీనికి తగ్గట్టే ఎన్.టి.రామారావు అధికారంలోకి రాగానే విద్యుత్ మండలి అధ్యక్షుడుగా నార్ల తాతారావుకు 5 ఏళ్ళపాటు పదవీకాలాన్ని పొడిగించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రణాళికా సలహాదారుగా ఎలవర్తి నాయుడమ్మను నియమించారు. ఆయన కాంగ్రెసు రాజ్యంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల గుర్తింపు పొంది అనేక ఉన్నత పదవులు నిర్వహించారు. రాష్ట్రేతరంగా వివాహమాడారు. అయినప్పటికీ రామారావు పదవి ఇచ్చాడు గనుక కులం జ్ఞాపకం వచ్చింది. అలాగే సాంస్కృతిక వ్యవహారాల సలహాదారుగా నార్ల వెంకటేశ్వరరావును నియమించారు. ఆయన కుటుంబంలో కులాంతర వివాహాలు జరిగాయి. ఆయన కులాన్నీ, మతాన్నీ అరమరికలు లేకుండా ఖండించారు. ఆచరించారు. అయినా కులప్రసక్తి పోలేదు. రామారావు సన్నిహితులలో, ఆంతరంగికులలో కమ్మ కులస్తులు ఎక్కువగా ఉన్నమాట నిజం. పర్వతనేని ఉపేంద్రను హిమాయత్ నగర్ ఉపఎన్నికలలో తెలుగుదేశం పక్షాన పోటీ పెట్టారు. గెలిస్తే మంత్రి అయి ఉండేవాడేమో పర్వతనేని బ్రహ్మయ్య ఆడిటింగ్ కంపెనీలో ఉన్న శీతారామయ్య, సినీరంగంలోని తాతినేని ప్రకాశరావు మొదలైనవారు రామారావుకి సన్నిహితంగా ఉన్నారు. రామారావుగారు తీసుకున్న నిర్ణయాల వలన కమ్మకులస్తులు కొందరు బాగా దెబ్బతిన్నారు. ప్రభుత్వ డాక్టర్ల ప్రైవేటు ప్రాక్టీసు నిషేధిస్తే కమ్మ డాక్టర్లే ఎక్కువమంది రాజీనామాలు చేశారు. తెలంగాణాలో కూడా లోగడలేని కమ్మ వ్యతిరేకత వ్యాపిస్తున్నది. ఆంధ్ర నుంచి వచ్చిన వారికి తెలుగుదేశం పక్షాన స్థానాలు ఇచ్చినందువలన కొందరు కమ్మవారు శాసన సభ్యులయ్యారు. మొత్తం మీద ఎన్నికలలో పట్టించుకోని కులాన్ని, పదవి చేపట్టిన తరవాత పట్టి చూస్తున్నారు. రామారావుకు కులాభిమానం లేకపోలేదు. కావాలని తగ్గించుకోటానికి ప్రయత్నించాడు. అందులో సఫలం కాలేదు.

--------

## ముఖ్యమంత్రి
## ఎన్. టి. రామారావు

మొదటి మంత్రివర్గం

1983 జనవరి – 1984 ఆగస్టు

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | ఎన్.టి.రామారావు | ముఖ్య మంత్రి |
| 2. | ఎస్. భాస్కరరావు | ఆర్థిక శాఖ |
| 3. | ఎస్. శ్రీనివాసులు రెడ్డి | రోడ్లు, భవనాలు |
| 4. | పి. మహేంద్రనాథ్ | రెవెన్యూ |
| 5. | ఎస్. సత్యనారాయణ | రవాణా |
| 6. | ఇ. ఆంజనేయులు | దేవాదాయ |

| | | |
|---|---|---|
| 7. | కె. రామచంద్రరావు | పంచాయత్ రాజ్ |
| 8. | పి. ఆనందగజపతి రాజు | విద్యా శాఖ |
| 9. | కె. జానారెడ్డి | వ్యవసాయ శాఖ |
| 10. | ఎస్. రామముని రెడ్డి | మెడికల్, హెల్త్ |

**రాష్ట్ర మంత్రులు**

| | | |
|---|---|---|
| 1. | శ్రీమతి కె. ప్రతిభా భారతి | సాంఘిక సంక్షేమ శాఖ |
| 2. | ఎమ్. రామచంద్రరావు | కార్మిక |
| 3. | వై. రామకృష్ణుడు | మునిసిపల్ కార్యనిర్వాహకశాఖ |
| 4. | టి. జీవన్ రెడ్డి | పన్నులు |
| 5. | మహ్మద్ షకీర్ | పర్యాటక శాఖ |

ఈలి ఆంజనేయులు మరణించిన తరువాత హెూమ్ అండ్ ఇన్ఫర్మేషన్ పోర్ట్ ఫోలియోస్ హరిరామ జోగయ్యకి ఇవ్వడం జరిగింది.

------

# నెల తప్పిన ముఖ్యమంత్రిత్వం

## నాదెండ్ల భాస్కరరావు పాలన

ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఒకటిన్నర సంవత్సర పాలనలో అనేక విమర్శలకు గురైనాడు. నగరాలలో, చదువు కున్నవారు, ఉద్యోగులు ఆయన్ను వ్యతిరేకించనారంభించారు. కాంగ్రెసు (ఐ) పార్టీ మళ్ళీ వూపిరి పోసుకుంటూ సభలు సమావేశాలు పెట్టి ప్రజలలోకి వెళ్ళసాగింది.

అటువంటి క్లిష్ట సమయంలో నాదెండ్ల భాస్కరరావు బయటకు పోతే ఆయన వెంట ఎందరుంటారు, ఎప్పుడు వెడతాడు. అనేవి చర్చనీయాంశాలైనవి. భాస్కరరావు ఎదురు తిరిగే విషయమై ఎవరికీ సందేహం లేదు.



భాస్కరరావుతోబాటు కొందరు శాసనసభ్యులు మొదటి నుంచీ ఆయన కొలువులో వుంటూ వచ్చారు. శాసన సభ్యులను బాగా ఆదరించడం, చేతనైనంత మేరకు వారికి పనులు చేసిపెట్టడం భాస్కర రావు ప్రత్యేక ఆకర్షణలు. ఈవిధంగా కూడగట్టిన బలాన్ని వినియోగించుకోవడానికి ఎదురుచూస్తున్న భాస్కరరావుకు కొన్ని సందర్భాలు కలసి వచ్చాయి. ఎన్.టి.రామారావుకు గుండె చికిత్స అమెరికాలో నిర్ధారణ అయింది. జూలై 17న రామారావు అమెరికా బయలుదేరి వెళ్ళాడు. ఆనాడే భాస్కరరావు ఢిల్లీలో కాంగ్రెసువారితో మంతనాలు ఆరంభించాడు. భాస్కరరావుకు కేంద్రంలోని నాయకుల వ్యవహారాలు బాగా తెలుసు. కాంగ్రెసు వారి వద్ద హామీ తీసుకొని, తన బలాన్ని కూడగట్టడానికి ఉద్యమించాడు. 1984 ఆగష్టు 22న రామారావును తొలగించి భాస్కరరావును ముఖ్యమంత్రిని చేయాలని ముహూర్తాలు పెట్టుకున్నారు. ఇలాంటి మంతనాలు జరుగుతున్నట్లు రాష్ట్ర కాంగ్రెసు నాయకులకు తెలుసుగాని పూర్తి వివరాలు వారిదాకా రాలేదు. భాస్కరరావు – కాంగ్రెసువారూ పరస్పరం విమర్శించుకోకుండా తమ పాత సన్నిహితత్వాన్ని పెంచుకున్నారు. శాసనసభ్యుల వద్ద రామారావును ఎగతాళిచేస్తూ మాట్లాడటం, *చూస్తున్నావుగదమ్మా మన పిచ్చోడు ఎలా చేస్తున్నాడో* అనడం భాస్కరరావుకు పరిపాటి అయింది. ఈయన్ను మంత్రిమండలి నుండి తొలగించమని తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ సంఘం సిఫారసు చేసింది. కాని రామారావు చర్య తీసుకోలేదు. ఈనాడు పత్రిక రామోజీరావు సంపాదకత్వాన

భాస్కరరావును గురించి తరచు హెచ్చరిస్తూ, అతడిని తొలగించమని రామారావుకు సలహాయిచ్చింది. ఈలోగా భాస్కరరావు సంతకాల ఉద్యమాన్ని కొనసాగించాడు. అమెరికాలో రామారావు పూర్తిగా కోలుకునే వరకూ విశ్రాంతి తీసుకుంటూ, రాష్ట్ర పరిపాలనా బాధ్యత భాస్కరరావుకు అప్పగించాలని సంతకాలుచేశారు. దీనినే ఉత్తరోత్తరా గవర్న్‌కు సమర్పించాడు భాస్కరరావు.

రామారావు అమెరికాలో ఉండగా హైదరాబాద్ పాత బస్తీలో మతకల్లోలాలు జరగడంతో కర్ఫ్యూ విధించారు. అది సాకుగా కేంద్ర హోమ్ మంత్రి పెండేకంటి వెంకటసుబ్బయ్య, మరో మంత్రి సాఠే వచ్చి పరిశీలించారు. భాస్కరరావుతో మంతనాలు సాగాయి.

ప్రధాని ఇందిరాగాంధీ కూడా మెదక్ వచ్చి రామారావు పరిపాలనను విమర్శిస్తూ మాట్లాడింది. ఆమెకు విమానాశ్రయంలో స్వాగతం చెప్పడానికి మంత్రి కరణం రామచంద్రరావును నియమించారు. ఇది కూడా భాస్కరరావుకు కష్టకారణమైంది. ఇందిరాగాంధీ అప్పుడే రహస్యంగా గవర్నర్ రాంలాల్‌కు సలహాలు యిచ్చింది.

భాస్కరరావు ఏమీ పట్టించుకోవడంలేదనే విమర్శ వచ్చేసరికి, ఆయన మంత్రుల సమావేశాలు ఏర్పరిచాడు. పాత బస్తీలో కల్లోలాల విషయమై చర్చ చేసి, శ్రద్ధ తీసుకోదలిచినా, తాత్కాలిక ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్ సహకరించలేదు.

భాస్కరరావు కొంప ముంచేస్తున్నాడంటూ తెలుగదేశం వారు అమెరికాలో వున్న రామారావుకు ఫోన్.లు చేశారు. ఆయన ముందుగా అప్పారావును (డి.ఐ.జి. ఇంటిలిజన్స్) ఇండియాకు పంపాడు. ఆ తరువాత ఆగస్టు 14 (1984)న రామారావు ఇండియాకు వచ్చేశాడు. డాక్టర్లు ఆయన్ను పూర్తి విశ్రాంతి తీసుకోమన్నారు. కనీసం ఆరువారాలపాటు కదలకుండా వుండమన్నారు. హైదరాబాద్ విమానాశ్రయంలో అందరితోబాటు భాస్కరరావు కూడా హడావుడిగా స్వాగతం పలికి, రామారావును కౌగలించుకున్నాడు. అది శివాజీ-అఫ్జల్ కౌగిలింతగా పరిణమించింది. భాస్కరరావును తక్షణం తొలగించక పోతే ప్రమాదమని నచ్చచెప్పగా ఆయన్ను బర్తరఫ్ చేయవలసిందిగా గవర్నర్ కు సిఫారసు చేయగా బర్తరఫ్ చేయక తప్పలేదు.

భాస్కరరావుతో పాటే మంత్రులు జీవన్ రెడ్డి, రామమునిరెడ్డి ఎస్. సత్యనారాయణ ఎఫ్.ఎం.కిషన్ రావు తమ పదవులకు రాజీనామాలిచ్చారు. రామారావు మద్దత్తు దారులు ఆయన ఇంట్లో సమావేశమై చర్చలు ప్రారంభించారు. భాస్కరరావు తక్షణమే కాంగ్రెసు వారితో సంప్రదించి తన మద్దత్తు దారుల జాబితాను గవర్నర్‌కు సమర్పించాడు.

ఆగస్టు 15వ తేదీ పెరేడ్ గ్రౌండ్స్‌లో రామారావు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా సందేశం యిచ్చాడు. అటువంటి అవకాశం యివ్వకపోతే బాగుండేదని కాంగ్రెస్ శాసన సభ్యుడు పిన్నమనేని కోటేశ్వరరావు అన్నాడు. భాస్కరరావు తన మద్దత్తుదారులతో గవర్నర్ వద్దకు వెళ్ళి తెలుగుదేశంలో తనకు 95 మంది అనుకూలురు వున్నా రన్నారు. రామారావుకు బలం పోయింది గనుక తనను ముఖ్యమంత్రిగా ఆహ్వానించాలని కోరాడు.

కేంద్ర హోమ్ మంత్రి పి.వి.నరసింహారావు ఫోన్లు చేసి జాగ్రత్తగా భాస్కరరావు సంఖ్యా బలాన్ని పరిశీలించమని, 95 మంది నిజంగా వున్నారని నిర్ధారణ అయితేనే సమర్ధించమని కాంగ్రెసు వారికి సలహా యిచ్చాడు. కాంగ్రెసు రాష్ట్ర నాయకులు యిదంతా వినేస్థితిలో లేరు. ఆత్రుతగా భాస్కరరావుకు మద్దత్తు ప్రకటించారు. గవర్నర్ రాంలాల్ రాజ్ భవన్.లో భాస్కరరావు మద్దత్తు దారులైన శాసన సభ్యులను చూచాడు. శాసనసభ్యులు కాని వారిని బయటకు పొమ్మన్నారు. అయినా ఎవరూ పోలేదు. ఎం.ఎల్.ఏ.లు కానివారే ఎక్కువగా వున్నారు. వారిని గుర్తుపట్టే అధికారులు లేరు. కనీసం లెక్కించలేదు కూడా. సరే వెళ్ళిరండి అని గవర్నర్ వారిని పంపేశాడు. ఈ విషయం తెలిసి రామారావు అనుకూల శాసన సభ్యులను వెంటబెట్టుకొని, తెలుగు దేశం పార్టీ కార్యదర్శి పి. ఉపేంద్ర రాజ్ భవన్‌కు వచ్చారు. గవర్నర్ వారిని చూడకుండా, అవసరమైతే పిలిపిస్తాను వెళ్ళండన్నాడు.

ఆగస్టు 16న కేంద్రం నుంచి కాంగ్రెసు పరిశీలకులు మూపనార్, ఫణిక్కర్ లు వచ్చారు. కాంగ్రెసు పార్టీ శాసనసభా పక్షం లాంఛనంగా భాస్కరరావును సమర్ధించాలనే తీర్మానంచేసింది. ఆపార్టీ నాయకుడు మదన్ మోహన్ తీర్మానాన్ని గవర్నర్.కు అందజేశాడు. అప్పటికే రామకృష్ణా స్టూడియోలో సమావేశమై చర్చలు జరుపుతున్న రామారావుకు గవర్నర్ తాఖీదు పంపాడు. బలం కోల్పోయిన దృష్ట్యా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా యివ్వమన్నాడు. రామారావు అందుకు నిరాకరించాడు. గవర్నర్ అప్పటికే భాస్కరరావును నాయకుడుగా రాజ్.భవన్‌కు

ఆహ్వానించాడు. రామారావు ఆయన్ను బలపరచే తెలుగుదేశం సభ్యులు, ప్రతిపక్షాలు కలిసి కార్లలో, బస్సులలో రాజ్‌భవన్‌కు ఆగస్టు 16 మధ్యాహ్నం 1 గంటకు చేరుకున్నారు. వారికి ప్రవేశం యివ్వక, భాస్కరరావు మనుషులు, రామస్వామి ఆధ్వర్యాన దౌర్జన్యం జరిపారు.

ఒకగంట అనంతరం రామారావుకు, మంత్రులకు, ప్రతిపక్ష నాయకులకు మాత్రం గవర్నర్ అనుమతించాడు. గవర్నర్‌తో ఎంత వాదించినా, ఆయన మొండిగా తాను సంతృప్తి చెందానంటాడేగాని, గేటు బయట రోడ్డుపై కూర్చున్న సభ్యుల్ని చూడదలచలేదు. చివరకు గదిలో వున్న వారిని అరెస్టు చేయమంటూ గవర్నర్ ఉత్తరువులిచ్చి, గబగబా వెళ్ళి భాస్కరరావుచే మధ్యాహ్నం 3 గంటలకు ప్రమాణ స్వీకారం చేయించేశాడు.

పోలీసులు రామారావును ఆయన్ను బలపరిచే శాసనసభ్యులను నిర్బంధించి, పోలీసు కంట్రోలు రూంకు తీసుకెళ్ళి, విడుదల చేశారు. మొత్తం 169 మంది ఉన్నట్లు వారి ప్రకటనలో తేలింది.

ఈసంఘం పట్ల రాష్ట్ర ప్రజలు, దేశవిదేశ పత్రికలు ఆశ్చర్యాన్ని ప్రకటించి, గవర్నర్ చర్యను తీవ్రంగా నిరసించారు. ఆగస్టు 17న రాష్ట్రంలో జరిగిన బంద్ లో 17 మంది చనిపోయారు. ప్రతిపక్షాలన్నీ యీ సమస్యపై ఒకే మాటగా నిలచి రామారావును సమర్ధించాయి.

ఒక కమ్మ ముఖ్యమంత్రి పోతే మరొక కమ్మ ముఖ్యమంత్రి వచ్చాడని కొద్దిమంది వ్యాఖ్యానించకపోలేదు. నాదెండ్ల భాస్కరరావు చేత పనులు చేయించు కోవాలనుకునేవారు యిలా ఆలోచించారు తప్ప అధిక సంఖ్యాకులు భిన్నంగా ప్రవర్తించారు. శాసన సభ్యులలో ఉన్న 48 మంది కమ్మవారిలో 8 మంది మాత్రమే నాదెండ్ల పక్షాన వున్నారు. వారు నన్నపనేని రాజకుమారి, సుబ్బారావు, రాంభూపాల్ చౌదరి, అడుసుమిల్లి జయప్రకాష్, దగ్గుపాటి చౌదరి, లక్ష్మీనారాయణ, రజనీబాబు.

కానీ యీ సమస్యను కులరీత్యా ప్రజలు చూడలేదు. ప్రజాస్వామ్య విలువలు నాశనమయ్యాయని వారంతా స్పందించారు. ఇలా జరిగితే తమ ఓటుకు విలువ ఏముంటుందనుకున్నారు. సంఖ్యా బలాన్ని శాసనసభలో నిరూపించకుండా కనీసం రాజ్‌భవన్‌లో చూడకుండా, గవర్నర్ తన యిష్టం వచ్చినట్లు కేంద్రం చేతుల్లో కీలు బొమ్మగా వ్యవహరించి, బలంవున్న ముఖ్యమంత్రిని తొలగించడంపట్ల ప్రజలు ఆగ్రహావేశం కనబరిచారు.

కాంగ్రెసువారు కేవలం తమ మద్దత్తు ప్రకటించడమే గాక, భాస్కరరావుకు బలం సమకూర్చాలని డబ్బు సంచులతో తీవ్ర ప్రయత్నాలు చేశారు. కేంద్ర మంత్రి విజయభాస్కరరెడ్డి వచ్చి హైదరాబాద్‌లో తిష్టవేశాడు.

గవర్నర్ రాంలాల్ ఒక నెలరోజులలో భాస్కరరావును అసెంబ్లీలో బలం రుజువు చేసుకోమని గడువు యిచ్చాడు. ఆగస్టు 18న అసెంబ్లీని పిలవమని రామారావు చేసిన విజ్ఞప్తిని ఆయన ఖాతరు చేయలేదు. ఈలోగా రామారావు పక్షాన వున్న కొందరు ఎం.ఎల్.ఎ.లతో బేరసారాలు సాగించి, అతి కష్టం మీద నలుగురైదుగురిని ఆకర్షించగలిగారు.

రాజ్‌భవన్ వద్ద రామారావు పక్షాన నిలచి, అరెస్టు అయినవారిలో కొందరు భాస్కరరావు వైపు తిరిగారు. అలా వచ్చినవారిలో శ్రీమతి త్రిపురాన వెంకటరత్నం, గ్రంధి మాధవి, డబ్ల్యు.ఆర్. సక్కుబాయి, సుమన వున్నారు. లోగడ కాంగ్రెసు ప్రభుత్వంలో ఒక జూనియర్ కళాశాలను స్థాపించుకోగలిగిన త్రిపురాన వెంకటరత్నం తెలుగుదేశం శాసనసభా పార్టీ కార్యదర్శి ఆమె యిలా మారడానికి ఆమె తండ్రి త్రిపురాన రాఘవదాసు ప్రముఖపాత్ర వహించాడు.

ముఖ్యమంత్రి భాస్కరరావు ప్రజల ఆగ్రహాన్ని విస్మరించి, పాలనాధికారాన్ని వినియోగించి నిర్ణయాలు తీసుకున్నాడు. ధర్మ మహామాత్ర సంస్థను రద్దుచేశాడు. ఇ.వి.రాంరెడ్డి (రిటైర్డ్ ఐ.ఎ.ఎస్.) పదవి దీనితో పోయింది. ఈయనవలన సెక్రటేరియట్‌లో పెద్ద వివాదాలు చెలరేగాయి. లోకాయుక్త అధికారాలలో కొన్ని ధర్మ మహామాత్రకు యివ్వడం కూడా గందరగోళానికి దారితీసింది. ఆ సమస్య కాస్తా యీ విధంగా పరిష్కారమైపోయింది. భాస్కరరావు ఏమిచేసినా ప్రజల ఆందోళనలో ఎవరూ పట్టించుకోలేదు. సెక్రటేరియట్ అంతా పైరవీకారుల మయం అయింది.

రామకృష్ణా స్టూడియోస్‌లో వున్న శాసన సభ్యులపై పోలీసులు దాడిచేశారు. తాము ఐచ్ఛికంగా, కావాలని వుంటున్నట్లు వారంతా తెలియజేసేసరికి పోలీసులు ఏమీ చేయజాలకపోయారు.

భాస్కరరావు తొలుత తనతోబాటు వచ్చిన జీవన్ రెడ్డి, రామమునిరెడ్డి, ఎస్. సత్యనారాయణలను మంత్రిమండలిలో చేర్చాడు. ఆగస్టు 19న వీరి ప్రమాణ స్వీకారం జరిగింది. ఆనాటి ఉదయమే ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్‌లో రామారావు మద్దతుదారులు, ప్రతిపక్షాలవారు ఢిల్లీ బయలుదేరారు. రిజర్వేషన్ లేకుండా చేయడమేగాక, దారి పొడవునా

పోలీసుల ప్రశ్నలతో, బండి జాప్యంగా నడవడంతో అనేక యిబ్బందులకు గురిచేశారు. రాష్ట్రపతి వద్ద తీసుకున్న నియామకపు వేళ తప్పించారు. అయినా శాసన సభ్యులు పట్టుదలతో ఢిల్లీచేరి, ఆంధ్రప్రదేశ్ గెస్ట్ హౌస్.లోగాక, సూర్య ఇంటర్.నేషనల్ హొటల్.లో వున్నారు. బి.జె.పి. వారు ఏర్పాట్లన్నీ శ్రద్ధగా చూచారు.

ఈలోగా హైదరాబాద్.లో తన మద్దతుదారులంటూ భాస్కరరావు విడుదల చేసిన శాసనసభ్యుల జాబితా నవ్వులపాలైంది. అందులో 35 మంది ఢిల్లీ వెళ్లిన వారిలో వున్నారు.

ప్రతిపక్షాల నాయకులంతా ఆగస్టు 19 నాటికి హైదరాబాద్ చేరారు.

బహిరంగ సమావేశానికి ముందు అనుమతి నిరాకరించి, తరువాత తప్పనిసరిగా యిచ్చారు. లక్షలాది ప్రజలు నిజాం కళాశాల ఆవరణలో వెల్లువగా వచ్చి చేరారు. ఫరూక్ అబ్దుల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో చరణ్‌సింగ్, బహుగుణ, శరద్ పవార్, ప్రభృతులు మాట్లాడారు. జబ్బుగా వున్న యన్.టి.రామారావు హఠాత్తుగా సభకు వచ్చేసరికి ప్రజలు వెర్రి ఆవేశాన్ని ప్రదర్శించి, ఆహ్వానించారు.

ఆగస్టు 20న ఢిల్లీకి విమానంలో రామారావు బయలుదేరాడు. అందులో బాంబువున్నదంటూ, సోదా నిమిత్తం కొన్నిగంటలపాటు ప్రయాణం ఆపారు. సాయంత్రానికి కూడా ఢిల్లీ చేరనందున, అనుమానించిన కార్యకర్తలు పాలం విమానాశ్రయంలో గొడవ చేశారు. రామారావుకు ఘనస్వాగతం లభించింది. జైన్ ఆస్పత్రిలో ఉన్న రామారావుకు రాష్ట్రపతి పుష్పగుచ్ఛాన్ని పంపారు. ఎప్పుడైనాసరే ఇంటర్వ్యూ ఇస్తామన్నారు. ఎందుకైనా మంచిదని, ఇందిరాగాంధీ, ఆమె కుమారుడు రాజీవ్‌గాంధీ కూడా పుష్పగుచ్ఛాలను పంపారు.

ఆగస్టు 21న ఢిల్లీలో రాష్ట్రపతి భవనానికి వచ్చిన రామరావును, ఆయన్ను బలపరిచే శాసన సభ్యులను ప్రపంచ వ్యాప్తంగా విలేఖరులు చూచారు. వారందరికీ గుర్తింపు కార్డులున్నవి. విదేశాలవారు టి.వి. టేప్లు తీసారు. రాష్ట్రపతి జైల్‌సింగ్ వీరందరినీ లెక్కించలేదు. గాని, చూచాడు. టి.వి. టేప్.లను విదేశాలకు పంపనివ్వకుండా కేంద్ర ప్రభుత్వం ఆపేసింది. ప్రజలకు వాస్తవం తెలిసింది. మరోకవైపు శాసనసభ్యులను అటు కాంగ్రెసువారూ యిటు భాస్కరరావు వర్గమూ వెన్నాడుతూనే వున్నారు. అసెంబ్లీ వరకూ వీరి బారినుండి తప్పించుకోవడానికి పశ్చిమ బెంగాల్ రావలసిందిగా ముఖ్యమంత్రి జ్యోతిబసు వారిని ఆహ్వానించాడు. తక్కువ సమయంలో హైదరాబాద్ చేరడానికి వీలుగా వుండాలన్నారు. రామకృష్ణ హెగ్డే (కర్నాటక ముఖ్యమంత్రి) సలహాపై ఛార్టర్డ్ విమానంలో బెంగుళూరు చేరుకున్నారు. కర్నాటక విద్యామంత్రి రఘుపతి వీరి రక్షణ ఏర్పాట్లు చూచాడు.

హైదరాబాద్.లో భాస్కరరావు చకచకా నిర్ణయాలు తీసుకున్నాడు. ఫైళ్ళు అతి వేగంగా కదిలిపోయాయి. తాత్కాలిక ఛీఫ్ సెక్రటరీ శ్రావణ్ కుమార్ స్థానే, మాజీ ప్రధాన కార్యదర్శి బి.ఎన్.రామన్‌ను ఛీఫ్ సెక్రటరీ చేశారు. ఆయనకు రాగద్వేషాలు మెండు, ఉద్యోగులలో యీయనపట్ల చీలిక వున్నది. అయితే ప్రభుత్వ నిర్ణయాలు త్వరితగతిని అమలుపరుస్తాడని ప్రతీతి. ఉద్యోగస్తుల పదవీ విరమణ వయస్సు 55 నుంచి 58 ఏళ్ళకు పెంచారు. ఉద్యోగులకు ఇది సంతోషకరమైన వార్త అయింది.

పార్లమెంటు ఉభయ సభలలో ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన చేశాయి. గవర్నర్ రాంలాల్ చర్యను కేంద్ర హోమ్ మంత్రి పి.వి.నరసింహారావు వెనకేసుకొచ్చి తన చాకచక్యమంతా ప్రయోగించి ఆయన చేసిందంతా సమర్ధనీయమే అన్నాడు. అదే సందర్భంగా ప్రధాని ఇందిరాగాంధీ చర్చలలో జోక్యం చేసుకొని ఏ దశలోనూ రాంలాల్ తననుగాని, కేంద్రాన్నిగాని సంప్రదించలేదన్నారు. రామారావును తొలగించిన విషయం న్యూస్ ఏజెన్సీ ద్వారా తనకు తెలిసిందన్నారు. ఎవరూ నమ్మలేదు.

ఇందిరాగాంధీ ప్రకటన ఫలితంగ రాష్ట్ర గవర్నర్ రాంలాల్ రాజీనామా యిచ్చి వెళ్ళి పోయారు. ఆగస్టు 24న రాష్ట్ర కాంగ్రెసు నాయకులను ఢిల్లీకి పిలిపించారు. తరువాత శాసనసభా కాంగ్రెసు పార్టీ నాయకత్వానికి మదన్‌మోహన్ రాజీనామా యిచ్చారు. శీలం సిద్ధారెడ్డి నాయకుడుగా వ్యవహరిస్తాడన్నారు. కాని తన రాజీనామాను ఆమోదించనందున తానే కొనసాగుతున్నట్లు మదన్‌మోహన్ ఉత్తరోత్తరా చెప్పాడు. రాష్ట్ర కాంగ్రెసు వ్యవహారాలకు ఎ.కె. ఆంథోని బాధ్యుడుగా వుంటాడని నిర్ణయించారు.

ఆగస్టు 25 నుండి సెప్టెంబరు 2 వరకూ ఎన్.టి.రామారావు రాష్ట్రంలోనూ, పొరుగు రాష్ట్రాలలోనూ, పర్యటించాడు. విజయవాడలో ప్రారంభించిన యీ చైతన్య యాత్రను, గుంటూరు, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, అనంతపూర్,

బెంగుళూరు, మద్రాసులో జరిగిన బహిరంగసభలలో ప్రసంగాలు చేయడం ద్వారా జనానికి విపరీత ఆకర్షణ అయింది. రామారావు పట్ల జనాదరణ చూచి విదేశీ పత్రికా విలేఖరులు ఆశ్చర్యపోయారు. బి.జె.పి. నాయకుడు వెంకయ్యనాయుడు, జనతా నాయకుడు జయపాల్ రెడ్డి, ఇండిపెండెంట్ నాయకుడు పి.రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు తమ పూర్తి మద్దత్తునిచ్చాయి. సభలు జరిగినతీరు అపూర్వంగా వున్నది.

గవర్నర్ రాంలాల్ స్థానే శంకర్ దయాళ్‌శర్మను రాష్ట్ర గవర్నర్‌గా నియమించారు. ఆగస్టు 26న యీప్రకటన వెలువడగా ఆగస్టు 29న ఆయన పదవీ బాధ్యత స్వీకరించారు. ఈలోగా భాస్కరరావు హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో పోలీస్ రక్షణతో నాలుగు బహిరంగ సభలను నిర్వహించారు. రాజధాని రౌడీ రాజ్యపాలన కింద వున్నదా అనిపించింది.

మైసూరు, బెంగుళూరు, నందీహిల్స్‌లో వుంటూ వచ్చిన శాసనసభ్యులను కాంగ్రెసువారు, భాస్కరరావు మనుషులు వేటాడారు. అన్ని ఆశలూ చూపారు. బంధువులను, స్నేహితులను ప్రయోగించారు. అన్ని ప్రయత్నాలూ విఫలమవ్వగా వారిని విడుదల చేయించాలనీ, అంతవరకూ అసెంబ్లీ సమావేశం జరగదని భాస్కరరావు ప్రకటించాడు. కాంగ్రెసు వారు తందానా అన్నారు.

భాస్కరరావుకు మజ్లిస్ మద్దత్తు ప్రకటించింది. దీనికి కృతజ్ఞతగా పాత బస్తీ అభివృద్ధికి 10 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. అల్ప సంఖ్యాకుల ఆర్థిక సహాయ సంస్థను ఏర్పరచారు. కాల్పులలో చనిపోయిన వారి కుటుంబాలకు ఏడున్నర వేల రూపాయలు ప్రకటించారు. తాడిపత్రిలో (అనంతపురం జిల్లా) చనిపోయిన వారి కుటుంబాలు చూడటానికి భాస్కరరావు హెలీకాప్టర్ లో వెళ్ళగా, చెప్పుల స్వాగతం లభించింది. (ఆగస్టు 27) తెలుగుదేశంలో చీలిక వలన ప్రభుత్వం పడిపోయిందేగాని, కాంగ్రెసుకు యిందులో పాత్ర లేదని వారణాసిలో ఇందిరాగాంధీ వ్యాఖ్యానించింది.

శంకర్ దయాళ్ శర్మ గవర్నర్‌గా పదవి చేపట్టిన కాసేపటికే తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి పి. ఉపేంద్ర వచ్చి మంత్రివర్గ విస్తరణకు అనుమతించవద్దన్నాడు. కాని గవర్నర్ వినలేదు. తిరుపతి వెళ్ళే ప్రయాణం కూడా వాయిదా వేసుకొని, 17 మంది మంత్రులతో రాజ్ భవన్ లో ప్రమాణాలు చేయించారు. దీనితో మంత్రిమండలి సంఖ్య 21 అయింది.

విస్తరించిన మంత్రిమండలిలో స్పీకర్ తంగి సత్యనారాయణ, డెప్యూటీ స్పీకర్ ఎ.భీం రెడ్డి మంత్రులయ్యారు. వీరిరువురూ ఢిల్లీలో రాష్ట్రపతి వద్ద కనిపించిన వారే. తంగి సత్యనారాయణ స్వతంత్ర పార్టీ పక్షాన లోగడ శాసనసభ్యుడుగా వుండేవాడు. తరువాత జనతాలోనూ, కాంగ్రెసులోనూ చేరి, పిమ్మట తెలుగుదేశానికి వచ్చాడు. ఆయన్ను మంత్రి గావించడంతో స్పీకర్ పదవి ఖాళీ అయింది.

అదిలాబాద్ జిల్లాకు చెందిన భీం రెడ్డి, తొలిసారిగా ఎం.ఎల్.ఎ. అయ్యాడు. భాస్కరరావు – రామారావు మధ్య ఆసులో గొట్టం వలె ఆయన మారడం చాలామందికి ఆశ్చర్యం కలిగించింది. ఆయన మంత్రి అయినందున డెప్యూటీ స్పీకర్ పదవి కూడా ఖాళీ అయింది. ఇదంతా భాస్కరరావు పథకమే. దీని ఫలితంగానే ప్రోటెం స్పీకర్‌గా ఎం. బాగా రెడ్డిని నియమించారు.

మంత్రిమండలిలో చేరిన ఆనం వెంకటరెడ్డి నష్ట జాతకుడు. లోగడ 1972లో పి.వి.నరసింహారావు మంత్రిమండలిలో యీయన మంత్రి అయిన వారంరోజులకే రాష్ట్రపతి పాలన వచ్చింది. మంత్రిమండలిలో కులాలవారీగా రెడ్లు 8, కమ్మ 4, వెనుకబడిన కులాలు 4, హరిజనులు 2, వెలమ 2 వున్నారు. ఆంధ్ర నుంచి 12 మంది తెలంగాణా నుంచి 9 మంది వున్నారు.

పదిహేను మందికి కార్పోరేషన్ ఛైర్మన్ పదవుల పంపిణీ చేశారు. పాత మంత్రుల యిళ్ళు గొంతుమీద కూర్చుని ఖాళీ చేయించారు. తెలుగుదేశం పార్టీ కోశాధికారిగా ఉన్న తాతినేని ప్రకాశరావుకు ఫిలిం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ అధ్యక్ష పదవి అంటగట్టారు. ఆయన కుమారుడు తాతినేని ప్రసాద్ (ఫిలిం ప్రొడ్యూసర్) రామారావును సమర్థిస్తూ ప్రకటన చేశాడు. రామారావు అనుకూల శాసనసభ్యులను ఛైర్మన్ పదవుల నుంచి తొలగించేశారు.

సినీ హీరో కృష్ణ ఒక పత్రికా ప్రకటనలో భాస్కరరావును సమర్థించాడు. వెంటనే అభిమాన సంఘాలలో సంచలనం బయలుదేరింది. కృష్ణ సినిమాలు నడుస్తున్న థియేటర్లపై దాడి జరిగింది. కొన్నిచోట్ల ప్రదర్శనలు ఆగాయి. ఇదంతా చూచి, తాను రాజకీయ పార్టీలకు అతీతుడనని కృష్ణ ఒక ప్రకటన చేశాడు. భాస్కరరావుకు లాంఛనంగా

అభినందనలు చెప్పానన్నాడు. మళ్ళీ రామారావు ముఖ్యమంత్రి అయినప్పుడు అలాంటి "లాంఛన అభినందనల్ను" వెంటనే చెప్పలేకపోయాడు.

దేశ వ్యాప్తంగా ఆందోళన సాగుతూనే వుంది. ప.బెంగాల్, తమిళనాడులలో బంద్ జరిగింది. పీపుల్స్ యూనియన్ ఫర్ సి.విల్.లిబర్టీస్ పక్షాన ఎన్.ఎ. పాల్కీవాలా, వి.ఎం.తార్కుండే, అరుణ్ శౌరి, సెప్టెంబరు 1న హైదరాబాద్.లో ఒక సమావేశంలో ప్రసంగించారు. యువకులు, మేధావులు చాలా సంఖ్యలో వారి సభలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఆందోళన చ్చేయాలని, భారత్ బంద్ పిలుపు యివ్వాలని ప్రతిపక్షాలు పధకం వేశాయి. బలం వున్నవారికే ముఖ్యమంత్రి పదవి లభిస్తుందని రాజీవ్ గాంధీ అన్నాడు.

భాస్కరరావు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కాగా, పిచ్చి పిచ్చిగా ప్రలాపించాడు. ఎన్.టి.రామారావుకు సి.ఐ.ఎ.తో సంబంధాలున్నాయనీ, ఒక విదేశీ రాజ్యంతో చేతులు కలిపి కేంద్ర ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కుట్ర పన్నాడనీ, కనుక ఆయన్ను దేశ బహిష్కరణ చెయ్యాలన్నాడు. ప్రజలు నవ్వుకున్నారు. తనది "అసలైన" తెలుగు దేశమనీ, తానే పార్టీ పెట్టాననీ, రామారావు వస్తే కార్యకర్తగా చేర్చుకుంటాననీ అన్నాడు. ఇందిరాగాంధీతో, కేంద్రంతో సఖ్యంగా వుండటమే తన విధానమని భాస్కరరావు ప్రకటించాడు.

రామారావు కళల్ని కాలరాచాడంటూ, జమున, మంగళంపల్లి బాలమురళీ కృష్ణ విమర్శించారు. ఆస్థానకవిగా దాశరథికి తిరిగి పదవులు కట్టబెట్టారు. దాశరథి హైకోర్టుకు పోయి తన పదవి విషయంలో ఓడిపోయాడనే విషయం కూడా విస్మరించారు. అనేక మంది ఉద్యోగుల్ని బదిలీలు చేసి తమకు అనుకూలమైన వారిని నియమించుకున్నారు.

ఎన్.టి.రామారావు మెదక్ జిల్లాలోని రామ చంద్రాపురం, సంగారెడ్డి వెళ్ళి ప్రజాప్రదర్శన సభలలో మాట్లాడారు. రామారావు వెంట గుండె నిపుణుడు వుంటూ ఆయన్ను మాట్లాడవద్దని వారించినా వినలేదు. గుండె కొట్టుకునే పద్ధతి చాలా అక్రమ రీతిలో ఉన్నందున ఆందోళన కలిగిస్తున్నదని డాక్టర్లు భయపడ్డారు. రామారావు మొండిగా పర్యటించి, మాట్లాడి శారీరక సంక్షోభం నుంచి బయటపడటం పెద్ద విశేషంగా భావించారు.

ఆంధ్రప్రదేశ్ సమస్యను వీధుల్లోకి లాగారని ఇందిరాగాంధీ ప్రతిపక్షాలను విమర్శించింది. ప్రతిపక్షాలకు పెద్ద సమస్య లభించినట్లయింది. కాంగ్రెసువారు, భాస్కరరావు కోరినా వినకుండా అసెంబ్లీని సమావేశ పరచమని గవర్నర్ సెప్టెంబర్ 4న ముఖ్యమంత్రికి చెప్పాడు. సెప్టెంబరు 11న శాసనసభ పిలవాలని నిర్ణయించారు. అంతటితో ఆందోళనను వాయిదా వేస్తూ ప్రతిపక్షాలు నిర్ణయించాయి. శాసనసభ సమావేశం నాటికి ప్రజలు హైదరాబాద్ చేరుకోవాలనీ ప్రతిపక్ష నాయకులు నాటి సాయంకాలం సందేశం యిస్తారనీ రామారావు పిలుపు యిచ్చాడు. లక్షలాదిగా ప్రజలు హైదరాబాద్ రావడానికి సన్నద్ధులయ్యారు. ఈ ప్రయత్నం ఆపడానికి భాస్కరరావు కేంప్‌లో పథకాలు వేశారు.

కర్నాటకలో వుంటున్న రామారావు మద్దత్తు దారులైన శాసన సభ్యులు ఒక దశలో మైసూరు నుండి నందీహిల్స్‌కు మారారు. కాంగ్రెసువారు, భాస్కరరావు ముఠా విపరీతంగా వెంటబడ్డారు.

ఈ జోరీగ బాధనుండి తప్పించుకోవడానికి మళ్ళీ బస్సులలో వారంతా మైసూరు వెడుతుండగా, ఒక బస్సు ప్రమాదానికి గురైంది. ఆరుగురు ఎం.ఎల్.ఎ.లకు దెబ్బలు తగులగా, నిశ్శంకరరావు వెంకటరత్నం (గుంటూరు)కు తీవ్రంగా తలకు గాయాలు తగిలాయి. బెంగుళూరులో వారిని ఆస్పత్రిలో చేర్చారు. భాస్కరరావు మంత్రిమండలిలోని రామమునిరెడ్డి (ఆరోగ్యశాఖ) పరామర్శ పేరిట బేరాలు సాగించి విఫలుడయ్యాడు. మైసూరు నుండి ఒకే ఒక శాసన సభ్యుడు రజనీబాబు (అలంపూర్ – తెలుగు దేశం, కమ్మ) వెళ్ళి భాస్కరరావు కేంప్.లో చేరాడు.

హైదరాబాద్‌లో జీవన్ రెడ్డి రామముని రెడ్డి యిళ్ళు కేంప్‌లుగా మారాయి. భాస్కరరావు అనుకూలురు రోజూ అక్కడకలసి చర్చలు చేశారు. తరువాత యూసఫ్‌గూడలోని సి.దాసు (మాజీ కాంగ్రెసు మంత్రి) యింటికి కేంప్ మార్చారు. సినీ నిర్మాత తిలక్ యీ కేంప్‌కు నిర్వాహకుడు. ఖాళీ చేసిన మంత్రుల ఇళ్ళలో రౌడీలు, గూండాలు చేరారు. నాటుబాంబులతో సహా అనేక ఆయుధాలు సమకూర్చుకున్నారు. ఇందులో ఇద్దరు ఆడరౌడీలు కూడా ప్రముఖ పాత్ర

వహించారు. హొటళ్ళలో కూడా భాస్కరరావు మద్దత్తు దారులు చేరి విపరీతంగా పైరవీలు చేశారు. మంచినీళ్ళ ప్రాయంగా డబ్బు ఖర్చు చేశారు.

అసెంబ్లీ సమావేశం తేదీ ప్రకటించగానే మైసూరులోవున్న శాసనసభ్యులు బస్సులలో, కార్లలో బెంగుళూరు బయలుదేరారు. (సెప్టెంబరు 9) వారి వెంట పర్యవేక్షకులుగా అరుణ్ శౌరి, చోరామస్వామి, అప్ప కూడా వున్నారు. బెంగుళూరులో విద్యామంత్రి రఘుపతి ఇంట్లో ఉదయం అల్పాహారం తీసుకునే సందర్భంగా కాంగ్రెస్ (ఐ) శాసనసభ్యుడు పాలకొండ రాయుడు (కడపజిల్లా) వచ్చి చేరాడు. సెప్టెంబరు 9న ఈ శాసన సభ్యులు రాయచూర్ చేరారు. ప్రతిపక్షనాయకులు వెంకయ్యనాయుడు, జయపాల్ రెడ్డి, ఓంకార్, రజబలి, రాఘవ రెడ్డి, రాంచంద్రారెడ్డితో సహా అందరూ కలసికట్టుగా ప్రయాణం సాగించారు.

సెప్టెంబరు 9, హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనం వూరేగింపులు ఉదయం నుంచే రాజధాని వివిధ ప్రాంతాలలో బయలుదేరాయి. భాస్కరరావు కేంప్‌లో జరిగిన కుట్ర, పథకం ప్రకారం కొందరు రౌడీలు పెట్రోలు డబ్బాలతో బయలుదేరి కేవలం ముస్లింల షాపులు, హొటళ్ళు తగులబెట్టారు. హైదరాబాద్ ప్రధాన వీధులలో లిబర్టీ టాకీస్ వరకూ జరిగిన యీ దహనకాండ వలన, బి.జె.పి. వారే యీ పనిచేసి వుంటారనే అపోహ కలిగించారు. హైదరాబాద్ నగరమంతటా కర్ఫ్యూ విధించారు. రామారావు రక్తపాతం జరుగుతుందన్నాడనీ, ఒక మతంవారు యీ దహన కాండ చేశారనీ ముఖ్యమంత్రి భాస్కరరావు టి.వి. ప్రసంగం చేసి యింకా రెచ్చగొట్టాడు.

బెంగుళూరులో చికిత్స పొందుతున్న శాసనసభ్యులు సెప్టెంబరు 9న విమానంలో హైదరాబాద్ వచ్చారు. వారిని ఎత్తుకపోవాలని భాస్కరరావు ముఠా విమానాశ్రయంలో విఫలప్రయత్నం చేసింది. 6గురు ఎం.ఎల్.ఎ.లు రామకృష్ణా స్టూడియోస్.కు సురక్షితంగా చేరారు.

సెప్టెంబరు 10 మధ్యాహ్నానికి రాజధాని శివార్లకు చేరిన రామారావును, ఆయన మద్దత్తుదార్లను పోలీసు అధికారులు అటకాయించారు. పోలీస్ వాన్‌లలో తీసుకెడతానన్నారు. వాదోపవాదాలతో గంటలు గడిచిన అనంతరం అసెంబ్లీకి వెళ్లడానికి అనుమతించారు. అసెంబ్లీవద్ద కూడా ఎం.ఎల్.ఎ.లను ఎత్తుకపోయే ప్రయత్నాలు జరిగాయి. గుర్తింపు కార్డులు అతి జాప్యంగా జారీచేసిన అనంతరం, ప్రయాణపు బడలికతో ఉన్న శాసనసభ్యులు రామకృష్ణస్టూడియోస్‌కు చేరారు. ఎప్పటికప్పుడు స్టూడియోస్.పై దాడి జరుగుతుందనే భయంతో గడిపారు.

సెప్టెంబరు 11 శాసనసభ సమావేశం ఉదయం 11 గంటలకు జరుగవలసి వున్నది. ప్రోటెం స్పీకర్‌గా కాంగ్రెసు మాజీ మంత్రి ఎం.బాగారెడ్డిని నియమించారు. లోగడ ఇందిరాగాంధీకి ఎన్నికల ఏజంటుగా పనిచేయడానికి తాత్కాలిక మంత్రి పదవికి రాజీనామా యిచ్చిన బాగారెడ్డి న్యాయంగా నిర్వహిస్తాడనే నమ్మకంలేదు. దీనికి తగ్గట్లే, తమకు వేరే బ్లాక్ ఏర్పరచమని రామారావు కోరగా, రెండు తెలుగుదేశాలున్నట్లు తనకు తెలియదని బాగా రెడ్డి అన్నాడు. ఒక ముఠాకు తమ పార్టీ మద్దత్తు యిస్తున్న విషయం విస్మరించాడు బాగారెడ్డి. కేవలం భాస్కరరావు బలం తేల్చడానికి శాసనసభను పిలిచారు. ఆ విషయం కూడా గమనించకుండా సంప్రదాయబద్ధంగా సంతాప తీర్మానాన్ని చర్చనీయాంశంలో ప్రవేశపెట్టాడు. విదేశాలనుండి, రాష్ట్రం వెలుపల నుండి వచ్చిన విలేఖరులను అనుమతించలేదు కర్ఫ్యూలో శాసనసభను సమావేశపరిచారు. భయానక వాతావరణాన్ని సృష్టించారు. శాసన సభ్యులను శోధించి, మెటల్ డిటెక్టర్ ద్వారా లోనికి పంపారు. బి.జె.పి శాసనసభ్యుడు నరేంద్రను నిర్బంధించారు. ఆయన్ను ఓటెయ్యనివ్వాలని హైకోర్టు ఆదేశించింది.

శాసనసభలో ఎలాంటి గొడవలు జరపరాదని, అవతలివారు రెచ్చగొట్టినా ప్రశాంతంగా వుండాలని రామకృష్ణా స్టూడియోస్‌లో రామారావు వర్గం నిర్ణయించింది. అసెంబ్లీలో ఓటింగ్ జరిగితే పరువు పోతుంది కనుక, ఏమైనాసరే సభను జరగనివ్వరాదని భాస్కరరావు కేంప్‌లో నిర్ణయించారు. అంతేగాక నూరు అద్దెకార్లుసిద్ధంగా వుంచి, అసెంబ్లీ నుంచి రామారావు మద్దత్తుదార్లను సాధ్యమైనంత సంఖ్యలో ఎత్తుకపోవాలని పథకం వేశారు.

సెప్టెంబరు 11న శాసనసభ సమావేశం ప్రారంభం కాగానే ఎన్. శ్రీనివాసులు రెడ్డి పాయింట్ ఆఫ్ ఆర్డర్ లెవనెత్తి మాట్లాడబోయాడు. ఇది అవకాశంగా తీసుకొని భాస్కరరావు వర్గం గందరగోళం చేసింది. అరుపులు, కేకలు, చప్పట్లు, తిట్లు, బల్లలు చరచడం, మైకులు వూడపెరకడం ఒకటేమిటి – వారు చేయని అఘాయిత్యం అంటూలేదు. మధ్యలో

రామారావు మీదకు వెళ్ళబోగా మార్షల్స్ గోడకట్టి ఆపారు. ఆనాడు భాస్కరరావు పక్షం తిట్టిన తిట్లు అచ్చువేయడానికి, నాగరికులు ఉచ్చరించడానికి పనికిరానివి. ఇంత గందరగోళం మధ్య కొందరు కాంగ్రెసు సభ్యులు కూడా తమ పాత్ర నిర్వహించి భాస్కరరావుకు తోడ్పడ్డారు. మజ్లీస్ వారు కూడా ఉర్దూలో తామూ తీసిపోమంటూ బూతులు మాట్లాడారు. దీనికి ఒవాసి నాయకత్వం వహించాడు. ముఖ్యమంత్రి భాస్కరరావు మాత్రం తన వారిని ఆపడానికి ప్రయత్నించలేదు. పైగా ఆయనకూడా ఒక చెయ్యి వేశాడు. విశాఖపట్టణం తెలుగుదేశం శాసనసభ్యుడు డా.వాసుదేవరావు మృతికి సంతాపం వ్యక్తం చేసే తీర్మానం ఆమోదించకుండానే, బాగారెడ్డి సభను మరునాటికి వాయిదా వేశాడు. అంటే భాస్కరరావు ఎం.ఎల్.ఎ.ల వేటకు మరో 24 గంటలు అవకాశం యిచ్చాడన్నారు.

సెప్టెంబరు 11 రాత్రి ఎన్.టిరామారావు ఇంటిపై దాడిచేసి కొందరిని అరెస్టు చేసి, వారివద్ద ఆయుధాలు పట్టుకున్నామన్నారు. కర్ఫ్యూ సడలించగా పాత బస్తీలో యీసారి ముస్లింలు కసిగా హిందువులపై దాడిచేశారు. మళ్ళీ కర్ఫ్యూ పెట్టి సైన్యాన్ని పిలిచారు.

సెప్టెంబరు 12వ తేదీ శాసనసభలో భాస్కరరావు వర్గం మరీ రెచ్చిపోయి ప్రవర్తించింది. కాంగ్రెసువారు మౌనం వహించారు. రామారావు వర్గం ఓరిమిచూపింది. గ్రంథి మాధవి, బగ్గిడి గోపాల్, పి. రామస్వామి, థామస్ చౌదరి, దేవయ్య, శాయిలు, జీవన్ రెడ్డి, రామముని రెడ్డి చేసిన గొడవకు అందరూ విస్తుబోయారు. మంత్రులమనే విషయం మరచి వారు అసెంబ్లీని చేపల మార్కెట్ చేశారు. ఒక మంత్రి అందరితోబాటుగాక, ఒక ఉన్నత పోలీస్ అధికారి కారులో వచ్చి మెటల్ డిటెక్టర్‌ను తప్పించుకొని, అసెంబ్లీలో చేతిబాంబు విసిరేశాడు. అది పేలకముందే అధికారులు తీసేశారు. బాంబు వలన చల్లాచదరయ్యే ఎం.ఎల్.ఎ.లను ఎత్తుకపోవాలనుకున్నారు, యధావిధి బాగారెడ్డి మరోరోజు వాయిదా వేశాడు. ఆనాడు భాస్కరరావు కేంప్ నుంచి ఈనాడు పత్రికపైనా, రామోజీరావు (ఎడిటర్) పైనా దాడి చేయాలని పథకం వేశారు. ఆయన యీ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి, రక్షణ అడిగారు. భాస్కరరావు కేంప్ వారు రామకృష్ణ ఎస్టేట్ పైన దాడి చేయాలనుకున్నారు.

సెప్టెంబరు 13న కూడా శాసనసభలో పరిస్థితి మారలేదు. ప్రోటెంస్పీకర్ బాగారెడ్డి సభను వాయిదా వేసి తన పదవికి రాజీనామా యిస్తున్నట్లు సభకు తెలియజేశారు. అంతవరకూ సభలోనే కూర్చున్న సభ్యులు నెమ్మదిగా బయటకు వెళ్ళారు. బ్లడ్ ప్రెజర్ పెరిగిందంటూ, డాక్టర్ల సలహాపై గాంధీ ఆస్పత్రిలో చేరిన బాగారెడ్డి రెండు రోజుల తరువాత ఇంటికి చేరారు.

బాగారెడ్డి స్థానంలో మజ్లీస్ నాయకుడు సుల్తాన్ సలావుద్దీన్ ఒవాసీని ప్రోటెం స్పీకరుగా నియమించారు. ఇది తగదని రామారావు అభ్యంతరం పెట్టారు. రాజ్యసభకు తన వారందరినీ తీసుకెళ్ళి గవర్నర్‌కు చూపారు. ప్రతిపక్ష నాయకులు కూడా వెంట వున్నారు. విలేఖరులు మరోసారి ఎం.ఎల్.ఎ.లను లెక్కబెట్టారు. ప్రతిపక్షాలు మళ్ళీ ఆందోళనకు సిద్ధమయ్యాయి.

ప్రోటెం స్పీకర్ ఒవాసీకి ఇంగ్లీషు, తెలుగు రాదు. ఉర్దూ ఒక్కటే అసెంబ్లీకి కుదరదు. రామారావును విపరీతంగా తిట్టిన ఒవాసీ న్యాయం చేకూర్చగలడనే నమ్మకం లేదు. ఆయనపై మతకలహాల సందర్భంగా నేరారోపణలున్నాయి. అనేకసార్లు జైలుకు వెళ్ళి కలహాల కారణంగా శిక్ష అనుభవించాడు. అలాంటి ఒవాసీ హఠాత్తుగా తాను గాంధేయుడినన్నాడు. బహుశ సంజయ్ గాంధీ కావచ్చునుకున్నారు. అసెంబ్లీ సమావేశం వెంటనే జరపకుండా సెప్టెంబరు 20వ తేదీ నిర్ణయించాడు. మత కలహాల చర్చ కూడా ఎజండాలో చేర్చాడు. ఆయన నియామకాన్ని భాస్కరరావు సమర్థించాడు.

ఈలోగా భాస్కరరావు సెలవునాడు కూడా ఆఫీసులు పెట్టి, త్వరగా ఫైళ్ళు నడిపించాడు. అనుమానాస్పదమైన అనేక లావాదేవీలు పూర్తి గావించాడని అనుకున్నారు.

రామకృష్ణా స్టూడియోస్.లో నిర్బంధానికి గురైన ఎం.ఎల్.ఎ.లను వదలి పెట్టాలని కాంగ్రెసు వారు, భాస్కరరావు యుగళ గీతాలు పాడారు.

తాము ఐచ్ఛికంగా వుంటున్నామనీ, కావాలంటే రాజధానిలోని మాజీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులచే పరిశోధించమని ప్రతిపక్ష నాయకులు ప్రకటించారు.

ఇట్లా కథ నడుస్తుండగా, కేంద్ర హోమ్ శాఖ కార్యదర్శి వలి వచ్చి పరిస్థితి చూచివెళ్ళి నివేదించాడు. హైదరాబాద్.లో మకాం వేసిన విజయ భాస్కర రెడ్డి ఢిల్లీ వెళ్ళి నివేదించాడు. శాసన మండలి అధ్యక్షుడు ముఖాసిర్.షా బెంగుళూరు వెళ్ళి పర్యటనలో వున్న ఇందిరాగాంధీని కలసి పరిస్థితి వివరించాడు. ఈ పరిణామాల వలన పరిస్థితి మారింది.

భాస్కరరావుకు లోగడ గవర్నర్ రాంలాల్ యిచ్చిన నెల గడువు ముగిసింది. అసెంబ్లీని గడువులోగా పిలిచాను. నా తప్పు లేదని భాస్కరరావు సంజాయిషీ చెప్పాడు._సెప్టెంబరు 17 నుంచీ ఆందోళనకు పిలుపు యిచ్చారు ప్రతిపక్షాలవారు.

సెప్టెంబరు 16 ఉదయాన్నే భాస్కరరావును గవర్నర్ పిలిచి రాజీనామా యివ్వమన్నాడు. రామారావును నాయకత్వం స్వీకరించమని కూడా పిలిచాడు. ఆగ్రహంతో భాస్కరరావు ఆఖరు మంత్రిమండలి సమావేశం జరిపి, రాజీనామా సమర్పించాడు. గవర్నర్ తప్పుచేశాడనీ, మదన్ మోహన్.ను పిలవాల్సిందనీ ప్రేలాపించాడు.

---------

## ముఖ్యమంత్రి
## ఎన్. భాస్కరరావు

ఆగస్టు 16 – సెప్టెంబర్ 16, 1984

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | ఎన్. భాస్కరరావు | ముఖ్య మంత్రి |
| 2. | జీవన్ రెడ్డి | పన్నులు |
| 3. | రామముని రెడ్డి | మెడికల్ సర్వీసెస్ |
| 4. | ఎస్. సత్యనారాయణ | రవాణా |
| 5. | తంగి సత్యనారాయణ | రెవెన్యూ |
| 6. | ఎ. భీమా రెడ్డి | పౌర సరఫరాలు |
| 7. | ఎమ్. కిషన్ రావు | విద్య |
| 8. | ఎమ్. రామచంద్రరావు | కార్మిక శాఖ |
| 9. | పి. రామస్వామి | వృత్తి విద్య |
| 10. | ఎమ్. భూపాల్ చౌదరి | రోడ్లు, భవనాలు |
| 11. | ఎస్. వి. సుబ్బారెడ్డి | విద్యుత్తు, గనులు |
| 12. | ఆనం వెంకట రెడ్డి | నీటి పారుదల |
| 13. | సి. ఆర్. సురేందర్ రెడ్డి | చిన్న తరహా నీటిపారుదల |

14. ఇ. వి. గోపాల రాజు దేవాదాయ

15. వి. లక్ష్మీ నారాయణ పరిశ్రమలు

16. జి. మోహన్ రెడ్డి వ్యవసాయం

17. జి. మల్లికార్జున రావు గృహనిర్మాణశాఖ

18. ఎమ్. నరసయ్య హరిజన సంక్షేమ

19. శ్రీమతి త్రిపురన వెంకటరత్నం మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ

20. వి. వి. నారాయణ రెడ్డి అటవీ శాఖ

21. శ్రీమతి నన్నపనేని రాజకుమారి సాంస్కృతిక వ్యవహారాలు

------

# ఎన్.టి. రామారావు రెండోసారి ముఖ్యమంత్రిగా

రామారావును గవర్నర్ పిలిచిన వార్త విని ప్రతిపక్షాలు ఆందోళనను విరమించాయి. ప్రజలు రాష్ట్రమంతటా వేడుకలు జరుపుకున్నారు. గవర్నర్, రామారావుకు నెలరోజులు గడువిస్తూ బలం నిర్ధారించమన్నాడు. మూడు రోజులలో తేల్చేస్తానని రామారావు చెప్పాడు. ప్రోటెం స్పీకర్‌గా ఒవాసీని తొలగించి, మహేంద్రనాథ్‌ను నియమించారు. అన్యాయం అంటూ ఒవాసీ వాపోయాడు. శాసనసభ సమావేశం సెప్టెంబరు 20న జరిగింది. శాసనసభలో తన బలం రుజువయ్యేవరకూ నిర్ణయాలు తీసుకోనని రామారావు ప్రకటించారు. తనను ప్రతిపక్ష నాయకుడుగా గుర్తించాలని 66 మంది తనను ఎన్నుకున్నారని దిగిపోయిన ముఖ్యమంత్రి స్పీకర్‌ను అడిగాడు. 20వ తేదీ సమావేశంలో కూడా గందరగోళం చేసి, సభ జరగకుండా చూడాలని భాస్కరరావు కేంప్ నిర్ణయించింది. ఈ సమావేశానికి విలేఖరులందరిని రానిచ్చారు.

ప్రోటెం స్పీకర్ మహేంద్రనాథ్ సభలో స్పీకర్ ఎన్నిక విధానాన్ని ప్రకటించి ఎన్నిక ప్రారంభించారు. భాస్కరరావు లేచి ప్రోటెం స్పీకర్ ఎంపిక చెల్లదన్నాడు. మిగిలిన సభ్యులు అందుకుని గొడవచేశారు. అక్షర క్రమంలో సభ్యుల పేర్లు పిలుస్తుండగా, ఓట్లు వేయడం మొదలైంది. నిశ్శంకరరావు వెంకట రత్నం తెలుగుదేశం అభ్యర్థి విజయరామరాజు (బాపట్ల) భాస్కరరావు అభ్యర్థి, కాంగ్రెసు మాజీ ముఖ్యమంత్రి అంజయ్య, మాజీమంత్రి బాగారెడ్డితో సహా 9 మంది కాంగ్రెసు నుండి, భాస్కరరావు ముఠానుండి ఓట్లు వేశారు. ఇలా సాగిపోతే పరువుపోతుందని భాస్కరరావు పక్షాన పెద్ద గొడవ చేశారు. కోట భాస్కరరావు తనకిచ్చిన బాలెట్ పేపరు తీసుకొని గుర్తు పెట్టేటప్పుడు మామూలు దుస్తులతో వున్న గూఢచారులు చూస్తున్నారని, రహస్యం లేదని అభ్యంతర పెట్టాడు. ఒక దశలో బాలెట్ పెట్టెను లాగేసుకోబోయారు. మార్షల్స్ 5గురు సభ్యుల్ని తొలగించారు. కాంగ్రెసువారిలో కొందరు భీభత్సకాండలో పాల్గొన్నారు. మొత్తం 15 మైకులు పీకేశారు. ఆరుపుల సంగతి సరేసరి. ఆదశలో భాస్కరరావు, మదన్ మోహన్ తమవారితో సహా బయటకు వెళ్ళి గవర్నర్ వద్దకు ఫిర్యాదుకై వెళ్ళారు. దెబ్బలు తగిలిన సభ్యుల్ని ఆస్పత్రికి తీసుకెళ్ళాలిగాని రాజ్.భవన్‌కు ఎందుకనీ, అసెంబ్లీ వుండగా తానేమి చేస్తానని గవర్నర్ చెప్పినట్లు తెలిసింది.

ఈలోగా స్పీకర్ ఎన్నిక పూర్తి అయింది. నిశ్శంకరరావు వెంకటరత్నానికి 169 ఓట్లు, విజయరామరాజుకు 9 రాగా, 4 ఓట్లు చెల్లలేదు. ఒక బాలెట్ పేపరు ఎత్తుకపోయారు.

నిశ్శంకరరావు వెంకటరత్నం స్పీకర్.గా సంతాప తీర్మానం ప్రవేశపెట్టిన అనంతరం, రామారావు తనపై విశ్వాసం ప్రకటించమని సభను కోరారు. లోగడ భాస్కరరావు వైపు వెళ్ళి మంత్రి అయిన భీం రెడ్డి లేచి రామారావును సమర్ధించాడు. ఆయన్ను శాసనసభనుంచి బయటకు తీసుకెళ్ళాలని కాంగ్రెసువారు (బాపిరాజు) భాస్కరరావు వర్గం విఫల ప్రయత్నం చేసింది.

శాసనసభలో 4గురు అధికారులు 4 బ్లాకులుగా నిలుచున్న సభ్యులను లెక్కించారు. ఇందులో ఒక అధికారి లోగడ మాజీ కాంగ్రెసు మంత్రి సి.దాసు ఆంతరంగిక కార్యదర్శిగానూ, మరో అధికారి మాజీ మంత్రి కొండయ్య చౌదరి ఆంతరంగిక కార్యదర్శిగానూ పనిచేశారు. వారంతా లెక్కించి 161 మంది అనుకూలురని సంఖ్య తేల్చారు. అయినా రామారావుకు బలం ఉన్నట్లే కాని మంత్రి శ్రీనివాసులురెడ్డి స్పీకర్ ప్రకటనకు అభ్యంతరం తెలుపుతూ, స్పీకర్‌కు 169 రాగా ముఖ్యమంత్రికి 161 ఎలా వస్తాయన్నారు. ప్రొటెం స్పీకర్ మహేంద్రనాథ్, మాజీ మంత్రి బీంరెడ్డిని కలుపుకుంటే 171 రావాలి. మళ్ళీ పేరు పేరునా లెక్కించమని శ్రీనివాసులు రెడ్డి కోరారు. స్పీకర్ అందుకు సిద్ధపడుతుండగా భాస్కరరావు ముఠా ప్రవేశించి విశ్వాస తీర్మానంపై చర్చ జరగాలన్నారు. ఆ విషయం ముగిసిందనీ, సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నామనీ స్పీకర్ ప్రకటించారు. ఏమీ తోచని భాస్కరరావు వర్గం,  మిగిలిన వారు వెళ్ళిపోయిన తరువాత అసెంబ్లీలో నిలబడి ప్రోటెం స్పీకర్.గా ఒవాసీని, సభానాయకుడుగా భాస్కరరావును ఎన్నుకున్నట్లు అరిచారు. లెక్కించడంలో వచ్చిన పొరపాటును స్పీకర్ తనపై వేసుకున్నాడు. భాస్కరరావు వర్గం గంగవెర్రులెత్తి అర్ధంపర్ధం లేని ప్రకటనలు చేశారు.

రామారావు ముఖ్యమంత్రిగావడం, అధ్యక్షపాలన వస్తుందని అంచనా వేసిన వారిని ఆశ్చర్యపరచింది. ఇందిరాగాంధీతో లోపాయికారిగా రామారావు రాజీపడినందున యిలా జరిగిందన్నారు. సెప్టెంబరు 20వ తేదీ సాయంత్రం హైదరాబాద్.లో ప్రజా విజయోత్సవ సభలో శాసన సభ్యులను సన్మానించారు. కనుక దొంగ ఓట్లు వేయించారనే కాంగ్రెసువారి అపవాదుకు అర్థంలేకుండా పోయింది. ప్రతిపక్షపార్టీల నాయకులు రామారావును అభినందిస్తూ, ఇందిరాగాంధీని విమర్శించారు. రామారావు ఆనాడు ఇందిరా గాంధీ జోలికి పోలేదు. వ్యక్తిగతంగా తనకు ఆమెపై ద్వేషం ఏనాడూ వెల్లడించలేదనీ, రాష్ట్ర హక్కులకై పోరాడాననీ రామారావు అన్నాడు. భాస్కరరావు మాత్రం ప్రత్యేక కుంపటి పెట్టి ప్రకటనలు చేశాడు. కొందరు సభ్యులు రామారావు పక్షాన చేరారు.

పి. రామచంద్రారెడ్డి, యతి రాజారావు, పాలకొండనాయుడు తెలుగుదేశంలో చేరారు. రజనీబాయి, సక్కుబాయి, సుమన రామారావు పక్షానికి వచ్చారు. సెప్టెంబరు 20న కూడా అసెంబ్లీలో గొడవ చేసిన కాంగ్రెసువారు పరువూ, మర్యాద (వున్నకాస్తా) పోగొట్టుకొని, నోటమాటరాక వున్నారు. భాస్కరరావు పక్షాన వున్నవారు రాజకీయంగా హత్యకు గురైనారు.

ఇందిరాగాంధీకి ఎన్.టి.రామారావుకు మధ్య లోపాయికారిగా ఎన్.జి.రంగా, వై.నాయుడమ్మ, ముఖసిర్ షా రాయబారాలు చేశారని వదంతులు వ్యాపింపజేశారు.

రాష్ట్ర కార్యాలయాలలో మళ్ళీ పైరవీకారులు, గుండాలు, రౌడీలు అదృశ్యమయ్యారు. ప్రజాస్వామ్యం ఒక నెలరోజులపాటు కఠిన శిక్షకు గురై, తిరిగి స్వేచ్ఛ పొంది బ్రతికి బట్టకట్టింది.

----------

# ముఖ్యమంత్రి
# ఎన్.టి.రామారావు

రెండవ మంత్రివర్గం
సెప్టెంబర్, 1984 – డిసెంబర్ 1984

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | ఎన్. టి. రామారావు | ముఖ్య మంత్రి |
| 2. | ఎన్. శ్రీనివాసులు రెడ్డి | ఆర్థిక శాఖ |
| 3. | పి. మహేంద్ర నాథ్ | రెవెన్యూ |
| 4. | సిహెచ్.హరిరామ జోగయ్య | గృహనిర్మాణ |
| 5. | కె. జానా రెడ్డి | పంచాయతీ రాజ్ |
| 6. | వై. రామకృష్ణుడు | మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ |
| 7. | మహ్మద్ షకీర్ | అటవీ శాఖ |
| 8. | శ్రీమతి కె. ప్రతిభా భారతి | సాంఘిక సంక్షేమ శాఖ |
| 9. | కె. రామచంద్రరావు | సహకార శాఖ |
| 10. | కె. నారాయణ స్వామి | మధ్యతరహా, చిన్న తరహా నీటిపారుదల శాఖ |
| 11. | ఆర్. రాజగోపాల రెడ్డి | రవాణా |
| 12. | వసంత నాగేశ్వరరావు | వ్యవసాయ శాఖ |
| 13. | ఎ. ప్రభాకర రావు | కార్మిక, ఉపాధి |
| 14. | ఎ. సత్యనారాయణ | ఆహార, పౌరసరఫరాలు |
| 15. | ఎస్.రామచంద్రారెడ్డి | జంతు సంరక్షణ, మత్స్య శాఖ |
| 16. | బి. వి. మోహన్ రెడ్డి | రోడ్లు, భవనాలు |
| 17. | ఎన్. రాజారెడ్డి | చేనేత, వస్త్ర పరిశ్రమలు |
| 18. | ఆరేటి కోటయ్య | మార్కెటింగ్ |
| 19. | ఆనంద గజపతి రాజు | మెడికల్, హెల్త్ సర్వీసెస్ |

**రాష్ట్ర మంత్రులు**

| | | |
|---|---|---|
| 1. | కె. అప్పల నాయుడు | దేవాదాయ శాఖ |
| 2. | జి. ఎమ్. కె. నాయుడు | విద్యాశాఖ |

| | | |
|---|---|---|
| 3. | డి. సత్యనారాయణ | పన్నులు |
| 4. | ఎస్. ఎ. కృష్ణ | చిన్నతరహా పరిశ్రమలు, ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు |
| 5. | బోయని రాజయ్య | ఎస్. సి. సంక్షేమ శాఖ |
| 6. | ఎమ్. నరసింహులు | గనులు, జియోలజీ |
| 7. | పి. చంద్ర శేఖర్ | న్యాయశాఖ |
| 8. | ఎస్. రాజశేఖర్ | పర్యాటక, సాంస్కృతిక శాఖ |

ముఖ్యమంత్రి

**ఎన్. టి. రామారావు**

మూడవ మంత్రివర్గం

జనవరి 1985 – డిసెంబర్ 1989

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | ఎన్. టి. రామారావు | ముఖ్య మంత్రి |
| 2. | ఎస్. శ్రీనివాసులు రెడ్డి | రెవెన్యూ |
| 3. | పి. మహేంద్రనాథ్ | ఆర్ధిక శాఖ |
| 4. | కె. జానా రెడ్డి | రవాణా |
| 5. | కె. రామచంద్ర రావు | పంచాయత్ రాజ్ |
| 6. | శ్రీమతి కె. ప్రతిభా భారతి | సాంస్కృతిక, స్త్రీ సంక్షేమ |
| 7. | వై. రామకృష్ణుడు | కో-ఆపరేషన్ |
| 8. | ఆర్. రాజగోపాల రెడ్డి | వ్యవసాయం |
| 9. | వసంత నాగేశ్వరరావు | గృహనిర్మాణశాఖ |
| 10. | ఎస్. రామచంద్రా రెడ్డి | చిన్నతరహా పరిశ్రమలు |
| 11. | ముద్దు కృష్ణమనాయుడు | విద్య |
| 12. | కె. ఇ. కృష్ణమూర్తి | భారీ పరిశ్రమలు |
| 13. | పి. యతి రాజారావు | దేవాదాయ శాఖ |
| 14. | అశోక్ గజపతి రాజు | వాణిజ్య పన్నులు |
| 15. | ఎమ్. పద్మనాభం | పన్నులు |
| 16. | డి. సత్యనారాయణ | గనులు |

**రాష్ట్ర మంత్రులు**

| | | |
|---|---|---|
| 1. | అయ్యన్నపాత్రుడు | వృత్తి విద్య, ఆటలు |
| 2. | ఫరూక్ | వక్ఫ్ |
| 3. | పి. ఇంద్రారెడ్డి | కార్మిక సంక్షేమ శాఖ |
| 4. | ఎమ్.ఎస్.ఎస్. కోటేశ్వరరావు | మెడికల్, హెల్త్ |
| 5. | మణిపాల్ రెడ్డి | అటవి శాఖ |
| 6. | జి. రామారావు | హరిజన, గిరిజన సంక్షేమం |
| 7. | రాజేశం గౌడ్ | న్యాయ శాఖ |
| 8. | కె. కళా వెంకటరావు | మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ |

**మే 14, 1986 నాటి**
**మంత్రి వర్గ విస్తరణ**

| | | |
|---|---|---|
| 1. | పత్తి మణెమ్మ | స్త్రీ, శిశుసంక్షేమ, స్త్రీ ఉపాధి పథకాలు, పర్యాటక శాఖ |
| 2. | హెచ్. బి. నర్సా గౌడ్ | న్యాయ, కోర్టులు, రక్షణ, రిజిస్ట్రేషన్ యాక్ట్, గనులు, జియోలజీ |
| 3. | ఎమ్. నరసింహులు | విద్యుత్తు |
| 4. | ఎమ్. కాశి రెడ్డి | చేనేత, వస్త్ర పరిశ్రమ, సెరీకల్చర్ |
| 5. | టి. నాగేశ్వరరావు | చిన్నతరహా నీటిపారుదల, భూగర్భ నీటి మరియు మురుగనీటి పారుదల |

------

# మళ్ళీ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా

1989లో శాసనసభ ఎన్నికలు జరిగాయి. అప్పుడు రాష్ట్రంలో డా.చెన్నారెడ్డి రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులుగా వున్నారు. ఎన్నికలలో తెలుగుదేశం ఓటమిని చవిచూచింది. ప్రతిపక్ష స్థానంలోకి పోయింది. కాంగ్రెసు ఏడేళ్ళ అనంతరం మళ్ళీ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ శాసనసభా పక్షంలో నాయకత్వ పోటీ జరిగింది. తనకు బలం ఉన్నదని నేదురుమల్లి జనార్ధన రెడ్డి అన్నారు. కానీ మర్రి చెన్నారెడ్డి ముగ్గురు పరిశీలకుల సమక్షంలో నాయకులుగా ఎన్నికయ్యారు. రెండవసారి అలా ముఖ్యమంత్రి అయిన చెన్నారెడ్డి హైదరాబాదులోని నిజాం కాలేజి గ్రౌండ్స్.లో తన మంత్రివర్గం చేత ప్రమాణస్వీకారం చేయించాడు. అధికారంలోకి రాగానే కొన్ని తెలుగుదేశం కార్యక్రమాలను పక్కకు పెట్టి కొత్త పథకాలను చేపట్టాడు. అయితే చెన్నారెడ్డి రెండవసారి ముఖ్యమంత్రి అయ్యేనాటికి కేంద్రంలో కాంగ్రెసు పార్టీ అధికారంలో లేదు. రాష్ట్రంలో 1990 వేసవిలో పెద్ద తుఫాను వచ్చి భీభత్సం జరిగింది. ప్రభుత్వం గడ్డు పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. మరొక వైపున నక్సలైట్ల పట్ల చెన్నారెడ్డి ఉదాసీన వైఖరిని చూపెట్టాడు. ప్రభుత్వ వైఖరిని ఆసరా చేసుకుని నక్సలైట్ మూఠాలు విజృంభించాయని విమర్శలు వచ్చాయి. అంతటితో వారిని అణచడానికి చెన్నారెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎన్.కౌంటర్లు జరిగాయి. హింస ప్రజ్వరిల్లింది.

మర్రి చెన్నారెడ్డి అప్పటికే కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చికిత్స నిమిత్తం అమెరికా వెళ్ళాడు. 50 రోజుల పాటు అక్కడే ఉండవలసి వచ్చింది. ఆయన కుమారుడు యిచ్చిన కిడ్నీతో కాలేయ మార్పిడి చేయించుకుని తిరిగి వచ్చాడు. ఈలోగా కాంగ్రెసు పార్టీలో చెన్నారెడ్డి వ్యతిరేక వర్గం తీవ్రస్థాయిలో ఆయనకు వ్యతిరేక చర్యలు చేపట్టారు. ఆయనను తొలగించాలని పట్టుబట్టారు. దాంట్లో వై.యస్.రాజశేఖర రెడ్డి, కావూరి సాంబశివరావు, బాలాగౌడ్ రాష్ట్ర పర్యటన చేసి చెన్నారెడ్డి గుట్టు బట్టబయలు చేశారు. జి.వి.సుధాకరరావు, నల్లపు రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సంగీతం వెంకటరెడ్డి వంటివారు వారికి మద్దతు పలికారు. కానీ చెన్నారెడ్డిని తొలగించబోవడంలేదని ప్రధాని రాజీవ్ గాంధీ స్పష్టం చేశారు. మరొకవైపు స్పీకర్.గా వున్న పి.రామచంద్రారెడ్డికి ముఖ్యమంత్రితో భేదాభిప్రాయాలు వచ్చాయి. మల్లు అనంతరాములు కూడా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడుగా చెన్నారెడ్డిని వ్యతిరేకించారు. చనిపోయిన మల్లు అనంతరాములు స్థానంలో వి.హనుమంతరావును కాంగ్రెస్ అధ్యక్షుని చేశారు. ఈలోగా 1990 డిసెంబర్.లో రాష్ట్ర రాజధానిలో హిందూ ముస్లిం కలహాలు తీవ్రస్థాయిలో జరిగాయి. సైన్యాన్ని పిలిపించవలసి వచ్చింది. కర్ఫ్యూ విధించారు. అలాంటి దశలో తన అనుచరులకు ఎడాపెడా పదవులు పంపిణీ చేసి మర్రిచెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా రాజీనామా చేశారు. ఆయనకు వ్యతిరేక వర్గాలన్నీ అప్పటికే నేదురుమల్లి జనార్దన రెడ్డి వైపుకు మళ్ళాయి. కాంగ్రెసు శాసన సభ ఆయనను ముఖ్యమంత్రిగా నియమించింది. 1990 డిసెంబరు, 21న జనార్దన రెడ్డి మంత్రి మండలి లాల్.బహదూర్ స్టేడియంలో ప్రమాణస్వీకారం చేసింది.

ముఖ్యమంత్రి పదవి కోల్పోయిన మర్రి చెన్నారెడ్డిని తమిళనాడు గవర్నరును చేశారు. ఆ పదవిలో ఆయన నాటి మద్రాసు ముఖ్యమంత్రి జయలలితతో తరుచు పేచీ పడ్డాడు. గవర్నర్.గా వుండగానే 1996 డిసెంబరు 2న మర్రిచెన్నారెడ్డి మరణించాడు.

----------

## ముఖ్యమంత్రి
## ఎమ్. చెన్నారెడ్డి

డిసెంబర్ 3, 1989-1990

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | డా. ఎమ్. చెన్నారెడ్డి | ముఖ్య మంత్రి |
| 2. | ఆర్. చెంగా రెడ్డి | పంచాయత్ రాజ్ |
| 3. | జె.సి.దివాకర్ రెడ్డి | కో-ఆపరేషన్ |
| 4. | ఎన్. జనార్దన రెడ్డి | వ్యవసాయం |
| 5. | ఎమ్. పద్మనాభన్ | చేనేత, వస్త్ర పరిశ్రమ |
| 6. | కోనేరు రంగారావు | హౌసింగ్ |
| 7. | ఎమ్. రవీంద్రనాథ చౌదరి | దేవాదాయ శాఖ |
| 8. | కె. రోశయ్య | ఆర్థిక, విద్యుత్తు, లెజిస్లేటివ్ వ్యవహారాలు |
| 9. | డా. కె. సమరసింహారెడ్డి | రెవెన్యూ |
| 10. | ఎన్. శ్రీనివాస రెడ్డి | రోడ్లు, భవనాలు, గనులు, జియాలజీ |
| 11. | జి. వి. సుధాకర రావు | రవాణా |
| 12. | ఎస్. వెంకటరెడ్డి | జంతు సంరక్షణ |

| | | |
|---|---|---|
| 13. | చిత్తరంజన్ దాస్ | కార్మిక, ఉపాధి |
| 14. | గీతా రెడ్డి | సాంఘిక సంక్షేమ శాఖ |
| 15. | కె. ఈశ్వర్ కుమార్ | వృత్తి విద్య |
| 16. | మహ్మద్ జాని | వక్ఫ్, ఉర్దూ అకాడమీ |
| 17. | ఆర్. శమంతక మణి | స్త్రీ, శిశు సంక్షేమ శాఖ |
| 18. | ఎమ్. వెంకటేశ్వర రావు | మార్కెటింగ్ |
| 19. | వి. హనుమంత రావు | యూత్ ఎఫైర్స్, ఆటలు |

**సెప్టెంబర్ 25, 1990 నాటికి**
**మంత్రివర్గ విస్తరణ**

| | | |
|---|---|---|
| 20. | డా. జగన్మోహన రావు | రెవెన్యూ, కమర్షియల్ టాక్సెస్ |
| 21. | భీమ్ రావు | గిరిజన సంక్షేమ శాఖ |
| 22. | కనుమూరి బాపిరాజు | దేవాదాయ, లెజిస్లేటివ్ అఫైర్స్ |
| 23. | ఉమా వెంకట రాం రెడ్డి | హౌసింగ్, చిన్నతరహా నీటిపారుదల, గనులు, జియాలజీ |
| 24. | సి. హరిరామ జోగయ్య | సమాచార, ప్రజా సంబంధాలు |
| 25. | అల్లూరి సుభాష్ చంద్రబోస్ | చేనేత, వస్త్ర పరిశ్రమ |
| 26. | ఎమ్. నరసింహారెడ్డి | మునిసిపల్ కార్యనిర్వాహక, న్యాయ, కోర్టులు |
| 27. | మహ్మద్ అలీ షబీర్ | వక్ఫ్ బోర్డు, ఉర్దూ అకాడమీ |
| 28. | జె. చిత్తరంజన్ దాస్ | కార్మిక, ఉపాధి |
| 29. | పి. జగన్మోహన రావు | రెవెన్యూ, వాణిజ్య పన్నులు |
| 30. | జి. వి. శేషు | డైరీ డెవలప్ మెంట్ కార్పొరేషన్, లిడ్ క్యాప్ |
| 31. | డి. శ్రీనివాస్ | బి.సి. సంక్షేమ, ఆటలు, యూత్ అఫైర్స్. |

-------

# ఎన్. జనార్ధన రెడ్డి – ఏడాది ముఖ్యమంత్రి

ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి నేదురుమల్లి జనార్ధన రెడ్డి ముఖ్యమంత్రి స్థానానికి వచ్చాడు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా చెన్నారెడ్డి అభాసుపాలయి తొలగించబడిన అనంతరం ఈ పరిణామం జరిగింది. అతనిని ముఖ్యమంత్రి కాకుండా చేయాలని కాంగ్రెసులోనే అనేకమంది తీవ్ర ప్రయత్నాలు జరిపారు. అందులో డా. వై.యస్. రాజశేఖర రెడ్డి, శివ శంకర్, జలగం వెంగళరావు, నాదెండ్ల భాస్కరరావు ఉన్నారు. రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడుగా ఉన్న వి.హనుమంత రావు గాంధీ భవన్ నుండి అనధికార ముఖ్య మంత్రిగా వ్యవహరించారు.



ముఖ్యమంత్రి కాగానే జనార్ధన రెడ్డికి తన సొంత జిల్లా నెల్లూరు నుండి మద్య నిషేధ ఉద్యమం తాకిడి వచ్చింది. స్త్రీలు ముందంజ వేసి మద్య నిషేధానికి పెద్ద ఎత్తున ఆందోళన ప్రారంభించారు. అది రాష్ట్రమంతా వ్యాపించింది. ఈనాడు పత్రిక పూర్తి మద్దత్తు పలికింది.

మరొకవైపు అదిలాబాద్ పాత బస్తీలో హిందూ ముస్లిం కలహాలు సంభవించగా వాటిని ముఖ్యమంత్రిగా జనార్ధనరెడ్డి అదుపులో పెట్టగలిగాడు.

రాష్ట్రంలో కాంగ్రెసుకు ప్రతికూల పవనాలు వీచాయి. రాష్ట్రంలో మళ్ళీ ఎన్.టి.రామారావుకు సానుభూతి ప్రారంభమైంది. ఆ దశలో 1991 మేలో లోక్.సభ ఎన్నికలు జరిగాయి. రెండు దఫాలుగా జరిగిన ఎన్నికలలో మొదటి రంగం తెలుగు దేశానికి అనుకూలంగా ముగిసింది. రెండవ దశకు ముందే చెన్నయ్.లో తమిళఈలం మానవబాంబు ప్రయోగించి ప్రధాని రాజీవ్ గాంధీని హతమార్చాడు. ఆ సంఘటన లోక్.సభ ఎన్నికలలో కాంగ్రెసుకు సానుభూతి వాతావరణంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెసు లోక్.సభ సభ్యులుగా కొందరు ఆశలు వదులుకున్నవారు కూడా గెలిచారు. రాజీవ్ గాంధీ అనంతరం ఆ స్థానంలోకి ప్రధానిగా వచ్చిన తెలుగు వ్యక్తి పి.వి.నరసింహారావు తన మంత్రివర్గంలోకి మాజీ ముఖ్యమంత్రి విజయభాస్కర రెడ్డిని, కమాలుద్దీన్, చింతా మోహన్, జి. వెంకటస్వామి, ఎమ్. మల్లికార్జున్, పి.రంగయ్యానాయుడు (పోలీస్ అధికారి), కమల కుమారిని స్వీకరించారు.

జనార్ధన రెడ్డి తన పరిపాలనలో వెనకా ముందూ చూడకుండా 12 మెడికల్ కళాశాలలు ఎనిమిది డెంటల్ కళాశాలలు మంజూరు చేశాడు. ప్రైవేటు యాజమాన్యాలు యాభై శాతం సీట్లను ఇచ్చుకోవచ్చని కాపిటేషన్ ఫీజు వసూలు చేయవచ్చునని అనుమతించారు. జనప్రియ ఎండోమెంట్స్ పేరిట ఒక మెడికల్ కాలేజీని తన కుటుంబానికే ముఖ్యమంత్రి ఇచ్చుకున్నాడు. అంతటితో రాష్ట్రంలో ఆందోళన చెలరేగింది. హైకోర్టు ముఖ్యమంత్రి ఉత్తరువులను కొట్టివేసింది. మెడికల్, డెంటల్ కళాశాలలు పెట్టాలంటే ముందుగా మెడికల్ కౌన్సిల్ అనుమతి ఉండాలని కేంద్ర ప్రభుత్వం అన్నది. ముఖ్యమంత్రిగా జనార్ధన రెడ్డి 160 మంది శాసన సభ్యులు బలంతో కొనసాగాడు. 1991 ఆగస్టు 5న ముఖ్యమంత్రి మాదల జానకీరాంను మరికొందరిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఒక్కొక్క శాసన సభ్యుడు తన నియోజక వర్గంలో 25 లక్షల రూపాయలు ఖర్చు పెట్టడానికి మంజూరు చేశారు. మరొక వైపున కాంగ్రెసు వ్యతిరేక పవనాలు వీస్తుండగా పరిస్థితిని సమీక్షించడానికి కేంద్ర మంత్రి కోట్ల విజయ భాస్కర రెడ్డిని పంపారు. అచిర కాలంలోనే ముఖ్యమంత్రిగా జనార్ధనరెడ్డిని తొలగించి, ఉత్తరోత్తర లోక్.సభకు ఎంపికయ్యే అవకాశం ఇచ్చారు.

-------

# ముఖ్యమంత్రి
# ఎన్. జనార్ధన రెడ్డి

మంత్రివర్గం 1990

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | ఎన్. జనార్ధన రెడ్డి | ముఖ్య మంత్రి |
| 2. | పి. రామచంద్రారెడ్డి | భారీ పరిశ్రమలు |
| 3. | ఎస్. వెంకట రెడ్డి | జంతుసంరక్షణ, మత్స్య శాఖ |
| 4. | ఎమ్. లక్ష్మీదేవి | సాంఘిక సంక్షేమశాఖ |
| 5. | పాలడుగు వెంకటరావు | పౌరసరఫారాలు |
| 6. | పి. జనార్ధన రెడ్డి | కార్మిక, ఉపాధి, గృహనిర్మాణ |
| 7. | జె. సి. దివాకర్ రెడ్డి | వ్యవసాయం |
| 8. | పి. సాంబశివరాజు | రవాణా |
| 9. | డి. ఐ. రవీంద్రా రెడ్డి | చిన్ననీటిపారుదల, విద్యుత్తు |
| 10. | ఎస్. సంతోష్ రెడ్డి | రోడ్లు, భవనాలు |
| 11. | డా. జి. కుతూహలమ్మ | మెడికల్, హెల్త్ |
| 12. | కె. భీం రావు | గిరిజన సంక్షేమ, ప్రింటింగ్, స్టేషనరీ |
| 13. | మహ్మద్ జాని | చక్కెర పరిశ్రమ, వాణిజ్య, ఎగుమతులు |
| 14. | జె. చిత్తరంజన్ దాస్ | వెనుకబడిన తరగతుల సంక్షేమం |
| 15. | పి. పద్మనాభం | దేవాదాయ శాఖ |
| 16. | ఎమ్. చంద్ర శేఖర్ | అటవి శాఖ |
| 17. | జె. ప్రసాద రావు | చిన్నతరహా గ్రామిణ, ఖాదీ పరిశ్రమలు |

# ముఖ్యమంత్రి ఎన్. జనార్దన రెడ్డి

సవరించిన మంత్రివర్గం

జనవరి 1985 – డిసెంబర్ 1989

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | ఎన్. జనార్దన రెడ్డి | ముఖ్య మంత్రి |
| 2. | కె. బాపిరాజు | వాణిజ్య పన్నులు |
| 3. | కె. భీం రావు | గిరిజన సంక్షేమ, అటవీ శాఖ |
| 4. | ఎమ్. చంద్రశేఖర్ | చిన్నతరహా పరిశ్రమలు |
| 5. | ఆర్. చంగారెడ్డి | అటవీ శాఖ |
| 6. | చిత్తరంజన్ దాస్ | బి.సి. సంక్షేమ శాఖ |
| 7. | ఆర్. దామోదర్ రెడ్డి | ఓడరేవులు, భూగర్భ జలాలు |
| 8. | జె. సి. దివాకర్ రెడ్డి | రోడ్లు, భవనాలు |
| 9. | పి. రామచంద్రారెడ్డి | భారీ పరిశ్రమలు, ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు |
| 10. | పి. జనార్దన రెడ్డి | కార్మిక, ఉపాధి, గృహనిర్మాణశాఖలు |
| 11. | డా. జి. కుతూహలమ్మ | స్త్రీ, శిశు సంక్షేమ శాఖ |
| 12. | శ్రీమతి ఎమ్. లక్ష్మీదేవి | సాంఘిక సంక్షేమ శాఖ |
| 13. | మహ్మద్ జాని | చక్కె, వాణిజ్య, ఇంజనీరింగ్ |
| 14. | ఎమ్. వి. మైసూరా రెడ్డి | హెూం ఎఫైర్స్ |
| 15. | ఎమ్. నరసింహ రెడ్డి | మునిసిపల్ కార్యనిరహణ, గిరిజన అభివృద్ధి |
| 16. | పంతం పద్మనాభం | దేవాదాయ శాఖ |
| 17. | జలగం ప్రసాదరావు | పంచాయత్ రాజ్ |
| 18. | పి. రాజం | మధ్యతరహా నీటిపారుదల |
| 19. | సి. రామచంద్రారెడ్డి | చిన్నతరహా నీటిపారుదల |
| 20. | కె. రామి రెడ్డి | మార్కెటింగ్, వేర్ హౌసింగ్ |
| 21. | డా. డి. ఐ. రవీంద్రారెడ్డి | రెవెన్యూ |
| 22. | కె. రోశయ్య | మెడికల్, హెల్త్ |
| 23. | డా. కె. సమరసింహ రెడ్డి | న్యాయ, కోర్టులు |
| 24. | పి. సాంబశివ రాజు | రవాణా |
| 25. | ఎస్. సంతోష్ రెడ్డి | ఆర్థిక శాఖ |
| 26. | వి. రాంభూపాల్ చౌదరి | కో-ఆపరేషన్ |

| | | |
|---|---|---|
| 27. | శ్రీమతి ఉమా వెంకటరాం రెడ్డి | రూరల్ డెవలప్ మెంట్ |
| 28. | సంగీతం వెంకట రెడ్డి | జంతు సంరక్షణ, డైరీ డెవలప్ మెంట్ |
| 29. | జి. గురునాథ రావు | వృత్తి విద్య |
| 30. | మాదాల జానకిరామ్ | గనులు, జియాలజీ |
| 31. | పి. లక్ష్మయ్య | మత్స్య శాఖ |
| 32. | కె. లక్ష్మీ నారాయణ | ఆటలు, యూత్ సర్వీసెస్ |
| 33. | ధర్మాన ప్రసాదరావు | చేనేత, వస్త్ర పరిశ్రమ |
| 34. | పి. వి. రంగారావు | ప్రైమరీ ఎడ్యుకేషన్, సెకండరీ ఎడ్యుకేషన్ |
| 35. | డి. శ్రీనివాస్ | సెరీ కల్చర్, స్వయం ఉపాధి |
| 36. | పి. వెంకట రావు | పౌర సరఫరాలు |

------

# మరోసారి ముఖ్యమంత్రిగా విజయభాస్కర రెడ్డి

లోగడ నాలుగు మాసాలు ముఖ్యమంత్రిగా వుంటూ అధికారాన్ని ఎన్.టి.రామారావుకు కట్టబెట్టడానికి దారితీసిన విజయభాస్కరరెడ్డిని రెండవసారి ముఖ్యమంత్రిగా పంపారు. వెంటనే ఆయన అనేక ప్రజారంజక పథకాలు ప్రకటించాడు. కానీ కాంగ్రెసు పార్టీలో అంతర్గత సంక్షోభం పరాకాష్టకు వచ్చింది. 1992 నవంబర్ 9న ముఖ్యమంత్రిగా వచ్చిన విజయభాస్కర రెడ్డి 31 మంది మంత్రులతో ప్రారంభించి 1993 సెప్టెంబర్ 8న మంత్రివర్గంలో మార్పులు చేర్పులు చేశాడు.

కాంగ్రెసులో ముఠాలకు నిదర్శనగా వై.ఎస్. రాజశేఖర రెడ్డి, కె.ఇ.కృష్ణమూర్తి, ముద్రగడ పద్మనాభం, పి.శివశంకర్, ముఖ్యమంత్రికి వ్యతిరేక రాజకీయం నడిపారు. విజయభాస్కర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కొద్దికాలంలో ఆయనను సందర్శించిన వారిలో 90 శాతం రెడ్లు అని అందులో 90 శాతం కర్నూలుకు చెందినవారని, వారిలో 90 శాతం 70 ఏళ్ళ పైబడిన వారని, వారిలో 90 శాతం ఆయన నియోజక వర్గం వారేనని చెప్పుకున్నారు. ముఠా రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి పరిపాలన సాగించలేక పోయారు. ఆయన మంత్రివర్గంలో కనుమూరి బాపిరాజుపై సారాయి బట్టీల విషయంలో తీవ్ర ఆరోపణలు వచ్చి కాంగ్రెస్.ను అపఖ్యాతిపాలు చేశాయి. చివరకు ఆయన మంత్రిగా తప్పుకోవలసి వచ్చింది. కాపులు ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా తమ అసంతృప్తిని వెల్లడించారు. ముద్రగడ పద్మనాభం ఇందుకు గంట కట్టారు. వై.యస్. రాజశేఖర రెడ్డికి కడప జిల్లాలో ఉన్న బైరైట్స్ గనుల లీజ్ కాంట్రాక్టును రద్దు చేయటంతో ఆయన ముఖ్యమంత్రిపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ హై కమాండ్ ఈ విషయంలో విజయభాస్కర రెడ్డికి ఎలాంటి మద్దతు ఇవ్వలేదు.

మొత్తం మీద విజయ భాస్కర రెడ్డి ముఖ్యమంత్రిగా రెండవసారి వచ్చిన తరువాత 1994 డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. మరోసారి విజయభాస్కర రెడ్డి జయప్రదంగా కాంగ్రెసు ఓటమిని చూచి రాష్ట్రాన్ని ఎన్.టి.రామారావు పాలనకు రెండవసారి అప్పగించాడు. ఆ ఎన్నికలలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు తెలుగుదేశాన్నే సమర్థించాయి. బి.జె.పి.కి కేవలం మూడు స్థానాలు వచ్చాయి. మరోసా

రి విజయభాస్కర రెడ్డి కేంద్రానికి వెళ్ళిపోయి 2001లో చనిపోయే వరకు రాష్ట్ర రాజకీయాలకు దూరంగానే ఉన్నాడు.

# ముఖ్యమంత్రి  కె. విజయ భాస్కర రెడ్డి

మంత్రివర్గ విస్తరణ, సెప్టెంబర్ 8, 1993

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | కె. విజయ భాస్కర రెడ్డి | ముఖ్య మంత్రి |
| | **కేబినెట్ మంత్రులు** | |
| 2. | పి. సాంబశివ రాజు | చక్కెర, వాణిజ్య, ఎగుమతులు |
| 3. | కుడుపూడి ప్రభాకర రావు | వాణిజ్య పన్నులు |
| 4. | సంగీతం వెంకట రెడ్డి | మార్కెటింగ్ |
| 5. | సిహెచ్. వి. హరిరామ జోగయ్య | చిన్నతరహా పరిశ్రమలు, గనులు, జియోలజీ |
| 6. | కొనేరు రంగారావు | సాంఘిక సంక్షేమ శాఖ |
| 7. | ఆలపాటి ధర్మారావు | గృహ, జైళ్ళు, ఫైర్ సర్వీసెస్ |
| 8. | జె. సి. దివాకర్ రెడ్డి | ఆర్ అండ్ బి, ఓడరేవులు |
| 9. | శ్రీమతి లక్ష్మిదేవి | గిరిజనాభివృద్ధి |
| 10. | ఎమ్.వి. మైసూరా రెడ్డి | రవాణా |
| 11. | డి. ఐ. రవీంద్రా రెడ్డి | మెడికల్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం |
| 12. | రాం భూపాల్ చౌదరి | భారీ పరిశ్రమలు |
| 13. | డి. కె. సమర సింహా రెడ్డి | పంచాయత్ రాజ్, రూరల్ వాటర్ సప్లయ్ |
| 14. | కె. రామిరెడ్డి | రెవెన్యూ |
| 15. | పి. జనార్దన రెడ్డి | పౌరసరఫరాలు |
| 16. | డి. శ్రీనివాస్ | సమాచార, ప్రజా సంబంధాలు |
| 17. | కె. భీమారావు | గిరిజన సంక్షేమం |
| 18. | పి. రాజం | హయ్యర్ ఎడ్యుకేషన్, అడల్ట్ ఎడ్యుకేషన్ |
| 19. | రోశయ్య | ఆర్థిక, ప్రణాళికలు, లెజిస్లేటివ్ అఫైర్స్ |
| 20. | ఎమ్. నరసింహా రెడ్డి | మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ |

| | | |
|---|---|---|
| 21. | పి. వి. రంగారావు | ప్రైమరీ, సెకండరీ ఎడ్యుకేషన్ |
| 22. | ఎస్. చంద్ర శేఖర్ | దేవాదాయ శాఖ |
| 23. | కె. జానా రెడ్డి | వ్యవసాయం |
| 24. | పి. పెంచలయ్య | గృహనిర్మాణ శాఖ |
| | **రాష్ట్ర మంత్రులు** | |
| 25. | డి. ప్రసాద రావు | యూత్ వెల్ఫేర్, ఆటలు |
| 26. | పి. జగన్మోహన రావు | అటవి శాఖ |
| 27. | బి. సత్యరావు | మధ్యతరహా నీటిపారుదల |
| 28. | మల్లాది స్వామి | మత్స్య శాఖ |
| 29. | శ్రీమతి ఎమ్. వరలక్ష్మి | స్త్రీ, శిశు సంక్షేమ శాఖ |
| 30. | ఎమ్. కె. బైగ్ | వృత్తి విద్య |
| 31. | కన్నా లక్ష్మి నారాయణ | కార్మిక, ఉపాధి |
| 32. | గాడే వెంకట రెడ్డి | పన్నులు, నియంత్రణ |
| 33. | కె. యానాది రెడ్డి | కో-ఆపరేషన్ |
| 34. | ఎమ్. రఘువిరారెడ్డి | జంతు సంరక్షణ |
| 35. | పి. శంకర రావు | మైనర్ ఇరిగేషన్ |
| 36. | పులి వీరన్న | చేనేత, వస్త్ర పరిశ్రమ |
| 37. | ఎమ్. శశిధర్ రెడ్డి | ఎన్విరాన్ మెంట్, పొల్యూషన్ |
| 38. | డి. నరసింగ్ రావు | ఖాదీ, గ్రామిణ పరిశ్రమలు |
| 39. | శ్రీమతి జె. గీతా రెడ్డి | సాంస్కృతిక, పర్యాటక శాఖ |
| 40. | మహ్మద్ అలి షబీర్ | మైనారిటి సంక్షేమ, వక్ఫ్, ఉర్దూ అకాడమీ |
| 41. | జి.ఎమ్. గద్దెన్న | బి. సి. వెల్ఫేర్ |
| 42. | పి. జగన్ నాయక్ | హార్టీకల్చర్, సెరీ కల్చర్ |

-----

# మూడవసారి ముఖ్యమంత్రిగా ఎన్.టి.రామారావు

1989 అసెంబ్లీ ఎన్నికలలో ప్రతిపక్ష స్థానానికి వెళ్ళిన తెలుగుదేశం పార్టీ నాయకుడు ఎన్.టి.రామారావు మళ్ళీ 1994 ఎన్నికలలో గెలిచి మూడవసారి ముఖ్యమంత్రి అయ్యాడు. ఆ ఎన్నికలలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు తెలుగు దేశానికి మద్దతునిచ్చాయి. ఎన్నికల అనంతరం 1994 డిసెంబరు 12న ఎన్.టి.రామారావు 32 మంది మంత్రులతో తన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. అందులో ఆయన అల్లుడు నారాచంద్రబాబునాయుడు కీలక శాఖలతో ప్రాధాన్యత వహించారు. ఆయనకు పార్టీలోను ప్రభుత్వంలోనూ కీలక స్థానం ఉండటం వలన ఉత్తరోత్తర రాష్ట్ర రాజకీయాలలో ఆయన చాలా మలుపులు తిప్పారు.

ఎన్.టి. రామారావు 1984లో తన భార్యను కోల్పోయిన తరువాత సంసార జీవితంలో ఒంటరివాడయ్యాడు. కుటుంబ సభ్యులలో స్త్రీలెవ్వరూ ఆయనను పట్టించుకోలేదని విమర్శ ఉన్నది. అలాంటి తరుణంలో రామారావుపై సిద్ధాంతం రాసి పి.హెచ్.డి. పొందాలనే దృష్టితో లక్ష్మీపార్వతి రంగ ప్రవేశం చేసింది. ఆమె భర్త వీరగంధం సుబ్బారావు ఎంతో నైపుణ్యంతో హరికథలు చెప్పేవాడు. ఆయన దేశవిదేశాలలో పర్యటనలు కూడా చేశాడు. లక్ష్మీ పార్వతి 1993 సెప్టెంబరు 11న తన భర్తనుండి విడాకులు పొందింది. తరువాత ఎన్.టి.రామారావుతో కలసి వున్నది. అది రామారావు కుటుంబ సభ్యులకు నచ్చలేదు. వారిరువురూ వివాహమాడారు. ఎన్నికలలో ఇరువురూ ప్రచారం చేశారు. ప్రజలు వారిని ఆహ్వానించి మళ్ళీ గెలుపు స్థానంలోకి తెచ్చారు.

లక్ష్మీ పార్వతి రాజకీయాలలో చురుకైన పాత్ర వహించి రామారావు జీవితంలో ద్వితీయ స్థానం పొందింది. అది చంద్రబాబునాయుడుకు కంటగింపుగా తయారైంది. మరొకవైపు జాతీయ స్థాయి రాజకీయాలలో నేషనల్ ఫ్రంట్ ఛైర్మన్.గా రామారావు కీలకపాత్ర వహించారు. ఆయన అధికారాన్ని కోల్పోయినప్పటి నుండి జాతీయ స్థాయి పార్టీలు రామారావుకు అండగా నిలిచాయి. 1994 అసెంబ్లీ ఎన్నికలలో కొన్ని స్థానాల అభ్యర్థులను ఎంపిక చేయడంలో లక్ష్మీపార్వతి కూడా తన పాత్ర వహించింది. మరొకవైపు ఎన్.టి.రామారావు అల్లుళ్ళు దగ్గుపాటి వెంకటేశ్వరరావు, చంద్రబాబునాయుడు మూడవస్థానంలో తమ పాత్రను సరిపెట్టుకోవలసి వచ్చింది.

ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధాన్ని ప్రవేశపెట్టారు. ఎన్నికలలో అటు ప్రజలు, ఇటు కొన్ని పత్రికలు ఆ విషయంలో ప్రాధాన్యతనిచ్చాయి. అది దృష్టిలో పెట్టుకుని రామారావు నిర్ణయం తీసుకున్నారు. కానీ ఆచరణలో అది విఫలమైంది. పేద ప్రజలకు రెండు రూపాయలకే కిలో బియ్యం ఇచ్చే ఉత్తరువు కూడా మరొకసారి ఎన్.టి.రామారావు జారీచేశారు. రామారావు దైవభక్తుడైనప్పటికీ, బాబాలను, మాతలను సందర్శించి, పాదపూజ చేసేవాడు కాదు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు సత్యసాయిబాబా వంటి వారు రాజధానిలో అడుగు పెట్టలేదు. కాగా సాయి ఆశ్రమంలో హత్యలు జరిగినప్పుడు విచారణ జరపమని, అవసరమైతే అరెస్టు చేయమని కూడా ఉత్తరువులిచ్చాడు. అవి కారణాంతరాల వలన అమలు జరగలేదు. తిరుమల తిరుపతి దేవస్థాన ప్రాంతాన్ని రోమ్‌లోని కాథలిక్ ప్రపంచ కేంద్రం వాటికన్ వలె చేస్తామని ప్రకటించారు. అది జరిగేపని కాదని ఆయన గ్రహించలేకపోయారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జ్యోతిష్యం కోర్సులు ప్రవేశ పెట్టటానికి ఎన్.టి.రామారావే కారకుడు.

పూర్తి మెజారిటీతో ముఖ్యమంత్రిగా అధికారం సాగిస్తున్న ఎన్.టి. రామారావు నవమాసాలూ నిండకముందే పదవి కోల్పోయాడు. 162 మంది ఎమ్.ఎల్.ఎ.లు హైదరాబాదులోని వెంకటరామారెడ్డికి చెందిన వైస్రాయ్ హొటల్‌లో చంద్రబాబు నాయకత్వాన సమావేశమయ్యారు. వారంతా రామారావుకు వ్యతిరేకంగా చంద్రబాబును నాయకుడుగా ఎన్నుకుని విశ్వాసాన్ని ప్రకటించారు. 1995 ఆగస్టు 24న ప్రారంభమైన ఈ రాజకీయ ఎత్తుగడ, కుట్ర, చాణక్య ప్రక్రియ ఒక వారంరోజులలో నాటకీయంగా ముగిసింది. ఎన్.టి.రామారావు తన రథంపై లక్ష్మీ పార్వతిని వెంటబెట్టుకుని హొటలుకు వెళ్ళి శాసనసభ్యులను బయటకు వచ్చి తనకు అండగా నిలవాలని కోరాడు. కానీ అది జరగలేదు.

ఎన్.టి.రామారావు తప్పనిసరై 1995 ఆగస్టు 30న తన పదవికి రాజీనామా ఇవ్వవలసి వచ్చింది. ఆ తరువాత రామారావు కుమిలి పోయాడు. లక్ష్మీపార్వతి రాష్ట్రమంతా పర్యటించి రాజకీయ కుట్రను జనానికి వివరించింది. ఆమెకు వ్యతిరేకంగా ఎన్.టి.రామారావు కుమారుడు హరికృష్ణ పర్యటించి, ఆమె పాత్రను దుయ్యబట్టాడు. ఈ రాజకీయ నాటకంలో అంతవరకు ఎన్.టి.రామారావును వెనకేసుకొచ్చిన జాతీయ నాయకులు, పార్టీలు కూడా నిస్సహాయంగానే ఉండిపోయాయి. ఆ దశలో 1996 జనవరి 18న గుండెపోటుతో రామారావు చనిపోయాడు. అటు రాష్ట్ర ప్రజలు, ఇటు దేశ నాయకులు రామారావుకు నివాళులర్పించారు. శవ దహన కార్యక్రమాన్ని, ఊరేగింపును చంద్రబాబు నాయుడే నిర్వహించాడు. ఆయన అప్పటి నుండి తెలుగుదేశం పార్టీలో తన స్థానాన్ని స్థిరపరుచుకున్నాడు. రామారావు దేశంలోనూ విదేశాలలోనూ తెలుగు వారికి పేరు తెచ్చిపెట్టాడు. తెలుగు సంస్కృతిని ప్రతిబింబించటానికి హైదరాబాదులో టాంక్‌బండ్‌పై సుప్రసిద్ధ తెలుగువారి విగ్రహాలను టూరిస్ట్ ఆకర్షణగా ఏర్పరచాడు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో రామారావు తనదైన ముద్ర వేసి చరిత్రలో నిలిచాడు.

------

ముఖ్యమంత్రి
**ఎన్. టి. రామారావు**
మంత్రులు డిసెంబర్ 12, 1994

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | ఎన్. టి. రామారావు | ముఖ్య మంత్రి |
| | **కేబినెట్ మంత్రులు** | |
| 2. | నారా చంద్రబాబు నాయుడు | రెవెన్యూ, రిలీఫ్, ఆర్థిక, ప్రణాళికలు, చిన్న పొదుపు, లాటరీస్. |
| 3. | అశోక్ గజపతి రాజు | వాణిజ్య పన్నులు, లెజిస్లేటివ్ అఫైర్స్ |
| 4. | సి.హెచ్. అయ్యన్న పాత్రుడు | రోడ్లు, భవనాలు |
| 5. | బషీరుద్దీన్ బాబూఖాన్ | మైనారిటీస్, వక్ఫ్, ఉర్దూ అకాడమీ |
| 6. | జి. బుచ్చయ్య చౌదరి | పౌరసరఫరాలు, వెయిట్స్, మెజర్స్ |
| 7. | పి. చంద్ర శేఖర్ | ట్రాన్స్ పోర్టు |
| 8. | ఎమ్. దామోదర్ రెడ్డి | గనులు, జియోలజీ |
| 9. | టి. దేవేందర్ గౌడ్ | బి.సి. వెల్ఫేర్, కో-ఆపరేషన్, నియంత్రణ |

| | | |
|---|---|---|
| 10. | పి. ఇంద్రారెడ్డి | గృహ, జైళ్ళు, ఫైర్ సర్వీసెస్ |
| 11. | ఎ. మాధవ రెడ్డి | హెల్త్, మెడికల్ ఎడ్యుకేషన్ |
| 12. | బి. వి. మోహన రెడ్డి | మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్. |
| 13. | ముద్దు కృష్ణమ నాయుడు | ఉన్నత విద్య, ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్. |
| 14. | డా. ఎమ్. పెదరత్తయ్య | మధ్యతరహా నీటిపారుదల, మురుగునీటిపారుదల |
| 15. | శ్రీమతి కె. ప్రతిభా భారతి | సాంఘిక సంక్షేమ, స్త్రీ సంక్షేమ |
| 16. | ఎమ్. నరసింహులు | పర్యాటక శాఖ, కల్చర్, మ్యూజియమ్స్. |
| 17. | దేవినేని రాజ శేఖర్ | సాంకేతిక విద్య |
| 18. | చిక్కల రామచంద్రరావు | ప్రైమరీ ఎడ్యుకేషన్, సెకండరీ ఎడ్యుకేషన్ |
| 19. | కరణం రాంచంద్రరావు | పంచాయత్ రాజ్ |
| 20. | పరిటాల రవి | లేబర్ |
| 21. | ఎస్. సత్యనారాయణ | దేవాదాయ శాఖ |
| 22. | డి. వీరభద్రరావు | సమాచార, ప్రజా సంబంధాలు |
| 23. | కె. విద్యాధర రెడ్డి | వ్యవసాయం, హార్టీకల్చర్, సెరీకల్చర్ |
| | **రాష్ట్ర మంత్రులు** | |
| 24. | పి. బ్రహ్మయ్య | చిన్నతరహా పరిశ్రమలు |
| 25. | జి. నగేష్ | ఎస్. టి. వెల్ఫేర్ |
| 26. | ప్రణయ్ భాస్కర్ | ఆటలు, యూత్ సర్వీసెస్ |
| 27. | ప్రసన్న కుమార్ రెడ్డి | చక్కెర్, కామర్స్ |
| 28. | పి. రామారావు | జంతు సంరక్షణ |
| 29. | పి. రామ సుబ్బా రెడ్డి | అటవీ, పర్యావరణం |
| 30. | టి. సీతారాం | కోర్టులు, జస్టిస్ |
| 31. | కె. శ్రీహరి | మార్కెటింగ్, వేర్ హౌసింగ్ |
| 32. | కె. సుబ్బారాయుడు | హౌసింగ్ |

# హైటెక్ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు



మామ ఎన్.టి.రామారావును జయ ప్రదంగా పదవి నుండి తప్పించి ఆ స్థానంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు తెలుగు దేశం పార్టీ నాయకుడుగా 1997 సెప్టెంబరులో తొలిసారి ముఖ్య మంత్రి అయ్యాడు. ఎన్నికల కమిషన్ కూడా ఆయన పార్టీని గుర్తించింది. తెలుగుదేశం పేరిట లక్ష్మీపార్వతి, హరికృష్ణ పెట్టిన పార్టీలకు ప్రజాదరణ రాలేదు. శాసనసభలో 227 మంది చంద్రబాబు నాయుడుకు మద్దతు పలికారు. ఎన్.టి.రామారావు కుమారుడు హరికృష్ణను కూడా చంద్రబాబునాయుడు తన మంత్రివర్గంలోకి తీసుకున్నాడు. కానీ, అతడు ఆట్టే కాలం ఉండలేదు. మరొక అల్లుడు దగ్గుపాటి వెంకటేశ్వరరావు కూడా చంద్రబాబుకు దూరమయ్యాడు. 1995 సెప్టెంబరు 1న కేవలం 11 మందితోనే చిన్న మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసిన చంద్రబాబునాయుడు అక్టోబరులో విస్తరించి మరొక 15 మందిని చేర్చుకున్నాడు. అప్పటి నుండి ఆయన తిరుగులేకుండా పరిపాలన సాగించాడు.

కేంద్ర రాజకీయాలలోనూ చంద్రబాబునాయుడు ముఖ్యమైన పాత్ర నిర్వహించాడు. 1996లో తెలుగుదేశం 16 లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడంతో చంద్రబాబుకు కేంద్రంలో ప్రాధాన్యత ఏర్పడింది. సంకీర్ణ మంత్రి వర్గాలతో వూగిసలాడే కేంద్రంలో తెలుగుదేశం మద్దత్తు అవసరమైంది. 13 రోజులు మాత్రమే ప్రధానిగా వుండి దిగిపోయిన బి.జె.పి నాయకుడు వాజ్‌పేయి అనంతరం, చంద్రబాబునాయుడు మద్దత్తుతో కర్ణాటకకు చెందిన దేవెగౌడ 1996 మే 14న ప్రధాని అయ్యారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కూడా బాబును బలపరచగా, ఆయన అనుచరులు కేంద్ర మంత్రివర్గంలో స్థానాలు పొందారు. ఆ దశలో బి.జె.పి., చంద్రబాబునాయుడు వందతప్పులు చేశాడంటూ ఆరోపణల పత్రం సమర్పించింది.

అచిర కాలంలోనే బి.జె.పి. బాబును వెనకేసుకు రావటం తప్పలేదు. 1998 మార్చిలో లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు 12 స్థానాలలో తెలుగుదేశం గెలవడమే ఇందుకు కారణం. తెలుగుదేశం అభ్యర్థి బాలయోగి లోక్‌సభ స్పీకర్ అయ్యాడు. ఆయితే ఆ మంత్రివర్గంలో తెలుగుదేశం వారు చేరకపోవడం నాయుడు ఎత్తుగడలలో భాగమే. ఆ దశలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు చంద్రబాబును దుయ్యబట్టాయి.

రాష్ట్రంలో డా.వై.యస్.రాజశేఖర రెడ్డి కాంగ్రెసు నాయకుడుగా చాలా ప్రాధాన్యతలోకొచ్చారు. ఆ దశలో 1999 శాసనసభ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెసు తీవ్రమైన పోటీని ఇచ్చింది. ముఖ్యమంత్రిగా రాజశేఖర రెడ్డి అయ్యే అవకాశం ఉన్నదని ఎన్నికల రాజకీయ సభలు సూచనలిచ్చాయి. మరొకవైపు లక్ష్మీపార్వతి, హరికృష్ణ తమ పార్టీలతో ఎన్నికల బరిలోకి దిగి బాబుకు వ్యతిరేకంగా పోటీ చేశారు. కానీ చంద్రబాబునాయుడు తన విధానాల ప్రచారంతోనూ వ్యక్తిత్వ ఆకర్షణతోనూ గెలుపొందాడు. 1999 అక్టోబరు 11న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండవసారి పదవిని చేపట్టారు.

తెలుగు దేశం సాంకేతిక పరిజ్ఞానంలో హైటెక్ పద్ధతులను ప్రచారంలోకి తెచ్చి ప్రోత్సహించింది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన మైక్రోసాఫ్ట్ ప్రముఖుడు బిల్‌గేట్స్ ఈ విషయంలో ఆకర్షితుడై చంద్రబాబును ప్రోత్సహించాడు. మరొకవైపు అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ రాష్ట్ర రాజధాని హైదరాబాదుకు వచ్చి హైటెక్ అభివృద్ధిని మెచ్చుకుని బాబుకు కితాబునిచ్చాడు.

అంతకు ముందే చంద్రబాబు అమెరికా పర్యటన కూడా చేసి వచ్చాడు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా సాంకేతిక పరిజ్ఞాన విషయంలో, రోడ్ల విస్తరణ విషయంలో, ఫ్లైఓవర్ నిర్మాణాల రంగంలో, నీటి

షెడ్ లను పెంపొందించటంలో, జన్మభూమి కార్యక్రమాలలో చంద్రబాబును మెచ్చుకున్నారు. ఆర్థికరంగంలో ప్రపంచ సమావేశాలకు చంద్రబాబు హాజరయ్యారు కూడా.

అయితే ప్రపంచ బ్యాంకుకు రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నాడని ప్రభుత్వ రంగంలోని పరిశ్రమలు ప్రైవేటు రంగానికి ధారాదత్తం చేస్తున్నాడని ఆయనపై విమర్శలు వచ్చేవి. రైతులను పట్టించుకోకుండా వారు అప్పులతో కృంగిపోతుంటే ఆత్మహత్యలు చేసుకుంటుంటే శీతకన్ను వేశాడన్నారు. మరొకవైపు రామారావు ప్రవేశపెట్టిన మద్య నిషేధాన్ని చంద్రబాబు పక్కన పెట్టివేశాడు. సామాజిక రంగంలో వెనుకబాటు తనంతో సాయిబాబా మొదలు అనేక మంది బాబాల చుట్టూ ప్రదక్షిణలు చేశాడు. సెక్యులర్ వ్యతిరేక విధానాలను వెనకేసుకొచ్చి వాస్తు, జ్యోతిష్యం ప్రోత్సహించాడు. రవిశంకర్ వంటి వారిని తీసుకువచ్చి ప్రాణిక్ హీలింగ్ పేరుతో మూఢనమ్మకాలను ప్రోత్సహించాడు. రాజకీయాలలో అవినీతి, అక్రమాలను ఏమాత్రం పట్టించుకోలేదు. అవకాశవాదాన్ని అవలంబించి పదవిలో వుండటానికి బి.జె.పి. మొదలు కమ్యూనిస్టుల వరకు ఎవరి మద్దతునైనా స్వీకరించడానికి వెనుకాడలేదు. ముస్లింల మతవాదాన్ని కూడా వెనకేసుకొచ్చాడు.

రైతు బజారు వంటివి పెట్టి మార్కెటులో జరుగుతున్న అన్యాయాలను ఆపటానికి రైతులు పండించిన వాటికి గిట్టుబాటు ధర ఇవ్వటానికి చంద్రబాబు కొంతవరకు ప్రయత్నం చేశాడు. పరిపాలనా రంగంలో కంప్యూటర్ టెక్నాలజీని వినియోగించాడు. మారు మూలల ప్రాంతాలకు కూడా కంప్యూటర్ ద్వారా చేరడానికి ఆవకాశమున్నదని నిరూపించాడు. ఎన్.టి.రామారావుకు ద్రోహం చేసి ఆయనను పదవి నుంచి దింపి. ముఖ్యమంత్రి అయినప్పటినుండి తెలివిగా రామారావును స్తుతిస్తూ ఆకాశానికి ఎత్తి ఆయన పేరును వాడుకున్నాడు.

రాష్ట్రంలో తీవ్రవాద కమ్యూనిస్టులను అణచివేయడానికి చంద్రబాబు గట్టిగా కృషి చేశాడు. ఇందుకు కమ్యూనిస్టు వర్గాలు ఆయనపై కసి తీర్చుకోవడానికి తిరుపతి వెడుతున్న చంద్రబాబుపై దాడిచేశారు. తీవ్ర గాయాలతో బయపడగలిగాడు. పరిపాలనలో సమర్థులైన ముఖ్యమంత్రులు మధ్యప్రదేశ్‌లో దిగ్విజయసింగ్, కర్ణాటకలో ఎస్.ఎమ్.కృష్ణ ఉండగా చంద్రబాబునాయుడు వారికి దీటుగా కొన్ని విషయాలలో వారికంటే మిన్నగా పేరు తెచ్చుకున్నాడు.

చంద్రబాబునాయుడు హయాంలోనే ప్రత్యేక తెలంగాణా నిమిత్తం పార్టీ ఏర్పడింది. ఆయనకు అనుకూలుడుగా తెలుగుదేశంలో ఉంటూ డెప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా పనిచేసిన కె. చంద్రశేఖర రావు, తగిన మంత్రిత్వ శాఖ లభించలేదనే కారణంగా రాజీనామా చేసి 2001 సెప్టెంబరులో ప్రత్యేక పార్టీకి అంకురార్పణ చేశాడు. అప్పటి నుండి చంద్రశేఖర రావు తెలంగాణా నాయకుడుగా పేరు తెచ్చుకున్నాడు.

2001లో నవంబర్ 27న చంద్రబాబు తన మంత్రి వర్గాన్ని పునరుద్ధరించి 40 మందితో ఏర్పరిచాడు. అప్పటి నుండి ఆయన పతనావస్థ మొదలైంది. రైతులలో ఆయన ఉదాసీనత పట్ల నిరసన ప్రారంభమయింది. చేనేత రంగంలో తమను పట్టించుకోలేదనే అభిప్రాయం నేత కార్మికులకు ఉన్నది. హైటెక్, క్రీడారంగం, సినీరంగం ఎంత పెంపొందినా, గ్రామాలు సామాన్య ప్రజలు అభ్యున్నతి చెందే దిశలో చంద్రబాబునాయుడు పరిపాలన జరగలేదని విమర్శలు వచ్చాయి. అవి సరైనవేనని 2004లో అసెంబ్లీ ఎన్నికలు రుజువు చేశాయి. ఆయన ముఖ్యమంత్రి పదవిని కోల్పోయారు. ప్రతిపక్ష స్థానంలోనే వుండవలసి వచ్చింది.

-----

# ముఖ్యమంత్రి
# ఎన్. చంద్రబాబునాయుడు

మొదటి మంత్రివర్గం, సెప్టెంబర్ 1, 1995

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | ఎన్. చంద్రబాబు నాయుడు | ముఖ్య మంత్రి |
| | **కేబినెట్ మంత్రులు** | |
| 2. | అశోక్ గజపతి రాజు | ఆర్థిక, ప్రణాళికలు |
| 3. | దేవేందర్ గౌడ్ | రెవెన్యూ, రిలీఫ్, రిహాబిలిటేషన్ |
| 4. | ఎ. మాధవ రెడ్డి | హెూం, జైళ్ళు, ఫైర్ సర్వీసెస్ |
| 5. | కె. విద్యాధర రావు | పంచాయతీ రాజ్, గిరిజన అభివృద్ధి, రూరల్ వాటర్ సప్లయ్ |
| 6. | నందమూరి హరికృష్ణ | రవాణా |
| 7. | సి.హెచ్. అయ్యన్న పాత్రుడు | ఆర్ అండ్ బి, కోర్టులు |
| 8. | ఎమ్. సింహాద్రి సత్యనారాయణ | దేవాదాయ శాఖ |
| 9. | టి. సితారాం | మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ, అర్బన్ డెవలప్ మెంట్ |
| | **రాష్ట్ర మంత్రులు** | |
| 10. | కడియం శ్రీహరి | సోషల్ వెల్ఫేర్ |
| 11. | జి. నగేష్ | ట్రైబల్ వెల్ఫేర్ |

మంత్రివర్గ విస్తరణ అక్టోబర్ 1995

| | | |
|---|---|---|
| 12. | కొడెల శివప్రసాద్ | భారీ, మధ్యతరహా నీటిపారుదల |
| 13. | బషీరుద్దీన్ బాబూఖాన్ | ఉన్నత విద్య |
| 14. | తుమ్మల నాగేశ్వరరావు | చిన్న తరహా నీటిపారుదల |
| 15. | సుద్దాల దేవయ్య | కొ-ఆపరేషన్ |
| 16. | ఎస్. వేణుగోపాలాచారి | సమాచార, పర్యాటక శాఖ |
| 17. | ఎస్. వి. సుబ్బారెడ్డ్ | వ్యవసాయం |
| 18. | బి. వీరారెడ్డి | జంతు సంరక్షణ, మత్స్య శాఖ |
| 19. | కె. జయరాం | గృహ నిర్మాణ |
| 20. | ఈవూరి సీతారామమ్మ | స్త్రీ, శిశు సంక్షేమ శాఖ |

**రాష్ట్ర మంత్రులు**

| | | |
|---|---|---|
| 21. | టి. రమేష్ రెడ్డి | మార్కెట్స్ |
| 22. | బి. దుర్గా ప్రసాదరావు | సెకండరీ ఎడ్యుకేషన్ |
| 23. | టి. శ్రీనివాస యాదవ్ | కార్మిక, ఉపాధి |
| 24. | ఎస్. జనార్ధన రెడ్డి | నియంత్రణ (ప్రొహిబిషన్) |
| 25. | జి. హనుమంత రావు | పౌర సరఫరాల శాఖ |
| 26. | ఐ. రమణ | చేనేత, వస్త్ర పరిశ్రమ |

## ముఖ్యమంత్రి
## ఎన్. చంద్రబాబునాయుడు

రెండవ మంత్రివర్గం, అక్టోబర్ 11, 1999

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | ఎన్. చంద్రబాబు నాయుడు | ముఖ్య మంత్రి |
| | కేబినెట్ మినిస్టర్స్ | |
| 2. | అశోక్ గజపతి రాజు | రెవెన్యూ |
| 3. | టి. దేవేందర్ గౌడ్ | హెూమ్, జైళ్ళు |
| 4. | ఎ. మాధవరెడ్డి (మాధవరెడ్డి మరణించిన తరువాత అతని భార్య మంత్రివర్గంలోకి వచ్చింది) | పంచాయత్ రాజ్, గిరిజన అభివృద్ధి |
| 5. | బి. వి. మోహన రెడ్డి | రవాణా శాఖ |
| 6. | యనమల రామకృష్ణుడు | ఆర్థిక, ప్రణాళికలు |
| 7. | వడ్డే శోభనాదీశ్వరరావు | వ్యవసాయం |
| 8. | కె. విజయ రామారావు | ఆర్ అండ్ బి, ఓడరేవులు |
| 9. | శ్రీమతి ఎస్ సరస్వతి | స్త్రీ శిశు సంక్షేమ శాఖ |

(తరువాత విస్తరించడం జరిగింది)

## ముఖ్యమంత్రి

# ఎన్. చంద్రబాబునాయుడు

తిరిగి ఏర్పరచిన మంత్రివర్గం, నవంబర్ 27, 2001

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | ఎన్. చంద్రబాబు నాయుడు | కార్యనిర్వాహక శాఖ, పోర్ట్ ఫోలియోస్ (మిగిలి మంత్రులకు చెందనివి) |
| 2. | పి. అశోక్ గజపతి రాజు | రెవెన్యూ రిలీఫ్ అండ్ రిహాబిలిటేషన్ |
| 3. | సిహెచ్. అయ్యన్న పాత్రుడు | అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ |
| 4. | ఎస్. చంద్రమోహన్ రెడ్డి | సమాచార, ప్రజా సంబంధాలు |
| 5. | పి. చంద్రశేఖర్ | న్యాయము, కోర్టులు |
| 6. | టి. దేవేందర్ గౌడ్ | హోమ్, జైళ్ళు, ఫైర్ సర్వీసులు, సైనికుల సంక్షేమం, చిత్రపరిశ్రమ అభివృద్ధి సంస్థ, సినిమాటోగ్రఫీ, ఎన్.సి.సి. |
| 7. | ఎమ్.డి. ఫరూక్ | మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ, గిరిజన సంక్షేమం, మైనారిటీల సంక్షేమం, వక్ఫ్ మరియు ఉర్దూ అకాడమీ |
| 8. | బి. గోపాల కృష్ణా రెడ్డి | ఎంప్లాయ్ మెంట్ జనరేషన్, చిన్నతరహా పరిశ్రమలు, ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు, లిడ్ క్యాప్, డ్వాక్రా. |
| 9. | ఎన్. జనార్ధన రెడ్డి | మెడికల్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం |
| 10. | బి. వి. మోహన్ రెడ్డి | రవాణా |
| 11. | టి. నాగేశ్వరరావు | రోడ్లు, భవనాలు, ఓడరేవులు |
| 12. | కె.ఇ.ప్రభాకర్ | చిన్ననీటి పారుదల, నీటిపారుదల అభివృద్ధి సంస్థ, భూగర్భ జలాల అభివృద్ధి మరియు సెరీకల్చర్. |
| 13. | జె. ఆర్. పుష్పరాజ్ | సాంఘిక సంక్షేమ శాఖ |
| 14. | చిక్కాల రామచంద్రరావు | కో-ఆపరేషన్ |
| 15. | కరణం రామచంద్రరావు | ఉన్నత విద్యాశాఖ |

| | | |
|---|---|---|
| 16. | వై. రామకృష్ణుడు | ఆర్థిక, ప్రణాళికలు, చిన్న పొదుపు, లాటరీస్, లెజిస్లేటివ్ అఫైర్స్ |
| 17. | పి. రామసుబ్బారెడ్డి | గృహనిర్మాణ శాఖ |
| 18. | ఎస్. సరస్వతి | స్త్రీ, శిశు సంక్షేమ శాఖ |
| 19. | టి. సీతారాం | నియంత్రణ, పన్నులు |
| 20. | కె. శివ ప్రసాద్ | ఆహారం, పౌరసరఫరాలు, లీగల్, మెట్రోలజీ, కన్స్యూమర్ అఫైర్స్ |
| 21. | డి. శివరామరాజు | దేవాదాయ శాఖ |
| 22. | వి. శోభానాద్రీశ్వరరావు | వ్యవసాయం |
| 23. | కె. శ్రీహరి | భారీ నీటిపారుదల, మధ్యతరహా నీటిపారుదల |
| 24. | పి. శ్రీనివాస రెడ్డి | పంచాయత్ రాజ్, గిరిజన అభివృద్ధి, గిరిజన నీటి సరఫరా, మురుగునీటి పారుదల, ఉపాధి. |
| 25. | టి. శ్రీనివాస యాదవ్ | పర్యాటక, సాంస్కృతిక |
| 26. | కె. సుబ్బారాయుడు | ఎనర్జీ, కోల్, బోయిలర్స్ |
| 27. | ఎమ్. వెంకటేశ్వరరావు | పాఠశాల విద్య, వయోజన విద్య, గ్రంథాలయాలు, మ్యూజియమ్స్, పురావస్తు, పురాతన కట్టడాలు. |
| 28. | కె. విద్యాధర రావు | భారీ పరిశ్రమలు, వాణిజ్యము, ఎగుమతుల అభివృద్ధి |
| 29. | కె. విజయ రామారావు | వాణిజ్య పన్నులు |
| 30. | ఎ. ఉమామాధవ రెడ్డి | గనులు, భూగర్భశాఖ |
| 32. | డి. ఆంజనేయులు | మార్కెటింగ్, వేరహౌసింగ్ |
| 33. | పి. భూమన్న | చేనేత, వస్త్ర పరిశ్రమ, ముద్రణ, స్టేషనరీ |
| 34. | ఎమ్. దామోదర్ రెడ్డి | సాంకేతిక విద్య, శిక్షణ |
| 35. | ఎస్. దేవయ్య | కార్మిక, కర్మాగారాలు |
| 36. | ఎన్. కిష్టప్ప | జంతు సంరక్షణ, డైరీ |
| 37. | ఎమ్. మణికుమారి | గిరిజన సంక్షేమ శాఖ, బధిరుల |

| | | |
|---|---|---|
| | | సంక్షేమం. |
| 38. | ఎస్. నరసింహారావు | వెనుకబడిన తరగతుల సంక్షేమం, మత్స్య శాఖ |
| 39. | పి. నారాయణ స్వామి నాయుడు | చక్కెర, హార్టీకల్చర్. |
| 40. | పి. రాములు | క్రీడలు, యూత్ సర్వీసెస్, ముఖ్యమంత్రి ఎంప్లాయ్ మెంట్ ప్రోగ్రాం. |

---------

# ఎదురులేని నాయకత్వం

## డా. వై.యస్.రాజశేఖర రెడ్డి

తెలుగుదేశం పార్టీ నారా చంద్రబాబు ముఖ్యమంత్రిగా పరిపాలించిన అనంతరం 2004లో డా.వై.యస్. రాజశేఖర రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకుడుగా రాష్ట్ర ముఖ్య మంత్రి అయ్యాడు. 2003లో రాజశేఖర రెడ్డి పార్టీ ప్రచారం నిమిత్తం హైదరాబాద్ సమీపంలో చేవెళ్ళ వద్ద ప్రారంభించి శ్రీకాకుళం వరకు ఎండా కాలంలో పాద యాత్ర చేశాడు. అది గ్రామాలలో జనాభాను, నగరాలలో యువ తను బాగా ఆకట్టుకున్నది. 1500 మైళ్ళు పాదయాత్ర చేసి మధ్యలో వడదెబ్బలకు గురై, తట్టు కొని యాత్రను దిగ్వి జయంగా నడిపించాడు. కాంగ్రెసు వర్గాలు చాలా ఆనందోత్సాహలతో ఎన్నికలకు సిద్ధమయ్యారు.



యాత్రలో రాజశేఖర రెడ్డికి మద్దతుగా అనేకమంది కాంగ్రెసు వారు ఎక్కడిక్కక్కడ పాల్గొన్నారు. గ్రామాలలో సమస్యలను విని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చాడు. మరొకవైపున తెలుగుదేశం అధికారంలో ఉండగా ప్రజలని పట్టించుకోని తీరును బాగా విమర్శించాడు. రైతుల ఆత్మహత్యలు, చేనేత వారి బాధలు, కరెంటు కోతలు అప్పుల తాకిడి మొదలైన సమస్యలను రాజశేఖర రెడ్డి బాగా ప్రచారంలోకి తెచ్చాడు.

ఎన్నికల నాటికి కాంగ్రెసు పార్టీ కొత్తగా ఏర్పడిన తెలంగాణా రాష్ట్ర సమితితో, ఉభయ కమ్యూనిస్టు పార్టీలతోనూ పొత్తులు కుదుర్చుకుని ఎన్నికల బరిలోకి దిగారు. అనేక హామీలను ప్రజలకు ఇస్తూ ముఖ్యంగా అత్యవసర వస్తువుల ధరలను అదుపులోకి తీసుకువస్తామని, విద్యుత్తు సరఫరాను ఉచితంగా కొంతమేరకు ఇస్తామని హామీ ఇచ్చారు.

చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో తీవ్ర కరువు కాటకాలెదుర్కొన్నారు. రైతులను సరిగా పట్టించుకోలేదు అనే విమర్శ వచ్చింది. మరొక వైపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుమల తిరుపతి వెంకటేశ్వర దర్శనార్థం కారులో వెడుతుండగా అలిపిరి వద్ద ఆయనను నక్సలైట్లు దారికాచి దాడిచేశారు. కొన్ని దెబ్బలతో బయటపడ్డారు. 2003 అక్టోబరు 1న జరిగిన ఈ సంఘటన అనంతరం ప్రజలలో సానుభూతి వచ్చినట్లు గమనించి అదే తరుణం అని భావించి చంద్రబాబు నాయుడు ఎన్నికల బరిలోకి దిగారు.

కాంగ్రెసు పార్టీ కేంద్రంలో యునైటెడ్ ప్రోగ్రసివ్ అలయన్స్ ఏర్పరచింది. అందులో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, తెలంగాణా రాష్ట్ర సమితి కూడా చేరాయి. రాష్ట్రంలో రాజశేఖర రెడ్డికి ఇదంతా అనుకూల వాతావరణంగా మారింది. కాంగ్రెసు పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. చంద్రబాబునాయుడు తెలుగుదేశం ప్రధాన ప్రతిపక్షంలోకి వెళ్ళిపోయింది.

వై.యస్. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా మంత్రిమండలి ఏర్పడింది. అందులోకి తెలంగాణా రాష్ట్ర సమితి కూడా చేరింది.

రాష్ట్ర ప్రజలకు కాంగ్రెసు పార్టీ యిచ్చిన హామీల దృష్ట్యా 15వేల రూపాయలను మాఫీ చేశారు. రైతులకు 5వేల రూపాయలు సబ్సిడీ ఇచ్చారు. వీటన్నిటి వలన రాష్ట్ర బడ్జెటుపై భారం పెరిగింది. 14 వందల కోట్ల రూపాయల విద్యుత్తు బిల్లులను మాఫీ చేశారు. వ్యవసాయ రుణాలను ఎక్కడికక్కడే పంచారు. ఇలాంటి చర్యలవలన రైతులలో మళ్ళీ ఆశలు చిగురించ ఆత్మహత్యలు తగ్గాయి. జలయజ్ఞం పథకం క్రింద అనేక నీటిపారుదల పథకాలను ప్రారంభించి వేలాది ఎకరాలను సాగులోకి తెచ్చారు. ఈ ఫథకం వలన చిన్న, మధ్యతరహా, పెద్ద నీటిపారుదల పథకాలను నిర్మించి 56వేల ఎకరాలను సాగులోకి తేవాలని తలపెట్టారు. అన్నపూర్ణ పథకాన్ని అమలు పరచటానికి పూనుకున్నారు. పేదవారికి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి కార్పొరేట్ ఆస్పత్రులలో సైతం పేదవారు చికిత్స పొందటానికి అవకాశాలు కల్పించారు. వృద్ధులకు ఇచ్చే పెన్షన్ పెంచి ప్రతినెల మొదటి తేదీన వారింటికే వెళ్ళి పంచే ఏర్పాట్లు చేశారు. యోజన పథకం క్రింద వేలాది గృహాలను పేదవారికి నిర్మించారు. ఈ పథకాలలో లోపాలు ఉన్నప్పటికీ కాంగ్రెసు పార్టీ బాగా పుంజుకోవడానికి, బలపడటానికీ, ఓట్లు తెచ్చుకోవటానికి ఎంతో దోహదం చేసింది.

రాజశేఖర రెడ్డి తిరుగులేని ముఖ్యమంత్రిగా 35 మందితో మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేశాడు. 2004 ఏప్రిల్‌లో ఈ మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేయగా అప్పటి నుండి ఆయన ఒక్కడే నాయకుడుగా ద్వితీయ స్థానం ఎవరికీ లేకుండా కొనసాగించాడు. చంద్రబాబునాయుడు ఆధ్వర్యాన తెలుగుదేశం ఎంత అధ్వాన్నంగా పరిపాలించిందనే విషయాన్ని ఆయన అటు అసెంబ్లీలోనూ, ఇటు బయటా మాటిమాటికీ ప్రచారం చేసుకుంటూ పోయాడు.

లోగడ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వుండగా అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్, మైక్రోసాఫ్ట్ రంగంలో అధినేత బిల్‌గేట్స్ రాష్ట్రానికి వచ్చి హైటెక్ రంగంలో నాయుడు చొరవను మెచ్చుకున్నారు. రాజశేఖర రెడ్డి హయాంలో అమెరికా అధ్యక్షుడుగా ఉన్న జార్జిబుష్ వచ్చి వ్యవసాయ రంగంలో సాధిస్తున్న ప్రగతిని ప్రశంసించాడు.

రాజశేఖర రెడ్డి పాలన సాగుతుండగా ఆయనతో చేతులు కలిపిన తెలంగాణా రాష్ట్ర సమితి, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు త్వరలోనే దూరమయ్యాయి. తెలంగాణా విషయంలో పేచీలు పడినందున తెలంగాణా రాష్ట్ర సమితి రాజశేఖర రెడ్డి ప్రభుత్వానికి దూరమయ్యింది. పైగా తెలంగాణా రాష్ట్ర సమితి చీలిపోయింది. కాంగ్రెసు పార్టీ మాత్రం తగినంత బలం ఉన్నందున సాఫీగానే ముందుకు సాగింది.

రాజశేఖర రెడ్డి నాయకత్వానికి ఢిల్లీలో బాగా మద్దత్తు ఉన్నది. రాష్ట్రం నుండి కాంగ్రెసు పార్టీ లోకసభ సభ్యులు కేంద్రానికి బాగా బలం చేకూర్చినందున కూడా ఆయనకు ఖ్యాతి లభించింది. సోనియాగాంధీ వద్ద, అధిష్ఠానం దగ్గర రాజశేఖర రెడ్డికి తిరుగులేని ప్రాబల్యం లభించింది. ఆయన తన సలహాదారుగా కె.వి.పి. రామచంద్రరావును అధికారికంగా నియమించాడు. చదువుకునే రోజుల నుండి ఆప్త మిత్రుడుగా వున్న రామచంద్రరావు కష్టనష్టాలలో ఆయనకు అండగా నిలిచాడు.

అఖిల భారత కాంగ్రెసు మహాసభలు రాష్ట్రంలో రాజశేఖర రెడ్డి ఆధ్వర్యాన జయప్రదంగా నిర్వహించి మెప్పు పొందాడు. అసమ్మతి వాదులు పరిమితంగా ఉన్నా, వారిని రాజశేఖర రెడ్డి పట్టించుకోలేదు. సోనియా గాంధీ చీటికీ మాటికీ ముఖ్యమంత్రులను మార్చే పద్ధతులను అనుసరించలేదు. తెలంగాణా సమస్య విషయంలో రాజశేఖర రెడ్డి స్పష్టంగా వ్యతిరేకించి ఐక్య రాష్ట్రానికి నిలబడ్డాడు. అధిష్టాన నాయకత్వం కూడా అన్ని విధాల ముఖ్యమంత్రికి అండగా నిలబడింది. ఎన్నికలలో ప్రత్యేక తెలంగాణా అంశాన్ని పక్కకు పెట్టి కాంగ్రెసును గెలిపించిన రాజశేఖర రెడ్డి తిరుగులేని నాయకుడుగా చెలామణి అయ్యాడు.

ఐదేళ్ళ పాలన రాజశేఖర రెడ్డికి సుస్థిరతను సమకూర్చి పెట్టింది. మంత్రులే కాక జిల్లా స్థాయిలో స్థానిక పరిపాలనలో కాంగ్రెసుకు అనుకూల వాతావరణాన్ని ఆయన సమకూర్చాడు. విపరీతంగా కార్యక్రమాలు రూపొందించి ఇంచుమించు ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతానికి వెళ్ళడం, గ్రామాలలో ప్రజలకు దగ్గరగా వుండటం రాజశేఖర రెడ్డిని మరింత శక్తివంతుణ్ణి చేసింది. ఆయన హయాంలో పారిశ్రామిక వేత్తలు, భూస్వాములు, ధనికులు విపరీతంగా భూములు కొని కొత్త పరిశ్రమలకు, పెట్టుబడులకు దోహదం కల్పించారు. తద్వారా పట్టణాలలో, శివార్లలో భూముల ధరలు కూడా బాగా పెరిగాయి. విదేశాల నుండి వచ్చి పెట్టుబడులు పెట్టడానికి కొందరు సిద్ధమయ్యారు. ప్రభుత్వం భూములు కొని వాటిని ప్రైవేటు రంగంలో పెట్టుబడిదారులకు ఇచ్చి పరిశ్రమలను ప్రోత్సహించింది. అంతర్జాతీయ స్థాయిలో విమానాశ్రయం హైదరాబాదులో ఏర్పడటానికీ, నగరాల అభివృద్ధికీ, వ్యవసాయ రంగంలో పురోగమనానికీ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం బాగా దోహదం చేసింది. ఈ నేపథ్యంలో 2009 ఎన్నికల నాటికి మళ్ళీ రాజశేఖ రెడ్డి నాయకత్వాన కాంగ్రెసు పార్టీ రంగంలోకి దిగింది. ఈసారి అటు తెలంగాణా రాష్ట్ర సమితి కానీ, ఇటు కమ్యూనిస్టు పార్టీలు కానీ లేకుండానే కాంగ్రెసు పార్టీ ఏకాకిగా పోటీచేసి తిరుగులేని బలాన్ని సాధించింది. 2009 ఎన్నికలలో అసెంబ్లీకి 157 స్థానాలు, లోక్‌సభకు 33 స్థానాలు కాంగ్రెసు పార్టీకి రావడం రాజశేఖర రెడ్డి నాయకత్వాన్ని సుస్థిర పరిచింది. అటు కేంద్రంలోనూ యునైటెడ్ ప్రభుత్వాన్ని కూడా బలపరిచేటట్లు చేసింది. దీనికి తగ్గట్లు మన్మోహన్ సింగ్ ప్రధానిగా చేపట్టిన పథకాలు కాంగ్రెసుకు రాష్ట్రంలో బాగా అండను చేకూర్చాయి. ఈ విషయాన్ని రాజశేఖర రెడ్డి కూడా స్పష్టంగా గుర్తించాడు. రెండవసారి అధికారంలోకి వచ్చిన రాజశేఖర రెడ్డి కేవలం తన వారు అనుకొనే వ్యక్తులను మంత్రిమండలిలోకి తీసుకున్నారు. జానారెడ్డి, దివాకర్ రెడ్డి వంటివారిని పక్కన పెట్టారు. అయినప్పటికీ ఎవరూ ఏమీ పైకి మాట్లాడలేదు. విశ్వాస పాత్రులను తన పట్ల విధేయతగా వుండేవారిని ఆయన మంత్రులుగా స్వీకరించాడు.

రెండవసారి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన రాజశేఖర రెడ్డి కొత్తగా రైతులకు సహకార వ్యవసాయ పథకాన్ని అందించబూనాడు. దీనికి మద్దత్తుగా సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు డా.స్వామినాథన్ దీవెనలు పొందాడు. అయితే లోగడ ఇలాంటి పథకాన్ని జవహర్.లాల్ నెహ్రూ 1958లో ప్రధానిగా ప్రకటించినప్పుడు రాజాజీ, రంగాజీ వ్యతిరేకించి స్వతంత్ర పార్టీని పెట్టారు. వినోబా భావే భూదాన యజ్ఞం పేరిట పథకాన్ని ప్రజలలోకి తీసుకెళ్ళాలని విఫల ప్రయత్నం చేశాడు. రాజశేఖర రెడ్డి గ్రామాలకు వెళ్ళడం, ప్రజల మధ్య ఉంటూ సమస్యలు తెలుసుకోవాలని తలపెట్టిన ప్రయత్నం కొనసాగించాడు. అలాంటి ప్రయత్నం లోనే చిత్తూరు జిల్లాలో ఒక గ్రామానికి హెలికాప్టర్.లో బయలుదేరాడు. వాతావరణం అనుకూలించక అది కర్నూలు జిల్లాలో కొండకు ఢీకొని ముక్కలైపోగా రాజశేఖర రెడ్డి చనిపోయాడు. 2009 సెప్టెంబరు 2న జరిగిన సంఘటన రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పింది. ఆనవాలు లేనంతగా ధ్వంసమయిన శవాన్ని కనుగొని, దహన సంస్కారాలు చేశారు. కానీ ఆ పని ముగియకముందే ఆయన వారసుడుగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన కుమారుడు, కొత్తగా లోక్.సభకు ఎన్నికయిన జగన్మోహన రెడ్డిని చేయాలని ప్రచారం జరిగింది. కేంద్ర కాంగ్రెసు నాయకత్వం ఈ ఆలోచనను ప్రోత్సహించలేదు.

## రాజశేఖర రెడ్డి పూర్వాపరాలు

రాజశేఖర రెడ్డి వైద్య విద్యను కర్ణాటకలో గుల్బర్గాలో పూర్తి చేసి, ప్రాక్టీసు చేయకుండానే రాజకీయాలలో ప్రవేశించారు. ఆయన తండ్రి రాజారెడ్డి జిల్లాలో ముఠా నాయకుడుగా పేరొందాడు. 1977-78లో ఎన్నికలు వచ్చేనాటికి రాజశేఖర రెడ్డి తొలిసారి ఎన్నికలలో నిలబడి పులివెందుల నుండి శాసనసభ్యుడయ్యాడు. అప్పట్లో కడప జిల్లాలో బసిరెడ్డి మంత్రిగా కాంగ్రెసు నాయకుడుగా ఉన్నారు. ఆయనకు మారుగా నాయకత్వాన్ని పెంపొందించాలని తలపెట్టిన బండారు రత్న సభాపతి, కుందా రామయ్య రాజధానిలో ముఖ్యమంత్రి జలగం వెంగళరావును కలసి ఆయన మద్దత్తుతో రాజశేఖర రెడ్డిని రంగంలోకి తెచ్చారు. తొలిసారి 1978లో గెలిచిన రాజశేఖర రెడ్డి చనిపోయేవరకూ నిరంతరం ఎన్నికలలో గెలుస్తూనే వచ్చాడు. ఒకసారి లోక్.సభలో కూడా గెలిచాడు. తొలిసారి ఆయన రెడ్డి కాంగ్రెస్ ఎం.ఎల్.ఎ.గా వచ్చాడు. అప్పట్లో ఇందిరా కాంగ్రెస్ పోటీగా వుండేది. రాష్ట్రంలో చెన్నారెడ్డి దానికి నాయకత్వం వహించాడు. ముఖ్యమంత్రిగా ఉన్న చెన్నారెడ్డిని రాజశేఖర రెడ్డి వ్యతిరేకిస్తూ వచ్చాడు. తరువాత రెడ్డి కాంగ్రెస్ ఇందిరా కాంగ్రెసుతో కలిసిపోయింది. రాజశేఖర రెడ్డిని మంత్రి వర్గంలోకి తీసుకోవడానికి చెన్నారెడ్డి ఇష్టపడలేదు. ఆయనను తొలగించిన తరువాత అంజయ్య

ముఖ్యమంత్రిగా రాజశేఖర రెడ్డిని మంత్రి మండలిలోకి తీసుకున్నారు. ఆ తరువాత భవనం వెంకట్రామ్, విజయభాస్కర రెడ్డి ముఖ్యమంత్రులుగా రాజశేఖర రెడ్డిని కొనసాగించారు.

తెలుగుదేశం అధికారంలోకి వచ్చి ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయినప్పుడు రాజశేఖర రెడ్డి కడప జిల్లాలో ఎదురీత చేసి గెలిచి వచ్చాడు. అయితే కాంగ్రెసు పార్టీ ప్రతిపక్షంలోకి పోయింది. అలాంటప్పుడు వై.యస్.రాజశేఖర రెడ్డిని రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడుగా చేయడంతో ఆయన 1985లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెసు పార్టీకి సారధ్యం వహించాడు. కానీ ఎన్.టి.రామారావు ఉప్పెనకు తట్టుకోలేకపోయాడు.

ఎన్.టి.రామారావు అనంతరం రెండవసారి కాంగ్రెసు ముఖ్యమంత్రిగా వచ్చిన డా.చెన్నారెడ్డి మళ్ళీ రాజశేఖర రెడ్డిని దూరం పెట్టాడు. అప్పుడు అసమ్మతి వర్గానికి నాయకుడుగా రాజశేఖర రెడ్డి అంతర్గత పోరాటాన్ని కొనసాగించాడు. ఆ తరువాత ముఖ్యమంత్రులుగా వచ్చిన ఎన్.జనార్దన రెడ్డి, కోట్ల విజయభాస్కర రెడ్డి పై కూడా తన పోరాటాన్ని రాజశేఖర రెడ్డి  పట్టుదలతో సాధించాడు. అంతేగాక నిరుత్సాహ పడకుండా కాంగ్రెసుపార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా తెలుగుదేశం పైన ముఖ్యంగా చంద్రబాబునాయుడు పైన రాజకీయ పోరాటం సాగించాడు. 1978లో తొలుత రాజకీయాలలోకి వచ్చినపుడు చంద్రబాబునాయుడు రాజశేఖర రెడ్డి సహచరులుగా ఉంటూ చెన్నారెడ్డి పై పోరాడారు. తరువాత అంజయ్య భవనం వెంకట్రామ్ మంత్రివర్గాలలో సభ్యులుగా కలిసి ఉన్నారు. ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయ్యేవరకు యీ కలయిక సాగింది. తెలుగుదేశంపై చంద్రబాబునాయుడు కాంగ్రెసు అభ్యర్థిగా పోటీ చేసి 1982లో ఓడిపోయిన అనంతరం మార్పు వచ్చింది. ఆయన తెలుగుదేశంలో చేరి రాజశేఖర రెడ్డితో పోటీ పడ్డాడు.

రాజశేఖర రెడ్డి రెండవసారి ముఖ్యమంత్రిగా తన కుమారుడు జగన్మోహన రెడ్డిని కడప నుండి లోక్‌సభకు కాంగ్రెసు అభ్యర్థిగా గెలిపించాడు. తరచుగా  కుల రాజకీయాలు ప్రస్తావిస్తూ, - **ఆ రెండు పత్రికలూ** – అంటూ ఈనాడూ, ఆంధ్రజ్యోతి కమ్మ కుల యాజమాన్యాలను దృష్టిలో పెట్టుకుని విమర్శిస్తుండేవాడు. వాటికి విరుగుడుగా సాక్షి దిన పత్రికను, తరువాత సాక్షి టి.వి.ఛానెల్‌ను కూడా పెట్టారు. ఈనాడు పత్రిక అధిపతి రామోజీరావుపై రాజశేఖర రెడ్డి నిరంతర పోరాటం చేశాడు. ఆంధ్రజ్యోతి యాజమాన్యంపై ముఖ్యమంత్రిగా వ్యతిరేకం కనబరిచాడు. రాష్ట్రంలో తనదంటూ ఒక ప్రత్యేక ముద్రను వేసిన నాయకుడు రాజశేఖర రెడ్డి. ఆయన హయాంలో తాను నమ్మిన అనుచరులను, స్నేహితులను అరమరికలు లేకుండా ఆదరించాడనే ప్రతీతి ఉన్నది. రెడ్డి కుల ఆధిపత్యం మంత్రి వర్గంలోనూ, పాలనా రంగంలోనూ, వాణిజ్యపరంగానూ చూపాడనే మాట ప్రబలింది. అట్టుడుగున ఉన్న సామాన్య జనానికి వివిధ పథకాల ద్వారా ఆరోగ్య, ఆర్థిక సహాయాలు అందించటంలో ఎంతో సాహసం కనబరిచిన రాజశేఖర రెడ్డి ముందు కుల విమర్శ పక్క దారిన పట్టింది.

-------

## ముఖ్యమంత్రి
## డా. వై. ఎస్. రాజశేఖర రెడ్డి
మంత్రివర్గం, ఏప్రిల్, 2004

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | డా. వై. ఎస్. రాజశేఖర రెడ్డి | ముఖ్యమంత్రి, కార్యనిర్వాహక శాఖ, న్యాయ మరియు ఇతర మంత్రులకు చెందని పోర్టుఫోలియోలు |
| 2. | శ్రీ కొణిజేటి రోశయ్య | ఆర్థిక, ప్రణాళికలు, చిన్నపొదుపు, లాటరీస్, లెజిస్లేటివ్ అఫైర్స్ |

| | |
|---|---|
| 3. ఎమ్ డి. అలీ షబ్బీర్ | ఎనర్జీ, కోల్, మైనారిటీల సంక్షేమం, వక్ఫ్, ఉర్దూ అకాడమీ |
| 4. శ్రీ జె.సి. దివాకర్ రెడ్డి | పంచాయత్ రాజ్ |
| 5. మహమ్మద్ ఫరీదుద్దీన్ | కో-ఆపరేషన్ |
| 6. డా. జె. గీతారెడ్డి | భారీ పరిశ్రమలు, చక్కెర, వాణిజ్య, ఎగుమతుల అభివృద్ధి |
| 7. కె. జానా రెడ్డి | హోమ్, జైళ్ళు, ఫైర్ సర్వీసెస్, సైనిక సంక్షేమం. |
| 8. శ్రీ పొన్నాల లక్ష్మయ్య | భారీ నీటిపారుదల, మధ్య నీటి పారుదల |
| 9. శ్రీ కన్నాలక్ష్మీ నారాయణ | రవాణా |
| 10. శ్రీ డి. ప్రసాదరావు | రెవెన్యూ, రిలీఫ్, రిహాబిలిటేషన్, అర్బన్ లాండ్ సీలింగ్ |
| 11. శ్రీ ఎన్. రఘువీరా రెడ్డి | వ్యవసాయం, వ్యవసాయ సాంకేతిక సంస్థ, హార్టీకల్చర్, సెరీ కల్చర్, రెయిన్ షాడో ఏరియా డెవలప్ మెంట్. |
| 12. శ్రీమతి ఎన్. రాజ్యలక్ష్మి | స్త్రీ శిశు సంక్షేమశాఖ, బధిరుల సంక్షేమం, జువెన్నైల్ సంక్షేమం |
| 13. శ్రీ కె. రామకృష్ణ | వాణిజ్య పన్నులు |
| 14. శ్రీ జె. రామమోహన్ రావు | పన్నులు, నియంత్రణ |
| 15. కోనేరు రంగారావు | మునిసిపల్ కార్యనిర్వాహక శాఖ, గిరిజన అభివృద్ధి |
| 16. శ్రీ డి. రెడ్యానాయక్ | గిరిజన సంక్షేమం, రిమోట్, ఇంటరీయర్ ఏరియాల అభివృద్ధి |
| 17. బి. సబితా ఇంద్రా రెడ్డి | గనులు, భూగర్భ, చేనేత, వస్త్ర పరిశ్రమ, స్పిన్నింగ్ మిల్లులు |
| 18. బి. సత్యనారాయణ | గృహ, వెనుకబడిన తరగతుల గృహనిర్మాణం, ఎ.పి. కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీల ఫెడరేషన్, హౌసింగ్ బోర్డు |
| 19. గొల్లపూడి సూర్యారావు | చిన్నతరహా పరిశ్రమలు, ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు |
| 20. పి. వెంకటేశ్వరరావు | రూరల్ వాటర్ సప్లయ్ |
| 21. ఎస్. విజయరామరాజు | అటవీ, పర్యావరణ, శాస్త్రీయ, |

| | | |
|---|---|---|
| | | సాంకేతిక శాఖలు |
| 22. | జి. వినోద్ | కార్మిక, ఉపాధి, పరిశ్రమలు, బోయిలర్లు |
| 23. | శ్రీమతి గల్లా అరుణ కుమారి | వైద్య విద్య, ఆరోగ్య భీమా |
| 24. | ఎమ్. హనుమంత రావు | సర్వశిక్షా అభినయాన్, డిపెప్, వయోజన విద్య, ఓపెన్ స్కూల్, ప్రజా గ్రంథాలయాలు, జవహర్ బాలభవన్, మహిళా సమతా సొసైటీ, స్టేట్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ |
| 25. | టి. జీవన్ రెడ్డి | రోడ్లు, భవనాలు, |
| 26. | ఆర్. ముఖేష్ గౌడ్ | బి.సి. సంక్షేమం |
| 27. | ఆనం రామనారాయణ రెడ్డి | ఐ అండ్ పిఆర్, పర్యాటక, సినిమాటోగ్రఫీ, కల్చర్ ఆర్కియాలజీ, మ్యూజియమ్స్, ఆర్కైవ్స్, దేవాదాయ, స్టాంపులు, రిజిస్ట్రేషన్. |
| 28. | ఎమ్. వెంకట రమణరావు | ఇన్ ఫ్రాస్ట్రక్చర్, ఇన్ వెస్టమెంట్, ఓడరేవులు, విమానాశ్రయాలు, నేచురల్ గ్యాస్. |
| 29. | మాగంటి వెంకటేశ్వరరావు | చిన్ననీటి పారుదల, ఎపిఐడిసి, లిఫ్ట్ ఇరిగేషన్, ఎ.పి. వాటర్ రిసోర్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, వాలంటరీ గ్రౌండ్ వాటర్ డెవలప్ మెంట్. |
| 30. | వి. వెంకటేశ్వరరావు | వైద్య విధాన పరిషత్, హాస్పిటల్ సర్వీసెస్. |
| 31. | మండలి బుద్ధ ప్రసాద్ | జంతు సంక్షేమ, డైరీ డెవలప్ మెంట్, వెటరినరీ యూనివర్సిటీ, మత్స్యశాఖ. |
| 32. | సంభాని చంద్రశేఖర్ | ఆరోగ్య, కుటుంబ సంక్షేమం |
| 33. | ఆర్. చెంగా రెడ్డి | న్యాయ, కోర్టులు, సాంకేతిక విద్య, పారిశ్రామిక శిక్షణా సంస్థలు |
| 34. | జి. చిన్నా రెడ్డి | గిరిజన అభివృద్ధి, ఎన్.ఆర్.ఇ.జి.పి., సెల్ఫ్ హెల్ప్ |

గ్రూప్

| | | |
|---|---|---|
| 35. | సి. దామోదర్ రాజనరసింహ | పాఠశాల విద్య, ప్రభుత్వ పరీక్షలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., రెసిడెన్షియల్ పాఠశాలల సంస్థ, హైదరాబాద్ పబ్లిక్ స్కూలు. |
| 36. | దామోదర్ రెడ్డి | సమాచార, సాంకేతిక, కమ్యూనికేషన్స్, యూత్ సర్వీసెస్, క్రీడలు |

## ముఖ్యమంత్రి
## డా. వై.యస్. రాజశేఖర రెడ్డి

ఏప్రిల్ 2009 నుండి 2-9-2009

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | డా. వై.యస్. రాజశేఖర రెడ్డి | ముఖ్యమంత్రి |
| 2. | పి. సుదర్శన్ రెడ్డి | వైద్య విద్య |
| 3. | డి. శ్రీధర్ బాబు | ఉన్నత విద్య, ఎన్నారై వ్యవహారాలు |
| 4. | వి. సునీతా లక్ష్మా రెడ్డి | చిన్న నీటి పారుదల, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి శాఖ, లిఫ్ట్ ఇరిగేషన్, భూగర్భ జలాల అభివృద్ధి, |
| 5. | జె. గీతా రెడ్డి | ఐ అండ్ పి.ఆర్. సినిమాటోగ్రఫీ, ఎఫ్.డి.సి., టూరిజం, ఆర్కియాలజీ, మ్యూజియమ్స్, ఆర్కైవ్స్ మరియు కల్చర్ |
| 6. | పి. సబితా ఇంద్రారెడ్డి | హెూమ్, జైళ్ళు, అగ్నిమాపక శాఖ, సైనిక పరిరక్షణ, ప్రింటింగ్, స్టేషనరీ. |
| 7. | డి. నాగేంద్ర | ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, ఎపివివిపి, ఆసుపత్రి సేవలు. |
| 8. | ఎమ్. ముఖేష్ గౌడ్ | బి.సి. సంక్షేమం |
| 9. | డి. కె. అరుణ | చిన్నతరహా పరిశ్రమలు, చక్కెర, ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు |

| | | |
|---|---|---|
| 10. | జె. కృష్ణారావు | ఆహారము, పౌర సరఫరాలు, లీగల్ మెట్రోలజీ, వినియోగదారుల వ్యవహారాలు |
| 11. | కోమటి రెడ్డి వెంకట రెడ్డి | ఐ.టి., యూత్ సర్వీసెస్, క్రిడలు, కమ్యూనికేషన్స్ |
| 12. | పి. లక్ష్మయ్య | భారీ, మధ్యతరహా నీటి పారుదల, ఎ.పి. వాటర్ రిసోర్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్. |
| 13. | కొండా సురేఖ | స్త్రీ శిశు సంక్షేమ శాఖ, బధిరుల సంక్షమం, జువెనైల్ సంక్షేమం |
| 14. | ఆర్. వెంకట్ రెడ్డి | కో-ఆపరేషన్, కార్మిక, ఉపాధి, కర్మాగారాలు, బోయిలర్స్ |
| 15. | ఎస్. విజయ రామరాజు | రవాణా |
| 16. | డి. ప్రసాద రావు | రెవెన్యూ, రిలీఫ్, రిహాబిలిటేషన్, యు.ఎల్.సి. |
| 17. | బి. సత్యనారాయణ | పంచాయత్ రాజ్ |
| 18. | పి. బాలరాజు | గిరిజన సంక్షేమ, ఆర్ఐఎడి |
| 19. | పి. సుభాష్ చంద్రబోస్ | సాంఘిక సంక్షేమ శాఖ |
| 20. | పి. విశ్వరూపు | రూరల్ వాటర్ సప్లయ్ |
| 21. | పితాని సత్యనారాయణ | ఆరోగ్యశ్రీ, ఆరోగ్య భీమా, మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్. |
| 22. | వి. వసంత కుమార్ | గిరిజనాభివృద్ధి, ఐ.కె.పి., పెన్షన్స్, ఎన్.ఆర్.ఇ.జి.పి. స్వయం సేవక సంఘాలు |
| 23. | కె. పార్థసారథి | జంతుసంరక్షణ, డైరీ అభివృద్ధి, మత్స్యశాఖ, వెటరినరీ యూనివర్సిటీ |
| 24. | ఎమ్.వి.రామారావు | న్యాయ, కోర్టులు, సాంకేతిక విద్య, ఐటీఐలు. |
| 25. | గాదే వెంకట రెడ్డి | దేవాదాయ శాఖ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ |
| 26. | కన్నా లక్ష్మీనారాయణ | భారీ పరిశ్రమలు, వాణిజ్యము, ఎగుమతులు, ప్రమోషన్, ఫుడ్ ప్రోసెసింగ్. |
| 27. | డి. మాణిక్య వరప్రసాద్ | సెకండరీ ఎడ్యుకేషన్, ప్రభుత్వ పరీక్షలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ |

| | | |
|---|---|---|
| | | ఎడ్యుకేషన్ ఇన్టిట్యూషన్స్ సొసైటి, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ |
| 28. | కె. రోశయ్య | ఆర్థిక, ప్రణాళికలు, చిన్న పొదుపు, లాటరీస్, లెజిస్లేటివ్ అఫైర్స్ |
| 29. | బి. శ్రీనివాస రెడ్డి | గనులు, జియోలజీ, చేనేత మరియు వస్త్ర పరిశ్రమలు, స్పిన్నింగ్ మిల్లులు. |
| 30. | ఆనం రాం నారాయణ రెడ్డి | మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ |
| 31. | మహ్మద్ అహమదుల్లా సయ్యద్ | మైనారిటీస్ సంక్షేమం, వక్ఫ్, ఉర్దూ అకాడమీ, ప్రైమరీ విద్య, ఎస్.ఎస్.ఎ., వయోజన విద్య, ఎపి ఓపెన్ స్కూల్స్ సొసైటీ, జవహర్ బాలభవన్, ఎ.పి.మహిళా సమతా సొసైటీ, సియట్, పబ్లిక్ లైబ్రరీలు, ఎస్.సి.ఆర్.ఇ.టి., టెక్స్ట్ బుక్ ప్రెస్. |
| 32. | సి. శిల్పా మోహన్ రెడ్డి | గృహ, వెనుకబడిన తరగతుల గృహనిర్మాణ పథకం, ఎ.పి. కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీస్ ఫెడరేషన్, ఎ.పి.హౌసింగ్ బోర్డు |
| 33. | ఎన్. రఘువీరారెడ్డి | వ్యవసాయం, అగ్రికల్చర్ టెక్నాలజీ మిషన్, హార్టీకల్చర్, సెరీకల్చర్, ఆర్.ఎస్.ఎ.డి. |
| 34. | పి. రామచంద్రా రెడ్డి | అటవీ శాఖ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ |
| 35. | జి. అరుణ కుమారి | రోడ్లు, భవనాలు |

-----

# రోశయ్య మీద పడిన ముఖ్యమంత్రిత్వం

రోశయ్య హఠాత్తుగా అనుకోకుండా ముఖ్యమంత్రి అయ్యారు. రాజశేఖర రెడ్డి హఠాత్తుగా చనిపోవడంతో, కాంగ్రెసు కేంద్ర నాయకత్వం తక్షణమే సెప్టెంబరు 3, 2009న కొణిజేటి రోశయ్యను ముఖ్యమంత్రిని చేసింది. ఆయన తన మంత్రివర్గంలో రాజశేఖర రెడ్డి మంత్రులను యధాతథంగా కొనసాగించారు. అప్పటివరకూ ఆర్థిక మంత్రిగా, సీనియర్ వ్యక్తిగా ఉంటూ వచ్చిన రోశయ్యకు అనుభవ రీత్యా విషయాలన్నీ కొట్టిన పిండి. అయితే ఆయన పదవి చేపట్టిన దగ్గర్నుండీ రాజకీయాలు సాఫీగా సాగ లేదు. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఎంపిక చేసిన మంత్రులూ ఎన్నికలలో ఆయన వలన గెలిచా మను కున్న కాంగ్రెసు శాసనసభ్యులూ తమ విశ్వాసాన్ని జగన్మోహన రెడ్డి పట్ల

చూపారు. వారసత్వంగా తండ్రి చనిపోగానే ఆయన కుమారుడు ముఖ్యమంత్రి కావడానికి అర్హుడని ప్రకటనలు చేశారు. రోశయ్య తటస్థ వైఖరి అవలంబించారు. కేంద్ర నాయకులు చెప్పినట్లు నడుచుకుంటానన్నాడు. ముఖ్యమంత్రిగా ఆయనపట్ల కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఒక నెల అనంతరం విశ్వాసం ప్రకటించింది. అంతటితో మంత్రివర్గంలో రాజశేఖర రెడ్డి తొలిసారి ఎంపిక చేసిన కొండా సురేఖ తన మంత్రిపదవికి రాజీనామా చేసింది.



తెలంగాణా రాష్ట్ర సమితి నాయకుడు కె. చంద్రశేఖర రావు తెలంగాణా కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టాడు. ఆయనను అరెస్టు చేసి కరీంనగర్ నుండి ఖమ్మం తీసుకు వచ్చి, ఆసుపత్రిలో పెట్టారు. దీక్ష విరమించిన తక్షణమే తెలంగాణాలో ఆయనపట్ల తీవ్రవ్యతిరేకత కనిపించింది. అంతటితో మళ్ళీ దీక్ష ప్రారంభించి 11 రోజులు చేశారు. ఆయనను హైదరాబాదుకు తరలించారు. తెలంగాణాలో ముఖ్యంగా విద్యార్థులు ప్రత్యేక తెలంగాణాకై ఆందోళన చేసారు. ఆయన జీవితానికి ప్రమాదం వాటిల్లకూడదని కేంద్ర నాయకత్వం మంత్రులు చర్చలు చేసి తెలంగాణా ప్రక్రియ మొదలు పెడుతున్నామని, దీక్ష విరమించమని కోరారు. చంద్రశేఖర రావు తన దీక్ష విరమించాడు. ఈ వ్యవహారంలో రోశయ్య వివాదాల జోలికి పోలేదు. కేంద్రం ఏది చెబితే అది చేస్తానన్నాడు. అసెంబ్లీలో తీర్మానం పెట్టి ఆమోదించాలని ప్రతిపాదన వచ్చింది. కానీ అది జరగక ముందే ప్రత్యేక తెలంగాణా పట్ల నాయకత్వం సుముఖత చూపిన దానికి నిరసనగా ఆంధ్రలో తీవ్రస్థాయిలో ఉద్యమం వచ్చింది. కొందరు మంత్రులు, శాసనసభ్యులు రాజీనామాలిచ్చారు. రాజీనామాలను ఆమోదించకుండానే స్పీకర్ కిరణ్ కుమార్ రెడ్డి న్యాయ సలహా అడుగుతామన్నారు. ఈలోగా అసెంబ్లీని నిరవధికంగా వాయిదా వేశారు. రోశయ్య ముఖ్యమంత్రిగా వుండగా హైదరాబాదు మునిసిపల్ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెసు అధికారంలోకి వచ్చింది. అదికూడా రోశయ్యకు వూపిరి పీల్చుకోవడానికి తోడ్పడింది.

ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి వ్యతిరేకంగా 1970లో ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం రాగా, 2010లో వైఖరి మారింది. సమైక్య ఆంధ్ర కావాలని కాంగ్రెస్ లోక్ సభ సభ్యుడు లగడపాటి రాజగోపాల్ నిరాహార దీక్ష ప్రారంభించారు. దీనికి స్పందనగా ఆంధ్ర అంతటా ఆందోళనలు, బంద్.లు, పాక్షికంగా హింస, విద్యార్థుల సమ్మెలు సాగాయి. కాంగ్రెసువారు చీలిపోయి సమైక్య ఆంధ్ర, తెలంగాణా వాదులుగా రంగంలోకి దిగారు. తెలంగాణాకు అనుకూలంగా కేంద్రంలో హోం మంత్రి చిదంబరం తొలుత ప్రకటన చేస్తూ, ప్రక్రియ ప్రారంభమైందని చెప్పటంతో తెలంగాణా వచ్చినట్లేనని భావించారు. కాని సమైక్య ఆంధ్ర ఆందోళన వలన హోం మంత్రి చిదంబరం మరో ప్రకటన చేయడంతో ఎటూ తేలని వ్యవహారంగా మారిపోయింది. ఉభయ పక్షాలు ఆందోళనలు కొనసాగించాయి. వివిధ రాజకీయ పార్టీలలోను ఈ విషయమై చీలికలు వచ్చాయి. తొలుత ప్రత్యేక తెలంగాణాను సమర్థించిన ప్రజారాజ్యం పార్టీ నాయకుడు, సినీనటుడు చిరంజీవి తరువాత సమైక్య ఆంధ్ర కావాలన్నాడు. తెలుగుదేశం పార్టీ అటూ, ఇటూ ఉన్నది. కమ్యూనిస్టు పార్టీలలో సిపిఎమ్ సమైక్యత కోసం, సిపిఐ ప్రత్యేక తెలంగాణా కోసం, మావోయిస్టు గ్రూపులన్నీ తెలంగాణాకు అనుకూలంగా మారాయి. బిజెపి తెలంగాణా కావాలన్నది.

## కొణిజేటి రోశయ్య

తొలిసారి 77వ ఏట ముఖ్యమంత్రి అయిన కొణిజేటి రోశయ్య 1950 నుండి ఆచార్య రంగా శిష్యుడుగా ప్రతిపక్ష రాజకీయాలలో ఉన్నాడు. కృషీకార్ లోక్ పార్టీ, స్వతంత్ర పార్టీలో కీలక పాత్ర వహించారు. శాసనసభకు, శాసనమండలికి, ఒకసారి లోక్‌సభకు ఎన్నికయ్యాడు. 1979 నుండి వివిధ మంత్రి వర్గాలలో పనిచేస్తూ కాంగ్రెసులో ప్రముఖ వ్యక్తిగా విశేష అనుభవాన్ని సంతరించుకున్నారు. 1933 జులై 4న తెనాలి తాలూకా వేమూరు గ్రామములో పుట్టిన రోశయ్య గుంటూరు హిందూ కళాశాలలో విద్యార్థి నాయకుడుగా బి.కాం. పూర్తి చేసి, రంగాగారి రాజకీయ పక్షమైన విద్యార్థి సమ్మేళనలో బాగా కృషి చేశారు. 1955లో మధ్యంతర ఎన్నికలలో ఐక్య కాంగ్రెసు పక్షాన ప్రచారం చేశారు. 1968లో స్వతంత్ర పార్టీ పక్షాన

శాసన మండలి సభ్యుడుగా పోటీ చేసినప్పుడు కాంగ్రెసు ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి ఆయనకు కొన్ని ఓట్లు ఇప్పించి గెలిపించారు. 1973లో పి.వి. నరసింహారావును ముఖ్యమంత్రిగా తొలగించబోతున్నప్పుడు ఆయనను కొనసాగించే సంతకాల ఉద్యమం చేసి విఫల ప్రయత్నంగా ఊరుకున్నాడు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్న తొలిరోజులలో ఆయనకు వ్యతిరేకంగా ఉన్న రోశయ్య క్రమంగా అనుకూలుడయ్యాడు. ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి పొందారు. ఆచార్య రంగా కాంగ్రెసులో ప్రవేశించినప్పుడు రోశయ్య కూడా ఆయనను అనుసరించారు. 1978లో మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయినప్పుడు శాసన మండలిలో రోశయ్య ప్రధాన ప్రతిపక్ష నాయకుడుగా మంత్రి స్థాయిని పొందారు. చెన్నారెడ్డిపై తీవ్రంగా ధ్వజమెత్తిన రోశయ్య కొద్ది రోజులకే ఆయన మంత్రివర్గంలో చేరిపోయారు. చెన్నారెడ్డిని తొలగిస్తున్నప్పుడు ఆయనకు అనుకూలంగా కృషి చేశారు. తరువాత టి. అంజయ్య 1980లో ముఖ్యమంత్రిగా వచ్చినప్పుడు తొలుత రోశయ్యను మంత్రి వర్గంలోకి స్వీకరించలేదు. కాని మార్పు చేసిన జంబో జెట్ మంత్రివర్గంలోకి రోశయ్యను తీసుకున్నారు. భవనం వెంకట్రామ్ ముఖ్యమంత్రిగా రోశయ్యకు స్థానం కల్పించలేదు. కాని నాలుగు నెలల ముఖ్యమంత్రిగా ఉన్న విజయభాస్కర రెడ్డి రోశయ్యకు పదవినిచ్చాడు.

ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రోశయ్య ఆయనపై తీవ్ర విమర్శలు చేశారు. మళ్ళీ చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చి దిగిపోతున్నప్పుడు మరోసారి రోశయ్య ఆయన కోసం సంతకాల ఉద్యమం కూడా చేశారు. కానీ కేంద్రం నుండి వచ్చిన ఐదుగురు సభ్యుల సంఘం వ్యతిరేకంగా నివేదిక ఇవ్వడంతో చెన్నారెడ్డిని తొలగించి ఎన్. జనార్దన రెడ్డిని ముఖ్యమంత్రిని చేశారు. వెంటనే మంత్రిపదవి రోశయ్యకు లభించలేదు కాని మార్పు చేసిన మంత్రివర్గంలోకి ఆయన రాగలిగారు. కొద్ది రోజులు లోకసభ సభ్యుడుగా ఉన్న రోశయ్య చంద్రబాబు నాయుడు హయాంలో ప్రతిపక్ష పాత్ర వహించారు. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఆర్థిక శాఖతో సహా వివిధ శాఖలను నిర్వహించి బాగా ప్రాధాన్యతలోకి వచ్చారు. అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ రోశయ్య ఇందిరాగాంధీ మొదలు సోనియా గాంధీ వరకూ పరిచయాలు కలిగి విశేష అనుభవం పొందిన రాజకీయ వాది. ముఖ్యమంత్రిగా ఆయనకు తలవని తలంపుగా పదవి లభించింది. వక్తగా రాజకీయాలలో రాణించిన వ్యక్తి. రాష్ట్ర కాంగ్రెసులో ముఠాల మధ్య ఆయన పరిపాలన సాగింది.

## వెనుకబడిన కులాలు

రాష్ట్రంలో వెనుకబడిన కులాలకు సంఖ్యా బలం ఉన్నా రాజకీయబలం లేకుండా పోయింది .

అగ్ర కులాలు ఆధిపత్యం వహిస్తున్నాయని బడుగు వర్గాల వారు ఆక్షేపించారు. ఈ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే సూర్య అనే దినపత్రిక హైదరాబాదు నుండి వెలువడింది. వీరిలో ఏకాభిప్రాయం లేకపోవటం, కట్టుబాటు లోపించటం వలన ఎవరి కులానికి సంబంధించి వారు చూచుకోవటం తప్ప ఐక్య పోరాటాన్ని చేయలేకపోయారు.

దళితుల సమస్యలు చిరకాలంగా కొనసాగుతున్నా కీర్తి శేషులు డా.అంబేద్కర్ పోరాడి వదలిన స్థితిలోనే ఇంకా పరిస్థితి ఉన్నది. మాదిగలు తమకు అన్యాయం జరుగుతున్నదని వర్గీకరణ జరగాలని పోరాటాలు సాగిస్తున్నారు. అందుకు వ్యతిరేకంగా మాల కులంవారు నిలిచారు. వీరిని రాజకీయ పార్టీలవారు వాడుకుంటున్నారు తప్ప ఉద్ధరణకు చిత్తశుద్ధిగా కృషి జరగడం లేదు. పైగా ఆ రెండు కులాల మధ్య ఐక్యత లేకపోవడం ప్రధాన బలహీనతగా ఉన్నది. దళితులను పొగిడేవారు ఆచరణలో అవకాశాలు కల్పించకపోవడం స్పష్టంగా కనిపిస్తున్నది.

------

# ముఖ్యమంత్రి
# కె. రోశయ్య

సెప్టెంబర్, 2009

| | పేరు | శాఖ |
|---|---|---|
| 1. | కె. రోశయ్య | ముఖ్యమంత్రి |
| 2. | పి. సుదర్శన్ రెడ్డి | వైద్య విద్య |
| 3. | డి. శ్రీధర్ బాబు | ఉన్నత విద్య, ఎన్నారై వ్యవహారాలు |
| 4. | వి. సునీతా లక్ష్మా రెడ్డి | చిన్న నీటి పారుదల, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి శాఖ, లిఫ్ట్ ఇరిగేషన్, భూగర్భ జలాల అభివృద్ధి, |
| 5. | జె. గీతా రెడ్డి | ఐ అండ్ పి.ఆర్. సినిమాటొగ్రఫి, ఎఫ్.డి.సి., టూరిజం, ఆర్కియాలజీ, మ్యూజియమ్స్, ఆర్కైవ్స్ మరియు కల్చర్ |
| 6. | పి. సబితా ఇంద్రారెడ్డి | హోమ్, జైళ్ళు, అగ్నిమాపక శాఖ, సైనిక పరిరక్షణ, ప్రింటింగ్, స్టేషనరీ. |
| 7. | డి. నాగేంద్ర | ఆరొగ్యం, కుటుంబ సంక్షేమం, ఎపివివిపి, ఆసుపత్రి సేవలు. |
| 8. | ఎమ్. ముఖేష్ గౌడ్ | బి.సి. సంక్షేమం |
| 9. | డి. కె. అరుణ | చిన్నతరహా పరిశ్రమలు, చక్కెర, ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు |
| 10. | జె. కృష్ణారావు | ఆహారము, పౌర సరఫరాలు, లీగల్ మెట్రోలజీ, వినియోగదారుల వ్యవహారాలు |
| 11. | కోమటి రెడ్డి వెంకట రెడ్డి | ఐ.టి., యూత్ సర్వీసెస్, క్రీడలు, కమ్యూనికేషన్స్ |
| 12. | పి. లక్ష్మయ్య | భారీ, మధ్యతరహా నీటి పారుదల, ఎ.పి. వాటర్ రిసోర్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్. |
| 15. | ఆర్. వెంకట్ రెడ్డి | కో-ఆపరేషన్, కార్మిక, ఉపాధి, కర్మాగారాలు, బోయిలర్స్ |
| 16. | ఎస్. విజయ రామరాజు | రవాణా |
| 17. | డి. ప్రసాద రావు | రెవెన్యూ, రిలీఫ్, రిహాబిలిటేషన్, |

| | | |
|---|---|---|
| | | యు.ఎల్.సి. |
| 18. | బి. సత్యనారాయణ | పంచాయత్ రాజ్ |
| 19. | పి. బాలరాజు | గిరిజన సంక్షేమ, ఆర్ఐఎడి |
| 20. | పి. సుభాష్ చంద్రబోస్ | సాంఘీక సంక్షేమ శాఖ |
| 21. | పి. విశ్వరూపు | రూరల్ వాటర్ సప్లయ్ |
| 22. | పితాని సత్యనారాయణ | ఆరోగ్యశ్రీ, ఆరోగ్య భీమా, మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్. |
| 23. | వి. వసంత కుమార్ | గిరిజనాభివృద్ధి, ఐ.కె.పి., పెన్షన్స్, ఎన్.ఆర్.ఇ.జి.పి. స్వయం సేవక సంఘాలు |
| 24. | కె. పార్థసారధి | జంతుసంరక్షణ, డైరీ అభివృద్ధి, మత్స్య శాఖ, వెటరినరీ యూనివర్సిటీ |
| 25. | ఎమ్.వి.రామారావు | న్యాయ, కోర్టులు, సాంకేతిక విద్య, ఐటీఐలు. |
| 26. | గాదే వెంకట రెడ్డి | దేవాదాయ శాఖ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ |
| 27. | కన్నా లక్ష్మినారాయణ | భారీ పరిశ్రమలు, వాణిజ్యము, ఎగుమతులు, ప్రమోషన్, ఫుడ్ ప్రోసెసింగ్. |
| 28. | డి. మాణిక్య వరప్రసాద్ | సెకండరీ ఎడ్యుకేషన్, ప్రభుత్వ పరీక్షలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్టిట్యూషన్స్ సొసైటీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ |
| 29. | బి. శ్రీనివాస రెడ్డి | గనులు, జియోలజీ, చేనేత & వస్త్ర పరిశ్రమలు, స్పిన్నింగ్ మిల్లులు. |
| 30. | ఆనం రాం నారాయణ రెడ్డి | మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ |
| 31. | మహ్మద్ అహమదుల్లా సయ్యద్ | మైనారిటిస్ సంక్షేమం, వక్ఫ్, ఉర్దూ అకాడమీ, ప్రైమరీ విద్య, ఎస్.ఎస్.ఎ., వయోజన విద్య, ఎపి ఓపెన్ స్కూల్స్ సొసైటీ, జవహర్ బాలభవన్, ఎ.పి.మహిళా సమతా సొసైటీ, సియట్, పబ్లిక్ లైబ్రరీలు, |

| | | |
|---|---|---|
| | | ఎస్.సి.ఆర్.ఇ.టి., టెక్స్ట్ బుక్ ప్రెస్. |
| 32. | సి. శిల్పా మోహన్ రెడ్డి | గృహ, వెనుకబడిన తరగతుల గృహనిర్మాణ పథకం, ఎ.పి. కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీస్ ఫెడరేషన్, ఎ.పి.హౌసింగ్ బోర్డు |
| 33. | ఎన్. రఘువీరారెడ్డి | వ్యవసాయం, అగ్రికల్చర్ టెక్నాలజీ మిషన్, హార్టీకల్చర్, సెరీకల్చర్, ఆర్.ఎస్.ఎ.డి. |
| 34. | పి. రామచంద్రా రెడ్డి | అటవీ శాఖ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ |
| 35. | జి. అరుణ కుమారి | రోడ్లు, భవనాలు |
| 36. | కొండా సురేఖ (వై. రాజశేఖర రెడ్డి కుమారుడు జగన్ కు ముఖ్యమంత్రి ఇవ్వలేనది రాజీనామా చేశారు). | స్త్రీ సంక్షేమశాఖ |

----------

## అనుబంధం

# రాజకీయంలోనూ వంశపారంపర్యత

**(రాజకీయాల్లో ఉన్న ప్రముఖులు చనిపోతే లేక ఓడిపోతే, సీట్లు రాకుంటే వారి వారసులకు శాసనసభల్లో స్థానాలిచ్చిన ఉదాహరణలు)**

| | | |
|---|---|---|
| చరణ్ సింగ్ | కుమారుడు | అజిత్ సింగ్ |
| జగజ్జీవన్ రాం | కుమారుడు | సురేష్ |
| గోవిందం వల్లభ్ పంత్ | కుమారుడు | కె.సి. పంత్ |
| పి.వి. నరసింహారావు | కుమారుడు | పి. వి. రంగారావు |
| జె. వెంగళరావు | కుమారుడు | జె. ప్రసాదరావు |
| శివ శంకర్ | కుమారుడు | సుధీర్ కమార్ |
| డా. ఎం. చెన్నారెడ్డి | కుమారుడు | శశిధర్ రెడ్డి |
| కోన ప్రభాకర రావు | కుమారుడు | కె. గోవిందరావు |
| విజయభాస్కర రెడ్డి | కుమారుడు | ప్రకాశ్ రెడ్డి |
| టి. అంజయ్య | భార్య | మణెమ్మ, ఎం.పి. |

| | | |
|---|---|---|
| కె. బ్రహ్మానంద రెడ్డి | అన్న కొడుకు | వెంకట కృష్ణారెడ్డి |
| అమర్ నాథ్ రెడ్డి | కుమారుడు | కిరణ్ కుమార్ |
| అల్లూరి సత్యనారాయణ రాజు | భార్య | కీ.శే.అన్నపూర్ణమ్మ<br>అల్లూరి సుభాష్ చంద్రబోస్,<br>ఎం.ఎల్.సి. |
| దామోదరం సంజీవయ్య | భార్య | కృష్ణవేణి సంజీవయ్య |
| | | మునుస్వామి |
| ఎ.సి.సుబ్బారెడ్డి | సోదరుని<br>కుమారుడు | ఆనం సంజీవరెడ్డి |
| ఆలపాటి వెంకటరామయ్య | కుమార్తె | ఇందిర, ఎం.ఎల్.ఎ. |
| నరసింహారెడ్డి | భార్య | రత్నమ్మ, ఎం.ఎల్.ఎ. |
| ముసునూరి కస్తూరీదేవి | తండ్రి | ఎర్నేని సుబ్రహ్మణ్యం |
| | | ఎం.ఎల్.సి. |
| ముక్త్యాల రాజా | భార్య | శ్రీమతి రాజ్యలక్ష్మమ్మ |
| ఎస్. వెంకట్రామారెడ్డి | భార్య | శ్రీమతి ఉమా వెంకట్రామా రెడ్డి |
| గుంటూరు బాపనయ్య | భార్య | శ్రీమతి ధనసూర్యావతి |
| తునిరాజా (సీటు యివ్వలేదు) | కుమార్తె | శ్రీమతి విజయలక్ష్మి |
| జి. తిమ్మారెడ్డి | కుమారుడు | ప్రతాప రెడ్డి |
| చదలవాడ వెంకటరావు<br>(ఎం.పి.) | భార్య | శ్రీమతి వెంకటరావు |
| జి. రాజారాం | భార్య | సుశీల |
| పరకాల శేషావతారం | భార్య | కాళికాంబ |
| ఈలి ఆంజనేయులు | భార్య | వరలక్ష్మి |
| వంగవీటి మోహనరంగా | భార్య | వి. రత్నకుమారి |
| మాధవరెడ్డి | భార్య | ఉమ |
| ఇంద్రారెడ్డి | భార్య | సబిత |
| చిరంజీవి | సోదరుడు | పవన్ కల్యాణ్ |
| | సోదరుడు | నాగబాబు |
| | బావమరిది | అల్లు అరవింద్ |
| కె. చంద్రశేఖర రావు | కొడుకు | తారక రామారావు |

| | | |
|---|---|---|
| | మేనల్లుడు | హరీష్ రావు |
| | కుమార్తె | కవిత |
| బొత్స సత్యనారాయణ | భార్య | ఝాన్సీ |
| నాదెళ్ళ భాస్కర రావు | కొడుకు | ఎన్. మనోహర్ |
| వై. ఎస్. రాజశేఖర రెడ్డి | కొడుకు | జగన్ మోహన్ రెడ్డి |

--------

# పార్టీ మార్పిడిలో ఇదీ వరస!

| | | |
|---|---|---|
| 1) | చౌదరి చరణ్ సింగ్ మాజీ ఎం.పి. | కాంగ్రెస్ – భారతీయ క్రాంతిదళ్ – భారతీయ లోక్ దళ్ – జనతా – లోక్ దళ్ |
| 2) | చంద్ర శేఖర్ | ప్రజా సోషలిస్టు కాంగ్రెస్ – జనతా – జనతా దళ్ (ఎస్) |
| 3) | జగజ్జీవన్ రాం | కాంగ్రెస్ – కాంగ్రెస్ ఫర్ – డమోక్రసి – జనత – కాంగ్రెస్ (యు) |
| 4) | ప్రకాశం మాజీ ముఖ్యమంత్రి | కాంగ్రెస్ – స్వరాజ్య – కాంగ్రెస్ – ప్రజాపార్టి - కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ – ప్రజా సోషలిస్టు – కాంగ్రెస్. |
| 5) | రంగా | కాంగ్రెస్ – కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ – యునైటెడ్ కాంగ్రెస్ – కాంగ్రెస్ – స్వతంత్ర – కాంగ్రెస్. |
| 6) | డా. చెన్నారెడ్డి ముఖ్యమంత్రి, గవర్నర్ సెంట్రల్ మినిస్టర్ | కాంగ్రెస్ – సోషలిస్టు డెమోక్రటిక్– కాంగ్రెస్ – తెలంగాణా ప్రజాసమితి – కాంగ్రెస్ – కాంగ్రెస్ డెమోక్రటిక్ పార్టీ – కాంగ్రెస్. |
| 7) | జె.బి. కృపలాని | కాంగ్రెస్ – కిసాన్ మజ్దూర్ పార్టీ – ప్రజా సోషలిస్ట్ పార్టీ – భారతీయ క్రాంతి దళ్ – జనతా. |
| 8) | హుమయూన్ కబీర్ | కాంగ్రెస్ – జన కాంగ్రెస్ – బంగ్లా కాంగ్రెస్ – భారతీయ క్రాంతిదళ్. |
| 9) | సుబ్రహ్మణ్య స్వామి | జన సంఘ్ – జనత – జనత (ఎస్) |
| 10) | ఎన్. సంజీవ రెడ్డి | కాంగ్రెస్ – కాంగ్రెస్ (ఓ) – జనత. |

# ఆంధ్ర ప్రదేశ్

| | | |
|---|---|---|
| 1) | ఎన్. భాస్కర రావు | కాంగ్రెస్ – తెలుగు దేశం – డెమోక్రటిక్ తెలుగు దేశం – కాంగ్రెస్. |
| 2) | తెన్నేటి | కాంగ్రెస్ – ప్రజాపార్టీ – కిసాన్ మజ్దూర్ – ప్రజా పార్టీ – ప్రజా సోషలిస్టు – ప్రజా – జనతా. |
| 3) | లచ్చన్న | కాంగ్రెస్ – కృషికార్ లోక్ – ఐక్య కాంగ్రెస్ – సోషలిస్ట్ డెమోక్రటిక్ – స్వతంత్ర – భారతీయ లోక్ దళ్ – జనత – ఆంధ్రప్రదేశ్ జనత – లోక్ దళ్. |
| 4) | పి.వి.జి. రాజు | సోషలిస్ట్ – ప్రజా సోషలిస్టు – సోషలిస్టు డెమోక్రటిక్ – కాంగ్రెస్ – కాంగ్రెస్ – కాంగ్రెస్ (ఐ). |
| 5) | జి. పి. కొండయ్య | కమ్యూనిస్టు – సోషలిస్టు – సోషలిస్టు డెమోక్రటిక్ – కాంగ్రెస్ – పాత కాంగ్రెస్ – జనత. |
| 6) | పి. తిమ్మారెడ్డి | కాంగ్రెస్ – కృషికార్ లోక్ – కాంగ్రెస్ – జనత – జనత (ఎస్.) |
| 7) | భాట్టం శ్రీరామమూర్తి | సోషలిస్టు – ప్రజాసోషలిస్టు – సోషలిస్టు – కాంగ్రెస్ శ్రీరామమూర్తి (ం) – కాంగ్రెస్ –ఐ |
| 8) | కె. రోశయ్య | కృషికార్ లోక్ – స్వతంత్ర – కాంగ్రెస్ ఓ – కాంగ్రెస్ ఐ |
| 9) | కాకాని వెంకటరత్నం | కాంగ్రెస్ – సోషలిస్ట్ డెమోక్రటిక్ – కాంగ్రెస్. |
| 10) | రత్న సభాపతి | సోషలిస్టు – స్వతంత్ర – కాంగ్రెస్ – ఇండిపెండెంట్ – కాంగ్రెస్ – కాంగ్రెస్ (ఐ). |
| 11) | రేబాల దశరథ రామరెడ్డి | కాంగ్రెస్ – పాత కాంగ్రెస్ – జనత – కాంగ్రెస్ (ఐ) |
| 12) | పిడతల రంగారెడ్డి | కాంగ్రెస్ – జనత – కాంగ్రెస్ (ఐ) |
| 13) | కందుల ఓబుల రెడ్డి | కాంగ్రెస్ – కృషికార్ – షోషలిస్ట్ డెమోక్రటిక్ – స్వతంత్ర – కాంగ్రెస్ (ఐ) |
| 14) | కె. ప్రభాకర రెడ్డి | కాంగ్రెస్ – జనత – జనత (ఎస్) – కాంగ్రెస్ (ఐ) |
| 15) | ఎం.వి.ఎస్. సుబ్బరాజు | కాంగ్రెస్ – జనత – జనత (ఎస్) ఆంధ్రప్రదేశ్ జనత – లోక్ దళ్ – కాంగ్రెస్ (ఐ) |
| 16) | శ్రీమతి టి. లక్ష్మీ కాంతమ్మ | కమ్యూనిస్టు – సోషలిస్టు – కాంగ్రెస్ – జనత – కాంగ్రెస్ (ఐ). |
| 17) | టి. అంజయ్య | కాంగ్రెస్ – ప్రజా సమితి – కాంగ్రెస్ – కాంగ్రెస్ (ఐ). |

| | | |
|---|---|---|
| 18) | కట్టమంచి రామలింగారెడ్డి | జస్టిస్ – జస్టిస్ డెమోక్రటిక్ – జస్టిస్ – కాంగ్రెస్. |
| 19) | బండారు రత్న సభాపతి | సోషలిస్ట్ – స్వతంత్ర – కాంగ్రెస్ – కాంగ్రెస్ ఐ – తెలుగు దేశం. |
| 20) | రేబాల దశరథ రాం రెడ్డి | కాంగ్రెస్ – కాంగ్రెస్ ఓ – జనతా – కాంగ్రెస్ ఐ. |
| 21) | జి. సి. కొండయ్య | కమ్యూనిస్టు సోషలిస్టు పార్టీ – సోషలిస్టు- సోసలిస్ట్ డెమోక్రటిక్ – కాంగ్రెస్ – కాంగ్రెస్ ఓ – జనత. |
| 22) | కె. ఇ. కృష్ణమూర్తి | కాంగ్రెస్ – తెలుగు దేశం – డెమోక్రటిక్ తెలుగు దేశం – తెలుగు దేశం – డెమోక్రటిక్ పార్టీ – కాంగ్రెస్ ఐ – తెలుగు దేశం. |
| 23) | సిహెచ్. కాశయ్య | కాంగ్రెస్ – జనత – ప్రజా సమితి – కాంగ్రెస్-ఐ – తెలుగు దేశం. |
| 24) | కొండా లక్ష్మణ్ బాపూజి | కాంగ్రెస్ – తెలంగాణా కాంగ్రెస్ – జనతంత్ర సమాజ్ – జనత – తెలుగు దేశం. |
| 25) | కొత్త రఘురామయ్య | కాంగ్రెస్ – జనత – కాంగ్రెస్ ఐ |
| 26) | ఎ. ఇంద్రకరణ్ రెడ్డి | టిడిపి – కాంగ్రెస్. |
| 27) | సి. హెచ్. రాజేశ్వరరావు | సిపిఐ – టిడిపి |
| 28) | యు కృష్ణంరాజు | కాంగ్రెస్ – బిజెపి – ప్రజారాజ్యం (రాజానామా) |
| 29) | ఎస్.బి.కె. సత్యనారాయణ రావు | కాంగ్రెస్ – బిజెపి |
| 30) | తోట సుబ్బారావు | కాంగ్రెస్ – టిడిపి – కాంగ్రెస్ |
| 31) | విజయ కుమార్ రాజు | కాంగ్రెస్ – టిడిపి – కాంగ్రెస్ |
| 32) | పర్వతనేని ఉపేంద్ర | టిడిపి – కాంగ్రెస్ – ప్రజారాజ్యం |
| 33) | పి. శివ శంకర్ | కాంగ్రెస్ – ప్రజారాజ్యం |
| 34) | సి. హెచ్. హరిరామజోగయ్య | కాంగ్రెస్ – టిడిపి – కాంగ్రెస్ – ప్రజారాజ్యం (రాజీనామా) |
| 35) | దానం నాగేంద్ర | టి.డి.పి. – కాంగ్రెస్ |
| 36) | గాలి ముద్దు కృష్ణమ నాయుడు | టి.డి.పి. – బిజెపి – కాంగ్రెస్ – టిడిపి |
| 37) | సి. రామచంద్రయ్య | టి.డి.పి. – ప్రజారాజ్యం |
| 38) | దేవేందర్ గౌడ్ | టి.డి.పి. – నవ తెలంగాణా – ప్రజారాజ్యం – టి.డి.పి. |

--------

# జనతా నుండి కాంగ్రెస్ (ఐ) లోకి!

(దేశంలో తప్పులన్నింటికీ జనతా పాలనే మూలకారణం అని ఇందిరాగాంధీ నుంచి అంజయ్య వరకు అంటుంటారు. అలాంటి జనతాపార్టీ పేరిట 1978లో ఎన్నికైన 60 మందిలో 45గురు ప్రస్తుత కాంగ్రెస్ (ఐ)లో వున్నారు. అలాగే శాసన మండలిలో కూడా జరిగింది. వీరిలో కొందరు ఇందిరాగాంధీని దుర్భాషలాడిన వారున్నారు. మంత్రి పదవులు, తదితర పదవులు పుచ్చుకొని చలామణి అవుతున్నారు.)

## తొలుత జనతా పేరిట ఎన్నికైన వారి పేర్లు

1) అమ్మిరాజు 2) పి. అమ్మిరెడ్డి 3) కె. అంకిరెడ్డి 4) జి. అప్పల నాయుడు 5) బి. అరుముగం 6) ఇ. అయ్యపురెడ్డి (ప్రస్తుతం న్యాయశాఖా మంత్రి) 7) ఎం బాబూ పరాంకుశం 8) జె. చంద్రమౌళి 9) డి.ఇందిర 10) ఎం. జగన్నాథం 11) ఎస్. జయపాల్ రెడ్డి (జనతా) 12) పి. జనార్ధన రెడ్డి (లోక్ దళ్) 13) సి.హెచ్.జంగారెడ్డి (బిజెపి) 14) సి. హెచ్. కాశయ్య 15) సి. హెచ్. లక్కయ్య 16) లక్ష్మీకాంతమ్మ (మంత్రి అయి, వినిమయదారుల ఫెడరేషన్ అధ్యక్షురాలు) 17) సి.హెచ్.లక్ష్మీనారాయణ 18) కె. నరసయ్య 19) హెచ్. నరసప్ప 20) వి. నరసింహారావు 21) నరసింహారెడ్డి (జనత) 22) ఎల్. నారాయణ 23) వి. నారాయణప్పలనాయుడు 24) బి. నారాయణస్వామి 25) బి. నారాయణ స్వామి 26) బి. నిరంజన రావు 27) ఎం. పద్మనాభం 28) ఎస్. పాలకొండ్రాయుడు 29) బి. మచ్చీంద్రరావు 30) సి.హెచ్.పరశురాం నాయుడు (నెల రోజుల మంత్రి అయ్యాడు) 31) కె. ప్రభాకర రెడ్డి (డెప్యూటీ స్పీకరుగా ప్రస్తుతం మంత్రిగా వున్నారు) 32) సి. హెచ్. ప్రతాప లింగం 33) కె. రాజరత్నం 34) రాంభూపాల్ రెడ్డి (నెలరోజులు మంత్రిగా ఉన్నాడు) 35) సి. హెచ్. ఎం. రామనాథ రెడ్డి 36) జి. రామస్వామి రెడ్డి 37) వి. రంగారావు (లోక్ దళ్) 38) పిడతల రంగారెడ్డి 39) జి. వి. రత్తయ్య 40) ఎన్. ఎస్. ఎన్. రెడ్డి (ప్రస్తుతం బిజెపి) 41) బి. రుక్మిణీ దేవి (నెల రోజులు మంత్రి అయ్యారు)
42) డి. కె. సత్యారెడ్డి 43) ఇ. సీతారామ శాస్త్రి 44) జి. లచ్చన్న (ప్రస్తుతం లోక్ దళ్ నాయకుడు) 45) కె. బి. సిద్ధయ్య (పట్టు పరిశ్రమ కార్పొరేషన్ అధ్యక్షుడు) 46) వి. శోభనా దీశ్వరరావు (లోక్ దళ్) 47) పి. అశోక్ గజపతి రాజు (లోక్ దళ్) 48) ఇ. సుబ్బారావు (లోక్ దళ్) 49) ఎం.వి.ఎస్. సుబ్బరాజు (మురికినీటి పారుదల బోర్డు అధ్యక్షులుగా వున్నారు) 50) బి. సూర్యనారాయణ 51) ఎ. వాసుదేవరావు (మాజీమంత్రి) 52) ఎం. వెంకయ్య నాయుడు (బి.జె.పి. నాయకుడు) 53) కె. వెంకట కూర్మి నాయుడు 54) బి. వెంకట రెడ్డి 55) పి. వెంకట శ్రీ రామారావు 56) ఎస్. వెంకట సుబ్బయ్య 58) బి. వెంకటేశం శర్మ 59) ఎస్. పి. వెంకటేశ్వర చౌదరి 60) ఎం. వెంకటేశ్వరరావు 60) ఎస్. విజయరామరాజు.

----------------

# కాంగ్రెస్ (యు) నుండి కాంగ్రెస్ (ఐ) లోకి

1) కె.అప్పుడు దొర 2) గడ్డన్న 3) బి. గోపాత్రుడు 4) డి. కొండలరావు 5) ఎం.వి. కృష్ణారావు (ప్రపంచ తెలుగు సంస్థ అధ్యక్షుడు) 6) డి. మును స్వామి (నెలరోజులు మంత్రి పదవిలో వున్నారు అంజయ్య కేబినెట్ లో) 7) పి. రామచంద్రయ్య 8) పి. సాంబశివరావు 9) వి. సన్యాసిరాజు వున్నారు) 11) వి. వరద రామారావు 12) జె. వెంగళరావు (కాంగ్రెస్ (యు) రాజకీయాల నుంచి విరమించాడు) 13) కాసు వెంకట కృష్ణారెడ్డి (విప్ గా వుంటూ, నెలరోజులు మంత్రి చేసారు) 14) డి. వెంకటరావు 15) కె. వెంకటేశ్వరరావు.

## కౌన్సిల్ లో

చేబ్రోలు హనుమయ్య, కె. రోశయ్య (ప్రస్తుతం మంత్రులు) టి. పాంచజన్యం, శివరామరాజు మొత్తం 35 సభ్యులు కాంగ్రెస్ (యు)లో వుండగా ప్రస్తుతం రొండా నారప రెడ్డి మిగిలారు.

--------

# ఇండిపెండెంట్లుగా కాంగ్రెస్ (ఐ)ని ఓడించి కాంగ్రెస్ (ఐ)లో చేరినవారు

1)..కె.మోహనరావు 2) నరసింహ్ రెడ్డి (సంగారెడ్డి) 3) సి.హెచ్. రామచంద్రా రెడ్డి 4) డి.ఎల్.రవీంద్రారెడ్డి 5) పి. శివారెడ్డి 6) జి. తిమ్మారెడ్డి 7) ఎ. వెంకటేశ్వర్లు.

### సి.పి.ఎం.ఎల్. నుండి కాంగ్రెస్ (ఐ) లోకి!

సి.హెచ్.ఎర్రయ్య (ఇల్లెందు గిరిజన స్థానం)

### కాంగ్రెస్ (ఐ) నుంచి కాంగ్రెస్ (యు) లోనికి!

కె.వి. కేశవులు కాంగ్రెస్ (యు)గా గెలిచి కాంగ్రెస్ (ఐ)లో చేరి, చెన్నారెడ్డిపై అలిగి కాంగ్రెస్(యు)లో అఖిల భారత పార్టీ కార్యదర్శి అయి, కాంగ్రెస్ (ఐ)లో తేలారు.

------

## Select References


1. Robrt E. Frykenberg
   Guntur District 1788-1848; A History of local influence and central authority in South India. Oxford.
2. Eugene F. Irschick
   Politics and Social conflict in South India. The non-Brahmin movement and Tamil separatism 1916-29. University of California Press 1969
3. G.V.Subba Rao
   Life and times of K.V. Reddy Naidu 1957 Rajahmundry.
4. B. Kesavanarayana
   Political and Social factors in Andhra (1900-56) Navodaya, Vijayawada 1976.
5. Christopher John Baker
   The Politics of S. India (1920-37) Vikas, N. Delhi 1976.
6. D.A.Washbrook
   The emergence of provincial politics. The Madras Presidency 1870-1920. Vikas, N. Delhi-76.
7. Sitaramayya Pattabhi
   The History of the Congress (1885-1935) Allahabad, Congress Working Committee 1935.
8. Sarojini Regani
   Highlights of the freedom movement in Andhra Pradesh. Hyderabad, Ministry of Cultural Affairs, 1972.
9. Bondurant Joan V.
   Regionalism Versus Provincialism: A study in the problems of Indian National Unity, Berkley, University of California Press 1958.
10. Narayana Rao K.V.
    Emergence of Andhra Pradesh, Madras University 1966.
11. Satyanarayana K.
    Problems of Linguistic States in S. India, Ph.D. Thesis, Bombay University, 1958.

12. Venkatarangaiah M. (Ed)
The freedom struggle in Andhra (4 vol) Hyderabad, Govt. of Andhra Pradesh.

13. Rudraiah Choudary G.
Prakasam - A Political Study.

14. Harrison, S. Selig.
India - the most dangerous decades.

15. Ranga N.G.
Fight for freedom.

16. Bhaskar Rao N.
Politics of leadership in an Indian State.

17. Weiner Myron (Ed)
State Politics in India.

18. Narayana Rao K.V.
Telangana (Calcutta Minerva Associates 1972)

19. Innaiah N.
    1. Politics for Power (Scientific Services, Hyderabad-20).
    2. The birth and death of political parties in India (Booklinks, Hyderabad - 29).
    3. Saffron Star over Andhra Pradesh (Booklinks, Hyderabad-29).
    4. Caste politics in Andhra (Telugu).
    5. The Freedom Struggle in Andhra (Telugu) (along with M. Venkatarangaiah)
    6. Extremists (Telugu), Telugu Academy
    7. Government and Politics in A.P. (Telugu), Telugu Academy.

--------

# Brief Bio-Data

| | | |
|---|---|---|
| Name | : | **INNAIAH NARISETTI** |
| Date of Birth | : | October 31, 1937 |
| Place of Birth | : | **Patha Reddypalem**, Chebrolu, Guntur District, Andhra Pradesh, India. |
| Academic | : | **M.A.,** (Philosophy), Osmania University, |
| | | **Ph.D.,**(Philosophical Consequences of Modern Science), Osmania University. |
| Presently | : | **Author & Freelance Journalist** from 1982 |
| Positions | : | **Co- Editor** "Prasarita" - A Telugu Quarterly in Social Sciences 1972-75. |
| | : | **Chief Reporter & Special Correspondent** - to Andhra Jyothi, Telugu Daily 1975-81. |
| | : | **President** - A.P. Chapter of Indian Academy of Social Sciences, Hyderabad 1988-90. |
| | : | **President -** A.P. Rationalist Association, 1991-93. |
| | : | **Secretary** - Indian Radical Humanist Association, Andhra Pradesh, 1992-94. |
| | : | **General Secretary** - Indian Rationalist Association, 1994-96. |
| | : | **Vice President** - Rationalist Association of India from 1996. |
| | : | **Co-ordinator - FARA, AP** - Federation of Atheist, Rationalist, Humanist Associations, A.P. 2003-2005. |
| | : | **General Secretary** - Indian Redical Humanist Association, 2005-2007, Advisor since 2009. |
| | : | **Chairman** : Center for Inquiry- India, 2006 onwords. |

## BOOKS IN ENGLISH

**New Encyclopedia of Unbelief** (2008) (article on unbelief in India).

**Let Sanity Prevail,** India, 2007.

**Forced into faith :Child Abuse by Religion** Prometheus Books, USA, 2008. (forthcoming).

**Encyclopedia of Unbelief** (Six Articles) Prometheus Books, USA, 2007.

**M.N. Roy - Radical Humanist,** Prometheus Books, USA, 2005.

**M.N.Roy- Photo Album,** Rationalist Voice Publications, 2003.

**A Century of Politics in Andhra Pradesh,** Rationalist Voice Publications, Hyderabad, 2002.

**M.N. Roy, Evelyn, Ellen : A Bibliography,** Booklinks Corporation, 1996.

**Evelyn Trent alias Shanti Devi** - Booklinks Corporation Hyderabad 1995.

**Between Charisma and Corruption** - A.P. Politics, 1991.

**Saffron Star Over Andhra Pradesh** - A Study of Contemporary Andhra Politics, Booklinks Corporation, Hyderabad, 1984.

**The Philosophical Consequences of Modern Science** - Booklinks Corporation, Hyderabad, 1982.

**The Birth & Death of Political Parties in India** - Booklinks Corporation, Hyderabad, 1982.

**Politics for Power** - A Study of Contemporary Andhra Pradesh Politics, Scientific Services, Hyderabad, 1982.

**State Governmant & Politics** - A study of A.P. Politics 1885-1985, Scientific Services, Hyderabad.

**Inside Andhra Pradesh -** Booklinks Corporation Hyderabad, 1980.

**Depressed Group Students** - ( Co-author Dr. C. Lakshmanna), College Book House, Trivendrum, 1977.

**Tradition & Modernity in Telugu & Urdu Literature.** (Co-Editor Dr. Alam Khundmiri), 1969.

**Political History of Andhra Pradesh 2009**

**Atheism and Secularity** ed. Phil Zuckermal (Praeger Publication 2010, USA) Article on Atheism and Secularity in India.

## BOOKS IN TELUGU

**Under the disguise of Truth, Everything is fraud** 2008.

**Lie Hunting Leading to truth : Collection of Essays**, 2005.

**Life of M.N. Roy,** 2001 (Serialised in Vaartha - Telugu Daily)

Sahiti Parulato Sarasaalu ( encounter with literary and journalist Friends 2008)

**Child Abuse by Religions,** 2000.

**Fradulent Alternative Medicines,** 1998.

**Lie-Hunting, A Collection of Essays,** 1995.

**Monograph on Terrorists,** 1995.

**20th Century Enemies of Humanity,** 1992.

**Will there be Renaissance in India?** 1989.

**Life and thoughts of Narla Venkateswara Rao,** 1987.

**Caste Politics in Andhra Pradesh,** 1984.

**Our Politics - from Khadi to Saffron,** 1983.

**Andhra Pradesh : Governmant & Politics,** 1983 &1991.

**No matter which political party, their culture is one,** 1982.

**Marx and Marxism,** 1976.

**How the Communists Eclipsed Karl Marx,** 1976.

**From Rammohan Roy to M.N. Roy,** 1973.

**Social Groupings & Relationships,** 1972.

**Philosophy & Commom Sense,** 1971.

**Groupism & Splits in Andhra Pradesh Politics,** 1970.

**Evolution of Politics in Andhra Pradesh,** 1970.

**Independence Struggle in Andhra Pradesh** (Co-author Prof. M.Venkatarangaiah) 1972.

**Political Parties in Andhra Pradesh.**

## TRANSLATIONS FROM ENGLISH TO TELUGU

**God Delusion** : Richard Dawkins.

**God is not great** : Christopher Hitchens.

**Letter to Christian Nation** : Sam Harris.

**Blasphemy** : Justice Raghvendra Jahagirdar -

**Secularism** : Justice Raghavendra Jahangirdar -

**Affirmations** : Paul Kurtz - CFI India.

**Living without Religion** _ Paul Kurtz (RV Publications)

**The truth about the Geeta** - V.R. Narla (Hema Publications)

**Why I am not a Muslim -** Ibn Warraq (Hema Publications)

**India in Transition** - M.N. Roy (Indian Council of Historical Research)

**Articles** - A.B. Shah (Anupama, Vijayawada)

**Kala Poornodayam** - G.V. Krishna Rao (Serialised in Golkonda Partika, Telugu Daily - 1963) Ph.D. Thesis on Aesthetics.

**The Courage to become : Humanist Virtues** - Paul Kurtz (Hema Publications)

**Ochre Robe** - Agehananda Bharati.

**In Freedom's Quest : M.N. Roy's Life Part 1, 2** - Sibnarayan Ray (Telugu University).

**Telugu Academy Publications** :

**Parties, Power & Politics** - M.N. Roy.

**Russian Revolution** - M.N. Roy.

**Revolution & Counter Revolution in China** - M.N. Roy.

**Reason, Romanticism & Revolution** - M.N. Roy.

**M.N. Roy, A Political Biography** - V.B. Karnik

**Strikes in India** - V.B. Karnik.

**Indian Trade Unions** - V.B. Karnik.

**Islamic Philosophy** - Dr. Alam Khundmiri

**Scientific Method** - A.B. Shah.

**Great Tradition and little Traditions** - Agehananda Bharathi.

**Rural Sociology in India** - A.R. Desai.

**Justice Jaganmohan Reddy's Books :**

**1.Minorities & The Constitution ; 2.A Constitution - What it is & What it means ; 3.We have a Republic - Can we keep it?4. our Governors; Law and Society 5. The University I served**

## CONTRIBUTIONS IN MAGAZINES

### ENGLISH

American Atheist, Free Inquiry,

Washline, American Rationalist,

Indian Rationalist, Radical Humanist,

Secularist, Rationalist Voice, Indian Skeptic.

### TELUGU DAILIES

Andhra Patrika, Andhra Prabha, Andhra Jyothi,

Golconda Patrika, Eenadu, Udayam, Vaartha, Surya

### TELUGU PERIODICALS

Prajavani, Vahini, Telugu Vidyarthi, Prajatantra, Sameeksha, Radical Humanist, Vikasam, Hetuvadi, Suprabhatam, Prasarita, Manava Vikasam, Swetchalochana.

Misimi, New Humanist

**Contributions through Electronic Media**

Produced Documentaries and Moderated Discussions

on Humanist-Rationalist themes through

All India Radio, Doordarshan, TV Channels in Telugu, Free Radio, TV-USA, TV5.

**Awards & Honours**

ATA Siromani Award (USA) 1992.

TANA Humanist-Journalist Award(USA)1997

Greater Washington Telugu Association, 1999

Delaware Valley Association, 1998

New York Telugu Association 1998

Malayasri award, Karimnagar

Tripuraneni Ramaswamy Award for Rationalism, 2009.

(Potti Sreeramulu Telugu University Hyderabad.

Library of Congress, USA

Listed 25 Books of Innaiah.

Participation in Humanist and Rationalist Activities

In USA, Europe 1992-2008

**Officiated Secular Marriages**

V.R. Narla dedicated his last Telugu play

Narakam Lo Harischandra

(Harischandra in Hell).

E-mail : innaiahn@yahoo.com

Website : www.centerforinquiry.net/india.

http://innaiahn.tripod.com